# శ్రీ భగవద్గీతామృతపానం

## భవ సాగర తీరము

శ్రీ శ్రీ శ్రీ రామకృష్ణ నందగిరి స్వాముల వారి ప్రసాదము






రచయిత, సేకరణ: సన్నిధి జనార్ధన స్వామి

ధర్మ ప్రచారకులు, జ్యోతిష వాస్తు శాస్త్ర పండితులు

శ్రీ

# భగవద్గీతామృతపానం

# భవసాగర తీరము



రచన సేకరణ

**సన్నిధి జనార్ధన స్వామి**

ధర్మ ప్రచారకులు, జ్యోతిష్య వాస్తు శాస్త్ర పండితులు

వెల - **రూ.180-00**

# శ్రీ భగవద్గీతామృతపానం భవసాగర తీరము


రచన సేకరణ **సన్నిధి జనార్ధన స్వామి**
ధర్మ ప్రచారకులు,
జ్యోతిష్య వాస్తు శాస్త్ర పండితులు



ప్రథము ముద్రణ 2014, 1000 ప్రతులు


**వీరి రచనలు**

**మరువ బోకు మీవు మంచి మాట ద్విశతి పద్య కావ్యం**

ప్రథమ ముద్రణ 3-5-2009 500 ప్రతులు

**మహనీయుల మహితోక్తుల మణిహారం**

ప్రథమ ముద్రణ 2013 1000 ప్రతులు

ద్వితీయ ముద్రణ 2014 1000 ప్రతులు

**రామాయణము రహస్యాల రసమయము**

ప్రథమ ముద్రణ 23-11-2013 1000 ప్రతులు

**ఆడపిల్లల పేర్లు ఆలోచించి పెట్టండి - స్త్రీలూ పురుషులూ ఇర్వురూ సమానమే అయినా ఈ తేడాలెందుకు**

ప్రథమ ముద్రణ 2013 1000 ప్రతులు

**ముద్రణ జరుగవలసినది**

**జ్ఞాన విజ్ఞాన కుసుమాలు (నీతి వేదాంత కథలు)**

**జ్ఞాన విజ్ఞాన కుసుమాలు (దివ్య సూక్తులు)**


ముఖచిత్ర రూప కల్పన : షబ్బీర్ అహ్మద్

డి.టి.పి.: చిరంజీవి లలిత

ముద్రణ : పూర్ణ గ్రాఫిక్స్, చైతన్యపురి

యీ పుస్తకాలు లభించు స్థలము


సన్నిధి జనార్ధన స్వామి
ఇ.నెం. 766, NGO's కాలని
వనస్థలిపురం, హైదరాబాదు - 70.
ఫోన్ - 9949996942



సర్వ హక్కులు రచయితవి


వెల - **రూ.180-00**

# శ్రీ భగవద్గీతామృతపానం భవసాగర తీరము

## విషయ సూచిక


| వివరములు | | పేజీ నెం. |
|---|---|---|
| అర్జున విషాద యోగము | - ప్రథమాధ్యాయము | 1 |
| సాంఖ్య యోగము | - ద్వితీయాధ్యాయము | 40 |
| కర్మయోగము | - తృతీయాధ్యాయము | 63 |
| జ్ఞానయోగము | - చతుర్ధాధ్యాయము | 72 |
| కర్మసన్యాస యోగము | - పంచమాధ్యాయము | 106 |
| ఆత్మ సంయమ యోగము | - ఆరవ ఆధ్యాయము | 118 |
| విజ్ఞాన యోగము | - ఏడవ ఆధ్యాయము | 130 |
| అక్షర పరబ్రహ్మయోగం | - ఎనిమిదవ ఆధ్యాయం | 146 |
| రాజ విద్యా రాజ గుహ్యాయోగం | - తొమ్మిదవ ఆధ్యాయం | 152 |
| విభూతి యోగము | - పదియవ ఆధ్యాయము | 156 |
| విశ్వరూప సందర్శన యోగము | - పదకొండవ ఆధ్యాయము | 163 |
| భక్తి యోగం | - పండ్రెండవ ఆధ్యాయము | 167 |
| క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగ యోగము | - పదుమూడవ ఆధ్యాయము | 210 |
| గుణత్రయ విభాగ యోగం | - పదు నాల్గవ ఆధ్యాయము | 224 |
| పురుషోత్తమ ప్రాప్తి యోగము | - పదునైదవ ఆధ్యాయము | 235 |
| దైవాసుర సంపద్విభాగ యోగం | - పదునారవ ఆధ్యాయము | 247 |
| శ్రద్ధాత్రయ విభాగ యోగము | - పదనేడవ ఆధ్యాయము | 257 |
| మోక్ష సన్యాస యోగము | - పదునెనిమిదవ ఆధ్యాయము | 265 |

ఓం నమో భగవతే వాసుదేవాయ

# అందరికీ నా వినయ పూర్వక వందనాలు



చివరి శ్వాస ఉన్నంత వరకు, ధార్మికో పన్యాసాలు ప్రవచిస్తూ,చివరి ఉప న్యాసంగా విజయుదశమి రోజు విజయుదశమి ప్రాశస్త్యాన్ని గూర్చి ఉపన్యసించి, అందరూ శ్రద్ధగా విన్నారా? అని అడిగి అందరూ విన్నాము స్వామీ అని అనగా ఆచరణలో పెట్టుకొనండి అనుభవించండని చెప్పి, హరి: ఓం తత్ సత్ అని కూర్చున్నవాడు కూర్చున్నట్లుగానే విదేహ ముక్తిని బొందిన మహానుబావుడు" ప్రవక్త శ్రీశ్రీశ్రీ రామ క్రిష్ణానందగిరి స్వామి వారికి నేను ఏకలవ్య శిష్యుణ్ణి, వారి ఉపన్యాసాలు వారి గ్రంధ రచనలు మరియు ఎందరెందరో మహానుభావులు పీఠాధిపతులు ఆశ్రమాధిపతుల దర్శన, స్పర్శన ప్రభావం నా జీవితాన్నే మార్చగలిగినాయి.

యీ భగవద్గీతామృతపానం భవసాగరతీరం నేను వ్రాయుటకు ప్రధమ కారణం శ్రీరామక్రిష్ణానందగిరి స్వామిగారు వ్రాసిన జనప్రియ గీతోపన్యాసాలు అను గ్రంధాలు 3 సంపుటాలు. అవి ప్రధమ షట్కము ద్వితీయ షట్కము తృతీయ షట్కము అవి మొత్తం 1500 వందల పేజీలు అంత గ్రంధాన్ని చదివే ఓపిక సమయము ఈ స్పీడు కాలంలో చాలామందికి సాధ్యం కాక పోవచ్చును. యీ మహత్తర గ్రంధ మనే సముద్రం నుంచి వాఖ్యానము తగ్గించుకుంటూ అతి ముఖ్యమయిన విశేషాలు అందరికీ అంద జేస్తే బాగుండుననే సంకల్పంతో నేను వ్రాసి పెట్టుకుంటూ నేను చదువుకుంటూ

సంతోషించే వాణ్ణి. యీ సంతోషాన్ని అందరికీ పంచితే బాగుండుననే సంకల్పం కలిగి ప్రస్తుత భూమానంద ఆశ్రమం పీఠాధిపతి ప్రతిభానందగిరి మాతాజీకి నా అభిప్రాయం తెల్పగా, ఆమె సంతోషించి " ఆ గీతామృతాన్ని ఒక్కరమే అనుభవిస్తే ప్రసాదమౌతుంది, అందరికీ పంచితే మహా ప్రసాద మౌతుంది" మంచి పని చేస్తున్నావు నాయనా అని సంతోషంగా అనుమతి ప్రసాదించిన మాతాజీ గారికి ఋషితుల్యులు, నా రచనకు కారణభూతులైన బ్రహ్మీ భూతులు శ్రీశ్రీశ్రీ రామక్రిష్ణానందగిరి స్వామి వారి దివ్యపాద పద్మాలకు ప్రప్రథమంగా నమస్సులు సమర్పిస్తున్నాను. నేనీ మార్గానికి రావడానికి ముఖ్య కారణము సనాతన వేదాంత జ్ఞాన సభలు అఖిలాంధ్ర సాధు పరిషత్తు మహా సభలకు వెళ్ళడము అక్కడ ఎందరెందరో మహానుభావులను దర్శించడం, వారి పాదాలు స్పర్శించడం ఆ అపూర్వ ఫలితం వల్లే యీ గీతామృతాన్ని పంచే భాగ్యం కలిగిందని నమ్ముచున్నాను.

నాకు బహుగ్రంథాలు చదివిన భాగ్యం వల్లను పెద్దల అనుగ్రహం వల్లను ఛందోబద్ధంగా పద్యాలు వ్రాసే అనుభవం కలిగింది. మా శ్రేయోభిలాషి శ్రీ తారా మనోహర్ గారి సూచన పాటించి నేను " మంచి మాట దీని మరువబోకు" అను మకుటంతో రెండు వందల పద్యాలతో శతకం వ్రాయగా, దానిని శ్రీ చెరుకూరి సంస్థల అధిపతి శ్రీ చెరుకూరి రామారావు గారు ముద్రించడం జరిగింది. తర్వాత " మహనీయుల మహితోక్తుల మణిహారం" అను ఇంకో గ్రంథం ఆవిష్కరణ మహాసభలో శ్రీ రామారావు గారు సువర్ణ కంకణం తొడిగి సన్మానం చేయడం జరిగింది. యీ రెండు గ్రంథాలకు ఇప్పుడు ద్వితీయ ముద్రణ జరుగుతున్నవి. తర్వాత రామాయణము రహస్యాల రసమయము అను గ్రంథము వ్రాయగా అదీ బహుళ ప్రచారం పొందింది. దీనిని శ్రీ కొలిశెట్టి లక్ష్మయ్య గారు ప్రథమ ముద్రణ చేయగా ద్వితీయ ముద్రణ శ్రీ శఠగోపాలాచార్యులు గారు చేయించడం జరిగింది. ఆ తర్వాత

"ఆడ పిల్లల పేర్లు ఆలోచించి పెట్టండి" అను గ్రంధాన్ని డాక్టరు ఈశ్వర ప్రసాదు గారు ముద్రించడం జరిగింది. ప్రస్తుతం భగవద్గీతామృత పానం భవసాగర తీరం అను గ్రంధాన్ని మా అభిమానులు మా మిత్రులు దాతలు కొందరు కలిసి ముద్రణ వ్యయాన్ని భరించినారు. వీరందరికీ నా నమస్సులు పరమానందంతో ఆర్ధిక సహకారం చేసిన వారందరిని ఆ గీతాచార్యుడు భవసాగరాన్ని దాటించి అందరికీ ఆనందాన్ని ప్రసాదించాలని ఆ పరమాత్ముని మనసారా ప్రార్ధిస్తున్నాను.

ఆ జనప్రియ గీతోపన్యాసమును నేను సంక్షిప్తం చేయాలని ప్రయత్నించడం దుస్సాహసమే, ఎందుకు అనగా అందులో ఏదీ వదల బుద్ధి కావడం లేదు. ఏదీ వదలకుండా వ్రాస్తే మళ్ళీ యిదీ ఒక పెద్ద గ్రంధ మౌతుంది. అల్పజ్ఞుడైన నా శక్తికి తగినట్లుగా యీ గీతామృతాన్ని పంచే భాగ్యము ఆ మహానుభావుల ఆశీర్వాద ప్రభావమే గాని వేరు కాదు. యీ గ్రంధానికి వారి వారి అభిప్రాయాలు వ్రాసిన శ్రీరంగాచార్యులు గారికి, శ్రీ శేషం రామానుజాచార్యులు గారికి, శ్రీ ఆచార్య వాసుదేవ గారికి, మహా కవి తిరువేంగళ సూరియతిశ్రీ గారికి, శ్రీ పాండురంగ ప్రసాద్ గారికి, శతావదానులు శ్రీ గండ్లూరి దత్తాత్రేయ శర్మగారికి పేరు పేరున నా నమస్సులు సమర్పిస్తున్నాను. బాల్య మిత్రుడు శ్రీ శివారెడ్డి గారికి ప్రగాఢమైన అభినందన వందనాలు సమర్పిస్తున్నాను. అడిగిన వెంటనే అభిప్రాయాలు వ్రాసిన వారందరూ ఎంతో ఆత్మీయతతో వారి వారి అభిప్రాయాలు వారి వారి శైలిలో పద్యాలతో పద్యాల మధ్యాక్షరాలతో, గద్యాలతో ప్రశంసిస్తూ వ్రాసిన వారిని గూర్చి ఎంత చెప్పినా తక్కువే వీరందరి ప్రశంసలు పూజ్యపాదులు గురుదేవులకే చెందును. ఎందుకు అనగా ఇది అంతా వారి ప్రసాదమే గనుక యీ ప్రశంసలకు వారే అర్హులు. యీ గీతామృతసారంలో గొప్పలు ఒప్పులు

యేముండినా అవి శ్రీరామక్రిష్ణానందగిరి స్వామివిగా గ్రహించండి. తప్పులు ఏమైనా దొర్లిన అవి నావిగా భావించి మన్నించమని సవినయంగా శిరసు వంచి ప్రార్థిస్తున్నాను. శ్రీశ్రీశ్రీ మళయాళ స్వాముల వారు అంటారు ధారాళంగా విరాళాలిచ్చే దాతలు దండిగా ఉన్నారు. చిత్తశుద్ధితో పని చేసే కార్యకర్తలు లేరు'' అనే వారట. వారి మాటలో సత్యం ఎంత ఉన్నదో నాకు అర్థమగుచున్నది. ఈ గ్రంథ రచనకు విరాళాలిచ్చిన వేల రూపాయల కంటే వారి ఆనందం చూస్తుంటే నాకు కన్నులు చెమర్చినాయి. వారి ఆనందం చూసి నాకెంతో తృప్తి ఆనందం కలిగింది. యీ ఆనందం వారికీ, నాకూ శాశ్వతానందంగా ఉండునట్లు ప్రతి పైసా సద్వినియోగానికే వెచ్చించగలనని మన:స్ఫూర్తిగా తెలియ జేయుచున్నాను. ఇచ్చేవాడు భగవంతుడే అయినప్పుడు ఇంకో మార్గంలో ఇవ్వలేడా యీ కక్కుర్తులెందుకో! శ్రీ మళయాళ స్వాముల వారు ఇంకో సూక్తి చెప్పే వారు "ఆచరణ లేని బోధ తాలు గింజల విత్తనం వంటిది." అది మొలవనూ మొలవదు పండనూ పండదు. యీ మళయాళ స్వామిగారు ఎవ్వరో అని అనుకుంటున్నారో ఏమో! శుకబ్రహ్మాశ్రమ స్థాపకులు శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరిస్వామి వారు. వారి గురువు " గీతా మకరందము" రామాయణ రత్నాకరము, భారత రత్నాకరము, వాశిష్ట రత్నాకరము, ఉపనిష ద్రత్నాకరము ఇలాంటి అనేక గ్రంథాలు వ్రాసిన మహానుభావునికి గురుదేవులు వారు ఆసేతు హిమాచల పర్యంతం పాదయాత్రలు, తీర్థయాత్రలు చేయగా, దక్షిణాది రాష్ట్రాలలో భక్తి జ్ఞానాలు దాన ధర్మాలు చాలా తక్కువగా ఆయనకు కన్పించాయట. మన ప్రాంతం దండకారణ్య ప్రదేశమని గుర్తించి ఆంధ్ర రాష్ట్రంలో అహర్నిశలు శ్రమిస్తూ అనేకమంది గురువులను చేసి, అనేక గ్రంథాలు వ్రాసి ఆ లోటు భర్తీ చేయుటకై కృషి చేసిన ఆ మహాను భావుని గూర్చి ఎంతని వ్రాయగలను. ఆయన జీవిత చరిత్ర దాదాపు అయిదు వందల

పేజీల పుస్తకం వ్రాయడం జరిగింది. నాకు మొదటినుండి మహాత్ముల జీవిత చరిత్రలు చదవడం చాలా ఇష్టము. అవి మళయాళ స్వాముల వారి జీవిత చరిత్ర. శ్రీ విద్యా ప్రకాశానందగిరి స్వామి గారి జీవిత చరిత్ర , శ్రీ రామక్రిష్ణ పరమహంసగారి జీవిత చరిత్ర, శ్రీ శంకరానందస్వామి గారి జీవిత చరిత్ర సమర్ధ రామదాసు గారి చరిత్ర వంటివి ఇంకా ఎన్నో జీవిత చరిత్రలు చదివి నేనెంతో చైతన్య వంతుడనౌతూ అందరినీ చైతన్యవంతుల చేయ ప్రయత్నిస్తూ ఉంటాను. అసలు నేను యీ జ్ఞాన మార్గానికి రావడానికి ముఖ్య కారణం ఒక విషాద ఘట్టం. నాకు 26 సంవత్సరాలకే వివాహమైన తర్వాత ఒక సంవత్సరానికే నాకు భార్య వియోగం జరిగింది. ఆమె అమృత స్వరూపిణి. ఆ వియోగం నన్నెంతో కృంగదీసింది. అప్పుడు నేను జీవిత గమనమేమి? జీవిత పరమార్ధ మేమి? ఇప్పుడు నేనేమి చేయాలి? అని ఆలోచించి నేను తరిస్తూ మరి ఎందరినో తరింప చేయాలని కృతనిశ్చయుడనై అనేక వేదాంతగ్రంధాలు భగవద్గీత శ్రీ సీతారామాంజనేయ సంవాదము, జీవబ్రహ్మైక్యరాజయోగసారామృతము, రామక్రిష్ణ బోధామృతము, శ్రీ క్రిష్ణ రుక్మిణీ సంవాదము మొదలగు అనేక గ్రంధాలు చదివి ఆ మార్గంలో పయనిస్తూ ఉండేవాడిని. అపుడు మా ఇంట్లో మా గ్రామంలో అందరూ వీడికేమో పిచ్చి పట్టినట్లున్నది మళ్ళీ వివాహం చేస్తే గానీ వీని రోగం కుదరదని అందరూ అన్ని విధాలా ప్రయత్నాలు చేసి వద్దన్నా వదలకుండా మరలా వివాహం చేయడం జరిగింది. విధి బలీయమో లేక వజ్రాల లాంటి సంతానాన్ని కలిగే యోగమున్నందువల్లనేమో కూతురు, కుమారుడు కలిగారు. మా కూతురు దత్తపీఠాధిపతికి భార్యగా, గురుపత్నిగా, అందరిచే గౌరవింపబడుచున్నది. కుమారుడు కర్నూలు మున్సిపల్ హైస్కూల్లో తెలుగు పండితుడిగా మంచి ఉపాధ్యాయుడిగా గుర్తింపు తెచ్చుకున్నాడు. ఇంతకన్నా మాకు కావలసిందేమున్నది.

## నా జీవితంలో అత్యంత మధుర ఘట్టాలు

1) 1972లో విశ్వ విఖ్యాత నటసార్వభౌముడు శ్రీ ఎన్.టి. రామారావు గారికి జనవరి శుభాకాంక్షలు వ్రాసి వారిచే ప్రశంసింపబడడం.

2) 1995 లో శతావధాని శ్రీ గండ్లూరి దత్తాత్రేయ శర్మచేత "ధర్మ ప్రచారకులు" అను బిరుదుతో సన్మానింపబడడం.

3) 1998లో త్యాగరాయ గానసభలో రామాయణముపై ఉపన్యసించి అందరి ప్రశంసలు అందుకోవడము

4) 1985 కర్నూలు ఎఫ్.ఎమ్. రేడియోలో ఉపన్యసించడం

5) 2008వ సంవత్సరంలో దూరదర్శన్‌లో 3 రోజులు ఉపన్యాసము ఇవ్వడము

6) 6-5-2011 విశ్వసాహితి సంస్థవారు మా గ్రంథము మరువబోకు మీవు మంచిమాట అను గ్రంధానికి ఉత్తమ గ్రంధంగా అవార్డు నిచ్చి శ్రీ P.V. మనోహర్ రావుగారి చేత సన్మానింపచేసి 2500/ బహుమతిగా ఇచ్చి త్యాగరాయ గానసభలో సన్మానం చేయడం జరిగింది.

ఇవి చాలా సంతోషించ దగ్గ విశేషాలు. నా యీ రచనల ద్వారా కొందరైనా మార్పు చెంది మంచి మార్గంలో పయనించినారంటే మా కృషి మా జన్మ సార్థకమైనట్లుగా భావిస్తాను. యీ పుస్తకాన్ని సర్వాంగసుందరంగా DTP చేసిన శ్రీమతి లలిత గారికి, ముఖచిత్ర రూపకల్పనా శిల్పి చిరంజీవి షబ్బీర్ అహ్మద్‌కు మా శుభాశీస్సులు.

ఇట్లు

**రచయిత సన్నిధి జనార్ధన స్వామి**

జ్యోతిష్యవాస్తు పండితులు

వనస్థలిపురం.

శ్రీరస్తు　　　　శ్రీకృష్ణ పరబ్రహ్మణేనమః　　　　శుభమస్తు

శ్రీయుతులు గౌరవనీయులు ధర్మనిరతులు సాహితీప్రియులు వదాన్యులు తెల్పిన వెంటనే ఆదరంగా ఆనందంగా గ్రంధ ముద్రణకు సహకరించిన వారందరకు కృతజ్ఞతాపూర్వక నమస్సుమాంజలులు సమర్పిస్తూ వారందరకూ భగవంతుడు ఆయురారోగ్య ఐశ్వర్య భోగభాగ్యంబులతో పాటు దివ్య జ్ఞానం ప్రసాదించమని దేవ దేవుడయిన గీతాచార్యులను ప్రార్థిస్తున్నాను. వారి పవిత్ర పరిచయాలు వారి దివ్య చిత్ర పటాలను దర్శించండి.

గీ॥　**లక్ష్మి రామ్మూర్తి** టీచరు. లక్షణముగ
ధర్మ మార్గాన పయనించు. ధర్మ పరులు
వారు దంపతులిద్దరు వసుధయందు
జ్ఞానకీర్తుల వెలుగంగ ఘనముగాను
వాసుదేవుడు రక్షించు. వారినెపుడు.



Ph : 9885500456



Ph : 9492032298

గీ॥　సుగుణ వంతుడు **సింగర. స్వామి** గారు
మంచి ఉద్యోగమును చేసి. మహిని యందు
**లక్ష్మి నరసమ్మతో** కూడి. లాలితముగ
సుఖముశాంతులు పొందుత. సుగుణమతులు
వారికారోగ్య భాగ్యాలు. వరుసతోడ
సిరులు సంపదత్ వీరింట. చెలగుగాక.

గీ॥　ఘనుడు **నరసింహ స్వామియు**. ఖ్యాతిపరుడు
మంచి పనులలో ముందుండు. మాన్యుడితడు
**శ్రీరమాదేవి** యిల్లాలు. శ్రేష్టురాలు
దాన ధర్మాల ముందుండు. ధర్మపరులు
వారికిచ్చుత కృష్ణుండు. వసుధ సిరులు



Ph : 8008889376

గీ॥ **గంజిలక్ష్మయ్య** యెంతయో. ఖ్యాతి పరుడు
సత్య ధర్మాల పాటించు. సాత్వికుండు
భార్య **భారతి**విద్యలో. బాగుచేశి
ఆమె ఉద్యోగములకెంతొ. వన్నెతెచ్చి
మంచిగాను కుటుంబాన్ని. మలచుకొనిరి
కనక వర్షాలు వారింట. ఖ్యాతి గురియు



Ph : 8106066110



గీ॥ ఘనుడు **శ్రీరామరెడ్డియు**. ఖ్యాతి పరుడు
శ్రీ **జయమ్మను** భార్యతో. స్థిరముగాను
దానధర్మాల ముందుండు. ధర్మ పరులు
మంచి మార్గాన పయనించు. మానధనులు
వారికారోగ్య భాగ్యాలు. వసుధకలుగు.

Ph : 040-24240454

గీ॥ **వెంకటయ్యయు** ఇంజనీర్. వేడ్కతోడ
శ్రీ **జయప్రద** భార్యగా. శ్రేష్టులనగ
గుడులబడులకు ప్రేమతో. గుర్తుగాను
దాన ధర్మాలు చేశెడి. ధర్మపరులు
ఇహము పరములు వారింట. యింపుతోడ
కలుగ కోరితినేనెంతొ. క్రమముతోడ



Ph : 9391057504



గీ॥ ఘనుడు **శ్రీ సీత రాంబాబు**. క్రమముతోడ
భార్య **శోభ** తోగూడియు. భవ్యముగను
ధర్మ మార్గాన పయనించు. ధార్మికుండు
మంచిపనులను చేయు సన్మాన పరులు
వారికిలవేల్పులిచ్చుత. వాంఛితములు

Ph : 9640676086

గీ॥ బలపనూరు వంశంబున. భానుపగిది
రైతుబిడ్డడునితడు. **రత్నాకరుండు**
మంచిపనులలొ ముందుండు. మాన్యుడితడు
భార్య **అనసూయతో** కూడి. బాగుగాను
ఆయురారోగ్య భాగ్యాల. నలరుగాక



Ph : 9440741970



Ph : 9550568334

గీ॥ కలడు బంగారు నగలను. బాగచేయు
విశ్వ బ్రాహ్మణకులములో. వెలుగు వాడు
**పద్మయు యశోకాచారికి**. ప్రబలముగను
సంతతానందములు అన్ని. చాల కల్గి
ఆయువైశ్వర్యభాగ్యాలు. అబ్బుగాక

గీ॥ **రామకిష్ణను** మిత్రుడు. రమ్యగుణుడు
**సత్యవతి** సాధ్వి భార్యతో. సంతతంబు
ఆయురారోగ్యభాగ్యాల.ననుభవిస్తు
సంతతానంద భాగ్యాలు. చాలకలుగ
దేవదేవుని ప్రార్ధింతు. దిన దినంబు



Ph : 9391022628



Ph : 9948277719

గీ॥ సురల కంటి **అనంత రెడ్డి**. సుగుణ గుణుడు
**మంజలమ్మను** భార్యతో. మంచి పనులు
దాన ధర్మాలు చేశెడి. త్యాగ ధనులు
వారు సంతతితో కూడి. వసుధ యందు
సర్వ సంపదల్ బొందుత. స్వామి కృపతొ

గీ॥ అమర వంశాన జన్మించి. నద్భుతముగ
భార్య సాధ్వి **సువర్ణమ్మ.** పడతిగాగ
మంచి పుత్రుల గాంచియు మహిని యందు
విజయుడాయె **విఠల్ రెడ్డి.** వినుత గుణుడు
తల్లితండ్రుల గుర్తుగా. తనయుడైన
శ్రీ జగన్నాథ రెడ్డియు. సిరుల నొసగె
వారికబ్బుత సంపదల్ వసుధ యందు



Ph : 9000770710



Ph : 7702543651

గీ॥ ఘనుడు రామోజు వంశాన. ఘనము తాను
పరగ **విద్యాధరు** డిలలొ. ప్రణుతి కెక్కె
ధర్మ పత్నియు **సవితతో.** ధర్మ మందు
మంచికార్యాల ముందుండు. మాన్యుడితడు
వీరికబ్బుత సంపదల్. విరివిగాను

గీ॥ శ్రీ **మహేశ్వర రావెంతో.** శ్రేష్టుడిలను
సాధ్వి **గీతాంజలీ దేవి.** సహన శీలి
పుత్రి దివ్యసాయెంతయో. పుణ్యపంట
మహిని నిత్యసాయెంతయో. మాన్యురాలు
అన్ని సుఖములు వీరికి. అబ్బుగాక



Ph : 9440418323



Ph : 9000224375

గీ॥ కర్మ ఘాటున నివసించు. ఖ్యాతి పరుడు
భార్య **లక్ష్మి దేవమ్మతో** బహువిధాల
**వెంకట స్వామి** మిత్రుండు. వేడ్కతోడ
తెల్పినంతనె వెంటనే. ధనమునీయ
సంత సంబును తెల్పిన. సాత్వికుండు
వారికబ్బుత సంపదత్ వదలకుండ

గీ॥ కలదు గుడిబండ గ్రామాన. ఖ్యాతి పరుడు
**(రామక్రిష్ణా రెడ్డి)** గొప్ప ఉద్యోగమును చేశి. కోర్కెతోడ
**లక్ష్మిదేవమ్మ** భార్యతో. లాలితముగ
పండ్లతోటలు పెంచుతు. ప్రతిభ తోడ
దాన ధర్మాలు వీడని. దాత యితడు
వీరికబ్బుత భువియందు. యీప్సితములు



Ph : 9963902363



Ph : 8885638629

గీ॥ **శ్రీరమేశు విశాలాక్షి.** శ్రేష్టులన గ
చేతి వృత్తినె ఓర్పుతో. చేయునతడు
దాన ధర్మాలు వదలని. దాత ఇతడు
లక్ష్మి భారతి వీరింట. లక్షణముగ
స్థిర నివాసమ్ము యుండుత. స్థిరముగాను

గీ॥ కలదు **రాంప్రసాదని**యెడు ఖ్యాతి పరుడు
సాధ్వి**లీలా కుమారియు.** సహకరింప
అంచలంచెలు నభివృద్ధి. నందితాను
పుణ్యకార్యాలు చేశెడి. పుణ్యతముడు
దానగుణముల ముందుండు. ధర్మ పరులు
భోగ భాగ్యాలు అబ్బుత. బోలెడన్ని



Ph : 9848010785



Ph : 9494827369

గీ॥ న్యాయవాదము వృత్తిగా. నడుచు కొనుచు
ఘనుడు **వెంకయ్య చౌదరి** ఖ్యాతి పరుడు
భార్య **రజనమ్మ**తోడుగా, బరగుచుండ
కష్టములు యెన్ని వచ్చినా. ఖ్యాతి విడక
జీవితమ్మును సాగించు. ధీరుడితడు
దీక్షలును పూజవదలని. దివ్యుడితడు
వారి అభివృద్ధికాంక్షింతు. వదలకుండ.



**సూరి సామ్రాట్ యతిశ్రీ**

**శ్రీమాన్ యల్లకరి తిరువేంగళసూరి**

**నవ జయదేవ – సుకవిశేఖర**

**కవికోకిల – మధురకవి**

**వినుకొండ – గుంటూరుజిల్లా**

**☎ 9492905787**

# పరమ ప్రమోదము

అవని జనులకు ఆవశ్య పఠనీయమైన “ శ్రీ భగవద్గీతామృత పానము భవసాగర తీరము ” గ్రంధ రచయితను తెలుసుకొన వలయునని ఉత్సాహ పడుతున్నారా? అయితే ఈ సీస పద్యములో దాగు కొనినారు. కనుగొంటారా!

సీ ॥ ప్రాణులు బ్రతుక కావలసిన దేమొకో? -- గ్రా**స**ము
పరిణయమ్మును కాని పడతి యెవతె ? -- క**న్ని**య
జానకి పెండిలి జరిగిన పురమేది? -- మి**థి**ల
భక్తులు చేసెడు పనియదేమి? -- భ**జ**న
నాథుడు లేనట్టి నారిని నేమంద్రు? -- అ**నా**థ
మందు నూఱుటను నే మందురయ్య? -- మ**ర్ద**న
అజ్ఞాన జనులంద ఆశించునదియేది? -- ధ**న**ము
చెవిటి, విననిది వచింపవలయు; -- ని**స్వా**నం

గీ ॥ ఆరు మోముల స్వామి వాహనము దెల్పు-- నె**మి**లి
అన్నిటికి జాడ మూడేసి యక్షరంబు;
లందు గల మధ్య వర్ణంబు లన్ని జదువ;
గ్రంధ రచయిత నామంబు గ్రాహ్యమగును ॥

గ్రాసము = కబళము, తిండి
మర్దన = పిసుకుట, చూర్ణము చేయుట
నిస్వానం = నిస్వానము, నిస్వనము ,శబ్దము, ధ్వని

## నవపాద గీత మాలిక

గీ॥ **స**ర్వవేదాంత నిక్షిప్త సారమును, జ
గ **న్ని**వాసి కృష్ణుడు జగద్ధితముగ,
ధీని **ధి** కి పార్థునకును బోధించినట్టి
గీతను **జ**నావళి వివిధ నీతులెఱుగ
హృద్యవచ **నా**లతో రచియించి ప్రధితు
లైరి; తమ మా**ర్ద**వ మధురమైన భావ
ములను కన్గొని**న**, కవులు బుధవరులును
సరస హృదయులు, **స్వా**మి హర్షపులకిత, శ
రీరులయి నుతించిరి **మి**మ్ము ప్రీతిదనర ॥

ఇప్పుడు తెలిసినది గదా; వారే ధర్మప్రచారకులు, జ్యోతిష్య శాస్త్ర పండితులునైన
**శ్రీమాన్ సన్నిధి జనార్దన స్వామివారు.**

ఆర్యా ! తమరు దయతో నాకొసంగిన రహస్యాలతో రసమయమైన రామాయణము(1)
భదవద్గీతామృతపానము (2) అను ఉద్గ్రంథాలను చదివే భాగ్యం నాకు గల్గింది.
స్థాలీపులాకన్యాయంగా కాక, ప్రత్యక్షరశోధగా పరిశీలించితిని. మా సతీమణి సరోజ కూడా
వాటిని నిత్యము చదువుతునే యున్నది. ఇంతగా ఆకర్షించినదంటే, తమరు అనేక
రామాయణములను పెద్దల వ్యాఖ్యానాలను, అత్యంతాసక్తితో, శ్రద్ధతో, జిజ్ఞాసతో చదివి, ఆ

సారమునంతయు ఆ గ్రంథములో నింపి, పాఠకులను పరవశింపజేసి. శ్రీరామచంద్ర పరబ్రహ్మ కృపకు పాత్రులైనారు. సత్కవుల సమక్షంలో సహృదయులైన శ్రీ చెరుకూరి రామారావుగారి చేత సువర్ణకంకణధారణ జరిపించుకున్నారంటే అది ఆ రాముని కరుణయే గదా !

ఇక "భగవద్గీతామృతపానము" తనివిదీరా గ్రోలినాను. ఆ గ్రంథరాజము పుటల క్రింద అనురక్తిని కలిగించే అనేక సూక్తులు రత్నములవలె ప్రకాశిస్తున్నాయి.

ఉ॥ సూక్తులు గ్రంధ పత్రముల నుండగ మెండుగ క్రింది భాగమున్
భక్తియు, ముక్తి నిచ్చు భగవానుని గీతను విస్తరించి, యా
సక్తిగ తద్విశేషముల సర్వు లెఱుంగునటుల్ రచించి మీ
శక్తిని జాటినారు. తమ జన్మము ధన్యత నొందె నీ భువిన్ ॥

భగవద్గీత 18 అంతస్థులున్న దివ్య భవనము. అందులో అనర్ఘరత్నము లున్నవి. 5115 సంవత్సరముల నుండి ఎవరు ఎన్ని తీసుకున్నను అవి తరుగుట లేదని తమరు సెలవిచ్చినారు. అది నిత్య సత్యము. తమ రచనలో ఎన్నెన్నో వినూత్న విషయాలను వివరించారు. మచ్చున కొక్కటి. ఇది "ఇందూరు మహారాణి" కథ; ఆ మహారాణి అహల్యాబాయి కోరికపై , పౌరోహితుడు భగవద్గీతను ప్రారంభించి, మొట్టమొదట శ్లోకము, శ్లో ॥ ధర్మక్షేత్రే కురుక్షేత్రే ॥ అని చదువ బోగా , " ఆపండి స్వామీ ! ఆ ఒక్క వాక్యము చాలు జన్మ తరించటానికి " అని రాణి అన్నది. పురోహితుడు ఆశ్చర్యంతో " గీత పూర్తి కాలేదు, భగవదువాచ వినలేదు, జన్మ ఎలా తరిస్తుంది " అన్నాడు. అప్పుడా రాణి " ఆ వాక్యాన్ని కొద్దిగా ఇలా మార్చి చదవండి " క్షేత్రే క్షేత్రే ధర్మం కురు " అవుతుంది అన్నది. క్షేత్రమనగా దేహము; క్షేత్రమనగా భూమి. ప్రతిచోట ప్రతి నిమిషము, " ధర్మం కురు " అని ఆదిలోనే చెప్పింది గీత. ఈ వాక్యాన్ని ఆచరిస్తే జన్మము తరిస్తుంది కదా ! అని సమాధానం చెప్పింది రాణి. పౌరాణికుడు ఏండ్ల తరబడి గీతను పఠిస్తున్నా, ఆ రహస్యాన్ని గ్రహింపనైతియని, సిగ్గుతో తలవంచి, ఆ తల్లికి నమస్కరించి వెళ్ళిపోయాడట.

కురుక్షేత్రంలో ధర్మమే జయించింది. మనలో కూడా ఏమి జయిస్తుందో తెలుసుకొనండి అని సూచించారు. ఇలాంటివి మీ ప్రతిభకు తార్కాణము. విస్తరణ భీతి చేత ఇలాంటి విజ్ఞానదాయక విషయాలను చెప్పటం విరమించుతున్నాను.

భగవద్గీతా విశేషాలను భక్తులకందించి, జనార్దన స్వామియైన మీరు శ్రీకృష్ణ పరబ్రహ్మ కరుణాకటాక్ష ప్రాభవము చేత, మీరు నిండు నూరేండ్లు, ఇహలోక సుఖాల ననుభవించి సద్యశమును గడించి, చివరిలో పరమాత్మ సన్నిధికి, సన్నిధి జనార్దన స్వామి యైన తమరు చేరు కొనవలయునని అభిలషిస్తున్నా ఆకాంక్షిస్తున్నా !

ఆంధ్రావళికి అత్యంత ఉపయుక్తములైన గ్రంధముల నందించి నందులకు, సకలదేవతలు, సర్వ దిక్పాలురు, సమస్త ఋషి పుంగవులు మీకనేక శ్రేయముల నొసంగుదురు గాక!

సీ॥ శ్రీహరి శంభు విరించి కంసారాతి
 దశరథ రామాది దైవతములు,
పద్మినీ పార్వతీ వాక్సతీ రుక్మిణీ
 సీతాది దేవతా స్త్రీ జనములు,
హరి శిఖ యమ దైత్య వరుణానిల కుబేర
 కాలకంఠాది దిక్పాలవరులు,
వ్యాస వశిష్ఠ విశ్వామిత్ర వాల్మీకి
 శిబి జనకాది ఋషి ప్రవరులు,
గీ॥ చల్లనౌ దీవెనల పూల జల్లు రాల్చి
 భవ్య శుభములు దివ్య విభవములు నెడ
పక నొసంగుత మీకును; స్వామి ! యోజ
నార్దన! కలుషమర్దన ! నతులు గొనుడు॥

మనకు ఎన్నో గీతలున్నవి. రామగీత, శివగీత, దేవీగీత, గణేశగీత,

హంసగీత, సూర్యగీత, యమగీత, యతిగీత, అవధూతగీత, అష్టావక్ర గీత, జనకగీత ఇలా 28 గీతలున్నవంటారు. వారి వారి పేర్లుతోనే ఈ గీతలన్నీ వున్నాయి. అలాగే కృష్ణుడు చెప్పింది కృష్ణ గీత కాలేదు. భగవద్గీత అయింది. అన్ని అవతారములలో భగవంతుని ఒక్క అంశము మాత్రమే ఉ ంటుంది. కాని కృష్ణావతారంలో భగవంతుని అంశము పూర్ణముగానున్నది. కాన కృష్ణుడు పరిపూర్ణ అవతారుడు. కావుననే "కృష్ణస్తు భగవాన్ స్వయమ్" అన్నారు కావున అది భగవద్గీత.

ఈ గీతను చెప్పింది కృష్ణుడు; విన్నది కృష్ణుడు; ఎందుకనగా అర్జునుని పదిపేర్లలో అర్జునునికి కృష్ణుని పేరుంది గనుక. ఇక వ్రాసింది కృష్ణుడే. కారణం వ్యాసునికి కృష్ణద్వైపాయనుడని పేరున్నది. అందువలన భగవద్గీతను వ్రాసింది, చెప్పింది, విన్నది కృష్ణుడే - కృష్ణుడే - కృష్ణుడే. అంటే విచిత్రంగా వున్నది కదూ! భగవంతునిచే గానము చేయబడినది భగవద్గీతలో శ్రీకృష్ణుడు ఋషులలో వ్యాసుండనేను, పాండవులలో ధనంజయుండనేను, అని చెప్పినాడు కదా!

భగవద్గీత భగవానుని గాత - వేదవ్యాసుని వ్రాత - వేదమంత్రముల మ్రోత - దైవీ సంపదకు నేత - దివ్య జ్ఞానమునకు దాత - ప్రణవనాదమునకు దూత - పరమార్థ దృష్టికి మాత - అహంకారములకు కోత - అసుర స్వభావమునకు వాత - కామక్రోధములకు ఘాత - కైవల్యసిద్ధికి సీత - అంటే మోక్షా న్నిచ్చేదని అర్థము.

అలాంటి భగవద్గీతామృత పానమొనర్చి ప్రతి మానవునికి భవసాగరమును తరించును గాక !

ఇట్లు యతిశ్రీ




**శతావధాని గండ్లూరి దత్తాత్రేయ శర్మ**

విశ్రాంత ప్రధానాంధ్ర పండితులు

డోను.

9440079522


# అభినందన చందనమ్

1) మ॥ భగవద్గీత పఠింప వీలుపడుటే
భాగ్యంబు – భవ్యాత్ముడై
భగవద్గీతను ఆకళించుకొని సవ్యాఖ్యాన
మందించుటెం
త, గరీయః ప్రతిభా విశేష ఫలమో
తర్కింప శక్యంబె? ఆ
భగవల్లీలకు పాత్రుడైతివనినే భావింతు
మిత్రోత్తమా!

2) కం॥ చెప్పినది తొలుత వినవలె;
ఎప్పుడు వినగలడొ అపుడె ఎద తర్కించున్
మెప్పునకు మచ్చుతునకగ
గొప్పగ చెప్పితివి గీత కొసమెఱుపనగన్

3) కం॥ అనురాగమూర్తి " సన్నిధి
జనార్ధనస్వామి" సరస సాహిత్యకళా
వననిధి; పరిశోధనలో
ఘనుడు; పురా పుణ్యధనుడు కాంచుత శుభముల్ ॥

4) మ॥ ధన సంపాదనమే ప్రధానమని
నిర్ధారించి సాధించు సా
ధన కాలంబిది; శారదాంఘ్రి భజనా
తాదాత్మ్య సంసిద్ధి సా
ధన గావించెడి వారలెందరు? జను
ర్ధన్యత్వమున్ గంటి – వ
ర్జున యోగంబు నినున్ వరించె సఖుడా !
శుద్ధుండవైనావిలన్.

5) మ॥ భగవద్గీతను ఒక్క శ్లోకమునో
తత్పాదంబో! భక్తి ప్రప
త్తిగ వల్లించినవాని కృష్ణ భగవత్
దృష్టుల్ సదానిష్ఠమై
సిగపూవాడక కాచి యుండునని
విశ్లేషించి రధ్యాత్మపా
రగు లేతత్ కృతినెల్ల జూచిన నినున్
శ్లాఘింప కెట్లుండెదన్.

ఇట్లు

**మీ శ్రేయోభిలాషి**



డా. శ్రీ రంగాచార్య
విశ్రాంత తెలుగు ఉపన్యాసకులు,
పాలెం ప్రాచ్య కళాశాల

# గీతా సుగీతా

శ్రీమత్ భగవద్గీత మన సమాజానికి మార్గనిర్దేశం చేసే మహోత్తమ గ్రంథరాజం. చాలా కాలం నాడే మన మతత్రయాచార్యులే గాక సర్వేపల్లి రాధాకృష్ణ పండితుని వంటి ప్రఖ్యాత తత్త్వవేత్తలు, శ్రీ వివేకానందస్వామి వంటి మహానుభావులు విపులరీతి వాఖ్యలు వ్రాసి వివరించి ప్రసంగించి ప్రజా సమూహానికి మహోత్తమ సందేశము నిచ్చి, యశస్కులైన విషయం అందరికీ తెలిసిందే. ఇక భగవద్గీత ఎన్ని భాషలలో ఎందరెందరిచేత ఎన్నెన్ని ప్రక్రియల్లో అనూదితమైనదో చెప్పలేము. గీత విషయంలో ఎవరి భక్తి ప్రపత్తులు, శ్రద్ధాదులు ఎట్లుగలవో తదనుగుణ రచనలు వస్తూనే వున్నవి. ఇది మన హిందూ సమాజ పురాకృత పుణ్య విశేషం.

ఆధునిక సమాజానికి ఏదో కొంత మేలు చేసి జాతిని కర్తవ్యోన్ముఖుల చేయవలెననే స్థిర సంకల్పంతో మన ఆశ్రమాల అధిపతులు, సాధు సన్యాసవరులు తమ భావనలను ప్రసంగములుగా, వానిని సులభరీతి గ్రంథములుగా ప్రచురించి ఆ బాల వృద్ధ పర్యంతం చదివి ఆనందించి కర్తవ్య నిష్ఠా పరాయణులై జాతి జాగృతి నిమిత్తం శ్రమించటం చూస్తున్నాము. ఇదొక శుభపరిణామం.

ఆ పరంపరలో వచ్చినదే పూజ్య రామకృష్ణానంద స్వామి వారి ప్రసాద ప్రసార రూపం 'భగవద్గీతామృతపానం - భవసాగర తీరం' అనే విశేష రచన. దీన్ని మరింత సులభరీతిలో పఠన ప్రసంగముల కనుగుణంగా తీర్చి దిద్దిన విద్వద్వరులు, ధర్మ ప్రచారకులు, వాస్తు జ్యోతిష పండితులు, పౌరాణికులైన సన్నిధి జనార్దనస్వామి వారి సత్కార్యం సర్వదా ప్రశంసావహం, మనం గీతా వైభవాన్ని, అంతరార్థాన్ని ఎట్లా తెలుసు కోగలుగుతామో దాన్నే వీరు చక్కగా అందించి కృతజ్ఞతా పాత్రులైనారు. ఉదాహరణకు 18 సంఖ్య దాని గొప్పదనం - వివరణ అద్భుతంగా వుంది. 106 పుటలో గాంధీగారి వద్ద గీతా బైబిలు కథ - 112 పుటలో ఇద్దరు సన్యాసుల కథ - 78 పుటలో కౌరవులనే రాచపుండును తొలిగించటానికి వైద్యుని శస్త్రచికిత్సా విషయ కథ. ఇట్లా ఎన్నో సాదృశ్యాలు, కథలు, సామెతలు, లోక వృత్తాంతాలతో భగవద్గీతామృతాన్ని మరింత అమృతపానంగా మనకందించి గొప్ప మేలు చేసినారు. వీరి రచనలోని ప్రతి విషయాన్ని వివరిస్తే మళ్లీ ఇంత గ్రంధం కాగలదు. కావున మనం చదివి గ్రహించి ఆనందపరవశులమై మరికొందరికీ విషయాలను వివరిస్తే జనార్దనస్వామి వారి కృషి సార్థకంగా అక్షరరూపమై వెలుగొందుతుంది.

ఇంత చక్కని కృతిని మన జాతి కందించిన రామకృష్ణానందస్వాముల వారికి ప్రణమిల్లుతూ, జనార్దన స్వామి వారిని కృతి జనార్దనునిగా భావిస్తూ సెలవు.

25-3-2014
హరిపురం కాలనీ,
హైదరాబాదు - 35.

# భవసాగరాన్ని దాటించే భగవద్గీత




**శేషం రామానుజాచార్యులు**

విశ్రాంత ఆకాశవాణి కార్య క్రమ నిర్వాహకుడు, బహుగ్రంథ కర్త

9133750442


ద్వాపరయుగ పరంధాముడు, యదువంశమణి, దేవకీ వసుదేవుల ముద్దుల పట్టి, నవనీతంతోపాటు, ఆధ్యాత్మిక భావనోద్యోగ సత్పురుషుల హృదయచోరి, ముముక్షు జన హృదయ సంచారియైన, శ్రీకృష్ణ పరమాత్ముడు లోకోద్ధరణ కోసము, ద్వాపర యుగంలో అవతరించాడు – ఆయన అవతరించిన సమయం నడిరేయి – కంసుడు నిర్భందించిన చెరసాలలో జననం – దేవకీ గర్భంలో ఎనిమిదవ శుక్తి ముక్తా ఫలం – ఆ మహానుభావుడు, నిరంతరం బృందావన విహారి యైనప్పటికి, భక్త చింతామణిగా యశస్తేజుడైన, గోవిందుని నామాన్ని స్మరించినా, తలచినా, కీర్తించినా మోక్షమే లభిస్తుంది. శాంతుడు, నిగమవందితుడైన యదువంశ నీలమణి విశ్వానికి 'గీత' ద్వారా మానవ సమాజోద్ధరణ లక్ష్యంగా, సందేశమిచ్చాడు అదే భగవద్గీతగా, అవతరించినది. అందుకే శ్రీకృష్ణ భగవానుడు, జగద్గురువుగా కీర్తింపబడి జగద్వంద్యుడైనాడు.

అసలు 'గీతలో ఏముంది? ఎందుకీ గీత కు ప్రాముఖ్యం? అందులోనే చెప్పాడు' సమాధానం పరిత్రాణాయ సాధూనాం, వినాశాయచ దుష్కృతాం' శిష్టులను రక్షించి, దుష్టులను శిక్షించడమే తన ధ్యేయమన్నాడు. దుష్టుడైన కంస మామను గూడ వదలలేదు. సన్యాసులను, సుధాముడు వంటి

మిత్రులను, 'కుబ్జ' వంటి కురూపిని' రక్షించిన ఆర్తత్రాణ పరాయణుడు. ఆయన చెప్పిన ప్రతివాక్యం, నేటికి ఆదర్శవంతంగా నిలిచింది. మన నొసట గీతలను మార్చే "గీత" ఎంతో ప్రపూతమైనది. మానవ సమాజం 'గ' కార పంచకాన్ని పవిత్రంగా భావిస్తుంది. గణపతి, గంగ, గీత, గోవు, గోపాలుడు ఈ 'గ' కారంతో వచ్చే అయిదు నిజంగా, పుణ్య దాయకాలు. ఎన్ని యుగాలైనా, యింకా నేటికీ భగవద్గీత పూజనీయం. ఏమిటి దాని ప్రత్యేకత. ఎంతోవుంది.

మన మతత్రయాచార్యులు, భగవద్గీతకు వ్యాఖ్య వ్రాసి భాష్య కారులైనారు. విశిష్టాద్వైత సిద్ధాంత ప్రవక్త " శ్రీమద్రామానుజాచార్యులు వ్రాసిన 'భాష్యం' సాంప్రదాయవాదులకు నిత్య పారాయణ గ్రంథంగా వెలసింది. ఆదిశంకరుల భాష్యం, శైవమతావలంబులకు ప్రాత: స్మరణీయం – శ్రీ మధ్వాచార్యుల భాష్యం. కర్ణాటక ప్రాంత, రామభక్తులకు, మధ్వులకు నిత్యానుసరణీయ గ్రంధము. భగవద్గీత, ఎందరి జీవితాలనో ప్రభావితం చేసింది. తనకెప్పుడు విచారంగా వున్నా, సమస్యలలో ఉన్నా, నాకు పరిష్కారమార్గం చూపింది, భగవద్గీతేయని గాంధీజీ అన్నారు. నాకు మార్గ దర్శకం గీత అన్నాడు స్వామి వివేకానంద. స్వాతంత్ర్య సమర యోధుడు బాల గంగాధర్ తిలక్ జైలులో, గీతాసారమనే వ్యాఖ్యానం వ్రాశారు. ఇది యితర మతస్థుల గ్రంధము కాక, సర్వమత సమ్మతమగు నీతి శాస్త్రము వంటిది – కర్తవ్యోపదేశమును బోధించిన గొప్ప శాస్త్రము. ఆదిశంకరుల నాటికి, హిందూ దేశములో నున్న 'హింసా ప్రవృత్తిని "అహింసా పరమోధర్మ:" అను బోధన చేత, ఆప గలిగింది – " నహి జ్ఞానసే సదృశం " అనుట చేత యిది ప్రత్యక్ష జ్ఞానార్జనకు ఉత్తమ ప్రమాణ గ్రంధము ఇన్ని ప్రత్యేకతలుండుట చేత, యావద్భారత దేశానికే కాక, ప్రపంచములోని యితర దేశీయులు గూడా యిందలి బోధనాంశములను గ్రహించినారు. కనుకనే, యీ భగవద్గీతకు, దేశంలోని అన్ని భాషలలోను గద్య, పద్య, వచన,

గీతముల ద్వారా విశేషంగా వ్యాఖ్యానాలు ప్రచురితమైనాయి. అందుచేత 'భగవద్గీతలను ఆప్త వ్యములని గూడా వ్యవహరిస్తారు. ఇటీవల వచ్చిన వ్యాఖ్యానముల కెల్ల మేలుబంతియనదగినది వచ్చింది. దాని పేరు "శ్రీ భదవద్గీతామృతపానం భవసాగర తీరం" – రచయిత, కవి, వ్యాఖ్యాత, వక్త, శ్రీ సన్నిధి జనార్దన స్వామి గారు. వీరు విస్తృత జాతక ప్రవీణులు, జనాకర్షణ గల వక్త – విషయ వివేచనా దక్షుడు – శ్రీమద్రామయణ రహస్యార్థములను యిటీవలనే వెలువరించారు – ఇది అగాధమైన సముద్రములో ఆణిముత్యాలను వెదకడమంత దుస్తర కార్యము – బహు కావ్యావలోకనము చేత యిది వారికి సుసాధ్యమయింది. ఇప్పుడు చేపట్టిన కార్యము – భగవద్గీతాసారము మానవాళికి ఎలా అమృతోపమానమో యిందులో చక్కగా వివరించారు. లోగడ వచ్చిన అనేక వ్యాఖ్యానములలో కెల్లా యిది శిరోమణి వంటిదై తెలుగు పాఠకలోకాన్ని ఆలరిస్తుందనడంలో సందేహం లేదు. భగవద్గీత యున్నచోట, సకల దేవతలు, ప్రయాగాది దివ్యస్థలాలుంటాయని గీత చెప్పింది.

గీతాయా: పుస్తకం యత్ర యత్ర పాఠ: ప్రవర్తతే
తత్ర సర్వాణి తీర్థాని ప్రయాగాదీని తత్రవై
సర్వదేవాశ్చ ఋషయో యోగిన: పన్నగాశ్చయే
గోపాల గోపికావా పి నారదోద్ధవ పార్షదై:
సహయో జాయతే శీఘ్రం
యత్ర యత్ర గీతా ప్రవర్తతే

ఇంతటి గహనమైన విషయాంతర్గతమైన భగవద్గీతకు, శ్రీ జనార్దనస్వామి గారు సరళ వ్యాఖ్యానము చేసి, సర్వ సుబోధకం చేశారు. పాండితీ ప్రకర్ష కన్న, జానపదులకు సైతము తెలియునంత తేలికగా సమకూర్చారు. ప్రతి అధ్యాయంలోని శ్లోకార్థ వివరణలో వీరి వ్యక్తిగత అనుభవం, సార్వ లౌకిక విషయాల్ని పూస గ్రుచ్చినట్లు వివరించడం వీరి ప్రతిభకు తార్కాణం. అక్కడక్కడ

పిట్ట కథలు మంచి రక్తిని కట్టిస్తాయి". 'నేను' అనే పదం అర్థం తెలుసుకోవడానికి వసిష్ఠుని యింటికి శ్రీరాముడు వెళ్ళిన సందర్భాన్ని చాలా చక్కగా వివరించారు. ఒకటవ ఆధ్యాయం నుండి 18వ ఆధ్యాయం వరకు అఖండంగా సాగిన వాక్ప్రవాహములో మనం కొట్టుకొని పోక తప్పదు – వారి వాగ్ధార అసిధారావ్రతం వంటిది – వారి అనర్గళ వక్తృత్వ ధారాభినివేశము ప్రతి పుటలో కనిపిస్తుంది. ప్రసక్తానుప్రసక్తంగా, కుంతీకథ, ఉద్ధవ, విదురాది కృష్ణభక్తుల ఆత్మగతాన్ని వివరించారు. – గీత చెప్పిన ప్రతివాక్యం వెనుక, శృతులు, ఉపనిషత్తులు, బ్రహ్మ సూత్రాదుల నైమిత్తికం దాగి ఉన్నదని విశ్లేషించారు. బహుధా కావ్యవ్యాసంగం వల్ల వీరికబ్బిన అభినివేశము, యీ వ్యాఖ్యాన గ్రంధమంతటా అంతర్వాహినిగా స్రవించింది.

ఇంతటి మహనీయ గ్రంధాన్ని, సరళ వ్యాఖ్య వ్రాసి, కోట్లాది తెలుగు ప్రజలకు గీతను కరతలామలకం చేసిన వీరి ప్రజ్ఞా వైదుష్యానికి జోహార్లు చెప్పక తప్పదని నా నిశ్చితాభిప్రాయము.

ఇట్లు

**శేషం రామానుజాచార్యులు**



ఓం

श्री मधुसूदनाय नमः


**ఆచార్య వాసుదేవ**

**ప్రముఖ సామాజిక ఆధ్యాత్మిక వేత్త**

☎ **9948917071**


# ముందు మాట

ధర్మ ప్రచారకులు, ప్రముఖ సామాజిక, ఆధ్యాత్మిక వేత్త శ్రీమాన్ సన్నిధి జనార్ధన స్వామి గారు " శ్రీ భగవద్గీతామృత పానం భవసాగర తీరం " గ్రంధమును శ్రీ రామకృష్ణానంద స్వామి ప్రసాదరూపముగా మనకు అందిచ్చి తాము ధన్యులయి మనలను కూడా ధన్యులను గావించినారు. అందుకు వారికి హృదయ పూర్వకముగ కృతజ్ఞతలు, అభినందనలు తెలియజేసు కుంటున్నాను.

భగవద్గీతకు గల ప్రాశస్త్యము ఏమి? ఎందరు ఎన్ని వ్యాఖ్యానములు రచించిననూ, ఇంకనూ రహస్యములు అందక ఎందుకు యుగాల తరబడి కాలానికి నిలబడుచున్నది? భగవద్గీత వలన కలిగే ఆనందం, అమృతం ఎవరికి, ఎక్కడ, ఎలా లభించగలవు? అష్టభార్యలతో, పదహారు వేల మంది గోపికలతో రాసకేళి గావించే చంద్ర వంశోద్భవుడయిన శ్రీకృష్ణుడు " కృష్ణం వందే జగద్గురుం " అనే జగద్గురువా? శాంతి సుఖ, సమృద్ధులతో తులతూగుతూ ఎక్కడా వేనిని వదులుకోని, సన్యసించని శ్రీకృష్ణుడు మోక్షము గురించి, సన్యాసము గురించి మోక్ష సన్యాసయోగముగా తెలియజేయడమా? ఆధునిక కాలంలో వ్యవహార భాషా శైలిలో, సరళీకృతంగా తెలుసుకోవలసిన రహస్యములు భగవద్గీత యందు ఎన్నో కలవు. ఈ సందర్భముగా జయపుర ఆస్థాన ప్రధాన పండితులు, వేద శాస్త్ర రహస్యోద్ఘాటక, విద్యావాచస్పతి, పండిత

మధుసూధన ఓఝా గారి ఆత్మీయ శిష్యులు, నా తండ్రిగారయిన శ్రీమత్తిరుమల వేంకట శ్రీనివాసాచార్యులుగారి (మహాభారత వైజ్ఞానిక సమీక్షా గ్రంధ రచయిత) వేదగురువులు బ్రహ్మశ్రీ చల్లా కృష్ణమూర్తి శాస్త్రి గారిచే రచన గావించబడిన " గీతా విజ్ఞానము " శ్రీమద్భగవద్గీతాచార్య విజ్ఞానము ప్రధమ, ద్వితీయ భాగములు గల గ్రంధములు చదువదగినవి.

బ్రహ్మసూత్రములు, భగవద్గీత, ఉపనిషత్తులు వీటిని మూడింటిని కలిపి ప్రస్థాన త్రయము అందురు. జీవితము నందు ప్రస్థానము అంటే మొదటి స్థానములో చదువ వలసినవి ఈ మూడునూ. మన పూర్వీకులు ఎందరో " ఆరవ ఏటనే " ప్రస్థాన త్రయము చదవడం పూర్తి గావించేవారు. ఇది మానవ జీవనానికి, జన్మను సార్ధకం చేసుకోవడానికి పునాది. మరి, నేటి కాలంలోనో? "ఆరు" కాదు కదా ఆరు ప్రక్కన సున్నా చుట్టి అరవై (60) ఏళ్ళు వచ్చినా, పైన చెప్పిన గ్రంధాలను కనీసం ముట్టుకోని పరిస్థితి. శ్రమపడకుండానే అన్నీ తెలిసిపోవాలి. సునాయాసంగా మోక్షం వచ్చేయాలి. మోక్షం అంటే ఏమిటో తెలియక పోయినా సరే!

బ్రహ్మసూత్రముల యందు అవ్యయుని గురించి ప్రస్తావించి ఉండగా, శ్రీకృష్ణుడు భగవద్గీతను మరల బోధించవలసిన అవసరము ఏమి వచ్చినది? విశుద్ధావ్యయ తత్త్వ ప్రతిపాదన అని సమాధానము. క్షర, అక్షర, అవ్యయ అని ముప్పురు పురుషులు గలరు. "త్రిపురష్వైక పురుష:" అని శ్రుతి. క్షరము అంటే నశించునది, వికారము లేదా మార్పు చెందునది శరీరము. అక్షరము నశించనిది అనగా ప్రాణము. అవ్యయునకు అయిదు కళలు గలవు. అవి (1) ఆనంద; (2) విజ్ఞాన (3) మన: (4) ప్రాణ (5) వాక్కులు అనునవి. ఆనందం కేవలము <u>రసము</u>. వాక్కు అత్యంత బల ప్రధానమయినది <u>బలము</u>. మన: ప్రాణ వాక్కులతో కూడుకొన్నది ఆత్మ సోపాధికము అనగా సీమ లోనికి వచ్చినది కాగా, ఆనంద, విజ్ఞాన, మనస్సులు మూడును ఒక సీమ లోనికి

రానివి. నిరుపాధికమయినవి. ఈ మూడింటినే విశుద్ధావ్య యము అందురు. భగవంతుడు శ్రీకృష్ణుడు అక్షరుని మీదుగా ప్రాణతత్త్వములను ( గోప్యముగా ఉంచునవి గోపికలు ) తెలియ జేయుచూ మనలను విశుద్ధానంద స్థితిలోనికి ప్రవేశింప జేయుచు బంధములను, అవిద్య, అస్మిత రాగ – ద్వేషాభినివేశాది క్లేశములను త్రుంచి జీవుని భగవంతునిగా మార్చి వేయును. అట్టి ధర్మ బద్ధమయిన జీవన విధానముతో కూడిన కేవల ఆనందమే, ఆ స్థితిలో ఉండుటయే అమృతపానము. క్లేశయుత భవసాగరానికి ఒక తీరము. మరొక ముఖ్య విషయము భగవద్గీత కేవలము పారాయణ గ్రంథము మాత్రమే కాదు. ఆచరణాత్మక గ్రంథము. “స్వల్ప మప్యస్య ధర్మస్య త్రాయతే మహతోభయాత్” అతి కొంచముగా నయిననూ ధర్మమును ఆచరించినచో మహత్తరమయిన భయమునుండి నిన్ను రక్షిస్తుంది అన్నది సందేశము. పారాయణము అనే పదానికి అర్థము పరము నందు అయనము అనగా ప్రయాణము పర అయనమే పారాయణము అని గుర్తించాలి. జీవితం ఉన్నప్పుడు ఎలా ఉ ంటే పరంలో అయనము అలాగే ఉంటుంది. తదనుగుణంగా ఉంటుంది అని మానవజాతి గుర్తించి కర్తవ్య దీక్షతో ధర్మ బద్ధంగా ప్రవర్తించాలి.

మనము బ్రతికి ఉండగా అసలు శరీరమే ఒక ఆవరణం అయితే, ఏ జీవులకీ లేనిది శీతాకాలంలో చలిగా ఉంటే వెచ్చగా కప్పుకుంటాం. వాన వస్తే గొడుగులు వేసుకొని తడవ కుండా రక్షించుకుంటాం. ఎండాకాలం అయితే అమ్మోయ్! అని బయటకు వెళ్ళకుండా ఎ.సి.లలోనో, కూలర్లు వేసుకొనో దాక్కుంటాము. మరి ప్రాణం పోయిన తరువాత శరీరం అనే ఆవరణమే పోగా, మన ఆత్మకు జీవునికి రక్షించుకొనే అవకాశం గాని పారిపోయి దాక్కునే అవకాశం గాని లేదు. ఉండనే ఉండదు. ఎండకి, గాలికి, వేడికి “ఓపెన్” అయిపోయినట్లే. ఎవ్వరూ రక్షించేవారు ఉండరు.

ఆ స్థితిలో జీవుని ఆత్మ పైకి ప్రయాణించడానికి లేవడానికి ప్రయత్నించగా బ్రతికి ఉండగా సంపాదించుకొన్న ఆధ్యాత్మిక శక్తి సామర్థ్యాలను బట్టి కొంత ఎత్తుకు ఎదిగి, ఎక్కడ సూర్య కిరణాల ప్రచండ వేడిమికి తట్టుకోలేక పడిపోతూ ఉంటుందో అక్కడ ఆత్మ చుట్టూ కర్మానుసారంగా ఆవరణం, శరీరం ఏర్పడుతూ ఆ జన్మలోనికి వెళ్ళిపోతూ ఉంటుంది.

సూర్యుడు అంటేనే బుద్ధి. వేడిమిగా ఉన్నా స్థిరమయినది, దోషములను తొలగించునది. బుద్ధిని ప్రచోదనము గావించే గాయత్రీ, సావిత్రీ, సరస్వతీ అన్నియునూ సూర్యుని లోనివి. సూర్యకిరణములలో ఉండునవి. మనకు కావలసినది చంచలంహి మన: కృష్ణా ! అని అర్జునుడు అన్నట్లుగా చంచలమయిన మనసు మీద నుంచి స్థిరంగా ఉండే బుద్ధితో యోగం (కూడిక, సంధానం) కుదుర్చుకోవాలి. ఎవరయినా తప్పు చేస్తే నీకు బుద్ధి లేదా అని తిడతారు గాని, మనసు లేదా? అని ఎవరూ అనరు. స్థిరంగా ఉండే బుద్ధి మీద ఏకాగ్రత ఉంచితే బుర్ర వేడెక్కడం అందరికీ, ప్రత్యేకంగా పరీక్షలలో చదివే విద్యార్థులకి తెలిసి ఉన్నదే. అది బుద్ధికి సంబంధించిన సూర్యుని లక్షణం. కాని, ప్రకాశం, వెలుగు, జ్ఞానం, ఆత్మజ్యోతి అన్నీ అదే ఎవరయితే జీవించి ఉండగా ధర్మంగా ప్రవర్తించి, బుద్ధిమంతులయి ఉండి బుద్ధితో యోగాన్ని శరీరం ఉండగానే, జీవన కాలంలో సాధించుకొని ఉంటారో వారికి నిప్పుకి నిప్పు, అనగా అగ్నికి, అగ్ని ఏమి చేయనట్లుగా అటువంటి మహాత్ములకు శరీరం ఆవరణం విడిచి పెట్టిన తరువాత వీరిలో ఉండే బుద్ధి, తాపమునకు తపమునకు చెందిన అగ్ని సూర్య కిరణాలతో సునాయాసముగా సంధానము చెంది వీరి ఆత్మ సూర్యునిలోనికి చేరిపోయి సూర్యునితో తాదాత్మ్యము చెందిపోతుంది. ఇటువంటి బుద్ధితో యోగమును ఎలా కుదర్చాలో తెల్పుతూ బుద్ధియోగాన్ని ప్రతిపాదించినదే శ్రీకృష్ణునిచే ప్రతిపాదింపబడిన భగవద్గీత. భూమి జీవులు కర్మలు ఆచరించే “కర్మక్షేత్రము” కురుక్షేత్రము కాగా, సూర్య

మండలము ధర్మ క్షేత్రము. ధర్మాన్ని కర్మల ద్వారా ఆచరించకుండా అగ్ని గోళం వంటి ధర్మక్షేత్రం లోనికి వెళ్ళే మానవజన్మ నిరుపయోగము. అధర్మయుతము, అవినీతిమయము గావించుకుంటూ డబ్బు, భూములు, లౌకిక భౌతిక విషయాల వెనుక పరుగులు పెడుతూ లక్ష్యాన్ని మరిచిపోతే ప్రవేశించడం ఎలా? ఇటువంటి రహస్యాలతో భగవద్గీత కూడుకొన్నది కాబట్టే నిజమయిన మహాత్ముల కోసం అన్వేషించి, వారి నిజమయిన మహాత్ముల కోసం అన్వేషించి, వారి కృపకు పాత్రులయి, వారిని ఆదరించక తప్పదు. గడ్డిమేటు దగ్గర కుక్కలు పడుకొని, అవి గడ్డి తినకుండా, అరుస్తూ ఉంటే ఆవులు, గోవులమందలు అటుపోవు. సమాజంలో సత్పురుషులు అయినా అంతే అని గుర్తించాలి. " తా చెడ్డకోతి వనమెల్ల చెరిచింది" అన్నట్లుగా జ్ఞాన శూన్యులయిన మూర్ఖులు హడావిడి చేసి, ధర్మాన్ని విడిచి, తమను తాము మరచి సమాజ వ్యవస్థలను, జాతిని నాశనము చేయరాదు. ఇటువంటి వారు ఎన్నటికినీ ఊర్ధ్వగతులను మంచి ఆనంద దాయకమయిన స్థితులను పొందలేరు సరికదా వారి వంశజులు కూడా ఈ పాపాన్ని అధర్మాన్ని అనుభవించక తప్పదు. అందుకే శ్రీకృష్ణుడు భగవద్గీతలో ధర్మానికి విలువను ఇస్తూ " ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే" ధర్మ సంరక్షణ, దుష్ట శిక్షణయే అవతార లక్ష్యమని తెలియ జేయుచుండును.

ప్రస్తుతము మనము జీవించి ఉన్నది కలి యుగము. భయంకరమయిన యుగము. అధార్మిక అవైదిక, కలహ యుగమే కలియుగము. కాబట్టి కాస్తంత ఒళ్ళు మరిచిపోయి కాకుండా, సమాజ వ్యవస్థలను పాడు చేస్తూ రెచ్చి పోకుండా, ధర్మ బద్ధంగా ప్రవర్తించడం ఇహానికి, పరానికి రెంటికీ మంచిది. మన హృదయం మంచిదయితే ఏది దర్మమో, ఏది అధర్మమో, ఏది నీతియో, ఏది అవినీతియో " దొంగోడికి దొంగతనం తప్పు " అని తెలియబడినట్లుగా తెలియబడుతుంది. నాకు తెలియదండి శాస్త్రాలు విరుద్ధంగా అంటున్నాయి

అని తప్పించుకోవడానికి, నాటకాలకు వీలు ఉండదు.

శ్రీమాన్ సన్నిధి జనార్ధన స్వామి వారి గ్రంధములో ఎన్నో విషయాలు బాలురకు సహితము అర్ధమయ్యే విధంగా అత్యాధునిక ఉపమానాలతో వివరించడము నన్ను ఎంతగానో ఆకర్షించింది. ఉదాహరణకు కొన్ని ఈ దిగువ తెల్పబడుచున్నవి.

ఒక చిన్న చీమకు బెల్లపు ముక్క కనిపిస్తే అది తినకుండా వెళ్ళి వంద చీమలను పిలుచుకు వస్తుంది. మరి మనిషికి బంగారు దూలము కనిపిస్తే దాని క్రింద పడి చావనైనా చస్తాడు గాని ఇంకొకరికి పంచి ఇవ్వడానికి ఇష్టపడడు.

విషజంతువు అయినా, క్రూర జంతువయినా పులి పులిని చంపదు. పాము పామును చంపదు. ఒక జాతి జీవి వల్ల ఆ జాతికి ప్రమాదము లేదు. కాని, మానవజాతిలో పుట్టిన మనిషి మనిషిని చంపుతాడు. ఇది అద్భుతమయిన మానసిక పరిశీలన. ఇటువంటి మనిషి ఎక్కడికి ఎదగవలసి ఉందో చూడండి.

ధర్మక్షేత్రే కురుక్షేత్రే అనే పదమును మార్చుకుని క్షేత్రేక్షేత్రే ధర్మంకురు అనడం ఎంతో బాగుంది. మనలో కూడా ధర్మానికి, అధర్మానికి యుద్ధం జరుగుతోంది అనడం ఎంతగానో సమంజసము. పద్దెనిమిది (18) జయ సంఖ్య ప్రాశస్త్యాన్ని అద్భుతంగా వివరించిరి.

తిండి కొరకై దేహము కాదు. దేహం కొరకై తిండి. దీర్ఘ జీవితం కాదు దివ్య జీవితం కావాలి అన్నది చక్కని సందేశము. విధిలేని, గతిలేని ఆ సహనం మోక్షసాధనం కాలేదు. బయట శాంతితో పాటు అంతరంగంలో శాంతి ఉండాలంటే వివేకంతో కూడిన సహనం కావాలి.

జ్ఞానం లేనివాడు కర్మలు చేసి బద్ధుడౌతాడు. జ్ఞాని కర్మబంధానికి అంటుకోడు. పనిచేయి - ఫలం వదిలేయి ఇది సాత్విక మార్గము.

సమత్వాన్ని సమదృష్టిని గురించి శ్రీకృష్ణుడు అనేక పర్యాయములు

ప్రస్తావించెను. " సమదు:ఖ సుఖం" పండితా సమదర్శిన:" సమబుద్ధి ర్విశిష్యతే, " సమస్సంగ వివర్జిత:"," సమలోష్టాశ్మకాంచన:" అని వేయేల గీతా యోగమే సమత్వయోగము.

కరెంటును తాకితే చంపుతుంది. అలాగే జ్ఞాని అయినవాడు కోరికలకు దూరంగా ఉంటూ కామనా త్యాగంతో అమృతత్వాన్ని పొందవచ్చును.

పాలు విలువైన వస్తువని పాలలో నివసించేందుకు చేప ఒప్పుకోదు. దానికి నీళ్ళు మాత్రమే కావాలి. మనుషులు కూడా ఎవరి స్థానాలను వాళ్ళు ఇలా గుర్తిస్తే ఎంతో బాగుంటుంది.

కోరేది శాంతి, పొందేది అశాంతి. కోరేది సుఖము, పొందేది కష్టము. కోరేది ఆరోగ్యము, పొందేది అనారోగ్యము. జీవన విధానాలే ఇందుకు కారణము అన్నది మరువరాదు.

అజ్ఞాని ఏ కర్మలో ప్రవేశించినా బాధాకరంగా ఉంటుంది. "శాంతాకారం భుజగ శయనం" నారాయణుడు పాముపై పవళించి కూడా శాంతాకారుడు అయి ఉన్నాడు. సత్సంగాన్ని అవలంబించాలి. సత్సంగంలో నిస్సంగం లభిస్తుందని శంకరుల వారి మాట.

బిడ్డలకు అనగా సంతానానికి సంపాదన ఇస్తే చాలదు. మంచి సంస్కారాలని కూడా ఇవ్వాలి. సంపాదన వెంటరాదు. సంస్కారం వెన్నంటి వస్తుంది.

మనుష్యుడు తన స్వేచ్ఛను, స్వార్థాన్ని, లాభాన్ని మొత్తం తానొక్కడే అనుభవించ కూడదు. లోకానికి, సమాజానికి కొంత భాగం త్యాగం చేయాలి.

త్యాగం కొలది వైభవం అని గుర్తించాలి. శాస్త్ర జ్ఞానముతో పాటు అనుభవజ్ఞానం కలిగి ఉన్న వాడే ఆధ్యాత్మిక మార్గంలో గురుపీఠానికి అర్హుడు.

పరమాత్మను తెలుసుకోవడము, ముక్తిని పొందడము మానవ జీవిత లక్ష్యం. మేడలు కట్టడంతో, భూములు సంపాదించడంతో, ధన సంపాదనతో, బిడ్డలను

కనడంతో మానవ జన్మకు గొప్పతనం రాదు. జ్ఞాననేత్రం తెరువబడి ముక్తిని సాధించి నరుడు నారాయణుడై జన్మ సంసార బంధం నుండి శాశ్వత విముక్తిని సాధించాలి, అదే మానవ జన్మకు శాంతి, విశ్రాంతి.

" సంతోషమే యవ్వనం. చింతే ముసలితనం " అనే లోకోక్తి బాగుంది.

పాశ్చాత్య దేశాలలో భోగాలు ఎంత పెంచుకుంటే అంత గొప్ప. భారతదేశంలో ఎంత తగ్గించుకుంటే అంత గొప్ప. బ్రతుకుటకై తినాలి. తినుటకై బ్రతుకరాదు.

శరీరాన్ని మనస్సును ఆధ్యాత్మికీకరణము చేసే ప్రక్రియే తపస్సు. ప్రపంచంలో పనులు చేస్తూ బయట లోపల క్షీణించిన శక్తిని పూరించే ప్రక్రియే తపస్సు.

ఇచ్చి పుచ్చుకునే విధానంపై బ్రహ్మాండములన్నీ ఆధారపడి ఉన్నాయి. ఇచ్చేందుకు ఇష్టపడని వానికి తీసుకొనే హక్కు లేదు.

కర్మ ఏదైనా కావచ్చు. స్వధర్మ కర్మలోనే సిద్ధిని పొందవచ్చును.

ఆకలికి తినుట యోగి లక్షణము. రుచికి తినుట భోగి లక్షణము. ఆహారము మితంగా, హితంగా సాత్వికమై ఉండడం మంచిది.

సర్వ వ్యాపక బ్రహ్మ వస్తువు తన స్వరూపంగానే ఉంది. విపరీత భావము, క్లేశములు, సంశయములు తొలగిన స్వస్వరూప యదార్థ భావమే బ్రహ్మప్రాప్తి.

అనధికారికి విద్య ఇచ్చినచో ఆ విద్యకు తిరస్కారము అనగా ప్రయోజనము చేకూరదు.

శ్రీకృష్ణుడు పైకి చూసేందుకు భోగేశ్వరుడు. లోపల అంతరంగం చూస్తే యోగేశ్వరుడు. త్యాగంతో కూడిన భోగం యోగమైనది. ఆ యోగేశ్వరుడు, త్యాగేశ్వరుడు అయిన శ్రీకృష్ణ పరమాత్మ ఆర్యులకు భారతీయులందరకూ ఆదర్శ ప్రాయమయిన ఆరాధ్య దైవము.

సర్వే జనా: సుఖినోభవంతు

ఓం శాంతి: శాంతి: శాంతి:

ఓం శ్రీకృష్ణ పరబ్రహ్మణేనమ:

# మంచి మిత్రుడు చేసిన మంచి రచనకు నా శుభాకాంక్షలు



మా మిత్రుడు శ్రీ సన్నిధి జనార్ధనస్వామి, మా అన్నగారైన శ్రీ లక్ష్మిరెడ్డి, గారు యల్లారెడ్డిగారు నేను బాల్యమిత్రులం. భాగవత, భారత రామాయణాదులలో మాకు అందరికీ ప్రవేశము ఉండినా అందులో ఎక్కువ పరిశ్రమ చేసినారు స్వామిగారు. మా ముప్వురికీ చదువుకోవడము తెలుసు కోవడమే తెలుసు కానీ స్వామిగారు ఆ భాగవత, భారత రామాయణాదులను వారి కంచు కంఠం ద్వారా సభలలో ధారళంగా ఉపన్యసించి అరటిపండు ఒలిచి చేతిలో పెట్టినట్లు అర్థం చెప్పేవారు మేము ఆ సభలలో శ్రోతలుగా పాల్గొనేవారము. ఆ సందర్భంలో మా అన్నగారైన శ్రీలక్ష్మి రెడ్డి గారు యీ స్వామి గారికి మంచి మంచి సూచనలు ఇచ్చేవారు. అవి ఎలాగనగా, యీ రామాయణ భారత భాగవతాలు అందరికీ తెలుసు కాబట్టి వాటితో పాటుగా అక్కడక్కడా వేదాంత పరమైన కథలు నీతి విజ్ఞాన దాయకమైన నీతికథలు వినిపించమని చక్కని సూచనలు ఇచ్చేవారు. స్వామి గారు ఆ సూచనలను తప్పకుండా పాటించేవారు.మా అన్నగారికి జ్యోతిష్యంలో బాగా పట్టు ఉండేది ఆ జ్యోతిశ్శాస్త్ర ప్రకారంగా మీకు వాక్స్థానంలో శుక్రుడున్నాడు, మీరు చెప్పే మాటలు ప్రజామోదకరంగా ఉండి ప్రజలను బాగా ఆకర్షిస్తాయి. మాకు తెలుసుకునే వరకే అవకాశాలున్నాయి. కాని మీవలె సభలలో ప్రసంగించే యోగం మా ముప్వురికీ లేదు అని చెప్పేవాడు. స్వామి గార్కి అప్పుడు జ్యోతిష్యంలో ఇంత ప్రావీణ్యం లేదు. మా అన్నగారు

స్వామితో చాలా సార్లు చెప్పేవాడు “నీవు జ్యోతిష్యంలో బాగా గుర్తింపు తెచ్చుకోగలవని తెలుపగా? ఆ జ్యోతిష్య శాస్త్రంలో బాగా గుర్తింపు తెచ్చుకొన్న వీరు, యీ 2014 సంవత్సరం నాటికి 27000 జాతకాలు వ్రాసి ఇచ్చి, వేలమందికి అభిమాన పాత్రుడై అందరిచేత అభిమానింపబడుతున్నారు. ఈ జ్యోతిష్యం మొదలు అన్ని విద్యలు వారు తండ్రి నుండే అభ్యసించినారు. శ్రీ స్వామిగారు 1943 లో జన్మించగా నేను 1942లోను మా అన్నగారు అయిన లక్ష్మిరెడ్డిగారు యల్లారెడ్డి గారు 1939వ సంవత్సరంలో జన్మించడం జరిగింది. పెద్దవాడు అయిన మా అన్నగారు మా అందరి జాతకాలు చెప్పేవాడు. మా జీవితాలలో ఎన్నెన్నో మధుర ఘట్టాలు జరిగినవి అవి

మేము నలువురం శ్రీవ్యాసాశ్రమ పీఠాధిపతులు అయిన శ్రీ మళయాళ స్వామి స్థాపించిన సనాతన వేదాంత జ్ఞాన సభలకు, అఖిలాంధ్ర సాధు పరిషత్తు మహాసభలకు, శ్రీ మళయాళ స్వాముల వారి శతజయంతి ఉత్సవాలకు వెళ్ళేవారము. యీ కార్యక్రమాలన్నీ మూడు రోజులు జరిగేవి ఆ మూడు రోజులు ఒక ఘడియ కూడా వృధా కాకుండా సద్వినియోగం చేసుకునే వారము. ఆ మూడురోజులు అక్కడివారు అభిమాన పూర్వకంగా ప్రేమానుగ్రహాలతో ఫలహారము, భోజనాలు పెట్టేవారు. ఆ సభలలో పదార్థాలు వడ్డించేవారూ, నీళ్ళు అందించేవారుకూడా హరేరామ హరేరామ రామరామ హరేహరే హరేకృష్ణ హరేకృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే అంటూ రామ నామ జపం చేస్తూ వడ్డించేవారు. ఆ మహాసభలలో పీఠాధిపతులూ, ఆశ్రమాధిపతులూ, బ్రహ్మజ్ఞాన సంపన్నులు, మహత్తరమైన వేదాంత గ్రంథాలు వ్రాసిన మహానుభావులు అయిన

1) శ్రీరామక్రిష్ణానందగిరి స్వామివారు భూమానందాశ్రమం, గండిక్షేత్రం, కడప జిల్లా
2) శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు శుక బ్రహ్మాశ్రమం శ్రీకాళహస్తి చిత్తూరు జిల్లా

3) శ్రీశ్రీశ్రీ విద్యానందగిరి స్వామివారు శ్రీ వ్యాసాశ్రమాధిపతులు ఏర్పేడు, చిత్తూరు జిల్లా.

3) శ్రీశ్రీశ్రీ శ్రీరామానుజ చిన్నజీయరు స్వామివారు సీతానగరం, గుంటూరు జిల్లా.

ఇటువంటి మహానుభావులందరు వేదికపై ఉపన్యసించేవారు. వీరు అనేక గ్రంధాలు రచించినారు. వారి గ్రంధాలు మావద్ద చాలా కలవు. పై ఆశ్రమాల నుంచి మాసపత్రికలు నడుపబడుచున్నవి. అవి వ్యాసాశ్రమం నుండి "యదార్ధ భారతి", శుక్రబ్రహ్మాశ్రమం నుండి " వేదాంత భేరి " భూమానందాశ్రమం నుండి "శుకవాణి" సీతానగరం నుండి " భక్తి నివేదన " ఆర్లగడ్డ గీతాశ్రమం నుండి "గీతావాణి" అవి మేము తెప్పించుకొని చదివేవారము.

శ్రీస్వామి గారు తాను కొన్ని మాసపత్రికలు తెప్పించుకోవడమే గాక వారి గ్రామంలో ఇంకా కొందరి ద్వారా సనాతన సారధి, ' రామకృష్ణ ప్రభ,' "శ్రీశైలప్రభ," 'సప్తగిరి' మాసపత్రికవంటి పత్రికలనూ తెప్పించేవారు. ఆ పత్రికలన్నింటినీ చదివేవాడు జనార్ధనస్వామిగారు. మేము ఆ మహాసభలకు వెళ్ళడం, ఆ మహానుభావుల దర్శనం వల్లను వారి వాగామృతము గ్రోలడం వల్లను మా జీవితాలు ఇలా మారిపోవడానికి అవకాశాలు యేర్పడినవి.

మా జనార్ధనస్వామి గారి గ్రామం మా గ్రామం అతి సమీప గ్రామాలు. కర్నూల్ జిల్లా, డోన్ మండలంలోని "కర్లకుంట" వారి గ్రామం, "జగదుర్తి" మా గ్రామం. అన్ని కార్యక్రమాలలో మేము పాలు పంచుకునేవారము. శ్రీ జనార్ధన స్వామి గారు 1983లో ఒక సంవత్సరం పాటు గీతా మకరందము, భాగవతము, రామాయణము యీ మూడు గ్రంధరాజములను పూర్తిగా పురాణకాలక్షేపం చేస్తూ, అందరకీ వినిపించే వారు అలా వినిపించు సమయంలో ప్రక్క గ్రామాల వారందరూ, ప్రతిరోజు బండ్లు కట్టుకొని వచ్చి

వినేవారు.  వీరి ప్రసంగాలు అంత బాగా ప్రజలను ఆకట్టుకునేవి. మా అన్నగారైన శ్రీలక్ష్మిరెడ్డి గారు మా మిత్ర మండలిలో ఒకరైన శ్రీ యల్లారెడ్డి గారు  కీర్తిశేషులైనారు.

మా అన్నగారికి జనార్ధనస్వామి గారికి జరిగిన ఓ సందర్భం తెలియజేస్తాను.  ఎందుకు అనగా అది మనందరికీ,  ఆచరణీయమైనది గనుక.  1975లో  మా గ్రామం  జగదుర్తిలో శ్రీరామనవమి సందర్భంగా నవరాత్రులు రామాయణ పురాణ ప్రవచనం చేసినారు జనార్ధనస్వామిగారు. మా అందరి కోర్కెల వల్ల చాలా బాగా వైభవంగా జరిగింది. శ్రీరామనవమి రోజు మేము స్వామిగారికి గౌరవంగా వంట పదార్ధాలు, భక్ష్య భోజ్యాలను మా అబ్బాయిలతో స్వామిగారింటికి పంపితిమి.  ఆ పెద్ద పిల్లలు స్వామి గారి గ్రామానికి వెళుతుంటే మా అన్నగారి చిన్న అబ్బాయి  వారి వెంట వెళ్లడానికి నేను వస్తానంటూ పట్టుబట్టటం, ఆ అబ్బాయిని “ మార్గంలో పెద్ద దయ్యం ఉంది నిన్ను పట్టిస్తాము నీవు వస్తే” అంటూ భయపెట్టి వారు వెళ్ళడం జరిగింది. ఆ చిన్న అబ్బాయి ఇంటిలో ఏడుస్తూ పడుకోవడంతో  ఆ అబ్బాయికి జ్వరం వచ్చింది. ఆ రాత్రి జనార్ధన స్వామి గారు వచ్చి చూసి బాబు లేచి కాళ్ళు, ముఖం కడుగుకోమని చెప్పి, కుంకుమ తీసుకొని మంత్రించి పెట్టగానే ఆ అబ్బాయికి జ్వరం తగ్గిపోవడంతో అందరూ కలిసి సంతోషంగా రామాయణ పురాణ కార్యక్రమం పూర్తి చేయడం జరిగింది. మా అన్నగారు ఒకసారి మాటల సందర్భంలో “మా అబ్బాయికి కుంకుమ మంత్రించిజ్వరం తగ్గించినావు నేను తల్చుకుంటే కేవలం చేతితో తుడిచి జ్వరం తగ్గాలి అంటే తగ్గేది కాని ఈ చిన్న విషయాల కొరకై  మన శక్తిని త్యాగం చేయడమేనా? ఇలా త్యాగం చేస్తూ పోతూ వుంటే మనకు మిగిలేదేముంటుందని” చిన్నగా నవ్వుతూ తెల్పెను.

ఇలాంటివెన్నో మా సత్సాంగత్యాలలో ఒకరితో ఒకరం తెలుసుకునేవారము, మంచి మార్గంలో పయనించేవారము. ఇలాంటి సంఘటనలు చాలా ఉన్నవి. స్వామిగారు ఆహారదోషాన్ని, మాంసాహారం యొక్క చెడును గూర్చి వారి గ్రామంలో సవివరంగా ఒక రోజంతా తెల్పినారు. ఆ ప్రసంగ ప్రభావంతో వారి గ్రామంలో హరిజనులు, ముస్లింలతో సహా చాలామంది మాంసాహారాన్ని వదలినవారు ఉన్నారు. మా నల్వురిలో ఇతరులను చైతన్యవంతులను చేసి వారిని మార్చిన వారు ''స్వామిగారు ఒక్కరు మాత్రమే'' అని మేమనుకునేవారము. ప్రస్తుతము వీరి రచనలు, అమూల్య గ్రంథాలు ఒకదాని వెంట ఒకటి తయారగుచున్నవి. అందులో " మంచి మాట దీని మరువబోకు " అను గ్రంథం ద్వితీయ ముద్రణ జరుగుతున్నది. " మహనీయుల మహితోక్తుల మణిహారం " యీ గ్రంథానికి ద్వితీయ ముద్రణ జరిగియున్నది. తర్వాత " రామాయణము రహస్యాల రసమయం" అను గ్రంథానికి ద్వితీయ ముద్రణ జరిగినది. " ఆడపిల్లల పేర్లు ఆలోచించి పెట్టండి " అను గ్రంథ ముద్రణ జరిగింది. ప్రస్తుతం మీ చేతులలోవున్న " భగవద్గీతామృత పానం భవసాగర తీరం" యీ గ్రంథాన్ని గురించి మీరే తెలుసుకోగలరు. మేము అనేక గ్రంథాలు చదివేటప్పుడు, యింత బాగా గ్రంథాలు ఎలా వ్రాయగల్గుతున్నారా? అని ఆలోచించే వారము, కానీ మా లోనే ఒక రచయిత, గ్రంధకర్త ఉన్నందుకు మేము చాలా సంతోషిస్తున్నాము. చాలా మంది గ్రంథాలు వ్రాస్తే ముద్రణా భాగ్యానికి నోచుకోక, చాలా గ్రంథాలు శిథిలమైన సందర్భాలు కలవు కానీ, స్వామిగారి గ్రంథాలు తయారు కాకముందే దాతలు ముందుకు వస్తున్నారు. మీది నేనొక గ్రంథం ముద్రణ చేయించాలనుకుంటున్నాను ఆ అవకాశం మాకు కల్పించండని ముందుగానే స్వామిగారిని అడుగుతున్నారట. అది చాలా సంతోషించ తగ్గ విషయం. స్వామిగారి పుస్తకాల పేర్లు కూడా ప్రత్యేకంగానే ఉంటున్నవి. ఇంకో ముఖ్య విషయం వీరికీ 9వ నెంబరుకూ

చాలా సంబందాలు ఉన్నవి. ఆ తొమ్మిదిని గూర్చి యీ భగవద్గీతలో 27వ పేజీలో బాగా వివరించినారు. వీరు జన్మించిన నెల తొమ్మిది. "సన్నిధి జనార్దనస్వామి " 9 అక్షరాలు. " శ్రీ గీతా జ్యోతిష్యాలయము " 9 అక్షరాలు. వీరి రచనలు " మహితోక్తుల మణిహారం " 9 అక్షరాలు. భగవద్గీతామృతపానం 9 అక్షరాలు. వీరి ఫోన్ నెంబర్లు 4110237 మొత్తం 9. 24243237 మొత్తం 9 సెల్ నెంబర్లు 9392598774 మొత్తం 9. ఆ తొమ్మిది పూర్ణ సంఖ్య. స్వామి గారి జీవితం పూర్ణ జీవితం. వీరి దగ్గర జ్యోతిష్యము నేర్చుకున్నవారు బ్రహ్మాండంగా రాణిస్తున్నారు గతంలో స్వామి వారు R.M.P. డాక్టరు గనుక వీరి దగ్గర వైద్యం నేర్చుకున్నవారూ ఉన్నారు. వీరి దగ్గర వాస్తు నేర్చుకొని బ్రహ్మాండంగా పేరు, గౌరవ మర్యాదలు పొందుతున్నవారూ ఉన్నారు. ఆధ్యాత్మికంగా ఎందరో ఎంతో అభివృద్ధి చెందినవారు ఉన్నారు. వీరి శిష్యుడు చంద్రశేఖర గౌడు విద్యాభ్యాసం వీరి దగ్గరేచేశారు. తర్వాత ఆధ్యాత్మికంగా కూడా బాగా అభివృద్ధి చెందినాడు. ఆ అబ్బాయి 30 సంవత్సరాల వయసులో రోజూ జపం చేసుకోవడానికి "మాకేదైనా మంత్రం చెప్పు స్వామీ" అని ఆ అబ్బాయి అడుగగా స్వామిగారు అతనికి మంత్రాన్ని తెల్పి తర్వాత యీ మంత్రాన్ని ఎప్పుడూ మరువకుండా సర్వకాల సర్వావస్థలలో జపం చేస్తూ ఉండుము అప్పుడు మంత్రము శుద్ధి అవుతుంది. శుద్ధి అయినపుడే సిద్ధి అవుతుందని చెబుతూ యీ మంత్రము శుద్ధి అయినదా లేదా? అని తెలుసుకోవాలనుకుంటే మన ఇంట్లో చిన్న పిల్లలు ఏదో బాధలో ఏడుస్తూ బాధపడుతూ ఉంటే ఈ మంత్రంతో మంత్రించిన నీళ్ళు గాని పాలు గాని త్రాగించినచో వారు వెంటనే సుఖంగా పండుకుంటారు. అలాగని స్వార్థాలకు స్వప్రయోజనాలకు వాడుకోరాదని" స్వామిగారు తెలిపారు. అలాగే స్వామీ అంటూ ఆ అబ్బాయి ఆ మంత్రాన్ని శ్రద్ధగా జపం చేస్తూ ఉండేవాడు. ఇలా జరిగిన తర్వాత కొన్నాళ్లకు చంద్రశేఖరు తల్లిగారికి తెల్ల చెరగు వ్యాధి ఉండడంతో అందరూ

డాక్టర్లకూ చూపించడం, ఆ మందులు వాడడం అయినా అది తగ్గక పోవడం, ఇంకో డాక్టరుకు చూపడం ఇలా 10 సంవత్సరాలు గడిచింది. ఒక డాక్టరుగారు పరీక్షించి యీమెకు కాన్సరు వచ్చింది. క్యాన్సర్ హాస్పిటల్‌కు లెటర్ వ్రాసిస్తాను, వెళ్ళండి అనగా సరేనని డబ్బు సిద్ధం చేసుకుంటానమ్మా 4-5 రోజులలో హాస్పిటల్‌కు వెళ్దామని చెప్పినాడు. కానీ తల్లి ఆరోగ్యం బాగు చేయించలేక పోయానని బాధపడుతూ దేవుని పూజ చేస్తూ ధ్యానిస్తూ " స్వామీ నేనేమైనా పుణ్య ఫలితం సంపాదించు కొని ఉంటే ఆ ఫలితం అంతా వదులుకుంటాను, ఆమె వ్యాధి బాగు పడాలని స్వామిని ప్రార్థించినాడు" తర్వాత వేరేవారి దగ్గర డబ్బు సమకూర్చుకొని హాస్పిటల్‌కు వెళ్దామని తల్లికి చెప్పగా నాకే అనారోగ్యం లేదు బాగా ఆరోగ్యంగా ఉన్నాను తల్లి అని చెప్పింది. యీ విషయాన్ని చంద్రశేఖరు స్వామిగారితో తెల్పగా, స్వామిగారు "ఆ శక్తిని స్వార్థానికి స్వప్రయోజనాలకు వాడుకోరాదు అని తెల్పితినే" అన్నాడు. అప్పుడు చంద్రశేఖర్ "నేను నా స్వార్థానికీ నా భార్యాబిడ్డల కొరకు ఉపయోగించుకోలేదు ఆమె నా తల్లి కదా, తల్లి ఆరోగ్యం కొరకు ఆ త్యాగం చేయవలసి వచ్చింది తప్పయితే క్షమించండి" అనగా స్వామిగారు నీ యొక్క ఆ శక్తి ఇంకా పెరుగుతుంది కానీ తరగదు" అని చెప్పారు. ఆమె ప్రస్తుతం మంచిగా ఆరోగ్యంగా ఉన్నది. యీ విషయం తెల్పడం ఎందుకనగా ఇది అహంకారం కాదు గొప్పతనం కూడా కాదు ఎటూ చెబుతున్నాను అందరూ ఆచరించాలని కోరిక. ఇంకొక్క జరిగిన సంఘటనను తెల్పి ముగిస్తాను జనార్ధనస్వామి గారు బస్సు దిగుతూ క్రింద పడగా హాస్పిటల్‌కు వెళ్ళెను నడుము క్రింది భాగంలోని తుంటి ఎముక బాలు కదిలింది దానికి ఆపరేషన్ చేయాలని రాత్రికి ఆపరేషన్ చేస్తామని చెప్పారు డాక్టరు. రూములో స్వామిగారు ఒక్కరే పడుకొని ఆలోచిస్తుండగా, అంతరాత్మలో "అందరికీ శారీరిక బాధలు అనారోగ్యాలు వస్తే శ్రీరామరక్షాస్తోత్రము జపం

చేయమని చెబుతుంటావే, నీకు నమ్మకం లేదా” అని ప్రబోధించగా వెంటనే క్షమించమని రామచంద్రుని వేడుకొని, ఆపరేషన్ వద్దని ఇంటికి వచ్చి శ్రీరామరక్షాస్తోత్రం జపంతో వీరు పరిపూర్ణ ఆరోగ్యవంతులు కావడం జరిగింది. ఇవి చెప్పడ మెందుకు అనగా అందరూ ఆ మార్గంలో పయనించాలని, అందరికీ ఆ భగవంతుడు మంచి చేయాలనే మా కోరిక. వీరు వ్రాసిన గ్రంధాలన్నింటిలోనూ నీతి, విజ్ఞానంబులు ఇంతకు ముందు తెల్పడం జరిగింది. మహితోక్తులు, మంచి మాటలు, రామతత్త్వము, భగవద్గీతామృతము అను నీతి భక్తి, జ్ఞాన సంబంధమైన గ్రంధాలు వ్రాసి ఎందరికో విజ్ఞానాన్ని పంచిన శ్రీ స్వామిగారు ధన్య జీవులు. ఇలాంటి మిత్రుని పొందడం మా అదృష్టంగా భావిస్తున్నాను. వీరి మొదటి రచన “ మంచిమాట దీని మరువబోకు” ను ఉత్తమ గ్రంధంగా ఎంపిక చేసి విశ్వసాహితీ సంస్థవారు 2014 సం॥లో త్యాగరాయ గాన సభలో పి.వి. నరసింహారావు గారి సోదరుడు పి.వి. మనోహర్ గారితో సన్మానింప చేసి 2500/- లు బహుమతి ఇవ్వడం జరిగింది. వీరి ద్వితీయ గ్రంధము మహనీయుల మహితోక్తుల మణిహారం యీ రెండు గ్రంధాలు గౌ. శ్రీ చెరుకూరి రామారావుగారు ముద్రణ చేయుటయే గాక ఆ ద్వితీయ గ్రంధావిష్కరణ సభలో సువర్ణ కంకణం తొడిగి సన్మానం చేయడం జరిగింది. తర్వాత రామాయణం రహస్యాల రసమయం అను గ్రంధం, తర్వాత ఇప్పుడు మీ హస్తాలను అలంకరించిన గీతామృతం గూర్చి నేను తెల్పడం అనవసరం. మీరే చదవండి, ఆనందాన్ని అనుభవించండి. వీరి తండ్రి గారు గొప్ప పండితులే గాక ఆధ్యాత్మిక జ్ఞాన సంపన్నులు. స్వామి గారు జన్మించునప్పుడు వీరి తండ్రిగారు పూజా మందిరంలో దైవధ్యానంలో ఉన్నారట. ఆ పూజలో “ దశమంతు జనార్దన: ”జఅనే వాక్యం ఉచ్ఛరించి కొంతసేపు ఆగి దశమంతు జనార్ధన: పదవ వాడు జనార్ధనుడు ఇపుడు జన్మించే శిశువు కుడా పదవ సంతానమే కావున పురుష

సంతానమే కలగాలని, ఆ శిశువుకు జనార్ధనుడని పేరు పెట్టాలని ముందుగానే నిర్ణయించుకున్న వారి తండ్రిగారి సత్సంకల్పం నెరవేరింది. జనార్ధనస్వామి గారు బాల్యంలో ఉండగా వీరి తండ్రిగారు నీకు గొప్ప పేరు పెట్టినాను పేరు సార్ధకం చేయి నాయనా అని అనేవారట. బాల్యంలో ఆ మాటలో ఇంత దూరదృష్టి ఉన్నట్లు ఎవరు గ్రహించగలరు. ఇదంతా వారి ఆశీర్వాదబలం, వారి సంకల్పబలం అని మాటల సందర్భంలో మాతో స్వామి గారు చెబుతూ ఉంటారు. జనార్ధనస్వామి గారి బాల్యంలో లంకమల్ల కృష్ణమూర్తి అనే గొప్ప పండితుడు వీరి తండ్రిగారిని దర్శించుకోవాలని వచ్చినారట. ఆయనకు స్వయం పాకము చేసుకొని భుజించే నియమం ఉండేది. వారికి సపర్యలు చేయడానికి యీ జనార్ధనస్వామిని ఇంకా ఇర్వురిని నియమించినారు. వీరి తండ్రి. వారు వంట సిద్ధం చేసుకొని వీరాసనం వేసుకొని కూర్చోగా యీ ముప్వురూ వారి ముందర పాఠాలు అప్పచేప్పేవారిలా నిల్చి యున్నారు. అప్పుడు ఆ పండితుడు ఏరా నీ పేరేమి అని ఒక బాలుని ప్రశ్నించగా శ్రీరాములు అని చెప్పెను. వెంటనే ఆ పండితుడు " నీవు భార్యను వదలి కోతులను వెంట వేసుకొని పోతావు కదరా" అనెను. ఇంకొకరిని నీ పేరేమనగా ఆ బాలడు కృష్ణమూర్తి అనెను. ఒరేయ్ నీవు దొంగవురా, ఆడవారి చీరెలు దొంగిలించే వాడవు అన్నాడట" తర్వాత నీ పేరేమిరా అనగా జనార్ధన స్వామి అని వీరు తెల్పగా, 'సెభాష్' జనులను ఉద్ధరించే వాడవురా అని అన్నాడట ఆ తపస్సంపన్నుడు. శ్రీరామ శ్రీకృష్ణావతారాలు ప్రపంచ ఖ్యాతి పొందినవి. శ్రీరాముని తారకరాముడవు అనవచ్చు. కృష్ణమూర్తిని గీతాచార్యుడవు అనీ అనవచ్చు. కానీ ఆ గుణాలు వారిలో లేవని ఆ మహానుహావుడు అప్పుడే గ్రహించినాడని ఇప్పుడర్థమగుచున్నది. ఆ రాముడనే బాలుడు భవిష్యత్తులో దొంగ వ్యాపారాలు చేస్తూ జైలు పాలవడం జరిగింది. ఆ దొంగలతో సహవాసాలంటే కోతుల సహవాసమే కదా భార్యను పుట్టినింట్లో వదలి

సంవత్సరాలు అజ్ఞాత వాసాలు చేసేవాడు, ఆ పేరు అలా సార్ధకమైనది. రెండవ వ్యక్తి క్రిష్ణమూర్తి ఆయన జీవితం గూడా అస్తవ్యస్తంగా జరుగడం జైలుకు వెళ్ళడం జరిగింది. ఆ పండితుడు దొంగవురా నీవు అన్నాడు కదా దొంగకు జైలు తప్పదు కదా. ఇలా వారి వాక్యం పొల్లు పోకుండా జరిగింది. ఇక స్వామి గారి విషయానికి వస్తే మీకు తెలుస్తూనే ఉంది ఎందరెందరినో ఎన్నో గ్రంధాల ద్వారా విజ్ఞానాన్నందిస్తూ, జనులను ఉద్ధరిస్తూ ఉన్నారు జనులనుద్ధరించుతూ జనార్దనుడను పేరుకు సార్ధక నామధేయడయ్యాడు. వీరు ఇలాంటి సేవలు ఇంకా ఇతోధికంగా చేయాలని ఆ గీతాచార్యులను ప్రార్థిస్తున్నాను. యీ మంచి విషయాలు తెలిపే గొప్ప అవకాశం కల్పించిన శ్రీస్వామిగార్కి దీనిని ఓపికతో చదివిన పాఠక దేవుళ్ళకూ ధన్యవాదాలు, నమస్కృతులు. మీకేమైనా విసుగు కలిగించిన వాడనైనచో మన్నించవలసినదిగా ప్రార్థిస్తూ, స్వామిగారి కలం నుండి ఇలాంటి ఉత్తమోత్తమ గ్రంధాలు ఇంకా వెలువడాలని ఆకాంక్షిస్తున్నాను. బాల్యంలో అక్కడ స్వగ్రామంలో మిత్రులం. స్వామిగారు హైదరాబాదు వచ్చిన తర్వాత దైవానుగ్రహంతో మా అబ్బాయిలు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు కావటంతో మేమూ హైదరాబాదుకు రావడం జరిగింది. ఇలా ఇక్కడా కలుసుకునే అవకాశాలన్ని భగవంతుడు కల్పించినందుకు, ఆ దేవదేవునికి నమస్సులర్పిస్తూ సెలవు తీసుకుంటున్న ........


రచయితగారి బాల్యమిత్రుడు

**కె. శివారెడ్డి**

హైదరాబాదు.

ఫోన్ 9573220850

# చాలామందికి తెలియని ప్రాధమిక సత్యాలు

భగవద్గీత జ్ఞానశాస్త్రం. ఇది మహాభారతాంతర్గతం. మహాభారత రచనాకాలం క్రీ.పూ. 5000 సంవత్సరాలుగా చారిత్రక పరిశోధకులు నిర్ణయించారు. అప్పటి నుండి నేటివరకు అనగా 5000 సంవత్సరాలకు పైగా ఈ గీతాగానం యోగులకు, జ్ఞానులకు, సామాన్య మానవులకు స్ఫూర్తి దాయకముగాను, జ్ఞానదాయకముగాను వెలుగొందుచున్నది. అందువలన ఇది అమూల్య రత్న భాండాగారమని చెప్పవలసి యుంటుంది.

శ్రీమన్నారాయణడు లోకహితం కోరి చేసిన అద్భుతగానం, అమృతగానం, అమరగానం, శాశ్వత సుధారసైకగానం, ఆత్మ సాక్షాత్కారగానం గాను, ప్రసిద్ధి చెందింది ఈ భగవద్గీత భగవానుడు ధర్మ స్వరూపుడు. ధర్మనిర్ణేత, ధర్మ రక్షకుడు, ధర్మ సంస్థాపకుడు కదా!

భగవద్గీతలో కర్మను యోగ సమన్వితంగా జేసి, నిష్కామ కర్మానుష్టానానికి పెద్ద పీట వేశారు. ఇది గీత యొక్క విశిష్టత. పరమోత్కృష్టత కూడా. దీని విశేషాదరణకు కారణం ఈ నిష్కామ కర్మయే నని నమ్ముచున్నాను. స్వార్థ రహిత కర్మ బంధంగా పరిణమించదు గదా ! గృహస్థాశ్రమ మందుండి నిస్వార్థ కర్మ చేయు వాడు శ్రేష్టుడుగా పరిగణింపబడినాడు కదా!

ఇట్టి గొప్ప శాస్త్రానికి జగద్గురువులు శ్రీ శంకర భగవత్పాదులు, శ్రీమద్రామానుజులు, శ్రీమధ్వాచార్యులు అనువారలు వారి పవిత్ర లేఖిని నుండి గొప్ప వ్యాఖ్యానాలు వెలువరించినారు. అవి నేటికినీ ఆదర్శనీయములే. ఆ తరువాత ఎంతో మంది మహనీయులు తమ తమ వ్యాఖ్యలు ముముక్షువులకు అందించియున్నారు. వానిని ప్రజలు ఆదిరిస్తూ ఉన్నారు.

బ్రహ్మవిద్యా సంప్రదాయ ప్రవర్తకులయిన శ్రీ మళయాళ స్వామి, శ్రీ విద్యా ప్రకాశానందగిరి స్వామి, శ్రీ రామకృష్ణానంద స్వామి, తిమ్మయ్య స్వామి మొదలుగా గల ఆధ్యాత్మిక గురుదేవుల యొక్క సేవ జేసిన శ్రీమాన్ సన్నిధి

జనార్ధన స్వామి, తన మేధోపరమైన విజ్ఞానముతో, నిజాయితీతో చాలామందికి తెలియని ప్రాథమిక సత్యాలను తన గ్రంథం " భగవద్గీతామృతపానం భవసాగరతీరం " లో తన అచంచల అనుభవజ్ఞానం తో మనముందుంచారు. ఈ వ్యక్తి లోని ప్రతిభ భగవత్ ప్రసాదితమనీ, వీరి గురువులు, అట్టి ప్రతిభను వీరి నుండి వెలికి తీశారని నేను భావిస్తున్నాను. అటువంటి ప్రతిభతో వీరు ఎన్నో సత్సంగములలో పెద్ద పెద్ద గురువుల సమక్షములో భగవద్గీతపై ఉపన్యాసాలిచ్చి, పెద్దల యొక్క, ముముక్షు జనుల యొక్క మన్ననలను పొందియున్నారు. కంచుకంఠంతో వారు వెలవరించే ఉపన్యాసాలు వింటుంటే, వినేవారు, ఆహా ! ఓహో ! అంటూ తలలూప వలసిందే.

శ్రీ జనార్ధన స్వామి గారు, భగవద్గీతలోని వివిధ అధ్యాయాలను విశ్లేషణ చేస్తూ, వారు ప్రయోగించిన ఆధ్యాత్మిక సాంకేతిక పదజాలములు, ఆ పదజాలములకు వారు తెలియ జేసిన వివరణములు పరిశీలిస్తే, వారికి శ్రీమద్భగవద్గీతపై గల అనన్య ప్రేమ, అవగాహనలు, పెద్దల శుశ్రూష వలన లభించిన ఆధ్యాత్మిక చింతనల ప్రవాహం మనకు అవగత మవుతుంది.

ఇట్టి ధర్మ ప్రచారనిధి, వ్రాసిన రచించిన ఈ గ్రంథము అత్యంత రసవత్తరము, భావయుక్తమున్నూ అయి ఉండగా, సనాతన ధర్మవాణికి, సర్వ మానవ ప్రేమ తత్వానికి, సర్వజీవుల ప్రేమ తత్వానికి, ప్రజల ఆధ్యాత్మిక ప్రయోజనమునకు, భావి తరముల ఉన్నతికి సోపానముగా విలసిల్ల గలదని నేను విశ్వసిస్తున్నాను. రచయితకు వారి కుటుంబానికి ఆ శ్రీమన్నారాయణుడు సకల శుభములు కలుగ జేయాలని కోరుకుంటున్నాను.

భగవద్గీతపై వీరి వ్యాఖ్య ఎన్నవదని చెప్పగలము? ఎన్నవదైతేనేమి, ఆధ్యాత్మ విద్యకు పునరుక్తి దోషం లేదు కదా !

శ్రేయోభిలాషి,

**ఫణిదపు పాండురంగ ప్రసాద్** బి.ఏ. హెచ్.డి.సి.

రిటైర్డ్ సెక్షన్ ఆఫీసర్, బహుగ్రంథ రచయిత, వనస్థలిపురం.

,

# శ్రీ భగవద్గీతామృతపానం నిజమైన భవసాగర తీరం గూర్చి

## నా మనసులో మాట

భగవద్గీతను పఠించి భక్తితో
జ్యోతిష తెలుగు భాషాప్రవీణుడు జనార్ధన స్వామి గారు,
గీతామృతపానం మృదుమధుర సరళశైలిలో రచించెను గద్యరూపములో
సామాన్యుడు సైతం భక్తితో చదివి సర్వపాప నివారణ సిద్ధి కొరకు,
వారికివే నా మనస్ఫూర్తి కృతజ్ఞతా వందనాలు.

ఎందరో మహానుభావులు ఎన్నో బోధనలు, వ్యాఖ్యా ప్రచారాలు చేసి భగవద్గీత గద్యరచనలు గావించారు. వాటిలో ఒకటిగా శ్రీ సన్నిధి జనార్ధన స్వామి గారు రచించిన " శ్రీ భగవద్గీతామృత పానం భవసాగర తీరం " అను గద్య రచన ఒక ప్రవాహం లాగా నల్లేరుపై నడకలాగా మృదుమధుర సరళ సులభశైలిలో సాగినదనుటలో అవాస్తవం లేదు. సామాన్య భక్తుడు కూడా సులభముగా భగవద్గీతను అవగాహనను చేసుకునే రీతిలో ఈ రచన సాగింది. ఈ గద్య రచన పఠన వాస్తవముగా అమృతం త్రాగినట్లుగా ఎంతో ఆనందము కలిగించుచున్నది. ఇంకా ఇంకా చదవాలని అనిపించుచున్నది. ఇది సకల భక్తులకు ఒక అమూల్యమైన కానుకగా భావించుచున్నాను. రచయిత ప్రధమాధ్యాయంలో 18వ సంఖ్య రహస్యమును చాలా చక్కగా వివరించారు. ఇది ఆశ్చర్యకర విశేషము. ఈ రచయిత ఇటువంటి రచనలెన్నో కావించి భక్త జనానికి అందజేయాలని ఆశించుచున్నాను. వారికి నా సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉండును.

మానవుని కర్మలు మానవుడే నిష్ఠగా నిర్వర్తించాలి నిష్కామ మనసుతో
మిగతాది మాధవుడే చూచుకొను మమకారంతో
చింతలు మాని సర్వము సమర్పించు సర్వేశ్వరుని పాదాల చెంత
సర్వపాపాల నుండి విముక్తి సిద్ధించు సంశయము వలదు సంసారీ!

అందరి ఆత్మలు భగవంతుని అంశమే అనుట గీతాసారాంశము
జీవితము సుఖదు:ఖమయములు
ఈ జగన్నాటకము భగవంతుడు ఎందుకు ఆడుతున్నాడు?
దీనికి జవాబు లేదు.

॥ శుభమస్తు ॥

ఇట్లు
సదా సంఘ సేవలో
**గౌరవ శ్రీరాములు రెడ్డి**
అడ్వకేట్
వనస్థలిపురం

శ్రీరస్తు　　　　శ్రీకృష్ణ పరబ్రహ్మణే నమ:　　　　శుభమస్తు

# గీతా ప్రతిభ గీతా ప్రార్థన

సీ॥ కర్మభక్తిని గూర్చి * క్రమముగా బోధించి
　　జ్ఞాన మార్గము జూపు* జ్ఞాన గీత
ఆత్మ న నాత్మల * నా దరంబున తెల్పి
　　తరియింప చేసెడి* తత్వగీత
అహమును క్రోధంబు* నావల పోద్రోలి
　　సాత్వికునిగ మార్చు* సత్య గీత
నాది యన్నను కర్మ * నీది యన్నను ముక్తి
　　సూటిగా తెల్పెడి* శుద్ధ గీత
భక్తి శక్తిని గూర్చి* ప్రాభవమ్ముగ తెల్పి
　　భవ్య మార్గము జూపు * భద్రగీత

గీ॥ నీ దు తల వ్రాత మార్చెడి* నీతి గీత
　　సకల శాస్త్రాల సారంబు* సత్య గీత
గీత నాశ్రయించిన మన* గీత మారు
సులభ మార్గంబు తెల్పెడి* సుజన గీత

# మహావిష్ణు ప్రార్థన

ఉ॥ ఎప్పుడు ధర్మహానియగు * నీ ధరణీ స్థలి నా క్షణంబునన్
తప్పక మాటిమాటికవ * తారము లెత్తుచు సాధుకోటి, మే
లొప్పగ నుద్ధరించి కుజ * నోద్ధతి మాన్పిన విష్ణుమూర్తి * మా
తప్పులనెల్ల బ్రోచి నను తప్పగ ప్రేమతొ కావు తండ్రి మా
యప్ప కృపా పయోనిధి ని * రంతర సౌఖ్యము మాకు నీ యుతన్

।

గీ॥ ధర్మ సంస్థాపనార్థమై * ధరణి యందు
జనన మొంది యు కృష్ణుడు * జగమెరుంగ
దుష్ట శిక్షణ మొనరించి * దూరదృష్టి
జ్ఞాన బోధను బోధించె * ఖ్యాతిగాను
సర్వ జనులకు యనుకూల * సారమైన
గీత బోధను బోధించి * కీలు దెలిపె

గీ॥ అట్టి గీతను మనమంత * నాదరించి
భక్తి జ్ఞానాల మనమున * భద్రపరచి
మనము తరియించు మార్గంబు * మదినెరింగి
జన్మధన్యత బొందుడీ జగతి యందు।

రచయిత

**సన్నిధి జనార్దనస్వామి**

ॐ

# శ్రీ భగవద్గీత
# ప్రథమాధ్యాయము
# అర్జున విషాదయోగము

శ్లో ॥ ఓం పార్థాయ ప్రతిబోధితాం భగవతా నారాయణేన స్వయం
వ్యాసేన గ్రథితాం పురాణమునినా మధ్యే మహాభారతం
అద్వైతామృత వర్షిణీం భగవతీ, మష్టాదశాధ్యాయినీం
అంబా త్వామను సంధధామి, భగవద్గీతే భవద్వేషిణీం ॥

శ్లో ॥ వసుదేవసుతం దేవం కంసచాణూర మర్దనం
దేవకీ పరమానందం కృష్ణం వందే జగద్గురుం ॥

శ్లో ॥ సంసార సాగరం ఘోరం, తర్తు మిచ్ఛతియో నర:
గీతానావం సమాసాద్య, పాపం యాతి సుఖేనస: ॥

శ్లో ॥ మూకంకరోతి వాచాలం పంగుం లంఘయతేగిరిం
యత్కృపాతమహం వందే, పరమానంద మాధవం ॥

శ్లో ॥ గీతా భాగవతాద్వైత, తత్వామృత స్వరూపిణే
గండి క్షేత్ర నివాసాయ, రామకృష్ణాయ మంగళం ॥

శ్లో ॥ మంగళం గురుదేవాయ మహనీయ గుణాత్మనే
సర్వలోక శరణ్యాయ సాధురూపాయ మంగళం ॥

శ్లో ॥ అఖండ మండలాకారం వ్యాప్తం యేనచరాచరం
తత్పదం దర్శితంయేన, తస్మై శ్రీగురవే నమ: ॥

ప్రియమైన దివ్యాత్మ స్వరూపులారా! భగవద్భక్తులారా! భాగవతులారా! మీ బుద్ధియందు, పవిత్రమైన మీ అంత:కరణమునందు సాక్షి స్వరూపంతో విరాజ మానమై ఉండే జగద్గురు శ్రీకృష్ణ పరమాత్మునకు, అనంతానంత నమస్కారములు. శిష్టా చార సంప్రదాయాన్ని అనుసరించి భగవంతునకు నమస్కరించి బ్రహ్మ విద్యా సంప్రదాయ ప్రవర్తకులయిన మహర్షులకు గురుదేవులు, శ్రీ రామకృష్ణా నందగిరి స్వాముల వారికి శ్రద్ధాంజలి ఘటించి, సాధు సజ్జనులకు పుణ్య సతీమతల్లులకు ధన్యవాద సమర్పణము చేస్తూ పెద్దల సాంగత్యము వల్లను, పెద్దల సేవా భాగ్యము వల్లను తల్లిదండ్రుల ఆశీర్వాదం వల్లను నాకు తెలిసినంత వరకు భగవద్గీతామృతాన్ని మీ కందించ ప్రయత్నించడం నా భాగ్యంగా భావిస్తున్నాను.

ప్రియ దివ్యాత్మ స్వరూపులారా! మానవుడు తరించుటకు భక్తి జ్ఞానములు ముఖ్య అవసరము. ఎనుబది నాల్గు లక్షల జీవరాసులలో మానవుడు శ్రేష్ఠుడని శాస్త్రములు పురాణములు ఉపనిషత్తులు ఘోషిస్తున్నాయి. కానీ, సామాన్యమైన ఒక కాకికి పది మెతుకులు కనిపిస్తే ఇక్కడ ఆహారమున్నది తిందామురమ్మని 'కావు, కావు, కావు' అంటూ పది కాకులను పిలుస్తుంది. ఒక చిన్న చీమకు ఒక బెల్లపు ముక్క గనుక కనిపిస్తే అది తినకుండా వెళ్ళి వంద చీమలను పిల్చుకొని వస్తుంది. మరి ఈ మానవుడు ఇంకొకరికి పాలు పంచివ్వగలడా. ఒక బంగారు దూలము గనుక కనిపిస్తే దాని క్రింద పడి చావనైనా చావగలడు కాని, ఇంకొకరికి పాలు పంచి ఇచ్చుటకు ఇష్ట పడడు. ఇంకో విధంగా ఆలోచిస్తే పాము పామును చంపదు. పులిని పులి చంపదు. ఈ విధంగా

పశు పక్ష్యాదులకు గాని, మృగాలకు గాని స్వజాతి వల్ల స్వజాతికి కష్టనష్టాలు, భయ భ్రాంతులు, ప్రాణాపాయాలు లేవు. మరి యీ మానవుడో? మానవుడు మానవుణ్ణి హత్య చేయడం, ఒకని ఇల్లు ఇంకొకడు కూల్చి వేయడం, ఒకని ఉన్నతిని చూసి ఇంకొకడు అసూయ పడడం శక్తి ఉంటే ఆ ఉన్నతికి విఘాతం కలిగించడం, మోసం చేయడము, ఇలాంటి నీచ నికృష్ట, భ్రష్ట సంస్కృతి గల ఈ మానవుని, శ్రేష్ఠుడని పురాణాలు ఎందుకు సెలవిచ్చాయి. ఇలాంటి నీచపు పనులు, అసూయలు, ద్వేషాలు, ముఠాకక్షలు, రౌడీయిజం మొదలగు దుర్గుణాలు ఆ పశుపక్ష్యాదులకు లేవే ! ఇదేనా మన గొప్పతనం. ఇదేనా మన నాగరికత. ఈ విధంగా ఆలోచనలు చేస్తే యీ మానవునికంటే ఆ పశుపక్ష్యాదులు ఎంతో మేలని అంగీకరించక తప్పదు.

మనమట్లు అంగీకరించి మానవ జన్మకంటే పశుజన్మ యే గొప్పదని మనమంటే శాస్త్రాలు, ఉపనిషత్తులు, జ్ఞానులు మనపైకి యుద్ధానికి వత్తురు. మరి ఆ శాస్త్ర పురాణముల అభిప్రాయ మేమైనట్లు అని సూక్ష్మంగా ఆలోచన చేస్తే, పశు పక్ష్యాదులకు మారే గుణం లేదు. శాకాహారి, శాకాహారిగానే జీవిస్తుంది. మాంసాహారి మాంసాహారిగానే జీవిస్తుంది. ఉదాహరణకు ఒక పిల్లిని తీసుకొని, మార్జాలమా! జీవహింస మహా పాపము, మాంసాహారము తినవద్దు అని ఆరు నెలలు బోధ చేసి వదిలితే ఎలుక కనబడితే వెంటనే దానిపై బడి సంహరిస్తుంది. భోంచేస్తుంది. మరి మన బోధ ఏమైనట్లు? అనగా జంతువులకు మారే గుణం లేదు. మానవుడట్లు కాదే! రత్నాకరుడను ఒక గజ దొంగ, వాల్మీకి మహర్షి కాలేదా! సుక్షత్రియుడైన ఒక మహారాజు విశ్వామిత్రుడు పట్టుదలతో బ్రహ్మర్షి కాలేదా! ఇదే విధంగా నీచ నికృష్ట భ్రష్ట మానవుడు జ్ఞానికావచ్చును. మూర్ఖుడు పట్టుదలతో పండితుడు కావచ్చును. ఈ గొప్ప అవకాశము ఒక మానవునికి తప్ప ఏ ప్రాణికీ లేదు. ఇది మానవుల

మహా భాగ్యం. పాప పుణ్య విచక్షణ, సత్యా సత్య వివేకము, మంచీ చెడూ తెలుసుకునే మహా భాగ్యాన్ని ప్రసాదించాడు భగవంతుడు. ఆ శక్తిని సద్వినియోగం చేసుకొని, వారి వారి జీవితాలను ఆదర్శవంతముగా తీర్చి దిద్దుకొని, అందరూ ధన్యజీవులై, ధర్మ గుణసంపన్నులై తరింతురు గాక.

అమూల్యమైన యీ మానవజన్మ భగవంతుడు నీకిచ్చినందుకు నీవు కృషి సల్పి, మానవుడవు, మాధవుడవు కావచ్చు. ఏ కృషి చేయక మానవుడవు మానవుడుగానే ఉండవచ్చు. దురభ్యాసాలు, దుర్గుణాలు, దురలవాట్లకు బానిసలై దిగజారి, మానవుడు దానవుడూ కావచ్చు. అది నీ చేతిలోననే యున్నది. ఆ శక్తిని ఆ జ్ఞానాన్ని భగవంతుడు నీకు ప్రసాదించాడు కనుక, సదాచార సంపన్నులై పెద్దలు తెల్పిన, మంచి మార్గాలలో ప్రయాణించి, మన జీవితాలు చరితార్థం చేసుకొనుటకు వెంటనే ప్రయత్నము చేయుదము గాక.

ప్రస్తుత వ్యాసం శ్రీమద్భగవద్గీతలోని ప్రథమాధ్యాయం. దీని పేరు " అర్జున విషాద యోగం " ఇయ్యది మహాభారతం, భీష్మ పర్వంలోనిది. భగవద్గీత అనే దివ్య భవ్య భవనానికి, యీ విషాద యోగము భద్రమైన పునాది లాంటిది. ఈ భగవద్గీత పుట్టి 5103 సంవత్సరాలు అయినప్పటికీ పైన పైన పదునేడు అంతస్థులు నిలబడి ఉన్నప్పటికీ చెక్కు చెదరకుండా కట్టు కదలకుండా, దివ్యంగా, సవ్యంగా భవ్యంగా యీ భగవద్గీత అనే భవనం వెలిసిందంటే ఈ పునాదిలో ఉండే గట్టితనం ఎలాంటిదో మీరు ఊహించుకోవచ్చును.

భగవద్గీత అనునది ఒక మహా భవనం. అది 18 అంతస్థులు కలిగి ఉన్నది. ప్రతి అంతస్థులో ప్రతి గదిలో ఎంతో విలువైన రత్నాలు, వజ్రాలు, మాణిక్యాలతో నిండి యున్నది. అది యొక ఎగ్జిబిషన్ లాంటిది. మామూలు ఎగ్జిబిషన్‌లో ప్రవేశించుటకు మూల్యము చెల్లించవలెను. లోపలికి ప్రవేశించిన తర్వాత ఏ వస్తువు కావాలన్నా వాటికి విలువ చెల్లించాలి. కానీ, భగవద్గీతా

భవనంలోనికి వెళ్ళాలంటే ఏ రుసుమూ చెల్లించవలసిన పని లేదు. పైగా అందులోని అత్యంత విలువైన రత్నాలు మాణిక్యాలు వజ్రాలు మోయగలిగినన్ని ఉచితంగా తెచ్చుకోవచ్చును. ఎన్ని తెచ్చుకున్నా అడ్డగించువారే ఉండరు. అది ఏమి చిత్రమో కాని 5 వేల సంవత్సరాల నుండి ఎందరు ఎన్ని తెచ్చుకున్నా అందులో తరిగేది లేదూ తగ్గేదిలేదు .

అసలీ విషాద యోగం లేక ఏ యోగమూ లేదు. విషాద యోగి కాని వాడు యోగి కాలేడు. జ్ఞాని కాలేడు. విషాదయోగం పొందిన తర్వాతే మానవుడు ఆధ్యాత్మిక తత్వానికి అధికారి కాగలడు. విషాదయోగమనే యీ విచిత్ర నామకరణము భగవద్గీతలో తప్ప మరెక్కడా కనపడదు. విషాద మనగా "ఏడుపు" "దిగులు" అది కూడా ఒక యోగమే అయినది. మనం ఏడిస్తే " నీకు ఏమి రోగము అంటారు". మన ఏడుపు రోగమయినది. అర్జునుని ఏడుపు యోగమయినది. ప్రపంచంలోని ప్రతి వారూ ఏడుస్తూనే ఉన్నారు. భార్యల కోసరము, బిడ్డల కోసరము, ఐశ్వర్యం కోసరము, ఆరోగ్యం కోసరము, ఉద్యోగాల కోసరము, పేరు కోసరము ప్రతిష్ఠల కోసరము, పదవుల కోసం ఇలాంటి వన్నీ కావాలని, మనము ఏడిస్తే ఆర్జునుడు ఇందుకు విరుద్ధంగా!

**శ్లో ॥ న కాంక్షే విజయం కృష్ణ । నచరాజ్యం సుఖానిచ**
**కింనో రాజ్యేన గోవింద । కింభోగైర్జీవితేనవా ।**

అంటూ మాధవా, గోవిందా, నాకు రాజ్యం వద్దు, ఐశ్వర్యం వద్దు. సుఖము వద్దు, ఈ భోగములు వద్దు. అంటూ అర్జునుడు ఏడ్చాడు. కనుకనే ఆయన ఏడుపు యోగమైనది. మన ఏడ్పులు పూర్తిగా విరుద్ధం ఆయన వలదన్నవే గాక ఇంకా ఎన్నో కావాలని మన ఏడ్పులు. యీ ఏడ్పులు రెండు

రకములు.యీ ఏడ్పులు ప్రథమాధ్యాయములో ధృతరాష్ట్రుని ఏడుపు ఉంది. అర్జునుని ఏడుపు ఉంది. ధృతరాష్ట్రుని ఏడుపు అహంకారముతో కూడినది. కనుకనే సంజయుడంతటి వాని ద్వారా గీతా బోధ విన్నప్పటికీ, ఫలితము శూన్యము అయినది. అర్జునుని ఏడుపు భగవంతుని ముందు బెట్టుకొని నడిచింది కాబట్టే అతని ఏడుపు యోగమైనది. మరియు భగవత్ప్రాప్తికి ఆత్మ జ్ఞానానికి మార్గమయినది.

ప్రియ భగవద్భక్తులారా! అర్జుననిలా ఏడ్వడం చేతకాకపోతే, అర్జుననిలా ఏడ్వలేక పోయితిమే అని అయినా ఏడ్వండి ఈ విషాదం గురించి ఇంకా కొంత తెలుసుకుందాము. ప్రపంచంలోని అవతారపురుషులూ మహనీయులూ, దు:ఖములలో సానదీరినవారే. ఉదాహరణకు శ్రీరాముడు మొదలగు వారందరూ దు:ఖాలు వచ్చినప్పుడు సహించి జయించి కీర్తివంతులైనారు. ఒక సందర్భంలో శ్రీకృష్ణుడు కుంతీదేవితో అంటాడు. "అత్తా ! మహారాణిగా ఉండవలసిన నీకు ఎంతటి కష్టాలు, సంకటాలు దాపురించాయి. ఇప్పుడైనా ఏదైనా వరం కోరుకో ఇస్తాను" అంటాడు. అలాగా కృష్ణా ! అయితే దు:ఖాలు, కష్టాలు, ఆపదలు ఎప్పుడూ నాకు కలిగేటట్లు అనుగ్రహించు నాయనా, అంటుంది. ఇంకేముంది నల్లని కృష్ణుడు తెల్లబోయాడు. ఆనందఘనుడైన శ్రీకృష్ణుడు దు:ఖాల నెక్కడ నుండి తెచ్చి ఇవ్వగలడు. సూర్యున్ని చీకటి ఇవ్వమని అడిగితే సూర్యుడు ఇవ్వగలడా. ఈ దు:ఖాలలో ఉండే ఆనందం కొందరికి మాత్రమే తెలుసు. శ్రీకృష్ణ పరమాత్మ యీ గీతాబోధను మహాధర్మపరుడు సోదరులలో జ్యేష్టుడు అయిన ధర్మరాజుకే బోధ చేయవచ్చును గదా అలాకాక చిన్నవాడైన అర్జునునికి ఎందుకు బోధ చేసినాడని మనం ఆలోచిస్తే అక్కడా ఒక పరమార్థం గోచరించును. అరిషడ్వార్గాలకు వ్యసనాలకు బానిసలైనవారు యీ గీతాబోధకు

అర్హులుగారు అనే ధర్మజున్ని వదలి అర్జునునకు బోధ చేయడమైనది. ఎట్లనగా ధర్మజునకు జూదమనే ఒక వ్యసన మున్నది. ఆ వ్యసనానికి బానిస అయినందుననే తన రాజ్యము సంపదలతో పాటు, తమ్ములను భార్యను సయితం జూదంలో పెట్టి ఓడినాడు. ఇందువల్లనే అరణ్యవాసాలకు అజ్ఞాత వాసాలకు, కురుక్షేత్ర యుద్ధానికి కారణమైనది. అందువల్ల దుర్వ్యసనాలు కలవారు గీతా బోధకు అనర్హులని లోకానికి తెల్పుటకేనో ఏమో ధర్మజునకు గీతను బోధించలేదు. మరి అర్జునునకు ఎందుకు బోధించినాడని ఆలోచన చేయగా అర్జునుడు దేవేంద్ర లోకంలో దేవతా స్త్రీ అయిన ఊర్వశి అపూర్వ సౌందర్యవతి వచ్చి ప్రేమించి, కామించగా నిరాకరించిన ధీరోదాత్తుడు సాక్షాత్తు ఈశ్వరుడితోనే యుద్ధంచేసి అక్షయ తూణీరాలు గాండీవము అదృశ్యము కాగా, శివుడినే ముష్టిగ్రుద్దులు గ్రుద్ది ద్వంద్వ యుద్ధం చేసి శివానుగ్రహం పొందిన తపస్సంపన్నుడు. ఖాండవ దహనమప్పుడు అర్జునుడి బాణవిద్యా ప్రభావానికి సంతసించి దేవేంద్రుడు అర్జునుని తన ఇంద్రలోకానికి పిల్చుకొని పోయి తన అర్ధ సింహాసనమిచ్చి గౌరవించాడు. ఇన్ని సద్గుణాలతో పాటు శ్రీకృష్ణ పరమాత్మకు ప్రేమ పాత్రుడయ్యాడు. ఇన్ని సద్గుణాలుండుట వల్లనే అర్జునుడు గీతాబోధకు పాత్రుడయ్యాడు. కనుక భగవద్భక్తులారా! భగవద్గీతలో ప్రవేశించకమునుపే మనమున్ను నిర్మల మనస్సు కలవారమై దుర్వ్యసనాలకు దూరమై గీతామృతాన్ని గ్రోలుటకు అర్హతను బొందుదము గాక. ధృతరాష్ట్ర ఉవాచా అంటూ మొదలవుతుంది భగవద్గీత. మొట్టమొదట ఓం ప్రథమంలో ఈ గ్రుడ్డి మహారాజుతో ఎందుకు ప్రారంభమయ్యింది. శ్రీకృష్ణ పరమాత్మ చేతనో, అర్జునుని చేతనో ప్రారంభించవచ్చుగదా అని అనుకోవచ్చును. యీ ధృతరాష్ట్రుని దర్శనం అనుమతి తీసుకొనే మనం గీతాభవనంలో ప్రవేశించవలె. ధృతరాష్ట్రుని గురించి కొంత తెలుసుకుందాము. ధృతరాష్ట్రునికి బయటి

చూపే కాదు లోపలి చూపుకూడా శూన్యం బాహ్య నేత్రంతో పాటు వివేకనేత్రం కూడా లోపించింది. కావుననే మీరుకూడా ధృతరాష్ట్రులై ఎన్ని ఏండ్లు భగవద్గీత చదివినా లాభం లేదు. అర్జునులై చదవండని వీరిరువురిని మన ఎదుట నిలబెట్టినాడు వ్యాస భగవానుడు. ధృతరాష్ట్రుడు అనగా తనది కాని, పరుల రాజ్యాన్ని గట్టిగా పట్టుకొని యజమాని వచ్చి అడిగినా ఇచ్చేందుకు ఇష్టపడని వాడే ధృతరాష్ట్రుడు. ఈ దుర్లక్షణం ఉండుట వల్లనే అతనికి గీతా బోధ ఫలించలేదు. ఇంకో అర్థము గ్రుడ్డివాడికి పనికి వచ్చునది. కనుకనే గ్రుడ్డివారితో ప్రారంభించడమైనది. గ్రుడ్డివారికి మాత్రమే పనికి వచ్చునదైతే మాకెందుకండీ భగవద్గీత? మాకు కళ్ళు బాగా కనిపిస్తున్నాయను కుంటున్నారేమో అజ్ఞానమనే అంధకారంలో కొట్టుమిట్టాడే మనమంతా గ్రుడ్డివారమే. ఒక దివ్యజ్ఞాన సంపన్నులు మాత్రమే చూపు ఉన్నవారు. అందుచేతనే గ్రుడ్డి మహారాజుతో భగవద్గీత ప్రారంభం చేయడమైనది.

ప్రియ భగవద్భక్తులారా! మీరును మీమీ మనస్సులలోను పవిత్రంగా మార్చుకొని ‘ దుర్వ్యసనాలను విడనాడి, పవిత్రాత్మ స్వరూపులుగా మారి యీ పవిత్ర గీతాభవనంలో ప్రవేశించవలసిందిగా మీ కందరకూ స్వాగతవచనాలతో ఆహ్వానిస్తున్నాము.

**శ్లో ॥ ధర్మక్షేత్రే కురుక్షేత్రే । సమవేతా యుయుత్సవ:**

**మామకా: పాండవాశ్చైవ। కిమకుర్వతు సంజయ: ॥**

యీ శ్లోకమునకు ముందుగా స్థూలార్థాన్ని చెప్పుకుందాము. ఓ సంజయా ! ధర్మక్షేత్రమయిన కురుక్షేత్రమందు, సమ ఉజ్జీలు, బలపరాక్రమ సంపన్నులు అయిన మామకా: మా వారలు పాండవులు ఏమి చేసిరి ఇది ఈ శ్లోకంలో

స్థూలార్థము. ఇంక సూక్ష్మార్థము తెలుసుకుందాము. ధర్మక్షేత్రే కురుక్షేత్రే పాండవులు, కౌరవులు యుద్ధం చేసిన ప్రదేశమునకు కురుక్షేత్రము, ధర్మక్షేత్రము అని పేర్లు, ఒక ప్రదేశానికి ఒక పేరు ఉండాలిగాని రెండు పేర్లు ఎందుకు వచ్చినాయి.

ఆ ప్రదేశంలో ధర్మకార్యాలు యజ్ఞయాగాదులు, పుణ్యకార్యాలు చేసిన ప్రదేశమగుటచే ధర్మక్షేత్రమనియు, పాండవులకు కౌరవులకు మూలపురుషుడైన కురుమహారాజు ఆ ప్రదేశంలో చుట్టూకొన్ని ఆమడల దూరం పందిళ్ళు వేసి ఆ ప్రదేశంలో ఒక మహా సత్రయాగం చేసిన ప్రదేశం కనుక ఆ ప్రదేశానికి కురుక్షేత్రమని పేర్లు కలిగినవి. కురు మహారాజు ఆ మహా యజ్ఞం పూర్తి చేసిన శుభ సందర్భంలో దేవతలంతా స్వయంగా వచ్చి ఆ యజ్ఞంలో హవిర్భాగాలు స్వయంగా గ్రహించి సంతుష్టాంతరంగులై కురుమహారాజు గారికి ధన ధాన్య పుత్రమిత్ర కళత్రాది ఆయురారోగ్య ఐశ్వర్యాదులన్నీ అడుగకనే వరాలు పరంపరలుగా ఇచ్చియు, వారికి తృప్తి కలుగక "మహారాజా నీ యాగం వల్ల మేమెంతో సంతృప్తి చెందినాము. మా ఆనందమునకు అవధులు లేవు. నీకింకా ఏమైనా కోర్కెలు ఉంటే కోరుకొనుము. నీ కోర్కెలు తీర్చుటే మా ధర్మము కోరుకొమ్మనగా కురుమహారాజు చేతులు జోడించి, " ఓ మహానుభావులారా! మీరు కృపతో నా యజ్ఞానికి దయచేసి హవిర్భాగాలు ప్రేమతో స్వీకరించుటయే గాక అడుగకనే అనేకానేక వరాలు ప్రసాదించినారు, ఇంతకన్నా ఏమి కోరుకోగలను. మీరు తృప్తి చెందడమే నా భాగ్యంగా సంతోషిస్తున్నాను" అంటాడు వినయపూర్వకంగా కురుమహారాజు. లేదు మహారాజా మేము ఎన్ని వరాలిచ్చినా నీవు కోరిన వరాలిచ్చినపుడే మాకు తృప్తి" అని దేవతలు బలవంత పెట్టగా కురుమహారాజు చేతులు జోడించి

“ ఓ మహానుభావులారా! నేను యజ్ఞం చేసిన యీ మైదానంలో ఎవరైనను ఏ ప్రాణి అయినా దేహాలు వదలినచో వారందరికీ స్వర్గసుఖాలు మోక్షాలు ప్రసాదించండని” వినయంగా కోరగా “అలాగేనంటూ” వరమిస్తారు దేవతలు. అందుచే ఆ ప్రదేశానికి కురుక్షేత్రమని పేరు. అంతియే గాక అనేక మహర్షులు తపస్సులు చేసిన పుణ్యభూమి. ఇన్ని కారణాలుండుటచే ఆ ప్రదేశానికి ధర్మక్షేత్రమని కురుక్షేత్రమని పేర్లు కలిగినది. అయ్యది ఇప్పుడు అంబాళాకు దక్షిణంగా ఢిల్లీకి ఉత్తర పశ్చిమ భాగంలో ఉన్నది. దీనికి శమంతపంచక మనేపేరు కూడా కలదు. ఇలాంటి పవిత్ర భూమిని యుద్ధభూమిగా ఎంచుకోవడంలో కౌరవపాండవుల బుద్ధికుశలత బహు ప్రశంసనీయమైనది.

అది ఎట్లనగా యుద్ధంలో మరణిస్తే స్వర్గభోగాలు మోక్షాలు పొందవచ్చు. యుద్ధంలో జయిస్తే ప్రాపంచిక భోగాలు, రాజ్యసుఖాలు పొందవచ్చును. ఇటులైతే ఇది మంచిది. అటులైతే అది మంచిది. ఇది వారి ఉద్దేశ్యము. ఇది ఎట్లున్నదనగా ఇక్కడ ఒక ఉపమానం చెప్పుకొని ముందుకు వెళ్దాము.

## వేమన – కబీరుదాసు

పూర్వము వేమన యోగికి ఒక అనుమానము కలిగిందట. అదియే మనగానేనైతే సర్వసంగ పరిత్యాగిని, జ్ఞానికావడం సబబుగా ఉన్నది. కబీరు బహు కుటుంబీకుడు. బట్టల నేత వృత్తిగా కలవాడు. వ్యాపారము వృత్తి అయిన ఇలాంటి కబీరు జ్ఞాని ఎలా అవుతాడు అని సందేహము కలిగి, అయినా ఒకసారి వెళ్ళి కబీరును చూడాలని నిర్ణయించుకున్నవాడై కబీరు ఇంటికి వెళ్తాడు. వేమన వెళ్ళుసరికి ద్వారం ఎదుట మగ్గం గుంతలో కాళ్ళు పెట్టుకొని నేతనేస్తూ ఉన్నాడు కబీరు. తన ఇంటికి వస్తున్న వేమనను చూశాడు. ఎందుకు వస్తున్నాడని విషయం సైతం అర్థం చేసుకున్నాడు. తగిన సమాధానం చెప్పాలనుకున్నాడు.

వేమన ఇంటిలోనికి అడుగు పెట్టగానే భార్యను పిలిచాడు. "ఏమే ఇటురా" అని అన్నాడు. ఆ ఇల్లాలు పిలిచినదే తడవుగా వెంటనే దంచే రోకలిని అలాపైననే వదలి వచ్చింది "ఏమండీ పిలిచితిరి" అంటూ. "అదుగో అక్కడ నూలు పోగు తెగిపోయినది. దానిని అతికించు" అన్నాడు. ఆమె అతికించినది. కబీరు కావాలని తెంచినదే ఆ నూలుపోగు. ఆమె పోయేవరకు ఆ రోకలి అలా పైననే నిలిచి ఉన్నదట. యీ దృశ్యమంతా వేమన చూస్తూనే ఉన్నాడు. అప్పుడు కబీరు అంటాడు 'ఇలా గుంటే ఇది మంచిది' లేకున్న అది మంచిది అంటూ నూలు కండె వేశాడట. అనగా ఇలాంటి ఇల్లాలు వుంటే యీ గృహస్థ ధర్మమే మంచిది. ఇలాంటి ఇల్లాలు లేకున్న నీ వలె సన్యసించుట మంచిదని అర్థము. అని చెప్తూ నూలు కండె వేశాడట. వేమనను చూడగానే, కబీరు "వేమన ఎందుకొచ్చినది ఎలా గ్రహించినాడని" చాలా మందికి సంశయం కలిగి ఉండవచ్చు. కొన్ని కెమెరాలతో ఫోటో తీస్తే కండ్లు, పండ్లు, ముఖము కాళ్ళూ చేతులు వంటి ఆకారాలు ప్రింట్ అవును. మరొక రకమైన కెమెరా X-Ray తో ఫోటో తీసినచో గుండె, ప్రేగులు, ఎముకలు మాత్రం ప్రింట్ అగును. అలాగుననే పై చూపులు చూతురు సామాన్యులు. లోచూపు చూతురు జ్ఞానులు.

యుద్ధభూమిగా కురుక్షేత్రమును ఎన్నుకోవటంలో ఆంతర్యం ఏమనగా "యుద్ధంలో గెలుపొందితే రాజ్యసుఖాలు" మరణిస్తే స్వర్గసుఖాలు పొందవచ్చు. ఉభయత్రా క్షేమంగా ఉండునట్లు కురుక్షేత్రాన్ని యుద్ధభూమిగా ఎన్నుకొన్నారు. మరో అర్థం – క్షేత్రం అనగా భూమి, దేహం. ఇందులో ధర్మక్షేత్రాలు, కురుక్షేత్రాలు, ధర్మకురుక్షేత్రాలు అని మూడు రకాలు. దేవతా శరీరాలు ధర్మక్షేత్రాలు, మనుష్య శరీరాలు ధర్మకురుక్షేత్రాలు. దానవ శరీరాలు అధర్మక్షేత్రాలు. మానవజన్మ రెండింటి మధ్య ఉన్నది. ఈ మానవుడు

సుకర్మలు చేసి స్వర్గ భోగాలు, మోక్షం పొందవచ్చును. పాపకర్మలు చేసి నరక సంకటములు పొందవచ్చును. ఈ మానవుడు " మాధవుడు కావచ్చు. లేక మానవుడుగానే ఉండవచ్చు, లేదా దానవుడూ కావచ్చు. ఈ అవకాశం ఏ ఇతర ప్రాణికోటికీ లేదు.

## ఇందూరు మహారాణి కథ

ఇందూరు మహారాణి అహల్యాబాయి హెూల్కర్ ఏకాదశి ఉపవాసం రోజు రాత్రి సత్కథా శ్రవణం చేయాలని పౌరోహితుని ఆహ్వానిస్తుంది. ఆ పురోహితుడు వచ్చి ఏ పురాణం చెప్పవలెను"? తల్లీ అని అడుగగా. ఆ మహారాణి భగవద్గీతను వినిపించమంటుంది. ఆ పౌరోహితుడు "ధర్మక్షేత్రే కురుక్షేత్రే" అంటూ మొదలుపెట్టగానే ఎలాగు? మళ్ళీ ఆ శ్లోక పాదం చెప్పండి అంటుంది మహారాణి. ధర్మక్షేత్రే కురుక్షేత్రే అని మళ్ళీ అంటాడు పౌరోహితుడు. వెంటనే ఆమె ఎంతో సంతోషించినదై చాలు స్వామీ ఈ పదం ఒక్కటే చాలు మానవులు తరించటానికి అని అంటుంది. ఏమిటి మహారాణిగారూ అసలు గీతాబోధే మొదలు కాలేదు, అసలైన నర నారాయణుల పలుకులే రాలేదు. ధృతరాష్ట్రుడు సంజయుని అడిగే విషయము కూడా పూర్తికాలేదు. ఈ వాక్యం చేతనే మానవులు తరించవచ్చు అని అంటున్నావు. అదెలా సాధ్యం తల్లీ అని అడుగ, ఆమె ఇలా వివరిస్తుంది. స్వామీ! మీరు చెప్పిన "ధర్మక్షేత్రే కురుక్షేత్రే" అను పదమును కొద్దిగ మార్చుకొనిన "క్షేత్రే క్షేత్రే ధర్మం కురు" అవుతుంది. క్షేత్రం అనగా దేహము, క్షేత్రం అనగా భూమి. ప్రతీ చోటా, ప్రతి నిమిషం, "ధర్మంకురు" అనగా ధర్మం చేయుము అంటుంది భగవద్గీత. ఈ ఒక్క వాక్యము మనం ఆచరణలో పెట్టితే చాలు మానవ జన్మ తరించటానికి, అని అంటుంది మహారాణి. అపుడు ఈ పౌరాణికుడు తల్లీ! భగవద్గీతను ఎన్నోమార్లు చదివినా ఈ ధర్మసూక్ష్మం గ్రహించలేక పోయాను. నీవు కదు ధన్యురాలవు

తల్లీ! అంటూ నమస్కరించి వెళ్ళిపోయాడు. కురుక్షేత్రంలో కౌరవులకు, పాండవులకు యుద్ధం జరిగినట్లే మనలో కూడా ధర్మానికి అధర్మానికి యుద్ధం జరుగుతూనే ఉంటుంది. కురుక్షేత్రంలో ధర్మం జయించినది. మనలో ఏమి జయిస్తుందో మీరే పరీక్షించుకోండి.

‘‘సమవేతాయుయుత్సవ:’’ సంజయా! యుద్ధం చేయుటకు కృతనిశ్చయులైన వారలు, సమ ఉజ్జీలు, మహా బలపరాక్రమ సంపన్నులు, అయిన “మామకా: పాండవశ్చైవ”, మా వారలు, పాండవులు అంటూ సంభోధించడంలో ధృతరాష్ట్రుని మమకారము, వాత్సల్యము, భేదాభిప్రాయం స్పష్టంగా అర్థమౌచున్నది. మా వారలు, పాండవులు అనుటకంటే, మావారు మా తమ్ముని కుమారులు అనవచ్చు కదా! లేకున్న వారిని పాండవులు అని సంబోధించిన వాడు, కౌరవులు, పాండవులు అని అనవచ్చు కదా! అలా అనేవాడే అయితే అసలు ఈ యుద్ధమే జరిగేది కాదేమో? ఇదెట్లుందనగా, ఒకామె తమ అత్తగారు చనిపోయినపుడు “ నా మొగుని తల్లి చనిపోయెనే” అని ఏడ్చుచున్నదట. అపుడు ప్రక్కనున్న ఓ అమ్మగారు చిన్నగా గిల్లి (గిచ్చి), అలా ఎందుకు ఏడుస్తావే, “ మా అత్త చనిపోయెనే” అని ఏడ్వవే అని గుట్టుగా చెప్పగా, ఆమె “నాకు అంతచుట్టు నోరు తిరగదమ్మా ” అని ఏడ్చినదట”. అనగా నా మొగుని తల్లి అనడం సులభం. మా అత్త అనడం చాలా చుట్టు కష్టము. ఇదండి వరుస, లేని మమకారం రావాలంటే ఎలా వస్తుంది. “కిమకుర్వతు సంజయ” ఏమి చేసిరయా సంజయా! అని ధృతరాష్ట్రుడు అడుగుచున్నాడు. ఆయుధాలు ధరించి, రథాలు ఎక్కి, యుద్ధభూమికి వెళ్ళినవారు “ఏమి చేస్తారు –విందారగిస్తారా? ఆడుకుంటారా? యుద్ధం చేస్తారు”. ఈ విషయం ధృతరాష్ట్రునికి తెలియకనే అడిగినాడా? తెలిసి అలా ఎందుకు అడుగుతాడు. ఇందు గురించి తెలుసుకుందాము.

కురుక్షేత్రం అనే పుణ్యభూమి నా కుమారుల పేర వుంది కదా! ఆ ప్రభావం వల్ల నా కొడుకుల పుణ్యం పండి, సహజంగా ధర్మస్వరూపుడైన ధర్మరాజు మనసేమైనా మారి, ఈ శేషజీవితానికై, నా స్వార్థం కొరకై ఇంతమంది యుద్ధంలో చావడం ఎందుకని యుద్ధమేమైనా విరమించెనా? అట్లుగాక నా కుమారుడైన సుయోధనునికి ఆ స్థల ప్రభావం వల్ల మనసేమైనా మారి, వారు కోరినట్లు ఐదూళ్ళేమైనా ఇచ్చి, యుద్ధం విరమించెనా? అనే ఆశతో ఇట్లుడుగుటకు కారణమైనది. ఈ ధృతరాష్ట్రుని ప్రశ్నకు సంజయుని జవాబు బహు చమత్కారముగా ఉన్నది. మహారాజా! మీ ప్రశ్నకు జవాబుసైతము మీ ప్రశ్నలోనే ఉన్నది. ఇక నేనెందుకు చెప్పాలి అంటాడు సంజయుడు. అదెట్లయా సంజయా, మా వారలు, పాండవులు ఏమి చేసినారని నేనడుగుచుండ అందులోననే జవాబున్నదంటున్నావే అదెట్లు సాధ్యం? అనగా, మహారాజా మీ వాక్యం "ధర్మ" తో మొదలయి "జయ"తో పూర్తి అయినది. అందుచే "యతో ధర్మస్తతో జయ:" అన్నట్లు ధర్మం ఎక్కడ ఉండునో, జయం అక్కడ వుండునని నీవే పలుకుచున్నావు. కావున నీ పుత్రులు ధర్మాత్ములైతే మీ పుత్రులే జయిస్తారు. పాండవులు ధర్మాత్ములైతే పాండవులే జయిస్తారు. అంతేగాక నీ వాక్యంలో మొదటి అక్షరం "ద" చివరి అక్షరం "య" రెండిటిని చేర్చగా "దయ" అనగా దయగల హృదయమే భగవన్నిలయము" ఇంకొక అర్థము ఈ ఒకటవ శ్లోకానికి చివరిదైన ఏడువందల ఒకటవ శ్లోకము జవాబు. అది ఏదనగా

**శ్లో ॥ యత్రయోగేశ్వర: కృష్ణో, యత్రపార్థో ధనుర్ధర:**
**తత్ర: శ్రీర్విజయోభూతి, ధ్రువానీ తి ర్మతిర్మమ॥**

అనగా యోగీశ్వరేశ్వరుడైన శ్రీకృష్ణుడు, ధనుర్ధారి అయిన అర్జునుడు ఎక్కడ వుందురో, అక్కడ విజయం వుండును. కృష్ణార్జునులు వారి పక్షాన ఉన్నారు కనుక విజయం వారి పక్షానే ఉండునని ఊహించి తెలిపెను. ఇంకొక అర్థము శ్రీమద్భగవద్గీత మొట్టమొదట శ్లోకంలో మొదటి రెండక్షరాలు "ధర్మ", చిట్ట చివరి శ్లోకంలో చివరి రెండక్షరాలు "మమ" అనగా ధర్మం, మమ నావృత్తి అని ధర్మంతో ప్రారంభమై మమతో పూర్తయినది భగవద్గీత.

మనము ఇంతవరకు భగవద్గీతలోని మొదటి శ్లోకానికి విశేషార్థాలు తెలుసుకోగలిగినాము. రెండవ శ్లోకంలోకి ప్రవేశించక మునుపే కొన్ని పూర్వాపరాలు తెలుసుకొని ముందుకు వెళుదాము.

సంజయున్ని ధృతరాష్ట్రుడు యుద్ధ విశేషాలు చెప్పమని అడిగినా అతడెట్లు చెప్పగలిగినాడు? అనే అనుమానం కలుగవచ్చు. యుద్ధం ప్రారంభం అయిన వెంటనే యుద్ధ విశేషాలు ఎప్పటికప్పుడు నేను తెలుసుకోవాలి. ఈపని ఎవరైతే చేయగలరని ధృతరాష్ట్రుడు వ్యాసభగవానుని స్మరిస్తాడు. స్మరించిన వెంటనే ధృతరాష్ట్రుని ఎదుట వ్యాసభగవానుడు ప్రత్యక్షమౌతాడు. ఏమయ్యా ధృతరాష్ట్ర మహారాజా, నన్ను స్మరించిన విశేషమేమనగా నమస్కరిస్తూ స్వామీ మహానుభావా నేను యుద్ధ విశేషాలు వెంటవెంటనే తెలుసుకోవాలనే తన కోరికను తెలియ జేస్తాడు. ఆయన కరుణించి, ఆ విధంగా తెలుసుకునే దివ్యశక్తిని సంజయునికి ప్రసాదించి, అక్కడి యుద్ధ విశేషాలు వెంట వెంటనే ధృతరాష్ట్రునికి తెలియ జేయునట్లు వరమిస్తాడు. ఈ సంజయుడు ఎవరనగా, భారతంలో ప్రతి ఒక్కరికీ గుణాలకు తగినట్లు గానే పేర్లు పెట్టినాడు వ్యాసుడు. సంజయుడు అనగా "సమ్యక్ జయ: యస్య" సంజయ: అనగా ఇంద్రియాదులను చక్కగా జయించినవాడని అర్థము. ఆ పేరుకు తగిన

గుణాలు కలవాడే సంజయుడు. ఈతడు "గవాల్గనుడు" అను సూతుని పుత్రుడు "కులాన్ని చూడవద్దు గుణాన్ని చూడమంటుంది భగవద్గీత" సంజయుడు భక్తుడు, జ్ఞాని, జితేంద్రియుడు. ఈ అర్హతలు ఉండబట్టే యుద్ధంలో జరిగేవన్నీ చూసే దివ్యదృష్టిని, దివ్యశక్తిని పొందగలిగినాడు సంజయుడు. ఈ భగవద్గీతను విన్నవారు అర్జునుడు, సంజయుడు, ధృతరాష్ట్రుడు, కేతనముపై ఉన్న ఆంజనేయుడు. ఈ నలుగురు మాత్రమే వినగలిగినారు. ఇందులో ధృతరాష్ట్రుడు తప్ప మిగతా ముగ్గురు తరించినారు. సంజయుని చమత్కారమైన జవాబుతో తృప్తిపడని ధృతరాష్ట్రుడు యథాతథంగా జరిగినది జరిగినట్లు తెలియజేయమని కోరగా సంజయుడు ఇట్లు తెలియజేయుచున్నాడు. మహారాజా! కౌరవ, పాండవుల ఉభయసైన్యాలు ముఖాముఖిగా ఉండిన సందర్భములో శ్రీకృష్ణునితో అర్జునుడు అంటాడు " శ్రీకృష్ణా ఉభయ సైన్యాల మధ్య మన రథాన్ని నిలుపుము. నేను అందరినీ ఒకతూరి చూడవలయును అనెను" సరేనని శ్రీకృష్ణుడు అర్జునుని రథాన్ని, కురుపాండవ సైన్యాల మధ్య భీష్మ, ద్రోణ, కృపాచార్యుల ముందర నిలిపెను. తన ఎదుట ప్రాణాలకు తెగించి, వయోవృద్ధులయి వుండియు అమితోత్సాహముతో యుద్ధానికి సిద్ధమయిన తాతలను, గురువులను, తండ్రులను చూసేటప్పటికి మన వీరుడు భీరువు అయినాడు. అంతేకాక శ్రీకృష్ణుడు అర్జునా నీ ఎదుట నీతో యుద్ధం చేయుటకు సంసిద్ధులైనటు వంటి నీ చిన్ననాటి విద్యా గురువులైన వారే కృపాచార్యులు పైగా మీ తండ్రి గారికి ప్రియమైన బాల్య స్నేహితుడు. బాగా గుర్తుంచుకో? తరువాత ఆ ప్రక్కనే వున్నవారు మీ గురుదేవులు, ద్రోణాచార్యులు వారు తన కుమారుని కంటే నీపై ఎక్కువ ప్రేమ కనపరచెడివారు. అంతేగాక విజయా తన కుమారునికి తెల్పని యుద్ధరహస్యాలను నీకు తెలిపి ధనుర్ధారులలో నిన్ను

మించినవాడు ఈ భూమండలంలో ఎక్కడా లేకుండా తయారు చేస్తానని నీకు వాగ్ధానం చేసి, ఆమాట నిలబెట్టుకునే నిమిత్తమై లోకనిందను సైతం లెక్క పెట్టక ఏకలవ్యుని అంగుష్ఠాన్ని గురుదక్షిణగా కోరిన మహానుభావుడు ఆయనను బాగా గుర్తుంచుకో. తరువాత ఆయన ప్రక్కనే రెండవ రుద్రుని వలె ప్రకాశిస్తున్న గంభీరమూర్తి మీ తాత భీష్ముడు. అతడు మిమ్ములను చిన్ననాటి నుండి ఎంతో ప్రేమతో, పెంచి పెద్దజేసి, విద్యాబుద్ధులు నేర్పిన మహానుభావుడు బాగా గుర్తుంచుకో. అర్జునా ఆయన ప్రక్కనే గొప్పయుద్ధ విద్యా విశారదుడు, రెండవ ద్రోణాచార్యుడు అని చెప్పదగిన ప్రతిభావంతుడు, దీక్షాదక్షుడు అశ్వత్థామ అంటూ తాతల పేర్లు, తండ్రుల పేర్లు, గురువుల పేర్లు చెబుతుంటే అర్జునునిలోని పరాక్రమము శౌర్యము అంచెలంచెలుగా తగ్గుతూ వస్తోంది. అప్పుడు అర్జునుడు దీనవదనుడై బావా! నేను క్షత్రియుడనైనందుకు వీరుడనైనందుకు ఇలాంటి బంధువులను, తండ్రులను తాతలను, గురువులను, గురుపుత్రులను సంహరించవలసిందేనా? ఈ బంధుమిత్రాదులను, నావారిని చంపుటకు నా చేతులాడుట లేదు. శరీరం వణుకుచున్నది. నోరు తడి ఆరిపోవుచున్నది. నాకండ్లు తిరుగుచున్నవి. శరీరమంతా గగుర్పాటు కలుగుచున్నది. నేనేవిధంగా యుద్ధం చేయగలను. అంటూ విలపిస్తూ ధనుర్బాణములు క్రిందవైచి రథంలో కూలబడినాడు అర్జునుడు. తన జీవిత చరిత్రలో యుద్ధమంటే దు:ఖపడటము, మమకారాలచే బంధింపబడి ఏడ్వటం, ఇదే మొదటిసారి. అర్జునుని జీవితంలో లేకలేక ఒకసారి ఏడిస్తే, భగవద్గీత బయటకు వచ్చింది. శ్రీరామచంద్రుడు ఏడ్చితే వశిష్టగీత బయటకు వచ్చింది. పరీక్షిత్తుడు ఏడ్చితే భాగవతం బయటకు రావడం జరిగింది. ఈ ముగ్గురి ఏడ్పులు ఎంత మంచివో కదా! వీరి ఏడ్పులే కనుక లేకపోతే మనకు ఈ మూడు గ్రంథాలు లభించేవి కావేమో? అసలు అర్జునునకు ఈ తాతలు, తండ్రులు గురువులు ఉత్తర గోగ్రహణంలో

కనిపించలేదా? మరి ఆ రోజు ఎందుకు ఏడ్వలేదు? నివాత కవచ కాలకేయాదులను సంహరించునపుడు, ఖాండవ దహనమప్పుడు, యతివేషంలో సుభద్రను తెచ్చునప్పుడు, ద్రుపద మహారాజును బంధించి తెచ్చునప్పుడు ఎన్ని యుద్ధాలు చేయలేదు. అన్ని యుద్ధాలలో లేని కరుణరసము అర్జుననకు ఇప్పుడే ఎందుకు వచ్చింది? అనే సందేహం మీకు కలుగవచ్చు. ఆ విషయాన్ని కూడా తెలుసుకుందాము. అర్జునుని రథము రెండు సైన్యాల మధ్య నిలిపి, చూడు అదిగో మీతాత, మీ గురువు అంటూ పేరు పేరున వారి గొప్పతనాన్ని వర్ణించి చెప్పకుంటే అర్జునునికి తెలియదా! అతనికి కనపడదా! అర్జునునికి చత్వారి, దృష్టి దోషము వంటి లోపాలు లేవు కదా! మరి అలాంటప్పుడు ఆ విధంగా ఎందుకు చెప్పవలసి వచ్చింది. ఆ పెద్దలను చూపిస్తూ వారి గొప్పతనమును వర్ణించి చెబుతుంటే దు:ఖించక ఏమి చేస్తాడు ఇదే రథాన్ని దుష్ట చతుష్టయం ఎదుట రథమును నిలిపి అర్జునా! చూడు ఇతడు దుశ్శాసనుడు. ద్రౌపదిని కొప్పుపట్టి సభకు ఈడ్చిన దుర్మార్గుడు. ఈతడు దుర్యోధనుడు. భీముని పాములచే కరిపించి గంగానదిలో త్రోయించిన వాడు. ఈతడు శకుని. మాయా ద్యూతమున మీ సంపదలను హరించి మిమ్ము అరణ్యాల పాలు చేసిన మహా పాపి అంటూ వారినే గనుక చూపించి ఉంటే వెంటనే ధనుస్సు అందుకొని వారిపై యుద్ధము చేసి వుండెడి వాడు. కానీ అది ఆ దేవదేవునికి ఇష్టం లేదేమో. ఇక్కడ మమకారపాశానికి బద్ధుడైనాడు అర్జునుడు.

ఒక ఉపాధ్యాయుడు బడిలో పిల్లలకు పాఠాలు చెపుతూ, “పాపము చేయరాదు, ఒరుల మనసు నొప్పించరాదు. పరదారధనాదుల కోరరాదు” ఇలాంటి పాపపు పనులు చేసిన వారిని యముడు తన పాశముతో బంధించుకొని యమలోకమునకు ఈడ్చుకపోయి, అక్కడ అగ్ని గుండాలలో

వేసి కాల్చడం, వాతలు పెట్టడం వంటి, మొదలగు క్రియలచే పాపాత్ములను శిక్షించును. అని పాఠం చెబుతుండగా ఒక గడుగ్గాయి పాశము అంటే ఏమిటి సార్ అంటాడు. అది ఒక తాడురా. వీని మెడకు వేసి లాక్కొని పోయేది అని చెబుతాడు టీచర్. అలాగైతే సార్ ఆయనకు తాళ్ళు ఉత్పత్తి చేసే ఫ్యాక్టరీ ఉందా? యమలోకంలో, అట్లు లేకున్న ఇన్ని కోటాను కోట్ల జీవరాసులకంతా తాళ్ళు ఎలా సమకూరుతాయి సార్ అన్నాడట. ఆ ఫ్యాక్టరీలో ఉద్యోగానికేమైనా దరఖాస్తు పెట్టుకుందామనుకున్నాడో ఏమో? అప్పుడా టీచర్ ఇలా అంటాడు. ఆయన తీసుకురావడమెందుకురా? వీడే మెడకు తగిలించుకొని రడీగా ఉన్నాడు, అవి ఏమనగా ?

**శ్లో ॥ ఘృణా లజ్జా భయం చింతా, జుగుప్సా చేతి పంచమీ,**
**కులం శీలంచ మానంచ, అష్టపాశా: ప్రకీర్తితా:**

సిగ్గు, భయము, చింత, ప్రేమ, మమకారము, అభిమానము, కులము, సౌశీల్యము, మానము మొదలగు త్రాళ్ళు పెనవేసుకొని, మెడకు తగిలించుకొని సిద్ధంగా ఉంటారు. ఆయన రావటమే తడువు, వాటిని బట్టి లాగడమే తడవు, వీడు రడీ చేసి పెట్టుకొని ఉంటాడు. అని చెప్పెనట. ఆ విధంగా దు:ఖార్తియై అర్జునుడు ఇంకా ఈవిధంగా పల్కు చుండెను. "బావా! అనేకానేకులు మాప్రక్క మరియు కౌరవుల ప్రక్కన యుద్ధం చేయుటకు, ప్రాణాలు వదలుటకు, కృతనిశ్చయులై వున్నారే, వీరంతా మా స్వార్థానికి బలి కావలసిందేనా? ఆవిధంగా వారంతా యుద్ధంలో మరణిస్తే, వంశక్షయం, కులక్షయం, చేసిన పాపం రాదా? ఆవిధంగా వీరులు యుద్ధంలో మరణిస్తే, ఆ స్త్రీలు కులభ్రష్టులై నీచమైన పనులకు పాల్పడి, దేశమంతా వర్ణసంకరము కావలసిందేనా? అంటూ పెద్ద వేదాంతిలా ధర్మాలు వల్లిస్తున్నాడు అర్జునుడు.

ఇక్కడ "దండు నశిస్తుందే అని ధనంజయుని బాధ – ధర్మం నశిస్తుందే అని దామోదరుని బాధ". దండు పోయినా ఫరవాలేదు కానీ, ధర్మం పోయిన దీని లోటు తీర్చలేనిదని దామోదరునికి తెలుసు. అర్జునుడు అనేక రకాలుగా విలపిస్తున్నా, అనంతుడేమీ మాట్లాడలేదు. బావా! ఒకవేళ ఈ యుద్ధము వల్ల నాకు త్రిలోక సుఖములు వచ్చిననూ, నాకు ఆ సుఖములు వద్దు. అంతేగాక, నేను నిరాయుధుడినైవుండిన, నన్ను అందఱు కలిసి హతమార్చినా సంతోషమేగాని, నేను మాత్రం యుద్ధం చేయనని గొప్పగా చెబుతున్న అర్జునుని చూసి శ్రీకృష్ణపరమాత్మ అంటాడు అర్జునా! మూర్ఖులు అవలింబించునది, స్వర్గప్రతిబంధకమయినది, అపకీర్తిని కలుగజేయు యీ వ్యామోహము నీకెక్కడ దాపురించినది, అదియును గాక అర్జునా!

**శ్లో ॥ క్లైబ్యంమాస్మగమః పార్థ నైతత్త్వయ్యుపపద్యతే**
**క్షుద్రం హృదయ దౌర్బల్యం త్యక్త్వోత్తిష్ఠ పరంతప॥**

ఇక్కడ "క్లైబ్యం" అను పదమును ఉపయోగించినాడు శ్రీకృష్ణుడు. "క్లైబ్యం" అనగా "షండుడా" అని అర్థము. అర్జునా ఇంతపని చేసి, ఇంతమందిని యుద్ధానికి పురికొల్పి, అందరూ సిద్ధమైన ఈవేళ యీ నీచ నికృష్టమయిన "మమకారం" అనే చెడువ్యాధి నీకెట్లు దాపురించెను. లేదులే, ఆ షండత్వము నీకు అజ్ఞాతవాసకాలంలో మాత్రమే ఉండినదను కొంటిని. ఆ షండత్వము నీలో ఇంకా వున్నట్లు ఇపుడు నాకర్థమవుచున్నది. అంతియేగాక! అర్జునా! కులాచార ధర్మప్రకారం క్షత్రియుడవైన నీవు యుద్ధం చేయాలి. రాజ్యపాలన చేయటం క్షత్రియుల ధర్మమైవుండ, యుద్ధం చేయలేననే దీనస్థితి నీకెందులకు వచ్చినది అంటూ శ్రీకృష్ణుడు ఎన్ని చెప్పినా, వాటినన్నిటికీ అన్ని సమాధానాలు చెబుతున్నాడు అర్జునుడు. యుద్ధం చేయమని, అది నీ ధర్మమని, తప్పుకాదని



**మనిషి పెరగాలనుకుంటాడు. కానీ వృద్ధాప్యం అంటే భయపడతాడు. మనిషి జీవించాలనుకుంటాడు కానీ మృత్యువు అంటే భయపడతాడు.**

శ్రీకృష్ణుని బోధ. అది నావల్ల కాదు. మా వారినందరిని హతమార్చిన తరువాత ఆ ఇంద్ర సౌఖ్యాలు లభించినా, అవినాకు ఆనందమును కలుగజేయవు అంటాడు అర్జునుడు. వీరి వాదము అంతా విన్నాడు పతాకంపై వున్న ఆంజనేయుడు. ఇక ఎక్కువ సేపు వినలేక, ఎదుట నిలచి స్వామీ! నీవు సెలవిస్తే తృటిలో వీరందరినీ సంహరిస్తానంటాడు ఆంజనేయుడు.

అప్పుడంటాడు శ్రీకృష్ణుడు "హనుమా! ఏమి నీ అహంకారము. అర్జునుడు యుద్ధం చేసేది, లేనిది నాకు తెలియదా. ఎవరు ఎపుడు ఏమి చేయాలో, ఎవరితో ఏమి చేయించాలనో ఆ విషయం నాకు తెలియదా? అయినా అహంకారంతో నేను చంపుతాను అందరినీ అంటూ ముందుకొచ్చినందుకు, అహంకారపూరితుడవైనందుకు నీవు పిశాచమైపోవుదువు గాక"! అని శపిస్తాడు శ్రీకృష్ణుడు. వెంటనే ఆంజనేయుడు నా పొరపాటును మన్నించండి స్వామీ! అంత కఠోరశాపమా స్వామీ! దాని నివారణ తెలియజేసి నన్ను కృతార్థుని చేయండి స్వామీ! అంటూ దీనంగా ప్రార్థించగా, "సరే ఇపుడు నేను బోధ చేయు భగవద్గీతకు పిశాచినివై వ్యాఖ్య వ్రాయుము. నీ వ్యాఖ్య పూర్తి కాగానే నీశాపము తొలగిపోతుంది" అంటాడు శ్రీకృష్ణుడు. ఆవిధంగా ఆంజనేయుడు పిశాచంగా వుండినప్పుడు వ్రాసిన వ్యాఖ్యకే "పైశాచిక భాష్యము" అని పేరు. ఆవిధంగా పిశాచంగా వుండి, గీతకు వ్యాఖ్య వ్రాసి శాపనివృత్తి పొందుతాడు ఆంజనేయుడు.

ఏమిదీ, నావల్ల మహానుభావుడైన వీరహనుమంతుడు ఇట్టి ఘోరశాపమును పొందుటయా, అని అర్జునుడు చాలా పశ్చాత్తాపపడి తన సంశయాలన్నీ శ్రీకృష్ణుని ద్వారా నివృత్తి చేసుకుంటాడు. విషణ్ణ వదనుడై, దీనవదనుడై, కృపణుడై, యుద్ధానికి అయిష్టుడైవున్న అర్జునునితో ఇంకా ఇట్లు అంటాడు మధుసూదనుడు. అర్జునా! ఈ యుద్ధ ప్రయత్నము ఈరోజే అకస్మాత్‌గా

చేసినది కాదే? శత్రుసంహార నిమిత్తమై కాయలు, దుంపలు తిని కైలాసనాథుని మెప్పించి పాశుపతాస్త్రము పొందావు. దేవలోకానికి వెళ్ళి దేవేంద్రాదులతో దివ్యాస్త్రాలు పొందావు. అరణ్యవాసం, అజ్ఞాతవాసం ముగించావు. నియమప్రకారం భాగమివ్వమని అడిగితే వారివ్వగలిగిరా? జరిగేది జరుగక మానునా? అసలు "విజయుడు" అనే సార్థక నామధేయుడివే, సుక్షత్రియుడవైన నీకు ఈ వైరాగ్యం ఎలా వచ్చింది. నీ ఈ ప్రవర్తన నీకే కాదు, నీ వంశీయులైన రాజన్యులందరకు తీరని కళంకము, మాయనిమచ్చ. ఫల్గుణా, యుద్ధము క్షత్రియులకు రాచబాట అని నీవెఱుంగవా? నీవు యుద్ధం వదిలిపోతే తీరని అపకీర్తిపాలు అవుతావు. నీ జీవితంలో "విజయుడు" అనే పేరుకు ఎలాంటి మచ్చ లేకుండా కాపాడుకున్నావు. యావజ్జీవితం కాపాడుకున్న నీకీర్తి ఒక్క దెబ్బతో గంగపాలయిపోతుంది. కనుక ధనంజయా క్షుద్రమైన హృదయ దౌర్బల్యాన్ని పరిత్యజించు.

అర్జునా! ఈ దౌర్బల్యం నీకేల కలిగినది. ఊర్వశి శాపఫలితం వలన కలిగిన ఆ షండత్వము అజ్ఞాత వాసముతో తీరిపోలేదా. అంతియేగాక, పరుగుపరుగున వచ్చి నిద్రిస్తున్న నన్ను లేపి సహాయముగా రమ్మని నన్ను కోరడం " ఈ దద్దమ్మ పౌరుషం నా యెదుట చూపేందుకేనా" అంటూ క్షాత్ర రక్తాన్ని కదిలించే శ్రీకృష్ణుని ఇంజక్షన్ అర్జునునిపై కొంతపని చేసింది. అప్పుడు అర్జునుడు మాధవా? యుద్ధంలో నా యెదుట వుండేవారు. తండ్రిలేని బిడ్డలము అయిన మమ్ము దగ్గర జేర్చి, విద్యాబుద్ధులు నేర్పిన మహానుభావుడు భీష్ముడు, మాతాతగారు. "అశ్వత్థామ కామపుత్రుడు – అర్జునుడు ప్రేమ పుత్రుడు"అంటూ కొడుకు కంటే మిన్నగా నన్ను అభిమానించి, అస్త్ర విద్యలలో ప్రవీణునిగా జేసిన గురువర్యుడు ద్రోణాచార్యుడు. వారు నేర్పిన విద్యతో వారినే ఎదురించి చంపుటయా? బాగుంది "గురోరధీతం గురవే నివేదితం" అన్నట్లు గురువుగారి

విద్యతో గురువునే సంహరించుటయా? ఇది భస్మాసుర సంప్రదాయం కానీ, భారతవీరుల సంప్రదాయము కాదే, పూలతో పూజించదగిన పుణ్యమూర్తులను బాణాలతో హింసించుట కంటే అనార్య లక్షణము యింక ఏదైనా కలదా యుద్ధం మానితే అపకీర్తికరమని, అస్వర్గమని, నీవేమో చాలా చెబుతావు. నీవు మధు సూదనునివే, అరిసూదనునివే, సరేసరి, నాకు తెలుసు. గురుసూదనునివి, బంధుసూదనునివి" కాలేదు కదా? ఈ యుద్ధము శత్రువులతో చేసే యుద్ధము కాదుగదా? గురు బంధువులను చంపుట న్యాయమా? చంపక మానుకొనుట న్యాయమా? నీవే గురుబంధువులను చంపమని ప్రోత్సహించితే ఇక జగత్తులో ఒక్క గురువూ మిగలడు. గురువులకు మహాప్రళయం వచ్చినట్లే. నీకీపని అనుభవంలో జరుగలేదు. గురువులను చేజేతులారా చంపే గ్రహచారం నాకు మాత్రమే కలిగింది. తపో విద్యా బ్రహ్మచర్యాది సుగుణ సంపన్నులను, మనకు మేలును కోరు మహానుభావులను బలిచేసి ఈ అర్థ, కామాది భోగాలను అనుభవించుట కంటే బిచ్చమెత్తి బ్రతకడం మంచిది కాదా?

శ్రీకృష్ణా! నా చిత్తము గజిబిజి అయినది. నా బుద్ధి పని చేయడం లేదు. ఈ గండాంతర సమస్య నన్ను ఉక్కిరి బిక్కిరి చేయుచున్నది. స్వామీ! నా రథాన్నే కాదు, నన్ను కూడా నడిపే నాథునివి నీవే? ఈ అఖండ భూమండలాధిపత్యమే కాదు, అమరేంద్ర సింహాసనము లభించినా నాకు కలిగిన ఈ హృదయాంతర్వేదన, ఇంద్రియతాపము తీరదు. ఆగదు. ఇక "పాలముంచినా, నీళ్ళముంచినా " భారంనీదే, అంటూ విచార సాగరంలో మునిగి తేలుతున్నాడు అర్జునుడు. ఓం ప్రథమంలో యుద్ధభూమిని ప్రవేశించునప్పుడు అర్జునునిలో ద్వేషప్రవృత్తి వుండినది. ఆ ద్వేష వృత్తి ప్రభావం వలననే శ్రీకృష్ణునిపై "హుకుం" జారీ చేశాడు. ఉభయసైన్యాల

మధ్య మన రథాన్ని నిలపమంటూ భీష్మ ద్రోణాదులను చూసేటప్పటికి ఆ ద్వేషవృత్తి తొలగిపోయి మమకారవృత్తి కలిగినది. ఆ మమకారవృత్తికి వివశుడై, ధీరవీరుడైన అర్జునుడు దీనహీనుడైనాడు.

"ఆత్మ యొక్క పరమాత్మ జ్ఞానము లేకపోవడమే అజ్ఞానము" తక్కిన ఏ దోషాలు లేవుకానీ, అర్జునునికి ఈ దోష మిదొక్కటే. కాబట్టి భగవంతుడు ప్రారంభములోననే జ్ఞానబోధ చేయడం జరిగింది. అజ్ఞానం అన్ని దోషాలకు మూలము. అది ఒక్కటి వుంటే అన్ని దోషాలు వున్నట్లే. ఎవడో అన్నాడట "నాకే రోగము లేదు – ఒక్క క్షయరోగము తప్ప" అన్నట్లు, అదొక్కటే చాలదా! అర్జునుడు తనతప్పును తాను తెలుసుకున్నాడు. తనతప్పును తాను తెలుసుకోవడమే శిష్యునికి, భక్తునికి ప్రథమ సుగుణము. ఇంతవరకు అర్జునుడు ప్రభువు, యజమాని, ఇప్పుడు అర్జునుడు శిష్యుడు, భక్తుడు. తెలియని మూఢునకు తనకు తెలియదనే సంగతి కూడా తెలియదు. మూఢత్వం పెరిగినకొలది నాకంతా తెలుసుననే అహంకారం పెరుగుతుంది. "నాకేమి తెలియదనే తెలివి రావాలంటే ఎంతో తెలివి కావాలి" నీలో ఎంత జ్ఞానం వుందో అనికాక, ఎంత అజ్ఞానము వుందో చూసుకోమంటాడు సోక్రటీస్". ప్రియమైన ఆత్మ స్వరూపులారా! భక్తులారా! మీరు ఇంతవరకు అర్జునుని విషాదము గురించి క్లుప్తంగా తెలుసుకున్నాము. అక్కడ దుర్యోధనుని పరిస్థితి గురించి కొంత తెలుసుకొని ముందుకు ప్రయాణించుదాము.

**సంజయ ఉవాచ:**

**శ్లో ॥ దృష్ట్వాతు పాండవానీకం – వ్యూఢం దుర్యోధన స్తథా**
**ఆచార్య ముపసఙ్గమ్య – రాజా వచన మబ్రవీత్.**



**ఆధునిక కాలంలో దౌత్యవేత్త అన్నవాడు హెడ్ వెయిటర్‌తో సమానం. పాపం అతను క్షణం కూడా కూచోడానికి వీల్లేదు.**

ఇది భగవద్గీతలోని రెండవ శ్లోకము. దుర్యోధనుడు ద్రోణునితో చేసే ప్రసంగము. భగవద్గీతా గ్రంథములో ధృతరాష్ట్ర ప్రసంగము చేసే చోట "ధృతరాష్ట్ర ఉవాచ" అని, అర్జునుడు మాట్లాడేటప్పుడు "అర్జున ఉవాచ" అని, శ్రీకృష్ణుడు మాట్లాడేటప్పుడు "శ్రీభగవానువాచ" అని అంటారు. దుర్యోధనుడు మాట్లాడేటప్పుడు ఎందుకో "దుర్యోధన ఉవాచ" అని అనలేదు. ఇక్కడ ఒకటి, రెండు శ్లోకాలు కాదు, ఏకంగా తొమ్మిది శ్లోకాలు దుర్యోధనుని సంభాషణ లున్నవి. అయినా ఎందుకో, "దుర్యోధన ఉవాచ" అని వాడలేదు. దుష్టాత్ముడైన దుర్యోధనుని స్మరణ ఎందుకని, కావాలనే వర్జింపబడినది అని పెద్దల అభిప్రాయము.

దుర్యోధన శబ్దము వాడక "రాజా వచన మబ్రవీత్ అని సంజయుడు వాడుట సమంజసముగానే యున్నది. ఆ సమయంలో దుర్యోధనుడు పరాక్రమవంతుడు, ధీరోధాత్తుడు అయిన భీష్మడే యుద్ధంలో నేలకొరిగినాడని భయభ్రాంతుడైనాడు కాబోలు. ద్రోణాచార్యుని పంచన జేరినాడు. శిష్ట సంప్రదాయము తెలిసిన వాడయివుంటే, ఆచార్యుని చేరిన వెంటనే అభివాదనము చేయాలి. తర్వాత ప్రసంగించవలె. కానీ దుర్యోధనుడు అలా చేయలేదు. వెళ్ళిన వెళ్ళడంలోనే "హుకుం జారీ చేయడం ప్రారంభించినాడు. "అంధుని కొడుకు వివేకాంధుడని ఋజువు చేసుకున్నాడు" కాబోలు ఒకవేళ తను రాజు కదా, తన సేనానికి తను ఎందుకు నమస్కరించవలె అనుకుంటే, తాను రాజుననే అభిప్రాయము, ద్రోణాచార్యుడు సేనాధిపతి అనే అభిప్రాయం వుంటే సేనానిని తన చెంతకే పిలిపించు కొనవలెను, తనే అతని దగ్గరికి వెళ్ళినందున ఆ నియమమూ భంగమైనది. ఇంతకూ అవివేకికి ఒక క్రమము లేదు. మార్గము లేదు. అంతా అస్తవ్యస్థమై వుంటుంది కాబోలు దుర్యోధనుని పరిస్థితి "అతోభ్రష్టా తథోభ్రష్టా అన్నట్లున్నది

తరువాత దుర్యోధనుడు ద్రోణునితో ఆచార్యవర్యా! అటుచూడండి. ద్రుపద మహారాజు కొడుకు, మీ శిష్యుడూ, బుద్ధిమంతుడూ అయిన ధృష్టద్యుమ్నుని చేత వజ్రవ్యూహాకారంగా తీర్చబడిన పాండవుల సేన చూస్తున్నారు కదా! అని దుర్యోధనుడు అడగడంలో ఒక రహస్యం ఇమిడివున్నది.

సుయోధనుడు గురుదేవా పాండవుల సేనను చూస్తున్నారు కదా అని దుర్యోధనుడు అడగడంలో రహస్య మేమనగా, ధృష్టద్యుమ్నుడు అని నేరుగా అనక ద్రుపద పుత్రుడు అనడంలో ఓ ఆంతర్యమున్నది. అది ఏమనగా నీతో అవమానం పొందిన ద్రుపదుడు నిన్ను హత మార్చుటకై అతన్నికన్నాడు. కనుక సావధానంగా జాగ్రత్తగా ఉండమని ఒక హెచ్చరిక మరియు ద్వేషాన్ని పురికొల్పే కుతంత్రము. నీ శిష్యుడని బుద్ధిమంతుడని ధృష్టద్యుమ్నుని గురించి చెప్పడంలో సయితం కుతంత్రమే ఉన్నది. నీకు మృత్యువుగా పుట్టినవానికి అస్త్ర విద్య నేర్పి అవివేకం చేసుకున్నావని ఒక ఎత్తిపొడుపు. నీ శిష్యుడే గనుక నిన్ను మించిపోతాడా అతన్ని మించిన శక్తి గురువు అయిన నీకుంటుందని ఒక ప్రోత్సాహము. ధృష్టద్యుమ్నుని బుద్ధిమంతుడనటంలో "విద్య నేర్పిన గురువునే హతమార్చేందుకు ప్రయత్నించినవాడు భలే బుద్ధిమంతుడు గదా" అంటూ ఎన్నో అర్థాలతో ప్రయోగించిన మాట. తన సేన పదకొండు అక్షౌహిణులు ఉండగా

ఏడు అక్షౌహిణులు ఉన్న పాండవసేనను "మహాసేన" అనడంలో అర్థమేమి? పాప హృదయాలకు ధర్మపక్షము ప్రబలంగా కనపడడం। సహజమేమో అక్షౌహిణి అనగా 21,870 ఏనుగులు, 21,870 గుఱ్ఱాలు 1,09,350 మంది సైనికులు కలిసి ఒక అక్షౌహిణి. ఇక్కడొక చిన్న విశేషాన్ని గూర్చి తెలుసుకుందాము. ఆ గీతా చార్యునకు 18 సంఖ్య అంటే ఎందుకు అంత యిష్టమో, ఆ యిష్టము గీతాచార్యుడైన శ్రీకృష్ణునికే ఇష్టమో లేక వ్యాస

భగవానునికే ఇష్టమో తెలియదు. ఆ 18ని గూర్చి తెలుసుకుందాము. 18ని కూడితే 9 వస్తుంది. తొమ్మిది పూర్ణసంఖ్య తొమ్మిదిని మించిన సంఖ్య లేదు.

| | | | |
|---|---|---|---|
| **భగవద్గీతలో ఆధ్యాయాలు** | | **18** | **9** |
| **అక్షౌహిణి** | | **18** | 18 - 9 |
| ఏనుగులు | 21,870 కూడితే | | 18 - 9 |
| రథాలు | 21,870 కూడితే | | 18 - 9 |
| గుఱ్ఱాలు | 65,610 కూడితే | | 18 - 9 |
| సైనికులు | 1,09,350 కూడితే | | 18 - 9 |
| అన్నింటినీ కలిపి | 2,18,700 కూడితే | | 18 - 9 |
| మహాభారత యుద్ధం జరిగిన రోజులు | | | 18 - 9 |
| మోక్షానికి సోపానాలు | | | 18 - 9 |
| యజ్ఞములో ఋత్విక్కులు | | | 18 - 9 |
| 2వ ఆధ్యాయములో ఆత్మవర్ణన శ్లోకములు | | | 18 - 9 |
| 2వ ఆధ్యాయములో స్థితప్రజ్ఞలక్షణ శ్లోకములు | | | 18 - 9 |
| భారతము | 18 పర్వాలు | | 9 |

18 గురించి దాని గొప్పతనాన్ని గురించి ఇంకా వేరే వేరే చోట్ల యందు కూడా చూద్దాం.

| | | |
|---|---|---|
| కృతయుగ సం॥ ప్రమాణము | 17,28,000 కూడితే | 18 - 9 |
| త్రేతాయుగ సం॥ ప్రమాణము | 12,96,000 కూడితే | 18 - 9 |
| ద్వాపరయుగ సం॥ ప్రమాణము | 8,64,000 కూడితే | 18 - 9 |
| కలియుగ సం॥ప్రమాణము | 4,32,000 కూడితే | - 9 |

4 యుగాల ప్రమాణము 43,20,000 కూడితే 9

శ్రీమద్రామాయణంలో ప్రతికాండలోనూ 18వ సర్గకి విశేషముంది.

బాలకాండలో 18వ సర్గలో రామాదుల జననం - 9

అయోధ్యకాండలో 18వ సర్గలో కైక వరాలు కోరడము - 9

అరణ్యకాండలో 18వ సర్గలో శూర్పణఖ శ్రీరాముని ప్రేమించుట- 9

కిష్కింధాకాండలో 18వ సర్గలో వాలి సంభాషణ - 9

సుందరకాండలో 18వ సర్గలో సీతను చూచుటకు ఆశోకవనమునకు
రావణుడు వచ్చుట - 9

సీతారావణుల సంభాషణలను చెట్టుపై నుండి ఆంజనేయుడు వినుట

యుద్ధకాండలో 18వ సర్గలో విభీషణునకు శ్రీరాములు
శరణమొసంగుట - 9

ఉత్తరకాండలో 18వ సర్గలో వేదవతి రావణుని శపించుట. - 9

వేదవ్యాసుడు రచించిన పురాణములు 18. ఈ 18ని కూడితే 9 వస్తుంది.

తొమ్మిది పూర్ణ సంఖ్య. అందుకేనేమో శ్రీరామచంద్రుని జననం కూడా నవమి నాడే జరిగింది. ఈ 18 గురించి 9 గురించి ఎటూ అందులో ప్రవేశించినాము. ఇంకో విశేషం సయితం తెలుసుకుందాము. ఏ సంఖ్యను తొమ్మిదితో హెచ్చించినా తిరిగి తొమ్మిదే అవుతుంది. మీరు ప్రయత్నించి చూడండి.

చతుర్యుగాలు నాల్గు కలిపితే 43,20,000లు. దీనిని మహాయుగ మందురు. కూడితే 9. ఈ మహాయుగాలు 1000 అయితే 1 కల్పము బ్రహ్మకు ఒక పగలు. 432 కోట్ల సంవత్సరాలు కూడితే 9 వస్తుంది. మరలా

432 కోట్ల సంవత్సరాలు బ్రహ్మకు ఒక రాత్రి. 432 కూడితే 9 అవుతుంది. 20000 మహాయుగాలు బ్రహ్మకు 1 నెల. అనగా 864 కోట్ల సంవత్సరాలు. కూడి సగం చేస్తే 9 అవుతుంది. ఇట్టి 12 నెలలకు 3,11,040 కోట్ల సంవత్సరాలు కూడితే 9 వస్తుంది. ఇట్టి 100 సంవత్సరాలు బ్రహ్మకు ఆయుర్ధాయం. 3,11,04,000 కోట్ల సంవత్పరాలు కూడితే 9 వస్తుంది.

ఈ విధంగా ఏ సంఖ్యను 9 చే హెచ్చించినా 9 వస్తుంది. యీ 9కి 18కి పురాణాలలో శాస్త్రాలలో అత్యంత ప్రాధాన్యత ఇచ్చినారు. వ్యాసుడు, శ్రీకృష్ణ పరమాత్మ. మన పూర్వీకులు వారందరికిన్నీ మరియు ఆ 18కి ఆ 9కి నమస్కరించి మనం మన గీతలో ప్రవేశించుదాము.

దుర్యోధనుడు అసుర భావానికి ప్రతిమూర్తి. శ్రీకృష్ణుని వదలి ఆయన ఇచ్చిన 10వేల మంది సైన్యాన్ని తెచ్చి రాశి పోసుకున్నాడు. తనమందిపై, తన మార్బలంపై, తన ధనంపై, తన దర్పంపై విశ్వాసముందికాని, భగవంతునిపై విశ్వాసం లేదు. వస్తువులపై, ఉన్న ప్రీతి వస్తుదాతపై లేదు. అసురభావంగల వారి ప్రవృత్తి ఇలాగే ఉంటుందేమో.

ద్రోణాచార్యులతో దుర్యోధనుడు ఇంకా ఇలా అంటాడు. ద్రోణాచార్యా! ఆ పాండవసేనలో గొప్ప ధనుర్ధారులు భీమార్జునులతో సమానంగా యుద్ధం చేయగల్గినవారు అనేకులు వున్నారు. వారిలో కొందరిని గుఱించి చెబుతా వినండి. దుర్యోధనునికి భీముడు అర్జునుడంటేనే భయం. వారి పరాక్రమాల గురించి జీవితంలో మరచిపోలేని ఘట్టాలు ఎన్నో ఉన్నవి. అందుకే వారి పేర్లు చెప్పి మిగతా పదిహేడుమంది పాండవుల ప్రక్కన ఉన్న వారి పేర్లు చెబుతున్నాడు. సాత్యకి, విరాటరాజు, ద్రుపదుడు, యీతనిని మహారథుడంటూ ద్రోణుని హృదయానికి తగిలేటట్లు చెబుతున్నాడు. దుష్టకేతువు, చేకితానుడు,

కాశీరాజు, పురుజిత్తు, కుంతిభోజుడు, శైబ్యుడు, యుధామన్యుడు, ఉత్తమౌజుడు, సౌభద్రుడు, ప్రతివింధ్యుడు, శ్రుతసోముడు, శ్రుతకర్ముడు, శతానీకుడు, శ్రుతసేనుడు వీరు 19 మంది మహావీరులు పాండవులలో గలరనిచెప్పి, తరువాత తన సైనికులలోని ముఖ్యుల పేర్లు చెబుతున్నాడు. ఆచార్యవర్యా మీరు, భీష్ముడు, కర్ణుడు, కృపాచార్యుడు, అశ్వత్థామ, వికర్ణుడు, భూరిశ్రవుడు, సైంధవుడు మొదలగు మహావీరులున్నారని చెబుతాడు. పాండవసేనలో 19మంది మహావీరులున్నారని చెప్పి, తన సైన్యంలో 8 మందిని మాత్రమే మహావీరులున్నారని చెప్పినాడు. పాండవసైన్యం 7 అక్షౌహిణులన్నా 8 మంది మాత్రమే మహావీరులున్నారని రారాజే పల్కుచున్నాడు. అనగా కౌరవులది సైన్యం అధికం, వీరులు స్వల్పం. పాండవులది సైన్యం అల్పం, వీరులు అధికమన్న మాట. పాండవ వీరులను 3 శ్లోకాలతో వర్ణించి చెప్పిన దుర్యోధనుడు తన సైన్యంలోని వీరులను ఒకే ఒక్క శ్లోకంతోనే వర్ణించినాడు.

ఈ రెండు సందర్భాలను బట్టి చూస్తే ధర్మ ప్రభువైన ధర్మరాజుది దైవసంపద, అధర్మపరాయణులు దుష్టచతుష్టయంగా పేరొందిన దుర్యోధనునిది అసురసంపద అని చెప్పకనే అర్థమగుచున్నది. పశువులాగా తినడం, పందిలాగా మనడము వారి యావజ్జీవిత తంత్ర ప్రణాళిక. తన ఆశయసిద్ధి కోసం ఎంతటి అన్యాయానికైనా, అక్రమాలకైనా వెనుకాడరు. ఇట్టివారే భోగజీవులు, మించితే రోగజీవులు.

"తిండి కొఱకై దేహము కాదు. దేహం కొఱకై తిండి" దీర్ఘ జీవితం కాదు కావలసినది, దివ్య జీవితం కావాలి. ఇట్టి వారూ కొందరున్నారు. వీరే యోగజీవులు. పరిపాకంలో త్యాగజీవులు. మొదటి పూలదండ తన మెడలోనే వేయాలి, ముందు తన పేరే చెప్పాలి. అన్ని రంగాలలో తన హస్తమే

ముందుండాలి. ఆస్తిలో, పరువు ప్రతిష్టలో తనదే పై చేయి వుండాలి. ఇది కొందరి ప్రవృత్తి. వీరి ఆస్థానంలో "సైతాన్" కు అగ్రపూజ. అహంకారానికి మొదటిస్థానం అసురజాతి వారంటే వీరే.

శివుని ఆజ్ఞలేక చీమైనా కుట్టదు. సర్వకర్త భగవంతుడు. సర్వస్వము భగవంతునిది, ఆయన సూత్రధారి, నేను పాత్రధారినంటూ ఉండేవారు కొందరు. దైవజాతి వారంటే వీరే సుమా.

భగవద్గీత మొదటి అధ్యాయంలో 9వ శ్లోకంలో దుర్యోధనుడు ద్రోణాచార్యులతో ఇలా అంటాడు.

**శ్లో ॥ అన్యేచ బహవశ్శూరా, మదర్థేత్యక్త జీవితా:**
**నానా శస్త్ర ప్రహరణా: సర్వేయుద్ధ విశారదా: ॥**

గురువర్యా మనసేనలోని వీరవర్యులు నానా శస్త్ర ప్రయోగ నిపుణులు, యుద్ధవిద్యా విశారదులు, ఇంకా ఎందరో ఉన్నారు. వారు వారి ప్రాణాలను నాకొరకు ధారపోయుచున్నారు. ధారపోస్తారు కూడా. వారిప్రాణాలు వారివికావు. నావి. వారి జీవితాలు నాకొఱకై ముడుపు కట్టబడియున్నవి. ఈ రహస్యం గమనించండి. బ్రతికి యుండగానే, వారిని "త్యక్త జీవితా:" అనే పదము దుర్యోధనునికి తెలియకుండగానే అతని నోటి నుండి వచ్చినది. భవిష్యత్తులో అనర్థమును సూచించునదై వున్నది.

బ్రతికియుండగానే వారిని చచ్చినారనుట అపశకునము. అనర్థము. ఈ శ్లోకములో దుర్యోధనుడు నేనే సమస్తము. నాకే సమస్తము అనే ధోరణిలో మాట్లాడినాడు. ఇది ఎట్లున్నదనగా, యీ పశువులు పక్షులు మేము తినుటకు గానే పుట్టినాయనే రాక్షస మానవులు కొందరంటూ వున్నట్లు మాట్లాడినాడు. అందరి బ్రతుకులు తనబ్రతుకు కోసమని ధుర్యోధనుడంటూవుంటే, ముందు ముందు ఇదే ఆధ్యాయంలో 33వశ్లోకంలో అర్జునుడు, తన బ్రతుకు

అందరికోసమని అంటాడు. కాబట్టి లీలామానుష రూపుడైన శ్రీకృష్ణుడు తనంతకుతానే తన శ్రీముఖంతో అర్జునా నీవు దైవీ జాతిలో పుట్టిన వాడవయ్యా అని 16వ అధ్యాయంలో 5వ శ్లోకంలో శ్లాఘించినాడు.

దుర్యోధనుడు మదర్థజీవి, అర్జునుడు తదర్థజీవి. రాజకీయ తంత్ర కుతంత్రుడగు రారాజు దుర్యోధనుడు, భయవిహ్వల చిత్తుడై ద్రోణాచార్యులకు ఏమేమో బోధిస్తున్నాడు. ద్రోణుడు కిమ్మనక " నీ జాతకం నాకు తెలుసులే " అన్నట్లు అపేక్షగాని, ఉపేక్షగానీ లేక వింటున్నాడు. "అర్జునుడు సైన్యాన్ని చూడగోరినప్పుడు, రెండు సేనల మధ్యన నిలిచి చూచినాడు. అది అతని నిర్భయత్వానికి ఆత్మవికాసానికి సంకేతంగా ఉంది ఎందుకనగా అతడు దైవజాతికి చెందినవాడు. దుర్యోధనుడు సేనను చూడాలనుకున్నాడు. ద్రోణాచార్యుల ప్రక్కకు చేరుకున్నాడు. అది ఈతనిలోని అసురభావానికి భయప్రవృత్తిని ప్రతిబింబింప జేస్తుంది. దుర్యోధనుడు భీష్ముని భద్రంగా కాపాడమంటూ తన సేనలకు హెచ్చరిక చేసినాడు. భీష్ముడు పడిపోతే అంతా పడిపోయినట్లేనని అతని అభిప్రాయం. ఇది ఒకరకమైన అర్థం, మరొక అర్థంలో భీష్ముడు అహంకారానికి ప్రతీక. అహంకారం పడిపోతే అంతా పడిపోయి నట్లే అని అసుర సంపదకు అధినాథుడైన దుర్యోధనుడు సైనికుల హెచ్చరించుచున్నాడు. ప్రార్థనా శ్లోకంలో "భీష్మ ద్రోణతటా" అని వర్ణించి యున్నాడు. కౌరవ రణ నదికి భీష్మ ద్రోణులు తీరములని అర్థము. అట్లే సంసార నదికి, అహంకార మమకారాలు ఉభయతటాలు. భీష్మ ద్రోణులే అహంకారమమకారాలు. అహంకారం చేయని పనంటూ లేదు. గురువులను భగవంతుని కూడా ఎదిరిస్తుంది. అహంకారం ఒక పట్టున చచ్చేది కాదు. ఈరెండూ భీష్ముని విషయానికి అక్షరాలా జరిగినవే. పాండవపక్షాన అగ్రస్థానాన భగవంతుడుంటే కౌరవపక్షాన అగ్రస్థానాన భీష్ముడున్నాడు.

దైవసంపద భగవంతుని వరిస్తే అసురసంపద అహంకారాన్ని వరిస్తుంది. అహంకారం భగవంతునికి ఎదురుపోటీ. జీవుని, దేవుని వేరుచేసే పరదా ఈ అహంకారం. అహంకార ప్రభావంతోనే, శివుడు జీవుడైనాడు. ఇక ద్రోణాచార్యులకు మమకారంతో పోల్చడానికి కారణమేమనగా ద్రోణునికి పుత్రుడంటే చచ్చేటంత మమకారం. ఆ మమకారంతోనే అతడు చచ్చాడు. ఆ భావంతోనే మమకారరూపంలో ద్రోణుని చెప్పడం జరిగింది. తరువాత దుర్యోధనుని బాధ చూసి జాలిపడి అతనికి కొంతైనా ఆనందం కల్పిస్తామనే ఉద్దేశ్యంతో భీష్ముడు శంఖాన్ని పూరించాడు. అప్పుడు కౌరవుల ప్రక్కవారు అందరూ శంఖాలు పూరించారు. నగారాలు మ్రోగించారు. భేరీలు వాయించారు. ఇలాంటి వాటితో హర్షంతో ధ్వని కలిగింపజేశారు. తర్వాత పాండవుల వంతు వచ్చినది. శ్రీకృష్ణుడు పాంచజన్యమనే తన శంఖాన్ని పూరించినాడు. సేనాధిపతి ప్రప్రథమంగా శంఖం పూరించవలె. ఇక్కడ భీష్ముడు సర్వసేనాధిపతి. అందువల్ల శంఖం పూరించడం సబబుగానే ఉన్నది. ఆ పద్ధతి ప్రకారం పాండవుల ప్రక్క ధ్రుష్టద్యుమ్నుడో లేక అర్జునుడో, భీముడో, ధర్మరాజో శంఖం పూరించవలె. అందరినీ కాదని అందరికంటె ముందు శ్రీకృష్ణుడెందుకు శంఖం పూరించాడు. రాయబారాలు, సంధులు, సమాధానాలు విఫలమై యుద్ధము తప్పని సరి అయినది. అర్జున దుర్యోధనులిద్దరూ సహాయ మర్థించుటకుగాను ద్వారకకు తన దగ్గరకు వచ్చినారు. అప్పుడు కత్తిపట్టను, ససేమిరా యుద్ధమే చేయను, చూచేవాడినే కాని, చేసేవాడిని కానని మహావాక్యాలు చెప్పిన మహానుభావుడు. అంత శంఖాన్ని ఎందుకు మోసుకురావలె. తెచ్చెనుబో, అంతకూ తగుదునన్నట్లు అందరికంటే ముందుగా తానే ఎందుకు శంఖం పూరించాలి. దీని

భావమేమిటంటే పాండవసేనకు మనమనుకున్నట్లు సేనాధిపతి ధ్రుష్టద్యుమ్నుడు కాదు. మరెవ్వరూ కాదు. అక్షరాలా సర్వసేనాధిపతి శ్రీకృష్ణుడే.

"ధర్మస్య ప్రభురచ్యుత:" అని ఆయన ధర్మానికే కాదు. ధర్మరాజు సేనకు కూడా ప్రభువుతానే. కౌరవ అసురసేనకు అహంకారం నాయకుడైతే, పాండవుల దైవ సేనకు భగవంతుడే నాయకుడు. అసురసేన అహంకారం పెత్తనం క్రింద నడిస్తే, దైవీసేన పరమాత్ముని పెత్తనం క్రింద నడుస్తుంది. ధ్రుష్టద్యుమ్నాదులు పాండవసేనకు ప్రత్యక్షసేనానులైతే భగవంతుడు పరోక్ష సేనాని. ఈశ్వర విధానాలు ప్రత్యక్షంగా ఎప్పుడూ ఉండవు. అవి ఎప్పుడూ పరోక్షంగానే ప్రవర్తిస్తాయి. ఈ సందర్భంలో "పాంచ జన్యం హృషీ కేశ:" అని తెల్పుతుంది. భగవద్గీత, హృషీకేశుడనగా ఇంద్రియాలకుకీ ఇచ్చేవాడు అని అర్థం. తర్వాత ధనంజయుడు దేవదత్తం పూరించాడు. ధనంజయుడనగా రాజసూయ యాగములో రాజ్యాలను జయించి ధనం తెచ్చినాడని స్థూలార్థము. "సూక్ష్మార్థము తీసుకుందాము. ధనమంటే ఒక్క డబ్బే కాదు. యీ ప్రకృతిలోని మనిషికి ఉపకరించే ప్రతి వస్తువూ ధనమే. ప్రకృతే ధనము. ప్రకృతిచే జయింపబడినవారు ప్రకృతిని జయించినవారు. అని మానవులలో రెండు రకాలు. ఈ అర్జునుడు ప్రకృతికి దాసుడు కాలేదు. ప్రకృతినే తన చెప్పు చేతలలో ఉంచుకున్న దిట్ట. ఈవిధంగా ప్రకృతిని జయించే శక్తి అర్జునునకు ఎలా కలిగింది. భగవంతుని ముందు పెట్టుకొని సేనలను వెనుకకు పెట్టుకున్నాడు. సూర్యుని ముందు పెట్టుకున్న వారికి నీడ వెనుకకు వెళుతుంది. అలాగుననే ప్రకృతినే తన స్వాధీనంలో పెట్టుకున్నాడు. కావుననే అతనికి ధనంజయుడు అనుపేరు సార్థక నామమైనది. ధనంజయుడనే పేరుకు ఇంకో అర్థముంది. ధనమనగా జ్ఞానధనమని కూడా అర్థము. జ్ఞానధనాన్ని సైతం పొందినవాడు కావున నిజమైన ధనంజయుడైనాడు. మొదట ఆధ్యాయంలో 14వ శ్లోకంనుండి 19వ శ్లోకం వరకు వాడిన పదాలలోని

అర్థాలను ఒక్కింత పరిశీలించుదాము. కృష్ణార్జునులు కూర్చున్న రథము తెల్లని గుఱ్ఱాలను పూన్చినది. తెలుపు రంగు శుభాన్ని జయాన్ని సూచిస్తుంది. ఆ రథారూఢులు మాధవ పాండవులు. "మా" అనగా లక్ష్మి. లక్ష్మీదేవికి భర్తగనుక మాధవుడైనాడు. మాధవుడు సేనాముఖంబున ఉన్నాడు గనుక భర్త ఉండిన చోట భార్య ఉండక తప్పింది కాదు. రాజ్యలక్ష్మి పాండవులనే వరిస్తుందనుటకు ఇది ఒక భవిష్యత్తు తార్కాణము. నరనారాయణులు అధిరోహించిన రథానికి కట్టిన గుఱ్ఱాలను పరీక్షించి చూడండి. గుఱ్ఱాలు నాలుగు ముఖాలు ముందుకు చాచి ఉండవు. ఒకటి క్రిందికి ముఖము వంచి, ఒకటి పైకి ముఖము ఎత్తి, ఒకటి ప్రక్కకు ముఖము త్రిప్పి, ఒకటి ఇట్లా నాల్గు నాల్గు రకాలుగానే ఉండును. ఎందుకు అట్లున్నవి అనగా దేహమే రథము. ఇంద్రియాలే గుఱ్ఱాలు అని సంబోధిస్తుంటారు. శ్రీకృష్ణుడు ఇంద్రియాదులను జయించిన వాడుగనుక, అవి పూర్తిగా ఆ శ్రీకృష్ణుని స్వాధీనంలో గుఱ్ఱాలు ఉన్నవి కానీ, వాటి స్వాధీనంలో కృష్ణుడు లేడు. శ్రీకృష్ణుడు పంచపాండవులు ధరించిన దివ్యశంఖాలకు దివ్యమైన పేర్లు గలవు.

శ్రీకృష్ణుడు మరియు పంచ పాండవులు వారు వాడిన శంఖాలకు ప్రత్యేకత వున్నది. శ్రీకృష్ణుని శంఖము పేరు పాంచజన్యము. అర్జునుని శంఖము పేరు దేవదత్తము. భీముని శంఖము పేరు పౌండ్రకము. నకులుని శంఖము పేరు సుఘోషము. సహదేవుని శంఖము పేరు మణిపుష్పకము. ఇవి పాండవాదుల శంఖముల పేర్లు. దివ్య శంఖాలు అనుటకు దివ్యమైన పేర్లు వున్నవని చెప్పుటలో దివ్యశక్తి పాండవుల పాలిట వున్నదని చెప్పినట్లయినది. ఇక కౌరవుల శంఖాలకు పేర్లూ లేవూ, ఏమీ లేవు. మామూలు శంఖాలు అవి. ఒట్టి నాటు సరుకులన్న మాట. పాండవులు దైవోపకృతులు. కౌరవులు దైవోపహతులు.

శ్రీకృష్ణుడు చిదానందఘనుడు. ఆయన ఆనందానికి తిరుగు, తరుగు, విరుగు లేదు. నందనవనం లాంటి బృందావనంలో నందనందనుడు మురళీగానం చేశాడు. అంతేకాదు, ఘోరభయంకర కురుక్షేత్ర రణరంగములో గీతాగానం ఆలపించాడు. ఆ గానలోలుని గానము శుభములో. అశుభములో మంచిలో చెడ్డలో సదా జరిగిపోతుండ వలసిందే! ధర్మరాజు అగ్రపూజ చేసేటప్పుడు శిశుపాలుడు నిందావర్షము కురుపించునప్పుడు, గాంధారి " నీ వంశము సయితం నావంశం వలెనే సర్వనాశనం అయిపోనీ" , అని శపించినప్పుడు సయితం ఆయన ముఖంపై చిరునవ్వు తొణికిందే గాని తొలికింది గాదు. ఆయనది ఆరోపగతమయిన ఆనందము కాదు. స్వరూపగతమయిన ఆనందము. ట్యాంకులో నీళ్ళవలె బయటినుండి కూరు కునే సరుకు గాదు. బావిలో నీళ్ళవలె ఊరే సరుకు. జన్మలో కన్నీరెన్నడు పెట్టని అర్జునుడు మమకార, వ్యామోహాలతో మొదటిసారిగా విషాదగ్రస్తుడు అయినాడు. అదృష్టవశాత్తు అదే ఆయనకు చివరిసారి కూడా అయింది. అర్జునుడంతటి శూరవీర ధీరుని ఈ మమకార భూతం పట్టి పీడించిందంటే తక్కినవారి గతేమిటి? "మహాగజా: పలాయంతే మశకానాంతుకా గతి:" గడ్డపారలు గాలికి పోతుంటే, పుల్లాకులు మాగతేంటి అన్నట్లు సామాన్యులైన సామాన్యమానవుల విషయం వేరే చెప్పాలా?

జనార్దనా! మావారైన ధార్తరాష్ట్రులను చంపి, మేము ఏ ప్రీతి అనుభవించగలము. ఆతతాయులైన వారిని చంపడంతో మాకు మరింత పాపమే వస్తుంది. "ఆతతాయులు" అనగా "కొంపలు కాల్చేవారు, విషం పెట్టేవారు, ఇతరుల భూములను హరించేవారు, పరస్త్రీలను అవమానం చేసేవారు". మారణాయుధాలను ధరించిన వారు పరుల ధనాన్ని దోచుకునేవారు ఈ ఆరుగురిని ఆతతాయులు అని అందురు. ఈ లక్షణాలు ఆ

దుష్టచతుష్టయంలో తుచ తప్పకుండా అమలులో పెట్టినవారే. లక్క ఇల్లు కాల్చినారు. భీమునికి విషం పెట్టినారు. గో(గ్రహణంలో ఘోషయాత్రలో పాండవులకు హాని కలిగించుటే వారి పని. కపట జూదంలో రాజ్యాన్ని, ధనాన్ని అపహరించినారు. ద్రౌపదిని అవమానపరచినారు. వీరు చేయని పాపం లేదు. దుర్యోధనాదులు కేవలం ఆతతాయులే కాదు, పరమ పాపిష్టి ఆతతాయులు. ఇంత చేసినా అర్జునుడు బంధుమోహంలో పడి తన దౌర్బల్యాన్ని అసందర్భ ప్రసంగాలతో మభ్యపెట్ట జూస్తున్నాడు. అర్జునుని ప్రజ్ఞావాదాల పరంపర యింతటిలో ఆగలేదు. "అర్జునుడు అంటూ వున్నాడు. అచ్యుతుడు వింటూ వున్నాడు" మాధవా స్వజనులైన దుర్యోధనాదులను చంపి, ఐహికమైన దృష్ట సుఖానికి, ఆముష్మికమైన అదృష్ట సుఖానికి మేము దూరులమే కాగలము. తన వారలను చేజేతులా చంపుకొన్న మాకు దృష్ట సుఖమెక్కడిది. బంధుహత్యా దోషానికి గురయిన మాకు అదృష్టసుఖం. స్వర్గసుఖం మాత్రం ఎక్కడిది. ఈ యుగంలో మాకు లభించేది ఉభయలోక భ్రష్టత్వమే, స్వామీ! నీవు మాధవుడవు, లక్ష్మీపతివి, మంగళస్వరూపుడవు. నీవు మమ్ము ఈ అమంగళకృత్యంలో ఎందుకు ప్రవర్తింప జేయుచున్నావో? అర్థంకావడంలేదు స్వామీ.

అచ్యుతా! ఇంకో విషయం భీష్మాదులగు పెద్దలకు, నీకు తెలిసినంతమటుకు వారికి తెలియదా? వారి మార్గాన్ని నీవెందుకు అనుసరించ రాదంటావేమో? వారు పెద్దలే! అయినా వారు అధర్మమార్గ ప్రవర్తకులైనపుడు, ఎందుకు అనుసరించాలి. లోభం అన్ని పాపాలకు మూలము. లోభ దోషంతో వారి చిత్తాలన్నీ కశ్మలాలయ్యాయి. కాబట్టే దుర్యోధనాదులు కులక్షయంతో కలిగే పాతకాన్ని గానీ గుర్తింపలేకున్నారు. బావా! మాసిపోయిన బట్టలు కట్టుకున్నవాడు ఎక్కడదొర్లినా పరవాలేదు. అదేవిధంగా మలిన చిత్తులైన

దుర్యోధనాదులకు అది తగినది. కానీ ఈ అనర్థమంతా కన్నులకు కట్టినట్లు చూస్తుంటే మనం తెలిసి, తెలిసి ఈ పాపానికి ఒడిగట్టవలసిన పని ఏముంది, అంటూ దీనంగా తెల్పుకుంటున్నాడు అర్జునుడు జనార్ధనునితో.

అంగవ్రాతములో చికిత్సకుడు దుష్టాంగంబు ఖండించి, శేషాంగ శ్రేణికి రక్షచేయుటకు ప్రయత్నిస్తున్నాడా జగద్వైద్యుడు. ఆనాటి విశ్వవిరాట్పురుషుని శరీరంపై, కౌరవులనే భయంకరమయిన విషవ్రణం పుట్టింది. దాన్ని అట్లే వదిలితే మొత్తం ప్రపంచానికే హాని. కత్తితో పని లేకుండా మందులూ, ఇంజక్షన్లు చేసి చూశాడు మానిపోతుందేమోనని. రాజీలు, రాయబారాలు అన్నీ విఫలమయ్యాయి. ఆపరేషన్ అనివార్య మయినది. తక్కిన భాగాన్ని కాపాడుకునే నిమిత్తమై, చెడిన భాగాన్ని కత్తరించివేయక తప్పింది కాదు. దుష్టసంఘంతో సాంగత్యం చేసిన దోషానికి, మహానుభావులైన భీష్మ, ద్రోణాదులు ఆ మారణహోమంలో స్వాహా కావలసి వచ్చింది. నిమిత్త మాత్రంగా అర్జునుని పెట్టుకొని, శ్రీకృష్ణుడు రంగంపైకి వచ్చాడు. గడిచిన ఆధ్యాయం చివరలో అర్జునుడు ధనుర్బాణాలను పారవైచి కూర్చున్నాడనే మాట అంధభూపతికి ఆశాభావాలను అంకురింపజేసినవి. రొట్టె విరిగి నేతిలో పడిందనుకొన్నాడు. యుద్ధం బెడద తప్పిందనుకొన్నాడు. కడుపులో చల్ల కదలకుండా, కావలసిన కార్యం నెరవేరిందనుకొన్నాడు. దూరదృష్టి, దివ్యదృష్టి కలిగిన సంజయుడు " పాపం పిచ్చిమహారాజు, పరమాత్ముడు పాండవుల పాలిటివాడై వుండగా ఈ అడియాశలు ఫలిస్తాయా"? అనుకుంటూ తన ప్రసంగాన్ని ప్రారంభిస్తున్నాడు. అర్జునుడు అలా బేలగా, బాధగా, చింతాగ్రస్తుడై వుండగా! శ్రీకృష్ణుడు నవ్వుతూ వున్నాడు. అర్జునుడు ఏడస్తూ వున్నాడు. "నవ్వేవాడు నారాయణడు – ఏడ్చేవాడు నరుడు" అదీగాక నవ్వుచున్నాడనీ చెప్పలేదు.

"ప్రహసన్నివ" అనే పదంలో ఎంతైనా స్వారస్యం వుంది. పరమాత్ముడు నవ్వడు. నిష్క్రియ వస్తువులో క్రియ ఎక్కడిది. నవ్వుతున్న వానివలె వున్నాడు, అన్ని భావాలకు అతీతుడైన పరమాత్మ, స్వరూపదృష్టిలో నవ్వేవాడు కాదు, అదికూడా చూసేవారి దృష్టి ననుసరించి చెప్పినమాట. శ్రీకృష్ణుడు నవ్వక ఏడుస్తాడా? ఆనందఘనునికి నవ్వుగాక ఏడుపు ఎక్కడిది. అయినా శ్రీకృష్ణుడు ఎందుకు నవ్వాడో? అర్జునా! ఈ ఏడుపు ఇంటిలోననే ఏడ్చివుంటే బాగుండేదే, వచ్చి వచ్చి యుద్ధంలో ఏడుస్తున్నావే? అని నవ్వేనో! ఒకసారి "శిష్యస్తేహం" అనీ నీ శిష్యున్ని నీ ఇష్టం వచ్చిన పని చెప్పు చేస్తాను అంటూ వెంటనే "నయోత్స్యే" నేను యుద్ధమే చేయను, అంటావు. "నేను చెప్పినట్లు చేసేవాడివా? నీ ఇష్టానుసారం చేసేవాడివా" నీ ఈ విరుద్ధ ప్రసంగాలకు ఏమిటి అర్థం అని నవ్వేనో?





మనస్సును తప్పుదారి పట్టించేది మనిషిని గుడ్డివాడిని చేసేది " గర్వం ".

# శ్రీ భగవద్గీత

# ద్వితీయాధ్యాయము

# సాంఖ్యయోగము

గీతాబోధకు ఇప్పుడు కదా సమయము లభించినది. అని నవ్వేనో ఏమో? "హరిహరిహరి చిత్రలీల హరియే ఎరుగున్" ఎన్నడూ ఏడ్వని అర్జునుడు ఇంతగా ఏడుస్తున్నాడే? ఎందుకో, ఏమి రోగమోనని మాధవుడు నాడి పట్టి చూశాడు. "వైద్యో నారాయణో హరి:" అని మనం మాట మాత్రం అంటుంటాము. అర్జునుని భాగ్యమేమో కానీ, సాక్షాత్ నారాయణుడే వైద్యుడైనాడు. నిజమైన వైద్యుడంటే ఎట్టివాడు? రోగం, రోగనిదానం, ఆరోగ్యం, ఆరోగ్యసాధనం ఈ నాల్గింటిని చక్కగా యెరిగినవాడే నిజమైన వైద్యుడు. నిజమైన గురువంటే, దు:ఖము - దు:ఖ నిదానము, సుఖము - సుఖ సాధనం ఈ నాల్గింటిని చక్కగా ఎరిగినవాడే నిజమైన గురువు.

**శ్రీ భగవానువాచ :-**

**శ్లో ॥ అశోచ్యానన్వశోచస్త్వం - ప్రజ్ఞావాదాంశ్చ భాషసే**
**గతాసూన గతాసూంశ్చ - నానుశోచంతి పండితా:**

గీతా పారాయణ విధానంలో దీనిని "బీజశ్లోకము" గా చెప్పుకుంటారు. భగవంతుడు అర్జునునిపై రెండు ఆక్షేపణలు విసురుతూ ఉన్నాడు. "అశోచ్యానన్వ శోచస్త్వం" అర్జునా! దేహాలకు కలిగే నాశం ఆత్మకేనని, శోకింపదగని వాళ్ళకోసం శోకిస్తావు. పైపెచ్చు "ప్రజ్ఞావాదాంశ్చ భాషసే" స్వధర్మాన్ని అధర్మమంటూ పండితవాదాలను చెండివేస్తున్నావు. నందనందనుని

మందమంద హసితాంబుజాననము అర్జునుని వైపు మళ్ళింది. అర్జునా ఇటువిను నీవెవరో నీవు చేసే పనేమిటో, కాస్త గ్రుక్క మ్రింగి యోచించు. శోకింపదగని వారిని గూర్చి శోకిస్తావు. పైపెచ్చు ప్రజ్ఞావాదాలను చేటలతో చెరుగుతావు. మాటలు కోటలు దాటుతాయి. నాకన్నీ తెలుసునంటావు. బావురుమంటూ ఏడుస్తావు. నీ మాటలు చూస్తే పండితునిలాగా, చేతలు చూస్తే మూర్ఖునిలాగా తోస్తుంది. మాటలను చూసి జ్ఞానివనుకోవలెనో? ఏడుపుని చూసి అజ్ఞానివను కోవలెనో? నీ పరిస్థితి "అగమ్య గోచరం – ఆకాశపంచాంగం" లా వుంది. పండితులు చావు, బ్రతుకుల గురించి వృధా దు:ఖానికి పాల్పడరు. దేహమిట్టిదని, ఆత్మ యిట్టిదని, వస్తువును ఉన్నదున్నట్లు తెలుసుకొనేవారే పండితులు. వారు, వున్నవారి కొరకు గాని, ఊడినవారి కొఱకు గాని శోకింపరు. పూర్తిగా తెలియని వాళ్ళు బ్రతికున్న వాళ్ళ కోసం. వారి బాగోగుల కోసం శోకిస్తారు. బాగా తెలిసిన పండితులు దేనికీ శోకించరు. అర్జునా! భీష్ముడు ద్రోణుడూ మరణిస్తారని ఏడుస్తావే? నీ ఏడుపు ఆత్మ కోసమా! దేహం కోసమా! దేహం నీవు ఏడ్చినా నిలువదు. ఏడ్వకున్నా నిలువదు. అలా ఏడ్చితే నిలిచే పక్షంలో లోకంలో వున్న వారంతా అదే ఉద్యోగం పెట్టుకొని ఏడ్చి వుందురు. దీన్ని అమృతభాండంలో పెట్టినా గిట్టేదేమో నిజం. దీని కొరకు ఏడ్చినా లాభం లేదు. ఆత్మ అంటావా అది నిత్యవస్తువు. దాన్ని మృత్యువు మూ చూడలేదు. దాని కొరకు ఏడ్వవలసిన పనే లేదు. అసలు ఏడ్వవలసిన పని దేనికొరకూ లేదు. నిజము తెలుసుకోలేని అజ్ఞానికి ఏడ్వవలసిందే! ఆత్మానాత్మల అన్యోన్యధ్యాసే దు:ఖానికి కారణం. అర్జునా! నీకు ఆత్మజ్ఞానం లేదు. కాబట్టే ఏడుస్తున్నావు. "కథం భీష్మమహం సంఖ్యే", భీష్మాదులను యుద్ధంలో ఎలా వధించేది అంటావు. "సంఖ్యే", అన్నావు కానీ "గృహే" అనలేదు కదా! ఇంట్లో కాదుగదా? యుద్ధంలో యుద్ధం క్షత్రియులకు స్వధర్మం కదా! నీ

పాలిటికి వచ్చిన కర్తవ్యాన్ని నిర్వర్తించి కృతకృత్యునివి కావాలి. ఊరికే అహంకారాన్ని మీదవేసుకొని అల్లాడిపోవద్దు. ఆర్చేవానివి తీర్చేవానివి నీవేననుకున్నావా? జ్ఞానులు, ప్రపంచంలో ప్రభవించే ప్రళయాలకు తికమకగారు. క్షత్రియులకు యుద్ధం ధారాతీర్థం. ఇదంతా తెలిసే భీష్మ ద్రోణులు దీనిలో తరించేందుకు వచ్చి యుద్ధానికి సిద్ధమైనారు. నీవలె వారికి విభ్రాంతి లేదు. విషాదం లేదు. ఇది నీకు పరీక్షాఘట్టం. కర్తవ్యకర్మను నెరవేర్చి ఈ పరీక్షలో "పాస్" అవుతావో, కాలగతిని ఎదిర్చి "ఫెయిల్" అవుతావో చూస్తాం నీ తడాఖా! అంటాడు శ్రీకృష్ణుడు.

అప్పుడు అర్జునుడు అడుగుతాడు, స్వామీ! నీవు భగవంతుడివి, నిత్యుడవు, నీకు నాశనం లేదు. నేను ఏడ్చేది నీకోసం కాదు మహాప్రభో! నిన్న పుట్టి, రేపుగిట్టే మా సంగతి చెప్పండి. తత్పదార్థమైన పరమాత్మ నిత్యుడంటే సంశయం లేదు. "త్వం" పదార్థం నిత్యమంటే అంత త్వరగా గ్రహించే వీల్లేదు. అర్జునుడడిగిన శంకకు భగవంతుడంటాడు, అర్జునా! "సత్యం" నీవు నిత్యుడవే. "ఇమే జనాధిప" ఈ భీష్మ ద్రోణాదులగు రాజులూ నిత్యులే! ఆత్మ నిత్యత్వాన్ని గురించి, శాస్త్రీయ యుక్తి ననుసరించి తెలియ జేయుచున్నాడు. "అర్జునా! నీవిప్పుడున్నావా? స్వామీ ఉన్నాను. దేహంతో వున్నావా? దేహం లేకవున్నావా? దేహంతోనే ఉన్నాను. ఈ దేహం నీకు ఎలా లభించింది? వెనుకజన్మలో నేను చేసుకొన్న పాపపుణ్యకర్మల వల్ల లభించింది. వెనుక జన్మలో కర్మ చేశానంటున్నావే? నీవు ఉండి చేశావా? లేక చేశావా? నేనుండే చేశాననుకొంటున్నావే, కర్మలు చేయుటకు అప్పుడు నీకు దేహం వుండినదా? లేదా? దేహం లేక కర్మలు ఎలా చేయడం జరుగుతుంది స్వామీ! నేను వుండినాను, దేహం వుండినది. కర్మలు చేశాను; అర్జునా! ఆ దేహం ఎట్లొచ్చింది, వెనుక జన్మలో చేసిన కర్మలను బట్టి వచ్చింది. స్వామీ!

అర్జునా! దేహాలు మారాయి కానీ, నీవు మారలేదు. నీవు నిత్యుడవు. నిత్యమైన ఆత్మకోసం శోకించడం నీవంటి వారికి సరిపోదు. ఆత్మ నిత్యమనే విషయాన్ని దృష్టాంతపూర్వకముగా భగవంతుడు అర్జునునకు తెలియజేయుచున్నాడు. జటిలమైన విషయాలకు దృష్టాంతాలు సరళం చేస్తాయి. అర్జునా!

**శ్లో ॥ దేహినోస్మిన్ యధాదేహే, కౌమారం యౌవనం జరా**
**తథా దేహాంతర: ప్రాప్తి, ధీరస్తత్ర న ముహ్యతి॥**

అర్జునా! స్థూలంగా ఒకే మాటతో చెప్పాలంటే దేహికి, ఈ దేహంలోని బాల్య యౌవన, వార్ధక్యాదులెట్టివో, దేహాంతర ప్రాప్తిగూడ అట్టిదే. ధీరులీ విషయంలో శోకంబొందరు. అర్జునా! నీకిప్పుడు ఎంత వయస్సు; స్వామీ ఎనభై సంవత్సరాలు. అయ్యా బాల్యములో నీవు చేసిన ఒక సంగతి చెప్పుము. అర్జునుడు జ్ఞాపకం చేసుకొని, ద్రుపద మహారాజును పట్టి, కట్టి, బంధించి తెచ్చిన విషయం చెప్పాడు. సరే, అర్జునా ఆ బాల్యం ఇప్పుడుందా? దాని జాడే లేదు. అది లేదుకానీ నీవు లేవా? ఎందుకులేను స్వామీ! అది లేదని చెప్పే నేను మాత్రం వున్నాను. పోనీ యౌవ్వనంలో నీవు చేసిన ఒక పని చెప్పుము. అప్పుడు అర్జునుడు ఇంద్రలోకము వెళ్ళి నివాత, కవచ, కాలకేయాదులను యుద్ధంలో జయించిన విషయము చెప్పెను. బావా? ఆ యౌవ్వనం ఇప్పుడుందా? లేదు స్వామీ! మరినీవో? దాని సంగతి చెప్పే నేనున్నాను. ఇపుడు వార్ధక్యం వచ్చింది. ఇదీ అంతే! అవస్థలు వుండడం, వుండకపోవడంతో నీకెట్లా సంబంధం లేదో, శరీరం వుండకపోవడం తోనూ అంతే సంబంధం. బాల్యంలో వుండిన నీవే వార్ధక్యంలోనూ వున్నావు. అవస్థాంతరాలలో వలనే, దేహాంతరాలలో సైతం నీవుంటావు. నీవు నిత్యుడివి, నిర్వికారుడివి. స్వామీ అవస్థాంతరాలలో వలెనే దేహాంతరాలంటివే?

అవస్థాంతరాలలోనివి జ్ఞాపకాలుండవే? జ్ఞాపకాలు లేనివి, వున్నవని ఎట్లు నమ్మవలె?

ఈ సంశయం అర్జునునికి కాకపోయినా, రాకపోయినా మనలాంటివారికి ఈ సంశయం కలుగుతుందనే "ధీరస్తత్ర న ముహ్యతి" అంటూ అక్కడికక్కడే సంశయనివృత్తి చేశాడు. అర్జునా! ఈ అవస్థాంతరాలలో బుద్ధి వైకల్యం చెందదు. కాబట్టి అవస్థలలోని విషయాలను కొంత జ్ఞాపకం పెట్టుకోగలుగుతుంది. దేహాంతర పరిస్థితిలో, మరణకాలంలో బుద్ధి వికలమై పోతుంది. ఆదెబ్బతో "బుద్ధి" గడిచిన విషయాలనన్నిటినీ మరచిపోతుంది. జ్ఞాపకం పెట్టుకోవడం, మరచిపోవడం బుద్ధి ధర్మం. కానీ ఆత్మధర్మం కాదు. ఉదాహరణకు రెండేళ్ళ క్రితం వైశాఖ శుద్ధ విదియ రోజు ఎక్కడ వుంటివి అంటే ఏమో తెలియదు అంటావు. జ్ఞాపకం లేదంటావే కానీ, నేను లేను అని అనవు కదా! ఆ విధంగా పూర్వజన్మ విషయాలు జ్ఞాపకములో వుండవు.

స్వామీ! ఆత్మనిత్యము, దేహమనిత్యము. ఆత్మ పోయేది కాదు. దేహం వుండేది కాదు. కాబట్టి మరణం కోసం శోకించను. కానీ ఒక విషయం, వారి దేహాలను పూజించి, గౌరవోపచారాలు చేస్తే వారి ఆత్మ సుఖిస్తుంది. బాణాలతో గ్రుచ్చితే ఆ ఆత్మ దు:ఖిస్తుంది. కాలవశాత్తు జరిగే పనులు జరిగితే జరుగని గాక. కానీ నా నిమిత్తంగా వారికి దు:ఖ మెందుకు కలిగించాలి. వారుంటే నాకు సుఖం. వారుపోతే నాకు దు:ఖం. "సుఖవియోగం - దు:ఖసంయోగం" కల్గించే ఈ యుద్ధం నేనెందుకు చేయాలి. ఇదీ అర్జునుని గాథ. అర్జునా! ఎలాగూ ఆత్మానాత్మల గూర్చి ఆ ప్రసంగాన్ని కదిలించావు కాబట్టి చెబుతా విను.

**శ్లో ॥ మాత్రా స్పర్శాస్తు కౌంతేయ – శీతోష్ణసుఖదు:ఖదా:**
**ఆగమాపాయినో నిత్యా – తాం స్తి తిక్ష స్వ భారత**

భరతకుల ప్రదీపా! జ్ఞాని జ్ఞానానికి, భక్తుని, భక్తికి, వివేకి వివేకానికి యివి గీటురాళ్ళవంటివి. ఈ సుఖదు:ఖాది ద్వంద్వాల ధాటికి తట్టుకొని నిలువగలిగిన జ్ఞానమే జ్ఞానము. భక్తే భక్తి. వివేకమే వివేకము. లేనిచో అది ఒట్టి బూటకం అవుతుంది. శీతోష్ణాదులు, మాత్రాస్పర్శలు ఎల్లప్పుడు సుఖాన్ని గానీ, ఎల్లప్పుడు దు:ఖాన్ని గానీ ఇవ్వలేవు. ప్రపంచ మున్నంతవరకు మనకు ఇంద్రియాలు తప్పవు. ప్రారబ్ధం వున్నంత వరకు సుఖదు:ఖాలు తప్పవు. వాటికి తట్టుకునే ఉపాయం నేర్వాలి. "సముద్రంలో అలలుడిగిన తర్వాత స్నానం చేయాలి" అని ఆశించి లాభం లేదు. అలలతో దెబ్బతినని ఉపాయం తెలిసి స్నానం చేయాలి. ప్రపంచంలో ఎండలేకుండా చేయడం నీతరం కాదు. అది వ్యర్థ ప్రయాస కూడా! ఆ ఎండ నీపై పడకుండా గొడుగు వాడేది నేర్చుకో! భూమిపై ముళ్ళు ఉండరాదనే హఠం పనికిరానిది. కాళ్ళకు భద్రమైన పాదరక్షలు ధరిస్తే ఏ బాధా నీకుండదు. భారతా "తాంతితిక్షస్వ" తితిక్షా కవచం ధరించు. సుఖదు:ఖాల ముట్టడి నీపై పనిచేయదు. తితీక్ష అనగా ద్వంద్వాలతో స్నేహం, సహనము బలవంతులసొత్తు. దుర్భలుడు ద్వంద్వాల తాకిడికి ఆగలేడు. అటు ఇటు అల్లాడిపోతాడు. ఒకసారి సుఖంవైపు, ఒకసారి దు:ఖం వేపు వాని చిత్తం కొట్టుకులాడుతుంటుంది.

అర్జునా! సహనమేమో కావాలి. అది పశుసహనం కారాదు. బండికి కట్టిన ఎద్దు, దిక్కులేని బజారు కుక్క చలిని, ఎండను, ఆకలిని దప్పికను సహిస్తూనే ఉన్నాయి. దరిద్ర భిక్షకుడు చాలీచాలని గుడ్డలతో శీతా, వాత

తాపాలను సహిస్తూనే ఉన్నాడు. విధిలేని, గతిలేని ఆసహనం మోక్ష సాధనం కాలేదు. బయట శాంతి వున్నా, లోపల శాంతి వుండదు. బయటి శాంతితోపాటు, లోపల శాంతి కూడా కూడి వుండాలంటే వివేకంతో కూడిన సహనం కావాలి. ఆ వివేకం ఎట్టిది అంటావేమో చెబుతా విను. ఈ సుఖదు:ఖాలు అనిత్యాలు. వీటికై నేనెందుకు వెత చెందాలి. అనే వివేకంతో తితీక్షను అవలంబించు. ఈ సుఖదు:ఖాలు వచ్చిపోయేవి. ఇటు వస్తవి, అటు పోతవి. ఈ అనిత్య వస్తువులతో నేనెందుకు తారుమారు కావాలి. పట్టుమని పది కాలాల పాటు కాపురం చేయవు కదా! వీటి కోసం నా స్వభావాన్ని నేనెందుకు కోల్పోవాలి. అనే వివేకంతో తితీక్ష నవలంబించు. ఈ తితీక్షాహీనుడు ధర్మమును నిలుపుకోలేడు. జ్ఞానమును నిలుపుకోలేడు.

సామాన్య మానవులు సుఖాన్ని మిత్రునిగా, దు:ఖాన్ని శత్రువుగా తలుస్తారు. కానీ సాధకుడు ప్రథమ దశలో సుఖాన్ని శత్రువుగా దు:ఖాన్ని మిత్రుడుగా తలపోయాలి. సుఖం మైమరపిస్తుంది. పుణ్యమును ఖర్చు చేసి పోతుంది దు:ఖము. పాపాన్ని తగ్గిస్తుంది. ఇంతకంటే గొప్ప మిత్రుడు ఎవరు. భక్తుని దృష్టిలో సుఖదు:ఖాలు భగవంతుని ప్రసాదాలు. వాటికి అతీతంగా వుండేవాడు నిజమైన భక్తుడు. జ్ఞాని అంటూ శ్రీకృష్ణుడు చెబుతూ వుంటే అందుకు అర్జునుడీ విధంగా అంటాడు.

**శ్లో ॥ యంహినము వ్యథయంతేతే, పురుషం పురుషర్షభ**
**సమదు:ఖ సుఖం ధీరం, సోమృతత్వాయ కల్పతే.**

స్వామీ! శ్రీకృష్ణా తితీక్షనవలంబించి సుఖదు:ఖాల బారినుండి తప్పించుకోమని బోధిస్తావు. మంచిదే, ఆ సుఖదు:ఖ జయము వలన నాకేమి లాభము. ఓర్చుకోవడము వరకేనా? మరేమైనా లాభముందా? ధాన్యము

లెక్కించేవాడు కూడా ప్రారంభంలో లాభమంటూనే పని ప్రారంభిస్తాడు. అది స్వభావం లాభం చూసుకొనే పని ప్రారంభిస్తాడు.

అర్జునా విను, సముద్రం ఒడ్డున గండశిలలు వుంటాయి. సముద్ర తరంగాలు విధి విరామం లేకుండా వాటిని ఢీకొంటాయి. అయినా అవి చలించవు. అలలు వదలవు – శిలలు కదలవు. ఇలాగే సంసార సముద్రం నుండి వచ్చిపడే సుఖదు:ఖాలకు చలించక వాటితో చిత్త సౌమ్యాన్ని కోల్పోక తన నిష్టతో నిలిచిన వాడే నిజమైన భక్తుడు, ధీరుడు, బయటి కామక్రోధాలను గెలువగలిగిన వాడే నిజమైన ధీరుడు.

ఒకతూరి హిరణ్యకశిపుడంటాడు. లోకాలనన్నిటినీ ఒక ఘడియలో గెలిచాను. నాకంటే వీరుడూ, గొప్పవాడు ఎవరూ లేరుఅని. అందుకు బాల భక్తుడు ప్రహ్లాదుడు చెప్పిన మాట స్మరించుకోవడం మంచిది. ఈ మాట భాగవతంలో ఉంది. తండ్రీ!

ఉ॥ లోకములన్నియున్ గడియ లోన జయించినవాడవు యింద్రియా
నీకము చిత్తమున్ గెలవ నేరవు, నిన్ను నిబద్ధుజేయు. నీ
భీకర శత్రులార్గుర ప్రభిన్నుల చేసిన ప్రాణి కోటిలో
నీకు విరోధిలేడొకడు, నేర్పున జూడుము దానవేశ్వరా!

అంటూ చక్కని సమాధానమిచ్చాడు ప్రహ్లాదుడు ఆ లోపలి శత్రువులను గెలిచితే ఏమి ప్రయోజనం అంటావేమో? అమృత పదవి లభిస్తుంది. మోక్షం లభిస్తుంది. భగవత్ప్రాప్తి లభిస్తుంది. దేవతల అమృతం దిక్కుమాలినది. దాన్ని చూచి కాపాడలేక అష్టకష్టాల పాలౌతున్నారు. ఎవరైనా ఎత్తుకు పోతారనే భయం దీనికి లేదు. సర్వేశ్వరుని దయతో, సద్గురు ప్రసాదంతో ఒక్కసారి లభించితే, దాన్ని త్రిమూర్తులైనా అపహరించలేరు. అర్జునా! నీవు

పురుషశ్రేష్ఠుడవు. ఈ సుఖదు:ఖ జయం కానీ, ఈ అమృత ప్రాప్తి కానీ, నీకు అశక్యమైనదేమీ కాదు. ఎందుకు శోకిస్తావు.

ఇక్కడ చిత్తాహంకారాల గెల్వడం గూర్చి ఓ ఉపమానం :-

ఒక గ్రామంలో ఇద్దరు మల్లయుద్ధ విశారదులు కలరు. పరోక్షంగా వీరిరువురికి ఒకరిపై మరొకరికి చాడీలు చెప్పుచుండిరి. ఒకరోజు ఇర్వురూ కలిశారు. ఓ చోట, ఏరా నీవు నా గురించి చాలా ఎక్కువగా మాట్లాడినావట అంటే, మరొకడు నీవే నా గురించి, చాలా కించపరిచి మాట్లాడినావట, మల్లయుద్ధంలో నాకు సమానుడా అని ప్రేలావుట, అంటూ ఇర్వురూ మల్లయుద్ధం చేయ తలపడి మల్లయుద్ధంలో పోరాడుతూ, ఒకడిని క్రింద పడవేసి ఇంకొకడు నిన్ను ఇక బ్రతకనివ్వను, చంపేస్తానంటూ పిడిబాకు పైకి లేపాడు. ఒక వ్యక్తి క్రింద పడ్డ వ్యక్తి, ఎటూ చంపకుండా నన్ను వదలడని, కసి తీర్చుకోలేక పైనున్న వ్యక్తి ముఖము నిండా ఉమ్మి వేశాడు. అప్పుడు కత్తిని ప్రక్కకు పారవైచి లేచి పోతాడు పైనున్న వ్యక్తి. అపుడు క్రిందబడ్డవ్యక్తి ఎందుకు నన్ను చంపకుండా వదిలావు అని అడుగగా, నీవు నామీద వుమ్మివేయకుండిన తప్పక చంపివుండేవాడిని. నీవు వుమ్మివేసినందుకు బ్రతికి పోయావంటాడు.

అదెలా సాధ్యం వుమ్మివేసిన యింకా తొందరగా చంపాలి కదా! వదిలి పెట్టినా వెందుకు అనగా! నిజమే నీవు వుమ్మి వేయగానే నా చిత్తం " ఊ చూస్తావేం, చంపు తొందరగా" అని చెప్పింది. అప్పుడు నేను నిన్ను చంపితే చిత్తం మాట విన్నట్లవుతుంది. చిత్తం మాట వినవద్దని మా గురువుగారి ఆజ్ఞ. ఆ మాట పాటించుటకై నిన్ను వదలవలసి వచ్చింది, అన్నాడట. కావున వాటి మాట విన్నామా మనగతి అధోగతి అని నమ్మండి.

అర్జునా! శోకింపదగని వాళ్ళకోసం శోకిస్తావే? ఆత్మ నిత్య వస్తువు. దాని కొరకు శోకింపనవసరం లేదు. అనాత్మ పదార్థాలన్నీ అనిత్యాలు. వాటిని గురించి శోకించి లాభం లేదు. అని నిత్యానిత్య వివేకాన్ని ఉపదేశించి ఇపుడు సదా సద్వివేకాన్ని గురించి ప్రారంభం చేస్తున్నాడు. ఈ కన్పించే జగత్తు నిత్యంకాదు. అధిష్ఠాన పరమైన పరమాత్మ నిజం కుండ. కుండ రూపంతో నిజం కాదు. మట్టి రూపంతో నిజం జగత్తు. జగత్ రూపంలో సత్యంకాదు. అధిష్ఠాన దృష్టి కలవానికి పరమాత్మ సత్యం. అర్జునా! లోకాలు తలక్రిందులయినా ఇది చలనం లేని సిద్ధాంతము. " సత్తు సత్తే - అసత్తు అసత్తే". కావున ఎందుకు వ్యర్థంగా శోకిస్తావు. తత్త్వమెరిగి శోకాన్ని వదలమంటూ, శ్రీకృష్ణుడు బోధించగా, అర్జునుడంటాడు.

స్వామీ! మహానుభావా! ఈ విషయాన్ని గురించి మరింత విపులంగా తెలియజేయమని కోరగా, కిరీటీ! నువ్వులలో నూనెవలె, పాలలో వెన్నవలె, ఆత్మ అన్నిటా వ్యాపకమయి వుంది. సంకుచితమైన మన దృష్టి వ్యాప వస్తువులను మాత్రమే చూడగలుగుతుంది. కానీ వ్యాపక వస్తువును చూడలేదు. నిత్యుడూ, అవినాశి, అప్రమేయుడూ అయిన ఈ శరీరం యొక్క దేహాలు అంతవంతాలు అని తత్త్వజ్ఞులంటారు. తెలిసి యుద్ధం చేయి భారతా అంటాడు. భగవంతుడిక్కడ అర్జునుని యుద్ధం చేయుమని చెప్పినమాట విధివాక్యం కాదు. అనువాద వాక్యము మాత్రమే అర్జునుడు యుద్ధం చేయాలని వచ్చాడు. కానీ ఈ యుద్ధం నరకదాయకము. శ్రేయ: ప్రతిబంధకము" అనే సంశయంతో ఆగాడు. భగవంతుడు సంశయాన్ని నివారించి "నీవు చేయబూనిన యుద్ధం చేయి" అంటూ అన్నాడు. సంశయ నివారణే భగవంతుని పనికాని యుద్ధం చేయించడం కాదు. ఒకడొక ఊరికి పోతున్నాడనుకో, మధ్యలో వానికి రెండు మార్గాలు కనిపించాయి. అపుడు అతడు ఏ మార్గంలో పోవాలో తెలియక ఆగిపోయాడు. అంతలో ఒక వ్యక్తి వచ్చి, వాని సంగతి తెలిసి అది " నీవు వెళ్ళాల్సిన దారి కాదు. ఇది నీదారి. ఈ దారిలో నీవు చక్కగా

వెళ్ళవచ్చు. సంశయం లేదు. పొమ్మంటాడు. కానీ ఆ పంపడం అతని అభిప్రాయం కాదు. పోయే దానికై వాడే వచ్చాడు. ఎటూ పోతాడు. తన సంశయంతో తన పని పూర్తవుతుంది. కావున అది అనువాద వాక్యమే కానీ విధివాక్యం కాదు. జ్ఞానియై కర్మలు చేయాలని భగవద్గీత అభిప్రాయము. “జ్ఞాత్వా కర్మాణి కుర్వతి” అనే ఆర్యోక్తి వుంది. “ జ్ఞానం లేనివాడు కర్మలు చేసి బద్ధుడౌతాడు. జ్ఞాని కర్మబంధానికి అంటుకోడు” దానినే “ఈత తెలిసి నదిలో దిగాలంటారు” తెలియక దిగితే “నదీనాం సాగరో గతి:” మాధవా! నీవు చెప్పిన ఆత్మానాత్మ విజ్ఞానంతో శోకం తొలగవచ్చు. కానీ యుద్ధం చేస్తే పాపం తప్పుతుందా! అని అర్జునుని శంక. జ్ఞానంతో శోకం లేకపోవచ్చు. కానీ, పాపం లేకపోతుందా! అని అర్జునుని సందేహం. జ్ఞానంతో శోక నివృత్తే కాదు. పాప నివృత్తి కూడా! అని భగవంతుడంటాడు. ఒక్క పాపమే కాదు. జ్ఞానంతో పాప పుణ్యాల ప్రసక్తి ఉండదు. కర్త అయినవానికి పాపపుణ్యాల సంబంధం తప్పదు. అకర్త అయిన ఆత్మకు పాపపుణ్యాల సంబంధం లేదు. చెట్టు ఎక్కనివానికి దిగే పనిలేదు. ఎవడు ఎక్కినాడో వాడు దిగక తప్పదు. ఎవడు కర్తో వాడే అనుభవిస్తాడు. కర్తకాని ఆత్మకు పాపపుణ్యాల సంబంధం లేదు. ఆత్మ నిత్యమని, నిర్వికారమని చెప్పి, ఆత్మ అకర్త, అభోక్తయని ప్రతిపాదిస్తున్నాడు. ఈ ఆత్మ స్వరూప యధార్థ జ్ఞానానికి ఫలము శోకనివృత్తి.

**శ్లో ॥ యఏనం వేత్తిహంతారం – యశ్చైనం మన్యతేహతం**
**ఉభౌతౌన విజానీతో – నాయంహంతి నహన్యతే.**

అర్జునా! ఈ ఆత్మ చంపుతుందని చస్తుందని, తలచే వారిద్దరూ, ఆత్మ స్వరూపాన్ని యధార్థంగా తెలియని వారే! ఈ ఆత్మ చంపేది కాదు. చచ్చేది కాదు. చంపుట, చచ్చుట యనునవి క్రియలకు ఉపలక్షణాలు. కర్త, కర్మ ప్రేరకభావాలు ఆత్మయందు లేవు. అనాత్మ ధర్మాలను ఆత్మయందారోపించరాదు. అర్జునుని ఆత్మ చంపేది కాదు. భీష్మ ద్రోణాదుల ఆత్మలు చచ్చేవి కావు.

శ్రీకృష్ణుని ఆత్మ ప్రేరేపించేది కాదు. కర్త, కర్మ, ప్రేరక భావాలు బుద్ధి ధర్మాలు. ఇది శుష్క వేదాంతం కాదు. ఉపనిషద్ సిద్ధాంతం. ఒకడు హత్య చేశాడు. న్యాయాధిపతి విచారించి ఉరిశిక్ష విధించాడు. ఆ ముద్దాయి జేబులో భగవద్గీత వుంది. దానిని పైకి తీసి శ్లోకాన్ని చదివి, న్యాయాధిపతితో అయ్యా! అత్మ చచ్చేది కాదు. చంపేది కాదు. నాకెందుకు శిక్ష విధిస్తారు. అని అడిగాడు. అప్పుడు న్యాయాధిపతి, నిజమే నీవు చంపిన వానివి కావు. ఇపుడు చచ్చే వానివీ నీవు కావు. శిక్షను చెప్పిన వాణ్ణి నేను కాదు. ఈ శిక్ష దేహానికి గాని, ఆత్మకు కాదు. అని న్యాయాధీశుడు జవాబిచ్చాడు.

మృత్యు సమయంలో ఏడ్చేవాడు అజ్ఞాని మాత్రమే జ్ఞాని ఏడ్వడు. పక్వం కాని కాయను గిల్లితే రసం కారుతుంది కానీ, పక్వమైతే కారదు. జ్ఞాన పరిపాకం కల్గినవాడు మృత్యుసమయంలో ఏడ్వడు. కసికాయ వంటివాడే కన్నీరు పెడతాడు. బ్రతుకుట చచ్చుట దేహానికి అని వార్యంగా కలిగే స్వభావాలే! బ్రతుకు వలె చావు కూడా సమానమైన విలువ కలదే. దీని కొరకు శోకించడం తగదు. జీర్ణమై పోయిన వస్త్రాలను కదా వదిలేది. శరీరాల విషయంలో అలా లేదే! బాలక శరీరాలు, యువక శరీరాలు మరణిస్తున్నాయే అని అంటావా? దేహాల విషయాలలో జీర్ణం కావడం కర్మతో జీర్ణమయినవి బాలకులవి గానీ, యువకులవి గానీ, ఆ శరీరాలు జీర్ణ శరీరాలే! చీకుపట్టిన వస్త్రాలు కొత్తవి అయినా, జీర్ణ వస్త్రాలే కదా! ఇదీ అంతే. భీష్మాదులు జ్ఞానులయితే ఈ యుద్ధంలో దేహ జంజాటకం తప్పుకొని విదేహ ముక్తులు అవుతారు. జ్ఞానులు కాని పక్షంలో నవతరమూ, కళ్యాణ తరమూ అయిన దివ్యదేహాలు పొంది సుఖిస్తారు. పాప భూయిష్టులగు ఈ దుర్యోధనాదులు సైతము యుద్ధంలో దేహాలను ఎడబాశారంటే పాప పంకిలాన్ని ప్రక్షాళనం చేసుకొని స్వర్గసీమను అధిగమిస్తారు. వారి యెడ కూడా ఇది లాభసాటి కార్యమే! నీవు నీ ధర్మాన్ని నెరవేర్చు కొని సార్థకత పొందుతావు. సన్నిహిత మృత్యువును సద్వినియోగం చేసుకొని వారూ సార్థకులు అవుతారు అర్జునా.

అర్జునా నరుడు వస్త్రాలను మార్చినట్లు ఈ ఆత్మను కత్తులు ఖండించజాలవు. అగ్ని కాల్చలేదు. నీరు తడుపలేదు. గాలి కదల్చలేదు.

**శ్లో ॥ నైనం ఛిందంతి శస్త్రాణి నైనం దహతి పావక:**
**నచైనం క్లేదయంత్యాపో – నశోషయతి మారుత:**

కిరీటీ! ఆత్మ అవినాశిని యని, ఆత్మ కోసం ఏవిధంగానూ, శోకించపనిలేదు. కొందరి దృష్టిలో దేహమే ఆత్మ అనియు, దేహంతోపాటు ఆత్మ పుడుతుందని, దేహంతో పాటు మరణిస్తుందని, మనుష్యుడు ఎందుకు పుడుతాడంటే చచ్చేటందుకని వారిమాట. ఏది తప్పినా మరణం తప్పనప్పుడు తప్పని పరిస్థితికి తన్నుకొని ఏడిస్తే ఏమి ప్రయోజనం. గాలి వేస్తుందని, సూర్యుడు ఎండకాస్తాడని, భూమి తిరుగుతుందని, అగ్ని వేడిగా వుందని ఏడిస్తే, ఎంత ప్రయోజనమో ఇదీ అంతే! కావున అన్ని విధాలుగా ఆలోచించి శోకమును వదులుము. భగవంతుని సిద్ధాంతములో భగవద్గీత నిష్కర్షలో "ఆత్మ" సత్యము, నిత్యము, అజము, అవికారి, అచింత్యము, నిర్గుణము. కాబట్టి శోకింపవలసిన అవసరం లేదు. ప్రక్క సిద్ధాంతాలను పట్టి చూసిన శోకం నిరర్ధకమే! అంటూ భగవంతుడు ప్రతిపాదించాడు.

భారతా! ఈ శరీరాలు కూలినా, రాలినా, ఉండినా, మండినా, ఆత్మకు నాశనం లేదు. కుండ బ్రద్దలయితే కుండలోని ఆకాశం బ్రద్దలు కాదు. చచ్చే శరీరాలలో వుండి కూడా ఆత్మ చావదు. కదిలే భూతాలలో వుండి ఆత్మ కదలదు. మారే భూతాలలో వుండి ఆత్మ మారదు. దీనిని గూర్చి తత్త్వ జ్ఞానులు యే విధంగానూ శోకించరు. అర్జునా! ఈ పరమార్థమెరింగి నీవూ శోకవిముక్తుడవు కమ్ము. తత్త్వ దృష్టిని అవలంబించి చూస్తే యే విధంగానూ శోకం నిరర్థకము. అంటూ 8 శ్లోకాలతో బోధించాడు శ్రీకృష్ణుడు. 31న శ్లోకం నుండి 38వ శ్లోకం వరకు ఈ ఎనిమిది శ్లోకాలను పెద్దలు "ధర్మాష్టకము" అందురు.

పార్థా! ధర్మం కొరకై అధర్మం రూపుమాపుట క్షత్రియునికి పరమ ధర్మము. భీష్మాదులంతటి వారు ప్రతి యోధులగుట నీ భాగ్యం కాదా! క్షత్రియ ధర్మానికి కట్టుబడి కదా నీ యెదుట వుండే ఈ భీష్ముడు బ్రాహ్మణుడూ,గురువూ అయిన పరశురామునితో యుద్ధం చేశాడు. ఆ విషయం జ్ఞాపకం తెచ్చుకో! సర్వాన్ని ఒడ్డి ధర్మాన్ని కాపాడుట క్షత్రియ జాతికి పరమ ధర్మము. నీవు అనుక్రమంగా పవిత్రమైన క్షత్రియ జాతిలో పుట్టావు. పుణ్యాత్ములైన సుక్షత్రియులకే ఇట్టి ధర్మయుద్ధం లభిస్తుంది. అదే వారికి పర్వదినం, శుభదినం, సంతోషదినం. స్వజనుల చంపితే మాకు సంతోష మెక్కడిదని విచారిస్తావు. కానీ క్షత్రియునికి ధర్మయుద్ధమే సుఖ స్వరూపమైనది. యుద్ధము సుఖమా? అంటావేమో! యుద్ధం సుఖం కాకపోయినా క్షత్రియులకు పరమధర్మం కాదా? ధర్మ ద్రోహులైన కౌరవుల మూకను, నామరూప నిశ్శేషంగా నురుమాడి విజయ నామాన్ని సార్థకం చేసుకో! ధర్మాన్ని, సత్యాన్ని తృణీకరించి ధన, దర్పమదోన్మత్తులైన ధార్తరాష్ట్రులకు పాపకాలం పండింది. నీ గాండీవ శరపరంపరలు వారిని క్రమ్ముకొనుటే తరువాయి.

మీది ధర్మపక్షం. ఆకారంలో తిరిగే ధర్మ స్వరూపమే ధర్మరాజు. ఫాలాక్షుడు కాదన్నా గెలుపు మీదే! ఇలాంటి అవకాశం వచ్చి వరిస్తానంటే, యుద్ధం వద్దంటావే? ఇదెక్కడి చాదస్తము. ధర్మ భ్రష్టునివి కావద్దు. స్వధర్మం భార్య వంటిది కాదు. తల్లివంటిది. భార్యను తాను పరిత్యజించుకోవచ్చు. తల్లి విషయం అలాకాదు. అక్కడ తన నిర్ణయం జరుగదు. అలాగే స్వధర్మం నీవిధి. అర్జునా! ఇది యుద్ధం కాదు. స్వర్గానికి రాచబాట. ఈ అపూర్వ అవకాశాన్ని జారవిడచుకుంటావా? నీవే యుద్ధం వదలినా వంటే నిన్ను క్షత్రియుడనటానికే వీల్లేదు. ఇంతకు పూర్వం నిన్ను పొగిడినవారే తిట్టిపోస్తారు. నీ అసమర్థతను చూచి శత్రువులు ఆనందిస్తారు. గేలి చేస్తారు. మర్యాదస్థునికి



**రహస్యంగా అపకారం చేయువానికి శిక్షలూ రహస్యంగానే పడును. బాహాటంగా అపకారం చేసిన వానికి శిక్షలు బాహాటంగా పడును.**

అపకీర్తి చావుకంటే చెడ్డది. కనుక అర్జునా! ఈ పందతనాన్ని విడిచి ధైర్యాన్ని అవలంబించు. ఒకవేళ యుద్ధంలో మరణించినా అమర భోగాలు మోక్ష ప్రాప్తి లభిస్తుంది. బ్రహ్మజ్ఞానం తోనే సమస్త ఫలితాలు లభిస్తుంటే ఇక నేను కర్మలు చేయుట ఎందుకంటావా! అటుకాదు నిష్కామకర్మయోగ విధాన మెట్టిదో, దాని గుణదోషాలు ఏవో, దాని స్వరూప స్వభావాలేవో సావధానంగా విను.

**శ్లో ॥ కర్మణ్యేవాధికారస్తే, మాఫలేషు కదాచన**
**మా కర్మఫల హేతుర్భూ, ర్మాతే సంగోస్త్వ కర్మణి**

అర్జునా! నీకు కర్మయందే అధికారం కలదు కానీ, ఫలం పై అధికారం ఎప్పుడూ వుండకూడదు. ఫలం వదిలివేయమంటే కర్మే వదుల్తానంటావే? ప్రపంచంలో ఫలం వస్తుందని తెలిస్తేనే పని చేస్తారు. పని చేయమంటే "ఏమిస్తావు" " ఏమొస్తుంది" అని అడిగేది రజోగుణ స్వభావం. ఈ రెండు స్వభావాలు బంధం కలిగించేవే? కర్మ చేస్తే ఫలం వస్తుందనే ఆసక్తి కానీ, ఫలం రాదని వదిలి ఊరకుండడం తమోగుణ స్వభావం. ఈ రెండూ పనికి రావు. ఏ ఆసక్తి అయినా బాధించేదే. కర్మలు వదిలేస్తానని పనులు ఒదిలేది సోమరి తనంలోవుండే దరిద్ర కర్మ, పెద్దలు ఇలా అంటూ ఉంటారు. "దయ్యం మనుష్యుల నాకర్షిస్తుంది. సోమరి మానవుడు దయ్యాలనాకర్షిస్తాడు". ఫలాసక్తితో పని చేస్తే రజోగుణం. పని మానేస్తే తమోగుణం. ఈ రెండింటి మధ్య భగవద్గీత ఒక మార్గం తెలిపింది. "పని చేయి – ఫలం వదులు" ఇది సాత్విక మార్గము. ఒక పాములవాడున్నాడను కోండి. పాము కరుస్తుందని భయపడి వదిలితే వాని బ్రతుకు జరుగదు. పాము కరిస్తే జీవితమే పరిసమాప్తి. ఇలా రెండూ కాకుండా మధ్యలో ఒక యుక్తి వుంది. పామును వదిలే పని లేదు. చచ్చే భయమూ లేదు. పాముకు కోరలు తీసివేసి ఎంత ఆడుకున్నా,



పుణ్యఫలితం నశించగానే స్వర్గమునుండి మరలా భూలోకంలో జన్మించవలసిందే.

ఏ ప్రమాదము వుండదు. అలాగే కర్మ ఒక సర్పం. అది బంధం కలిగిస్తుంది. వదిలే వీలు లేదు. కానీ ఫలాసక్తి అనే కోరలు తీసివేస్తే ఎంత ఆడుకొన్నా బంధదాయకం కాదు. అదీ గాక చెప్పే సూక్ష్మ మార్గము. ఈవిధంగా కర్మ యోగమును బోధించిన శ్రీకృష్ణుడు 48వ శ్లోకంలో ఆకర్మ ఏవిధంగా ఆచరించాలో బోధిస్తున్నాడు.

**శ్లో ॥ యోగస్థ: కురుకర్మాణి – సంగం త్యక్త్వా ధనంజయ**
**సిధ్య సిధ్యో సమో భూత్వా – సమత్వం యోగ ముచ్యతే॥**

ధనంజయా! సంగం వదిలి సిద్ధిలో, అసిద్ధిలో సమభావంతో కర్మలు చేయి. కర్మయోగికి సమబుద్ధులు కావాలి. కాని. సంగబుద్ధి పనికి రాదు. సంగమే బంధానికి కారణము. ఈ కర్మ నాది, దీన్ని చేసే కర్తను నేను, దీని ఫలం కావాలనే ఏ కోరికా యుండరాదు. ఈ సంగబుద్ధికి అతీతుడవు కావాలంటే సిద్ధిలో, అసిద్ధిలో సమదృష్టి సాధించాలి. "సమత్వం యోగముచ్యతే" సమత్వమే యోగము. సమత్వాన్ని సమదృష్టిని గూర్చి శ్రీకృష్ణుడనేక మార్లు హెచ్చరించాడు. "సమదు:ఖసుఖం" "పండితా స్సమదర్శిన:" "సమబుద్ధిర్విశిష్యతే" "సమస్సంగ వివర్జిత:" సమలో ష్టాంశ్మకాంచన:" అని చెప్పబడింది. వేయేల గీతాయోగమే సమత్వయోగము. ధనంజయా, సకాల కర్మలు కర్తకు రాగద్వేషాలు కలిగిస్తాయి. జనన మరణాలు కలిగించి బంధానికి హేతువు అవుతాయి. నిష్కామ కర్మలు చిత్తశుద్ధికి, అత్మ జ్ఞానానికి సాధనాలు. మోక్షానికి మార్గదర్శకాలు. కావున నీవును సమబుద్ధిని ఆశ్రయించి ప్రవర్తింపుము. ఇట్టి సమబుద్ధితో కూడు కున్నవాడు కర్మలను తన కర్తవ్యాలుగా తలపోసి , ఫలాసక్తి లేక నిర్వర్తిస్తాడు. నెరవేరినప్పుడు సంతోషంకాని, నెరవేరనప్పుడు దు:ఖం కాని వానికి లేదు. ద్వంద్వ తరంగాలు వాని సమబుద్ధిని కదిలించలేవు. అట్టి కర్మ యోగి ఈ జన్మ యందే పుణ్యపాపాలకు



**అందరి పాపాలను పుణ్యనదులు హరించితే పుణ్యనదుల పాపాలను పుణ్యపురుషుల స్నానాలతో నదులు పవిత్రం అవుతాయి.**

అతీతుడౌతాడు.

అర్జునా! దేహం నేను అనుకొనుటకు, దేహ సంబంధీకులగు భార్యా పుత్రులను నావారని అభిమానించుట మోహబుద్ధి లక్షణము. మోహమనగా విపరీత భావన. అనాత్మను ఆత్మ అని, అనిత్యమును నిత్యమనుకొని, అసుఖమును సుఖమనుకొను విపరీత బుద్ధే మోహము. మోహమొక "ఊబిగుంట" మోహనిష్ట వల్ల చిత్తానికి స్థిమితముండదు. అట్టివాడు వాంఛలకు, వాసనలకు కింకరుడై ఇహపరభోగాలకు ఉవ్విళ్ళూర్తాడు. అర్జునుడు ఇంతవరకు స్థిరబుద్ధి యొక్క మహత్వాన్ని విన్నాడు. ఆ స్థిరబుద్ధి కల్గిన మహానుభావుని లక్షణ విలక్షణాలను తెలుసుకోవాలనే అభిప్రాయం కలిగి కృష్ణునితో అంటాడు.

**శ్లో ॥ స్థిత ప్రజ్ఞస్యకా భాషా – సమాధిస్తస్య కేశవ**
**స్థితధీ: కిం ప్రభాషేత – కిమాసీత వ్రజేతకిం.**

కేశవా! స్థితప్రజ్ఞుని లక్షణమేమి? ఆ స్థిత ప్రజ్ఞుడు ఏ విధంగా మాట్లాడుతాడు. ఏ విధంగా కూర్చుంటాడు. ఏ విధంగా సంచరిస్తాడు. దయచేసి చెప్పు దేవా! అంటూ అర్జునుడు అడుగుచున్నాడు. "స్థితప్రజ్ఞులకు స్థితప్రజ్ఞుడు" తన ఎదుటనే ఉన్నాడు. అయినా! ఈ ప్రశ్న తన కొరకు కాదు. తన తర్వాతి వారి గతియేమని అర్జునుడు మనందరి కొరకు ఈ ప్రశ్నను కదిలించాడు. ఈ స్థితప్రజ్ఞుడు గీతకు ఆదర్శమూర్తి. వైదిక సంస్కృతికి ఉజ్వల ప్రతీక. ప్రతి మానవుడూ స్థితప్రజ్ఞుడు కావాలంటూ భగవద్గీత ఆశయం. మహాత్మాగాంధీగారి ఆధ్యాత్మిక శిష్యుడు శ్రీ వినోబాగారు ఈ ప్రకరణముపై "స్థితప్రజ్ఞ దర్శనము" అనే పేరుతో మరాఠీలో ఉత్తమ వ్యాఖ్యానాన్ని రచించాడు. భగవద్గీతకు పూర్వగ్రంధాలలో జీవన్ముక్తుడు, యోగి, బ్రహ్మజ్ఞాని అనే శబ్దాలు లభిస్తాయి. కానీ స్థితప్రజ్ఞుడనే శబ్దం మాత్రం భగవద్గీత సృష్టే.

**అర్జునుని ప్రశ్నకు భగవానుల జవాబు:-**

పార్థా! మనోగతాలైన సర్వకామనలను ఎప్పుడు సంపూర్ణముగా వదులుచున్నాడో, ఎప్పుడు ఆత్మయందు ఆత్మతో సంతోషించువాడైయున్నాడో అతడు స్థితప్రజ్ఞుడని చెప్పబడ్తాడు. ఒక పాత్రలో భోజనం పెట్టాలంటే ముందాపాత్రను శుద్ధి చేయాలి. అలాగే అంత:కరణంలో జ్ఞానాకారవృత్తి నెలకొనాలంటే ముందు ఆ అంత:కరణంలోని కామనావృత్తులను బహిష్కరించాలి. "మనోగతాన్ సర్వకామాన్" మనస్సులోని సమస్త కామనలని అర్థము. కామనలు అనగా కోరికలు. "మనస్సు కోరికల పుట్ట". మనస్సే కోరికల స్వరూపం. ఇక్కడ మనస్సులోని కోరికలన్నారు కానీ, ఆత్మలోని కోరికలనలేదు. కోరికలు మనస్సుకేగాని ఆత్మకు లేవుకదా! "మనస్సులో వుంటే ఉండనీలే" అనే మాట పనికిరాదు.

"మనోగతాన్ సర్వకామాన్ ప్రజహాతి" మనస్సులోని సర్వకామనలను వదలవలె నంటూ భగవంతుడంటున్నాడు. "ప్రజహాతి" అనే మాటకు ఏదో వదలుట కాదు. పూర్తిగా వదలుట అని అర్థము. ఈ స్థితి స్థితప్రజ్ఞునికి సహజలక్షణం. సాధకుడికి సాధనలక్షణం. సిద్ధ పురుషులకు సహజమైన లక్షణాలను ఆదర్శంగా పెట్టుకొని సాధకుడు ప్రయత్నపూర్వకముగా సాధించాలి. సిద్ధాంతం తనకు ఎంతదూరంలో వున్నా ఫరవాలేదు. అనుకూల ప్రవర్తన మాత్రం ఉండరాదు ''సర్వకామాన్'' అన్ని కోర్కెలను వదలాలని భగవంతుడన్నాడు. చెడ్డ కోరికలను వదిలి, మంచి కోర్కెలను పెట్టుకోమనలేదు. ఇక్కడ చెప్పినది స్థితప్రజ్ఞుని మాట కానీ, సాధకుని మాటకాదు. ఈ కామనాజయం సామంతో, దానంతో, దండంతో జరిగేది కాదు. ఒక్క భేదోపాయమే శరణ్యం. "కామనలను చూచే వాడుగా వుండాలేగానీ, తాకేవాడుగా వుండరాదు". వేదాంతంలో ఇది ఒక సూక్తి. మనస్సును

చూచేవాడుగా వుండాలి. కోరికలతో కలిసి కోరికలను జయించుట చాలా కష్టము. వాటికి తాను సాక్షిగా ఉండాలేకాని తాకరాదు. " కరెంటును తాకితే చంపుతుంది." అలాగే జ్ఞాని అయినవాడు కోరికలకు దూరంగా ఉండాలి. ప్రకృతి అంతే. కామనా త్యాగంతో అమృతత్వాన్ని పొందవచ్చును. శ్రీకృష్ణుడు బాల్యంలో కాలి బొటనవ్రేలు నోటిలో పెట్టుకొని ఆనందించేవాడు. "ఆనందం నీలోనే ఉంది. దానిని అనుభవించు" అని దాని అర్థం.

అర్జునా! స్థితప్రజ్ఞుని మనస్సు దు:ఖాలతో కలవరపడదు. సుఖాలపై వాంఛ లేదు. రాగ, భయ, క్రోధాలు వానిని వదిలిపెట్టాయి. అట్టి ముని స్థితప్రజ్ఞుడు. "కిం ప్రభాషేత" స్థితప్రజ్ఞుడు ఏవిధంగా మాట్లాడతాడు. ప్రాప్తించిన హర్ష శోకాల్లో అతడెట్లుంటాడని అర్జునుడడుగగా ఆది దేవుడంటాడు.

అర్జునా! సుఖాలు, దు:ఖాలు అవి దైవికాలు. అవి కోరితే వచ్చేవి కావు. వలదంటే పోయేవికావు. పాప పరిపాకం వల్ల దు:ఖాలు, సుఖ పరిపాకం వలన సుఖాలు వస్తాయి. సామాన్య అజ్ఞాన మానవులు దు:ఖాలకు బెదిరిపోతారు. అదొక దౌర్బల్యం. సుఖ సమయాల్లో మైమరచిపోతారు. అదొక దౌర్భల్యమే. స్థితప్రజ్ఞుడు కష్టాలలో కలత చెందడు. సుఖాలు కలిగినపుడు సంతసించడు. సుఖాలు ఎవ్వనిని ఆకర్షించలేవో అతనిని కష్టాలు సయితం కలత చెందించలేవు. సుఖాలు కావాలని పడి చచ్చేవాడు దు:ఖాలంటే పరిగెత్తి పారిపోతాడు. ఆత్మ తత్త్వాన్ని అనుభవించేవాడు. ఈ బయటి కష్టసుఖాలకు ఆరాటపడడు. స్థితప్రజ్ఞునికి రాగంలేదు. క్రోధం లేదు. ఈ రాగం వల్లనే మరణించాడు దశరథుడు. క్రోధం వల్ల మరణించాడు దుర్యోధనుడు. కామం వల్ల సర్వనాశనమయ్యాడు రావణుడు. వీటి శక్తి ఎంత గొప్పదో దీనిని బట్టి మనం తెలుసుకోవచ్చు. అర్జునా అన్నింటితో

కలిసిమెలిసి వ్యవహరించినా స్థితప్రజ్ఞుడు "అద్దం" వలె ఏదీ అంటకుండా ఉదాసీనుడై వుంటాడు.

వేటియందు అతిగా అనుబంధం పెంచుకోడు. అంతా ఈశ్వరుని సొత్తు అయినపుడు అవి వచ్చినపుడూ, రానపుడూ ఉన్నా లేకున్నా, శుభం వచ్చినపుడు పొగిడేది లేదు. కష్టం వచ్చినపుడు తెగిడేది లేదు. అట్టివాడే స్థితప్రజ్ఞుడు. అతడు ఇంద్రియాలను వదలగలడు. లోపలికి తీసుకోగలడు.

ఈ ఇంద్రియ నిగ్రహం సాధకునకు అత్యాంతావశ్యకము. అయితే అదే సర్వస్వం కారాదు. అదే సర్వస్వం అయితే రోగులు, నిరాహారులు కాని ఇందుకు సరిపోరు. "చెల్లియుండియు సైరణ చేయునతడు" అన్నట్లు విషయాసక్తి మనస్సులో శేషించి ఉన్నంతసేపూ, ఇంద్రియ నిగ్రహం పూర్ణత్వం చెందదు. మనస్సు స్వాధీనానికి వచ్చినపుడే ఇంద్రియ నిగ్రహం సాధ్యమవుతుంది. అర్జునా! మనస్సును నిగ్రహించుట సాధకుని ముఖ్య ధర్మం. విషయచింతనలను వెంటనే నివారించకపోతే అది దాని ప్రభావం వికృతంగా చూపకపోదు. విషయధ్యానం వల్ల విషయసంగం కలుగుతుంది. ఆ వస్తువు వుంటే బాగుండుననే కోరిక కలుగుతుంది. ఈ కామం నెరవేరిందనుకొందాము. అప్పుడు లోభం కలుగుతుంది. ఈ సమ్మోహాలతో బుద్ధి భ్రంశం కలుగుతుంది. అనగా వివేకమైన జ్ఞాన శక్తిని కోల్పోతాడు. కనుక బాహ్యేంద్రియ నిగ్రహముతో పాటు అంతరేంద్రియ నిగ్రహం కూడా ముఖ్యంగా వుండాలి.

అర్జునా! మనస్సులో విషయాసక్తి నశిస్తే, రాగద్వేషాలు నిరాశ్రయమై వాటంతట అవే తొలగిపోతాయి. జగత్తు మిధ్య అని గుర్తించిన జ్ఞాని వాయువులాగా, సూర్యునిలాగా కర్మలలో సంచరిస్తున్నా కర్మబంధాలకు గురికాడు. కౌంతేయా! అమృత సముద్రాన్ని ఆపోశనం చేసిన వానికి ఆకలి

దప్పులుంటాయా? సూర్యుడు ఉదయించుసరికి చుక్కలు అదృశ్యమయినట్లు జ్ఞాన సూర్యుడు ఉదయించగానే, అజ్ఞాన అంధకారం పటాపంచలగును. ప్రపంచంలో ఒక్కొక్క దు:ఖానికి ఒక్కొక్క మందు వుంది. కాని అన్ని దు:ఖాలకు ఆత్మ ప్రసాద మొక్కటే మందు. సంయమ శక్తి లేని వానికి ఆత్మ విషయమైన బుద్ధి వుండదు. నిష్ఠ కూడా ఉండదు. ఆత్మ నిష్ఠలేనివానికి శాంతి ఎక్కడిది. అజ్ఞానంతో పరితపించువానికి మోక్షసుఖమెక్కడిది. మానవునికి ముఖ్యమైన ఉపకరణాలు మూడు. బుద్ధి, మనస్సు, ఇంద్రియాలు, ఇంద్రియాలకు వశమైతే సంసార ప్రాప్తి - మనస్సు బుద్ధికి వశమైతే ఆత్మ ప్రాప్తి లభిస్తుంది.

కం॥ కర్మలు చేయగవలయును - కర్మలు చేయంగలేని కర్ముల నెపుడున్,

చర్మమ్ము లొలుచుదైవము - కర్మలు యేరీతిజేయ కర్మలు తొలగున్! యీ కర్మలు గూర్చి ఆ దేవదేవుడేమంటాడో, చదవండి తరించండి.

మహా బాహుడైన ఓ అర్జునా! కామభోగాలురానీ, రాకపోనీ వాని శాంతికి లోటు లేదు. అతడు శాంతి ధామానికి యజమాని. అతడు కోర్కెలను కోరడు. కోరికలే అతనిని చేరి శాంతి పొందుతాయి. వాని హోదా కామభోగాల దయాధర్మాలకు లొంగిలేదు. తన మహిమపై తానాధారపడి వుంటాడు. కామ కామికి ఎప్పుడూ శాంతి వుండదు. స్థిత ప్రజ్ఞుడు తన పూర్ణస్థితిలో తానుంటే ప్రాప్తించవలసినవి రానే వస్తాయి. సముద్రుడు కోరకపోయినా నదులు వాటంతట అవే వచ్చి చేరినట్లు, తనకు అవసరమయినవి అవే వచ్చి చేరును. ఇక్కడ ఓ ఉపమానం చూద్దాము.

## "లక్ష్మీదేవి స్వయంవరం" కథ

సముద్రమథన సమయమందు లభించిన వస్తువులను ఒక్కొక్కరు ఒక్కో దాన్ని వస్తువు తీసుకుంటున్నారు. లక్ష్మీదేవి ఉద్భవించగానే, దేవతలు, రాక్షసులు అందరూ "ఆమె నాకు కావాలంటే నాకు కావాలి" అని తోపులాడుకొనుచున్నారు. వారందరినీ చూసి లక్ష్మీదేవి మీరందరూ నన్ను కోరుచున్నారా అనగానే "ఔను" అని అందరూ ముక్తకంఠంతో పలికారు. అదెలా సాధ్యం నేను ఒక్కదాన్ని ఇంతమందిని వివాహమాడటం ఎలా సాధ్యమవుతుందని ఆమె ప్రశ్నించగా అందరూ ఒకేసారి "నన్నొక్కడినే వివాహమాడమని ముక్తకంఠంతో పలికారు. అపుడు లక్ష్మీదేవి "నన్నెవరు కోరరో వారినే నేను వరిస్తాను" అన్నదట. అపుడు అందరి ముఖాలు తెల్లబోయాయి. ఎందుకనగా అక్కడున్న వారందరూ ఆమెను కోరినవారే గనుక అందరూ అనర్హులే అయినారు. అపుడు ఆమె పరీక్షించి చూడగా పాలకడలిలో శేషతల్పంపై ప్రశాంతంగా శయనించిన శ్రీమహావిష్ణువు కన్పించెను. అపుడు మహాలక్ష్మి విష్ణువు దగ్గరకు వెళ్ళి "స్వామీ! నమస్కారములు. నన్నెవరు కోరరో వారినే నేను కోరి వరించి వివాహమాడాలని నిశ్చయించినాను. మీరు ఒక్కరే నన్ను కోరలేదు. కనుక మిమ్ముల వివాహమాడదలచుకున్నాను. నా కోరిక మన్నించండని వినయంగా ప్రార్థించగా శ్రీమహావిష్ణువు ఏమీ చలించక, పాదాలకేసి చేయి చూపిస్తూ నీవు నా చెంత వుండాలంటే ఇదిగో ఇక్కడ ఉండగలిగితే ఉండమంటూ సెలవిచ్చాడు. అలాగే అక్కడే వుంటానంటూ శ్రీమహావిష్ణువు పాదాల చెంతనే కూర్చునివుంది లక్ష్మీదేవి. లక్ష్మి కోరివచ్చినా పాదాల చెంత పెట్టుకున్నాడు. ఆమెతో సేవ చేయించుకుంటున్నాడే కానీ, ఆమెను తలపై పెట్టుకొని ఆమెకు దాసుడు కాలేదు స్వామివారు. మరో నిదర్శనం చూడండి.

గతంలో గడచిపోయిన పార్లమెంటు ఎలక్షన్లలో రాజీవ్‌గాంధి, పి.వి. నరసింహారావును ఎలక్షన్లలో పోటీ చేయమని కోరగా, "నాకు ఆరోగ్యం సరిగా లేదు. విశ్రాంతి తీసుకోవాలని " నరసింహారావు పోటీ చేయలేదు. తర్వాత రాజీవ్‌గాంధి బలవన్మరణం పొందడం, ప్రధాన మంత్రి పదవి పి.వి. నరసింహారావునే వరించడం మనం చూశాము. అనగా శ్రీ కృష్ణ పరమాత్మ చెప్పిన ప్రతి వాక్యం ఎంత సత్యమో మనకు అర్థమవుతుంది.

పన్నెండేండ్లు (12 సం॥లు) గురు సేవ చేసిన శిష్యునితో గురువు పరమ సంతోషముతో "నాయనా నీ సేవకు చాలా సంతోషము కలిగినది. నీకే వరం కావాలో కోరుకొమ్మనగా "చక్కని ఆధ్యాత్మిక జ్ఞానసంపన్నుడు అయిన ఆ శిష్యుడు స్వామీ! కోర్కెలు కోరుకునేందుకు నేను జీవున్ని కాదు, కోరికలు తీర్చేందుకు నీవు ఈశ్వరుడివి కావు. నీవూ బ్రహ్మమే, నేనూ బ్రహ్మమే. ఇక ఇచ్చేదెవరు, పుచ్చుకునే దెవరు అని చక్కగా సమాధానం చెప్పాడట. అర్జునా! సర్వకామనలను వదిలి ఎవ్వడు నిస్పృహుడై అహంకార మమకార రహితుడై సంచరిస్తాడో అతడు శాంతిని పొందగలడు. "అంత్యకాలేపి" అనుట వలన స్థితప్రజ్ఞుడు అంత్య కాలములో కూడా యీ బ్రాహ్మీస్థితిలోననే ఉండి బ్రహ్మ నిర్వాణం పొందుతాడని అర్థము. పరమపవిత్రమయిన భగవద్గీతాపఠనా సక్తులయిన భగవద్గీతా భక్తులారా! మనం ఇపుడు భగవద్గీతలోని "ద్వితీయాధ్యాయాన్ని" పూర్తి చేసుకొనే భాగ్యాన్ని పొందగలగటము మనందరి భాగ్యము. మనందరిని ఆ గీతాచార్యుడు అనుగ్రహించి ఇష్టఫల కామ్యములను నెరవేర్చుగాక!



లక్ష్మి కలహము, దు:ఖము లేని చోట తాను నివశిస్తాననంటుంది.

# శ్రీ భగవద్గీత

# తృతీయాధ్యాయము

# కర్మయోగము

ధర్మక్షేత్రమయిన కురుక్షేత్రంలో ఒక దివ్యరథము నిలబడివుంది. అందులో నర, నారాయణులు వున్నారు. ఒకరు అంతా చేసి ఏమీ చేయనివాడు. అతడు నరుడు. నరోత్తముడయ్యాడు. మరొకరు ఏమీ చేయక అంతా చేసేవాడు. అతడు నరరూపధారి నారాయణుడు. ఒకరిది కర్మలో అకర్మ. మరొకరిది అకర్మలో కర్మ. నరుడు చేసేవాడు. నారాయణుడు చూసేవాడు. నరునిది కర్మయోగం. నారాయణునిది కర్మ సన్యాస యోగము. లోకానికి పనికి వచ్చేది నరుని ఆచరణే కాని, నారాయణుని ఆదర్శం కాదు. కనుకనే కర్మ సన్యాసం కంటే కర్మయోగమే మంచిదంటూ నారాయణుడు నరునికి బోధిస్తున్నాడు. కర్మలను వదలడం కర్మసన్యాసం కాదు. కర్మయోగంలో జ్ఞానం కలిసినపుడు అదే కర్మ సన్యాసమౌతుంది. కర్మలను చేస్తూ ఫలాన్ని త్యాగం చేయటంతో వాసనాక్షయం కలుగుతుంది. వాసనాక్షయంతో చిత్త శుద్ధి కలుగుతుంది. చిత్తశుద్ధితో ఆత్మజ్ఞానం, మోక్షం సిద్ధిస్తుంది. కర్మలను స్వరూపత: వదలుట కాదు.

"యుద్ధస్య విగతజ్వరా:" విగత జ్వరుడవై యుద్ధం చేయాలని భగవంతుని ఆదేశం. కర్మయోగి విగతజ్వరుడై చేయడంలో ఇద్దరూ ఒకేరకమయినా ఇద్దరి భావాలలో వ్యత్యాసముంది. బాధలేక, భారం లేక సవ్యసాచిలా భక్తుడు పని చేస్తాడు. అందరూ ఒక చేత్తో యుద్ధం చేస్తే సవ్యసాచి రెండు చేతులతో

యుద్ధం చేస్తాడు. సామాన్య మానవుడు ఒక్క భాగం పని చేస్తే జ్ఞాని, భక్తుడు రెండింతలు పని చేస్తాడు. పెద్దలు భక్తుని నాలుకతో పోల్చి చెపుతూ వుంటారు. నాలుక ముప్పది రెండు పళ్ళ మధ్యన నిరంతరం కసిమసిగా తిరుగుతున్నా, ఒక్కింతైనా దెబ్బ తినక ప్రవర్తించుతుంది. అలాగుననే భక్తుడు హోరాహోరి సంకటాలలో వున్నా ప్రహ్లాదునిలాగా నలిగి పోడు. హడలిపోడు. నాలుక పనిపడినపుడు తప్పితే బైటికిరాదు. భక్తుడూ అంతే. అవసరం వస్తే తప్ప బైటికి రాడు. నాలుకకు సంగ్రహ బుద్ధి లేదు. (దాచుకుందామనే బుద్ధి) మన శరీరంలో దశేంద్రియాలు ఒక్కొక్కటి ఒక్కపని చేస్తే నాలుక రెండు పనులు చేస్తుంది. "అనడం – తినడం" భక్తుడూ అంతే! రెట్టింపు పనులు చేస్తాడు. బద్ధకంతో పనులు వదిలి ఊరికే వుండేవారు భగవంతుని దృష్టిలో దొంగలు.

ఈ తృతీయాధ్యాయంలో భగవంతుడు జ్ఞానివో, అజ్ఞానివో, సాధకుడివో, సిద్ధుడివో, ఎవ్వరివైనాసరే ఊరికే వుండుటకంటే పనిచేయుట శ్రేష్ఠమని ఖండితంగా చెబుతున్నాడు. ఇప్పటివరకు మీరు విషాదయోగాన్ని – సాంఖ్య యోగాన్ని చూశారు. ఇపుడు కర్మయోగంలో ప్రవేశిస్తున్నారు. ఈ కర్మయోగం చదువుట వల్ల లాభంలేదు. ఇది ఆచరించి అనుభవించితేనే కర్మయోగం మీకు సత్ఫలితం చేకూర్చగలదు. ఈ మంచి అవకాశం కల్పించిన సర్వేశ్వరుడికి మన: పూర్వక ధన్యవాదములు. ఈ కర్మయోగ రహస్యాన్ని భగవద్గీతలో వలె మరెక్కడా తెలియజేయలేదు. " ఈ కర్మయోగం భగవద్గీతకు సొంతమయినది. భగవద్గీత కర్మయోగానికి సొంతమయింది." కర్మణా బధ్యతే జంతు:" అని అనగా కర్మలతో ప్రాణికోట్లు బంధింపబడుతాయని అర్థము. భూమిపై జన్మించుటయే కర్మ. కర్మలు వదిలి వేయుట కూడా కర్మే.

ఈ జన్మ పరంపరలకు ఈ సుకర్మ, దుష్కర్మలే కారణమని అకర్మలు

వదిలి కూర్చోవటం అదీ ఒక కర్మే. ఈ ప్రపంచమే ఓ కర్మరాశి అయివున్నప్పుడు కర్మలను వదిలి వుండడం సంభవం కాదు. దీనికి పరిహారోపాయం అదే కర్మయోగం. "యోగ: కర్మసుకౌశల:".

**శ్లో ॥ లోకేస్మిన్ ద్వివిధానిష్టా, పురాప్రోక్తా మయానఘా**
**జ్ఞానయోగేన సాంఖ్యానాం, కర్మయోగేన యోగినామ్.**

అర్జునా! నీవు అనఘుడివి. నీ జీవితంలో వెతికినా ఒక్క మచ్చకూడా లేని మహామనిషివి. కావుననే ఆధ్యాత్మ విద్యకు అర్హుడివి కాగలిగావు. మానవ జన్మ ఒకటే మోక్షాధికారం గల జన్మ. మిగతా లోకవాసులు భోగజీవులే కాని యోగజీవులు కాదు. అర్జునా! కర్మలు చేయకపోవటంతోనే మానవుడు కర్మరహిత స్థితిని పొందలేడు. అసలే చేయనివానికి రహితమెక్కడిది. కర్మలు చేస్తూ కర్మలనంటని వాడే అతీతుడు. అసలు కర్మలు చేయనివాడు అతీతుడు ఎలా అవుతాడు. అట్టి సోమరిగతి అధోగతే అవుతుంది. నైష్కర్మ్యము అంటే కర్మత్యాగం కాదు. వాటికి తాను సాక్షిగా ఉండుటయే సరైన మార్గం.

ధనంజయా! గుణాతీతుడైన ఒక్క జ్ఞాని తప్ప ఏ ఒక్కడు కూడా కర్మలను చేస్తున్నట్లున్నా! అతనికి కర్మలతో సంబంధమెక్కడిది. నీవు విరాటనగరంలో వున్నప్పుడు నిన్ను అందరూ "బృహన్నల" అని అనుకున్నా నీకేమో నీవు బృహన్నల కాదని తెలుసు. అలాగే తినడం, తిరగడం, వినడం, కనడం, లేవడం, కూర్చోవడం, బ్రతకడం, చావడం కూడా కర్మే అయినపుడు తాను కర్మలను వదిలాననటం హాస్యాస్పదం కాదా! పార్థా రాగద్వేషాలకు వశమై మలినమైన చిత్తంగలవాడు విమూఢాత్ముడనిపించుకుంటాడు. దేహమును ఆత్మను వేరుపరిచే నేర్పు అతనికి తెలియదు. అట్టి అజ్ఞాని బాహ్యేంద్రియాలను బిగపట్టినా వాని చిత్తం శబ్దస్పర్శాది విషయాలనే వాంఛిస్తుంది. అది

నిరర్థకమైన పని అవుతుంది.” నియతంకురు కర్మత్వం” నీవు కర్మలను చేయకుండా వుండుటకంటే కర్మలు చేసేది మంచిది. ఆకలి అయినప్పుడు భిక్షమైనా ఎత్తాలి కదా! నీవే అన్నావు భిక్షాటన అయినా చేయగలను కానీ యుద్ధం చేయలేనని అది మాత్రం కర్మ కాదా!

ప్రపంచంలో ప్రతి ఒక్కటి తమ నియతకర్మను పరిపాలిస్తున్నాయి. సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, గాలి, భూమి, సముద్రాలు, పశువులు, పక్షులు, చెట్లు, వేయేల ప్రతి ఒక్కటి తమ కర్మ నిర్వర్తిస్తున్నాయి. అలా నిర్వర్తించకపోతే ప్రపంచం అస్తవ్యస్తమౌతుంది. నీవు మాత్రం కర్మను వదలి వేస్తానంటే ఎలా సరిపోతుంది. వాటి నియతకర్మను అవి పాటించినట్లే నీవూ నీ నియతకర్మ ను పాటించు. నీకూ, వాటికీ వ్యత్యాసం ఏమంటే అవి ప్రకృతిపరంగా తెలియకుండానే కర్మలు చేస్తున్నాయి. నీవు స్వతంత్రుడవై తెలిసి చేయాలి. అందువల్ల ఫలితమేమంటావా! చిత్తశుద్ధి ద్వారా మోక్షమే సిద్ధిస్తుంది. అని గీతాచార్యుని బోధ. ఈ మాట విన్న అర్జునుడు స్వామీ! నీవేమో కర్మలు చేయాలంటావు. కర్మలు బంధదాయకాలని నీకూ తెలుసు. నన్నెందుకు కర్మలు చేయమని బోధిస్తున్నావని దీనంగా అర్జునుడు అడుగగా, శ్రీకృష్ణుడు కుంతీకుమారా! నీవనుకున్నట్లు కర్మలన్నీ బంధదాయకాలు కావు. స్వార్థబుద్ధితో, భోగాసక్తితో చేసిన కర్మలు మాత్రం సంసారబంధంతో మానవుని పడవేయగలదు. భగవదర్పణ బుద్ధితో చేసే కర్మలకు ఆదోషం లేదు. ఈ కర్మలను నేను చేస్తున్నాను. దీని ఫలితం నాకు కావాలి అనే కర్తృత్వంతోనే అతడు బద్ధుడైపోతున్నాడు.

**శ్లో॥ మయిసర్వాణి కర్మాణి - సంన్యస్యాధ్యాత్మ చేతసా**
**నిరాశీర్నిర్మమో భూత్వా - యుద్ధస్వ విగత జ్వర:**

అర్జునా! ఆధ్యాత్మచిత్తంతో సర్వకర్మలను నాకు సమర్పించు మమకార రహితుడవై నిశ్చింతతో యుద్ధం చేయ్. ఈ కర్మలను నేను వదిలివేస్తే యెవరు మోస్తారని సందేహిస్తున్నావా? ప్రపంచాన్నంతా మోసేవాడు వీటిని మోస్తాడు. తన నెత్తిన బరువు తాను దించుకుంటే, తనని మోసేశక్తి దాన్నీ మోస్తుంది. సర్వేశ్వరాధీనుడవై సేవకుడు యజమాని కొరకు పనులు చేసినట్లు యుద్ధాన్ని ఆచరించు. ఆశలను, మమకారాలను దూరం చేసుకో. అంత:కరణలో ఎట్టి వికారాలకు ఆస్కారమీయవద్దు. నీవు ఉద్ధారకమౌతావు. అర్జునా! యుద్ధమే చేయనంటావు. కర్మలను మానివేస్తానంటావు. ఒకటిమాని ఇంకొకటి పట్టుకొనుటే అవుతుంది. అసలే మానడం ఎలా సాధ్యమౌతున్నది. బ్రహ్మజ్ఞాని తన అకర్తాప్రభావంతో ప్రకృతికి అతీతుడై, తాను కర్మలను చేయకున్నా, అతని ద్వారా కర్మలు జరుగుతూనే వుంటాయి. కర్తృత్వ బుద్ధిలేక అహంకారం లేక, ఉచ్ఛ్వాస నిశ్వాసలవలె, రెప్పపాట్ల వలె జరిగే అకర్మలు ఆత్మకు ఎట్లు సంబంధం లేవో అట్లే దేహేంద్రియాదులకు కర్మతో సంబంధం ఎప్పుడూ లేదు. కర్మలను ఆత్మతో ముడివేయుట ఎట్లా కానిపనో, ఆత్మయందు కర్మనువుంచే వీల్లేదు. దేహేంద్రియాది ప్రకృతి వస్తువులలో కర్మను తుంచే వీల్లేదు.

అట్టిచో ప్రకృతిని నిగ్రహించాలనుకోవడం వట్టి దురాగ్రహము మాత్రమే. నిగ్రహంపై ఆగ్రహం పనికిరాదు. ఆగ్రహంపై నిగ్రహం వుండాలి. ఈ రహస్యం జ్ఞానికి తెలుసు. ఈ వాస్తవాన్ని ఎరుగని వాడు ప్రకృతిని నిగ్రహించే హఠప్రయత్నం చేసి విఫలుడౌతాడు. గాలికి "వీచుట" స్వభావమైనట్లు దేహేంద్రియ ప్రకృతికి కర్మలు చేయుట స్వభామైపోయెను. ప్రకృతి నిగ్రహం అసాధ్యం. అసంభవం కూడాను. నిజం విచారిస్తే నిగ్రహించవలసినది

ప్రకృతిని కాదు వికృతిని. ప్రకృతి ఈశ్వర సృష్టి. వికృతి జీవ సృష్టి. బంధానికి, దు:ఖానికి జీవసృష్టే కారణం కానీ ఈశ్వరసృష్టి కాదు. ప్రకృతిని నిగ్రహించుకోలేకపోయినా నీకు అనుకూలంగా దానిని మలచుకోవచ్చు. మళ్ళించుకోవచ్చును. ఉదా: రైలు మద్రాస్ నుండి బొంబాయికి దాని మార్గం వెంట అది వెళ్తుంది. అయినా మనకు అవసరమైన చోట మనం ఎక్కుతూ, దిగుతూ మనకు అనుకూలంగా ఉపయోగించుకుంటున్నాము.

అర్జునా! ముఖ్యంగా నీకు చేప్పేదేమనగా యుద్ధము నీకు ఘోరకర్మగా కనపడవచ్చును. కాని అది క్షత్రియుడవైన నీకు అనుకూలమైన శాస్త్రవిహితమైన ధర్మము. ఎంత సౌమ్యంగా కానవచ్చినా భిక్షాటనము నీకు పర ధర్మము. పరధర్మం కంటే స్వధర్మం హీనంగా కనపడవచ్చును. అయినా స్వధర్మమే తనకు శ్రేష్ఠమయినదిగా ఎరుంగుము. పరధర్మాన్ని ఆచరించడంలో సౌకర్యం ఉండవచ్చును. ఆచరించుటకు అనుకూలంగానూ ఉండవచ్చు. విలువకూడా ఉండవచ్చును. పాలు విలువైన వస్తువని పాలలో నివసించేందుకు చేప ఒప్పుకోదు. దానికి నీళ్ళే కావాలి. స్వధర్మాన్ని ఆచరిస్తూ చచ్చినా మంచిదే. ఇహంలో కీర్తి, పరంలో స్వర్గం లభిస్తుంది. పరధర్మాచరణం మాత్రం భయంకరమైనది. ఇక్కడ అపకీర్తిని, అక్కడ నరకాన్ని ప్రాప్తింప చేస్తుంది. ఈ స్వధర్మ పరధర్మం గురించి ఆధ్యాత్మిక దృష్టితో వేరు అర్థాలు చెప్పడం కూడా జరిగింది. భగవంతుడు స్వధర్మాన్ని వదలరాదనీ, దానిలో మరణించినా మంచిదేనని పరధర్మం భయావహమని చెప్పి, మరలా ఆయనే 18వ అధ్యాయంలో సర్వధర్మాలను పరిత్యజించి నన్నే శరణుబొందు అన్నాడు. ఇక్కడ స్వధర్మాన్ని వదలరాదని, అక్కడ సర్వధర్మాలను వదలాలని చెప్పినమాటలను అర్థమేమి ఈ "స్వధర్మ" "సర్వధర్మాలు" అనగా "స్వ" అనగా ఆత్మ. ఆత్మధర్మమే స్వధర్మం. పర అంటే భిన్నాలైన దేహాది అనాత్మధర్మాలను పరిత్యజించి ఆ ఆత్మధర్మాన్ని అవలంబించు మంటూ ఫలితార్థము.

ఈవిధంగా నారాయణుడు బోధించగా నరుడిట్లు అడుగుచున్నాడు. మహాత్మా నీకొక నమస్కారం స్వామీ! నీవు ప్రతివానికి సంయమ జీవితం కావాలంటావు. స్వధర్మాన్ని ఆచరించాలంటావు. కాని మానవునికి ఉద్దేశపూర్వకంగా పాపాలను చేయాలనే అభిప్రాయం లేకున్నా, ఏదో బలవంతమైన శక్తితో ప్రేరేపింపబడి పాపకార్యాలతో ప్రవర్తిస్తున్నాడు. పరమ పురుషార్థానికి సాధనంగా నీవు చెప్పిన కర్మయోగాన్ని ఆచరించాలని ఇష్టం వున్నా మానవుడు ఆచరించలేక పోతున్నాడు. తన స్థితి, గతికి మానవుడు స్వతంత్రుడు కాడని తోస్తుంది. మానవున్ని పాపాలతో ప్రవర్తింపజేసే ఆ బలవంతమైన శక్తి ఏది. భగవంతుడే చేయిస్తున్నాడా? ప్రారబ్ధం చేయిస్తుందా? నాకీ విషయాన్ని తెలియజేయండి. స్వామీ అనగా భగవంతుని సమాధానం.

**శ్లో॥ కామఏష క్రోధఏష – రజోగుణ సముద్భవ:**
**మహాశనో మహాపాప్మా – విద్ధ్యేన మిహవైరిణమ్**

అర్జునా! నీవింతవరకు చెప్పిన అర్థానికి కారణం ఈ కామము, క్రోధమే సుమా! పరమేశ్వరుడు కాదు. ప్రారబ్దం కాదు. కరుణా మూర్తియగు పరమేశ్వరుడు కఠోరకృత్యాలను చేయమంటాడా! ప్రారబ్ధం భోగరూపాలలో తీరిపోయేదే కానీ, కర్మలలో ప్రేరేపించేది కాదు. ఈ పాపాలకంతటికీ కామ క్రోధాలే కారణం. వీటిని ఎందుకు చెప్పానంటే యివి దృశ్య వర్గానికి అనాత్మకోటి లోనికి చేరినవని గుర్తించాలనే ఉద్దేశ్యంతోనే చెప్పినాను. ఇది రజోగుణంలో పుట్టినది. ఇవి రెండు రెండు కావు. ఈ రెంటి స్వరూపం ఒక్కటే. ఈ కామమే పరిస్థితి ననుసరించి క్రోధమౌతుంది. కోరికకు ఏదైనా ఆటంకం కలిగినపుడు ఆ కామమే క్రోధమౌతుంది. ఈ కామాన్ని నశింపజేస్తే ఇక క్రోధాన్ని నశింపజేసే పని వుండదు. ఇదివరకు చెప్పిన రాగద్వేషాల

స్థూలరూపాలే ఈ కామక్రోధాలు. ఈ కామం పుట్టుక రజోగుణంతోనా, రాగంతోనా అనే సందేహం కలుగవచ్చు. రాగమన్నా, రజోగుణమన్నా పెద్ద తేడా ఏమీ వుండదు. రాగానికి రజోగుణబలం, రజోగుణానికి రాగబలం, ఈ రెంటి స్వరూపం ఒక్కటే. ఈ కాముడు మహాశనుడు, పెద్ద తిండిబోతు. కామమన్నా, ఆశ అన్నా, కోరిక అన్నా మాటలు వేరే కానీ, వస్తువు ఒక్కటే. భోగాలు ఎంత అనుభవించినా, కామానికి తృప్తిలేదు. నేయి పోసినకొద్దీ అగ్ని ఎక్కువగా మండినట్లే, భోగాలు అనుభవించేకొద్దీ, ఆశ పెరుగుతూనే వుంటుంది. కోరిన కోర్కెలు రావచ్చు. రాకపోవచ్చు. కానీ కోరికలు మాత్రం నశించటం లేదు. దూడ పెరిగే కొద్దీ కొమ్ములు పెరుగుతూ వున్నట్లు, వస్తువులు వచ్చే కొద్దీ, అవసరాలు పెరుగుతూ వుంటాయి. ఈ కామమే అన్ని పాపాలకు మూలమైన పాపము. పారమార్థిక మార్గానికి ఇది ఒక మహాశత్రువు. అంతులేనట్టి మహాపాపకూపంలో పడవేయునది శత్రువు గాక మిత్రుడెట్లు అవును. ఈ కామం విషయంలో జ్ఞాని చాలా జాగ్రత్తగా ఉండుట మంచిది. ఈ కామనిర్మూలానికి ప్రయత్నించుట పరమధర్మము. ఈ కామాన్ని గురించి "ధూర్జటి" మహాకవి తన "శ్రీకాళహస్తీశ్వర శతకం" లో ఇలా అంటాడు.

మ॥ అమర స్త్రీల రమించినం చెడదు కామంబింతయున్, బ్రహ్మాప
ట్టము సిద్ధించిన నాసదీరదు నిరూఢ క్రోధమున్ సర్వలో
కములన్ మ్రింగిన మానదిందుగల సౌఖ్యంబొల్ల, నీ సేవజే
సి, మహాపాతకవారి రాశిగడుతుం శ్రీకాళహస్తీశ్వరా! అని

అర్జునా! శత్రువును జయింపగోరువాడు వాని ఉనికి పట్టు పూర్తిగా తెలిసి వుండాలి. శత్రువుకు అయువు పట్టు అయిన దుర్గం స్వాధీనం చేసుకోవాలి. కోట స్వాధీనం అయితే కోటలో ఉండే రాజును తేలికగా బంధించవచ్చు. కోటలో ఉన్న శత్రువుకు దొంగదారులున్నట్లు ఈ

కామశత్రువుకు సైతము పంచేంద్రియాలు అను 5 దొంగ దారులు, మనోబుద్ధులు, నివాస కేంద్రాలు వీటి వివేకశక్తిని భ్రష్టు చేసి దేహాభిమానియైన జీవుణ్ణి అధోగతిపాలు జేస్తుంది. అర్జునా! ఇది గుర్తుంచుకొని నీవు మొట్టమొదట ఇంద్రియాలను నియామకంలో పెట్టుకో. తర్వాత జ్ఞాన విజ్ఞానములకు కారణమైన యీ కామపాపిని నిర్మూలించడం శక్యమౌతుంది. అన్ని పాపాలకు ఈ కామమే మూలకారణం. ఇది చేయని పాపమంటూ లేనే లేదు. ఈ శత్రుజయానికి శాస్త్రాలలో సామ, దాన, భేద, దండోపాయాలని తెల్పినారు. కాని సామవాక్యాలకు ఈ శత్రువు లొంగడు. దానోపాయం బొత్తిగా వ్యర్థము. ఎంతయిచ్చినా దానికి తృప్తి లేదు. రజోగుణంలో పుట్టినది కాబట్టి మహాజగడాలమారి స్వభావం కలది. దీనిని దండోపాయంతో సాధించే వీలు అసలే లేదు. ఇక మిగిలింది భేదోపాయం ఒక్కటే. దానితోనే ఈ కామశత్రువును జయించాలి. ఈ కామానికి ఉనికిపట్టు ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి. వాటిని స్వాధీనం చేసుకుంటే కామం స్వాధీనం అవుతుంది. మనస్సు స్వాధీనం అయితే ఇంద్రియాలు స్వాధీనం అయినట్లే. బుద్ధిని వశపరచుకుంటే మనస్సు వశమౌతుంది. ఆత్మ యొక్క బలంతో మొత్తం అన్నింటినీ స్వాధీనం చేసుకోవచ్చు. రాజు వశమైతే రాజ్యమంతా వశమౌతుంది.

తే॥గీ॥ శాస్త్రములవేల పెక్కులు* చాలుచాలు
చాలునొక్కటి గీతయే* శ్రద్ధతోడ
ఆచరించిన మనుజుండు* నద్భుతముగ
నరుడు నారాయణుండగు, నార్యులార

దేవదేవుడైన గీతాచార్యుడు మనపై గీతామృతాన్ని, జ్ఞానామృతాన్ని కుండపోతగా కురిపిస్తున్నాడు. అందులో మునకలిడి కడుపారా త్రాగి కృతార్థులమౌదాం!

# శ్రీ భగవద్గీత

# చతుర్ధాధ్యాయము

# జ్ఞానయోగము

ప్రపంచంలో జ్ఞానం వంటి పవిత్ర వస్తువు లేనేలేదు. అజ్ఞానము వంటి అపవిత్ర వస్తువు లేదు. ఇది భగవద్గీతలోని పరమోపదేశం. అభిన్న దృష్టి జ్ఞానం, భిన్న దృష్టి అజ్ఞానం. శివదృష్టి జ్ఞానం, అత్మతానని యెరుగుట జ్ఞానము, ఆత్మే పరమాత్మయని తెలియుట విజ్ఞానము. ఈ జ్ఞాన విజ్ఞాన సిద్ధి కొరకు ఎన్నో సాధనలను, సాధనాలను భగవద్గీత చెప్పింది. ప్రస్తుతం మన చేతుల్లోనున్నది జ్ఞానయోగం. మన ఈ జ్ఞానయజ్ఞం సాంగ మంగళప్రదంగా నెరవేరి, భక్తులు భగవంతులుగా, మానవులు మాధవులుగా, నరులు నారాయణులుగా మారి మానవ జన్మ సార్థకం చేసుకొనే అవకాశాన్ని గీతాచార్యుడైన భగవంతుడు మనకు అనుగ్రహించుట మన మహాభాగ్యం.

" జ్ఞానేన హీన: పశుభిస్సమాన:" అంటూ శాస్త్రం చెబుతుంది. మానవుడై జన్మించిన తర్వాత జ్ఞాని కావటం ప్రతి ఒక్కరి జన్మహక్కు. దానిని అనగా తన జన్మహక్కును తను పొందనివాడు పశుప్రాయుడే కద. మానవునికి జ్ఞానానంద స్వరూపుడని పేరు. అంత పెద్ద పేరు వీనికి ఎవరు పెట్టారా? అని అనుకుంటున్నారు కదూ! అదేమీ కాదు, ఎవరూ పెట్టిన పేరు కాదు. జన్మతా సత్యజ్ఞానానందం స్వరూపుడే మానవుడు. అది ఎట్లనగా

1) **సత్యం :-** ఎక్కడో ప్రమాదం జరిగిందన్నా, ఎక్కడో ఎవరో వచ్చారన్నా వెంటనే ప్రతివ్యక్తి ఎట్లెట్లా? ఎక్కడ, ఎప్పుడు ఏం జరిగిందని తెలుసుకుంటారు.

అలా ప్రతి ఒక్కరు ఎందుకు తెలుసుకోవాలి. అని ఆలోచిస్తే "సత్యం" వాని జన్మ హక్కు. గనుక ప్రతి ఒక్కరు సత్యమును తెలుసుకునే ప్రయత్నం చేస్తుంటారు.

2) **జ్ఞానం :-** జ్ఞానం అనగా తెలియని విషయాలు తెలుసుకోవడమే జ్ఞానం. ఆవిధంగా ప్రతిఒక్కరు తెలుసుకొనే ప్రయత్నం చేస్తారు. ఎందుకలా చేస్తుంటారంటే అదీ వారి జన్మహక్కే గనుక.

3) **ఆనందం :-** ప్రపంచం అంతా ఆనందం కావాలనే కోరుతారు కానీ దు:ఖాలు రావాలని ఒక్కరైనా కోరుతున్నారా? కోరరే! ఎందుకు అనగా ఆనందం తన జన్మహక్కు గనుక.

తన జన్మహక్కులను తనవాటిని తనకు కావాలని కోరుతున్నాడే కాని, పొందలేక పోతున్నాడు. కోరేది శాంతి, పొందేది అశాంతి, కోరేది సుఖము, పొందేది కష్టము. కోరేది ఆరోగ్యము, పొందేది అనారోగ్యము. ఏమిటీ విచిత్రం. ఇవన్నీ కోరితే వచ్చేవి కావు. సాధన సంపత్తిచే సంపాదించుకోవలసినవే. ముందు ముందు ఈ జ్ఞానమార్గంలో ఆ మురళీలోలుడు ఏమి సెలవిస్తాడో చూద్దాము. నేనే దేహమనుట అజ్ఞానము. తాను ఆత్మనని తెలియుట జ్ఞానము. ఆత్మే పరమాత్మయని తెలియుట విజ్ఞానము. ఈ జ్ఞాన విజ్ఞానముల సిద్ధి కొరకు ఎన్నెన్నో సాధనలను మనకు భగవద్గీత చెప్పింది. భగవద్గీత సిద్ధాంత గ్రంథము. అందుకే యోగశాస్త్రమని దీనికి పేరు. యోగ మనగా సాధన, సాధనలు సాధనాలేయని మరువరాదు. సాధనలయందు పట్టుదల వుండవలసిందే కాని, మొండి పట్టుదలే వుండరాదు. అలాగని సాధనలను నిర్లక్ష్యం చేయరాదు. సిద్ధి లభించే వరకు సాధనలను వదలరాదు. సిద్ధి లభించాక సాధనలలో పడి వుండరాదు. భగవద్గీతలో ప్రతి ఆధ్యాయం చివరలో బ్రహ్మ విద్యాయాం యోగశాస్త్రే అని చెబుతుంది.

అనగా "బ్రహ్మవిద్య" అనగా "సిద్ధి", యోగశాస్త్రమంటే సాధన.

యుద్ధమంతా ముగిశాక, పనంతా ముగిసి, సింహాసనంపై కూర్చోబోయేముందు ధర్మరాజుకు విషాదం మొదలయింది. పని చేసేముందు విషాదమో, విచారమో ఉండాలి కానీ, పని అయిన తర్వాత ఎందుకు విచారాలు, విషాదాలు "వెనుక చింతించుట వెర్రితనము", అని ఒక సూక్తి. ఇక భీమసేనుని గూర్చి ఆలోచిస్తే, ధర్మంకోసం యుద్ధం కాదు ఆవేశం అక్కసు తీర్చుకొనేందుకు యుద్ధం. ఇది భీముని సంగతి. ధర్మరాజు అతివిచారం – భీమునిది అతివికారం. మధ్యమ పాండవుడు అర్జునుడు మధ్యమ పక్షపాతి. అందుకే అతడు దూడ అయినాడు. "పార్థోవత్స:" అని మనం ప్రారంభంలోనే ప్రార్థించుకుంటాము. మన భాగ్యమో, అయన భాగ్యమో కాని, దూడ మంచిది దొరికింది. గీతామృతాన్ని అర్జునుడు కడుపారా త్రాగాడు. మళ్ళీ త్రాగవలసిన పనిలేకుండా త్రాగాడు. "బాగా త్రేపాడు" ఏవుమని త్రేపాడు. "నష్టోమోహ:" మోహం నశించింది అని త్రేన్చాడు. నాకు స్వస్వరూప సిద్ధి లభించింది. స్థిత ప్రజ్ఞుడనైనాను. సందేహాలు వదిలాయి. నీవు చెప్పినట్లు చేస్తాను అన్నాడు. తెలిసిందా? అర్జునుని అనుభవం. గీతాశ్రవణం వల్ల ప్రతి వారికీ ఈ ఫలితం లభించాలి. ఇంతవరకు కుంతీపుత్రుడను ధనంజయుడను అనుకుంటూ వుండేవాడు. ఇప్పుడు నేను "అకర్తను అభోక్తను నిత్యశుద్ధ బుద్ధసచ్చిదానంద స్వరూపాత్మను" అనే జ్ఞానం కలిగింది. గురుదేవా! నాబుద్ధి మొద్దుబారినది. నా యుక్తులు అణగిపోయినవి. "నీవే తప్ప నిత: పరంబెరుగ" అంటూ శ్రీకృష్ణుని శరణుబొందాడు. తన పాండిత్యానికి, తన పౌరుషానికి స్వస్తి చెప్పినాడు.

అప్పుడు శ్రీకృష్ణ భగవానుడు అర్జునా! ఈ పరమగోప్యమయిన ఈ యోగాన్ని తొలుత నేను సూర్యునకు ఉపదేశించాను. అతడు మనువుకు,

మనువు ఇక్ష్వాకునకు బోధించాడు. ఇది పరంపరగా వస్తూ వున్నది. దానిని రాజర్షులు తెలుసుకుంటూ తరిస్తూ వున్నారు. కాలం గడవగా, గడవగా ఈ జ్ఞానం లోకంలో నశిస్తూ వచ్చినది. పురాతనము, సనాతనము, పవిత్రము అయిన ఈ యోగాన్ని భక్తుడివి, మిత్రుడివి అయిన నీకు బోధిస్తున్నాను. ధర్మచక్రప్రవర్తనానికి రాజులే ఆధారస్తంభాలు. ధర్మరక్షణ చేయువారలు క్షత్రియులే. పృధువు, భరతుడు, హరిశ్చంద్రుడు, దిలీపుడు, భగీరథుడు, రఘువు, దశరథుడు, శ్రీరాముడు, జనకుడు, యుధిష్టిరుడు, పరీక్షిత్తు, విక్రమార్కుడు, అశోకుడు, మొదలైన చక్రవర్తులు ధార్మిక చరిత్రలో ఉజ్జ్వల కీర్తి పతాకాలు ఎగురవేసిన వారే! ధర్మశక్తికి శాసనశక్తి తోడైనపుడు అగ్నికి వాయువు తోడైనట్లు సర్వత్రా అనుకూలత జయము లభిస్తుంది. ఈ అభిప్రాయంతోనే భగవంతుడు యోగవిద్యను రాజర్షులకు ఉపదేశించాడు. మహారాజులు జ్ఞానులైతేనే లోకమంతా త్వొందరగా జ్ఞానంలో అభివృద్ధి చెందగలరు.

లోకం తీరు మారింది. ఇప్పుడు ఈ కలియుగంలో కూడా బుద్ధుడు, మహావీరుడు, శంకరాచార్యులు, రామానుజాచార్యులు, మధ్వాచార్యులు, కబీర్‌దాసు, గురునానక్, తులసీదాసు, సమర్థరామదాసస్వామి, రామకృష్ణ పరమహంస, దయానంద సరస్వతి, వివేకానందుడు, మళయాళస్వామి మహాత్మాగాంధి వంటి మహానుభావులు ఎందరో అవతరించి ధర్మోద్ధరణ చేశారు.

పాండవ పక్షంలో "ధర్మం" ధర్మరాజు అనే రూపంతో ప్రముఖమైన శాసనస్థానంలో వుంది. ధర్మరాజు ప్రక్కన భీముడున్నాడు. భీముడంటే బలానికి ప్రతీకం. ఆ బలం ధర్మానికి అనుకూలమైన బలం. అట్లుగాక ధర్మరహితమైతే ఆ బలం పశుబలం లోకానికి కీడు చేస్తుంది. అర్జునుడు

ధర్మానికి ప్రతీక. ధర్మానికి హాని కలిగించారు. అనగా ధర్మపరులు పాండవులు అడవుల పాలయినారు. కౌరవుల ప్రక్కన కూడా ధర్మం వుంది, అది విదురుని రూపంలో, విదురుడు ధర్మాన్ని చెప్పగలుగుతాడు గానీ, ఆచరింపజేసే శక్తి విదురునకు లేదు. బలహీనమైనది ఆచరణకు రాని ధర్మం. అది అధర్మంతో సమానమే. ధర్మాన్ని ప్రతిష్టించాలంటే పెద్ద ప్రయత్నం కావాలి. అధర్మం వ్యాపించాలంటే పెద్ద ప్రయత్నమేమీ అవసరం లేదు. పైరు పండించాలంటే గట్టి ప్రయత్నం అవసరం. గడ్డి, గాదం పెరగాలంటే ప్రయత్నమేమీ చేయవలసిన పనిలేదు.

ధర్మాన్ని కాపాడుటకు తామే కర్తలమని చెప్పే పీఠాధిపతులే అర్థ, కామ, వ్యామోహాదులలోపడి, స్వార్థపరులై నప్పుడు ధర్మం దిక్కులేని దీనావస్థలో పడిపోతుంది. ఈ పురాతనమైన యోగాన్ని భగవంతుడు అర్జునుని నిమిత్తంగా చేసుకొని లోకానికి బోధించాడు. ఇక్కడ అర్జునునకు ఒక సంశయం పట్టుకొని పీడిస్తున్నది. సంశయ నివృత్తి చేసుకోవటం సాధకుడి ముఖ్యధర్మం. శ్రీకృష్ణుడు ద్వాపరయుగంలో చివరలో జన్మించినాడు. తనకంటే కొంచెం పెద్దవాడు ధర్మరాజు కన్నా చిన్నవాడు సూర్యుడు, ఇక్ష్వాకుడు చాలా ప్రాచీనుడు. వారికి ఈ శ్రీకృష్ణుడు ఎలా ఉపదేశం చేసి వుంటాడు. ఇది ఎలా సాధ్యమౌతుంది. తన సంశయాన్ని ఆ దేవదేవుని ముందు నివేదించు కుంటున్నాడు అర్జునుడు. స్వామీ! మహానుభావా! నీవు ఈ యోగాన్ని సూర్యునకు బోధించినానంటున్నావే, ఈ దేహం ధరించిన తర్వాత బోధించినావా? లేక ఆ దేహం వేరేనా? ఈ దేహంతోనే బోధించానంటే అది సాధ్యం కాదు. నీవు నాకంటే నాలుగు సంవత్సరాలే పెద్దవాడివి. సూర్యుడు మన కంటే చాలా పెద్దవాడు. ఆ సూర్యుడు మీ దగ్గర ఉపదేశం పొందాడంటే నమ్మశక్యం కావటంలేదు. గతజన్మలో ఉపదేశం చేశాను. ఆ ఉపదేశం చేసిన జన్మవేరు అంటావా? ఆ

మాటకూడా సమంజసంగా లేదు. వెనుక జన్మలో చేసిన పనులు ఈ జన్మలో ఎలా జ్ఞాపకం వుంటాయి. అలా వుండేటట్లు అయితే నాకూ జ్ఞాపకం ఉండాలి కదా! ఒకవేళ దైవాంశ సంభూతులకు జ్ఞాపకం వుంటాయి అనుకుంటే నీవూ మావలె జనన, మరణరూపకమగు భ్రాంతి మయసంసారాలతో ఎందుకు సంబంధాలు పెట్టుకున్నట్టు. కేశవా ఎంత విచారించినా నీవెవరో స్పష్టం కావడం లేదు. నాపై దయవుంచి నా సంశయాన్ని నివారించు దేవా! అని దీనంగా అర్జునుడు ప్రార్థించగా, అర్జునుని సంశయానికి దేవదేవుని సమాధానం వినండి.

మన శరీరాలు మృణ్మయాలు. అవతారపురుషుల శరీరాలు చిన్మయాలు. మనము సంసార కారాగారంలో ఖైదీలము. పుణ్య, పాప కర్మల బలాత్కారంతో సుఖదు:ఖాలను అనుభవిస్తూ పరతంత్రులమై వున్నాము. భగవంతుడు దేహం ధరించి మన వలెనే ప్రపంచంలో వున్నా ఆయన రాజువలె స్వతంత్రుడై విహరిస్తాడు. మనకు అవిద్యాబలంతో దేహాదులలో అహంకార మమకార రూప ధ్యాస తగుల్కొంది. శ్రీరామ, శ్రీకృష్ణాదులకు దేహధ్యాస లేదు. అవిద్యావరణం లేదు. వారి ఉపాధి శుద్ధ సత్వప్రధానం కాబట్టి స్వరూప జ్ఞానానికి హాని లేదు. మనలాగా మరొకరిని ఆశ్రయించి జ్ఞానోపదేశం పొందవలసిన పని లేదు. అజ్ఞానమే లేనపుడు జ్ఞానోపదేశంతో పనేముంది.

అర్జునా! భగవంతుడనగు నేను జన్మ, జరామరణములు లేనివాడను అయినా మాయాశక్తిని చిదా భాసముఖంగా, వశీకృతం చేసుకొని పుట్టినవానివలె శరీరధారివలె గోచరిస్తుంటాను. నేను సర్వ భూతాలకు ఈశ్వరుడనై ప్రవర్తిస్తుంటాను. శుద్ధ సత్వ ప్రధానమైన నిత్య దేహంతో కూడి ఈశ్వరుడినైన నేను సృష్టి యొక్క ఆదికాలంలో సూర్యునికి ఉపదేశించినా దానినే మరలా నీకు ఉపదేశిస్తున్నాను. ధనంజయా ఎప్పుడెప్పుడు ధర్మానికి

హాని కలుగుతుందో, అధర్మం విచ్చలవిడిగా విజృంభించుతుందో, ఆ సమయాలలో నన్ను నేను సృష్టించుకుంటాను. అనగా స్వతంత్రంగా స్వేచ్ఛగా అవతరిస్తానని అర్థము.

భగవంతుడు అవతరించి ఏ కార్యక్రమాలను చేస్తాడో భగవంతుడే స్వయంగా చెబుతున్నాడు. సాధువులను రక్షించుట కొఱకు, దుష్టశిక్షణ కొఱకు, ధర్మాన్ని స్థాపించుట కొఱకు ప్రతి యుగంలో నేను అవతరిస్తుంటానని భగవంతుడు స్వయంగా తెల్పుచున్నాడు. కౌరవులను సంహరించుట హింస కాదా! హింసను చేయించుట మంచిదా అని కొందరు ప్రశ్నిస్తుంటారు. ఇది చాలా తప్పు. అంగవ్రాతములో (శస్త్ర చికిత్స) చికిత్సకుడు దుష్టాంగంబు ఖండించి శేషాంగశ్రేణికి రక్ష చేయు విధంగా, కౌరవులనే రాచపుండు విరాట్ పురుషుని శరీరంపై పుట్టింది. దానిని ఉపేక్షిస్తే మొత్తం సమాజానికే హాని. దానిని త్రుంచుటకై భగవంతుడు మహావైద్యుడుగా అవతరించినాడు. ఆ వైద్యుడు ఆపరేషన్ చేసి ఆ భాగాన్ని తీసివేయకపోతే ప్రాణానికే ప్రమాదమని ఆ విశ్వవైద్యుడు కౌరవులనే చెడు భాగాన్ని తీసివేయక తప్పలేదు. ఈ శస్త్రచికిత్సలో అర్జునుడు కాంపౌండరు వంటివాడు.

ధర్మ సంస్థాపన మంటే అర్థమేమి. శాస్త్ర విహితమైన ధర్మంలో స్వయంగా తాను ప్రవర్తిస్తూ, ధర్మం యొక్క ఔన్నత్యాన్ని ఆవశ్యకతను తన అమోఘవాణితో అశేష జనాల హృదయాలలో హత్తుకునేటట్లు బోధించి, దైవలోకంలో, పరలోకంలో వేదశాస్త్రాలలో, సాధు సత్పురుషులలో శ్రద్ధ కలిగించుటయూ, ప్రజా సముదాయాన్ని సదాచార నిష్టా సంపన్నులుగా ఒనర్చుట. ఇవే ధర్మ సంస్థాపన అనే మాటకు అర్థము. అర్జునా! నా జన్మ కర్మలు స్వతంత్రాలు. వాటికి సత్వ, రజ, తమోగుణ సంబంధం లేదు. నా జన్మ మాయా కార్యం కాబట్టి సామాన్యునివలె సుఖదు:ఖాలకు వివశమై వుండదు. ఈ రహస్యాలను

తెలిసినవాడు తిరిగి పుట్టడు వాడు నన్నే చేరుతాడు.

అర్జునా! దైవీగుణ యుక్తములైన కర్మలను దివ్యకర్మలు అంటారు. భగవంతుడు మనుష్య శరీరధారియై విహరించి వ్యవహరించుటే దివ్యకర్మలు ప్రకృతిలో వుండి గుణాతీతుడై వుండి చేసే కర్మలే దివ్యకర్మలు. ఆ మార్గాన్ని అనుసరించిన విజ్ఞాని యొక్క జన్మ కూడా దివ్య జన్మే. భగవంతుడు తనకంటే అన్యంగ వున్నాడని తెలియుట పరోక్ష జ్ఞానము. ఆయన తన స్వరూపమే అని తెలిసికొనుట అపరోక్షజ్ఞానం. తత్వత: తెలిసికొనుట అంటే అపరోక్ష జ్ఞానం దృష్ట్యా తెలిసికొనుట అని అర్థము. అర్జునా! రాగ భయక్రోధాదుల నుండి విడివడిన వారు నా యందే తన్మయమై వుండేవారు. నేను తప్ప మరి వేరు ఆశ్రయమే లేదని ప్రసన్నులైనవారు ఆత్మజ్ఞానమనే తపస్సుతో పవిత్రత పొందిన వారు ముందు చెప్పిన విధంగా నా దివ్య జ్ఞానాన్ని, నా దివ్య కర్మాన్ని తత్త్వత: తెలిసికొని నా స్వరూపస్థితిని సంప్రాప్తిస్తారు. అయ్యా కృష్ణా! నీవు దయామయుడవు కదా! ఈ పరమోత్తమమైన స్థితిని సర్వసమానంగ కలిగించకూడదా! నీకు పక్షపాతం లేదు కదా! జ్ఞానులకు మాత్రమే ఇచ్చి అజ్ఞానులకు ఎందుకు ఇవ్వవు అంటూ అర్జునుడు శంకిస్తాడేమో అనే అభిప్రాయంతో భగవంతుడే స్వయంగా తానే దానికి సమాధానం పదకొండవ శ్లోకంలో చెబుతున్నాడు.

కుంతీపుత్రా! లోకంలో ప్రజలు నాకు భక్తి చేయువారు ముఖ్యంగా నాలుగు విధాలై వున్నారు. దు:ఖంతో పీడింపబడే ఆర్తుడొకడు. పుత్ర, కళత్ర ఆయురారోగ్య భాగ్యాల నపేక్షించే అర్థార్థి ఒకడు. ఆత్మను తెలసుకోవలె పరమాత్మను తెలుసుకోవాలనే జిజ్ఞాసువొకడు. తత్వాన్ని తెలుసుకోవాలనే జ్ఞాని ఒకడు. ఈ విధంగా వుండే వీళ్ళలో సకామ బుద్ధితోగాని, నిష్కామ

బుద్ధితోగాని, నన్ను భజించే వారెవ్వరైనగాని, సర్వ కర్మ ఫలప్రదాతను, సర్వేశ్వరుడను అయిన నేను వారి వారి వాంఛితాలకు తగిన ఫలాన్ని ఇచ్చి వారిని అనుగ్రహిస్తుంటాను. అంతేకాని, వారి కోర్కెలకు విపరీతంగా ఫలితాలను నేనిచ్చుట లేదు. వీరిలో మొదటివాడైన ఆర్త భక్తుడు "సంకటమొస్తే వేంకటరమణుడు" అనే మాదిరి నన్ను భజిస్తాడు. వాని దు:ఖాన్ని నేను నివారిస్తూ ఉంటాను. అలాగే మోక్షాపేక్ష లేని అర్థార్థి కోరుకొనే ధనధాన్యాదులను వానికి ఇస్తుంటాను. నిష్కామ కర్మలను ఆచరిస్తుండే జిజ్ఞాసువులకు ఆత్మజ్ఞానాన్ని ప్రసాదిస్తూంటాను. మోక్షాన్ని కోరే వారికి మోక్షాన్ని అనుగ్రహిస్తాను. వారి భావనలకు అనుకూలంగా ఫలాన్ని ఇవ్వడమే నావంతు. అంతే కాని నాకు వైషమ్యం కాని, పక్షపాతం కాని లేవు.

భగవంతుడనైన నిన్ను సేవించడంతోనే సమస్త ఫలాలు సమకూరుస్తూ వుంటే ఈ మానవులు అన్యదేవతలను సేవిస్తారే ! కారణమేమని శంకిస్తావేమో? అర్జునా! విను, జ్ఞానం వలన సిద్ధి లభించడం ఆలస్యం. కర్మల వలన కలిగే సిద్ధులు త్వరగా లభిస్తాయి. అంతేగాక కర్మసిద్ధి ప్రత్యక్షంగా గోచరిస్తుంది. జ్ఞాన జన్య సిద్ధి ప్రత్యక్షం కాదు. దీనికి మరో కారణం కూడా వుంది. కర్మలు స్థూల శరీరానికి, ఇంద్రియాలకు ఎక్కువ సంబంధపడి వుంటాయి. జ్ఞానం సూక్ష్మ శరీరానికి అంత: కరణానికి సంబంధించినదై వుంది. సామాన్య జనులు ముఖ్యంగా స్థూల శరీరంతోనే గాఢంగా అంటుకొని వుంటారు. అందువల్లనే వారికి కామనాసక్తి మెండు. ఇంద్రియ విషయ భోగాపేక్ష జాస్తి. " ప్రపంచంలో విచారాసక్తులు తక్కువ – విషయాసక్తులు ఎక్కువ. అట్టివారు తమ ఇష్టార్థసిద్ధి కొరకు ఆయా ఇంద్రియాధిష్టాన దేవతలనే ఉపాసిస్తారు. సర్వఫలప్రదాతను, సర్వఫల ప్రతిష్టాతను ఆత్మ స్వరూపభూతుడను అయిన నాయందు వారికి దృష్టి లేదు. వారు ప్రాపంచికమైన పుష్టినే అభిలషిస్తారు. కాని పారమార్థికమైన

పుష్టిని కోరరు. వారు చేసే అన్యదేవతోపాసన ప్రకారాంతంగా నాకు చెందేదే ఎలాగంటావా "సర్వదేవ నమస్కార: కేశవం ప్రతిగచ్ఛతి " కావున వారిది సరళ మార్గం కాదు. వక్ర మార్గం. తద్వారా శ్రమ బహుళం. ఫలం విరళం.

అర్జునా ! శమము, దమము, తపస్సు, శౌచము, ఓర్పు, ఋజుత్వము, విజ్ఞానం, జ్ఞానం, ఆస్తిక్యము మొదలగు స్వభావ సంపదలతో కూడి వ్యవహరిస్తూ సత్వగుణ ప్రధానులైనవారు బ్రాహ్మణులు పరాక్రమము, తేజస్సు పట్టుదల, గట్టి తనము, ధీరత్వము ఠీవి స్వభావకర్మలుగా కలిగి రజోగుణం ప్రధానంగా సత్వగుణం గౌణంగా వుండేవారు క్షత్రియులు. కృషి, గోరక్ష, వాణిజ్యాలు స్వభావ కర్మలుగా రజోగుణం గౌణంగా వుండేవారు వైశ్యులు. పరిచర్యే చేయుట స్వభావంగా కలిగి తమోగుణం ప్రధానంగా రజోగుణం గౌణంగా ఉండేవారు శూద్రులు. గుణ కర్మ విభాగాన్ని బట్టి నాల్గు వర్ణాలు నాచే సృజింపబడినాయి. నేను వాటికి అవ్యయ కర్తను అయివుండికూడా అవ్యయమైన అకర్తనై వున్నాను. తత్వదృష్టితో విచారిస్తే జడమైన కర్మ చైతన్యమైన ఆత్మను బంధించలేదు. "అసంగోహ్యాయం పురుష:" ఆత్మ స్వరూపత: అసంగమైనది. శ్రీకృష్ణుని ఆత్మ చంపించేది కాదు. అర్జునుని ఆత్మ చచ్చేది కాదు. పరిశుద్ధమైన ఆత్మయందు కర్తృ కర్మ ప్రేరక భావాలు లేవు.

అర్జునా! నేను నిరహంకారుడిని. నాకు కర్తుత్వాభిమానం లేదు. కావుననే యీ జగదుత్పత్తి స్థితి ప్రళయ రూపమైన కర్మ నన్ను బంధించలేదు. అజ్ఞానులు కర్తృత్వ భోక్తృత్వాభిమానం కలిగిన వారై వుండడంతో వారు కర్మ జాలంలో చిక్కుకుంటారు. నేను స్వయంగా భగవంతుడిని. నాకు కర్మ దోషం లేదు. నేను కర్మ చేస్తున్నట్లు కనబడ్డా వాస్తవంగా నేను అకర్మను. పార్థా! అజ్ఞానులగు

జీవులు అది కావాలి. ఇది కావాలి అంటూ ఆశాపాశాల కాలవాలమై కర్మ ఫలాసక్తులై వుంటారు. నేను ఆత్మ కాముకుని నిత్యతృప్తుడిని. ఈశ్వరుడిని అయిన నాకు కర్మ ఫలాలలో ఆసక్తి లేదు. కౌంతేయా! అపరోక్ష విజ్ఞానాన్ని పొందిన మహాత్ముడు కూడా నావలెనే కర్మ బంధాలకు చిక్కడు. అతడు ఆత్మ యొక్క అకర్త్రాత్మ జ్ఞానసంపన్నుడు. కాబట్టి వాడు కర్మ బంధ విముక్తుడయ్యే వున్నాడు.

సవ్యసాచీ ! ఈ ఉపాయాన్ని ఎరిగి పూర్వీకులు కర్మలను ఆచరించినారు. పూర్వ కాలంలో ముముక్షువులుగానీ, జ్ఞానులుకానీ, " నేను కర్తనుగాను, భోక్తను గాను అనే అసంగాత్మ భావంతో కూడుకొని దేహేంద్రియాదులతో కర్మలను చేస్తూ వచ్చారు. ఆ విధంగా నీవు కూడా చెయ్. నీవు ముక్తుడవైనచో యిదంతా వ్యవహారం మాత్రమని తెలిసి చెయ్. ముముక్షుడవైనచో సర్వకర్త భగవంతుడని కర్తృత్వాన్ని వదిలి కర్మలను ఆచరించు, అలా చేసినపుడు నీకు చిత్తశుద్ధి కలుగుతుంది. ఇట్లు భగవంతుడు అర్జునునికి నిష్కామభావంతో కర్మల నాచరించాలని బోధ చేశాడు.

అర్జునా! కర్మ అంటే ఏమో, అకర్మ అంటే ఏమో ఈ విషయంలో బుద్ధిమంతులు సహితం తికమకపడుతున్నారు. కావుననే ఆ విషయాన్ని నీకు చెప్పదలచుకున్నాను. ఆ తత్వాన్ని తెలుసుకొన్నావా, యీ అశుభరూపమైన సంసారబంధం నుండి విముక్తుడవైపోతావు. నదీతీరంలో స్థిరంగా వుండే వృక్షాలు పడవలో ప్రయాణం చేసేవానికి పరిగెత్తిపోయినట్లు కన్పిస్తాయి. నడిచిపోతున్న మనుష్యుని దూరం నుండి చూసే వాడు నిలబడినట్లే తోస్తుంది. చూశావా ! కర్మ యొక్క వాస్తవస్థితిని సామాన్యుడు గుర్తించడం కష్టం. శ్రుతిస్మృతులు ఆదేశించిన వాటిని కర్మలని, తదితరమైన వాటిని అకర్మలని

కొందరంటారు. శాస్త్రవిహితా చరణం కర్మ అని, దానిని ఆచరించక వదలుట అకర్మయని మరికొందరి మాట. సహజంగా జరిగిపోయే శారీరిక క్రియలన్నీ కర్మ అనియూ, వాటిని మానుకొని వుండటం అకర్మ అనియూ కొందరు అర్థం చెప్తారు.

కుంతీ కుమారా! శాస్త్ర విహితమైన కర్మ విషయాలన్నీ తెలుసుకోవాలి. శాస్త్రము నిషేధించిన వికర్మ విషయాలన్ని కూడా తెలిసికోవాల్సిందే. అకర్మ అంటే ఏమిటో ఆ విషయాలన్నీ కూడా తెలుసుకోవాల్సిందే. ఈ కర్మాకర్మ వికర్మల తత్త్వము దుర్భేధ్యమైనది. శ్రుతిస్మృతి రూపమైన శాస్త్రము విధించిన కర్మ యొక్క వాస్తవిక స్వరూపాన్ని తెలియకపోతే దానిని ఆచరించే స్వరూపాన్ని కూడా చక్కగా తెలిసికోలేకపోతే పరిత్యజించడమంటూ కుదరదు. అకర్మ అనిన పనులు మాని ఊరకుండుటేనా? అదేనా దాని అర్థం. ఆతత్త్వం కూడా తెలుసు కోవలసిందే.

అజ్ఞానంతో చేసే కర్మ అదెంత గొప్పదయినా వానికి క్లేశదాయకం కాకపోదు. ఒక గ్రామంలో ఒక భక్తుడు వుండేవాడు. వాడు సద్గురువును ఆశ్రయించి మంత్రదీక్షను పొందినాడు. ఏకాంతంలో నివసిస్తూ అరలక్ష జపం చేయమని గురువు శిష్యుణ్ణి ఆదేశించాడు. అతడు ఇంటికి వెళ్ళి అనుష్ఠానం ప్రారంభించాడు. ఆ ఇంట్లో పిల్లా, జల్లా, గొడ్డూ, గోదా ఒకటే గొడవ, గందరగోళం, దాంతో ఏకాంతం కుదరలేదు. జపం సాగలేదు. విసుగుపొంది ఇల్లు వదిలి అరణ్యానికి వెళ్ళాడు. అక్కడ ఒక వృక్షమూలాన్ని ఆశ్రయించాడు. జపనిష్ఠ ప్రారంభించాడు. అదేం ఖర్మో! అదే సమయానికి చెట్టుపైన వుండే ఓ పక్షి వాని తలపైన రెట్ట వేసింది. అన్నీ అపశకునాలే అనుకుంటూ ఎదురుగా వుండే నదిలోనికి వెళ్ళి నడుములోతు నీళ్ళలో నిలిచి జపం ప్రారంభించాడు. అక్కడ పెద్ద చేపలు చిన్న చేపలను మ్రింగటం

చూశాడు. ఇది హింసామయ వాతావరణం. ఈ చోట జపసిద్ధి ఎలా కుదురుద్ది. అనుకుంటూ నా కర్మం ఇలా కాలింది. ఇంట్లో పిల్లలగోల, అడవిలో పిట్టల గొడవ, నదిలో ఓ సంకటం, ఈపాడు జీవితాన్ని వదిలి మరో ఉత్తమ జన్మ పొంది గురువుగారికి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలను కున్నాడు. ఆ అడవిలోని కట్టెపుల్లలన్నీ పోగు చేశాడు. అగ్గి తగిలించాడు. చితిలో దుముకడానికి సిద్ధమైనాడు. దైవప్రేరణ కావచ్చు. అంతలో ఓ వృద్ధ బ్రాహ్మణుడు అకస్మాత్తుగా విచ్చేశాడు. ఏమిటయ్యా ఈ హడావిడి అంతా అని అడిగాడు. స్వామీ! మా గురువుగారు బోధించిన మంత్రాన్ని జపం చేసుకొనేందుకు ఇంట్లో కుదరలేదు, అడవిలో కుదరలేదు, ఈ అగ్నిహోత్రంలో ఆహుతి అయిపోయి మరో అనుకూల జన్మం పొందాలని నా అభిప్రాయం అని వాడన్నాడు. అరే నాయనా! నీ ఇష్టాన్ని కాదనను. అట్లే కానియ్యి. కానీ ప్రక్కనే ఫర్లాంగు దూరంలో మా పల్లె వుంది. నీవు కాలిపోతే యీ దుర్గంధం మా ఊళ్ళోకి వ్యాపిస్తుంది. మాకు రోగాలు వస్తాయి. ఎలాగూ చచ్చేవాడివి కాస్త దూరానికి వెళ్ళి చచ్చిపో, అన్నాడు.

పాడు ప్రపంచం వుండనీయదు, మండనీయదు అనుకుంటూవాడు బుద్ధిని మార్చుకొని చక్కా ఇంటికి వెళ్ళిపోయాడు. ఇంతకూ కథ కాదు ముఖ్యం. అదేమంటే అజ్ఞాని ఏ కర్మలో ప్రవేశించినా అది వానికి బాధాకరంగా వుంటుంది. "శాంతాకారం భుజగశయనం" నారాయణుడు పాముపై పవ్వళించి కూడా శాంతాకారుడూ అయి వున్నాడట. కర్మ సంసారంలో శాంతంగా మెలిగేవాడు నరుడు. ఆ విద్యను, ఆ కళను మానవుడు సాధించాలి. ఆ అభిప్రాయంతోనే కర్మమర్మ విజ్ఞానాన్ని భగవంతుడు బోధించేందుకు ప్రారంభించాడు. ధనంజయా! కర్మయందు కర్మను, అకర్మ యందు కర్మను ఎవ్వడు దర్శించగలుగుతాడో వాడే మనుష్యులలో బుద్ధిమంతుడు. వాడే యోగయుక్తుడు. వాడే సమస్త కర్మలను ఆచరించిన పుణ్యాత్ముడు.

కర్మ అంటే ఇక్కడ సహజంగా చేసెడి క్రియ అని సామాన్యానికి అంతటికీ అర్థం వస్తుంది. వినడమూ, చూడడమూ, తినడమూ, తిరగడమూ, యివ్వడమూ, పుచ్చుకోవడమూ, సంకల్పించటమూ, నిశ్చయించడమూ యివన్నీ కర్మలే. ఒక్క స్థూలదేహంతో మాత్రమే కాదు. దేహప్రాణ, మనోబుద్ధ్యాదికాలతో చేయబడే వ్యవహారాలన్నీ కర్మలనే చెప్పబడుతున్నాయి. కర్మ వ్యవహారమంతా దేహేంద్రియ ప్రాణ మనోబుద్ధులలోనే ప్రవర్తిస్తుంది. కాని వాటికి అతీతమై అసంగమమైన ఆత్మను యివి అంటవు. అంటలేవు. ఈ జ్ఞానాన్ని అపరోక్షంగా పొందినవాడు, కర్మలో అకర్మను చూచినవాడు కర్మరాశి అయిన అనాత్మ సముదాయంలో అధిష్ఠానమూ, అకర్మ స్వరూపమూ అయిన ఆత్మను వాడు దర్శించినాడు. అవునా విను ఇట్లే అకర్మలో కర్మను చూడాలి. అకర్మ అంటే కర్మలను మాని ఊరకవుండడమని, కొందరనుకొంటారు. నిజంగా ఈ అకర్మ అకర్మ కాదు. కర్మే, తెలియని భ్రాంత పురుషులు దీనిని అకర్మమని భావిస్తారు. నిజమైన అకర్మస్థితి అంటే ఆత్మనిష్ఠయే. పనులు మాని ఊరక ఉండడం కూడా ఒక పనే. ప్రవృత్తి నివృత్తులు రెండూ కర్తకు ఆధీనాలయి వున్నాయి. ఈ కారణాలతో కర్మలను మానడంతో, పూనడంతో పరమార్థవస్తువైన ఆత్మకు ఎట్టి సంబంధమూ లేదు. అకర్మ అని అజ్ఞానులు చెప్పుకొనే యీ బాహ్య కర్మత్యాగము ప్రకారాంత రంగ కర్మే అవుతుంది. ఈ విధంగా తెలియుటే అకర్మలో కర్మను చూచుట. అనగా అజ్ఞానులు దేనిని అకర్మ అనుకుంటారో అది కర్మే అని తెలియుట. అకర్మలో కర్మను దర్శించిన వాడెవడో వాడే బుద్ధిమంతుడు. వాడే యుక్తుడు. యుక్తుడనగా యోగి అని అర్థం. వాడే సర్వకర్మలను నెరవేర్చినవాడు కూడా అగుచున్నాడు. అని భగవంతుడు ఈ కర్మాకర్మవేత్తను పై విధంగా ప్రశంసించుచున్నాడు. ఈ కర్మాకర్మ విజ్ఞానమే

ఈ జ్ఞాన యోగాధ్యాయం ప్రతిపాదించిన ముఖ్య సిద్ధాంతం. చైతన్యాత్మకునూ, దృశ్య ప్రపంచానికినీ పరస్పరాధ్యాస ప్రవర్తించే వ్యవహారకాలంలో కూడా యెవడు శుద్ధ చైతన్యాన్ని చూడగలుగుతాడో అట్టివాడే మనుష్యులలో బుద్ధిమంతుడు. బుద్ధిమంతుడంటే వస్తువును ఉన్నదున్నట్లు తెలిసికోగలిగేవాడే గదా! తాడును తాడని గ్రహించేవాడే బుద్ధిమంతుడు. కాని పామనుకొనేవాడు బుద్ధిమంతుడు కాలేడు. అట్లే సర్వాధిష్టానమగు శుద్ధ చైతన్యాన్ని దర్శించువాడే పరమార్థ దర్శికాగలడు. అతడే బుద్ధిమంతుడు. ఆత్మ అకర్త అనెడి అనుభవాన్ని పొందుటే నిజమైన అకర్మస్థితి. అంతేకాని, బాహ్యంలో కర్మలను వదలిపెట్టుటను అకర్మ అనుకొనడం అవివేకసరణి. అలాంటివాడు కర్తృత్వాభిమానాన్ని మరో విధంగా వుంచుకొన్నవాడే అయివున్నాడు. వానిది కర్మ గతే కాని అకర్మస్థితి కాదు.

కర్మాకర్మ యథార్థ దర్శనం కలిగినవాడే నిజమైన పండితుడు. అలాంటి వాడొనర్చు కర్మలన్నీ కామసంకల్ప రహితాలై ప్రవర్తిస్తాయి. కామమనిన స్వర్గాధి ఫలకాంక్ష. సంకల్పమనిన నేనే కర్మలను చేసేవాడననే కర్తృత్వాభిమానం. కామ సంకల్ప రహితుడైన వాడాచరించు కర్మలన్నీ లోక సంగ్రహణార్థంగానో, జీవయాత్రామాత్రా నిర్వహణంగానో, ప్రారబ్ధ భోగ బలాత్కారంతోనో జరిగి పోతుంటాయి. అకర్మలలో స్వార్థవాసనంటూ వుండదు. వాడొనర్చు శు భాశుభ కర్మలన్నీ జ్ఞానాగ్నిచే దగ్ధప్రాయాలైనాయి. కర్మాకర్మ యదార్థ దర్శనమే జ్ఞానమని వెనుక చెప్పే వున్నాము కదా! అట్టి జ్ఞానాగ్నిచే ఆగామి సంచిత ప్రారబ్ద కర్మలన్నీ కూడా దగ్ధమై పోయాయి. ప్రారబ్ద కర్మ జ్ఞానికున్నదనుమాట. పరదృష్టిని అవలంబించే కాని స్వదృష్టితో కాదు. అట్టి వానిని బుద్ధులు పండితుడన్నారు. "పండా" అంటే బుద్ధి అని అర్థం . సమ్యగ్దర్శన యోగ్యతా బుద్ధిని "పండా" అంటారు. అట్టి బుద్ధి కలవాడు పండితుడు.

మనం చేసే పనులన్నీ కోరికలతోను, సంకల్పాలతోను, ప్రేరేపింపబడి జరుగుతూ వుంటాయి. ఫలాసక్తితో కర్తృత్వాహంకారంతో చేయబడే కర్మలు బరువునూ, అలసటనూ కలిగిస్తాయి. జ్ఞాని ద్వారా జరిగే కర్మలు సహజకర్మలు. సూర్యునివలె, గాలివలె, నిరంతరాయంగా జరుగుతూవున్నా ఆ కర్మ వేసటను శ్రమను కలిగించేదిగా వుండదు. ఊపిరి పీల్చుట, రెప్పలల్లార్చుట మనం జన్మప్రభృతిగా చేస్తూవున్నా మనకవి భారభూతమై లేవు. కారణమేమంటారు. అవి సహజకర్మలు. వాటిని కర్తృత్వాహంకారంతో చేయుటకుపక్రమించావా పది నిమిషాలకు ప్రళయము దాపరించినట్లవుతుంది. జనకుడు, శ్రీకృష్ణుడు, బుద్ధుడు, శంకరుడు, మహాత్మాగాంధి, ప్రభృతులు చేసినవి సహజకర్మలు. కాబట్టి సులువుగా అంతంతవి సాగిపోయాయి. జ్ఞానులకూ మనకూ వుండే భేదమిది. కర్మయందు కర్మను, అకర్మయందు కర్మను దర్శించిన మహానుభావుణ్ణి యింతవరకు కొనియాడి అంతటితో ఆగక, తనివి తీరక భగవంతుడు మరీమరి ముందు ముందు శ్లోకాలతో ఆ మహాత్ముణ్ణి గురించి బహుముఖాల ప్రశంసిస్తూవున్నాడు. అర్జునా కర్మలపై ఆసక్తిని ఫలంపై ఆసక్తిని వదిలిపెట్టి, నిత్యతృప్తుడూ, నిస్వార్థుడూ అయిన జ్ఞాని కర్మలలో ప్రవర్తిస్తూ వున్నా ఏమీ చేయని వాడే అగుచున్నాడు. ఇక్కడ జ్ఞాని అని చెప్పిన మాటకు కర్మాకర్మల యదార్థదర్శి అని అర్థం. కర్మాసక్తికాని, ఫలాసక్తికాని, ఈ రెండు విధాలైన ఆసక్తులు వానికి లేవు. నిత్య నైమిత్తికాది కర్మలను చేసేవాణ్ణి, చేసినవాణ్ణి అనే కర్తృత్వాభిమానమును కర్మాసక్తి అంటారు. వాటి ఫలమైన స్వర్గాది భోగాలను ఆపేక్షించుట ఫలాసక్తి అనబడుతుంది. ఆత్మ అకర్త, అభోక్త అనెడి జ్ఞాన ప్రభావంతో ఆరెండు ఆసక్తులు ఎగిరిపోయాయి. అతడు నిత్యతృప్తుడైనాడు. పరమానంద స్వరూప లాభప్రాప్తి చేత వానికి అనాత్మ పదార్థాలపై ఆశలేదు. అతడు నిరాశ్రయుడు. అద్వైతాత్మదర్శి కాబట్టి

దేహేంద్రియాదుల అభిమానం కాని, వాటిని ఆశ్రయించివుండటం కాని వానికి లేవు. అట్టి జీవన్ముక్తుడు ప్రారబ్ధకర్మవశాత్తు లోకదృష్టిని అనుసరించి, లౌకిక, వైదిక కర్మలను సాంగోపాంగంగా ఆచరిస్తూ వున్నా కూడా పరమాత్మదృష్టిలో పరికించినప్పుడు ఏమీ చేయనివాడే అయివున్నాడు.

జ్ఞానికి ఫలాసక్తి లేదు. కారణమేమనగా అతడు నిత్యతృప్తుడు. ఆసక్తి కలవాడు నిత్యతృప్తుడు కాలేడు. తృప్తి లేకుండుట అజ్ఞాని లక్షణం. జ్ఞానికి కర్తృత్వసంగం లేదు. కారణమేమనగా అతడు నిరాశ్రయుడు. కర్తృత్వభావం కలవాడు నిరాశ్రయుడుగా వుండలేడు. కర్తృత్వ బుద్ధి అజ్ఞాని చిహ్నం. సమ్యక్‌జ్ఞాన ప్రభావంతో విక్షేపహేతువులైన జ్యోతిష్టోమాది కర్మలు సైతము బంధకాలు కావన్నప్పుడు శరీర నిర్వహణార్థం జరుపుకొనే సహజ కర్మలు కాని భిక్షాటనాది యత్యాశ్రమకర్మలు కాని నిరహంకార పూర్వకంగా చేసే లోక సంగ్రహరూపమైన కర్మలు కాని బంధకాలు కావని వేరుగా చెప్పవలసిన పని లేదు. అర్జునా! నిరాశి, నియతచిత్తాత్ముడు, సర్వపరిగ్రహ వివర్జితుడు ఐన జ్ఞాని జీవయాత్ర కోసం, శారీరికమైన కర్మలు చేసినా, వాణ్ణి ఇంద్రియసుఖాల ఆవేశాలకు లోనుకాడు. అన్ని విధాలైన వాంఛలకు వాసనలకు స్వస్తి చెప్పినాడు. అట్టి వానిని "నిరాశి" అందురు. వాని మనస్సులోను, ఇంద్రియాలలోను రాగద్వేషాల అలజడి లేనేలేదు. కాబట్టే శబ్దాది విషయాలు తమ ప్రభావం వానిపై చూపలేవు. అట్టివాడు గృహస్థుడు కానీ, సన్యాసి కానీ, వాణ్ణి "యతచిత్తాత్ముడు" అంటారు. ఏ వస్తువునందు కూడా మమకారబుద్ధి యెవ్వనికి లేదో, భోగవస్తు సామాగ్రులను చేర్చి పెట్టుకోవాలనే సంగ్రహబుద్ధిని యెవ్వడు దూరము చేసినాడో వాడు "త్యక్తసర్వపరిగ్రహుడు" అన్ని పరిగ్రహాలను త్యాగం చేసినవాడని దాని అర్థం.

కౌంతేయా! మరీవిను, యదృచ్ఛాలాభ సంతుష్టుడు, ద్వంద్వాతీతుడు మాత్సర్యరహితుడు, జరిగినా జరుగకున్నా, అయినా కాకున్నా చలనములేని బుద్ధి కలవాడు అయిన జ్ఞాని, పనులు పాటలు, కర్మలు ధర్మాలు చేస్తూవున్నా కర్మలు వానిని బంధించవు. యేదేది సంప్రాప్తిస్తుందో అది అనుకూలంగానీ, ప్రతికూలంగానీ, వానికి రాగంలేదు. ద్వేషం లేదు. వానిది వెలితిలేని తృప్తి, బాహ్యవస్తువులకు గుటకలు మ్రింగడు. యదృచ్ఛాలాభ సంతుష్టుడు పాలిటికి వచ్చిందే పరమాన్నము. నొసటి వ్రాత తుడిస్తే పోదు. వృథావ్యధ యెందుకని, శాంతిని చెదరనీయక, నిండిన హృదయంతో వుండుట యదృచ్ఛాలాభ సంతుష్టి. అంతేకాని పురుషార్థానికి దూరుడై, ప్రయత్నహీనుడై, సోమరితనంతో జడప్రాయంగా పడివుండే మూఢుని యదృచ్ఛాలాభ సంతుష్టుడనుకోవడం, అర్థాన్ని అపార్థం చేసికొనుటే. తృప్తి జ్ఞాని యొక్క సొత్తు గాని, సోమరిసొత్తు కాదు. సోమరి హృదయంలో అశాంతి పిశాచము వలె తాండవనృత్యము చేస్తుంటోంది. స్వార్థం తొలగనిదే కోరికలు తొలగవు. కోరికలు తొలగకపోతే తృప్తి సున్నా.

అనుకున్నపని అయితే సిద్ధి. తప్పితే అసిద్ధి. ఇష్టం ఫలిస్తే సిద్ధి. ఫలించకపోతే అసిద్ధి. సిద్ధిలో పొంగడం అసిద్ధిలో క్రుంగడం సామాన్యుల పద్ధతి. కానీ కర్మాకర్మ తత్త్వాన్ని తెలుసుకున్న జ్ఞాని సిద్ధిలోను, అసిద్ధిలోను సమత్వస్థాయిలోనే వుంటాడు. "కృత్వాపి ననిబధ్యతే" అర్జునా! ఇంతవరకు చెప్పినట్లు ఒప్పిన మహాత్ముడు బైటికి కర్మి, లోపల అకర్మి, అతడు కర్మలు చేస్తున్నా, కర్మబంధాలకు గురికాడు. మనుష్యుడు కర్మలు చేసే తీరాలి. కర్మలను వదిలే వీలులేదు. "కర్మణ్యే వాధికారస్తే" అని భగవంతుడు ఆదేశించినట్లు జరగాల్సిందే. మానవుడే కాదు, సృష్టిలోని ప్రతివస్తువు కర్మ

చేస్తూనే వుంది. సృష్టే కర్మ. కర్మే సృష్టి. ప్రజాపతి బ్రహ్మదేవుడు కర్మతో జతగూర్చే ప్రాణికోటిని సృష్టించాడు. తనపాలి వంతుకు వచ్చిన కర్మను మానవుడు స్వార్థంతో బద్ధకంతో వదిలేస్తే పతితుడైపోతాడు. అసలు ఏదీ చేయకుండా వదిలివుండే దానికే వీలులేదు. ప్రతివాడూ తన ప్రకృతికి అనుగుణ్యమైన కర్మను చేసే తీర్తాడు. కానీ ఈ నియమం జ్ఞానిపై వర్తించదు. పరిగ్రహరహితుడై కేవలం శారీరక సంబంధమైన కర్మలను మాత్రం చేస్తాడు. తక్కినవి చేయలేదనే ప్రత్యవాయం వానికి లేదు. అర్జునా! గత సంగుడైన ముక్తుడు జ్ఞానావస్థిత చిత్తం కలవాడై యధార్థంగా యెవడు కర్మల నాచరిస్తూ వున్నాడో అట్టివాని కర్మలు సమగ్రంగా ఫలసహితంగా తమంతకు తాము ఉపశమించి పోతున్నాయి.

ఇట్టి నిస్సంగ స్థితిలో నిలబడే శక్తిలేనివాడు ప్రాథమిక సాధనంగా సత్సంగాన్ని అవలంబించాలి. సత్సంగంలో నిస్సంగం లభిస్తుందని అని శంకరుల వారి మాట. సత్సంగమనే మాటకు మూడు విధాలైన అర్థాలను గ్రహించవచ్చు. సత్యస్వరూప పరమాత్మతో సాంగత్యమని మరొక అర్థం. అర్హతను బట్టి, అనుకూలాన్ని బట్టి వీటిల్లో దేనినైనా అవలంబించి చివరకు నిస్సంగుడు కావలె. అసంగుడు కావలె. గత సంగుడు కావలె. భక్తులు భగవంతుని ప్రార్థన చేయునపుడు ఆయన అవయవాలకు కమలసాదృశ్యం చెప్పడం వుంది. పాదకమలములని, నేత్ర కమలములని, కరకమలములని, ముఖ కమలమని వర్ణిస్తారు. కమలము భారతీయ సంస్కృతికి పూజ్యప్రతీకము. అది బ్రహ్మ కంటే ముందు పుట్టింది. కమలము భారతదేశంలో తప్ప విదేశాలలో లేదని శ్రీచిన్మయానంద స్వాములవారు ఒకచోట వ్రాసినట్లు జ్ఞప్తి. బురదలో వున్నా, నీటిలో వున్నా అది అంటుకోదు. "ప్రపంచంలో తామరాకుల

వుండవలె. బ్లాటింగ్ పేపరులా వుండొద్దని ఆర్యోక్తి". ఇదే గత సంగుని లక్షణం. చిత్తము ఒకవైపు, ఇంద్రియాలు మరోవైపు పనిచేస్తుంటే వాడు రెంటికీ చెడిన రేవడు కాడా? అట్టి వానికి పరమార్థము దొరకదు. వ్యవహార సిద్ధీ లేదు. అని కొందరికి శంక కలుగవచ్చు. కానీ ఆమాట అనుభవంలో లేనిమాట. అరూఢులు కానివారి మాట. కొత్త పూజారి గంట వాయిస్తే ధూపహారతి తిరుగదు. ధూపహారతి తిరిగితే గంట మ్రోగదు. కానీ అలవాటు పడితే అదీ ఆడుతుంది. ఇదీ ఆడుతుంది. ఆ విధంగా అభ్యాస బలంతో చిత్తము ఆత్మాను సంధానంలోను ఇంద్రియాలు తమ కర్తవ్య కర్మలలోనూ ప్రవర్తించ గలుగుతాయి.

అర్జునా కొందరు కర్మయోగులు దైవయజ్ఞాన్ని ఆచరిస్తారు. పరిపక్వచిత్తులైన జ్ఞానయోగులు జ్ఞానయజ్ఞ పద్ధతిని ఆశ్రయించి బ్రహ్మరూపాగ్నిలో జీవాత్మను హోమము చేస్తున్నారు. జీవబ్రహ్మైక్యాను సంధానాన్ని ఆచరిస్తున్నారు. యజ్ఞం చేయుటవలన పుణ్యం వస్తుంది. పవిత్రత వస్తుంది. చేయనివాడు పాపానికి పాత్రుడౌతాడు. ఫలాపేక్షతో చేసినపుడు అది జన్మబంధానికి కారణమౌతుంది. అసలు చేయనివాని మాటేవేరు. వాడు వ్యర్థ జీవి. ఫలాసక్తి రహితంగా కర్తవ్య నిష్టతో చేసిన యజ్ఞము పూర్ణత్వ సిద్ధికి సాధనమౌతుంది. లోభరహితంగా, స్వార్థరహితంగా చేసినది ప్రశస్తమైన యజ్ఞము యజ్ఞము అంటే నిష్కామకర్మ. కర్మ ప్రవృత్తికి ఆరంభమూలమేదో, కర్మసంకల్పానికి ప్రేరకశక్తి యేదో గుర్తించి, దాని కారణ కార్యక్షేత్రాన్ని పర్యావలోకనం చేసి ఆద్యంతాలలో తాను తానై నిండి వుండే మహాశక్తిని సంభావించి, తన కర్మ ప్రవృత్తిని పూర్ణార్పణం చేయుట యజ్ఞమను మాటకు సమగ్ర అర్థం. ఈ విజ్ఞానంతో చేసిన కర్మలన్నీ పరమసిద్ధి ప్రాప్తికి దోహదాలౌతాయి. ఇదే అధియజ్ఞం. ఇదే నిష్కామకర్మ. ఇదే కర్మయోగం.

కర్మయజ్ఞాలను ఆచరించడం వల్ల మనుష్యునికి పాపం తొలగును. చిత్తశుద్ధి కలుగుతుంది. తద్వారా జ్ఞాన యోగానికి అర్హుడై పోవును. బ్రహ్మాగ్ని యందు యజ్ఞంతోనే యజ్ఞాన్ని హోమం చేసే ప్రావీణ్యతను సంపాదించగలుగుతూ వున్నాడు. బ్రహ్మము అగ్నివంటిది. సర్వకర్మలను దగ్ధం చేయగలుగుతుంది. అగ్ని కట్టెలకన్నిటికీ తన స్వరూపాన్ని యిచ్చివేసినట్లు బ్రహ్మజ్ఞానాన్ని సమస్తాన్ని తన స్వరూపంగా చేసుకుంటుంది. "యజ్ఞాన్ని యజ్ఞంతో హోమము చేయుట" అనే మాటకు అర్థమేమంటే జీవాత్మను జ్ఞానముతో బ్రహ్మాగ్నిలో వ్రేల్చుట అని అర్థం. ఆత్మే పరమాత్మ అనెడి ఏకత్వ జ్ఞానంతో వ్యష్ఠిని సమిష్టిలో ఏకం చేయుట అని అర్థం. అర్జునా మరికొందరు ఇంద్రియాలను సంయమ రూపమనే అగ్నిలో హోమం చేస్తున్నారు. ఈ విధంగానే మరి కొందరు శబ్దాది విషయాలను శ్రోత్రాది యింద్రియాలనే అగ్నులలో హోమమాచరిస్తున్నారు. యోగులైన వారు ఇంద్రియాలను విషయాలలో పడిపోకుండా అరికట్టుతారు. చెవి మొదలైన యింద్రియాలను సంయమనే అగ్నిలో హోమం చేస్తారట. అనగా ఇంద్రియాలను విషయాలవైపు పోనీయరని అర్థము. లోకంలో సంయమానికే విలువ. గుర్రం స్వాధీనంలో వున్నప్పుడే రౌతు గమ్య స్థానం చేర్తాడు. గుర్రం తనదే అయినా కళ్ళెం బిగించి స్వారీ చేయాలి. అలాగే యింద్రియాలు తనవే అయినా పరమార్థ పథికుడు సంయమనే కళ్ళెం వేసే పయనిస్తాడు. అర్జునా! క్షిప్త, మూఢ, విక్షిప్త, ఏకాగ్ర, నిరుద్ధాలని అయిదు భూమికలు వున్నాయి. భూమికలంటే అవస్థలని, తరగతులని అర్థం. రాగద్వేషాలకు వశమై విషయ పదార్థాలలో కదుంగదు చంచలమైన చిత్త భూమికను క్షిప్తమంటారు. ఈ స్థితిలో చిత్తము ఈగవలె కొట్టులాడు తుంటుంది. నిద్రతో బద్ధకంతో కునికిపాట్లతో కూడిన చిత్తము మూఢము. చిత్తము విషయాసక్తమూవున్నా అప్పుడప్పుడు

పుణ్యపరిపాకమో ప్రయత్నఫలమో దైవయోగమో అడపాదడపా ధ్యాన నిమగ్నస్థితిని పొంది వుండగలిగే అవస్థను విక్షిప్తమంటారు. క్షిప్తావస్థగాని, మూఢావస్థగాని, సమాధి సాధనకు అర్హము కాదు. ప్రయత్నిస్తే విక్షిప్తావస్థకు ఆ యోగ్యత వుంది.

కౌంతేయా! యజ్ఞాధికారులైన మరికొందరు ఇంద్రియకర్మలను జ్ఞానదీప్తమైన ఆత్మ సంయమ యోగమనే అగ్నిలో హోమం చేస్తున్నారు. సమాధి రెండు రకాలు, ఒకటి లయ పూర్వక సమాధి, ఇంకొకటి బాధ పూర్వక సమాధి, కార్యాన్ని కారణంలో లయింపజేస్తూ, చివరికి చైతన్య మాత్రముగ మిగులుట లయపూర్వక సమాధి. ఈ సమాధిలోని వానికి తత్త్వమస్యాది వేదాంత మహావాక్యాల యొక్క తాత్పర్య జ్ఞానం లేకపోవుట చేత కార్యసహితంగా అవిద్య నశించుట లేదు. అవిద్య మిగిలివుండటం చేత కార్యరూపమైన సంసారము మళ్ళీ సంభవించే వీలుంది. ఈ లయపూర్వక సమాధి సుషుప్తితో సమానమైనదే కాబట్టి దీనిని సబీజ సమాధి అంటారు. బాధ పూర్వకమైన సమాధి నిర్బీజ సమాధి. తత్త్వమసి మహావాక్య శ్రవణంతో బ్రహ్మ సాక్షాత్కారం యెప్పుడు సిద్ధిస్తుందో అప్పుడే అవిద్య సంపూర్ణంగా నివర్తిస్తుంది. అనాదియు, సాంతమునగు అవిద్య ఒక్కసారి నశించిందంటే మళ్ళీ సంభవించే వీల్లేదు. ఎందుకనగా అది అనాది కాబట్టి. అవిద్యా నివృత్తితో మహత్తత్వాదికాలు కూడా బాధింపబడుతున్నాయి. ఇవి బాధ పూర్వకమైన నిర్బీజ సమాధి. పట్టుదల కలిగి ధృఢవ్రతులైన కొందరు సాధకులు ద్రవ్యముతోను జ్ఞానులైన కొందరు తపో యజ్ఞాన్ని, కొందరు యోగ జ్ఞానాన్ని ఆయా సంస్కార భేదంతో ఆచరిస్తూ వుంటారు. తన దగ్గర వుండే సామాగ్రులను శాస్త్రీయ పద్ధతులతో సదుపయోగం చేయటాన్ని ద్రవ్య యజ్ఞం అంటారు. ద్రవ్యము, దేవత, మంత్రము ఈ మూడింటి సమీకరణంతో జరిగే యజ్ఞాన్ని ద్రవ్య

యజ్ఞమంటారు. ధర్మం కొరకు మనోవాక్కాయములను తపింపచేస్తే దానిని తపోయజ్ఞం అంటారు. తపస్సును హింసగా భావించరాదు. ఒక నిశ్చిత కార్యం కొరకు తనను తాను దండించుకొనుట హింసకాదు. దుష్ట ఫలాన్ని ఆశించక, ధర్మాన్నే ప్రధాన లక్ష్యంగా పెట్టుకొని శరీరేంద్రియ మనస్సులను తపింపచేయుట తపస్సు.

అర్జునా! అన్నం దొరకక పస్తుంటే అది తపస్సు కాలేదు. అది అభావ వైరాగ్యమే కాని స్వభావ వైరాగ్యమనిపించుకోదు. తపస్సుతో పాపం క్షయించడమే కాక పుణ్యము కూడా సిద్ధిస్తుంది. ఉత్తమ నీచ జన్మలకుగాని, శ్వాసోచ్ఛ్వాసరూపమైన ఆయుస్సుకు గాని, సుఖదు:ఖ భోగాను భవమునకు గాని వెనుకటి పాప పుణ్యాలే కారణం. పుణ్యమెంతో సుఖమంత. ఎంత పాపమో అంత దు:ఖము. సుఖదు:ఖాలు పుణ్యపాపాలతో ఏర్పడుతాయి. ఈ ఏర్పాటుకు ఆధారము వాని వాని ఉద్దేశ్యాన్ని బట్టి వుంటుంది. మంచివలన గూడా దు:ఖాన్ని పొందుట వుంది. అయినా ఆ దు:ఖము ధర్మదృష్ట్యా తృప్తిగా అనుభవిస్తే పుణ్యోత్పత్తికి సాధనమౌతుంది.

ఆ పుణ్యంతో ఆత్మోన్నతి సిద్ధిస్తుంది. పుణ్యం వలన కలిగే సుఖాన్ని అనుభవించడంలో కూడా రెండు మార్గాలున్నాయి. మద్యపానం చేసి, జార, చోరత్వాలకు పాల్పడి అనాచార దురాచారాలకు లోబడి పొందే సుఖము ఉత్తరోత్తరం పాపహేతువు అవుతుంది. ధర్మానుకూలమైన సుఖానుభవంతో ఉత్తరోత్తరం పుణ్యం కూడి వస్తుంది. కర్మలను చేస్తూ కర్మబంధాలకు చిక్కని యుక్తిని యోగమంటారు. భగవద్గీతలోని పద్దెనిమిది ఆధ్యాయాలు పద్దెనిమిది యోగాలే! యోగ యజ్ఞంతో జీవితం సర్వతో ముఖమైన వికాసాన్ని పొందుతుంది. చిత్తము ఇంద్రియాలు వశపరులై మెలగుతాయి. మనుష్య

జన్మ ముఖ్యంగా భోగజన్మ కాదు. యోగజన్మ, యోగ జీవితాన్ని గడుపుటే మానవ జన్మానికి ముఖ్య బాధ్యత. మానవుని స్వధర్మం కూడాను. యోగ సేవనంతో స్వాస్థ్యము, స్వాతంత్ర్యము, స్వరూప జ్ఞానము, కర్మ కౌశలము లభిస్తాయి.

సత్ సాహిత్య పఠనం లేకపోబట్టే ఈనాటి బాలబాలికలలో ధర్మ సంస్కారం లోపించి నీతి భ్రష్టులవుతున్నారు. భగవద్గీత, భాగవతం వంటి ఆర్ష సాహిత్యాన్ని పఠింపజేసి వారిని నీతిమంతులగా చేయవలసిన బాధ్యత తల్లిదండ్రులపై వుంది. బిడ్డలకు సంపాదన ఇస్తే చాలదు. సంస్కారాన్నీ కూడా ఇవ్వాలి. సంపాదన వెంట రాదు. సంస్కారం వెన్నంటి వస్తుంది. ఊరక పఠించడంతో, కాక అర్థజ్ఞాన సంపన్నతతో పఠిస్తే సద్య: ఉత్తమ ఫలితాన్ని పొందగలుగుతాడు. ఆధ్యాత్మిక సాధకుడి ఆహారాన్ని గురించి అయిదు లక్షణాలు చెప్పినారు. (1) న్యాయార్జితమూ అయివుండాలి. (2) సాత్వికమై వుండాలి (3) పరిమితి వుండాలి (4) రుచికి గాక ఆకలి కొరకు తినాలి (5) భగవన్నివేదితం కావాలి. ఈ ఐదు లక్షణాలతో కూడిన ఆహారము యోగ్యమైన ఆహారము. తినుటకై బ్రతకడం కాదు. బ్రతుకటకై తినాలి. అని మహాత్మాగాంధి గారి ఉపదేశం. శ్రీ మళయాళ స్వాముల వారు కూడా దీనిని బోధించేవారు. దేహము కొరకు తిండిగాని, తిండి కొరకు దేహము కాదు అని.

ధనంజయా! యజ్ఞాలను ఆచరించి ప్రసాద రూపంగా మిగిలిన అమృత భోగాన్ని అనుభవించే పుణ్యాత్ములు సనాతన సత్య పరబ్రహ్మాన్ని ప్రాప్తిస్తారు. యజ్ఞ జీవి కానివాడు తినేది అన్నం కాదు. పాపమేనంటూ గడిచిన మూడవ అధ్యాయంలో భగవంతుడు చెప్పివున్నాడు. "తనకు గానే తినేవాడు పాపాన్నే తింటున్నాడు" అనే అర్థాన్ని ఋగ్వేద శృతి కూడా చెప్పింది. యజ్ఞము ఒక

విధము కాదు. ప్రాణా యామము, యజ్ఞము ఆజ్యాది సామగ్రులను అగ్నిలో వ్రేల్చుట యజ్ఞము. దైవిక పూజాస్తోత్ర పాఠాలను పఠించుట యజ్ఞము.

బలివైశ్వదేవాదికాలు యజ్ఞాలు. ద్రవ్య యజ్ఞం చేసేవాణ్ణి మాత్రమే యాజ్ఞికుడని గీత చెప్పదే. పైన చెప్పిన వ్రత నియమాదులను ఆచరించే వారంతా యాజ్ఞికులే. యజ్ఞార్థ కర్మము బంధకము కాదని, యజ్ఞహీనుడు ఉభయ లోక భ్రష్టుడని గీత చెప్పిన మాట అర్థపూర్ణమైంది. మనుష్యుడు తన స్వేచ్ఛను తన స్వార్థాన్ని, తన లాభాన్ని మొత్తం తానొక్కడే అనుభవించకూడదు. లోకానికి, సమాజానికి కొంతభాగం త్యాగం చేయాలి. అట్లు చేయకపోతే సమయం వచ్చినప్పుడు త్యాగమనే గౌరవమైన పద ప్రయోగం వానికి లభించదు.

జ్ఞానము యొక్క ప్రశంశ భగవంతుడు చెప్పగా అర్జునుడు విన్నాడు. ఆ జ్ఞానము ఎక్కడ లభిస్తుందో తెలుసుకోవాలనే ఆదుర్దా ఆయనకు కలిగింది. జ్ఞానము ఏ కంపెనీలో దొరుకునో, దానికి ఏమి వెల చెల్లించాలో అనే జిజ్ఞాస అర్జునునికి కలిగిందేమో? అయితే ఆయన పుణ్యం మంచిది. కాబట్టి అడుగకనే ఇచ్చే అంతర్యామి పరమాత్మ జగద్గురువై తనకు సంప్రాప్తించి వున్నాడు. జిజ్ఞాస ఆసక్తి వున్నా ఆ పుణ్యభాగ్యం అందరికీ లభిస్తుందా! అయినా ఫర్వాలేదు. సాధకుడు నిరుత్సాహపడవలసిన పనిలేదు. భగవంతుని బోధ ఒక్క అర్జునునికి మాత్రమే అనుకోరాదు. “గోవిందుడు అందరివాడు” ఆయన బోధ మానవ కోటికంతా సంబంధించినది. అర్జునా జ్ఞానప్రాప్తికి ఆచార్యోపాసనము తప్పని సరి సుమా! తత్త్వవేత్తలైన జ్ఞానుల సన్నిధికి పోయి దండవత్ ప్రమాణాలు చేయుము. నీతో దండాలు పెట్టించుకోవాలనే ఉబలాటం వాళ్ళకు ఉందని భ్రమించేవు సుమా! అయ్యా! నీ అభిమానం

నశించే కోసంగా, నీ యోగ్యతను ప్రదర్శించే కోసంగా ఈ ప్రవర్తన అవసరం. నీళ్ళు పల్లంలో నిలుస్తాయి. కానీ, మిట్ట ప్రదేశంలో నిల్వవు. వినయము దైవీ సంపద అభిమానము అసురీ సంపద. జ్ఞానం దైవీ సంపన్నుని సొత్తు.

వినయం వున్నచోట విద్య నిలుస్తుంది. తత్త్వ జ్ఞానుల చిత్తములు ప్రసన్నమయ్యేటట్లు సేవా సపర్యలు చేయుము. "గురుశుశ్రూషయా విద్యా" గురుసేవతో అలవడిన విద్య సాత్త్విక విద్య. సమయం తెలిసి నీ శంకలను వారి ముందు పెట్టు. ఉద్వేగ చిత్తంతో వారిని తొందర పెట్టకు. "నేనెవరు ఈ సంసార బంధం నాకెలా వచ్చింది. ఈ చక్రం నుండి తప్పించుకొనే మార్గం లేదా? అని సౌమ్యంగా ప్రశ్నించు. నీ శ్రద్ధా భక్తులకు, నీ ప్రణిహిత సేవలకు వారు ప్రసన్నులౌతారు. మోక్ష కారణమైన ఆత్మ జ్ఞానాన్ని నీకు ఉ పదేశిస్తారు.

జ్ఞానం కావాలంటే జ్ఞానులనే ఆశ్రయించాలి. దీపం ద్వారానే దీపం వెలుగుతుంది. వేరే ప్రయత్నంతో వెల్గదు. పుస్తకాల పాండిత్యంతో వ్యాకరణ నిఘంటువుల ఆశ్రయంతో చిత్త సంతాపాన్ని శమింపజేసే ఆధ్యాత్మ జ్ఞానం లభించదు. శాస్త్రాభ్యాసం మంచిదే. అంతమాత్రాన చాలదు. సముద్ర జలాన్ని సరాసరి త్రాగితే దప్పి తీరదు. పైపెచ్చు ఆ దప్పి అధికం కావడమూ వుంది. ఆ సముద్ర జలమే మేఘం నుండి వస్తే ఆ దప్పి తీరుతుంది. తృప్తి కలుగుతుంది. అట్లే శాస్త్రాలు సముద్రము లాంటివి. "అనంతశాస్త్రం" శాస్త్రజాలం మహారణ్యం" వాటిని సరాసరి చదవటంతో అపరిపక్వ చిత్తులకు అభిమానం పెరుగుతుంది కాని అనుభవం పెరగదు.

అదే శాస్త్రాలలోని జ్ఞానము సద్గురు సాన్నిధ్య ప్రసాదంతో లభిస్తే ఆత్మ సంతృప్తికి ఆలవాలమౌతుంది. జ్ఞానుల వద్దకు వెళ్ళి జ్ఞానాన్ని తెలుసుకొమ్మని

భగవంతుడన్నాడు. కానీ, నావద్దకు రమ్మని చెప్పలేదు. జ్ఞానోపదేశ మొనర్చుట జ్ఞానుల పని. గురువుల పని. ఆ పని ఆ డిపార్ట్‌మెంట్ వారిది. ఇక్కడ జ్ఞానులని బహువచన ప్రయోగం జరుపడంలో భలే స్వారస్యం వుంది. తృప్తి కలిగినా కలగకున్నా ఒక్కే గురువును ఆశ్రయించి పడివుండాలనే సాంప్రదాయిక సంకుచిత దృష్టి గీతకు లేదు. తుమ్మెద తనకు తృప్తి కలిగే వరకు పుష్పాలను మార్చి మార్చి, తేనెను తీసుకొంటుంది.

అట్లే జిజ్ఞాసువు తృప్తి కలిగేటంతవరకూ గురువులను ఆశ్రయించి, జ్ఞానాన్ని పొందాలని గురుగీత చెప్పింది. ఇక్కడ చెప్పిన మాట జిజ్ఞాసువులకు చెప్పినది కాని, నటనకు, వినోదానికి కుచోద్యానికి ఆషామాషీకి ప్రవర్తించే చపల చిత్తులకు సంబంధించిన మాట కాదిది. ఇంతకూ, ఫలితార్థము ఏమనగా నరపుత్రుడు గురుపుత్రుడు కావాలి. "ఆచార్యవాన్ పురుషోవేద" అని శ్రుతి చెప్పింది. శ్రద్ధయూ, భక్తియూ, సరళ భావమూ కల్గివున్నప్పుడే జ్ఞానాన్ని పొందటానికి అర్హుడు. జ్ఞానం తెలుసుకోవాలనే శ్రద్ధ వుండాలి.

సరేసరి. శ్రద్ధ వుండడంతోనే సరికాదు. ఉపదేశం చేసే సమయంలో చెప్పే విషయాన్ని మనస్సులోకి దించుకొనుటకు తగిన నిబ్బరమూ వుండాలి. అంతేకాదు. తెలిసిన విషయాన్ని క్రియాత్మకంగా అనుష్ఠానంలో పెట్టగలిగే నేర్పూ వుండాలి. భక్తి శ్రద్ధలు లేనివాడు గురువు చెప్పిన ఉపదేశాన్ని గ్రహించలేడు. ఆ వుద్దేశ్యంతోనే గురుసేవా శుశ్రూషలు శాస్త్రాలలో విధించబడ్డాయి. ప్రశ్నలు అడుగువారు వివిధ రకాలు. పరీక్ష చేయుటకు ప్రశ్నలు వేసేవారు ఉంటారు. అట్టివారు జ్ఞానదేవుని యొక్క ప్రసాదానికి అర్హులు కాలేరు. దూడను చూసి ఆవు చేపినట్లు సువినీతుడైన శిష్యుని యెడ గురువు ఆత్మజ్ఞానాన్ని, జ్ఞానామృతాన్ని స్రవింపజేస్తాడు.

శిష్యుడెట్టివాడై వుండాలో చెప్పి భగవంతుడు గురువు యొక్క యోగ్యతను కూడా చెప్పుచున్నాడు. గురువు జ్ఞానియై వుండాలి. మరియు తత్త్వవేత్తయై వుండాలి. ముండకోపనిషత్తు ఈ రెంటినే వేరే మాటలలో "శ్రోత్రియం బ్రహ్మ నిష్టం" అని చెప్పింది. శాస్త్ర జ్ఞానమూ, అనుభవ జ్ఞానమూ కలిగిన వాడయి వుండాలని అర్థం. అట్టివాడే గురుపీఠానికి అర్హుడు. గురుత్వం లేని గురువులు వట్ఠి బరువులు మాత్రమే. "విద్య, వివేకం, వైరాగ్యం, చరిత్ర శుద్ధి" ఇవి గురుస్థానానికి ఒప్పిన యోగ్యతలు. వట్టి శాస్త్రజ్ఞానంతో భుక్తి మాత్రం లభిస్తుంది గాని ముక్తి లభించదు. అనుభవాన్ని పొందక, శాస్త్రాలను చదివి శుష్కజ్ఞానాన్ని యితరులకు బోధించేవాడు "కాశీయాత్ర మార్గదర్శిని" అనే గైడ్ చదివి కాశీనగర సమాచారాలను ఇతరులకు చెప్పేవానితో సమానమైన వాడై వుంటాడు.

వాడు స్వయంగా కాశీనగరం చూసినవాడు కాదు. వానిది కేవలం పుస్తకజ్ఞానం. ఇలాంటి గురువులతో శిష్యులకు ఆత్మశాంతి కలుగదు. గురువులు మరొక రకం వారు వున్నారు. వారికి గురూపదిష్ట పద్ధతి ప్రకారం సాధన చేసి తత్త్వానుభవం పొంది వున్నారు. తమంతకు తాము తరించి వున్నారు. వారు ధన్యులు. అయినా తగిన స్థోమతతో శాస్త్రజ్ఞానం లేదు. కాబట్టి సామాన్య శిష్యుల సందేహాలను తీర్చి వారిని సంతృప్తి పరచి కృతార్థులను చేయలేరు. అందుచేత శాస్త్ర జ్ఞానము, అనుభవ జ్ఞానము ఈ ఉభయ యోగ్యతలు కల్గివున్నవాడే నూటికి నూరుపాళ్ళు గురుపదానికి అర్హుడు.

శ్రీ రామకృష్ణ పరమహంస గారు గురువులను ఉదాహరణలుగా పోల్చి చెప్పారు. "ఒకరు" రాయి వంటివారు, రాయి తను మునిగి పోతుంది. తనను పట్టుకొన్న వాళ్ళ సంగతి చెప్పనక్కరలేదు. "రెండోవారు" ఆకు లాంటివారు. ఆకు తాను మాత్రం తేలుతుంది. ఇంకోదాన్ని తేల్చదు.

"మూడోరకం" వారు పడవ లాంటివారు పడవ తాను తేలుతుంది, తనను ఆశ్రయించిన వారిని కూడా తరింపజేస్తుంది. కాబట్టే వడగట్టి నీళ్ళు త్రాగు, గుర్తించి గురువును చేసుకో అని కబీరు అన్నాడు.

పరబ్రహ్మ స్వరూపుడు అర్జునుని సంశయాలన్నీ తెంచుతూ దివ్య జ్ఞాన బోధలను కుండపోతగ వర్షిస్తున్నాడు అనుభవించువారు అదృష్టవంతులు.

గురువు శ్రోత్రియుడు మరియు బ్రహ్మనిష్ఠుడూ కావలె. గురువులు విత్తాపహారకులు కారాదు. హృత్తాపహారకులు కావాలి. దీనినే గురుగీత ఇలా చెప్పింది. "గురువో బహవస్సంతి శిష్యవిత్తాపహారకా: గురవో విరళాస్సన్తి శిష్యహృత్తాప హారకా:" అంటూ లోభి గురువు. సోమరి శిష్యుడు గ్యారంటీగా నరకంలో వుంటారని తులసీదాసుగారన్నారు. అర్జునా! పరమగోప్యమయిన జ్ఞానాన్ని యింతవరకు బోధించాను. నాయనా! "యధేచ్ఛసి తథాకురు" బాగా ఆలోచించి నీకు నచ్చినట్లు నడు, అంటూ గీతోపదేశాన్ని ముగిస్తూ గీతాచార్యుడు చెప్పిన మాట చెప్పవలసిన మాటలు చెప్పిన గురువు శిష్యుని భావ స్వాతంత్ర్యానికి వ్యక్తి స్వాతంత్ర్యానికి అవకాశమిచ్చాడు. నిజానికి వేదాంతం బలవంత మాఘస్నానము కాదు. నిర్బంధ బ్రాహ్మణార్థము కాదు. ఆహా! గురువెంత ఉదారుడు.

ఇదిగో నేను చెప్పిందే అక్షరాలా వేదం. నీకు నచ్చినా నచ్చకున్నా వినే తీరాలి. ఆ – ఊ అన్నావా గురుధిక్కారానికి గురి అవుతావు. గురుద్రోహానికి శాపనార్థాలే గతి. గురుశాపాన్ని హరిహరాదులు కాదనలేరు. గురుపుత్రుడవైన తర్వాత, గురుపాదం పట్టిన తరువాత, గురువు ఎదుట పాలుత్రాగి ప్రమాణం చేసిన తరువాత, నీ తను, ధన మనస్సులు నీవికావు. అవి గురుసొత్తు. విన్నావా! ఖబడ్దార్ అని శిష్యులపై సుగ్రీవాజ్ఞలు

చెలాయించే యీనాటి గురువు లెక్కడ, ఇట్టి గురువులు బరువులు కాక మరేమిటి. పోనీ శిష్యుడు తక్కువవాడా? మొదట్లో ప్రజ్ఞావాదాలను చేటలతో చెరిగిన పెద్ద మనిషి. తీరా శ్రీకృష్ణుడు " నీ ఇష్టం వచ్చినట్లు చేసుకొమ్మని పల్కగానే తాను " కరిష్యే వచనం తవ" నీవు చెప్పినట్లు చేస్తాను అంటాడు. కాసు ఖర్చు కాకుండా కైవల్యము ఒడిలో ఊడిపడాలని డంబానికి గురుపుత్రులమనే ఈనాటి కపట శిష్యులెక్కడ. చేసేదంతా దేహార్పణం, కళాత్రార్పణం, పుత్రార్పణం చేస్తూ ఉపచారానికి కృష్ణార్పణం – గురువార్పణం అని జొల్లుమాటలు పలికే ఈ ఆషాఢ భూతులెక్కడ. గురువాజ్ఞను తాము పాలించుట కాదుకదా! ఇంగితజ్ఞుడై గురువు తమ ఆజ్ఞలను పాలించాలని, వారి ధూర్తభావన, గురువుకు తాము శిష్యులై ఉండాలను కొన్నారో లేక గురువును తమ శిష్యునిగా చేసుకోవాలనే వీరి ఆంతర్యం తమ కామ, కాంచన విలాసాలకు ఆంక్ష లేకుండా ఒళ్ళు సలియ కుండా డబ్బు సెలవుగాకుండా అంతమట్టుకే తన అధికారాన్ని వర్తింపచేయాలి. తప్పిందా! మరుక్షణమే విశ్వాసరాహిత్య తీర్మానం సిద్ధం. లేదా తెగతెంపు రాజీనామా గురువుల కర్మం కాలనూ! ఆ శిష్యుల పడిపంచలనేపడి మిడకే దౌర్భాగ్యం ఎందుకు దాపరించిందో.

పూర్వకాలంలో శిష్యులు గురువులను పోషించేవారు. తెచ్చిన భిక్షాన్నాన్ని గురువుకు నివేదించి, వారు తినగా మిగిలినది తిని తాము జీవించేవారు. కాలం మార్పు కావచ్చు. ఈనాడు గురువుగారు శిష్యులను పోషించాలి. శ్రీవారు సంపాదించిన వస్త్రవాహనాలను పండుఫలాలను అనుభవించే కోసం. దండగమారి ఋణపాతకపు శిష్యులు. భగవద్గీతలోని శిష్యులు ఆదర్శ శిష్యులు. గురువులు నరోత్తముడైన నరుడు. పురుషోత్తముడైన ప్రభువు, మహాత్ముడైన నరుడు, పరమాత్ముడైన కృష్ణుడు వహవ్వా! " నభూతో నభవిష్యతి" ధనుర్ధరుడైన

శిష్యుని యొక్క యోగీశ్వరుండయిన గురుని యొక్క పొందికతో గీతోపదేశం ధన్యధన్యమై పోయింది. అహల్య శిలవంటి శిల రామపాదం వంటి పాదంతో సంయోగమైనప్పుడు విశేష చైతన్యం సంభవిస్తుంది. గురుశిష్యుల యోగ్యత కూడా అట్టిదై వుండాలి. “దేహం తాననుకొనుట, జగత్తు నిజమనుకొనుట, దేవుడు ఎక్కడో వున్నాడనుకొనుట” ఇవే అజ్ఞాన కార్యాలు. వ్యామోహ విలాసాలు. ఈ అజ్ఞానం జ్ఞానంతో నివర్తించును.

పరమాత్మ స్వరూపాన్ని సంశయ విపర్యయ రహితముగా సాక్షాత్కారం చేసికొనుట జ్ఞానం యొక్క ముఖ్య ప్రయోజనం. సూర్యోదయంతో చీకటి నశించినట్లు జ్ఞానంతో సంశయాలు నివర్తిస్తాయి. నేనెవరు? జగత్తంటే ఏమిటి? దీనికి కర్త ఎవరు? బంధమంటే ఏమిటి? మోక్షమంటే ఏమిటి? అనే తత్త్వ విషయక సంశయాలన్నీ పలాయనం చిత్తగిస్తాయి. శరీరం నేననుకొనే అహంకారమూ, శరీర సంబంధ వస్తువులు తనవనుకొనే మమకారమూ, జననమరణాలు ఆత్మ యందు ఆరోపించుకోవటమూ, సుఖ దు:ఖాలకు తాను భోక్తనని తలంచడమూ తద్వారా కలిగే రాగద్వేషాలకు, శోక మోహాలకు గురి కావడమూ ఈ పరంపర మొత్తము మోహ సంసార వికారాలు.

ఆత్మజ్ఞానమనే సూర్యోదయంతో ఈ అంధకారమంతా విచ్ఛిన్నమైపోతుంది. భీష్మద్రోణాదులు తన వారనే మోహం, వారిని చంపాల్సి వచ్చెనే అనే శోకం అర్జునుని ఆవహించాయి. ఈ శోకమోహ నివృత్తికి ఆత్మజ్ఞానమే మహా ఔషధం. జ్ఞాన సూర్యుడు ఒక్కసారి ఉదయించాడా ఇక అస్తమించడమంటూ లేదు. మోహాంధకార, పునర్దర్శనానికి ఆస్కారమే లేదు. వాస్తవానికి తనకంటే భిన్నంగా వాటికి ఉనికే లేదని గుర్తిస్తాడు. అట్లే ! జ్ఞాని సమస్త చరాచర జగత్తుకు తన సత్తా కంటే భిన్నమైన సత్తాలేదని, కేవల స్ఫురణమాత్రాలని తెలిసి సమస్తాన్ని

తన యందే చూడగలుగుతాడు. సర్వాత్మ భావ సంపన్నుడై వుంటాడని అర్థం. ఈ జ్ఞానాన్ని పొందిన మనుష్యుడు శోకమోహాల నుండి పూర్ణ విముక్తు డౌతాడు. పాపాత్ముడు జ్ఞానాన్ని పొందలేడనే విషయం భగవంతునికి తెలియదా? తెలుసు. పాపి, పాపిగానే వుండి జ్ఞానాన్ని పొందలేడు. పక్షాంతరంలో వాడుకూడా యేజన్మ సౌభాగ్యంతోనో గతంలోని పాపాలకు పశ్చాత్తాపం చెంది భగవదనుగ్రహమో మరి ఏ మహాపురుషుల వరప్రసాద మహిమో యెట్లో జ్ఞానానికి పాత్రుడైనాడా నిన్నటి వరకు వాడెంత పాపిగా వున్నా ఫరవాలేదు. తరించిపోతాడు. ఈ విషయంలో దృష్టాంతంగా వాల్మీకి చరిత్రను చెబుతుంటారు కదా! సమస్త పాపాలకు మూలకందమైన దేహాత్మ బుద్ధి నశించిందంటే పాప సంబంధ గ్రంధి స్వయంగా విచ్ఛిన్నమైపోతుంది.

అర్జునా! ఆత్మ జ్ఞానానికి సమానంగా పవిత్రమైన వస్తువు లోకంలో గాని, శాస్త్రంలోగానీ, ఎక్కడా లేదు. తక్కిన సాధనలతో, సాధనాలతో కొంత కొంత సిద్ధి. జ్ఞానంతో పూర్ణసిద్ధి విషయాసక్తులకు కర్మలు రుచిస్తాయి. వివేకాసక్తులకు జ్ఞానము రుచిస్తుంది. జ్ఞానంతో తప్ప కర్మోపాసనలతో అజ్ఞానం తొలగదు. అజ్ఞానమనేది, దేహాత్మబుద్ధి అనేది అన్ని దోషాలకు, అన్ని పాపాలకు అది మూలమై వుంది. కర్మతో, ఉపాసనలతో, ప్రాయశ్చిత్తాదులతో పాపాలు తాత్కాలికంగా పైపైన తొలగినప్పటికి అజ్ఞానమున్నంతవరకు వాటికి మళ్ళీ పాదుర్భావం తప్పదు. ఆత్మజ్ఞానంతో అజ్ఞాన నివృత్తి జరిగిందా సమస్త పాపాలు సమూలంగా నశించి పోతాయి.

ధనంజయా! శ్రద్ధావంతుడే జ్ఞానప్రాప్తికి అర్హుడు. గురువు లందు శ్రద్ధ. శాస్త్రాలలో శ్రద్ధ, జ్ఞానం సంపాదించాలని శ్రద్ద అన్నింటికి మించి తన సామర్థ్యం మీద తనకు శ్రద్ధ వుండాలి. శ్రద్ధ లేకపోతే ఏమీ దొరకదు. శ్రద్ధ

వున్న చోట సిద్ధి వుంది. శమ, దమ ఉపరతి, తితీక్ష సమాధానాలనే ఆస్తిని భద్రపరచే బీరువా సుమా! శ్రద్ధ అంటే. అయితే శ్రద్ధ ఒక్కటే వుంటే చాలదు. దానికి తోడు తత్పరత్వం కూడా వుండాలి. ఉపదేశించే విషయాన్ని తెలుసుకోవాలనే ఆసక్తినే తత్పరత్వం అంటారు. తత్పరత్వం కలసిరానప్పుడు వట్టి శ్రద్ధ జడమై పోతుంది. అజ్ఞుని కంటే అశ్రద్ధావంతుని కంటే సంశయాత్మునికి కలిగే అనర్థం దొడ్డది. సంశయం మనస్సుకు పట్టిన క్షయరోగం లాంటిదంటారు. బ్రహ్మాండంలో చంద్రునికి క్షయరోగం వుందంటారు. పిండాండంలో మనస్సే చంద్రుడు. సంశయమే దానికి క్షయరోగం. సంశయగ్రస్తునికి అడుగడుగునా ఆపదలే తగుల్తాయి. వానికి ఇహలోక సుఖం కూడా లేదు.

బ్రతుకు బ్రతుకుగా బాగా సుఖించే భాగ్యరేఖ వాని నొసట లేదు. వానికి ఇరుగులో పొరుగులో సంశయం. ఇంట్లో బయటా సంశయం. ఆలు బిడ్డల మీద, ఆప్తమిత్రులమీద కూడా సంశయమే? అవన్నీ ఏల? సంశయాత్ముడు తనను తాను నమ్మడు. తన చేతిని, తన కంటిని, తన జేబును కూడా నమ్మడేమో? తన శ్వాసపై కూడా విశ్వాసం ఉండదు. ఒక మనిషి వున్నాడు. వానికి ఒళ్ళంతా సంశయం. అతి తెలివి అనర్థం అంటారు కదూ? వాడు ఒకరోజు ఇలా అనుకున్నాడట "ఈ శ్వాస బయటికి పోతుంది. లోపలికి వస్తుంది. దీనిని మాత్రం ఎలా నమ్మడం బయటికి పోయినది తిరిగి లోపలికి రాకపోతే" ఎలా అని ఊపిరి గట్టిగా బిగపట్టినాడు. పది కాలాల పాటు బ్రతికే మనిషి "హరీ" మన్నాడు. కావున విశ్వాసం లేకపోతే నీ శ్వాస కూడా నడవదు.

శ్రీకృష్ణపరమాత్మ అర్జునుని ముందు వుంచుకొని యావత్ ప్రపంచానికే దివ్యజ్ఞానాన్ని బోధించాలనే సంకల్పంతో తెలుపుచున్నాడు. ముందుగా తీవ్రమైన విషాదం ప్రతి మానవునికీ అవసరం. ఆ విషాద వైరాగ్యం లేనివారికి ఈ జ్ఞానం బోధపడదు. అని తెలుపుటకై అర్జునుని విషాదాన్ని అంతావిని "సాంఖ్యయోగం" బోధించాడు. మానవుడు తరించుటకు ఈ సాంఖ్యయోగం ఒక్కటే చాలు. అయినా కోటానుకోట్ల మానవుల మనస్తత్వాలకు ఇది రుచించనిచో "కర్మయోగం" లో తరించవచ్చని కర్మయోగాన్ని బోధించాడు. ఆ సుకర్మ వల్ల తరించని వారి కొరకు సర్వశ్రేష్ఠమైన "జ్ఞానయోగం" బోధించాడు. అందులో సిద్ధి పొందలేని వారిని దృష్టిలో పెట్టుకొని ప్రస్తుతం "కర్మ సన్యాస యోగం" బోధించుతున్నాడు.



# శ్రీ భగవద్గీత
# పంచమాధ్యాయము
# కర్మ సన్యాస యోగము

ఏ కోవకు చెందిన వారికి ఏది కావాలో దానిని పాటించి అందరూ తరించాలని ఆచార్యుని ఆకాంక్ష. మనమిప్పుడు "కర్మ సన్యాస యోగము" లోనికి అడుగిడుతున్నాము. కర్మలు చేస్తూనే కర్మలకు అంటకుండా ఉండే పరమ రహస్యాన్ని బోధిస్తున్నాడు గీతాచార్యుడు. ఈ కర్మసన్యాసం అనే క్రొత్త ప్రయోగం భగవద్గీత కంటే ముందు ఏ వేదాంత గ్రంథాలలో లేదు. అటువంటి పరమ రహస్యమైన కర్మ రహస్య మేమిటో మనం తెలుసుకొని ఆనందించి అనుభవిద్దాము. గాంధీగారి జీవితకాలంలో ఒక సంఘటన జరిగింది.

విదేశం నుండి ఒక క్రైస్తవ మత బోధకుడు ఇండియా వచ్చాడు. గాంధీ గారిని కలుసుకున్నాడు. ఆ సమయానికి గాంధీ గారి ప్రక్కన భగవద్గీత వుంది. బైబిలూ వుంది. భగవద్గీత, దాని పైన బైబిలు ఒకదానిపై ఒకటి వున్నాయి. అతడు గాంధీజీతో అయ్యా! మీ భగవద్గీత పైన మా బైబిలు వుందే? అన్నాడు. వెంటనే గాంధీగారు తడుముకోకుండా "మిత్రమా! మా భగవద్గీత ఆధారంతో మీ బైబిలు వుంది" అని ఠపీమని చెప్పారు. ఇది ఛలోక్తి మాత్రమే కాదు. సత్యసారం కూడా. ఇతర మతాలు చెప్పే సదాచార జీవనానికి, భగవద్గీత చెప్పే సర్వాత్మ భావము ఆధారమై వుంది. ఈ ఐదవ ఆధ్యాయం విచారించి చూస్తే ఇదొక్క స్వతంత్రమైన ఆధ్యాయం కాదు. మూడవ ఆధ్యాయం పూర్వార్థమైతే ఇది ఉత్తరార్థమని చెప్పవచ్చు. కర్మలను ఆచరిస్తూ,

ఆచరిస్తూ దాని పరమావధియైన సన్యాసాన్ని చేరగల్గే ప్రక్రియ ఇందులో చెప్పబడింది. చెప్పబడుతుంది. యోగ మాతిష్ఠోత్తిష్ట భారత! "అర్జునా లే! లే! కర్మయోగాన్ని ఆచరించు" అంటూ మళ్ళీ ఉపదేశించాడు. ఆ రెంటిలో తానేది గ్రహించాలో యెరుగక సందిగ్ధంలో పడిన అర్జునుడు భగవంతుని ప్రశ్నిస్తున్నాడు. "భక్తుల యొక్క పాపాలనే కృశింపజేసెడి ఓ కృష్ణా! సదానంద రూపుడవైన ఓ పరమాత్మా ఒకసారి సన్యాసమును గురించి పొగడుచుంటివి. మరోసారి కర్మయోగాన్ని గురించి ప్రశంసిస్తావు. ఇంత వరకు బోధించిన నాలుగో ఆధ్యాయంలో "కర్మణ్య - కర్మయ: పశ్యేత్" అని "జ్ఞానాగ్ని దగ్ధ కర్మాణి" అని "శారీరం కేవలం కర్మ" అని " సర్వ కర్మాఖిలంపార్ధ" అని, " యోగ సన్యస్త కర్మణాం" అని కర్మసన్యాసాన్ని గురించి భూరి భూరి ప్రశంసలు చేశావు. మళ్ళీ "కురు కర్మైవ తస్మాత్త్వం" అని "యోగ మాతిష్ఠోత్తిష్ఠ భారత" అని కంఠం మార్చి కర్మయోగాన్ని బోధిస్తావు.

అయ్యా నేను ఏ దారిలో పోవాలో, ఏది మోక్షాన్ని ప్రసాదిస్తుందో తేల్చి చెప్పుము. నాకు కావాలసింది శ్రేయస్సు కాని, ప్రేయస్సు కాదు సుమా! ఈ విషయం నీకు మూడవసారిగా మనవి చేస్తున్నాను. మరీ యిప్పుడు కూడా ముమ్మాటికీ శ్రేయస్సునే అపేక్షిస్తున్నాను. నీ అంతటి వానిని చేరి శ్రేయస్సును కోరక ప్రేయస్సును కోరటం కల్పవృక్షం దగ్గరకు వెళ్ళి కాఫీ కావాలన్నట్లు వుంటుంది". (కాఫీ అనేది మన భాష)

స్వామీ! కర్మ సన్యాసము కర్మయోగము రెంటినీ ఒక్కడు ఆచరించే వీలు లేదు కదా! స్థితిగతుల లాగా అవి పరస్పర విరుద్ధాలు. నడుస్తున్నాడంటే నిలబడలేదని అర్థం. నిలబడి నాడంటే నడవలేదని అర్థం. నడుస్తూనూ ఉన్నాడు, నిలబడీ వున్నాడనే మాట ఒక్కని యందు ఎలా పొసగదో, అలాగే కర్మ సన్యాసము, కర్మయోగము ఒక్కనిలో పొసగే వీలులేదు. ఏ ఒక్కటైనా

సరే - మంచిదే నంటావా? స్వామీ! ఈ గొడవ ఎందుకు కర్మ యోగాని కంటే కర్మ సన్యాసము నాకు సుఖం కాదా! దానినే నేను అనుసరిస్తాను. నాకు శ్రేయస్సును కలిగించే మాట ఏదో ఒకటి చెప్పండి. నాకు మోక్షాన్ని ప్రసాదించే మార్గం చూపండి.

"కర్మలను చేయాలి - వదలాలి" అని చెప్పే మాటలు కర్తృత్వ బుద్ధి కలవారిని ఉద్దేశించి చెప్పిన మాటలు. జ్ఞానుల దృష్టిలో కర్మ కూడా అకర్మే. కలలో రాజైన వాడు మేల్కొనిన రాజు కాడు కదా! ఈ విధంగా చూసినపుడు సర్వ కర్మ సన్యాసమనేమాట ఒక ఆత్మ జ్ఞానానికి మాత్రమే పూర్ణంగా చెల్లుతుంది. తక్కిన వారెవరైనా యేదో ఒక కర్మను చేస్తూనే ఉన్నారు. భగవానుడు ఇలా చెప్పుచున్నారు.

"అర్జునా! నా మాట విను. నేను చెప్పేది కర్మల సన్యాసము కాదు. కర్మలలో సన్యాసం నాకు ఇష్టము. కర్మ త్యాగం కాదు. కర్మలలో త్యాగం. అసలు కర్మలే చేయని వాడు వదిలేదేముంది. ఉన్న వానికి త్యాగం కాని, లేనివానికి త్యాగమేముంది. వీర్యవంతునికి బ్రహ్మచర్యంకాని, నపుంసకుడికి బ్రహ్మ చర్యమేముంది. కర్మలను చేస్తూ కర్మలలో ఫలాలను త్యాగం చేయుట గొప్పం కాని కర్మలనే చేయనివాడు త్యాగం చేసేది ఏముంది. సన్యాసాశ్రమంలో నివృత్తి మార్గాన వుండి ధ్యాన యోగాదులను శ్రవణ మననాదులను చేసుకొనే శక్తి అందరికి వుండదు. ఆశక్తి లేనివారు కర్మలను సన్యసిస్తే ఉట్టికి, స్వర్గానికి కాక ఉభయ భ్రష్టులౌతారు. కర్మయోగ మార్గము నిరపాయమైనది. ఏ కొంచెం చేసినా మహాభయం నుండి అది రక్షిస్తుంది. కర్మయోగి ఇంద్రియాలతో కర్మల నాచరిస్తూ క్రమ పరిపాకంలో చిత్తశుద్ధిని బొంది ఆత్మనిష్ఠను సంపాదించి కృతకృత్యుడౌతాడు. కిరీటీ! నీవూ ఆ కర్మయోగాన్ని అవలంబించు. కృతకృత్యుడైన ఆత్మజ్ఞానానికి కర్మ సన్యాసంతో కాని, కర్మ యోగంతో కాని

ఒరిగేది తరిగేది ఏమీ లేదు. వానిపట్ల రెండూ ఒకటే. కాని ఆత్మ జ్ఞానాన్ని పొందక దానిని పొందగోరే జిజ్ఞాసువునకు కర్మ సన్యాసం కంటే కర్మయోగం శ్రేయోదాయకమైనది. కర్మ సన్యాసికి వుండే పతన భయం కర్మయోగికి లేదు. ఈ దృష్టిననుసరించి భగవంతుడు "కర్మ సన్యాసానికంటే కర్మయోగం శ్రేష్ఠమంటూ ప్రశంసించాడు."

అర్జునా! పనులు మానుకొంటే సన్యాస మను కొన్నావా? నేనే సన్యాసిని నాకు కర్తవ్యమంటూ ఒకటి లేదు. నేనేమీ చేయనంటూ పనులు, పాటలు వదిలేసిన వానిని సన్యాసియని కొందరు భావిస్తారు. ఒళ్ళు వంచడానికి శ్రమించలేక అజ్ఞానంతో బద్ధకంతో, సోమరితనంతో కర్మలను వదలినవాడు నా దృష్టిలో సన్యాసి ఎప్పుడూ కాదు. నా అభిప్రాయమేమంటావా? విను. పైకివాడు కర్మేంద్రియాలతో కర్మలు చేస్తుండనీ, వుండకపోనీ, ఆ విషయంలో నాకు జోక్యం లేదు. సంన్యాసమంటే కేవలం బైట వేసుకొనే బురఖా కాదు. అది అంతరంగికమైన ఐశ్వర్యం. దు:ఖాన్ని దు:ఖ కారణాలను వాడు ద్వేషించడం లేదు. సుఖాన్ని, సుఖ కారణాలను వాడు కాంక్షించడం లేదు. ప్రారబ్దవశాత్తు కలిగే మంచి చెడ్డలలో వాడు తటస్థుడు. జయాపజయ మానావమాన, లాభనష్ఠ, శీతోష్ణాది, ద్వంద్వాలలో వాడు సమచిత్తం కలవాడు. వాడే నిత్య సన్యాసి. బైట చూసేందుకు గృహస్థాశ్రమంలో వున్నా కర్మలు చేస్తూవుండినా, ఆ సమయంలో కూడా వాడు కర్మసన్యాసే. రాగద్వేషాలు లేనివాడు సంసారి అయినా సన్యాసే. "నివృత్తరాగస్య గృహం తపోవనం" రాగద్వేషాలతో కూడుకొన్న సన్యాసి బాహ్య సన్యాసి, యిళ్ళు, వాకిళ్ళు, భార్య, పుత్రులు లేకున్నా వాడు సంసారే.

ఆసక్తిని త్యజించినవాడు మోక్షం పొందుతాడు. కాని గృహకళత్రాదులను త్యజిస్తే మోక్షం పొందడు. "సంసారికి ఆలుబిడ్డలపై ఆసక్తి, సన్యాసికి దండ

కమండలాలపై ఆసక్తి" పెద్ద రూపం ధరించినా, చిన్నరూపం ధరించినా రాక్షసి రాక్షసే. ఆసక్తే బంధము. అనాసక్తే మోక్షము. "మమ" అంటూ బంధము కలిగింది. " నమమ " అంటూ ముక్తి వచ్చింది. అనాది వాసనా మూలమైన సంసార వృక్షాన్ని అసంగ శస్త్రంతో ఖండించి వేయాలి. వాడే ముక్తుడు. వాడే విముక్తుడు. నిష్కామ కర్మయోగి అనాసక్తుడై కర్మలు చేస్తూ కూడా అనాయాసంగా కర్మల నుండి కర్మ బంధము నుండి విముక్తి సంపాదిస్తాడు. ఈ ఫలప్రాప్తి సాంఖ్యయోగంతో కానీ, కర్మ యోగంతో కానీ యేవిధంగానైనా పొందవచ్చు. సాంఖ్యమని చెప్పబడే సన్యాసానికి కానీ, యోగమని చెప్పబడే కర్మయోగానికి గానీ, పరమావధి ఆత్మజ్ఞాన మూలకమైన మోక్షమే కదా ?

అర్జునుడు అడిగిన ప్రశ్న సన్యాసమును గురించి కర్మను గురించి, ఇక్కడ శ్రీకృష్ణుడు సాంఖ్యమును, యోగమును గురించి ప్రస్తావిస్తున్నాడు. ఎందుకీ వ్యత్యాసం. వ్యత్యాసమేమీ లేదు. భగవంతుడు అర్జునుని మాటకు మెరుగు పెట్టి " జ్ఞాన సహితమైన సన్యాసాన్ని సాంఖ్యమంటూ, సమత్వ బుద్ధి ఈశ్వరార్పణలతో కూడిన కర్మను యోగమంటూ" చెప్పుచున్నాడు. స్వామీ! పురుషోత్తమా ! కర్మ సన్యాసం జ్ఞాన నిష్ఠకు హేతువై వుంది కదా ! ముముక్షువులు అవశ్యంగా దానిని అనుసరించాలి కదా! ఆ సందర్భంలో అంత: కరణశుద్ధి కలవాడు మాత్రమే కర్మ సన్యాసాన్ని అనుసరించాలనే నియమమెందుకు? అంత: కరణ శుద్ధి లేనివాడు కర్మ సన్యాసాన్ని ఎందుకు అవలంబించరాదు? అని అర్జునుని శంక. దానికి సమాధానంగా అర్జునునికి భగవంతుడు చెబుతున్నాడు.

పరాక్రమశాలీ ! పాండు కుమారా ! కర్మ సన్యాసానికి కాని కర్మయోగానికి కానీ, జ్ఞాన నిష్ఠాపూర్వకమైన పారమార్థిక సన్యాసమే పరమ గమ్యమౌతుంది. కానీ కర్మయోగాన్ని ఆచరించక ఆ స్థితిని బొందుట కష్టదాయకమై వుంటుంది.

చిత్తశుద్ధి కారకాలైన నిత్య నైమిత్తిక యజ్ఞ దానాది సత్కర్మలను హఠంతో వదలిన సన్యాసి కష్టాలపాలౌతాడు. చిత్తశుద్ధి కల్గకముందే కర్మలను సన్యసిస్తే జ్ఞాన ఫలం లభించదు.

సరికదా ! మళ్ళీ కర్మలలో ప్రవేశించి జ్ఞానాధికారం కూడా కోల్పోయాడు. వాడు ఉభయ భ్రష్టుడైనాడు. లోపల శాంతి లేని బయటి సన్యాసంతో లాభమేముంది. లోపలా బయటా సన్యాసి యగుటే పురుషార్థానికి ఫలం. కర్మయోగాన్ని ఆచరించక జ్ఞానం పొందాలనుకోవడం పునాది కట్టకనే ఇల్లు నిర్మించాలనుకోవడం అవుతుంది. చిత్తశుద్ధి లేనివాడు బాహ్యకర్మలను సన్యసించి యేకాంతంలో వున్నా ఆత్మ చింతనానికి తగిన ఏకాగ్రత వానికి లేదు. అట్టివాడే కర్మ సన్యాసం జోలికిపోక, చిత్తశుద్ధిని కలిగించే కర్మయోగంలో ప్రవర్తించుటే మంచిది. కర్మయోగి "ముని" అనగా మనన శీలుడు అని అర్థము. కర్మయోగం ద్వారా అంత:కరణ శుద్ధిని బొందినవాడు మునియైనాడు. తాను బైట కర్మ చేస్తూ కూడా తన ఆత్మయే అయిన పరమాత్మను వాడు మననం చేస్తూ వుంటాడు.

అర్జునా! కర్మలు సహజంగా బంధదాయకాలు కదా! " కర్మణాబధ్యతే జంతు:" అంటూ శాస్త్రం చెప్పనే చెప్పింది. అలాంటప్పుడు కర్మల నాచరిస్తూ కర్మయోగి యే ప్రభావంతో కర్మబంధాలకు అతీతుడౌతాడంటూ శంకిస్తావేమో? విను. చేతికి నూనెను రాసుకొని పనస పండును ఒలిస్తే ఆ పాలజిడ్డు చేతికి అంటుకోదు. పాత్రకు కళాయి పోయిస్తే ఏ పదార్థం పెట్టినా పాత్రదోషం పదార్థానికి అంటుకోదు. ఆ విధంగానే కర్మయోగి సర్వాత్మజ్ఞానసిద్ధిని బొంది ఆ జ్ఞాన ప్రభావంతో కర్మలు చేస్తూ కర్మలను అంటుకోడు.

ఫలాపేక్ష లేక కర్తవ్య దృష్టితో ఈశ్వరార్పణ బుద్ధితో చేసే కర్మ కర్మ యోగమనబడుతుంది. అట్టి కర్మ యోగాన్ని ఆచరిస్తున్నాడు కాబట్టి వాడు " కర్మయోగి " యన బడినాడు. విశుద్ధాత్ముడై మనోదండాన్ని విజితాత్ముడై దేహ దండాన్ని, జితేంద్రియుడై వాగ్ధండాన్ని సాధించి " త్రిదండి " అయ్యాడు. సన్యాసి దండాన్ని ధరించడం, అతనిని "త్రిదండి" అనటానికి కారణము అదియే. అర్జునా అంటూ త్రిదండి రహస్యాన్ని కూడా బోధించిన ఆ గీతాచార్యునకు నమస్సుమాంజలులు.

నేను అకర్తను. అభోక్తను, అసంగుణ్ణి, సాక్షిని సూర్యునివలె, దీపమువలె నేను ప్రకాశకుణ్ణే కాని, ప్రవర్తకుణ్ణి కాదు. నేనేమియు చేయుట లేదనే నిశ్చయంలో వున్నాను. అట్టి అకర్తాత్మజ్ఞాన పరివిష్ఠితుడైన వానిని కర్మలు బంధించలేవు.

## ఇద్దరు సన్యాసుల కథ :

ఇద్దరు సన్యాసులు నడచి యెక్కడికో వెళుతున్నారు. మధ్యలో ఒక చిన్న వాగు అడ్డం వచ్చింది. అదీగాక వర్షాకాలం. కొత్తనీరు నడుంబంటి వుంది. ఒక స్త్రీ ఒడ్డున కూర్చొని దీనంగా వుంది. ఒక సన్యాసి అడిగాడు. "ఏమమ్మా! అలా కూర్చున్నావేమి ? అని " నాయనా ! నేను అటువైపు ఒడ్డుకు వెళ్ళాలి. ఈ వాగు దాటలేను. దయవుంచి ఆవలికి చేర్చి పుణ్యం కట్టుకోండి అని ఆమె వేడుకున్నది. ఒక సన్యాసి ఆమెను భుజంపై కూర్చొనపెట్టుకొని ఆవలి గట్టున దించాడు. ఎవరిదారి వారు పట్టారు. ప్రక్క సన్యాసి ఒకటే గోకడం ప్రారంభించాడు. " నీవు సన్యాసివి స్త్రీని అసలే తాకరాదు. భుజాన పెట్టుకొని మోశావే " రెండు రోజులయినా ఆయన తన పోటు వదలలేదు. " అయ్యా నేను రెండు నిమిషాలు మోసి వదలి వేశాను. నీవు రెండు రోజుల నుండి

యింకా మోస్తూనే వున్నావే? అని అన్నాడు కర్మ సన్యాసం కాదు ముఖ్యం, భావ సన్యాసం ముఖ్యం. భావంలో కర్తృత్వ బుద్ధి వుండి బయటకి కర్మలను వదలిన వాణ్ణి గీత "మిథ్యాచారి" అని పేర్కొంది. అర్జునా! సర్వకర్త భగవంతుడు. నేను నిమిత్త మాత్రము. ఆయన సూత్రధారి. నేను పాత్రధారిని. "పనీ ఆయనదే ఫలమూ ఆయనదే " అంటూ బరువు భారాలను భగవంతునిపై వేసి కర్తవ్య సంగాన్ని ఫలసంగాన్ని వదలి యెవడు కర్మల నాచరిస్తూ వుంటాడో వాడు తామరాకు నీళ్ళ నంటనట్లు పాపపుణ్య రూపమైన కర్మబంధానికి వశం కాడు.

"జగన్నాటకానికి భగవంతుడు సూత్రధారి, తాను పాత్రధారి " అని కర్మయోగి లౌకిక వైదిక కర్మలను చేస్తూ కూడా నిర్లిప్తుడైవుంటాడు. తామరాకు నీళ్ళలోనే పుడుతుంది. పెరుగుతుంది. అయినా నీటిని అంటుకోదు కాబట్టే భగవంతుడు కర్మయోగికి పద్మపత్రాన్ని దృష్టాంతంగా ఇచ్చాడు. పద్మము వైదిక సంస్కృతికి పూజ్య ప్రతీకము. బ్రహ్మదేవుని కంటే ముందే పుట్టిందని పురాణాలంటాయి. నిర్మలత్వము, నిర్లేపత్వము, సౌందర్యము దాని సహజ లక్షణాలు. అవి భగవంతుని లక్షణాలే. కాబట్టే భగవంతుని అవయవాలను పద్మానికి పోలుస్తాము. భక్తుడు కానీ ఆత్మయోగి కానీ దానిని ఆదర్శంగా పెట్టుకోవాలి. పద్మము నీళ్ళలో వుండి నీళ్ళను అంటనట్లు కర్మలు చేస్తూ కర్మ ఫలితాలైన పాప పుణ్యాలకు అతీతుడు కావాలి. ఫల్గుణా ! ఈశ్వరార్పణ బుద్ధితో కర్మలు నాచరించే కర్మయోగి కర్మఫలాన్ని త్యజించడంతో మోక్షమనే పరమశాంతిని పొందుతాడు. ఈ నైష్ఠిక శాంతియే కర్మ యోగానికి ఫలితము. చిన్న ఫలితాన్ని త్యాగం చేసి పెద్ద ఫలితాన్ని అనుభవిస్తాడు. ఈ కర్మయోగి కర్మయోగాన్ని ఆచరిస్తూ క్రమంగా చిత్తశుద్ధితో పరోక్ష జ్ఞానమూ, సర్వకర్మ సంన్యాసరూప జ్ఞాన నిష్ఠ, తద్వారా మోక్షరూప శాంతిని ప్రాప్తిస్తాడు. కర్మయోగి

కానివాడు, స్వర్గాది ఫలకాంక్షతో పని చేసే పామరుడూ పున: పున: సంసార చక్రంలో పరిభ్రమిస్తుంటారు. నిష్కామకర్మకు, సకామ కర్మకుండే వ్యత్యాసమిదే సుమా! కాబట్టి నీవు నిష్కామ కర్మయోగాన్ని అవలంబించి ధన్యుడివికా!

అర్జునా! పారమార్థిక సర్వకర్మ సన్యాసియై శాంతిని బొందిన మహనీయుని ఆంతరంగిక పరిస్థితిని గురించి కొంత వివరిస్తాను. కాస్తవిను. యాత్రికుడు ధర్మశాలలో బస చేసినప్పుడు దాని హాని వృద్ధులకు సంబంధపడనట్లు, అద్దె యింటిలో కాపురము చేయువాడు ఆ ఇంటి యందు అభిమానము లేక కాపురమున్నట్లు, జ్ఞాని దేహసంబంధమైన అహంకార మమకారాలు లేక దేహియై ప్రారబ్ధావసాన పర్యంతం దేహంలో నివసిస్తాడు. ఆత్మతో జరుగకపోతే మరి యీ కార్యాలు యెవరి ద్వారా జరుగుతున్నాయండీ అంటావా? అర్జునా! స్వభావమని చెప్పబడే ప్రకృతి ద్వారానే జరుపబడుతున్నాయి. ఆ ప్రకృతినే వేదాంతులు మాయ, అని అజ్ఞానము అని అంటారు. దానిదే కర్తృత్వము. దానిదే కారకత్వము. దాని నాటకమే ఇదంతా. సూర్యుడు మనకందరకూ ప్రకాశకుడే గాని, ప్రవర్తకుడు కాదు. సూర్యుడు తనకు తానే ప్రకాశిస్తుంటే కొన్ని పుష్పాలు వికసిస్తాయి. కొన్ని పుష్పాలు ముకుళిస్తాయి. ఆ పనులకు సూర్యుడు కర్తా కాదు. కారయితా కాదు. వాటి వాటి స్వభావం ఆయా కర్మలను చేయించింది. అట్లే చిదాత్మ సూర్యుని యందు కూడా ప్రకాశకత్వ లక్షణం తప్ప ప్రవర్తకత్వాది ధర్మాలు లేవు. భగవంతుడు నాకీగతి కల్పించాడంటూ మానవుడు యేడ్వవలసిన పని లేదు. కర్మ చేసి కర్మఫలాలను అనుభవించే స్వాతంత్ర్యం తనకు వుందని తెలిసికోవలె. తనకు కావలసిన కర్మలను చేసి తనకు కావలసిన సంస్కారాలను యేర్పరచుకొని, తనకు కావలసిన గతిని ఏర్పరచుకొని తనకు కావలసిన గతిని నిర్మించుకొనే అవకాశం తనకు

వుంది. భగవంతుడు వాని వాని ప్రకృతికే స్వాతంత్ర్య మిచ్చాడు కదా !

ప్రియ సఖుడవైన అర్జునా! కర్మోపాసనలు చేసి చిత్తశుద్ధిని సాధించి శ్రవణ మననాది సాధనలతో కూడా భగవదనుగ్రహానికి పాత్రుడైన ముముక్షువునకు "అహం బ్రహ్మోస్మి" అనే మహావాక్య ప్రమాణంతో కల్గిన వృత్తిజ్ఞానం ద్వారా ఆవరణ విక్షేపాత్మకమైన అజ్ఞానం నశిస్తుంది. ఆ ఆత్మజ్ఞానము సూర్యుడిలాగా యితర సహాయాన్ని ఆపేక్షింపక కార్యసహితమైన అజ్ఞానాన్ని దూరం చేసి పరబ్రహ్మాన్ని ప్రకాశింపజేస్తుంది. సూర్యుడు అంధకారాన్ని నశింప జేసి సమస్త వస్తువులను ప్రకాశింప జేసినట్లు ఆత్మజ్ఞానం అజ్ఞానాన్ని నశింపజేసి జ్ఞేయ వస్తువైన పరమాత్మ తత్త్వాన్ని ప్రకాశింప జేస్తుంది. బ్రహ్మ సాక్షాత్కారము లభిస్తుందని అర్థము. భగవద్గీత దృష్టిలో పండితులనగా ఎవరు? సర్వత్రా బ్రహ్మదృష్టి కలిగిన బ్రహ్మ జ్ఞానులే పండితులు. తర్కవ్యాకరణాలలో శిరోమణి ఆచార్య బిరుదులు గడిస్తే కాదు. ఎం.ఏ. బి.ఏ., డిగ్రీలు పొందితే కాదు. వీరంతా పొట్టకూటి పండితులు. "చదువులలో మర్మమెల్ల చదివితి తండ్రీ" అని ప్రహ్లాదుడు చెప్పిన రీతిగా "చీమలో బ్రహ్మలో శివకేశవాదులలో" సర్వసమంగా అస్తిభాతి ప్రియరూపమై వుండే పరమాత్మను దర్శించి సమదృష్టి సాధించిన పుణ్యశీలుడే పండితుడు. అర్జునా! విద్యావినయ సంపన్నుడైన బ్రాహ్మణునిలోగానీ, గోవులో గానీ, ఏనుగులోగానీ, కుక్కలోగానీ, బ్రహ్మజ్ఞానులు అయిన పండితులు సమదర్శనం కలిగి వుంటారు. ఈ విషయ ప్రపంచ నామ రూప వస్తువులలో సమంగా వుండే బ్రహ్మాన్ని సందర్శిస్తారు. మాయా అంశాలైన నామరూపాలు విషమంగా వున్నా పరబ్రహ్మము యొక్క అంశాలైన అస్తిభాతి ప్రియాలు సమంగా వున్నాయి.

బ్రహ్మజ్ఞానానికి నామరూపాల వ్యత్యాసం పాటింపునకు రాదు. నామ రూపోపాధులు భిన్న భిన్నాలైనా సర్వత్రా అనుస్యూతమై వున్న ఉపహిత చైతన్యం ఒక్కటే కదా! గలీబులు వేరు వేరు అయినా వాటిలో వున్న దూది ఒక్కటే కదా! అక్షరాలు వేరు వేరు అయినా అక్షరాలకు అధిష్ఠానమైన కాగితం ఒక్కటే కదా. తలకాయల వద్ద వ్యత్యాసం వున్నా కాళ్ళ వద్ద వున్న "లెవలు" అందరిదీ ఒకటే. పైగా నామరూపాలు చూస్తే వ్యత్యాసాలు కనపడినా ఆధారాధిష్టాన దృష్టిని అవలంబిస్తే ఏక సమానవేనంటూ అర్థం. విద్యావినయాలతో కూడుకొన్న బ్రాహ్మణునిలోనూ, ఆత్మ రూపమై ఆ బ్రహ్మవస్తువే వుంది. విద్యా వినయాలు రెండూ బ్రాహ్మణునికి ఒప్పిన గుణాలుగా చెప్పబడ్డాయి. విద్య ఆ తర్వాత వినయం. వినయములేని విద్య విద్య కాదు. అవిద్యే అవుతుంది. విద్యావంతునికి గల నియమ నిగ్రహస్థితినే వినయమన్నారు. వినయము అంటే ప్రశాంతి అని కూడా అర్థము. విద్యకు ప్రశాంతియే ఫలితము. బ్రాహ్మణునిలోని ఆత్మే, గోవులోను, ఏనుగులోనూ, కుక్కలోనూ, ఛండాలుని లోనూ వుండేది అదే ఆత్మ. బ్రాహ్మణుడూ, గోవూ సాత్త్విక పదార్థాలకు ఉపలక్షణము. ఏనుగు రజోగుణోపాధులకు ఉపలక్షణము. కుక్క, ఛండాలుడు తమోగుణ వస్తువులకు ఉపలక్షణము. వీటిని చెప్పుటతో ప్రపంచములోని అన్ని రకాలైన ఉపాధులను గ్రహించినట్లయింది. విద్యావినయ సంపన్నుడైన బ్రాహ్మణుడు ప్రథమంలో చెప్పబడ్డాడు. కుక్కను తిను ఛండాలుడు చివర చెప్పబడ్డాడు. బాహ్యదృష్టిలో ఒకటి అత్యంత పవిత్రం. మరొకటి పరమనీచం. ఏనుగు పెద్ద ప్రాణి, కుక్క చిన్న ప్రాణి. గోవు పూజ్య పశువు. కక్కిన పదార్థమునే తినే కుక్క చండాల జంతువు. ఇంతటి విషమ పదార్థాలలో పండితుడు సమమైన బ్రహ్మాన్ని దర్శిస్తాడు. సూర్యుడు గంగాజలంలో ప్రతిబింబించినా, కల్లు కుండలో ప్రతిబింబించినా ఉపాధుల యొక్క

గుణదోషాలు సూర్యునికి అంటవు. ఆ విధంగా ఈ క్షుద్ర భద్ర అల్ప అధిక ఉత్తమ నీచములైన ఉపాధులలోనూ బ్రహ్మ పదార్థానికి వాటి గుణదోషాలు సంబంధించవు. ఈ చోట మరో అంతరార్థాన్ని కొందరు సూచిస్తారు. నచ్చిన వాళ్ళు ఆ విషయాన్ని గ్రహించవచ్చు. విద్యా వినయ సంపన్నుడయిన బ్రాహ్మణుడంటే బుద్ధి, గోవు అంటే చిత్తము. కుక్క అంటే మనస్సు. ఏనుగు అంటే అహంకారము. శ్వపాకుడని అంటే మనస్సుతో తాదాత్మ్యం కల్గిన జీవుడు. ఈ అన్నిటా ఒకే చైతన్యం పరివ్యాప్తమై వుందని యెరిగి వృత్త్యధిష్ఠాన బ్రహ్మ వస్తువును పండితులు దర్శిస్తారు.

నా ఇంద్రియాలు నాకు అన్నీ సమానమే అయినా, చూచేందుకు చెవులను, వినేందుకు కన్నులను ఉపయోగించడం లేదు కదా! యెడమ చెయ్యి, కుడి చేయి రెండూ సమానమే అయినా ఒకటి పాకీపని చేస్తుంది. మరొకటి భోజనం చేస్తుంది. పనులలో తేడా వున్నా భావంలో నాకు రెండూ ఒకటే. ఆభరణాలలో ఉండే బంగారం సమానమే అయినా దేన్ని ఎక్కడ ధరించాలో అక్కడే ధరిస్తున్నాము. మెడది వేలికి, వేలిది మెడకి వేసుకోము. కాబట్టే ఇక్కడ "సమదర్శనం" అని చెప్పబడింది. "సమవర్తనం" అని చెప్పబడలేదు. "పండితాస్సమ దర్శిన: " అని కుక్కలు, యేనుగులు ఒకటేనని భగవద్గీత చెప్పిందని రాజభవనానికి రెండు కుక్కలను తీసుకొని వెళ్ళి అక్కడ కట్టివేసి రెండు ఏనుగులను పట్టుకొని రాము కదా! అలా పట్టుకొస్తే వారు ఊరుకోరు కదా !

# శ్రీ భగవద్గీత

# ఆరవ ఆధ్యాయము

# ఆత్మ సంయమ యోగము

ఈ భాగం అత్యంత ముఖ్యమైన ధ్యానం గూర్చి ఆత్మసంయమాన్ని గూర్చి బోధిస్తున్నాడా పరబ్రహ్మం చదవండి తరించండి.. చిత్తము వాటి యందు సక్తమౌతుంది. ఆ విషయాసక్తిని దూరం చేయాలి. బాహ్య సుఖాలలో బద్ధుడైన వానికి అంతరమైన ఆత్మసుఖం లభించదు. పైకొళాయిలో నీళ్ళు రావాలంటే క్రింది కొళాయిని 'బంద్' చేయాలి. పెద్ద వస్తువు కొరకు చిన్న వస్తువును త్యాగం చేయవలసి ఉంటుంది. " అవ్వా కావాలి - బువ్వా కావాలి " అనే ద్వంద్వ నీతి సరిపోదు. అట్టి విరక్త చిత్తుడే అంత:కరణంలోని ఉపశాంతి సుఖాన్ని పొందగలుగుతాడు. ఆ సుఖము యిహలోక పరలోక సుఖాలకంటే శ్రేష్ఠమైనది. ఇవి క్షయ సుఖాలు. అది అక్షయ సుఖము. అట్టివాడు "బ్రహ్మ యోగ యుక్తాత్ముడు " అని చెప్పబడతాడు.

శరీరం వదిలే లోపుగానే సాధకుడు కామక్రోధాలను వాటి వేగాన్ని అణచుకోవాలి. శరీరం వదిలే లోపుగానే అని చెప్పుటలో అర్ధమేమంటే శరీరం వదిలే చివరి క్షణం వరకూ వీటి విషయంలో సాధకుడు అప్రమత్తంగా ఉండాలి. ఈ శత్రువులను గెలువనిదే ముక్తిరాజ్యం దొరకదు. మరణించక ముందు నీవే స్థితిని సాధించివుంటావో మరణించిన తర్వాత నీకు లభించే స్థితి అదే. కాబట్టి చచ్చి సాధించేదేమీ లేదు. బ్రతికే సాధించాలి. " దంతంబుల్ పడనప్పుడే తనువునందారూఢి యున్నప్పుడే కాంతా సంఘము రోయనప్పుడే జరా క్రాంతంబు గానప్పుడే వింతల్ మేన చరింపనప్పుడే

కురుల్వెల్వెల్ల కానప్పుడే" సాధించాలి. కాని జవసత్వాలుడిగిన తర్వాత శ్మశానానికి టికెట్ "కన్‌ఫర్మ్" చేసుకున్న తర్వాత సాధించేదేముంది. అప్పుడు చావే సాధించడం. అర్జునా! ఎప్పుడో చూస్తాములే అని వాయిదా వేయక దీపం ఆరిపోకముందే యిల్లు చక్కబెట్టుకో.

కామక్రోధాదుల వేగం చిన్నది కాదు. మహానదీ ప్రవాహము తనలో పడ్డ మానవుణ్ణి సముద్రంలో త్రోసివేయునట్లు ఈ వేగం సంసార సముద్రంలోకి యీడ్చుకొని పోతుంది. జల జంతువులు జలవేగాన్ని సహించినట్లు ఈ కామక్రోధాదుల వేగాన్ని యెవడు అరికట్టగలడో వాడే బ్రహ్మయోగ యుక్తుడు. వాడే ఆత్మానందానికి అధికారి. వాడేనయ్యా నిజంగా నరుడు. తక్కిన వాళ్ళు నరరూపంలో వుండే వానరాలు లేదా సూకరాలు.

ఒక్క కర్మయోగమే మూడు విధాలుగా వుంది. కర్మ ప్రధానమైన కర్మయోగమని, ధ్యాన ప్రధానమైన ధ్యానయోగమని. ప్రేమ ప్రధానమైన భక్తి యోగమని చెప్పబడుతుంది. భగవంతుని లక్ష్యంలో పెట్టుకొని భగవత్ ప్రీతికొరకు కర్మలను చేయమని కర్మయోగం చెబుతుంది. ఆ భగవంతుని సాక్షాత్తుగా చింతన చేయమని ధ్యానయోగం చెప్పును. అర్జునా ఇంతవరకు కర్మయోగ ప్రసంగంలో శబ్దాది విషయాలను రాగద్వేష రహితంగా అనుభవించమంటూ చెప్పాను. ఆ తరగతి దాటిపోయింది. ధ్యానయోగ సందర్భంలో ఆ మాట సరిపోదు . ఆ శబ్దాది విషయాలను లోపలికి తీసుకొనుటే పనికిరాదు. వాటిని చింతింపనే వద్దు. వివేకబలంతో వైరాగ్య నిష్ఠతో బైటి విషయాలను బయటనే పెట్టు. శబ్దాదుల క్షేత్రం బయటి ప్రపంచం. నీ హృదయక్షేత్రంలో ప్రవేశించే హక్కు వాటికెక్కడిది. అనుమతీయనిదే లోపల ప్రవేశించరాదంటూ ధ్యానసమయాలలో అయినా బోర్డ్ వ్రాసిపెట్టు. ఒకవేళ జులుంతో లోపల ప్రవేశిస్తే బలప్రయోగంతో బయటికి నెట్టివేయి. వాటిని

బహిష్కరించమని చెప్పడంలో అవి బయటి వస్తువులని చెప్పినట్లయింది. వాటి ఉనికి నిజంగా లోపలనే వుంటే నీవు శతప్రయత్నాలు చేస్తే మాత్రం బహిష్కరించగల్గుతావా అని. మరి ఆవిధంగా ఇతర విషయాలు నీ అంత:కరణంలో ప్రవేశించకుండా వుంచాలంటే యే పథకాన్ని అవలంబించవలసి వుంటుందని అంటావా? నిరంతరం భగవదాకార వృత్తిలో బ్రహ్మాకార వృత్తిలో అంత:కరణాన్ని నింపు. అంత:కరణంలో ఒకవృత్తి వుండే సమయంలో రెండో వృత్తి చొరబడే అవకాశం వుండదు. ఒక కుర్చీలో ఇద్దరు కూర్చోగలుగుతారా? ఒక ఒరలో రెండు కత్తులు యిముడునా? బ్రహ్మాకార వృత్తిని భద్రంగా పదిల పరుచుకొంటివా విషయాకారవృత్తికి అవకాశం వుండదు.

వైరాగ్యంలో విషయ బహిష్కరణం చేసిన తరువాత అభ్యాసం కూడా చేయాలి. ఆ విషయాన్ని విను. చూపును భ్రూమధ్య స్థానంలో పెట్టు. యోగశాస్త్రంలో దీనిని "ఖేచరీ ముద్ర " అని అంటారు. విచారమార్గంలో ఈ పద్ధతికి రాగద్వేష రహితమైన దృష్టి అని అర్థం చెపుతారు. భ్రూమధ్య స్థానమనగా రెండు కళ్ళ మధ్య ప్రదేశము. ఆజ్ఞా చక్రానికి అదే స్థానము. కళ్ళు పూర్తిగా మూసుకుంటే నిద్ర వస్తుంది. పూర్తిగా తెరిస్తే బహిర్విషయాలు కనిపిస్తాయి. ఒకటి లయావస్థ, మరొకటి విక్షేపావస్థ. ఈ రెంటినీ చేరనీకుండా వుండే కోసం దృష్టిని అర్ధనిమీలితం చేసి భ్రూమధ్య స్థానంలో పెట్టి ఏకాగ్రం చేయాలి. చిత్త స్థిరత్వానికి ఇది ప్రథమ సాధన.

అర్జునా! జ్యోతిష్టోమాది యజ్ఞ ఫలాలను కాని, కృచ్ఛచాంద్రాయణాది తప: ఫలాలను కాని ఇంద్రాది దేవతల రూపంతో అనుభవించే భోక్తను నేనే. యజ్ఞ దాన తప: ఫలితాలు ఇంద్రాదులకు అర్పితమైతున్నాయన్న మాట పరమార్థం కాదు. సమస్త చరాచర సర్వవ్యాపకుణ్ణి కాబట్టి సర్వ కర్మలకు కర్తను కర్మను భోక్తను నేనే. "కర్తా భోక్తా మహేశ్వర:" ఆ ఇంద్రాదులు

ఒక్కొక్క లోకానికి అధిపతులు. నేనే సర్వలోక మహేశ్వరుణ్ణి. హిరణ్యగర్భుని కూడా నియమించే ప్రభువును నేను. ఒక్కొక్క లోకానికి శాసకుడైన వానిని మహేశ్వరుడని అంటారు. ఇంద్ర, చంద్ర, రవి, వాయు, అగ్ని, యమాదులు ఒక్కొక్క లోకానికి ప్రభువులు. నేను సర్వలోక మహేశ్వరుడను. వారు నా శాసనానికి అధీనులై వుంటారు. సర్వలోక ప్రభువునయ్యి కూడా కఠోర హృదయుడను కాదు.

భగవంతుడు యోగేశ్వరుడు. భగవద్గీత యోగశాస్త్రము. యోగివి కమ్మంటూ భగవంతుడు అర్జునునికి చెప్పిన బోధ. తక్కిన యోగాల మాట తర్వాత మాట కావచ్చు. అర్జునుడు ఆది యోగమైన విషాద యోగాన్ని పట్టుకోవడంతోనే అసలు భగవద్గీత ఆయనకు లభించింది. భగవంతుడూ దొరికాడు. శరీరం రోగమయము. ప్రపంచము దు:ఖమయము. "దు:ఖాలయ మశాశ్వత" మంటూ భగవంతుడే చెప్పాడు. సంసారము "నల్లుల" మంచము. దీనిలో సుఖనిద్ర పొందినవాడెవ్వడూ లేడు. ఈ ప్రపంచము "జన్మ మృత్యు జరావ్యాధి దు:ఖ దోష " మహాలయము. జీవుడు దీనిలో పడ్డాడు. " ఇది నేను – ఇది నాది " అనే అహంకార మమకార పాశాలతో బద్ధుడై పరితపిస్తున్నాడు. ఈ మకరబంధం నుండి విముక్తి బొందేందుకు "నీవే తప్ప నిత:పరం బెరుగ " నని అనన్య భావంతో భగవంతుని శరణు బొందుట ఒకే మార్గము.

చేపలు వలవైపు పరిగెత్తితే వలలో పడతాయి. వలవేసిన వాని పాదాల వైపు పరిగెత్తితే వల నుండి బయట పడతాయి. మృత్యు దు:ఖం నుండి దాటుకొనే కోసం మార్కండేయుడు శివుని కౌగిలించుకున్నాడు. శవాన్ని కౌగిలించుకొని వుండేంత వరకు జీవునికి దు:ఖం తప్పింది కాదు. ఇదే దు:ఖానికి కారణం. జీవుడు సోహంభావంతో పరమాత్మతో తదైక్యం చెందాడా?

ఆద్యంతిక దు:ఖ నివృత్తి వానికి సంభవిస్తుంది. సముద్రం నుండి విడువడిన ఉప్పురాయి, దేశాంతర, రూపాంతర, నామాంతరములకు వశమై బాధలకు తాపాలకు చిక్కి బంధంలో పడిపోయింది. అది స్వస్థానమైన సముద్రంలో చేరిందా, అపరిచ్ఛిన్నమైన బాధలకు తాపాలకు అతీతమై కూర్చుంది. ఇపుడు మనము భగవద్గీతలోని ఆరవ అధ్యాయాన్ని ప్రసంగ విషయంగా మనం పెట్టుకున్నాము. ఈ ఆధ్యాయానికి పేరు " ఆత్మ సంయమ యోగము " అని పేరు. ఈ ఆధ్యాయానికి మరికొన్ని పేర్లు కూడా వున్నాయి. ధ్యాన యోగమని, అభ్యాసయోగమని, ఆధ్యాత్మ యోగమని, ఆత్మ యోగమని, సంయమ యోగమని, స్వరూప యోగమని పర్యాయ నామాలు కూడా చెప్పబడి వున్నాయి. గంగానది ఆద్యంతం పవిత్రమే అయినా కొన్ని కొన్ని చోట్ల మరింత పవిత్ర తను వహించినట్లు, భగవద్గీతలోని కొన్ని ఆధ్యాయాలు మరింత విశిష్టతను సంపాదించుకొన్నాయని ఆచార్య వినోబా గారు అన్నారు. ఆ రూపంగా విశిష్టతను సంపాదించిన ఆధ్యాయాలలో ఇదియు ఒకటి. దీనిని ప్రారంభించే ముందు మీకొక్కమాట చెప్పవలసి వుంటుంది. అసలు ఈ ఆధ్యాత్మ శాస్త్రం ఎవరికి ఉపయోగపడుతుంది. దీనివల్ల ప్రయోజనం పొందేవారు ఎవరు? జడవస్తువులు, తిర్యక్ ప్రాణులూ వదిలేస్తే తక్కిన మనుష్యవర్గంలో కూడా అందరికీ ఇది ఉపయోగపడుతుంది. మానవ కోటినంతనూ మూడు వర్గాలుగా విభజించవచ్చు. విషయాసక్తులైన పామరులు ఒక వర్గం. మోక్షాన్ని ఆపేక్షించే జిజ్ఞాసువులు రెండో వర్గం. ముక్తిని బొందిన సిద్ధపురుషులు మూడో వర్గం. ఈ మూడు వర్గాలలో మొదటి పామర వర్గానికి ఈ వేదాంతంతో పనిలేదు. వారికి " ఆహార నిద్రభయమైధునాని " అంతే బస్. ఇక మూడవ వర్గం వారైన సిద్ధపురుషులు జ్ఞానులు. వారు కృతకృత్యులు. సంసార పారావారానికి అవతలిపారం చేరుకున్నారు. వారు ఈ శాస్త్రంతో పొందే ఉపకారం ఏమీ

లేదు. పోగా మిగిలిన రెండోరకం వారు వారిని జిజ్ఞాసువులనండి, ముముక్షువులనండి, వారికి ఈ శాస్త్రంతో పని వుంది. ప్రయోజనం వుంది.

అర్జునుని వలె వారు అనర్థ సంసార దు:ఖ నివృత్తికై ప్రయత్నిస్తారు. వారికీ శాస్త్రం ఉపకరిస్తుంది. ప్రయాణీకుడికి గొడుగు సహాయపడునట్లు, ఎండకు వానకు రక్షణ కల్పించినట్లు ఈ శాస్త్రం ముముక్షువునకు ఆత్మ రక్షణకు సహాయం చేస్తుంది. కానీ మరొక్కమాట ఏమిటంటే ప్రయాణికునికి తానెక్కడికి ప్రయాణం చేయాలో ఆగమ్యస్థానం తెలిసివుండాలి. గమ్యస్థానం తెలియక ఆదరాబాదరాగా ప్రయాణం చేసేవాడిని పిచ్చివాడంటారు. ఒక మనిషి ఆదరాబాదరాగా వెళ్ళి రైలు ఎక్కి కూర్చున్నాడు. "అయ్యా! టికెట్ తీసుకొన్నావా? " అని ప్రక్క మనిషి అడిగాడు. మరచిపోయానే అన్నాడు వాడు. "పోనీ! ఇప్పుడైనా వెళ్ళి తీసుకో?" అని చెప్పినాడతను. ఎక్కడికి పోవాలో మరచిపోయానే అంటాడతను. ఊరే తెలియని వానికి టికెట్ ఎవరిస్తారు. అన్ని అధ్యాయాలలోవలెనే ఈ అధ్యాయంలో కూడా మానవ జీవితము యొక్క గమ్యస్థానమూ, గమ్యప్రాప్తికి కావలసిన మార్గమూ చెప్పబడింది. అనగా " సాధ్యమూ సాధనమూ రెండూ చెప్పబడినాయంటూ అర్థం. అందులోనూ మార్గాన్ని గురించి యింత విస్తారంగా చెప్పబడిన అధ్యాయం మరొకటి లేదు. చిలుకకు పాఠం చెప్పినట్లు చిన్న చిన్న విషయాలను సైతం ఈ ఆధ్యాయం మనకు బోధించింది, గీతే సాధన ప్రధాన గ్రంథం. అందులోనూ నాదే అగ్రతాంబూలం ఈ విషయంలో, అంటూ ఈ ఆధ్యాయం పలికింది. మన గమ్యస్థానం ఏది. ఉపనిషత్తులను అడుగుదాము.

మన గమ్యమేమో ఉపనిషత్తులేమి చెబుతున్నాయో ఆ రహస్యాలను గీతాచార్యుల ద్వారా యీ ఆత్మ సంయమ యోగంలో శ్రీకృష్ణుని బోధామృతం లో క్రుంకులిడి పానం చేసి మనమంతా ఆ దేవదేవుని అనుగ్రహపాత్రులమై తరించుదాము.

నదులకు గమ్యస్థానం ఏది. గంగానది ఎక్కడ చేరాలని పరుగెడుతోంది? అడుగుమరి? సముద్రం నా గమ్యస్థానం. అదే నా స్వస్థానం, అక్కడికే నేను చేరాలని గంగానది మౌనభాషలో మనకు సమాధానం చెపుతుంది. సముద్రం చేరితేనే నదులకు శాంతి విశ్రాంతి. సముద్రం చేరకపోతే నది మురిగిపోతుంది. అక్కడికి చేరితేకాని దాని ప్రయాణం ముగియదు. నదులు సముద్రాన్ని చేరి తమ నామరూపాలను సముద్రుని పాలు చేసి తమ అస్తిత్వాన్ని కోల్పోయి అఖండ మహిమను అనుభవించి తిరిగిరావు. సముద్రం చేరిన తరువాత గంగ గంగకాదు. గోదావరి గోదావరి కాదు. కృష్ణ కృష్ణ కాదు. "అస్తం గచ్ఛంతి నామ రూపే విహాయ " ఈ దృష్టాంతాన్నే పై ఉపనిషత్ చెప్పింది.

జీవునికి గమ్యస్థానమేది? మానవులారా! మీ గమ్యస్థానమేది? మీ ఊరేది? మీ రెక్కడ నుండి వచ్చారు. "కుత అయాత:' చిత్తూరు నుండి వచ్చాను. కర్నూలు నుండి వచ్చాను. ఆ వీధి నుండి వచ్చాను. ఈ వీధినుండి వచ్చాను. ఈ మాటల్ని దేహాన్ని గురించి చెప్పిన మాటలు. నేనడిగేది దేహాల గురించి కాదు? జీవుని గురించి, జీవుని స్వస్థానమేది? జీవులు నా స్వరూపమే – నా అంశమే "అంటూ భగవద్గీత పదిహేనవ అధ్యాయం ఏడవ శ్లోకంలో భగవంతుడు చెప్పాడు. "సర్వభూతాలకు సనాతన బీజం నేనే" అంటూ ఏడవ అధ్యాయం పదోశ్లోకంలో ఆయనే చెప్పారు. అనగా జీవునికి గమ్యస్థానం స్వస్థానం పరమాత్ముడే అని అర్థం. వేదం కూడా " శృణ్వంతు విశ్వే అమృతస్య పుత్రా:" ఓ అమృత పుత్రులారా అంటూ సంబోధించింది.

బావిలోని నీరు, చెంబులోని నీరు అంటూ పేర్ల బేధమే కాని, నీరు మాత్రం ఒక్కటే. "తథా విద్వాన్ నామరూపే విహాయ " అంటూ ఈ విధంగా విద్వాంసుడు తెలుసుకుంటాడు. నామరూపాలు మిధ్యలని సర్వత్రా అఖండ వస్తు దృష్టి కలిగిన మహనీయుడే విద్వాంసుడు. ఈ జ్ఞానం కల్గిన వారెవరైనా

విద్వాంసులే? వారు స్త్రీలు కావచ్చు. పురుషులు కావచ్చు. ఈ నామ రూపాత్మక దేహాది సంఘాతం తాను కాదని తెలుసుకున్న విద్వాంసుడు అఖండ పరమాత్మతో తదైక్యం చెందుతాడు. ఆ పరమాత్మే జీవుని యొక్క గమ్యస్థానం. ఈవిధంగా జీవుని యొక్క గమ్యస్థానాన్ని ఉపనిషత్తులు, భగవద్గీత నిర్దేశించాయి. గమ్యమేమో తెలిసింది. కాని దానిని చేరే సాధనం కావాలి. ఆ సాధన మార్గాన్నే ఈ ఆధ్యాయం తెల్పుతుంది. మార్గం మంచిదేగాని సూటిగా ఉంటే గమ్యాన్ని సులభంగా సుఖంగా చేరవచ్చు. త్వరితంగా గమ్యాన్ని చేరే మంచి మార్గాన్ని కోరుకోవడం మానవుని పురుషార్థంపై ఆధారపడి వుంది. " ప్రకృతి పెట్టిందే ప్రసాదం" అని పడివుండటం పశువుకు చెల్లుతుందే కాని, పురుషార్థ పరుడైన మానవునికి సరిపోదు. పశువు ప్రకృతిని ప్రకృతిగానే అనుభవిస్తుంది. కాని మానవుని విషయం అలా కాదు. వివేకియై ప్రకృతిని సంస్కృతిగా మార్చుకొనేందుకు గాని, అవివేకంతో ప్రకృతిని వికృతిగా అనుభవించేందుకు గాని, మానవుని ప్రయత్నంపై ఆధారపడి వుంది.

ప్రకృతి యొక్క రథచక్రాల క్రింద నలిగిపోయే బలిపశువు కారాదు మానవుడు. ప్రకృతిని అదిమి భోగమోక్షాలను సాధించడం పురుషార్థ పరుని కర్తవ్యం. జీవిత గమ్యమైన పరమార్థాన్ని " యెప్పుడో యే జన్మంలోనో చేరితే సరిపోతుంది లే" అనే జాప్యాన్ని వదలి " ఆలస్యం అమృతం విషం శుభస్య శీఘ్రం " అనే నానుడిని దృష్టిలో వుంచుకోవాలి. తర్వాత తర్వాత అంటే తర్వాత ఎన్ని ఆటంకాలో ? వర్తమానమే మన చేతిలో వుంది, దాని భవిష్యత్ మన చేతిలో లేదు. మన వశంలో లేదు. ఒకనాడు స్నేహితుని ఇంటికి వెళ్ళావు. త్రాగమంటూ కాఫీ ఇచ్చాడు. అది చాలా వేడిగా వుంది. వెంటనే చల్లార్చుకొని త్రాగుతావు. "దానంత అది చల్లారిన తరువాత త్రాగుదాములే" అనుకోవు కదా! అదే పురుషార్థం. నీ నౌకరు నీ తడి ధోవతిని నాలుగు

మడతలు వేసి ఆరవేస్తాడనుకో! నీవు వాణ్ణి ఛీ కొట్టి మడతలు విప్పి ఆరవేస్తావు. ఎందుకు? అది ఎప్పటికో ఆరేది. అది ఇప్పుడే ఆరిపోవాలని, అదే పురుషార్థం.

మనుష్య జన్మము మోక్షానికి ద్వారము. మాటి మాటికి రమ్మంటే రాదు. వచ్చినప్పుడే సార్థకం చేసుకోవాలి. సోమరికి ఇహం లేదు. పరం లేదు. ప్రపంచంలో అన్ని వున్నాయి. సోమరికి ఏమీ లేదని తులసీదాసు అన్నాడు. ఎడమ చేయి సోమరి. అదే కుడిచేయి వుంది. లెమ్మని వెనక్కు, వెనక్కు తప్పుకొంటుంది. కాబట్టే దేవుడు దానికొక పని పెట్టాడు. మానవుడు ఆ పాఠాన్ని గ్రహించాలి. గ్రహించి సోమరితనానికి, బద్ధకానికి స్వస్తి చెప్పాలి. పౌరుషంతో ప్రయత్నంతో పరమాత్మ మార్గంలో, ముందుకు సాగిపోవాలి. మద్రాసు వెళ్ళాలనుకొన్నావు నడిచి వెళ్ళితే వారం రోజుల్లో వెళ్తావు. ఎద్దుల బండిలో అయితే అయిదే రోజుల్లో చేరుకొంటావు. జట్కాబండిలో అయితే మూడు రోజుల్లో చేరుకుంటావు. స్కూటర్‌లో ఒకరోజులో చేరుతావు. రైలులో ఆరుగంటల్లో చేరుతావు. విమానంలో ప్రయాణం చేస్తే గంటలో చేరుకుంటావు. గమ్యస్థానం ఎంత దూరం అనే మాటకాదు. యే సాధనాన్ని ఉపయోగించావనే మాటలో వుంది ఫలితం. ఉత్తమ సాధనాన్ని ఉపయోగిస్తే గమ్యాన్ని త్వరగా చేరుకుంటావు. కాబట్టే కబీరు ఇలా అన్నాడు. " నా గమ్యస్థానం కోటి జన్మల ప్రయాణం. గురుదేవుడు నన్ను క్షణంలో గమ్యం చేర్చివేశాడు" అదే జ్ఞానమనే సాధనం. కర్మ, భక్తి, యోగ, ధ్యానాది కాలు యెద్దుల బండి, జట్కా, మోటారు బండి, రైలు లాంటివి. జ్ఞానం విమానం వంటిది. " నహిజ్ఞానేన సదృశం " జ్ఞానంతో సమానమైనది లేదంటూ నాలుగవ అధ్యాయం ముప్పది ఏడులో "జ్ఞానాగ్ని" అని, నలభై రెండులో " జ్ఞానాసి" అనియు భగవద్గీత జ్ఞానాన్ని పలురకాలుగా వర్ణించింది.

జ్ఞానం, జ్ఞానం అంటున్నామే! సంసార సముద్రాన్ని దాటించే పరమాత్మ ప్రాప్తిని కలిగించే ఆ జ్ఞానం అది యే జ్ఞానం. మన దగ్గర రెండు విధాలైన

జ్ఞానాలు వున్నాయి. అవి విషయ జ్ఞానము. భేద జ్ఞానమూ అని. విషయ జ్ఞానమంటే లౌకిక జ్ఞానం. కాఫీని త్రాగనక్కర లేదు వాసన చూస్తే చాలు చక్కెర ఎక్కువో, తక్కువో చెప్పివేస్తాం. ఎంత ప్రచండమైన జ్ఞానం అంటారు " నహినహి రక్షతి " ఈ జ్ఞానం నిను ఉద్ధరించలేదు. ఈ లాంటి విషయజ్ఞానం పశుపక్ష్యాదులకూ వుంది. కాకి తాను మహాతెలివైన ప్రాణిననుకొంటుంది. అయినా దాని పాలిటికి మైలతిండి, యెంగిలి మెతుకులే గతి. గడిచిన నాలగు అధ్యాయాలలో చిత్తాన్ని పలువిధ విషయాలపై పోనీకుండా ఆత్మయందే పరమాత్మ యందే లక్ష్యము ఉంచాలని తద్వారా శాంతి లభిస్తుందని, అడపాదడపా భగవంతుడు చెప్పాడు. కానీ చిత్తాన్ని యేక లక్ష్యంలో వుంచుటకు, మనస్సు యొక్క ఏకాగ్రతకు తగిన సాధనను వివరించి చెప్పలేదు. ఆ లోటును పూరించుటకు కొరకై ఈ ఆధ్యాయం ప్రారంభించబడింది. మరియు అర్జునుడు పంచమాధ్యాయం ప్రారంభంలో " కర్మ సన్యాసమా - కర్మ యోగమా " నాకేది శ్రేయోదాయకమంటూ శ్రీకృష్ణుని ప్రశ్నించాడు.

ఫలంలో రెండూ సమానమే. అయినా సౌకర్యాన్ని, సౌలభ్యాన్నీ బట్టి కర్మయోగమే శ్రేష్ఠమని భగవంతుడు సమాధానమిచ్చాడు. అయిదవ అధ్యాయంలో కర్మ సంన్యాస కర్మయోగాలను రెండింటినీ తెలియజేస్తూ, వాటి స్వరూపాన్నీ, విధులనూ చెప్పి ఆ ఆధ్యాయం చివరిలో ఆ కర్మ సన్యాస, కర్మయోగాలు రెంటికీ ఉపయోగపడే ఉమ్మడి సాధనమైన ధ్యానయోగాన్ని సంక్షేపంగా మూడు శ్లోకాలతో చెప్పాడు. "ఉద్ధరేదాత్మ నాత్మానాం" అంటూ ఆత్మ విశ్వాసాన్ని పురికొల్పే రెండు శ్లోకాలను ఉపదేశించాడు. భగవంతుడు ప్రతి వానిలోనూ అనంతమైన శక్తిని నింపి వున్నాడు. దానిని సద్వినియోగం చేసుకొని తనను తాను ఉద్ధారకం చేసుకొనే జవాబుదారి ప్రతివాని యందూ వుంది. తనకు తానే శత్రువు. తనకు తానే మిత్రుడు. వెలుపల మరెవ్వడో

లేదు.  నిజానికి తనకు తానే గురువు.  తక్కిన వారంతా ఉపగురువులు మాత్రమే.  తారక మంత్రం గాని, మారకమంత్రం గాని ఎవరిది వాని చేతులలోనే వుంది.  అదృష్టమని, గ్రహచారమని ఏడవటం నపుంసకుని లక్షణం.  ఆత్మ విశ్వాసం మార్గ విశ్వాసం.  గురు విశ్వాసము, భగవద్విశ్వాసమనే చతుర్విధ విశ్వాసాలకు ఆధార శిల ఆత్మ విశ్వాసమే.  ఆత్మ విశ్వాసం లేని వానికి అన్ని విశ్వాసాలు సున్నే.  తర్వాత యీ అధ్యాయంలో మూడో పర్యాయం ముఖ్యంగా కానవచ్చే బృహద్దృశ్యం చిత్తైకాగ్రత.  ఏకాగ్ర చిత్తం లేనివాడు ఏ ఘనకార్యాన్ని సాధించలేదు.  చపల చిత్తము పశుత్వ చిహ్నము.  చారిత్రకంగా పేరుపొందిన మహా పురుషులందరూ ఈ చిత్తైకాగ్రతలో ఆరితేరినవారే.  తన గీతోపదేశాన్ని ముగిస్తూ భగవంతుడు అర్జునితో " కచ్చిదేతచ్ఛ్రుతం పార్థ త్వయేకాగ్రేణ చేతసా" అయ్యా!  ఏకాగ్ర చిత్తంతో విన్నావా!  అంటూ అడిగాడు. ఈ ఏకాగ్రత ఆధ్యాత్మ రంగంలోనే కాదు.  లౌకిక రంగంలో కూడా అవసరమే! నెపోలియన్ చక్రవర్తి యొక్క యేకాగ్రత జగత్ప్రసిద్ధి బొందింది.  ఏసుక్రీస్తు తన మనస్సును దేహం నుండి తొలగించి ఆత్మలో ఏకాగ్రం చేశాడు.

కాబట్టే అతనికి దు:ఖమే గోచరించలేదు.  వంట చేయుట, కసువు చిమ్ముట కూడా యేకాగ్రతతో చేస్తే అదొక కళగా రాణిస్తుంది.  చపల చిత్తంతో భోజనం చేస్తే వానికి అగ్ని మాంద్యం యేర్పడుతుంది.  వినేదానికే కాదు తినేదానికి కూడా యేకాగ్రత అవసరము అని అర్థం.  ఈనాటి మానవుని జాతకము ప్రభావము ఏమో కాని ఎవ్వనికి స్థిమిత చిత్తం లేదు.  చిత్త ఏకాగ్రత లేదు. ఉపన్యాసం వింటుంటే నిద్ర వస్తుంది.  సరే!  నిద్రపోదామని పడకవేసి పడుకొంటే అక్కడ అక్కరలేని ఆలోచనలు శరపరంపరలుగా  బయలు దేరుతాయి.  ఒకటి శూన్యాగ్రం మరొకటి అనేకాగ్రం.  మన భాగ్యంలో "యేకాగ్రత అనేది కరువైపోయింది.  ఒకటి లయావస్థ.  మరొకటి విక్షేపావస్థ.

మధ్యలో "నార్మల్" స్థితి వంటి ఏకాగ్రావస్థ పరమ దుర్లభమైపోయింది. ఏకాగ్రమంటే నిజమైన అర్థమేమి. ఏకమంటే పరమాత్మ. పరమాత్ముడే అగ్రముగా కలిగియుండుట ఏకాగ్రత. చెవికి శబ్దము అగ్రము. నాలుకకు రసము అగ్రము. ముక్కుకు గంధము అగ్రము. పంచేంద్రియాలకు పంచవిషయాలు అగ్రాలు.

మనస్సుకు ఏది అగ్రం కావాలి. పరమాత్మే కావాలి. మనస్సు పరమాత్మను విషయం చేయగలిగితే అదే నిజమైన ఏకాగ్రత. ఆరో ఆధ్యాయంలో తర్వాత కానవచ్చే నాల్గవ దృశ్యం జీవన పరిమితి. డాక్టర్ గారు మందును ఆచి, తూచి ఇచ్చినట్లు జీవితంలో ప్రతి అంశమూ నియమబద్ధమై నడిచినపుడు ఆ జీవితమే యోగ జీవితముగా నడుస్తుంది. తినుట, తిరుగుట, నిద్రించుట వంటి ప్రతి విషయంలోనూ, అతి లేక మితిని గ్రహించాలె. తినుటకై బ్రతుకటం కాదు. బ్రతుకుటకై తినుట అనే " పాలసీ " ని అవలంబించాలి. వీణకు తంత్రులు వదులుగా వుండరాదు. అలాగని అతిగా బిగించరాదు. తగినట్లు ఉండాలి. దీపానికి నూనె ఎంత అవసరమో అంతే వేయాలి. ఎక్కువయినా, తక్కువయినా ప్రమాదం. ఆ విధంగానే జీవితంలో మధ్యమ మార్గం అవసరమై ఉంటుంది. అప్పుడే ధ్యానయోగం సిద్ధించేది, జ్ఞానం కలిగేది.

# శ్రీ భగవద్గీత
# ఏడవ అధ్యాయము
# జ్ఞాన విజ్ఞాన యోగము

మన దేశంలో అనేక గీతలు కలవు. అందులో ఏ గీతకులేని గొప్పదనం భగవద్గీతకే దక్కింది. ఆ గొప్ప తనము ఎందుకనగా కర్తృత్వాహంకారము లేకుండా కృష్ణుడు కృష్ణుడుగా గాక తన పేరు ఉండాలనే స్వార్థం వదలి భగవంతుడుగా చెప్పిన వాక్యాలు. భగవంతుడై చెప్పిన ధర్మాలు కాబట్టి యీ భగవద్గీతకు ఇంత కీర్తి ప్రతిష్టలు చేకూరినవి. అన్ని గీతలు ఎవరు చెప్పితే వారి పేరుతోనే ప్రఖ్యాతి చెందినవి. యిక్కడ కృష్ణుడు చెప్పినా కృష్ణగీత కాలేదు ఉదాహరణకు కొన్నింటి పేర్లను మీకు తెలియజేస్తాను.

ఉతథ్యగీత, వాసుదేవగీత, ఋషభగీత. షడ్జగీత, శంపాకగీత, బోధ్యగీత, విచఖ్యుగీత .. జనకగీత, హారీతగీత, వృత్రగీత, పరాశరగీత, హంసగీత, పురాగీత, బ్రహ్మగీత, వశిష్టగీత, అష్టావక్రగీత, శివగీత, రామగీత, యమగీత. గణేశగీత, సూర్యగీత, ఉత్తరగీత, హనుమద్గీత, బుద్ధగీత, బ్రహ్మగీత ఇట్లనేక గీతలున్నవి. ఈ గీతల పేర్లు కూడా తెలియవు చాలా మందికి కాని భగవద్గీత పేరు వినని మానవుడు ఉండడు. పైగా మన హిందువులకు మత గ్రంథంగా భగవద్గీతకు సర్వశ్రేష్ఠస్థానము దక్కినది.

అలాంటి పరమ పవిత్రమయిన గీతను చదివినా విన్నా చూచినా స్మరించినా మానవుడు జన్మరాహిత్యం సద్గతులు పొందునని భగవానుని సందేశము ఇక మనము ఆ పవిత్రమయిన గీతాగంగోదకాన్ని పానం చేద్దాము. అందులో ప్రవేశించుటకు ముందు గీతాచార్యులకు నమస్కరించి ద్వితీయ షట్కములో

ప్రవేశించుదాము.

యీ భగవద్గీతకు శంకరాచార్యులు, రామానుజాచార్యులు, మధ్వాచార్యులు, రాఘవేంద్రస్వామి నుండి నేటి దాకా కొన్ని వందల మంది వ్యాఖ్యలు వ్రాశారు వ్రాస్తున్నారు. అయినా అందులో పరమార్థమింతేనని చెప్పువారు మాత్రం లేరు. అంత నిగూఢ అర్థాలతో నిండి నిబిడీకృతమై ఉన్నదీ భగవద్గీత ఎవరికే మార్గము ఇష్టమో ఆ మార్గమునే తీసుకోవచ్చును.

అర్జునా! జ్ఞానం ఎక్కడో ఎంతో దూరంలో లేదు. "ఇదంజ్ఞానం" ఇది అపరోక్షమైన నీ స్వరూప భూతమై ఉండే జ్ఞానమేనని ఎరుంగుము. అంత: కరణంలోని సత్వగుణం 'సత్యంజ్ఞానమనంత' మని చెప్పబడే బ్రహ్మజ్ఞానం నిర్వికారమైనది. ఆ జ్ఞానాన్ని విజ్ఞాన సహితంగా నీకు బోధిస్తున్నాను. సాధన సఫల సహితంగా విచార పరిపాకంగా విజ్ఞాన సహితంగా నీవీ బ్రహ్మజ్ఞానాన్ని తెలుసుకున్నావంటే ఇంక తెలుసు కోదగినదేదీ ఉండదు. యిక్కడొక ఉపమానం చెప్పుకొని ముందుకు వెళ్ళుదాము.

## ఉద్దాలకుని పుత్రుడు, శ్వేత కేతువు కథ

ఉద్ధాలకుడను మహర్షి తన ఆశ్రమంలో జిజ్ఞాసువులకు బ్రహ్మ విద్యాబోధ చేస్తూ ఉండేవాడు. ఆయనకు శ్వేతకేతువను ఒక కుమారుడు ఉండెడివాడు. ఉపనయన వయస్కుడై అతడు విద్యాబుద్ధులపై ఆసక్తి లేక సోమరిగా తయారైనాడు. అతని స్థితిని చూసి తండ్రి చాలా బాధపడుతూ ఇతడు నా చెంత విద్యాబుద్ధులు అబ్బవని గ్రహించి పుత్రునితో నాయనా తగిన గురువు నాశ్రయించి గురుకుల వాసం చేసి విద్యావంతుడవైరమ్ము " పండితపుత్ర పరమశుంఠ" అనే అపఖ్యాతి మన వంశానికి తగదు వెళ్ళు అని చెప్పగా, ఆ బాలకుడు గౌతమముని చెంతకు వెళ్ళి వారిని ఆశ్రయించి 12 సంవత్సరాలు

గురుకుల వాసం చేసి అనేక శాస్త్రాలు పఠించి విద్వాంసుడై తండ్రి కడకు వచ్చి పండితుడనైనాననే విద్యామదంతో తండ్రికి నమస్కారమైనా చేయక నిలబడ్డాడు. తాను తండ్రి కంటే గొప్ప పండితుడను విద్యావంతుడననే అహంకారంతో తన తండ్రి విద్యావంతుడయితే తననెందుకు వేరే చోటికి పంపును. కాబట్టి ఆయన విద్యావంతుడు కాడని అతని భావన. తండ్రి కుమారుని అవిధేయతను గుర్తించినాడు వినయవిధేయతలు విద్యకు ఫలితాలు వినయంలేని విద్య విద్యే కాదు అవిద్య. ఈ రోగం పెరిగిపోతే మరింత ప్రమాదం చెట్టైవంగనిది మానై వంగునా అని.

ఆ కుమారునితో తండ్రి అంటాడు. అబ్బాయీ నీ వాలకం చూస్తుంటే మహావిద్వాంసుడవై వచ్చినట్లున్నావు. చాలా సంతోషము బాబూ. దేనిని వింటే సమస్తము వినినట్లవుతుందో దానిని విన్నావా? దేనిని తెలుసుకుంటే సమస్తము తెలిసినట్లగునో దానిని తెలుసు కున్నావా? అని తండ్రి ప్రశ్నించే సరికి కుమారుడు తెల్లబోయినాడు. అప్పుడు కుమారుడు ఆశ్చర్యపడుతూ తండ్రీ ఆవిద్య మా గురువుగారికే తెలియదేమో. తెలిసివుంటే నాకెందుకు తెలుపడు తండ్రీ ఆ చదువు నేను చదువలేదు. లోకంలో ఏ వస్తువును గురించి తెలుసుకుంటామో పుస్తకజ్ఞానమే తెలుస్తుంది కాని మేజాను గురించి తెలుసుకున్నట్లవుతుందా.

ఒక దానిని గూర్చి తెలుసుకుంటే అన్నీ తెలుసుకున్నట్లే అనే సంగతి లోకంలో లేని సంగతి తామే బోధించడంటూ తండ్రిని శరణు బొందినాడు. అతడు శరణుబొందిన తర్వాతనే విద్యాపాత్రుడు జ్ఞానపాత్రుడు అయినాడు. మట్టిని తెలుసుకుంటే తత్సంబంధమైన పాత్రలకాధారం తెలిసిపోతుంది. బంగారం తెలుసుకుంటే ఆభరణాల స్వరూపం తెలుస్తుంది. పరమాత్ముడు

ప్రపంచానికంతటికి ఆధారమైనవాడు. ఆ పరమాత్మను తెలుసుకుంటే ప్రపంచాన్నంతా తెలుసుకున్నట్లే అట్టి వానిని " ఆత్మజ్ఞాని " అంటారు. అతడే సర్వజ్ఞుడు. అంటే అన్నీ తెలిసినవాడని అర్థము. యీ ఉపమానము "చాంద్యోగ్యోపనిషత్తు" లో చెప్పబడినది.

అర్జునా! ఈ జ్ఞానము విలువైనదే గాని సులువైనది కాదు సుమా. యీ జ్ఞానప్రాప్తికి ఒక్క మానవ జన్మ మాత్రమే అర్థవంతమైనది. చెట్లు, చేమలు, కీటకాదులు, జంతువులకు జ్ఞానంపొందే అవకాశం లేదు. భోగప్రధానమైన జీవులైన దేవతలకు కూడా ఆత్మజ్ఞాన ప్రాప్తికి హక్కు లేదు. కర్మాధికారం జ్ఞానాధికారం గల మానవులకు మాత్రమే బ్రహ్మజ్ఞానాన్ని పొందే అవకాశములు గలవు.

అసలు మానవ జన్మమే దుర్లభము. అందులో మోక్షాపేక్ష కలవారు చాలా స్వల్పము.

కిరీటీ సద్గురువును ఆశ్రయించి శ్రవణ మనన నిధి ధ్యాసముల నాచరించి నిత్య నిరంతర నిర్వికల్ప సమాధి నిష్ట యందు పరిపక్వుడైన ఉత్తముడు సర్వ స్వరూప వాసుదేవ పరబ్రహ్మమగు నన్ను అపరోక్షముగ తెలుసుకుంటాడు.

దు:ఖానికి మూల కారణమేమిటని మనం శాంతంగా కూర్చొని ఆలోచించే టైం లేదు. అన్నింటికీ తీరుబాటుంది కాని ఆత్మ శ్రేయస్సును గూర్చి విచారించే టైమే తీరిక లభించుట లేదు. అర్జునుని యీ దు:ఖానికి కారణమేమిటని జగద్వైద్యుడు నాడి పట్టి చూశాడు. యీ దు:ఖానికి అజ్ఞానమే కారణమని గ్రహించాడు. అజ్ఞానము పోతే దు:ఖము లేదు. అజ్ఞానమనే చీకటి పోవాలంటే "గీత" అనే జ్ఞాన దీపం వెలిగించాలి. గీతాజ్ఞాన ప్రసాదంతో అజ్ఞానం తొలగిందా. ఇక జన్మలో అది మన చెంతకు రాదు. గీతా జ్ఞానంతో అర్జునుని

దు:ఖం తుదముట్టింది. మహామహా నాయకులు ఆచార్యులు గీతను ఆశ్రయించి అమృతపదవి నందినారు. మీరూ ఆ భాగ్యాన్ని పొందండి. చంద్ర సూర్యులలోని ప్రకాశంనేనని భగవంతుడన్నాడు. ప్రకాశం లేకపోతే మానవుడు జీవించలేడు. చీకటి దయ్యం వంటిది మానవునికి దు:ఖం కలిగిస్తున్నది. ఆ ప్రకాశం సూర్యుని నుండి కాని చంద్రుని నుండి కాని అగ్ని నుండి కాని రావాలి ప్రకాశం ఎక్కడి నుండి వచ్చినా అది నాసొత్తేనని భగవంతుడు అంటున్నాడు. నీళ్ళు ఏ కొళాయినుండి వచ్చినా అవి ట్యాంకులో నీళ్ళే. అలాగుననే అన్నింటికీ అందరికీ అన్నీ ఇచ్చేది నేనే.

అర్జునా ! నా ఉపాసన కోసం నీవు ఎక్కడికో ఏ లోకానికి ఎంత దూరమో పోవలసిన పనిలేదు. నీవు వుండిన చోటనే నీవు నిలిచిన చోటనే నా ఉపాసన చేయవచ్చు. భూమిలోని పుణ్య గంధం నా స్వరూపం, అగ్ని యందలి తేజస్సు నా స్వరూపమే. తపస్సులలోని తపస్సు నా స్వరూపమే అని భగవంతుడు అంటున్నాడు. అజ్ఞానంతో యీ మహాసత్యాన్ని మనం మరిచాము. దయామయుడు కరుణించి ఎరుక జేయుచున్నాడు.

అర్జునా ! సర్వభూతములకు సనాతన బీజం నేను బుద్ధిమంతులలోని బుద్ధి నా స్వరూపము, తేజశ్శాలురలోని తేజస్సు నా స్వరూపము.

ధర్మానికి విరుద్ధం కాని కామము భగవంతుని స్వరూపము. ధర్మవిరుద్ధమయిన కామం అసురీ గుణం దానిని నరక ద్వారంగా భగవంతుడే చెప్పినాడు. అర్జునా! వెయ్యేల ఏయే వస్తువులలో ఏయే విధంగా ఉన్నానో విడివిడిగా చెప్పాలంటే ఎన్ని జన్మలైనా చాలవు. సమస్తానికి సారభూతమయిన వస్తువు నేనే.

ధనంజయా జ్ఞాని యొక్క జన్మ చాలా అపురూపమయినది. అనేక జన్మల సాధన బలంతో చివరకు అతడు జ్ఞానియైనాడు. జ్ఞానాధికారం గల మనుష్య జన్మలు ఎన్ని ఎత్తినా జ్ఞానికానిదే మోక్షం పొందలేడు. పరమాత్మ జ్ఞానం ఆత్మజ్ఞానం జన్మసార్థక్యం. మోక్షం కావాలని నీవు యీనాడు అపేక్షిస్తున్నావంటే బహు జన్మ పుణ్య భాగ్యంతోనే నీకీ శుభేచ్ఛ కల్గిందని ఊహించాలి జ్ఞానికి ఇది అంతిమ జన్మం అంతిమ జన్మం కాబట్టే జ్ఞానం పొందినాడు. జ్ఞాని యనగా నేనే. నాకు జ్ఞానికి యెట్టి భేదం లేదు. జ్ఞాని ఉన్నచోటే కాశి. అతడు క్రుంకులిడిన నీరే గంగానది. అతడు పల్కినదే వేదం. జ్ఞానికి నమస్కరిస్తే నాకు నమస్కరించినట్లే. జ్ఞానికి భోజనాది సత్కారాలు చేస్తే నాకు చేసినట్లే. జ్ఞాని స్వరూపమెట్టి దంటావా " వాసుదేవ: సర్వమితి యీ సమస్తము వాసుదేవుడు " అను జ్ఞానము పొంది యున్నాడు. అతడు సమస్తమూ వాసుదేవుడే అయినప్పుడు తాను మాత్రం వాసుదేవుడు కాడా.

" వాసుదేవస్సర్వం " ఇది గీతలోని మహావాక్యాలలో మహావాక్యం. ఈ షడాక్షరీ మంత్రజపం చేసినా మానవుడు తరించిపోతాడు. సర్వమూ వాసుదేవుడే అని ఎందు చూచినా ఆ పరమాత్మనే చూచుటే జ్ఞాన దృష్టి " ఇది ఎట్లనగా, ఒక భక్తుడు వినాయకున్ని బాగా ఆరాధించేవాడు. ఆ ఆరాధనా బలం వల్లనేనేమో అతనికి ధనాదాయం బాగా కలిసి వచ్చినది. అతనికి ఆ దేవుని యందు నమ్మకం భక్తి బాగా పెరిగింది. కొయ్య గణపతికి బదులుగా బంగారుతో వినాయకున్ని చేయించి పూజించితే ఇంకా ధనాదాయం పెరుగుతుందనే నమ్మకంతో బంగారంతో వినాయకుణ్ణి చేయించినాడు. తర్వాత వాహనమైన ఎలుకనూ బంగారుతోనే చేయించినాడు. వినాయకుడు కూర్చునే పీఠాన్ని అందంగా తయారు చేయించుకొని తెచ్చుకున్నాడు. ఆ విధమైన

బంగారు విగ్రహాలు పెట్టుకొని పూజలు చేసేవాడు. ఎక్కడ బెడిసిందో ఏమోకాని అతనికి వ్యాపారాలలో భారీగా నష్టాలు కష్టాలు తాండవం చేశాయి. విధిలేని పరిస్థితులలో ఆ బంగారు విగ్రహాలను అమ్మవలసిన పరిస్థితి యేర్పడినది. అన్నింటినీ తీసుకొని షరాబు దగ్గరకు వెళ్ళి వీటి విలువ తెల్పమంటాడు. అతడు ఆ వస్తువులను వరుపురాయిపై గీచి వాటికి వెలకట్టాడు. వాహనానికి, గణపతికి పీఠానికి ఒకే వెలకట్టినాడు. అదేమిటయ్యా ఎలుకకూ, వినాయకునికీ ఒకే రేటేనా అంటూ యీ అమ్మే వ్యక్తి వస్తువు ఏదైనా నాకవసరం లేదు. బంగారు ముఖ్యమంటూ కొనే వ్యక్తి నేనిచ్చే విలువ బంగారానికి కాని వస్తువుకు కాదయ్యా నాకు ఎలుక, ఏనుగు, వినాయకుడు నాకు సంబంధం లేదు బంగారమే మాకు ముఖ్యమన్నాడట. అలాగుననే ఎలుకని దేవుడని చెప్పుకోవడం వట్టి వాచారంభమే అలాగుననే యీ సర్వం వాసుదేవ మయమని ఎరుంగుటే సరి అయిన విజ్ఞానము బాహ్యావేషాలతో మానవుడు మహాత్ముడు కాలేడు.

మానవజన్మకు జ్ఞానమే ప్రధానం చెరుకుగడకు రసాన్ని పట్టి విలువ, పశుపక్ష్యాదులకు శరీరాన్ని పట్టి విలువ, కాని మానవునకు జ్ఞానాన్ని బట్టి విలువ ఆర్తి తొలగాలన్నా అర్థం కావాలన్నా భగవంతుని మళ్ళీ ప్రార్థించే వారు భక్తులే వారు ఇష్టార్థసిద్ధిని పొందుతారు. అర్జునా కోరికల వలన వివేకశక్తి క్షీణిస్తుంది. కోరిన వస్తువులు వస్తున్నాయి. నశిస్తున్నాయి. కాని కోర్కెలు నశించడం లేదు. అతి కోర్కెలు అనర్థాలకు మూలము. కాముడేలే హృదయంలో రాముడుండడు. రాముడుండే హృదయంలో కాముడుండడు.

# శ్రీ భగవద్గీత

# ఏడవ అధ్యాయము

# విజ్ఞాన యోగము

వేదాంతంలో అన్నీ ఇందులో కలవు. ఇప్పుడు మనం ప్రవేశించునది "విజ్ఞానయోగము" ప్రథమ షట్కమునకు "త్వం" పదార్థశోధన చేయబడినది. త్వం అనగా నీవు నిన్ను గురించి తెలుసుకో అనగా దేహం నీది కాదు ఇంద్రియాలు నీవి కావు ప్రాణాలు నీవి కాదు. మరి నీవేది అనేదే అత్మతత్త్వం. యీ ఆత్మసాక్షాత్కారం కలుగనిదే యీ ప్రాపంచిక భోగాలన్నీ ఉండి నా సుఖము శాంతి ఉన్నదేమో చూడండి. ఐశ్వర్యం పెరిగే కొద్దీ ఆరాటం అధికమగుచున్నది. ఆ భోగాలలో శాంతి సుఖాలు యేమాత్రం లేవని జ్ఞానము చెప్పే అనుభవ వాక్యాలు బుద్ధునికి రాజ్యము భోగాలు రూపవంతురాలు భార్య ముద్దుల కుమారుడు అన్నీ వున్నా అసలైన జ్ఞానం కొరకు అడవులకు వెళ్ళి కఠోర తపస్సు చేసి తాను శాంతి సుఖాలను బొంది శాంతిని సంతోషాలను లోకానికి పంచిపెట్టినాడా మహానుభావుడు " నేను దేహము – నాకు ఆత్మ వుంది " అని పాశ్చాత్యుల అభిప్రాయం మన భారతీయుల అభిప్రాయము వేరు అర్జునా దేహాలు మారినా దేహధారియైన ఆత్మ ఒక్కటే అతడు మారడు.

ప్రపంచంలో అందరూ ధ్యానం చేస్తున్నారు అందరూ ధ్యాన తత్పరులే అయినా ఆత్మను గూర్చి పరమాత్మను గూర్చి చేసే ధ్యానము అసలైన ధ్యానము.

శ్లో ॥ మయ్యాసక్త మనా: పార్థ యోగం యుఞ్జ న్మదాశ్రయ:
అసంశయం సమగ్రంమాం యధాజ్ఞాస్యసి తచ్ఛృణు:



ఇంటికి నిప్పంటుకుంటే బయటకు పరుగెత్తవచ్చును. ఇంద్రియాలకు నిప్పంటుకుంటే ఎక్కడికి పరుగెత్తగలవు.

అర్జునా భగవంతుడనైన నా స్వరూపాన్ని తెలిసి కొనుటకు ప్రయత్నించే నీవు నిజంగా కృతకృత్యుడవు కావాలంటే నాయందే ఆసక్తి పెట్టి నన్నే ఆశ్రయించుము. ధనంజయా నీవు అంతటి సమర్ధుడవు కాబట్టే పదివేల మంది మహావీరులను వదలి కృతవర్మాది యోధులను వదలి నన్ను ఒక్కనినే కోరుకున్నావు. నీవే తప్ప నిత:పరం బెరుగనని నన్నే ఆశ్రయించావు. అంత మాత్రమే చాలదు నేనిప్పుడు బోధించే నా సమగ్ర స్వరూపం అఖండతత్త్వం తెలుసుకొనే అర్హత అధికారాలు నీకు లభించాయి. అరకొర జ్ఞానం కలవానికి అన్నీ సంశయాలే. సంశయాత్మావినశ్యతి.

కర్మచేసే మానవుడు తాను చేసే కర్మలలోని రహస్యం తెలుసుకొని చేస్తే అది యోగమౌతుంది. "యోగం కర్మ సుకౌశలం" భగవంతుని దృష్టిలో యుంచుకొని కర్మలు చేయాలి అట్టి వానికి సంశయరహితమైన భగవంతుని అఖండ జ్ఞానం చేకూరుతుంది. సమస్తం పోయినా సరే బుద్ధిని కాపాడుకోవాలని సోక్రటీసు చెప్పాడట. బుద్ధి భ్రష్టుడు అన్ని విధాలా భ్రష్టుడు మంచి బుద్ధి గొప్ప ఆస్తి.

అర్జునా! ఎవడెవడు ఏయే దేవతను ఏ కామితాల కొరకై ఆరాధించినా ఆయా దేవతారూపంలోననే వారి కోర్కెలను తీర్చుతూ ఉంటాను. దయామయుడగు భగవంతుడు మన మార్గాలకే వచ్చి మనల నుద్ధరిస్తున్నాడు. నీవే దేవతనైనా ఉపాసించు అది నీ యిష్టము. అచ్చట ఆ రూపంలో భగవంతుడున్నాడని తలంచు. అన్నింటా భగవంతుని చూడడమే వివేకి ధర్మము. అందరి కోర్కెలు నెరవేర్చగలిగే శక్తి ఆ పరమాత్మయందే కలదు.

అర్జునా! అనిత్యఫలములను కోరి అల్ప బుద్ధులై నన్ను వదలి అన్యదేవతలను ఆరాధించువారికి లభించు ఫలితము అల్పమై యుండును. దేవతలే

అనిత్యమైనపుడు దేవతలిచ్చు ఫలితములు ఎట్లు నిత్యములగును. నా భక్తులకు కల్గు నిత్య ఫలితములు అన్య దేవతా రాధకులకు కల్గదు. నన్ను ఉపాసించు నా భక్తులు నన్నే చెందెదరు. నిత్యుడను నిర్వికారుడను అయిన నన్ను భజించువారికి నిత్యఫలమే కల్గును. భగవద్భజన సర్వోత్తమ నిత్యఫలాన్ని యిచ్చేదై వుండగా మానవులా మార్గంలో ప్రవర్తింప నందుకు కారణమును భగవంతుడు ముందు ముందు తెల్పబోతున్నాడు.

అర్జునా! అక్షయ ఫల దాతనైన నేనుండగా అన్యదేవతలను ఎందుకు ఉపాసన చేస్తున్నారని నీకు శంక కల్గినదా? విను నన్ను భగవంతుడని వారెరుంగరు. సత్యాసత్యముల గుర్తెరుగని బహిర్దృష్టితో కూడిన లౌకిక జనులు నన్ను తమ వలెనే మానవ మాత్రునిగా తలంతురు. నన్ను కృష్ణుడనే భావిస్తున్నారు. కాని భగవంతుడని వారికి తెలియదు. ఇంతకు ముందులేని వానినిగను ఇప్పుడున్నవానినిగను వారి భావన నా నిజస్వరూపము తెలియని మూఢ బుద్ధులు. వారు తమ విషయంలో కూడా దేహమే తన స్వరూపమనుకొనుచున్నారు. కంటికి కానరానిదే సత్యమూ స్థిరమూనైన వస్తువు. కంటికి కానవచ్చు యీ దృశ్యమంతయు అల్పము అసత్యము అనిత్యము రూపధారణ కల్గిన ప్రతి వస్తువూ కలిగిమెలిగి తొలగుతుంది. అవ్యక్త వస్తువే నిజమైన వస్తువు. మరి కొందరు భగవంతుడు మోక్షము మాత్రమే యిచ్చును. కాని, కోర్కెలను ఆయన నుండి పొందే వీలు లేదని వారు ఇతర దేవతలను ఆరాధించెదరు. వారి దృష్టి యెంతో సృష్టి అంతే వారు భావింతురు. తమలోని అవ్యక్త స్వరూపాన్ని దర్శించలేనివారు భగవంతుని అవ్యక్త స్వరూపాన్ని యెలా దర్శిస్తారు.

అర్జునా! నన్ను తెలిసికొనలేనందుకు కారణమేమందువా అదే నా యోగమాయ. ఆ యోగమాయచే ఆవరింపబడి నా భక్తుడుకాని వారు కోర్కెలచే

జ్ఞానహీనులైనవారు తెలుసుకొనలేరు. భక్తులు కాని వారికి అనధికారులకు కానరాకూడదనే సంకల్పయోగము. ఆ నా సంకల్పానికి వశమై యుండును. మాయ నన్ను వారికి కానరాకుండా చేసినది నేను అంతటా ఉండియు అజ్ఞానులకు అగోచరమై వున్నాను ఇదియే యోగమాయ.

అర్జునా! యీ మాయ నన్నావరిస్తుందని తలుస్తావేమో క్షుద్రమయిన మాయకు నన్నావరించే శక్తి యెక్కడిది. నన్నావరించలేదు. అజ్ఞానుల దృష్టి నావరించినది. మేఘాలు సూర్యున్ని ఆవరించినాయి అని అంటుంటారు. సూర్యుడెక్కడ మేఘాలు యెక్కడ చూసే వారి దృష్టిని బట్టి మేఘాలు ఆవరించినాయి. అర్జునా ! ఇంకా విను గతించిన కాలములోని భూతములను నేనెరుంగుదును వర్తమానములోని సమస్తమూ నాకు తెలిసియే యుండి భవిష్యత్తులోని చరాచర భూతములను నేనెరుంగుదును. నా జ్ఞానము అఖండము త్రికాలములలోనూ నేనుండేవాన్ని అజ్ఞానులు నన్ను తెలుసుకోలేరు. నేను అన్నీ తెలుసుకుంటాను. నన్ను తెలుసుకొనే వాడెవడూ లేడు.

ఇదే యోగమాయా చమత్కారం. అర్జునా! పుణ్యకర్మలను చేసి యెవరు తమ పాపములను నశింపచేసుకున్నారో అట్టి జనులు ధృడవ్రతులై ద్వంద్వ మోహముల నుండి విముక్తిని సాధించి నన్నారాధిస్తారు. పాపి పాపిగా వుండి భగవంతుని చేరలేడు. తన పాప కర్మలకు స్వస్తి చెప్పిన తరువాతనే వానికి ఉద్ధారకము అందులకు దృఢమైన దీక్ష శ్రద్ధ అవసరము.

మానవుడు ఎందుకు పుట్టాడు. అంటే చచ్చేకోసం కాదు. మళ్ళీ పుట్టకుండా ఉండేందుకు. ఎందుకు ఛస్తాడు మళ్ళీ చావకుండా ఉండేందుకోసమేనని మనం గ్రహించాలి. మనుష్యుడు అజ్ఞానంతో పుట్టాడు కానీ అజ్ఞానంతో చావరాదు. పుట్టేటప్పుడు పసివాడు కాబట్టి అజ్ఞానంతో ఏడ్చాడు. కాని చచ్చేటప్పుడు అజ్ఞానంతో ఏడ్చుతూ చావడం మంచిది కాదు.

పుట్టేటప్పుడు కోహం కోహం అంటూ ఏడ్చాడు. చచ్చేటప్పుడు సోహం సోహం అంటూ మరణించాలి అప్పుడే జన్మ సాఫల్యమౌతుంది. సమాప్తము అవుతుంది.

జ్ఞాని ఇక్కడే ముక్తిని పొందినాడు. ముక్తి ఎప్పుడో చచ్చిన తర్వాత వచ్చే ముక్తి ముక్తి కాదు. జ్ఞాని ముక్తిని బొందుట ఉద్దర వేదాంతం కాదు. ఇప్పుడే ఇక్కడే ముక్తిని పొందిన వాడే నిజమైన జ్ఞాని భగవంతుడీ ఆధ్యాయంలో రెండు మహావాక్యాలు మహామంత్రాలు తెల్పినాడు. "తస్మా స్సర్వేషు కాలేషుమా మనుస్మర యుధ్యచ " 27వ శ్లోకంలో " తస్మాత్ సర్వేషు కాలేషు యోగయుక్తో భవార్జున '' యీ మహామంత్రాలు సర్వత్రా ఆచరణీయమైనది. ''మృత్యుగ్రస్తుడైనవాడు మృత్యుంజయుడు కావాలంటే ఇంతకన్నా తరుణోపాయమే మున్నది.

పరమాత్మను తెలసు కోవడము ముక్తిని పొందడం మానవజీవిత లక్ష్యం. మేడలు కట్టడంతో, భూములు సంపాదించడంతో, ధనము సంపాదించడంతో, బిడ్డలు కనడంతో మానవ జన్మకు గొప్పతనం లేదు. జ్ఞాననేత్రం తెరచి ముక్తిని సాధించి నరుడు నారాయణుడై జన్మ సంసారబంధం నుండి శాశ్వత విముక్తిని సాధించాలి. అదే మానవ జన్మకు శాంతి, విశ్రాంతి.

అర్జునా జరామరణాదులనే దు:ఖసాగరం నుండి విముక్తిని పొందేందుకై నన్నాశ్రయించి ఎవరు సాధన చేస్తారో వారు సంపూర్ణమగు ఆధ్యాత్మాన్ని సమగ్రమగు కర్మను తెలసుకున్నవారై సమాహిత చిత్త వృత్తి కలవారై మృత్యు సమయంలో నన్ను మరచిపోరు.

ప్రతి మానవుడు దు:ఖం నాదరి దాపుకు రారాదు. సుఖ సంతోషాలు పూర్తిగా నేననుభవించాలని కోరుతున్నాడే కాని, మంచి పనులు చేయడం లేదు. చెడు పనులు వదలడం లేదు. అందుచే మానవులకు సుఖ సంతోషాలు

సిద్ధించటం లేదు. యీ దు:ఖాలకు కారణమేమిటి అనగా అజ్ఞానము దేహభ్రాంతులే కారణాలు. ఇలా కృష్ణుడు చెబుతూ ఉంటే, అర్జునుడు అడుగు చున్నాడు.

పురుషోత్తమా నీవింతవరకూ చెప్పిన మాటలు నాకు అర్థం కావటం లేదు. మరికాస్త వివరించి చెప్పు బ్రహ్మము ఇంద్రియాలకు అందనిది ప్రమాణాలకు అందనిది లౌకిక వస్తువులను జ్ఞానేంద్రియాదులతో తెలుసుకోవచ్చును. కాని అలౌకికమైన పరబ్రహ్మాన్ని తెలుసుకునే వీలులేదు. అది నాబుద్ధికి అందుకునేది కాదేమోననిపిస్తున్నది. అది బోధాపరంగానే తెలుసు కోవలసి వుంటుంది. కనుక ఓ దేవాదిదేవా నీవు చెప్పాలి నేను తెలుసుకోవాలి.

కృష్ణా నీవు ఆశ్రితుల కష్టాన్ని ఎంతైనా సహిస్తావు ఏమైనా చేయగల్గుతావు. సర్వ సమర్థుడవైన ఓ దేవాదిదేవా నా సంశయాన్ని తొలగించు సమాహిత చిత్తులైనవారు ప్రాణ ప్రయాణ సమయంలో నన్ను చేరుతారని సెలవిచ్చినావు. వారు ఏ విధంగా నిన్ను తెలుసుకుంటారు. మరణ సమయం అతిదారుణమయిన క్లిష్ట సమయం. ఆ సంకట సమయంలో నీ వుపాసన యెలా నిలువ గల్గుతుంది. నిన్ను మరువకుండుట ఎలా సంభవిస్తుంది అంటూ అర్జునుడు సద్గురువును జగద్గురువును ప్రశ్నించుచున్నాడు. యీ ప్రశ్నలు తనకే కాక పోయినా మన కోసరమని మనం గ్రహించాలి.

అర్జునా మరణ మంటే ఏమిటి ఈ శరీరంతో అనుభవించవలసిన కర్మ ముగిసి మరో శరీరంతో అనుభవించవలసిన కర్మ ఇంకా ఉత్పన్నం కానటువంటి సంధి సమయంలో భగవంతుడనైన నన్ను స్మరించేటందుకు యోగ్యమైన సమయం అట్టిదానినే సంధ్యా సమయం. సంధ్యావందన మంటారు.

శ్లో ॥ అంతకాలేచ మామేవ – స్మరన్ముక్త్వాకళేబరం
యః ప్రయాతి సమద్భావం – యాతినాస్త్యత్ర సంశయః

సవ్యసాచీ అంత్యకాలంలో కూడా నన్నే స్మరిస్తూ శరీరాన్ని వదలి యెవడు ప్రయాణం చేస్తున్నాడో వాడు నా భావాన్ని పొందుతాడు. ఇందులో సందేహం లేదు. ప్రయాణ కాల విషయం అర్జునుడు అడుగగా అంత్యకాల విషయాన్ని భగవంతుడు తెల్పుతున్నాడు. యుద్ధ రంగంలో వచ్చి నిలచిన వానికి యే క్షణంలో మృత్యువు కల్గుతుందో చెప్పలేం, ఏ క్షణానికి ఆ క్షణమే అంత్యకాలం నశ్వర శరీరానికి ప్రతిక్షణమూ అంత్యకాలమే.

భీష్ముడు అంపశయ్యపై పరుండి శాంతి పర్వాన్ని బోధించాడు. పండు కున్నది శరతల్పం మీద బోధించునది శాంతి బోధ అలా బోధించుటకు అయనకే చెల్లింది కాబట్టే భగవంతుడు అంత్యకాలాన్ని జ్ఞాపకం చేసి మనలను హెచ్చరిస్తున్నాడు. ప్రయాణ కాలమంటే యెప్పుడో కాదు. ఎప్పటికప్పుడు ప్రయాణ సమయం మనుష్యుడు పుట్టినప్పుడు నుండి మృత్యువు దగ్గరకు ప్రయాణం చేస్తూనే ఉన్నాడు.

" భాగవతంలో పరీక్షిన్మహారాజుకు వారం రోజులలో మరణమని శృంగి మహాముని శాపంబొంది ఆ వారం రోజులలో భాగవతాన్ని విని మోక్షం పొందినాడు. ఆ పరీక్షిన్మహరాజుకే కాదు మనకూ వారం రోజులలోననే మృత్యువు ఆ 7 రోజులలో ఏదో ఒక రోజు మృత్యువు తప్పదు ".

అంత్యకాలంలో నన్నే స్మరించమంటూ భగవంతుడు ఆదేశించాడు. ఏదో ఒకటి స్మరించడం మానవుని సహజగుణం వేరే స్మరణలు నిన్నుద్ధరించలేవు.

ఒకాయన చనిపోయే సమయం అంత్యకాలం సమీపించింది చుట్టాలు బంధువులు సంతానం చుట్టూ గుమిగూడి అయ్యో తండ్రీ నీవు వెళ్ళిపోతున్నావే మాగతేం కావాలి అంటూ విలపిస్తూ వుంటే ఆయన అన్నాడట " నేను సంపాదించిన ఆస్తులూ, ధనమూ, వాహనాలూ అన్నీ మీకే వదలి పోవుచున్నానే

గాని నేను యే ఒక్కటీ తీసుకపోవడము లేదు. ఇన్ని సంపాదించి ఇచ్చినా నాకెవ్వరూ తోడు రావడం లేదు. నాగతి చెప్పండి" అని అన్నాడట. ఆ మాటకు అందరూ నిర్ఘాంతపోయారు. యీాయన యేమి తోడు రావాలంటూ న్నాడే అని దూరంగా జరిగారట.

పెండ్లాము, బిడ్డలు, ఆస్తులు, ధనమూ నిన్ను కాపాడలేవు. అన్య స్మరణములు మానుకొని నన్నే స్మరణ చేయమంటున్నాడు. మహా ప్రయాణ సమయంలోపరమాత్ముని స్మరణ లభించాలంటే రెండు ప్రతిబంధకా లుండరాదు.

1. ప్రాపంచిక స్మరణ తనలో ఉండరాదు.

2. వెలుపల ఆలు బిడ్డలు, చుట్టాలు, బంధువులు యేడ్పులు పెడబొబ్బలు ఉండరాదు. చస్తే ఏడ్వాలనే ఆచారాన్ని మనవాళ్ళు పెట్టుకున్నారు. ఇదియే శాస్త్రంలోనూ లేదు. మరి ఎందుకో యీ ఆచారం.

అర్జునా అంత్యకాలంలో కూడా నన్నే స్మరిస్తూ శరీరాన్ని యెవ్వడు వదులుతాడో అతడు నా స్వరూపాన్ని దర్శించగలుగుతాడు. వదలవలసింది (దేహం) శరీరం గ్రహించవలసింది పరమాత్మ స్వరూపం దేన్ని వదులుతున్నామో అది మన స్వరూపం కాదు. మన స్వరూపాన్ని మనం వదిలే ప్రసక్తే యుండదు. భగవంతుడు నీ స్వరూపమే కాబట్టి భగవంతున్ని పొందడం నీ ధర్మం.

అంత్యకాలంలో భగవస్మరణ చేసిన భగవంతుని పొందునో లేదోయని సంశయంతో పనే లేదు. సంశయగ్రస్తుడు చెడిపోతాడు. కాబట్టి నా వాక్యంలో సంశయం వద్దు మనుష్యుడు అంత్యకాలంలో భగవంతున్ని స్మరిస్తూ దేహం వదిలితే భగవంతునిలో ఐక్యమౌతాడు. కోడలుపై కసి తీర్చుకోలేక పోతినే

అనిగాని అత్తపై కసి తీర్చుకోలేక పోతినే అని గాని, శత్రువుని హింసించలేక పోతినే అని గాని స్మరిస్తూ దేహం వదిలినట్లయిన మళ్ళీ జన్మలో యీ కసి, హింసలు తీర్చుకొనుటకై జన్మించడం కూడా జరుగవచ్చు.

జడభరతుడు మహా తపస్సంపన్నుడు జిముకపై మమకారంతో జిముకను స్మరిస్తూ దేహం వదలి జిముకగా జన్మించుట మన మెరింగిన విషయమే కదా. దేహం వదలునప్పుడు వెయ్యి తేళ్ళు కుట్టినంత బాధాకరంగా ఉండునని శాస్త్రం చెబుతుంది. అంత కష్టంలో భగవంతుడు జ్ఞప్తికి వచ్చునా దైవనామస్మరణ చేయగలమా అనే సంశయం కూడా కలుగక మానదు. వానికి తరుణోపాయము అంత్య కాలంలో దైవనామస్మరణ చేయాలంటే ప్రతిక్షణం జీవితమంతా దైవనామస్మరణ చేయగలిగితే ( అది ఎట్లనగా ) "పానీయంబులు త్రాగుచున్ కుడుచుచున్ భాషించుచున్ హాసలీలా నిద్రాదులు సేయుచున్ సంతత శ్రీనారాయణ పాదపద్మయుగళీ చింతామృతా స్వాదనాయత్త చిత్తుండై మరిచాడట ప్రహ్లాదుడు. అలాగుననే ప్రతిఒక్కరూ ఎప్పుడూ ఏదో ఒకటి స్మరిస్తూనే ఉందురు. ఆచింతన వలన సాధించే దేమీ లేదు. జరిగేది జరుగక మానదు. ఆచింతన స్థానంలో యీ దైవనామస్మరణను అతికించి నామంటే నీ జన్మ తప్పక సార్థకమవుతుంది. ఇట్లు ధ్యానం చేసిన వారికి భగవంతుడు ఋణపడి ఉంటాడు ఆ ఋణం తీర్చుకొనుటకై భగవంతుడు అంత్య కాలంలో దైవనామస్మరణచేసే జ్ఞాపకం ఇచ్చి దైవనామస్మరణ చేసే శక్తిని యిచ్చి నిన్ను తరింపజేస్తాడు. కనుక భగవద్భక్తులారా " కలౌస్మరణాన్ముక్తి " కలౌ కేశవనామ కీర్తన:" అని శాస్త్రం చెబుతుంది. అందరం ఆ దేవుని ధ్యానంతో తరించే మార్గం మనకందరకు ప్రసాదించుగాక.

# శ్రీ భగవద్గీత
# ఎనిమిదవ అధ్యాయము
# అక్షర పరబ్రహ్మ యోగము

అర్జునా మానవుడు భువిపైకి వచ్చేటప్పుడు తెచ్చింది లేదు. వెళ్ళేటప్పుడు తీసుకవెళ్ళేది లేదు. ఈ మధ్యన యెందుకో వీనికంత తాపత్రయాలు ఈ వస్తువులను తానైనా వదలాలి. లేక ఆ వస్తువులన్నీ అవియైనా వదలిపోతాయి. అలా వదలనంటే బలవంతంగానైనా అన్నింటినీ వదలిస్తుంది. అది సృష్టి ధర్మం కూడా. ఈ వదలడమనేది మనస్పూర్తిగా సంతోషంగా నైనా వదలవచ్చు. ప్రకృతి యొక్క ఉక్కుపిడితో మొట్టికాయలు తినక ముందే వివేకి వదలి ప్రశాంతంగా కూర్చుంటాడు.

ప్రతి ఒక్కరు తన రక్షణకై అంగరక్షకులను నియమించుకుంటున్నారు. కాని వారు బ్రతికున్నవారిని చంపగలరేగాని చచ్చే వారిని బ్రతికించే వారుకారు. కనుక జీవుడు చేసుకున్న కర్మమూ - ధర్మమే కాని అతని వెంటపోయేది ఇతరత్రా యేమీ వెంటరావు. ఇట్టి అనిత్యమైన తుచ్ఛమైన వస్తువులు స్మరణ మరణకాలంలో రానేరాదు. ఆమరణ కాలంలో పరమాత్మను స్మరించి జన్మధన్యత చేసుకోవాలి.

అర్జునా ఆత్మజ్ఞాని జ్ఞానం పొందినపుడే ముక్తుడౌతాడు. జ్ఞానికి మరణదోష ప్రభావంపట్టదు. అతడు విప్ర గృహంలోగాని చండాలగృహంలో గాని అతడే విధంగా మరణించినా అతనికి ముక్తికి లోటు ఉండదు.

పార్థా మరొక్కమాట అజామీళుడు వలె మరణ కాలంలో నారాయణ స్మరణ చేస్తే సరిపోతుంది కదా ఇప్పటి నుండి ఎందుకు తిప్పలు పడాలి.

ఆనాడు చూసుకోవచ్చునని వాయిదా వేస్తావేమో మరణ సమయంలో వూడిపడినట్లు ఆత్మజ్ఞప్తి భగవంతుని స్మరణ రావాలంటే అది అంత తేలికగా రాదు సుమా. అస్త్రవిద్యను నిరంతరం నీవెందుకు అభ్యసిస్తూ వుండాలి. యుద్ధం నాడు కదా కావలసింది. అభ్యాసం లేకపోతే హఠాత్తుగా యుద్ధంలో జ్ఞప్తికి రాకపోవచ్చును. అందుకోసమే గా నీవు శస్త్రాస్త్రమంత్ర విద్యను ప్రయోగోప సంహారాలతో నిత్యమూ జపిస్తూ వుంటావు. ఈ విషయమూ అంతే బ్రతికి నన్ని రోజులు తింటూ తిరుగుతూ స్వేచ్ఛగా కాలం గడిపి చచ్చే సమయంలో దైవనామస్మరణ జ్ఞప్తికి రావాలంటే రాదు. అందులో మరణ సమయం అత్యంత భయంకరమైనది.

ఇంద్రియాదులు పరవశమౌతవి బుద్ధివికలమై పోతుంది. వాని చిత్తం వాని స్వాధీనంలో ఉండదు. పరిస్థితి అట్లుండునప్పుడు చేయవలసిన పని ఏమందువా

శ్లో ॥ తస్మాత్సర్వేషుకాలేషు - మామనుస్మర యుధ్యచ
మయ్యర్పిత మనోబుద్ధి - మామేవైష్య సంశయ:

ఈ శ్లోకం ఎనమివదవ అధ్యాయంలో 7వ శ్లోకం అర్జునుని నిమిత్తంగా చేసుకొని యావత్ప్రపంచమునకు మానవకోటికి భగవంతుడు సందేశమిస్తున్నాడు. ఈ కారణము వలన నీవు సర్వకాల సర్వావస్థల యందును నన్నే అనుస్మరిస్తూ నీ కర్తవ్యమగు యుద్ధాన్ని ఆచరించు నీ మనోబుద్ధులను నాకే సమర్పించుము. నన్ను చేరగలవు సంశయము లేదు. పరీక్షలలో విద్యార్థి నెగ్గాలంటే ప్రతినిత్యం శ్రద్ధగా పఠించవలసి వుంటుంది. పరీక్షల సమయంలో చూసుకోవచ్చు ననుకుంటూ తక్కిన దినాలంతా తాత్సారం చేస్తూ సినిమాలు షికార్లు చేస్తూ వుండేవాడు.

పరీక్షలలో ఉత్తీర్ణుడు కాలేడు గదా, అట్లే మరణకాలంలో భగవస్మరణ కలగాలంటే అనుదినం సాధన చేయాలి మొత్తం జీవితంలో యే సంస్కారం బలిష్టంగా వుంటుందో అదే మరణకాలంలో వచ్చి ఎదురుగా నిలుస్తుంది. మరణ సమయం పరీక్షా ఘట్టం సర్వకాలం నన్నే స్మరిస్తూ యుద్ధం చేయమన్నాడు. యుద్ధం జరిగింది 18 పదునెనిమిది రోజులే కదా. ఆ పదునెనిమిది రోజులే స్మరించమని చెప్పలేదు. సర్వకాలం స్మరించమన్నాడు శ్రీకృష్ణుడు. నన్ను స్మరిస్తూ యుద్ధం చేయమన్నాడు. మరి పదునెనిమిది రోజులేనా అంటే కానే కాదు. సర్వకాలం యుద్ధం చేయాలి ఆ యుద్ధం కురుక్షేత్రంలో యుద్ధం కాదు, మానవుడు ప్రకృతితో సాగించే నిత్య పోరాటమే యుద్ధం, మన సంసారమే కురుక్షేత్రం మన హృదయమే కురుక్షేత్రం. ఇందులో ఎప్పుడూ యుద్ధం జరుగుతూనే వుంది. వెయ్యేల మనం చేసే పనిపాటలూ, యుద్ధాలే ఇవి జీవిత మంతా జరిగే యుద్ధాలు. ఇవి చేస్తూ భగవంతున్ని స్మరిస్తూ వుండాలి.

గోపికలు కామంతో, కంసుడు భయంతో, శిశు పాలాదులు వైరంతో యాదవులు బంధుభావంతో, పాండవులు ప్రేమతో, నారదాదులు భక్తితో బ్రహ్మజ్ఞానులైన మునులు ఆత్మభావంతో భగవంతున్ని స్మరించి ధన్యులైనారు. ఏదో విధంగా భగవస్మరణ జరిగిందంటే మానవుడు కృతార్థుడైపోతాడు. నిరంతర స్మరణ జరగాలంటే చిత్తశుద్ధి తప్పనిసరి అవసరం.

ఆ చిత్తశుద్ధి సిద్ధించే కోసం స్వధర్మ పరిపాలనం, కర్తవ్యాచరణం సూచింపబడినది యుద్ధమని చెప్పడం ఆ కర్తవ్యపాలన గూర్చే – లోభి ధనాన్ని స్మరించినట్లు కాముకుడు కామినిని స్మరిస్తున్నట్లు – సాధకుడు యే యే పనులు చేస్తున్నా ధ్యేయ వస్తువుని చింతిస్తూనే ఉండాలి.

పతివ్రతాంగన తాను ఆయా గృహ కృత్యాలు చేస్తున్నా పతిని స్మరిస్తూనే ఉంటుంది. తన పతి భక్తికి తాను చేసే పనులు అడ్డురావు పనుల పాలిటి పనులు జరుగుతూ యుంటవి. దైవనామ స్మరణపాటికి అదీ జరుగుతూ యుంటుంది. ఇలా కాకుండా ఒక స్త్రీ పని పాటలు వదలి తలుపులు బంధించుకొని పతి పతి పతి అంటూ జపం చేసుకుంటూ కూర్చుంటే ఈమెకేదో పిచ్చి పట్టిందని పిచ్చాసుపత్రికి తీసుకుపోతారు. అలా కాకుండా ప్రతి సమయంలోను ప్రతి పని చేస్తున్నా మదిలో దైవనామ స్మరణ చేస్తూ పని చేయువాడు నిత్యముక్తుడు, చరితార్థుడు.

ఇలా చేయడం మొదట కొంచెం కష్టమే ఎట్లనగా కొత్త పూజారి మంగళహారతి చేయునపుడు గంటమోగితే హారతి తిరుగదు, హారతి తిరిగితే గంటమోగదు. ఇది ప్రారంభ దశ కొద్దిగా అనుభవమైతే గంట మ్రోగుతుంది. హారతి తిరుగుతుంది. అలాగే మనకూ మొదట కొంచెం కష్టం కావచ్చు. సాధన చేత ఈ పని సులభంగా చేయవచ్చును. అప్పుడు మన జీవితం మేళతాళాలతో కలిసిన సంగీతంలాగా జీవితం దివ్యంగా శోభిస్తుంది.

భగవంతుడు నీ మనోబుద్ధులు నాకు సమర్పించమంటూ ఆదేశిస్తున్నాడు. అవి సమర్పించకుండా పూవులు, పండ్లు, టెంకాయలు ఆకుపూజలు కాదు, పూలు, పండ్లు, టెంకాయలు దేవునికి ఇచ్చి నాకు పుణ్యము ఇవ్వమంటే అది యెట్లు సంభవం. ఒకవేళ ఆ పుణ్యమేదో ఆ చెట్లకు లభిస్తుంది కాని మధ్యన నీకెందుకు. కొందరైతే ప్రక్కింటిదొడ్డిలోనివో వేరే వారి తోటలోనివో దొంగిలించి తెచ్చి దేవునికి అలంకరిస్తుంటారు. వాటిని తీసుకొని నీకు భగవంతుడు పుణ్యం ఇస్తాడా! అసలు ఆ ఇచ్చే వస్తువులు ఆ పూలు టెంకాయలు అన్నీ ఆయన సృష్టించినవే కదా. ఆయన వస్తువులు ఆయనకిస్తే ఆయనకేమి సంతోషం కలుగుతుంది. నీకు పుణ్యం వచ్చుటకు నీ వస్తువులు నాకేమిచ్చావు

గనుక.  అందుకే నీ మనోబుద్ధులను భగవంతునకు సమర్పించినట్లయితే అట్టివానికి ఇహంలో భగవంతుని నిష్ఠ పరంలో భగవత్ ప్రాప్తిని అందివ్వగలనని ఆ గీతాచార్యుడు ఘంటా పథంగా చెబుతున్నాడు.

మరణ సమయంలో భగవంతుని స్మరణ కావాలంటే అభ్యాసయోగం కావాలంటే అన్యచింతనలను వదలాలి.  అభ్యాసమొక యోగం.  ఈ అధ్యాయానికి " అభ్యాస యోగ మనే పేరును కలదు " జీవితాన్ని వశవర్తిగా నడుపుకోగల్గినవారు మరణాన్ని సైతం వశవర్తిగా మలుచుకోగల్గుతారు. " జీవితానికి ఆధారం మరణాని కొక స్మరణం.  అలా వుంటే శాంతితో బ్రతికి శాంతితో మరణించి పరమాత్మునితో వారు కలిసిపోతారు.  ఒక భక్తుడిలా కోరినాడు

శ్లో ॥ అనాయాసేన మరణం – వినాదైన్యేన జీవనం
దేహాంతే తవ సాన్నిధ్యం – దేహిమే భక్తవత్సల

అంటూ దైవాన్ని కోరినాడంట.  కృష్ణుడా విధంగ భగవన్నామ స్మరణ గూర్చి చెబుతూ వుంటే

అర్జును డంటున్నాడు " దేవా నీవేమో బ్రహ్మాండంగా చెబుతున్నావు మనస్సు హృదయంలో చేర్చమంటావు.  ఇంద్రియాలను సంయమనం చేయమంటావ్ అంతటి సావకాశం నాకెక్కడిది.  ఈ యుద్ధంలో నాకు మృత్యు గంటయెపుడు మ్రోగుతుందో చెప్పగలమా నా మాటే కాదు మీరు చెప్పినది ఎంత మందికి అనుకూలిస్తుంది పుణ్యపురుషులకు సుఖ పురుషులకు ఆ అవకాశాలు అనుకూలించునుగాని కష్ట జీవులకు దరిద్రులకు ఈ ధ్యానం ఇవన్నీ యెలా అనుకూలించును.  యోగాభ్యాసం ఆహార విహారాదులలో అనుకూలాలుండాలి ఏకాంత ప్రదేశం కావాలి స్వామీ ఈ ఆత్మ జ్ఞానం అంతసులభంగా అలవడునా

ఈ ఆత్మ జ్ఞానం కూడా సుఖపురుషులకేనా దీనులగతి దిక్కులేని వారి గతేమి కావాలి అంటూ అర్జునుడు మొరపెట్టుకోగా

శ్రీకృష్ణుడు అర్జునా చాలా బాగా అడిగినావయ్యా నా స్థానం యెప్పుడూ తెరువబడే యుంటుంది. కానీ రావాలనే కోర్కెవుంటే చాలు అల్పులను గొప్పవారినీ చేర్చుకుంటాను. భయపడవలసిన పనేమీ లేదు. సులభోపాయం చెబుతున్నా శ్రద్ధగా విను అనన్య చిత్తంతో నిత్య యుక్తుడై సతతమూ నన్ను స్మరించితే చాలు. అతడు ఎక్కడ దేహం వదలనీ ఏ విధంగా వదలినా వారు నన్ను చేరుతారు. నన్ను మరువని వాణ్ణి నేను మరువనయ్యా మీ నుండి నేనేమీ కోరడంలేదే మీ చిత్తాన్ని ఇవ్వమంటున్నాను మనుష్యుడు తన చిత్తాన్ని ఎవరికో ఒకరికి ఇచ్చే వున్నాడు. కొందరు భార్యలకిచ్చినారు. కొందరు బిడ్డల కిచ్చినారు కొందరు ధనాని కిచ్చినారు. కొందరు పేరు ప్రతిష్టలకిచ్చినారు. భగవంతుడనైన నాకివ్వాలంటేనే పెద్ద ప్రళయం. మానవ జన్మ తరించాలంటే అంత తేరగా వచ్చిందా, పడవ ఎట్లు తిరుగుతున్నా దిక్సూచి ఉత్తరం వైపే చూచినట్లు మీరేమి చేస్తున్నా మీమనస్సు నామీదుంచు అర్జునా నీవు తరించగల్గుతావు.



# శ్రీ భగవద్గీత

# తొమ్మిదవ అధ్యాయము

# రాజవిద్యా రాజగుహ్యా యోగము

శ్రీకృష్ణుడు తెల్పే రాజగుహ్యాయోగం వినాలని తొందర పడుతున్న అర్జునునితో అంటాడు భగవంతుడు. అర్జునా ఇది రాజవిద్య ఇది ధర్మబోధ ఇది సులభ సాధ్యము కూడా. ఇది పవిత్రం. ఈ విద్య తెలిసిన వారికి వేరే విద్యలు నేర్వవలసిన పని లేదు. అసలు రాజవిద్య అని పేరు ఎందుకొచ్చిందంటావేమో, ఇక్ష్వాకుడు జనకుడు అశ్వపతి అజాత శత్రువు మొదలగు రాజు లెందరో జన్మ చరితార్థం చేసుకున్నారు. పైగా చెప్పే నేనూ రాజును, వినే నీవు రాజువు అలాగని రాజులకు మాత్రమేనని అనుకోవద్దు. యీ విద్యను అనుభవించుటకు అందరూ అర్హులే. వేరే వేరే విద్యల ద్వారా భుక్తి లభించునేమోగాని, ముక్తి మాత్రం లభించదు, పైగా అహంకారం పెరుగుతుంది. యీ రాజవిద్య నభ్యసించిన వానికి అహంకారమే ఉండదు.

పైగా లౌకిక విద్యలు ఎన్ని నేర్చినా ఇంకా మిగిలే ఉంటాయి. నారదుడు అరవై నాల్గు విద్యలు నేర్చి ఆత్మశాంతి కరువై సనత్కుమారు నాశ్రయించి ఆత్మ విద్య నభ్యసించి సంతృప్తి జెందినాడు. కోటి జన్మలలో చేసుకున్న పుణ్య ప్రభావంతో శాస్త్రాచార్య వాక్యాలయందలి శ్రద్ధా గౌరవాలతో ఏ ఒకానొక అదృష్టవంతునకో లభించగలిగేది కాబట్టి యీ విద్య రాజగుహ్యం. అర్జునా మానవుని పవిత్రం చేసే సాధనాలు అనేకములున్నవి. జలము సూర్యుడు అగ్ని గాలి గంగ ఇవి తాత్కాలికంగా పవిత్రం చేయగలిగేవే గాని సంపూర్ణంగా పవిత్రం చేయలేవు. తాత్కాలికంగా పాపాలు పోయినా పాపవాసనలు పాపబుద్ధులు మిగిలే ఉండును. మళ్ళీ పాపాలు రాకుండా కాపాడలేవు.



**ఎవరైనా నిన్ను మోసగించినారంటే అది వానికి సిగ్గు చేటు. రెండుతూర్లు మోసగిస్తే అది నీకు సిగ్గుచేటు.**

యీ జ్ఞానం ఉత్తమమైనది. రామనామము ముందు రత్నాలహారమెంత. యీ రాజవిద్యను ధరించుట ఎంత కష్టమోనని భయపడుచున్నావేమోకాని, శరీరానికి క్లేశం యేమీ లేకుండా సులువుగా సంపాదించవచ్చు అలాగని అనాయాసంగా లభించినది అల్పమేమో. త్వరలో నశిస్తుందేమోనని నిరుత్సాహపడవద్దు. యీ జ్ఞానం లభించాలే గాని అది సిద్ధించిన తరువాత యీ సిద్ధికి చలనం లేదు. సుఖలభ్యమయ్యాక సుస్థిరమైనది కర్మలూ కర్మ ఫలాలు నశించిపోతాయి జ్ఞానమూజ్ఞానఫలమూ నశించేది కాదు.

అజ్ఞాన కారణం వల్ల మానవులు యీ జ్ఞాన విద్య నభ్యసించుటకు ప్రయత్నం చేయక పోవటమే వారు నన్ను పొందలేక సంసార చక్రంలో పడి నలిగి చస్తున్నారు. ప్రపంచంలో అన్నీ ఉన్నాయి. శ్రద్ధ లేనివారికి యేమీ లేవు. అశ్రద్ధయే పెద్ద శని. "శ్రద్ధావాన్ లభతే జ్ఞానం " జ్ఞానం శ్రద్ధ వల్లనే కలుగుతుంది. ఖట్వాంగుడు 3 ఘడియలలో మోక్షం పొందాడు. ఏకలవ్యుడు శ్రద్ధకు సజీవమూర్తి. శ్రద్ధ కలవాడే మోక్షం పొందగలడు. అన్ని సిద్ధులకు శ్రద్ధ తాళంచెవి వంటిది, మానవునకు అల్పస్వల్ప విషయాలలో ఉండే శ్రద్ధ ఆత్మోద్ధారకం యందు లేదు. పైసా పోతే ప్రపంచమంతా గాలిస్తాడు. ఆత్మను పరమాత్మను పోగొట్టుకుంటే చీమ కుట్టినంతైనా లేదు. అర్జునా ఈ విధంగా సర్వార్పణ భావంతో ప్రవర్తిస్తే నీకు కల్గే ప్రయోజనాన్ని విను, శుభాశుభఫలాలకు కారణమైన కర్మబంధాల నుండి నీవు విముక్తుడవు కాగలవు. అంతేకాదు సన్యాసి యోగ యుక్తాత్ముడనే బిరుదు నీకు లభిస్తుంది. చివరకు నీవు నన్నే చెందుతావు.

పరమేశ్వరార్పణముగా ఫలాన్ని వదలుట సన్యాసమని, కర్మలని ఆచరించుట యోగమని చెప్పబడుతుంది. అతని అంత: కరణలో యీ రెండు సమన్వయమే కాబట్టి అతడు సన్యాసయోగ యుక్తాత్ముడనబడినాడు.

కావుననే కర్మబంధాల నుండి, జీవించి ఉండగానే విముక్తుడైనాడు, చివరకు దేహాన్ని వదలి పరమాత్మలో విలీన మౌతాడు.

స్వామీ ఓ చిన్న సంశయం అనన్య భక్తులను మాత్రమే రక్షించి భక్తులు కాని వారల రక్షింపక పోవడం ఒకరియందు ప్రేమ ఒకరి యందు నిరాదరణ నీవంటి దేవ దేవుని కెందుకు. తల్లికి ఎందరు పిల్లలు ఉండిన అందులో మంచివాణ్ణి చెడ్డవాన్ని అందరినీ సమానంగానే చూస్తుంది కదా. మీరు అలా ఎందుకు అందరినీ రక్షింపకూడదు. అని అర్జునుడు ప్రశ్నింపగా

భగవంతుడంటున్నాడు. అర్జునా నేనే సర్వభూతాలకు సమానుణ్ణి నాకు ప్రియుడు లేడు. అప్రియుడు లేడు. ఎవరు నన్ను భక్తితో భజిస్తారో వారు నాయందున్నారు వారిలో నేనున్నాను. అన్ని వ్యత్యాసాలు నామరూప పదార్థాలలోననే గాని పరమాత్మలో లేవు పరమాత్మ అన్ని భూతాలలో సమానంగా ఉన్నాడు. నామరూపాలు మాయ యొక్క అంశాలు. అర్జునా భక్తుడు నాకు సర్వం సమర్పిస్తున్నాడంటే నాకేమో ఉపకారం చేస్తాడని కాదు దానివల్ల వాడే ఉద్ధారకమైపోతాడు నాకొకడు యిష్టుడుగాని అయిష్టుడు గాని కాదు.

అర్జునా నన్ను చేరుటకు ఎట్టి వారికైనా అవకాశముంది ఎట్లనగా విను. వాల్మీకి వంటి పరమ దురాచారులు గాని అనన్యభక్తితో నన్ను సేవించినచో అట్టివారు త్వరలో పాప విముక్తులై సాధుకోటిలో వినుతింపబడ్తారు. గతంలో యెట్లున్నా ఇప్పుడు మంచి నిశ్చయంతో నా భక్తులైనచో ఉద్ధరింపబడ్తారు. దురాచారులైన పాపాత్ములు కూడా ఉద్ధారకమైపోతారు. ఇంక సామాన్యుల విషయం చెప్పేదేముంది. దురాచారాలకు భక్తి కలుగదు. ఏదో కారణంతో పూర్వ పుణ్యంతో సత్సంగ ప్రభావంతో ఈశ్వరాను గ్రహంతో ఉద్ధారక మగుటకు సందేహం లేదు. ఇందుకు వాల్మీకే మనకాదర్శము నిదర్శనం.

పార్థా స్త్రీలు కాని పురుషులు కాని పాప సంభూతులు కాని మరెట్టి వారైనా నన్నా శ్రయించినచో ఉత్తమగతిని పొందుదురు. పరమార్థ జ్ఞానాన్ని భక్తిని సంపాదించేందుకు అవకాశం లేని వారే పాపులు. అట్టి వారు కూడాయేదో విధంగా భగవంతుని ఆశ్రయిస్తే వారి పరిశ్రమతోనే వారు కృతార్థులు కాగలరు.

అర్జునా ! నీ మనస్సును నాయందే ఉంచు. నీళ్ళకు వలె మనస్సుకు ఏక రూపం అంటూ లేదు. నీళ్ళు యే రంగులో కలిపితే ఆ రంగై పోయినట్లు, అలాగుననే మనస్సుకూడా ఏ రూపంలో చేర్చితే ఆ రూపం అవుతుంది. అప్పుడది మనస్సు నీది కాక నాది అవుతుంది. కనుక పార్థా నాకు భక్తునివిగా. ప్రపంచంలో ప్రతివాడూ ఏదో ఒక వస్తువుకు భక్తుడయ్యే యున్నాడు. జడవస్తువులకు భక్తి పెట్టి ఉన్నాడు అతడూ జడమై పోతున్నాడు. ప్రేమించవలసిన వస్తువును ప్రేమిస్తే ఉపయోగం ఉంది కానీ, జడవస్తువుల ప్రేమిస్తే ఫలమేమి ఉంటుంది. కనుక చైతన్య స్వరూపుడనైన నాకు భక్తుడివిగా. అన్ని రూపాలలో నేను ఉన్నానని సదా సర్వత్రా నన్నే పూజించు.

యీ రాజవిద్యా రాజగుహ్య యోగంలో అన్నింటా అంతటా నిండినిబిడీ కృతమైన పరమాత్ముడనునేననే పరమార్థాన్ని బోధించాడు భగవానుడు.



# శ్రీ భగవద్గీత
# పదవ అధ్యాయము
# విభూతి యోగము

ఇందులో విశేషం ఏమనగా విభూతులగూర్చి బోధిస్తున్నాడు. మొత్తం విశ్వజగత్తు భగవద్విభూతియే అయినా విశేషించి అందులో కొన్నింటిని ప్రత్యేకంగా తెలుపుచున్నాడు. ప్రపంచంలో శ్రేష్ట నికృష్ట వస్తువులన్నీ భగవద్విభూతులు కావు. అందులో వేటిలో తేజస్సు బలము, ఐశ్వర్యము విద్య శక్తి కాంతి ఎక్కువ విశేషంగా ఉండునో అవి దివ్య విభూతులు.

భగవంతునికి నీ అహంకారం సరిపోదు. ఒకటిని రెండు చేస్తానంటుంది నీ అహంకారం. అంతా ఒకటి చేస్తానంటాడు భగవంతుడు. ఇతరమునుండి వేరుపడే స్వభావం అహంకారానిది. ఇతరమే లేకుండా చేసేది యీశ్వరుని పని. నీలో అహంకారం తొలగిందా నీకూ భగవంతునకూ తేడా లేదు.

ఈ అధ్యాయంలో శ్రీకృష్ణుడు యాదవులలో వాసుదేవుండనేను, పాండవులలో ధనంజయుండను. మునులలో వ్యాసుండ అని బోధిస్తాడు. వ్యాసుడు ప్రథమ పురుషము. వాసుదేవుడు ఉత్తమ పురుషము. ధనంజయుడు మధ్యమ పురుషము. ప్రపంచమంతా యీ మూడు పురుషాలలో చేరిపోయింది. కనుక అంతా కృష్ణ మయం.

అగ్ని తన సామాన్య రూపంలో 'సర్వత్రా వ్యాపించి ఉంది. కనబడే ప్రతి వస్తువులోనూ అగ్ని వుంది. అగ్ని లేకపోతే వస్తువు కనబడే అవకాశము లేదు. కాని ఆ అగ్నిని విశేషరూపంలో కట్టెలలోననే చూస్తాము. పరమాత్ముని

విషయం కూడా అంతే. సర్వం వాసుదేవుడని తెలియడం కష్టం. ఆ అనుభూతి పొందిన మహాత్ముడు సుదుర్లభుడు. కనుక సోపాన ప్రాయంగా భగవంతుని విశేషరూపాలను తెలియజేయుచున్నాడు గోవిందుడు.

చూపునకు కనబడే ప్రతి వస్తువులో భగవంతుని చూస్తూ రా? అలా చూడగలిగితే ఆయన అనుగ్రహించి తన చూపునిస్తాడు. అదే దివ్యదృష్టి చూపే భగవంతుడయినప్పుడు చూడబడేదంతా భగవంతుడే. యీ అనుభూతే పదకొండవ అధ్యాయంలో విశ్వరూప సందర్శన యోగంలో నిరూపించబడుతుంది. సర్వము భగవంతుడే అను సమత్వ జ్ఞానం కలగాలంటే అంత సులువైన పనికాదు. మొదట ఉత్తమమైన వస్తువుల్లో భగవదృష్టి అవలంబిస్తూ రాగా, తర్వాత దుష్టనికృష్ట వస్తువుల్లోనూ భగవంతుని దర్శించే భాగ్యం కలుగుతుంది.

ఓ అర్జునా! నా పరమ వాక్యాన్ని మళ్ళీ విను. ఇంత వరకు ప్రీతితో భక్తితో విన్నావు కాబట్టే నీకు మళ్ళీ మళ్ళీ చెప్పాలనే అనిపిస్తున్నది. నీ మాటలు వింటే నాకేమి లాభమంటావేమో, "గురుబుద్ధిర్విశేషత:" గురు వాక్యాలు శిష్యునకు హితాన్ని కలిగిస్తాయి. ఇంకా జన్మసంసార దు:ఖ నివృత్తి. ఓ కృష్ణా ! నేనింత వరకు నీ వల్ల చాలా విశేషాలు విన్నాను. అంతేగాక వ్యాసుని వల్లను నారదుని వల్లను అనేకానేక మహర్షుల వల్లను అనేక ధర్మాలు విన్నాను కదా! ఇంకా వినగల్గుతాను. దేవలోకానికి పోవాలనుకున్నా అవలీలగా వెళ్ళగలను. అక్కడ దేవేంద్రాది దేవతల వలన కూడా నీ స్వభావాన్ని, నీ ప్రభావాన్ని గురించి వినగల్గుతాను. ప్రయాస తీసుకొని నీవుగా బోధించవలనసిన పనేముంది" అని నీవు భావిస్తావేమో విను.

'సురేంద్రకుమారా ! నా ప్రభావాన్ని దేవతలెరుగ లేరు. మహర్షులు

తెలియలేరు. దేవతలు దివ్య ఐశ్వర్యము అపారవైభవము కలవారు కావచ్చు. మహర్షులు మంత్రద్రష్టలు సిద్ధి సంపన్నులు అయివుండవచ్చును. అయినా, నా విభూతి విస్తారాన్ని వాళ్ళు తెలియలేరు. అంతేకాని ఆత్మస్తుతి చేసుకొనే అలవాటు వుండి చెప్పుతున్నానని తలంచవద్దు. దేవతలకు శక్తి ఉండి చెప్పుతున్నానని తలంచవద్దు. దేవతలకు శక్తి ప్రధానం చేసింది నేనే. ఋషులకు జ్ఞానశక్తిని కల్గించింది నేనే. జ్ఞానం ప్రదానం చేసింది నేనే. నేను యిచ్చిన తెలివితో వారు నన్నేమి తెలుసుకుంటారు. ఊహించు. అశ్వత్థామ రుద్రాంశతో పుట్టినవాడు. మహాశక్తి సంపన్నుడు. ఒక పర్యాయం నా వద్దకు వచ్చాడు. వచ్చి స్వామీ, నా బ్రహ్మాస్త్రము నీకు ఇస్తాను నీ చక్రము నాకివ్వండి అని అడిగాడు. అప్పుడు నేను బదులు ఎందుకయ్యా! ఫ్రీగా ఇస్తాను తీసుకు పొమ్మని చక్రమునివ్వగా చక్రాన్ని కదిలించలేక పోయాడు. నేను అలా సంకల్పించాను. అలాగే జరిగింది. వారికి శక్తిని జ్ఞానాన్ని యిచ్చింది నేనే. నేనిచ్చిన జ్ఞానంతో నన్ను వాళ్ళు తెలుసుకోగల్గుతారా? అందుకే నా మహిమను నేనే చెప్పుకోవలసి వచ్చింది. తండ్రి ఆదిని తనయుడు తెలుసుకోగల్గుతాడా, అచేతన వస్తువును సృష్టించి అచేతనంలో చేతనాన్ని చేర్చి ఆడించే సూత్రధారిని నేను.

తాను పరమాత్మ స్వరూపమై వుండి దేహము తాననుకోవడము కంటే పాపం వేరే కలదా, మోహక్షయమే మోక్షం. పాపపరిహారానికి రెండు మార్గాలలో కూడా పూర్తి పరిహారం జరుగదు. గంగాస్నానంతో పాపాలు పోతాయని పురాణ వాక్యం. పాపాలు పోతే పోవచ్చు కాని పాప బుద్ధి పోదు. అజ్ఞానం పోదు. ఎముకలను పట్టుకొని ఎన్నిసార్లు మునిగినా మైలపోతుందా. దేహమనే పెద్ద ఎముకను నేను నాది అని కౌగిలించుకొని ఎన్ని ప్రాయశ్చిత్తాలు చేసుకొంటే

మాత్రం పాపానికి పూర్ణ నివృత్తి ఉందా. పాపాలకు మూలమైన అజ్ఞానము భ్రాంతీ పోతేగాని పాపాలకు పూర్ణ నివృత్తి లేదు కావుననే ..

నేను బుద్ధిమంతుడనంటూ ఎవ్వడూ అహంకరించ వలసిన పనిలేదు. భగవంతుని సమష్టిబుద్ధిలో ఒక అంశము వానికి లభించినది. మూఢుడైనవాడు యీ వాస్తవాన్ని గ్రహించలేక పోతున్నాడు. పవర్ హౌస్‌లో కరెంటు ఉంటే నీవు స్విచ్ వేసినప్పుడు లైటు వెలుగుతుంది. అసలు కరెంటే లేకపోతే లైటు ఎలా వెలుగుతుంది. భగవంతుని అనుగ్రహం ఉంటేనే మానవుని ప్రయత్నాలు తెలివి తేటలు ఉపయోగపడేది. ఇతరులు నిందించినా ఆక్షేపించినా బాధించినా ఎట్టి పరిస్థితుల్లో కూడా వికారము చెందని స్వభావాన్ని "క్షమ" అంటారు. అసమర్థుని క్షమ క్షమ అనిపించుకోదు. దుర్బలునికి క్షమ ఉండదు. బదులుకు బదులు చేయగలిగే సామర్థ్యం ఉండికూడా సహించుకోవటాన్ని క్షమ అంటారు. " చెల్లి ఉండియు సైరణ చేయు నతడు" అని భారతంలో విదురనీతిలోని నీతి. సుఖము భగవంతుని నుండి వచ్చేదే, దు:ఖమూ భగవంతుని నుండి వచ్చేదే. సుఖమిచ్చి కొందరిని దు:ఖమిచ్చి కొందరిని బాగుచేస్తాడు భగవంతుడు. వివేకంతో విధానం తెలిసి ఉపయోగించుకుంటే విషంకూడా అమృతంలా ఉపయోగ పడుతుంది. సుఖంవలె దు:ఖం కూడా భగవంతుడిచ్చిన సంపదే. మంచి దేవుని నుండి వస్తుందని చెడుగ్రహాల నుండి చెడు వస్తుందని చాలామంది అభిప్రాయపడుతూ ఉందురు. మన వైదిక సిద్ధాంతంలో అంతా భగవంతుని ప్రసాదమే.

ఒక పిల్లవాడు రాయితో కుక్కను కొట్టాడు. అది రాతిని చూచి మొరగదు. రాయివేసిన వానివైపు చూసి మొరుగుతుంది. అంతమట్టుకు వివేకమైన మనకుండ వలదా. పైన పడిన సంకటాన్ని చూసికాక, సంకటాలు పంపిన

పరమాత్మను చూసి మొరపెట్టుకోవాలి. భూలోకంలో పుట్టడమూ ఒక విభూతే. చావడమూ ఒక విభూతే. బాల్యమూ విభూతే, యవ్వనమూ విభూతే, సన్యాసమూ విభూతే. పెండ్లిలో దేవతా సమారాధనము, చావులో వైకుంఠ సమారాధనము. “భయంచాలా భయమే! భయమూ అభయమూ రెండూ దైవ ప్రసాదాలే ఆని అనుభవించాలి.

విషయ భోగాలు యెంతకాలం ఉన్నప్పటికీ యేదో ఒకనాడు అవి వదిలిపెట్టి పోవడం తప్పదు. అయితే వాటికవి వదిలిపెట్టి పోయేదానికి స్వయంగా తాను మనస్ఫూర్తిగా వదిలే దానికి అపారమైన భేదం ఉంటుంది. అవి వదిలిపోతూ వీని మనస్సును తపింప జేస్తాయి. వీడే వదిలాడా అనంతమైన యోగసుఖం దక్కుతుంది. అర్జునునికి భగవంతుడు ఇంతవరకు ఆధ్యాత్మిక విభూతుల గూర్చి తెల్పి “ అవన్నీ నా విభూతులే ” అని కూడా తెలియజేశాడు. ఇప్పుడు ఆదిదైవిక విభూతుల గూర్చి తెలియ జేస్తూ సమస్తానికి తానే ఆదిపురుషుడనని తెలియజేయు చున్నాడు.

ధనంజయా నా ఈ విస్తారమయిన విభూతిని వివిధ రూపాలతో ప్రకటమైన నా అఘటన ఘటనా పటుత్వమయిన నా యోగమాయను సమ్యగ్ దృష్టితో తెలుసుకున్నవాడు అవికంపయోగాన్ని అధిష్టించగల్గుతాడు. యీ చరాచర ప్రపంచమంతా భగవంతుని విభూతులేయని ఆయన సంకల్పానికి భిన్నంగా అన్యమేదీ లేదని తెలుసుకున్నవారికి నిశ్చల యోగం సిద్ధిస్తుంది. యోగమనగా “సమత్వమే యోగము” విషమత్వమే రోగము ” నామరూప దృష్టి విషయ దృష్టి ” వస్తు దృష్టి సమదృష్టి.

విభూతి ద్వారా విభూతినాయకుడు గుర్తింప బడ్డాడు. ప్రపంచమంతా అతని విభూతే. దేవా నీ విభూతులకు లెక్క లేదు. ఆకాశంలోని చుక్కలను

లెక్కపెట్టవచ్చు. సముద్రంలోని నీటిని బొట్టుబొట్టు లెక్కపెట్టవచ్చునేమో కానీ, అగణితంగా ఉండే నీ విభూతులను గణించడం శక్యం కాదు. యేవిభూతులతో నిన్ను ఉపాసించేందుకు వీలౌతుందో ఆ ఉపాయాన్ని నాకు ఉపదేశించు అంటూ, అర్జునుడు ప్రార్థించగా కృష్ణుడు చెబుతున్నాడు. కురుశ్రేష్టా! నీవు కోరినట్లు నా దివ్యమైన విభూతులలో ముఖ్యమైన వాటిని బోధిస్తాను. నా విభూతులు అనంతమైనవి వాటిని వివరించి చెప్పాలంటే ఆదిశేషునకు, సరస్వతికి కూడా సాధ్యం కాదు అని కృష్ణుడు తెల్పగా, అర్జునుడు అడుగుచున్నాడు.

ఓ యోగినాథా నేను నిన్ను సదా ధ్యానం చేయాలని వుంది. కనుక నీ యోగమునూ, నీ విభూతులనూ విశదీకరించుతూ మళ్ళీ తెల్పాలని వేడుకుంటున్నాను. నీ అమృతవాక్యాలను నీ ముఖత: ఎంతవిన్నప్పటికీ నాకు తృప్తి కలగడము లేదు. సర్వాంతర్యామివైన నీ విభూతి సమస్తంలో వ్యాపించివుండే మాట నిజమే కానీ, అందులోనూ విశేషంగా నీ శక్తి ప్రకటితమైన స్థానాలను విస్తారంగా నాకు బోధించి శిష్యుడనైన నన్ను శిక్షించి, రక్షించు అంటూ అర్జునుడు ప్రార్థింపగా భగవంతుడంటున్నాడు. అర్జునా నా విభూతులలో మొదటిది ఆత్మని, ఆత్మ నీ ఇంట్లో వుండే వారి ఆత్మ. నీలో దేవున్ని చూడు, నీ ఇంట్లో దేవున్ని చూడు, తర్వాత బైట దేవున్ని చూడు. ఆర్య సంస్కృతి ఇంటితోనే మొదలవుతుంది. మన వాళ్ళు దేవుడంటే కండ్లు మూసుకుంటారు. దేవున్ని నీలోని ఆత్మగా చూడాలని అర్థం. ఇతర మతస్థులు దేవుడు అంటే ఆకాశం వైపు చూస్తారు. భగవంతున్ని పరోక్షంగా చూచేది వారి పద్ధతి, అపరోక్షంగా చూచేది మన పద్ధతి. నేను అన్నప్పుడు మనం హృదయం వైపు చూస్తాము. అనగా పరమాత్మ నేను అని చెప్పడమే. నా విభూతులలో అతి ముఖ్యమైనవి మాత్రమే చెబుతున్నాను శ్రద్ధగా విను.



**సంతోషంగా గడిపిన రోజు మంచి నిద్ర వస్తుంది. సంతోషంగా గడిపిన జీవితం మంచి మరణాన్ని ఇస్తుంది.**

వేదాలలో సామవేదం నేను, దేవతలలో దేవేంద్రుడను నేనే, ఇంద్రియాదులలో మనస్సు నేనే అక్షరములలో ఓంకారము నేనంటూ అన్నింటిలో శ్రేష్ఠమయిన వాటిని గురించి చెబుతున్నాడు. అవి అందరికీ తెలిసిన విషయమే గనుక క్లుప్తంగా ముగించుకుందాము.

అర్జునా ! బుద్ధిమంతునికి ప్రతి మెతుకూ పట్టుకొని చూసే పని ఉండదు. వెయ్యి మాటలెందుకు ఏదేది వైభవయుక్తమై ఉందో, ఐశ్వర్య యుక్తమై ఉందో, ఏది కాంతివంతమై ఉందో ఆ ప్రతి వస్తువూ నా తేజస్సులోని ఒకానొక అంశమేనని గ్రహించుము. అర్జునా అది ఇది అననేల మొత్తము యీ జగత్తు అంతా ఒకానొక అంశంలో ఇమిడివుంది. నా స్వరూపమే దీనిని మించి మరెంతో మిగిలి యున్నది. యీ వాత్సల్యామృతవర్షిణి భగవద్గీతామాత మనందరను మన్నించుగాక, లోకం సుసంపన్న మగునుగాక.





ఇతరుల లోపాలు ఎత్తి చూపే ముందు నీ లోపాలు నీవు తెలుసుకో.

# శ్రీ భగవద్గీత

# పదకొండవ అధ్యాయము

# విశ్వరూప సందర్శన యోగము

ప్రియ భగవద్భక్తులారా విభూతి యోగం పూర్తిచేసుకొని సమస్తమంతా భగవంతుని విభూతులే నని ఇంతవరకు చదువుకున్నాము. ఇప్పుడు విశ్వరూప సందర్శన యోగంలో ప్రవేశించే ముందు భగవంతునకు భగవద్గీతకు మరొక్కసారి నమస్కరించి ఆయన విశ్వరూపమనే అంతస్థులో ప్రవేశించుదాము.

దివ్య దృష్టి కలిగిన అర్జునునికి విశ్వమంతా, విశ్వేశ్వరుని రూపమనే అనుభవం కల్గింది. ఆ వృత్తాంతమే యీ అధ్యాయంలోని విషయము. అందువలన దీనికి విశ్వరూప సందర్శన యోగమనే పేరు కల్గింది. భగవంతుడు అనుగ్రహించి తన దృష్టిని భక్తునకిచ్చి వర్తమానం చూపించ గల్గినాడు. అన్ని దేశాలు అన్ని కాలాలు అన్ని వస్తువులు భగవంతుని స్వరూపాలే అయినా అర్జునునికి భయంకర రూపాలుగా దర్శనమిచ్చాయి. యుద్ధంలో జరిగే మారణకాండ జరుగబోతుంది గనుక భగవంతుని విశ్వరూపం భయంకరంగా కనిపించినది భగవంతుని విశ్వరూపంలో గంభీరము. శాంతము, ప్రశాంతత క్రూర, స్వభావాలు ఉన్నాయి. ప్రళయంలో క్రూర స్వభావం, సృష్టిలో గంభీర స్వరూపము ఉంటుంది. కాని ప్రస్తుతం యుద్ధ సమయం కాబట్టి కరాళకాల స్వరూప దర్శనం దర్శించగల్గినాడు. భయపడినాడు అర్జునుడు. సముద్రము చెరువులోనికి దొర్లితే చెరువుగతి యేమవుతుందో ఆగతి అర్జునునికి పట్టింది.

పరమేశ్వరా నీవు చెప్పిన దంతయు యదార్థమే అయినా చెవులారా విన్న విషయాలు కన్నులారా చూడాలని కోరిక కల్గినది. విన్నదానిని చూచినప్పుడే



మితాహారం ఎక్కువ నీరు త్రాగడం సుఖ నిద్ర మంచి నవ్వు నిన్ను డాక్టరుకు దూరంగా ఉంచుతాయి.

సంతృప్తి కలుగుతుంది. సమస్తం నేనే. నేనే సమస్తమని చెబుతున్నావుగదా! ఆ సత్యస్వరూపాన్ని చూపించి నన్ను ధన్యున్ని జేయమని అర్జునుడు ప్రార్థించుతున్నాడు. ఎందుకనగా, గురువునూ గుడ్డిగా నమ్మరాదని, వారి మహిమా గొప్పతనం తెలుసుకోవడం ముఖ్యమని మనకు పరోక్షంగా తెల్పుచున్నాడు అర్జునుడు. వినయ వినమ్రుడై చేసిన అర్జునుని అభ్యర్ధనను భగవంతుడు ఆలకించాడు ఆమోదించాడు. సామాన్య మానవ గురువులకు అది శక్యం కాకపోవచ్చు. కాని సమర్థుడైన జగద్గురువునకు శక్యం కాని పని యేముంటుంది. తన విశ్వరూపాన్ని ప్రప్రథమంగా ప్రపంచంలో దర్శించగల అధికారి ఉత్తముడు తనకు లభించాడని ఆయనకు ఆనందమెంత కల్గినదో. అర్జునా యీ చర్మ నేత్రాలతో నన్ను చూచుటకు వీలు లేదు. నీకు దివ్య నేత్రాలను ప్రసాదిస్తున్నాను. తద్వారా యీ విశ్వరూపాన్ని దర్శించు.

సామాన్య గురువులు చూపు సంపాదించుకున్నవారికి చూపిస్తారు గానీ అవతార గురువులు చూపు యిస్తారు చూపిస్తారు కూడా. విశ్వరూపాన్ని చూచినప్పుడు దుర్యోధనుడు కనుకట్టు అన్నాడు కాని, అర్జునునికి అది కనువిప్పు అయినది. మతి యెంతో గతి అంత విస్తారంగా అనేకానేకాలుగా వుండే యీ జగత్తంతా ఆ మహారూపంలో ఒక మూలలో ఉండటం చూసి ఆశ్చర్య పోయాడు అర్జునుడు. ఆ అఖండరూపము మంగళకరము ఖండత్వము అమంగళము. ఆ అఖండ దర్శనము దివ్యనేత్రంతో శక్యమైంది కాని చర్మనేత్రాలకు శక్యమయ్యేది కాదు. కురుకుల చక్రవర్తి వినమ్రుడైన సురపతి కుమారుడు శిరస్సు వంచి చేతులు జోడించి ఆ దేవదేవుని స్తోత్రం చేస్తున్నాడు. ప్రభూ నీ ఈశ్వర స్వరూపంలో స్థావరజంగ మాత్మకమైన సమస్త భూతకోట్లు కమలాసనముపై బ్రహ్మదేవుడు, ఈశ్వరుడు ఋషులు దేవతా సంఘాలు, సర్పాలు ఒకటేమిటి విశ్వచరాచర ప్రపంచమంతా ఆ భగవంతునిలో

దర్శిస్తున్నాడు అర్జునుడు. మహానుభావా! ఓ దేవదేవా! యీ నీ ఉగ్ర రూపం ఉపసంహరించుకొని నన్ను అనుగ్రహించు అంటూ అతి దీనంగా ప్రార్థిస్తున్న అర్జునునితో అనంతుడు అంటున్నాడు.

అర్జునా నీ యందు ప్రసన్నుడనై నా యోగ శక్తి ప్రభావంతో సర్వోత్కృష్టమయిన తేజోమయమయిన నా విశ్వరూపాన్ని చూపించాను. నా యీ స్వరూపాన్ని నీవు తప్ప ఇంతకు ముందెవరు చూడలేదు. అనగా తల్లి అయిన దేవకికి చెరసాలలో చూపినది, యశోదకు మన్నుతిని నప్పుడు నోటిలో చూపించినది, మధురానగరంలో అక్రూరునికి, సభా స్థలిలో దుర్యోధనునికి చూపించినవి అవన్నీ అల్పములైనవి. ఇదేమో అనంతము అయినది.

భగవద్దర్శనము వేదాలపై ఆధారపడి లేదు. అది స్వయమాధారము. అర్జునా నా భయంకర రూపాన్ని చూచి భయభ్రాంతుడవు కావద్దు. ఇదిగో నీవు కోరిన నా మొదటి స్వరూపాన్ని చూడు సంతోషించు. అనగానే అర్జునుడు పరమాత్ముని సౌమ్యమైన మొదటి రూపాన్ని చూసి దేవా నీ సౌమ్యమైన రూపం చూసి నేను శాంతి పొందాను. చిత్తము స్థిమిత పడింది. అని వినయంగా మనవి చేసుకున్నాడు. అప్పుడు భగవంతుడంటున్నాడు అర్జునా యీ స్వరూప సందర్శనం కోసం దేవతలు అహర్నిశము పరితపిస్తూ ఉందురు. అర్జునా నీ పుణ్యమే పుణ్యము నీ జన్మే ధన్యము."

అర్జునా నీవు చూచిన యీ నా స్వరూపము వేదాలు చదివినా తపస్సులు చేసినా యాగాదులు ఆచరించినా, నీకు లభించిన యీ దివ్యరూప సందర్శనయోగం ఎవ్వరికీ లభించదు. కర్మకాండల లో యజ్ఞము, విద్యలలో వేదాధ్యయనము సర్వ శ్రేష్ఠమైనవే కాని భగవత్తత్వము ఆ హద్దులను కూడా

దాటింది. వేదాధ్యయనంతో, తపస్సుతో, దానధర్మాలతో నన్ను స్వాధీనం చేసుకోవడం కష్టము. ఎందుకనగా వేదాలు నానుండి వచ్చినవే. తపస్సులలో పెద్ద తపస్విని, దాతలలో పెద్ద దాతను నేను.

అర్జునా నన్ను గురించి చక్కని జ్ఞానం గాని, ప్రత్యక్ష సాక్షాత్కారము గాని తాదాత్మ్యమైన మోక్షంగాని కలగాలంటే అనన్యభక్తి ద్వారానే కలుగుతుంది. సర్వత్రా భగవంతుని తాదాత్మ్యాను భూతి కల్గుటే అనన్యభక్తి . సకామ యజ్ఞాలతో, తపస్సులతో దేవలోక ప్రాప్తి లభిస్తుంది. అంటూ అనేక విషయాలు తెల్పిన శ్రీకృష్ణ భగవానుడు ముఖ్య రహస్యాన్ని తెలియజేయుచున్నాడు. అర్జునా నా పనులే జేయువాడై, నన్నే పరమ వస్తువుగా నమ్మి నాకు భక్తుడై అనిత్యమైన సాంసారిక సంగం వదలి సమస్త భూతములను ప్రేమించుతూ ఉండే వాడు నన్నే చేరి నేనుగానే ఉంటాడు అని సెలవిస్తూ విశ్వరూప సందర్శన యోగం పూర్తి చేశాడా దేవాధిదేవుడు.

భగవద్గీతలో అత్యంత శ్రేష్ఠమైనది అందరికీ అనుకూలమయినదీ ముఖ్యమైనదీ భక్తియోగం. యీ భక్తి యోగం అనే 12వ అంతస్థులో ప్రవేశించునప్పుడు గీతాచార్యులకు భగవద్గీతాభిమానులకు వినయంగా నమస్కరించి అడుగు ముందుకు పెడుదాము.



**శాస్త్రాలు చదివినంత మాత్రాన మనిషి వివేకి కాలేడు. గొప్ప వివేకవంతుల సహచర్యం ద్వారా అతడు వివేకవంతుడు కాగలడు.**

# శ్రీ భగవద్గీత

# పన్నెండవ ఆధ్యాయము

# భక్తి యోగం

స్వర్గంలో ఒక అమృతం ఉంది అది పుణ్యాత్ములకు దేహం వదలిన తర్వాత స్వర్గంలో లభించవచ్చు. యీ భక్త్యామృతం అలాకాదు, జీవించి ఉండగానే లభించే అమృతం ఇది ఎప్పుడో చచ్చినాక లభించే అప్పుల వ్యాపారం కాదిది. ఇప్పుడే యిక్కడే లభించేది నగదు బేరం యీ అధ్యాయం ద్వాదశాధ్యాయము. 12వ అధ్యాయము భక్తియోగం. ద్వాదశి అనగానే అందరికీ ఇష్టము. వాసుదేవునకు ద్వాదశమహామంత్రము ప్రశస్తి చెప్పవలసిన పనేలేదు. వైష్ణవ ఆళ్వారులు 12 మంది, ద్వాదశ జ్యోతిర్లింగాలు, ద్వాదశాదిత్యులు, భాగవతానికి ద్వాదశ స్కంధాలు. ప్రస్తుత భక్తి యోగంలో ప్రయాణం చేస్తున్నాము. భక్తి అంటే ప్రేమ. యీ భగవంతునిపై గల అనురాగమే భక్తి. డబ్బులు ఇచ్చి కొనేది కాదు ప్రేమ వృత్తి ప్రవాహము. చెల్లాచెదరు కాకుండా యేకోన్ముఖంగా యీశ్వరుని వైపు ప్రవహించిందంటే దానినే భక్తి అంటారు. కర్మభక్తి జ్ఞానాలలో కర్మ ఎద్దుల బండివంటిది, భక్తి రైలుబండి వంటిది, జ్ఞానము విమానము వంటిది. భక్తి మార్గము సులువైనదని పెద్దలంటారు. భక్తి అంటే ప్రేమ అని చెప్పుకున్నాము కదా! ప్రేమ లేని ప్రాణి లేనే లేదు. పులికి కూడా తన పిల్లలపై ప్రేమ ఉంటుంది. యీ ప్రేమను మోహమంటారు. బిడ్డలపై జాలువారిన ప్రేమ వాత్సల్యమంటారు. సమానులపై చూపు ప్రేమ మైత్రి అంటారు. దీనులపై ప్రేమను కరుణ అంటారు. అదే ప్రేమ భగవంతునిపై ప్రవహిస్తే అది భక్తి అని పిలువబడుతుంది. మన ప్రేమ ప్రవాహము కనబడిన ప్రతి వస్తువుపై జారి జారి చిందరవందరగా చెల్లచెదురుగా చీలికలుగ యేర్పడి

దుర్బలమై క్షీణమై హీనమై యెందుకూ కొరగాకుండా వ్యర్థమై పోతుంది.

నానా ముఖాలై భిన్న భిన్నమైన ప్రేమ ప్రవాహాన్ని అరికట్టి ఏకముఖం చేసి భగవంతునివైపు ప్రవహింపజేయాలి. నదికి ఆనకట్టలు కట్టి పొలాలను సస్య శ్యామలం చేసినట్లు, వైరాగ్యము అనే ఆనకట్ట కట్టి అభ్యాసమనే కాలువలగుండా నీటిని ప్రవహింపచేస్తే భగవత్కృప అనే దివ్యపంట పండుతుంది. అపుడే మానవ జన్మకు సార్థకత చేకూరుతుంది. భక్తుడు తప్పక జ్ఞాని కాగలడు. జ్ఞాని భక్తుడు కాక తప్పదు. భక్తి జ్ఞానాలు విడదీయరానివి.

శ్రీకృష్ణ మహానుభావా! చీటికి మాటికి ఈశ్వరుడని చెబుతూ ఉంటావే ఆయన యెక్కడుంటాడు, ఆయన అడ్రసు ఎక్కడ, ఆయన కార్యాలయం ఎక్కడ, వారి అడ్రసు చెప్పి పుణ్యం కట్టుకోండి అని అర్జునుడు కోరగా శ్రీకృష్ణుడు చెబుతున్నాడు యీశ్వరుడు భగవంతుడు కాశీలో ఉన్నాడని, రామేశ్వరంలో ఉన్నాడని, తిరుపతిలో ఉన్నాడని, శ్రీరంగంలో ఉన్నాడని, మక్కాలో ఉన్నాడనీ, మదీనాలో ఉన్నాడని, ఆకాశంలో ఉన్నాడని చెప్పలేదు. మరి యేమని చెప్పాడు " ఈశ్వర: సర్వ భూతానాం హృద్దేశేర్జున తిష్ఠతి। ఈశ్వరుడు సమస్త భూతాల హృదయాలలో ఉన్నాడు. ఆయన ప్రతివారికీ ఆత్మ స్వరూపమయ్యే ఉన్నాడు. ఆయన దివ్య దర్శనం కావాలంటే అజ్ఞానం తొలగితే, చాలు అంతటా ఉన్నాడు. జపమూ ధ్యానమూ చేయాలంటేనే మనకు కష్టం. మన మనస్సు అవలక్షణాలకు పుట్ట, శతపుటాలు వేసినా దాని చేదుచావదు. శ్రవణం చేస్తూ వుంటే నిద్దుర వస్తుంది. చీట్లపేక తెల్లవార్లు ఆడినా కంటికి కునుకు రాదు. ఏమిటీ తమాషా! ఎక్కడుంది కీలకం, ఇదంతా మనస్సు చేసే తిప్పలు, ఆటలు. సామాన్యమైన సగుణోపాసనలోనే ఇంత అద్వాన్నంగా ఉంటే ఇక నిర్గుణోపాసన మాట చెప్పేదేమిటి.

దేహాత్మ బుద్ధిలేని మహనీయులకు అవ్యక్తోపాసన సులువే గాని దేహాభిమాన వంతులకు మాత్రం అలవి కాదు దేహాభిమానాన్ని వదలుటే నిజమయిన సన్యాసం మనుష్య జన్మలో దానాలు ధర్మాలు యజ్ఞాలు యాగాలు యిష్టాపూర్వాది సత్కారాలు చేసి పుణ్యం మూటగట్టుకొని స్వర్గలోకం పోవచ్చు. అచ్చట అమృతపానం అప్సరోపభోగం నందనవిహారం కోకొల్లలుగ అనుభవించవచ్చు. ఎంతవరకు పుణ్యఫలం ఉండునో అంతవరకే తర్వాత క్షీణే పుణ్యేమర్త్యలోకం విశంతి " పుణ్య ఫలితం అయిపోయినవెంటనే మళ్ళీ భూలోకం రావలసిందే మానవ జన్మకు విలువ జ్ఞానంతోనే నని గ్రహించాలి ఆ జ్ఞానం శూన్యమైతే " జ్ఞానేనహీన: పశుభిస్సమాన:" జ్ఞాన హీనుడు పశు వుతో సమానుడు అని నీతి శాస్త్రం చెబుతుంది.

"జగతిలో మానవ జన్మంబు దొరకదు" అని మహాపురుషులు గర్జించి చెబుతున్నారు " ఉత్తమ జన్మమురా " అని హరిదాసులు ఉల్లాసంగా పాడుతున్నారు. ఆ గొప్పతనం దేనితో వచ్చింది ధనంతోగాదు బలంతో కాదు ప్రతాపంతో కాదు " జ్ఞానంతో ఆత్మజ్ఞానంతో జ్ఞానం కల్గి ప్రయత్నిస్తే నరుడు నారాయణుడౌతాడు. మానవుడు మాధవుడౌతాడు. జీవుడు శివుడై జనుడు జనార్ధనుడౌతాడు కాని యీ మానవుడు ప్రయత్నించితే గద.

సృష్టికి ప్రతి సృష్టి చేసిన విశ్వామిత్రుడు నీలాంటి మానవుడే భగవంతున్ని స్తంభంలో నుండి బయటకి తీసిన ప్రహ్లాదుని శక్తి నీలో ఉంది. ఆరునెలల్లో ధృవ పథాన్ని సాధించిన ధృవ బాలకుని శక్తి నీలో ఉంది మానవుడా "ఉ ద్ధరేదాత్మ నాత్మానాం " నిర్గుణ భక్తి దేహాభిమానం కలవారికి పొసగనే పొసగదు. సర్వ సమర్పణం చేసిన అర్జునుని లాంటి శరణాగత భక్తులకే అది శక్యం కావచ్చు. అర్జునుడు ఇహ మూత్రఫలభోగాలపై ఆశవదలి " త్వమేవ శరణం – మమ " అని అనన్య చిత్తంతో శరణుబొందాడు.

అర్జునా సమస్త కర్మలను భగవంతుడనైన, నా యందు వదలి అనన్య యోగంతో భగవంతుడనైన నన్నే ధ్యానిస్తూ ఉపాసిస్తూ ఉండేవారిని త్వరగా సంసార సముద్రము నుండి ఉద్ధరిస్తాను. వారికే భయమూ లేదు భగవంతుడు భక్తులకు హామీ ఇచ్చాడు. ఎంతటి ప్రేమ పూర్వకమయిన మాట సమస్త కర్మలను నాకు సమర్పించమని భగవంతుడు చెబుతున్నాడు. వ్యాపారం – వ్యవహారం పని – పాట ఏమి చేస్తున్నా నేను చేస్తున్నాననే కర్తృత్వాహంకారాన్ని వదలి యీశ్వరునికి సమర్పించాలి. దానివలన అంత: కరణ శుద్ధి కల్గుతుంది. అర్జునా పైన చెప్పిన అభ్యాసయోగాన్ని ఆచరించే అభ్యాసంలోని శక్తి అపారమైనది. సర్కసులో ఏనగు సైకిలు త్రొక్కుతుంది అదియే విద్య అదే అభ్యాసము యీ అభ్యాసంతో ఎవరైనా ఏమైనా సాధించవచ్చు. అర్జునా యీ అభ్యాసాన్ని ఆచరించేటందుకు యే కారణంతోనో వీలు లేక పోతే నీవు చేసే కర్మలన్నీ నావల్లనే జరుగుతున్నాయని భావించు కర్తృత్వాన్ని అహంకారాన్ని వదలి నీ నిత్య వ్యవహారాలన్నీ చేస్తూపోతే క్రమంగా నీకు సిద్ధి లభిస్తుంది. మనం మన సంసారంలో ఇంద్రియాలతో ఎన్నో పనులు చేస్తున్నాం ఆ చేసే పనులు నేను చేస్తున్నాను నేను లేకుంటే యీ పనే జరుగదు అనే అహంకారం లేకుండ చేయాలి మన ఇండ్లలో లైటు వెలగాలంటే కరెంటు ఉంటేనే గాని బల్బు వెలుగదు ఇందులో బల్బు లాంటి వాడు మానవుడు మధ్యన లేని పోని పెత్తనం అహంకారం తనకెందుకు – అకర్తృత్వ బుద్ధి నిరహంకార భావం చేకూర్తే బ్రహ్మ ప్రాప్తి సిద్ధించినట్లే.

ఒక వేళ అట్లు చేత కాకపోయినచో కనీసం ఫలాపేక్ష వదలి పనులు చేసినా నీ జన్మ చరితార్ధ మవుతుంది. శ్రీకృష్ణుడు నా యోగాన్ని ఆశ్రయించి కర్మలను చేయాలన్నాడు. అదియేమనగా ఆ దేవాదిదేవుడు కిరీటం పెట్టక రాజ్యాలు ఏలాడు కత్తి పట్టకుండానే యుద్ధాలు చేశాడు. ఏమిటీ అర్థమంటే

కర్తృత్వాభిమానం లేక అన్నీ నెరవేర్చాడని అర్థం యీ పనీ చేతకాకపోతే పనులు చేస్తున్నాననే కర్తృత్వబుద్ధి ఉన్నా ఫరవాలేదు. యీ కర్మఫలం నా కక్కర లేదు. కృష్ణార్పణం రామార్పణం అని ఫలత్యాగాన్ని హృదయ పూర్వకంగా వదలాలి.

ఫలాసక్తి నీచమైనది "కృపణా ఫలహేతవ:" అని భగవద్గీతే పొగిడింది. ఫలాసక్తి భక్తునికి తగదు. పనులందు దృష్టి ఉండాలేగానీ ఫలితమునందు మనసు పెట్టరాదు. యీ విషయంలో పుండరీకుడే మనకు ఆదర్శం. మహాభక్తుడైన పుండరీకునికి తల్లిదండ్రుల సేవా కార్యక్రమమే ముఖ్యం అంతకు మించిన జపం లేదు. తపం లేదు. అతని నిష్టకు భగవంతుని హృదయం కరిగింది. ప్రసన్నుడైనాడు ఆయన ఇంటి ముందు ఆయన కొరకై వేచి చూస్తూ నిల్చి వున్నాడు పాండురంగడు.

భగవంతుని స్తోత్రాలలో అష్టకాలకు ప్రత్యేక స్థానం ఉంది. అచ్యుతాష్టకం, గోవిందాష్టకం, శివాష్టకం, బిల్వాష్టకం, లింగాష్టకం, లక్ష్మీ అష్టకం మధురాష్టకం, సూర్యాష్టకం – ఈ అష్టకాలన్నీ భక్తులు భగవంతున్ని వర్ణించినవి ఇపుడు మీరు చదివే వ్యాసం "భక్తాష్టకం" యీ అష్టకంలో చాలా ప్రత్యేకతలు కలవు. అందరూ భగవంతున్ని గూర్చి వర్ణిస్తే యిక్కడ భగవంతుడే భక్తుని గూర్చి వర్ణిస్తున్నాడు. భక్తుని గూర్చి వర్ణించిన శ్లోకాలు ఎనిమిదే అందుకే దీనికి "భక్త్యాష్టకం" అను పేరు బాగా సరిపోయింది.

గీతలో మొదటి షట్కములో స్థిత ప్రజ్ఞుడిని గూర్చి రెండవ షట్కములో భక్తుడుని గూర్చి మూడవ షట్కములో త్రిగుణాతీతుడిని గూర్చి వర్ణించబడినది. గీతా మాతకు యీ ముప్వురు సుపుత్రులు భక్తులలో నాల్గు రకాలు. గజేంద్రుని వంటివారు ఆర్త భక్తులు ఆపద వచ్చినపుడు తన్నివారణార్థం వీరు భగవంతున్ని

వేడుకుంటారు. ఉద్ధవాదులు జిజ్ఞాసు భక్తులు వీరు భగవత్ స్వరూపజ్ఞానం కొరకు దైవ ప్రార్ధన చేస్తారు. ధ్రువుని వంటివారు అర్ధార్ధి భక్తులు వీరు లౌకిక పారలౌకిక లాభప్రాప్తి కొకకు భక్తి నాచరిస్తారు. ప్రహ్లాదుడు నారదుడు సనకసనందనాదులు జ్ఞాన భక్తులు వీరు భక్తి కొరకు భక్తి చేస్తుంటారు.

ప్రస్తుతం మన భక్తుడు ఆర్తభక్తుడు కాదు. " అద్వేష్టసర్వభూతాని, యిక్కడ జ్ఞానభక్తుని గూర్చే భగవంతుడు వర్ణిస్తున్నాడు. జ్ఞానికీ భక్తునికీ తేడాలేదు. అతడే భక్తులలో అగ్రగణ్యుడు. ఆ భక్తుడు తన జ్ఞానంతో ఆచారంతో జీవకళతో భగవంతునికి పరమ ప్రియుడైనాడు. యీ మాటను సాక్షాత్తు భగవంతుని వాక్కుల ద్వారానే ముందు ముందు ఆలకిస్తాము.

శ్లో ॥ అద్వేష్టా సర్వభూతానాం – మైత్ర: కరుణ ఏవచ
నిర్మమో నిరహంకారా – సమదు:ఖ సుఖ: క్షమీ

శ్లో ॥ సంతుష్ట: స్సతతం యోగీ – యతాత్మాదృఢనిశ్చయ:
మయ్యర్పిత మనోబుద్ధి – యోమద్భక్తస్సమే ప్రియ: ॥

ఏ భూతాన్ని ద్వేషించనివాడు సర్వత్రా మిత్రభావం కలవాడు కరుణామంతుడు. అహంకార మమకారంలు లేనివాడూ సుఖదు:ఖాలలో సమస్థితిలో నుండేవాడు ఓర్పుకలవాడు సతతమూ సంతృప్తిగా వుండేవాడు యోగయుక్త జీవనం కలవాడు సంయతాత్ముడు దృఢనిశ్చయం కలవాడు త నువును మనస్సును బుద్ధిని నాకే సమర్పించినవాడు. నాకు చాలా ప్రియమైనవాడు అద్వేష్టాసర్వభూతాని, ఎవరినీ ద్వేషించనివాడు అనువాక్యానికి ఇంకా కొంచెం సవిస్తరంగా తెలుసుకుందాము.

నీటికీ నిప్పుకూ పొత్తు కుదరనట్లే ద్వేషానికీ భక్తికీ ఎప్పుడూ పొత్తు కుదరదు ఏ రూపంలో గాని ద్వేష వృత్తి ఉందంటే వాడు భక్తుడు కాదు కాలేదు.

భగవంతుడు భక్తుని లక్షణాలు గూర్చి తెలియ జేస్తున్నాడు. యీ లక్షణాలు అన్నీ వున్న వాడు గొప్ప భక్తుడు. ఎవరెవరికి ఎన్ని మార్కులు వస్తాయో అందరం చూసుకోవచ్చు. అలా చూసుకొని చెడును తొలగించుకొని భక్తి లక్షణాలను పెంపొందించుకొని అందరం భగవద్భక్తులమవుదాం.

భక్తి తత్త్వాన్ని ప్రబోధించిన పరమాచార్యులందరూ ద్వేషాన్ని భక్తికి విరోధి వస్తువుగానే పరిగణించారు. భక్తికి దు:ఖానికి పొత్తు ఉంటుంది కానీ, భక్తికి ద్వేషానికి పొత్తు ఉండదు. ప్రేమద్వేషం ఒకే హృదయంలో ఉందంటే ఒప్పుకోలేము. భగవత్ప్రియుడు యే ప్రాణిపైన ద్వేషం పెట్టుకోడు. పెట్టుకోకూడదు కూడా. “ నీ మతస్థులను ద్వేషించవద్దని ” మహమ్మద్ పైగంబరు తన మతం వారికి మత సౌభ్రాతృత్వం బోధించాడు. “ మానవులంతా ఒకే తండ్రి బిడ్డలు వారిని ద్వేషించవద్దని” యేసు క్రీస్తు ప్రభువు చెప్పినాడు శ్రీకృష్ణుడు అట్లు చెప్పక “ సమస్త భూతాలను ద్వేషించవద్దని ” సెలవిచ్చినాడు. భూతములంటే పుట్టిన ప్రతి వస్తువు అని అర్థం. నీ స్వజాతి మనుష్యులనే కాదు పశుపక్షి క్రిమికీటక చరాచర భూతాలతో ఎక్కడా ద్వేషం ఉండరాదని శ్రీకృష్ణుని సిద్ధాంతం.

“వాసుదేవ స్సర్వమితి ” అనే గీతా వాక్యంపై విశ్వాసం ఉంది. కదా సమస్తము వాసుదేవుడే అయి ఉండేటప్పుడు దేన్ని కాని ద్వేషించే ఆస్కారము లేదు. కాబట్టే హిందూ మతం పశుపక్ష్యాదులను కూడా పూజిస్తుంది. “ఆత్మౌపమ్యేన సర్వత్ర” అని ఆరవ అధ్యాయంలో చెప్పినాడు దేన్ని ద్వేషించినా నిన్ను నీవు ద్వేషించుకున్నట్లే కదా. ఒకే గర్భంలో జన్మించిన అన్నదమ్ములలో పార్టీలు కలహాలు, ఖూనీలు, హత్యలు జరుగుతుండడం మనం గమనిస్తూనే ఉన్నాం. సోదర వాత్సల్యం పూర్తిగా శాంతి నివ్వదు. కాబట్టే యింకా ముందుకు వెళ్ళి గీత సర్వాత్మ భావాన్ని బోధించింది.

యితరుల వలన తనకు బాధకల్గినా భక్తుడు సహించుకుంటాడు. ఎట్లనగా బఠానీలు సరదాగా తింటూ ఉన్నావు అనుకో. అవి కొరుకునప్పుడు నీ నాలుక పళ్ళ క్రింద పడిందనుకో. ఏమీ ఇంత గట్టిగా నాలుకను కొరికినావు అని కోపంతో నీకు తగిన శాస్తి చేస్తానని రాతితో పళ్ళను ఊడగొట్టుకుంటావా? లేదు. ఎందుకనగా నాలుకా తనదే పళ్ళూ తనవే ఎంత బాధ కలిగినా, ఎంత కోపం వచ్చినా ఓర్చుకుతీరాలె. రెండింటి యందు ఆత్మీయతా బుద్ధి ఉంది కాబట్టి ద్వేషము అనుపదంలో ఇంకో అర్థము ఉంది. "ద్వి – విష " ద్వేషం " ఈ ద్వేషమనేది డబుల్ విషమని అర్థం. లోకంలోని విషం తిన్న వానినే చంపుతుంది. కాని పెట్టినవానిని చంపదు. ద్వేషం అలా కాదు, ద్వేషంతో పెట్టినవాడూ, తిన్నవాడూ ఇర్వురూ చెడిపోతారు. ఎవడు ద్వేషిస్తాడో వాడు మండిపోతాడు. అగ్నితాను ఆశ్రయించిన వస్తువును కాల్చి ప్రక్కనున్న వస్తువులనూ కాల్చుతుంది. ఈ ద్వేషమూ అట్టిదే.

ద్వేషము ముక్తికి విరోధి, ముక్తి అంటే రాగద్వేషనివృత్తే కదా! ద్వేషనివృత్తి కానివానికి ముక్తి సున్న. యీ ద్వేషము పూర్తిగా నివృత్తి చెందాలంటే సర్వత్రా భగవద్భావం లభించాలి. జగత్తు మాయామయము భేదబుద్ధి, స్వార్థ పరత్వం నిర్మూలం కానిదే ద్వేషం నివృత్తి కాదు.

" అద్వేష్టా సర్వభూతాని " యే భూతమందు కూడా ద్వేషం లేని వాడే భక్తుడు అని అర్థం " సర్వ దేవ నమస్కార: కేశవం ప్రతిగచ్ఛతి " అని మంత్రపుష్పంలో చెప్పుకుంటున్నాం కాని అంతమాత్రం చాలదు " సర్వ జీవతిరస్కార: కేశవం ప్రతిగచ్ఛతి" దీనినీ చేర్చుకోవాలి. యే జీవుని తిరస్కరించినా కేశవున్ని తిరస్కరించినట్లే " ఇక్కడొక చిన్న కథ చెప్పుకుందాం".

ఒక సాధువు నదిలో స్నానం చేయుచుండగా ఆ నదిలో తేలుకొట్టుకొని

పోవుచుండెను. దయామయుడగు సాధువు దానిని కాపాడుటకై దోసిలిలో దానిని పట్టుకొనెను. వెంటనే అది కుట్టెను. బాధతో సాధువు దానిని వదిలి పెట్టెను. అది నీటిలో కొట్టుకొని పోవుచుండ మరలా పట్టుకొనెను. అది మరలా కుట్టెను. యిలా అది కుట్టుట ఈయన పట్టుకొనుట ఈ దృశ్యం చూస్తున్న కొందరు వ్యక్తులు సాధువుగారూ మీకేమైనా మతి చెడిందా? దుష్ట జంతువును పట్టుకోవడం ఎందుకు దానితో కుట్టించు కోవడమెందుకు అనగా, ఆ సాధువు జవాబు చూడండి. నా ధర్మం నేను నిర్వర్తిస్తున్నాను. దాని ధర్మం అది నిర్వర్తిస్తున్నది. దాని ధర్మం అది వదలనప్పుడు నా ధర్మం నేను ఎలా వదలాలి. అది దాని ధర్మం. ఇది నా ధర్మం అని అన్నాడట ఆ సాధువు. " అద్వేష్టా సర్వభూతాని " భక్తుడు యే భూతాన్ని ద్వేషింపడు. మనుష్యులనే కాక పశుపక్ష్యాదులకు కూడా శాంతి సుఖాలు కావాలె అని మనం అభిలషిస్తున్నాం. ఈ ఆశయంతోనే మన పురాణాలలో దేవతలకు వాహనాలుగా పశుపక్ష్యాదులను చెప్పి ఉన్నారు. కుక్కను కాలభైరవునిగా పామును సుబ్రహ్మణ్యేశ్వరుడుగా చెప్పుకుంటాం. పంది భగవంతుని అవతారాలలో ఒకటి. భగవంతుడు విశ్వరూపుడే అయి ఉండగా విశ్వంలో ఆయన కాని వస్తువు అంటూ ఒకటి వుంటుందా, కాకి పితృదేవతలకు ప్రతినిధి గరుత్మంతుడు విష్ణు వాహనము వీటి అన్నిటి సారమేమి అనగా భూతకోటిలో అన్నింటి పైన పూజ్య భావం ఉంచమని దేన్ని కూడా ద్వేషించవద్దని సున్నితంగా సూచిస్తున్నాడు.

నిజమైన భక్తుడు నాస్తికుని కూడా ద్వేషించడు. నాస్తికుడు కూడా దేవుడు లేడు దేవుడు లేడు అంటూ ఇతడు ఇంకో రకంగా దైవధ్యానం చేస్తున్నాడు. ద్వేషం ఉండరాదు. ఇంత మాత్రం ఉంటే భక్తుడైనట్లేనా? అది అభావాత్మక లక్షణం ఇంటిలో స్తంభం ఎవరిని ద్వేషిస్తుంది. గోడ ఎవరిని ద్వేషిస్తుంది.

ఇవి కూడా భక్తులేనా? కాదు మైత్ర: అనే లక్షణం కూడా అవసరం. మిత్రుడనగా సూర్యుడు, అందరికీ సమానంగా తన ప్రకాశాన్ని యిస్తాడు. ఆ ప్రకారంగా భక్తుడు తన స్నేహాన్ని అందరికీ సమానముగా విస్తరిస్తాడు. మైత్రి పాపమును నివర్తిస్తుంది. కుటుంబంలోని వారంతా స్నేహంగా ఒద్దికగా ఉంటే కుటుంబ యజమాని సంతోషంగా సంతృప్తిగా ఉంటాడు. విశ్వమే ఒక కుటుంబం దీనికి యజమాని తండ్రి, పరమాత్మ. సమస్త ప్రాణులు కుటుంబంలోని సభ్యులు. విశ్వకుటుంబం యజమాని విశ్వేశ్వరుడే.

ధర్మం కాని, భక్తి కాని తన హృదయ పరిశుద్ధి కొరకే కానీ లోకాన్ని ఉద్ధారకం చేసే కోసం కాదని మొదట్లో గుర్తించాలి. ద్వేషం ఉండరాదు. స్పర్ధ కొంత వరకు ఉండవచ్చు. స్పర్ధ అంటే పోటీ పడడం కొంతవరకు ఇది యోగ్యమే కానీ, స్పర్ధ ద్వేషంగా పరిణమించే అవకాశం కూడా కలదు.

"నిర్మమ:" ఇది భక్తుని నాల్గవ లక్షణము మమకారంలేని వాడు నిర్మముడు కరుణ ఉండేవాడు భక్తుడు. కరుణ దైవీసంపద మమకారం అసురీ సంపద యీ మమకారంతోనే ఋషి తల్లి లేని జింకపిల్లని పోషించి పెంచి మమకారం విపరీతంగా పెంచుకొని, చరమ దశలో నేను లేకుంటే జింకయేమౌనోయని జింకను స్మరిస్తూ ప్రాణం వదలి మరుజన్మలో జింకగా పుట్టాడు. దశరథుడు, శ్రీరాముడు అరణ్య వాసానికి వెళుతుంటే పుత్రునిపై మమకారం చేత రామారామా యని విలపిస్తూ ప్రాణాలు వదలినాడు. యీ మమకారం చాలా ప్రమాదము కనుకనే నా భక్తుడు మమకారం లేనివాడు అని తెల్పినాడు.

భగవద్గీతలో భగవంతుడు భక్తుని వర్ణిస్తున్నాడు. నా భక్తుడు మమకారంలేనివాడు అదే "నిర్మమో". ద్రోణుడంతటి వాడు పుత్ర మమకారంతో మరణించాడు. మమ తరిగిందా మాయ తగ్గినట్లే మమ అనే రెండక్షరాలలోననే బంధం ఉంది. " నమమ " అనే మూడక్షరాలలో ముక్తి వుంది. అది

ఎట్లనగా, మన ఇంటిలో ఎలుకా ఉంది, మనం పెంచే చిలుకా ఉంది. చిలుకను పిల్లి చంపిందంటే ఎక్కడలేని బాధ కోపము దిగులు దు:ఖము అన్నీ కలుగును. ఎలుకను పిల్లి చంపితే, ఓ బాధ తగ్గిందిలే. దాని ఆయుస్సు తీరిపోయిందని వేదాంతం పలుకుతాము. ఎందుకీ వ్యత్యాసము. ఒకే ఇంటిలో పెరిగినవి, రెండూ వారి సంపాదననే తిన్నవి. ఒకదానిపై మమకారం పెంచుకున్నాము గనుక అది పోతే బాధ పడుతున్నాము. మరోదానిపై మమకారం పెంచుకోలేదు. గనుక ఎలుకపోతే బాధ పడలేదు. భక్తునికి కరుణ ఉండవచ్చు. మమకారం ఉండరాదు. అదే " నిర్మమో ".

" నిరహంకార: " ఇది భక్తుని అయిదవ లక్షణము. సర్వకర్త భగవంతుడని ఎరింగినవానికి అహంకారము ఏ విధంగా అంటుకొంటుంది. అహంకారం నివసించే హృదయంలో భగవంతుడు నివసించడు. భగవంతుడు నివసించే హృదయంలో అహంకారానికి చోటులేదు. నేనుంటే గురువు లేడు. గురువుంటే నేను లేనని కబీరన్నాడు. హిరణ్య కశిపుడున్నంత వరకు నరసింహస్వామి లేడు. నరసింహస్వామి వచ్చాడు. హిరణ్య కశిపుడు లేడు. ఒక వరలో రెండు కత్తులు ఇముడవు. అహంకారమూ, భగవంతుడూ ఒక హృదయంలో వుండరు. తలకట్టు యిస్తే " శవం, తలకట్టు తీస్తే "శివం".

ఇంతవరకు చెప్పుకున్న భక్తుని లక్షణాలు అద్వేష్టా, ద్వేషంలేని వాడు సమస్త ప్రాణికోట్లయందును " మైత్ర: సర్వత్రా మైత్రీభావం కల్గి యుండుట కరుణ: " కరుణా హృదయుడై యుండుట. " నిర్మమో " మమకార రాహిత్యం కలిగి యుండుట. " నిరహంకార:" అహంకారము లేకుండుట యీ అయిదు లక్షణాల గూర్చి తెల్పి ఇపుడు ఆరవ లక్షణము " సమదు:ఖ సుఖ: అనగా సుఖ దు:ఖాలలో సమానంగా ఉండుట భక్తుని లక్షణం. సుఖదు:ఖాలలో చలించని వాడే భక్తుడు. వాడే జ్ఞాని, వాడే యోగి, వాడే ముక్తుడు, వాడే

ముముక్షువు, వాడే సిద్ధుడు, వాడే సాధకుడు.  ఇదంతా ఆధ్యాత్మిక రంగంలో చెప్పే మాటలు. వ్యావహారిక రంగంలో కూడా భర్తృహరి మహాకవి " లెక్కకు రానీయడు కార్యసాధకుడు దు:ఖంబున్ సుఖంబున్ మదిన్ " అని తెల్పినాడు. సుఖదు:ఖాలలో సమానంగా ఉండేవాడు భక్తుడు.  సుఖం వస్తే పొంగిపోవడం, దు:ఖం వస్తే క్రుంగిపోవడం భక్తుడనే మాటకు యోగ్యతకు సరిపోదు. "సమదు:ఖసుఖ:"  ఒక ధనవంతుడు ఉండేవాడు.  ఆయన జ్ఞాని భక్తుడు. ఆయనది స్టీమరు వ్యాపారం.  ఆయనకు ఒకే ఒక పుత్రుడు.  సర్వగుణ సంపన్నుడు సర్వలక్షణ సంపన్నుడు.  వ్యాపారానికి స్టీమరు వెంట కొడుకును పంపినాడు.  రెండురోజుల తర్వాత టెలిగ్రాం వచ్చింది.  తుఫాను ప్రమాదానికి మీ స్టీమరు సముద్రంలో మునిగింది అని. యీ వార్త చదివి కళ్ళు మూసుకున్నాడు.  తర్వాత కళ్ళు తెరచి భగవంతుని అనుగ్రహం అన్నాడు. తక్కిన లెటర్లు చూసుకుంటున్నాడు.  గుమాస్తాలు తకబికలై పోయారు.  ఓ గంట తర్వాత మరలా అర్జంటు టెలిగ్రాం వచ్చింది.  మునిగిపోయిన స్టీమరు మీదికాదు,  మీ స్టీమరు మంచిగా ఉన్నదని, మేము పొరపాటుగా మీ స్టీమరని చెప్పినామని.   ఆ భక్తుడు ఆ కాగితం క్రింద పెట్టి కళ్ళు మూసుకున్నాడు. కళ్ళు తెరచి భగవదనుగ్రహం అన్నాడు.  పిడుగుకు, పిండికీ ఒకే మంత్రము. అందరికీ ఒకటే ఆశ్చర్యము.  ఇప్పుడు సరే భగవంతుని అనుగ్రహం అన్నావు. మరి ఓడ మునిగింది అన్నప్పుడు కూడా భగవంతుని అనుగ్రహమన్నారే అని అడుగ, ఆయన అన్నాడు. ఓడ మునిగింది అన్నప్పుడు కళ్ళు మూసుకొని హృదయంవైపు చూసుకున్నాను అది మునగలేదు,  సంతోషం భగవదనుగ్రహం అన్నాను మళ్ళీ సంతోషవార్త విన్నప్పుడు హృదయం వైపు చూసుకున్నాను చెక్కు చెదరలేదు బ్యాలెన్సు చెడలేదు.

నా హృదయం “ దు:ఖంలో మునగలేదు.  సంతోషంలో పొంగలేదు”. భగవదనుగ్రహం అన్నాను అనెను.  జలజంతువులు జలవేగాన్ని తట్టుకొని సహించి నిలుస్తాయి.  కొట్టుకొనిపోవు.  భక్తుడు ప్రారబ్ధ వశాత్తు వచ్చే సుఖ: దు:ఖాల వేగాన్ని  తట్టుకొని తన స్థాయిలో తను నిలబడి ఉంటాడు. ఎందుకనగా, వాడు సుఖదు:ఖ సముడు.  నా భక్తుడిట్టివాడని భగవంతుడు స్వయంగా సంతోషంతో ఉబ్బిపోతూ వర్ణిస్తున్నాడు ఇంకా ఏమంటాడో చూద్దాము.

“క్షమీ”

భక్త లక్షణాలను వింటున్నాము.  భగవంతుని భక్తుల లక్షణాలలో ఐదో లక్షణం “క్షమీ” అంటే క్షమావంతుడని అర్థం.  క్షమా అనే మాటకు రెండు అర్థాలు ఉన్నాయి.  ఒకటి ఓర్పు, రెండవది సమర్థత.  భూమికి “క్షమ” అని పేరు.  భూమిని త్రవ్వినా, పూడ్చినా, మలవిసర్జన చేసినా, మూత్రవిసర్జన చేసినా మనపై ప్రతీకారం తీర్చుకోకపోగా తిరిగి మనకు పంటలు, తిండి ఏర్పాటు చేస్తుంది.  అందుకే ఆమెకు భూమాత అని పేరు.  భూమే కాదు పంచభూతాలు అన్నీ కూడా. నీళ్ళను గలీజు చేస్తాం.  పీనుగులను పడవేస్తాం. అగ్నిలో కసువుగత్రారోతా పారవేశి కాల్చివేసాం.  గాలిలో దుర్వాసనలను వదలి వాటిని వ్యాపకం చేస్తాం.  ఆకాశంలో అపశబ్దాలను క్రక్కుతుంటాం. కాని వాటికి కోపం లేదు.  క్షోభలేదు.  ప్రతీకారం చేయవు.  భూమి మొదలుకొని భగవంతుని వరకు క్షమ ఓర్పు వ్యాపకమై ఉంది.

ఒక్క అహంకారం మాత్రమే ఓర్పుకు శత్రువు.  అహంకారం పాపానికి పుత్రుడు.  తాపానికి తండ్రి.  ఒకతూరి ఒక వ్యక్తి మదన్‌మోహన్ మాలవ్యాతో కలసి ఏమండీ మాలవ్యాగారూ మీరు నోరు నొచ్చేవరకు నన్ను తిట్టండి. నేను చలిస్తానేమో చూడండి అన్నాడట.  ఆ మాటకు మాలవ్యాగారు నీవు

చలించడం చలించకపోవడం దేవుడెరుగు. మొదట నేను నా నోటిని, నా హృదయాన్ని భ్రష్టం చేసుకోవద్దా అన్నాడట. క్షమ భక్తునికి అతి ముఖ్యమైన మంచి గుణం. స్వయంగా భగవంతుడే చెప్పాడు కదా. ప్రతి భక్తుని చరిత్రలో దీనికి కావలసిన నిదర్శనాలు ఉన్నాయి. సమర్థ రామదాసు, తుకారాం, ఏకనాథస్వామి, సోక్రటీసు, ఏసుక్రీస్తు ఇలాంటి మహనీయుల చరిత్రలు క్షమాగుణానికి దివిటీలు. అన్ని యోగాల కంటే క్షమాయోగం గొప్పది. "మనస్సును సమస్థితిలో పెట్టుకోవడమే యోగం. భగవంతుడు భక్తుడు ఒకజాతి వారే కాబట్టి భగవంతుని లక్షణం భక్తునిలో ఉండాలి.

శ్లో ॥ సంతుష్ఠ: సతతం యోగీ - యతాత్మాదృఢ నిశ్చయ: ॥
మయ్యర్పిత మనోబుద్ధి: - యోమద్భక్త స్సమేప్రియ:॥

ఇంతవరకు భక్తుని ఏడు లక్షణాల గూర్చి చర్చించుకున్నాము. ఇప్పుడు మిగతా లక్షణాలను గూర్చి చర్చించుకుందాము. "సంతుష్ఠస్సతతం " భక్తుడు సతతం సంతుష్టుడు. సామాన్య మానవులు అప్పుడప్పుడు సంతుష్టులు. కీడు కలిగినప్పుడు సంతాపం. భక్తుడు అలా కాదు, సతతం సంతుష్టుడు. సర్వస్వంతో సంతృప్తి పొందుతాడు. సంతోషమే యవ్వనం చింతే ముసలితనం అని లోకోక్తి. ఈ సంతుష్టిని గురించి భాగవతంలో వామనుడంటాడు.

"సంతుష్టుడీ మూడు జగముల పూజ్యుండు
సంతోషికెప్పుడు జరుగు సుఖము
సంతోషికాడేని శక్రుడైన నశించు
సంతసంబున ముక్తి సతియు దొరకు ॥

భగవంతుడు ఆనంద ఘన స్వరూపుడు. ఆయనతో సంబంధం పెట్టుకున్న భక్తుడు కూడా ఆనంద ఘన స్వరూపుడే. తల్లి గర్భంలో ఉన్నప్పుడు

పోషించినవాడు. యిప్పుడు మతి తప్పినాడా? మృతి చెందినాడా లేదులేదు. అప్పుడు తల్లిగర్భంలో ఉంటే ఇప్పుడు విశ్వగర్భుని గర్భంలోనే ఉన్నాను. ఇక నాకెందుకు చింత. ఇది భక్త లక్షణం. పళ్ళు రాకముందు పాలు ఇచ్చినవాడు పళ్ళు వచ్చిన తర్వాత అన్నం ఇవ్వడా ! లోకంలో ఒక నియమం ఉంది. సంతోషం ఉన్నచోటికి సంతోషం వస్తుంది. దు:ఖం వున్నచోటికి దు:ఖం వస్తుంది. అందరి డబ్బ్బా బ్యాంకుకు చేరుతుంది, బ్యాంకు డబ్బుకు కేంద్రం గనుక నీళ్ళన్నీ సముద్రానికి చేరుతాయి ఎందుకు, నీళ్ళకు కేంద్రం గనుక. యీ సూత్రం భక్తునికి తెలుసుగనుక అతడెప్పుడూ సంతుష్టుడై వుంటాడు. అదే మాట భాగవతంలో

కం ॥ రక్షకులు లేని వారల
రక్షించెదననుచు చక్రిరాజైయుండన్
రక్షింపమంచు నొకనరు
నక్షము ప్రార్థింపనేల నల్పుజ్ఞుడిలన్ ॥

భక్తుని జీవనం నందనవనం. అతడు సతతం సంతుష్టుడు. భగవంతుడు సతతుడు, భక్తుడూ సతతుడే. వాని సంతుష్టి సతతం.

మనము ఇంతవరకు సతతసంతుష్టుడు అనే 8వ లక్షణం వరకు తెలుసుకున్నాము.

భగవద్భక్తులారా ! భగవద్గీతాస్వాదనాయత్త చిత్తులారా! గీతామృతాన్ని, భక్తిరసామృతాన్ని పానం చేయండి సంతృప్తిని చెందండి.

భక్తుడు “సతతయోగి. ఇది తొమ్మిదవ లక్షణం. ఇక్కడ యోగి అనగా, కర్మయోగి, ధ్యానయోగి జ్ఞానయోగికి సంబంధించిన ప్రసంగం కాదిది. ఇతడు భక్తి యోగి. భగవంతుడు సతత సంపూర్ణుడు. ఆయనతో సతత యోగం ఎప్పుడూ ఉంది జీవునికి. అయినా మాయా వ్యామోహమువల్ల అజ్ఞాన

ప్రభావంతో జీవుడు భగవద్వియోగానికి గురి అయినాడు. ఎట్లనగా చేప నీళ్ళలోననే ఉండినా, అన్ని ప్రక్కలా నీళ్ళు ఉండినా చేప వెల్లకిలపడితే దాని కుత్తుకలోనికి నీళ్ళు పోక విలవిలలాడి ఛస్తుంది " అప్పుడు దాన్ని చిన్నగ ప్రక్కకు త్రిప్పితే చాలు బ్రతికి బయట పడుతుంది. అలాగే జీవుడు భగవంతున్ని తెచ్చుకునే పనిలేదు తెలుసుకుంటే చాలు. ఆ తెలివి కలిగితే చాలు, ఆ దృష్టి లభిస్తే చాలు అతడే "సతతయోగి". సతత యోగి అయినవాడు భగవంతునివలెనే సతతం సంతుష్టుడు. ఇనుప ముక్క నీళ్ళలో వేస్తే మునిగి పోతుంది. అదే ముక్క చెక్కతో సంబంధం పెట్టుకుంటే నీళ్ళలో తేలుతుంది. అప్పుడు మునుగదు. అట్లే మృత్యు సంసార సాగరంలో మునిగి పోతూ యుండే జీవుడు భగవంతునితో సంబంధం పెట్టుకుంటే సముద్ధరింప బడతాడు.

నీవు ఎంత పట్టుకున్నా వదలిపెట్టబోయే వస్తువు సంసారం, నీవు యెంత వదలి పెట్టినా పట్టుకొని వుండే వస్తువు పరమాత్మ. భక్తుడు సతతం యోగి కాబట్టే సతతం సంతుష్టుడు అయ్యాడు. భక్తుని లక్షణాలలో ఎనిమిదవ లక్షణం సతతం సంతుష్టుడు. భగవంతుడు సతతం సంతుష్టుడు, చిదానంద ఘనుడు భక్తుడు కూడా సతతం సంతుష్టుడైనప్పుడే తనకూ భగవంతునకూ సంబంధం కుదిరేది.

సంతోషం మనకూ ఉంటుంది. అనుకున్న పనులు అయినప్పుడు తమ కూతురుకు మంచి సంబంధం కుదిరినప్పుడూ, కమ్మని తిండి తిని కబుర్లు చెబుతూ ఉంటే కలిగే సంతోషం. భక్తుని సంతోషం అలాకాదు, సతతం సంతుష్టుడు వాని స్వభావమే సంతోషము. యోగికి సంతోషము ఒక నియమము. అతడు ఎప్పుడూ సంతోషంగానే ఉంటాడు. ఒక భక్తుడంటాడు భగవంతున్ని " ప్రభూ నేను అనాథనుగాను, నీవు నాకు నాథుడవు అయి ఉ న్నావు గనుక నేనెలా అనాథ నౌతాను. కానీ నీవే అనాథుడవు, నీకు నాథుడు

లేడు, నిన్ను కాపాడే వాడే లేడు. నీవు నాకు దిక్కున్నావు. దిక్కు లేనివాడవు నీవే " ఇది భక్తుని ధీమా, ధైర్యము. నరుని నరోత్తముడిగా చేసి నారాయణునిగా తయారు చేయడం యీ మన భగవద్గీత ఆశయం. ఆ ప్రక్రియలోననే మనం ఇప్పుడు చెప్పుకునే భక్తుని ప్రసంగం భక్తుడు సతతం సంతుష్టుడు ఇది భక్త లక్షణాలలో ఎనిమిదవది.

సతతం సంతుష్టుడు ఎలాగయ్యాడు. సతతం యోగి కాబట్టి చిత్తాన్ని సమతూకంగా పెట్టుకోవడమే "యోగం". భోగం రోగాలకు మూలము. యోగము ఆరోగ్యానికి మూలము. రోగమెప్పుడు వస్తుంది. యోగము లేకపోతేనే రోగం వస్తుంది. సమత్వమే యోగము. విషమత్వమే రోగము. సతతం యోగి కావడంలో స్వారస్యముంది సామాన్యుల పరిస్థితి అలా కాదు ఉదయం యోగి మధ్యాహ్నం భోగి. రాత్రికి రోగి ఇలా అవతారాలు మార్చేవాడు యోగి కాలేడు. భక్తునికి ఒక సిద్ధాంతం ఉంది. తనను వదిలితే భగవంతునికే నష్టము. అచ్యుతుడు చ్యుతుడౌతాడు. అఖండుడు ఖండుడౌతాడు. ఎప్పుడూ తన పక్షానికి బలం భక్తుడే. ఈ సత్యాన్ని గుర్తించాడు కాబట్టే "సతత యోగి" కనుకనే సతత సంతుష్టుడైనాడు.

వాని సంతుష్టి బైటనుండి కూరేది కాదు. లోపల నుండి వూరేది. ట్యాంకులోని నీరు బైటి నుండి కూరేది, బావిలోని నీరు లోపలి నుండి వూరేది. కూరే నీళ్ళు మురిగిపోతాయి, తరగిపోతాయి. వూరే నీళ్ళు ఎప్పటికప్పుడు తాజా తాజా, నవనవ నవీనం నిత్యనూతనం. ప్రకృతిలో ఓ నియమం ఉంది. వస్తువు తన కేంద్రానికి సహజంగానే చేరుతూ ఉంటుంది. డబ్బంతా బ్యాంకుకు చేరుతుంది, అక్కడక్కడి కసువు దిబ్బలో చేరుతుంది. (మున్సిపాలిటి తొట్టిలోనికి) నదులు సముద్రం చేరుతాయి, దరిద్రుని దగ్గరకి ధనం పోదు భక్తుడు సంతుష్టుడు గనుక, సంతుష్టి. సంతుష్టుని చెంతకే

చేరుతుంది, శాంతి వద్దకు శాంతి చేరుతుంది, అశాంతి చెంతకు అశాంతి చేరుతుంది. ఎవరి చుట్టం ఇంటికి వారు వెళ్ళినట్లు. మనం ప్రస్తుతం భక్తుని లక్షణాలలో ఉన్నాం. భగవంతుడు గొప్పా? భక్తుడు గొప్పా? భగవంతుడు భక్తుడే గొప్ప అంటాడు. భక్తుడు భగవంతుడే గొప్ప అంటాడు. అందుకే భగవంతుడూ భక్తుడూ ఇద్దరూ గొప్పవారలైనారు.

బలి చక్రవర్తి భగవంతున్ని రెండు ప్రశ్నలు వేశాడు. " స్వామీ నీవు అందరికి ఇచ్చే వాడివి సర్వ లోకాధిపతివి, అడుక్కునేగతి నీకెందుకు పట్టింది.

నీ దర్శనంతో బంధాలు ఊడిపోతాయంటారు. మరి నీ దర్శనం చేసుకున్న నాకు బంధం ఎలా కలిగింది" అని. బలి చక్రవర్తి ప్రశ్నలకు భగవంతుడు నిరుత్తరుడైనాడు. దేవతలు పుష్ప వర్షం కురిపించారట, భగవంతుని మీద కాదు భక్తుని మీద. ఆ భక్తునకు బహుధా ధన్యవాదాలు తెల్పుకుందాము. సతత యోగి ఇంద్రియాలను నియమబద్ధంగా ఉంచుకుంటాడు. పరాయి తిండి తిని, తిని నాలుక శక్తి నశించి పోయింది. చేతులు చాచి చాచి అందరివద్దా తిరిపెం తీసుకొని, దానాలు గ్రహించి, చేతులలో పుణ్యం నశించింది. కోరికలు కోరి కోరి మనస్సు లొట్ట అయిపోయింది. దానికి బలమెక్కడిది దేవుడిచ్చిన ఐశ్వర్యాన్ని అవివేకి మానవుడు వ్యర్థం చేసుకున్నాడు.

మన భక్త లక్షణాలలో " దృఢ నిశ్చయ: " ఇది పదవ లక్షణం. యీ దృఢ నిశ్చయుల్ని గూర్చి చెప్పాలంటే ఎన్నో ఎన్నెన్నో. పార్వతి పరమ శివుని కోసం తపస్సు చేస్తూ పెళ్ళి చేసుకుంటే ఆ శివున్నే చేసుకుంటాను. లేకున్నచో ఇలా కన్యగానే ఉంటాననే దృఢ నిశ్చయంపూని ఆ సంకల్పం నేరవేర్చుకున్నది. రుక్మిణీదేవి విషయం అంతే వ్రతచర్యల్ నూరు జన్మంబులన్ " నిను చింతించుచు ప్రాణముల్ విడిచెదన్ నిక్కంబు ప్రాణేశ్వరా " అని దృఢ నిశ్చయం చేసింది ఇంకే ముంది ద్వారకానాథుడు రాక తప్పలేదు. ఆంజనేయుడు

భయార్తులను కాచుటలో తన స్వామినే యెదుర్కోక తప్పలేదు. అందులో ఆంజనేయుడే విజయం పొందాడు. సత్యహరిశ్చంద్రుని సత్యదీక్ష, కర్ణుని దాన దీక్షా రుక్మాంగదుని వ్రతదీక్ష ఇలాంటి వన్నీ దృఢ దీక్షలే. వీరంతా దృఢ దీక్షాదక్షులై ప్రపంచంలో ఆచంద్రార్కము శాశ్వత కీర్తి ప్రతిష్టల పొందగలిగినారు. అదే భక్తుని దృఢ నిశ్చయం. వట్టి నిశ్చయం దృఢ నిశ్చయం చాలదట సతతం దృఢ నిశ్చయా:, ఎల్లప్పుడూ దృఢ నిశ్చయుడై యుంటాడు ఆ భక్తుడు. ఆ భక్తుని 10వ లక్షణం గూర్చి చెప్పడం జరిగింది. ఇప్పుడు భక్తుని పదకొండవ లక్షణము గూర్చి తెల్పుతున్నాడు. అది ''మయ్యర్పిత మనోబుద్ధి'' మనోబుద్ధులను నాకు అర్పించిన వాడు నా భక్తుడు. మనస్సుతో ఆడింపబడేవాడు జీవుడు, మనస్సును ఆడించేవాడు దేవుడు. ఖైదీ పోలీసుకు అధీనమైతే, పోలీసును అధీనం చేసుకున్నవాడు ఆఫీసరు. దొంగచుట్టూ పోలీసులు గన్‌లు పట్టుకొని ఉందురు. కాని పోలీసులకు దాసుడు దొంగ, రాష్ట్రపతికి దాసులు పోలీసులు. యీ విధంగానే ఇంద్రియాలకు దాసుడైనవాడు దొంగతో సమానం. ఇంద్రియాలను తన అధీనంలో పెట్టుకున్నవాడు పెద్ద ఆఫీసరుతో సమానం. భక్తుడు తాను భయపడడు, ఒరులను భయపెట్టడు. భయపడుట పశులక్షణం, భయపెట్టుట మృగలక్షణము. తప్పు చేయనివానికి భయమెందుకు. మనోబుద్ధులను భగవంతునకు సమర్పించేవాడు భక్తుడు. హర్షామర్షభయోద్వేగై అంటూ

భగవంతుడు తన భక్తుని లక్షణాలను నోరారా, తనివితీరా స్తుతి చేయుచున్నాడు. ఎందుకు ఇంతగా చెబుతున్నాడంటే, యీ భక్తుని లక్షణాలలో మీకు ఎన్ని మార్కులు వస్తాయో ఒకసారి చూసుకొని, సరి చేసుకొని మీమీ జన్మలు తరియింప చేసుకొమ్మని పరోక్షంగా మనకు హెచ్చరిక చేయుచున్నాడు. గీతాచార్యులు. యీ భక్తలక్షణాలలో మనకెన్ని ఉన్నాయో చూసుకొని ఉన్నవానిని

కాపాడుకుంటూ లేని వానిని సంపాదించుకుంటూ మన జీవితాలను చరితార్థం చేసుకొని భగవదనుగ్రహపాత్రులమై ధన్యులం కావాలనేదే దేవదేవుని ఆశయం.

మన యీ ప్రసంగంలో భక్తుని స్వభావ ప్రభావాలను భగవంతుడు వర్ణిస్తూ హర్షము లేదు. అహర్షము లేదు, భయము లేదు, ఉద్వేగము లేదు, ఇట్టి వాడే నాకు అత్యంత ప్రియమైనవాడు. అతడే నా భక్తుడు హర్షామర్ష భయో ద్వేగాలు మనోవికారాలు వాటినుండి భక్తుడు ముక్తుడై యున్నాడు. విడివడి యున్నాడు. వీడు వదలడం కాదు. అవే వదలిపెట్టి పోయాయి. " యీ చోట మాకు మర్యాద లేదని " వాటంతట అవే వాని మనస్సు నుండి వదలి పోయాయి. వీడు వదలినాడంటే అవి మళ్ళీ వచ్చే అవకాశం ఉండవచ్చు. అవే వదలినాయంటే మళ్ళీ చేర్తాయనే సమస్యే ఉండదు.

మానవుని ఉన్నతికి యీ ఆరు విఘ్నాలు. సోమరితనము, స్త్రీల పట్ల రోగము, జన్మభూమిపై మమకారం సంతోషము పిరికితనము, వ్యామోహము యివి మానవుని పతనానికి మూలకారణాలు. ఇక పదహారవ లక్షణము "ఆమర్షముక్తుడు" అనగా అసూయ ఓర్వలేని తనము లేనివాడే భక్తుడు. యీ కాలం భక్తులలో భక్త సమాజాలలో భక్తి మాట దేవుడెరుగు కాని అసూయ మాత్రం తప్పక రాజ్యమేలుతుంటుంది.

అసూయలేనిలక్షణాలను గూర్చి శాస్త్రం ఏమి చెబుతుందో చూడండి.

అసూయ లేనివాడు మంచి గుణాలను అసహ్యించుకోడు. ఫలానా వ్యక్తి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడైనాడంటే, ' ఆ, కాపీలు కొట్టాడులే అని అనడు మంచి తక్కువగా ఉండినా పెద్దగా స్వీకరిస్తాడు. చీమ అది దుమ్మునంతా వదలి చెక్కెరనే తీసుకుంటుంది. 'మక్షిక మనగా, ఈగ. ఈగ మంచి చోటునంతా వదలి మురికిపైననే వాలుతుంది. భక్తుడు ఇతరులలో దోషాలు

లోపాలు కనపడినా, వాటి ప్రభావాన్ని తన మనసుపై పడనీయదు. అన్నీ ఒక యెత్తు. అగస్త్యుడు ఒక ఎత్తు అన్నట్లు అన్ని అసురగుణాలు ఒక ఎత్తు అసూయ ఒక ఎత్తు మొత్తం అసుర గుణాలన్నింటికి ఇది ఉపలక్షణం అనగా ప్రతినిధి.

అసూయ అన్నా మత్సరమన్నా యీర్ష్య అన్నా ఒకటే అర్థం. ఇవి పర్యాయపదాలు అరిషడ్వార్గాలంటూ కామ క్రోధ లోభ మోహా మద మాత్సర్యాలను ఆరింటిని పేర్కొంటాము. చివరిలో "మత్సరం" పై వాటికన్నింటికీ కుదురు ఆధారం. యీ మత్సరం అసూయ ఇది ఉంటే అన్నీ ఉన్నట్లే. అసూయా గ్రస్తులకు జ్ఞానబోధ పట్టదు. ఈ అసూయాగ్రస్తునికి జ్ఞానబోధ అంటకపోగా యీ ప్రపంచంలోని ఉన్నతిగా ఉత్సాహంగా వాడు బ్రతుకలేడు. దుర్యోధనునిలాగా వానికుళ్ళే వానిని తినేస్తుంది. పరాయి వాళ్ళ ఔన్నత్యాన్ని వైభవాన్ని చూచి కళ్ళల్లో నిప్పులు పోసుకునే దుష్టరోగమే యీ అసూయ. అది రోగం కాని రోగం. మందులకూ డాక్టర్లకూ లొంగే రోగం కాదు. మంటల్లోకి పోయే వరకు మండే రోగం.

భయానికే భయం కల్గించేవాడు భక్తుడు యముడంటే అందరికీ భయం. మార్కండేయుడు యమునికే భయం కల్గించాడు. శవపిండాన్ని కౌగిలించేవానికి భయం కాని శివపిండాన్ని కౌగిలించుకున్నవానికి భయం యెక్కడిది. పరిచ్ఛిన్నతే భయం. పరిపూర్ణతే నిర్భయం. ద్వైతమే భయం. అద్వైతమే అభయం. శ్వాస పెట్టినవానిపై విశ్వాసం వుంటే నీకు భయమెక్కడిది. విశ్వాస ఘాతకుడు భయగ్రస్తుడు కాకెట్లుండును.

భగవద్గీతలో పండ్రెండవ అధ్యాయం భక్తియోగం అన్నింటికన్నా చిన్నదైనా కీర్తి గొప్పది. ఇందులో ఇరవయ్యో శ్లోకాలు అందులో పదునైదవ శ్లోకంలో ఉన్నాము మనమిప్పుడు. భక్తుని లక్షణాలను ఇంతవరకు పదునారు చెప్పడం



నీ వివాహాన్ని ప్రేమనింపిన నిండు పాత్రలా ఉంచుకోవాలంటే నీవు తప్పు చేసినపుడు ఒప్పుకో!
ఒప్పు చేసినపుడు నోరు మూసుకో.

జరిగింది. ఇప్పుడు 17వ లక్షణం విముక్త, ఉద్వేగుడు ఉద్వేగము లేనివాడు భక్తుడు. ఉద్వేగము అంటే కలత, అలజడి, గజిబిజి, అలజడులలో అల్లాడకుండా ఉండేవాడే ధీరుడని పెద్దలసూక్తి. భక్తుడు అనపేక్షుడు - నిరపేక్షుడు. అపేక్షారహితుడు అపేక్షజీవుని తత్త్వం ఉపేక్ష శివుని తత్వం ఆపేక్షది క్రింది చూపు ఉపేక్షది పైచూపు. అపేక్ష విషయమైన నామరూపాలకు అంటుకొని యుంటుంది. ఉపేక్షసమమైన అధిష్టాన్ని అనుసరిస్తూ ఉంటుంది. యీ అనపేక్షునికి మణులు మాణిక్యాలు రాళ్ళు రప్పలు సుఖము దు:ఖము అన్నింటినీ సమత్వంగా ఆరాధించును సమత్వంగా అనుభవించును.

అర్జునా ! నాకు ప్రియుడివి కావాలంటే నా ప్రేమను పొందాలంటే నా భక్తుడివి కావాలంటే దీని కీలకం దీని సాధన దీని రహస్యము. దీని ఉపాయం చెబుతాను విను. నా హృదయాన్ని తెరచి నా ప్రేమను గ్రహించాలంటే తాళంచెవి కావాలి కదా ఆ తాళం చెవి నా వద్ద నేను పెట్టుకోలేదు. నీ దగ్గరనే నీకే యిచ్చినాను కానీ, నీకా సంగతే తెలియదు. ఆ తెలియ చెప్పుటే నా యిప్పటి ప్రయాస అంతా. నా ప్రేమను కోరేవాడు నా భక్తుడైన అనపేక్షుడు అని గ్రహించుకో. కోటీశ్వరుని భార్య సబ్బు కావాలని నూనె కావాలని యెవరెవరినో అడుక్కుంటే భర్తగారికి అవమానం కాదా. భక్తుడు అనపేక్షుడు. అనపేక్షుడు. అనగా ఒక అర్థం చూపులేనివాడు. అనగా గుడ్డివాడు. గ్రుడ్డివానికి పరుల సహాయం కావాలి. భగవంతుడు అనపేక్షుడు. భక్తుడనగా విభక్తుడు కానివాడు. భక్తుడు భగవంతుడూ ఇర్వురూ ఒక్కటే అట్టివానికి అన్యాపేక్ష ఎక్కడిది. ఆయుస్సు ఉన్నవాని ఆటంబాంబు కూడా ఏమీ చేయలేదు.

అర్జునునికి ఛస్తాననే భయంలేదు. లేదని దేబరించడంలేదు. యీ రెండు తన జీవితంలో ఎన్నడూ విడువలేదు. దీనిని ఇంతటితో విరమించి, యిప్పుడు "శుచి" అనే భక్తుని గూర్చి తెలుసుకుందాము.

విష్ణు సహస్రనామ స్తోత్రంలో శుచి: అను వాక్యం వాడడం జరిగింది. యీ "శుచి" అనుపేరు భగవంతునకూ ఉంది. భక్తునికీ ఉంది. భగవంతుడు తన భక్తుని తన అంతట వానిగా ప్రశంసిస్తున్నాడు. భగవంతుడు " శుచి " అనగా పవిత్రము అని అర్థము. భక్తులందరూ గంగానదిలో స్నానంచేసి వారందరి పాపాలు పోగొట్టుకుంటే ఆ గంగానది పాపం భక్తుడు స్నానం చేయుటచే గంగానదికి ఆ పాపాలన్నీ తొలగి గంగ పవిత్రమౌతుందట. ఏ సాధనాన్ని ఆశ్రయించి మానవుడు సంసారాన్ని తరిస్తాడో ఆ సాధనం పేరు తీర్థం, తీర్థయాత్రలకు వెళ్ళేవారు ఆ తీర్థయాత్రలు తెలిసో తెలియకో చేసిన పాపాల పరిహారానికి ఉపయోగపడేదే.

మహాభక్తులు తీర్థాలను మహాతీర్థాలుగాను వారి మహిమల వలన సాధారణ కర్మలు పుణ్యకర్మలు అవుతాయి. వారు ప్రామాణికంగా పలుకుట చేత శాస్త్రాలు సచ్ఛాస్త్రాలు అవుతాయి. గంగ తనలో స్నానం చేసిన జగత్తుని పావనం చేస్తుంది. కాని తన పాపం పోగొట్టుకునేటందుకు భక్తుని చరణ సంగాన్ని కోరుకుంటుంది గంగ. భక్తుడు తీర్థపాదుడు, తీర్థంకరుడు అన్ని తీర్థాలు పోగొట్టలేని పాపాలు భక్తుల సస్సాంగత్యంతో పూర్తిగా పోగొట్టుకొని పాపికూడా పవిత్రుడు శుచి కాగలడు. అదే భక్తుని శుచిత్వంలోనున్న గొప్పదనం. శరీరం నీటితో శుద్ధిబొందుతుంది. సత్యంతో మనస్సు శుద్ధి అవుతుంది. విద్యా తపస్సులతో జీవునికి శుద్ధి, జ్ఞానంతో బుద్ధికి శుద్ధి కలుగుతుంది. వర్షంగా భూమిపై పడిన నీరు శుచి పతివ్రతయైన స్త్రీ శుచి ప్రజలకు క్షేమం కలిగించే శుచిత్వం అసదృశమైనది. అత్యంత దుర్లభమైనది. బాహ్యాంభ్యంతర శౌచము, భక్తుని సహజ లక్షణము. బైట శౌచమే తెలియని వానికి అంత: శౌచమెలా లభిస్తుంది.

భక్తుని లక్షణాలలో "శుచి" తర్వాత "దక్ష:" అని ఇది యిరవయ్యో లక్షణం.

భక్తుడు దక్షుడు. భాగవతంలో ఒక దక్షుడు వస్తాడు. అతడు శివద్వేషి దక్షుడు. ఇక్కడి దక్షుడు శివప్రేమీ దక్షుడు. ఆ దక్షుడు శివప్రతి కూల దక్షుడు. యీ దక్షుడు శివానుకూల దక్షుడు. దక్షుడు అంటే సమర్థుడు అని అర్థము. ఇంకా చతురుడు కుశలుడు సత్రంలో భోంచేసి మఠంలో నిద్రించే వాణ్ణి సోమరి అంటారు. భక్తుణ్ణి దక్షుడంటూ సమర్థించి టైటిల్ యిచ్చాడు భగవంతుడు. భక్తాగ్రేసరుడైన ఆంజనేయున్ని శాత్రవపురాన్ని కాంచిరావయ్యా అంటే కాల్చి వచ్చిన మహాసాహసి ఆనవాళ్ళు చెప్పి తెల్లవారే లోగా సంజీవకరణి తెమ్మని పంపగా మొత్తం ద్రోణ పర్వతాన్నే తెచ్చి ఎదుట పెట్టిన పరాక్రమశాలి ఏ టైమునకు ఏది చేయాలనే అంతకంటే ముందు ఆ కార్యక్రమాలను చేసి పెట్టే సమర్థుడు ఆంజనేయుడు. అతడు రాముడు వద్ద దీనుడు, రావణుని వద్ద ధీరుడు. గురువు దగ్గర పిల్లి పరుల దగ్గర పులి. అందుకే ప్రాత: స్మరణీయుడైనాడు ఆంజనేయుడు. మరి అర్జునుడు నివాత కవచకాలకేయాదులను ఓడించుట ఉత్తర గోగ్రహణంలో ఒకే ఒక్కడు కౌరవుల నందరిని ఓడించుట, దేవతలంతా అడ్డుపడినా లెక్కపెట్టక ఖాండవ వనాన్ని అగ్నిదేవునకు అర్పణ చేయించాడు. యిది దక్షత అంటే భక్తుడంటే ఇలా ఉండాలి. సమర్థ రామదాసు ఆంజనేయుని అవతారమని అంటుంటారు. ఆ మహానుభావుడు జ్ఞాని భక్తుడు సమర్థుడు దక్షుడూ, ఆయన మహామనీషి. రామదాసు సమర్థ రామదాసు అయ్యాడు. మనందరం దినం వింటున్నా సాపాటు రాములమే గాని సమర్థరాములం కాలేకపోతున్నాము.

గురుపూర్ణిమ సందర్భంగా జగద్గురువులు గురువులకే గురువయిన శ్రీకృష్ణ పరమాత్మ పాదారవిందములకు నమస్సుమాంజలు సమర్పించి జగద్గురువుచే ప్రబోధింపబడిన గీతామృతంలో భక్తియోగంలో పయనిస్తున్నాము. గురుపూర్ణిమ వ్యాసపూర్ణిమ కదా! వీరేమిటి శ్రీకృష్ణుణ్ణి జగద్గురు వంటున్నాడనుకుంటున్నారా!

ఆ విషయం శ్రీకృష్ణుడే తెల్పినాడు. మునులలో వ్యాసుండ నేను పాండవులలో ధనుంజయుండ నేను అని వారే తెల్పినారు యీ వ్యాసుడు వారి అంశమాత్రమే. జనాకర్షణకు ధనాకర్షణకు వేశ్యాస్త్రీకి కావలసినంత నేర్పరితనం ఉంటుంది. ఆ నేర్పరితనం కాదు. కామ కాంచన భ్రమలను కాలదన్ని భగవన్ముఖుడై బ్రతుకుటే నైపుణ్యం అదే చాతుర్యం అదే నేర్పరితనం భగవంతుని సేవచేస్తే ఒక భగవంతుని సేవా ఫలితమే దక్కుతుంది. భక్తునికి సేవ చేస్తే భక్తునికీ భగవంతునికీ ఇర్వురికీ సేవ చేసిన ఫలితం దక్కుతుంది.

భక్తుని 20 ఇరవయ్యో లక్షణం దక్ష: భక్తుడు దక్షుడు సమర్థుడు కుశలుడు నేర్పరి. యీ భక్తుడు సంపన్నుడు అపకారికి ఉపకారం చేసే సాత్విక సంపన్నుడు. ధైర్యవంతుడు భగవంతునకు దక్షుడనే పేరు వుంది. భగవంతుడు రక్షించే వాడే భక్తుడూ రక్షించేవాడే కాని భక్షించేవాడు కాదు. ఇంతవరకు అనపేక్ష శుచిర్దక్ష: పూర్తి అయినది.

ఇపుడు 21 ఇరవై యొక్కటవ లక్షణం " ఉదాసీనం " భక్తుడు ఉదాసీనుడు యీ పదానికి నిరుత్సాహి అనే అర్థం కూడా ఉంది. యీ భక్తుడు వారిలా స్మశాన మనుష్యుడు కాదు. ఉత్ + ఆసీనుడు ద్వంద్వాలకు పైన ఉండే వాడని అర్థం ఉదాసీనుడనే పదానికి జ్ఞాని అని అర్థం కూడా ఉంది. వశిష్ఠుడు జనకునకు జ్ఞాన బోధ చేస్తున్నాడు. అప్పుడు భటులు వచ్చి మహారాజా మిథిలా నగరం అగ్నికి ఆహుతి అయి దహించుకపోతున్నదని తెల్పగా ఆ మిథిలానగరం ఉంటే నాకేమీ కాలితే నాకేమి అన్నాడట. అందుకే ఆయన విదేహుడయ్యాడు. ఉదాసీనత అంటే ఇది ఇంకో సందర్భంలో జనక మహారాజు మీ ఆస్తి కాలిపోతుందండీ అంటే నా ఆస్తి కాలేదికాదు మునిగేది కాదు అన్నాడట. ఇదీ ఆయన స్థైర్యం. ఇలాకాక తనకు అనుభవంలో లేని వేదాంత బోధ గుడ్డి వాడి చేతిలో దీపం వలె ఆ వెలుతురు మందికి ఉపయోగమే గాని

తనకు కానట్లు అనుభవంలేని జ్ఞానం అవస్థలకు నిలయం.

భక్తుడు కపటికాదు కపటి భక్తుడు కాలేడు. నరసింహస్వామి తొడపై కూర్చున్న ప్రహ్లాదుడిలా భక్తుడు మహోన్నత స్థానం అలంకరించాడు. కనుకనే అతడు ఉదాసీనుడు అయ్యాడు. ఇతడు భక్తుడు ప్రాజ్ఞుడు ప్రజ్ఞ అనే సౌధాన్ని ఎక్కి కూర్చున్నాడు. భూమి పై జనులు శోకిస్తున్నారు. శోకం అజ్ఞానుల లక్షణం వేదాంతంలో ఒక సూక్తి ఉంది. అదేమనగా "చూచే వానిగా ఉండు తాకేవాడుగ ఉండవద్దు " అని, కరెంటును చూస్తే ప్రమాదంలేదు కాని తాకితే ప్రమాదం. కల్లు త్రాగితే మత్తు చూస్తే కాదు. ప్రకృతికి సాక్షిగా ఉండు అది పరమాత్మ సొత్తు కర్తృత్వ భోక్తృత్వాలతో తాదాత్మ్యం చెందదు భక్తుడు.

ఈశ్వర సృష్టిబంధం కలిగించరాదు. జీవ సృష్టేబంధ కారకం రాగద్వేషాలు అహంకార మమకారాలు జీవసృష్టి అవే బంధానికి దు:ఖానికి కారణాలు ఉదాసీనుడు వేరే, మధ్యస్థుడు వేరే. ఇద్దరు తగవులాడుతుంటే రెండు పక్షాల వారికి సమాధానం చెప్పి రాజీ చేసేవాడు మధ్యస్థుడు. అతడు ఉభయపక్షాలకు సంబంధుడౌతాడు. ఏ పక్షానికి సంబంధించని నిర్లేపస్థితి కలవాడు ఉదాసీనుడు.

తర్వాత 22 ఇరవై రెండవది " గత వ్యథ: " అనేది భక్తుడు. గత వ్యథుడు అనగా వ్యథలేనివాడు దిగులు చింత ఇతనికి లేవు దిగులు చింత మానసిక దౌర్బల్యం భగవంతునిపై అవిశ్వాసం భక్తికి " క్యాన్సర్ " వంటిదీ జబ్బు. అది ఆహారము ప్రయాస – ప్రగల్భము, అనియమాగ్రహము, జన సంగమ లోలత్వము, యీ ఆరు భక్తిని భంగం చేసేవే. తిండిపోతు ఇంద్రియాలను జయించలేడు. జిహ్వేంద్రియాలకు స్వాతంత్రమిస్తే అన్ని ఇంద్రియాలకు స్వేచ్ఛ ఇచ్చినట్లే "ప్రజల్పము" అనగా అతి వాగుడు. ఇది జ్ఞానమార్గానికి విఘ్నము మాటే విషం – మాటే అమృతం. కాలు జారినా

లాక్కొనవచ్చు నోరు జారితే లాక్కొనే వీలులేదు.  తక్కువ తినాలి.  తక్కువ మాట్లాడాలి.  తక్కువ తింటే డాక్టర్లతో పని లేదు.  తక్కువ మాటలాడితే వకీళ్ళతో పనిలేదు.

తర్వాత భక్తుని 23వ లక్షణం – "సర్వారంభ పరిత్యాగి" ఇది భక్తుని ఇరవై మూడవ లక్షణం.  బహుకార్యాలు బహు వ్యాసంగాల వ్యాసంగం భక్తునికి పనికిరాదు.  మోయలేనంత పనులు బరువులు పెట్టుకొని తల చెడగొట్టుకునే దుర్గతిలో భక్తుడు పడిపోరాదు పడిపోడు ఒక సాధువు ధనాన్ని పోగుచేసినాడు ముహూర్తం దగ్గర పడుతుంది అందరికీ సంతర్పణకు ఆహ్వానాలు పంపినాడు. ఇంతలో ఓ ఆషాఢభూతి భక్తుడు ఆ ధనాన్ని దొంగిలించి పారిపోయాడు.  అప్పుడు ఆ సాధువు అవస్థ బాధ చెప్పనలవి కాదు.  భక్తుడు ఆర్భాటాలు చేయడు "నాహంకర్తా హరి: కర్తా" సర్వకర్త భగవంతుడు నేను నిమిత్తమాత్రుణ్ణి అని భక్తుని భావన " సర్వారంభము " అంటే ఐహిక ఆముష్మిక ఫలవాంఛతో చేసే పనులంటూ అంటారు.  సర్వ కర్మ పరిత్యాగమె సర్వారంభ పరిత్యాగమనగా, ఆత్మ చేసేది కాదు చూచేది మాత్రమే కేవలం ఆత్మ జ్ఞానం కలిగినప్పుడే సర్వారంభ పరిత్యాగం పూర్ణంగా సిద్ధిస్తుంది.  భక్తికి భిన్నమైన ఆరంభాలను (అనగా) అకార్యాలను వదలినవాడే భక్తుడు అంటూ శ్రీరామానుజాచార్యులు అర్థం చెప్పినాడు.

పూర్ణంగా సర్వారంభ పరిత్యాగి స్థితి ఆస్థితి జ్ఞానియందు మాత్రమే వర్తిస్తుంది.  సిద్ధిస్తుంది కర్తృత్వము నుండి విడివడిన వాడు ఒక్క ఆత్మజ్ఞాని మాత్రమే యీ భక్తుని కూడా జ్ఞాని కూటమిలోనికి చేర్చినాడు భగవంతుడు.

ప్రస్తుతం మనం భగవద్గీతలో 12వ అధ్యాయం భక్తుని లక్షణాలను భగవంతుడు మనసారా కీర్తిస్తున్నాడు.  ఆ భక్తుని సంకీర్తనలు మనం వింటున్నాం.  యీ 12వ  ఆధ్యాయంలో మొత్తం 20 శ్లోకాలు అన్నింటి



**ఏమైనా నీ పని నీవు చేయక తప్పదు.  కనుక దాన్ని ఇష్టంగా చేస్తే ఎక్కువ శ్రమ పడకుండా పూర్తి చేయగలుగుతావు.**

కంటే చిన్న అధ్యాయం భక్తి శక్తిలో అన్నింటి కంటే విలువైనది ఎందుకనగా, జ్ఞాని అహంకారంలో పతనం కావచ్చునేమో గాని భక్తుడు అహంకారానికి గురి అయ్యే అవకాశాలు లేవు. యీ ఆధ్యాయం " విశ్వరూప సందర్శన యోగం" తర్వాత భక్తి యోగం వచ్చింది. అనగా విశ్వరూపంలో సర్వం భగవస్వరూపంగా దర్శించిన భక్తుడు యిప్పుడు విశ్వంలో యే వస్తువును ద్వేషించినా భగవంతుని ద్వేషించినట్లే కదా భక్తీ భగవంతుడూ భగవన్నామము భక్తుడు వీరందరూ సమానమేనని పెద్దల అభిప్రాయము.

తర్వాత 24వ లక్షణం " నహృష్యతి " అనగా భక్తుడు హర్షంలో ఉబ్బిపోడు హర్ష వివశుడు కాదు ఇంద్రియాలకు హృషీకాలని పేరు హర్షాన్ని కలిగించేవి కనుక హృషీకములని పేరు ఇంద్రియాలకు హర్షములేదు. అనగా, ఏడుస్తూ ఉంటాడని అర్థంకాదు. ఇంద్రియ వృత్తి వ్యాపారాలకు దాసుడు కాడని అర్థం. అవి వూపినట్లు తాను వూగడు. హర్షము వేరే ఆనందము వేరే. ఆనందము ఆత్మభావము హర్షము అనాత్మభావము. ఆనందము సహజ స్వభావము హర్షము కృత్రిమము ఐశ్వర్యము అధికారము ప్రశంస ప్రతిష్ఠ మానవుని మదోన్మత్తుని చేస్తాయి. కైపులో పడేస్తాయి. ఐశ్వర్యము మానవున్ని గ్రుడ్డివానిగా చెవిటి వానిగా చేస్తుంది. అది హాలా హలానికి చెల్లెలు. హర్షించే సన్నివేశాలలో కూడా ఆవేశానికి లొంగనివాడే భక్తుడు యోనహృష్యతి భక్తునికి హర్షం ఉండదు. హడావిడి ఉండదు. ఆవేశం ఉండదు. ఇలాంటివాడే నా భక్తుడు.

ఇక 25వ లక్షణం " యోనద్వేష్టి " భక్తునికి ద్వేషం ఉండదు. భక్తునికి దు:ఖం ఉండవచ్చు గాని ద్వేషం ఉండరాదు. " అద్వేష్టా సర్వభూతానాం " అనే వాక్యంలో మొదలయ్యింది భక్తుని లక్షణాల గూర్చి మరలా " యోనద్వేష్టి" అని అదే వాక్యం మరలా చెబుతున్నాడు పైగా యీ వాక్యం అతి ముఖ్యమైనది భక్తునికి గనుక.

తర్వాత 26వ లక్షణం "నశోచతి" యీ అమృత ఘట్టంలో మునిగియున్నాడు. భక్తుడు శోకింపడు కష్టాలు కర్మతో వస్తాయి. శోకం అజ్ఞానంతో వస్తుంది.

శ్లో ॥ శోక స్థాన సహస్రాణి – భయస్థాన రతానిచ
దివసే దివసే మూఢం – అవిశంతి న పండిత: ॥

తా ॥ నూర్ల కొలది భయాలు వేల కొలది శోకాలు దినదినమూ అజ్ఞానిని ఆక్రమిస్తూ ఉంటాయి కాని భక్తుని జ్ఞానిని పండితుని అవియేమీ చలింప జేయజాలవు.

ఒక వ్యక్తి పరుగెత్తుకుంటూ వెళ్ళి అయ్యా నా కొడుకు నా భార్య నాపై అలిగి వాదులాడి పారిపోయారు. మీరేమైనా చూశారా అని ఒక పెద్ద మనిషిని అడుగగా, అయ్యా నీ భార్య పేరేమి నీ కొడుకు పేరేమి అని ఆయన అడుగగా అయ్యా నా భార్యపేరు "భయం" నా కొడుకు పేరు శోకం అన్నాడు అయితే నీ పేరేమి పెద్దాయన ప్రశ్న నాపేరు అజ్ఞానం అనగానే నీవేమి వెదక నక్కరలేదు అజ్ఞానమే అన్ని శోకాలకు పుట్టినిల్లు. వారు వెంటనే నీ దగ్గరకే వస్తారు నీవేమీ చింతించకుండ ఇంటికి వెళ్ళు అన్నాడట అవివేకము అన్ని అనర్థాలకు మూలమట శోకము మనోధర్మము నాకు శోకం అనుకోవడం అజ్ఞానం భక్తుని దృష్టిలో కష్టాలు విపత్తులు భగవంతుని ప్రసాదాలు నాకు సదా విపత్తులే ఇమ్మని కుంతీదేవి కోరింది భక్తుని భూమిక వేరే అభక్తుని భూమిక వేరే నీళ్ళలో బరువు మోయడం వేరు భూమిపై బరువు మోయడం వేరు అదే భక్తుని గొప్పతనం.

తర్వాత 27వ లక్షణం నకాంక్షతి కోరికలు కోరని వాడని అర్థం ఓడేవాడు వీరుడు కాదు – కోరికలు కోరేవాడు భక్తుడు కాదు. యోధుడు గెలువనైనా గెలుస్తాడు చావనైనా ఛస్తాడు కాని ఓడిపోవడం మాత్రం జరుగదు.

భక్తుడు ఇతరులనే కాదు భగవంతున్ని కూడా ఏమీ కోరడు. ఎందుకనగా తన ప్రభువు అజ్ఞాని కాదుకదా అల్పజ్ఞుడు కాదు కదా భగవంతుడు ప్రత్యక్షమై భక్తునితో ఏమి కావాలో కోరుకో అంటే భక్తుడన్నాడు స్వామీ నాకేమీ కావాలో అజ్ఞానిని నాకేమి తెలుసు నాకు ఏమిస్తే మంచిదో అది ప్రసాదించండి ప్రభూ అన్నాడట ప్రహ్లాదునితో నరసింహస్వామి బాబూ నా కొరకు చాలా బాధలు పడ్డావు ఏమి కావాలో కోరుకో అని భగవంతుడు తెల్పగా ప్రహ్లాదుడు అంటాడు స్వామీ మీ మాట నిరాకరించలేను. వరం ఇచ్చే తీరాలని పట్టుదల మీకుంటే దేవాదిదేవా నా హృదయంలో ఎలాంటి కోరికలు లేకుండా వుండేటట్లు వరాన్ని ప్రసాదించండి అన్నాడు ప్రహ్లాదుడు. ఇప్పుడు చెప్పుకునే భక్త లక్షణాలలో “నకాంక్షతి” అనేది యిరవై ఏడవ లక్షణం కోరికలు కోరని వాడని దాని అర్థం కోరికలు కోరేవాని యోగ్యతను తెలిపే దిక్సూచికలు “ తలపే తెలివిని తెలుపును – పలుకే భావంబుతెలు పు॥ అని సూక్తి కోరిక కొరతను చూపిస్తుంది. కోరికలు బలహీనుల లక్షణం భక్తుడు పూర్ణుడు పూర్ణత బలశాలి లక్షణం భక్తుడు కామదాసుడు కాడు – అతను రామదాసుడు.

“శుభాశుభ పరిత్యాగి” ఇది భక్తుని ఇరవై ఎనిమిదవ లక్షణం 28 భక్తుడు శుభాశుభ పరిత్యాగి అటువంటివాడు నాకు అత్యంత ప్రియుడని భగవంతుడు సెలవిచ్చాడు భక్తుడు. త్యాగి పైపెచ్చు పరిత్యాగి భగవంతుడు పట్టుకున్న మురళిలాగా భక్తుడు పరిపూర్ణంగా త్యాగి సూర్యుని మీదకు చేరిన వానికి రాత్రింబగళ్ళు లేవు అద్వైత నిష్ఠునికి శుభాశుభా లెక్కడివి సర్వము వాసుదేవుడై ఉండగా శుభమేది అశుభమేది శుభాశుభ దృష్టి వదలడమే శుభము విశ్వమే విష్ణువైనప్పుడు విష్ణువు కాని వస్తువేది శుభాశుభాలకు తావెక్కడిది అద్వైతంలో శుభాశుభాలకు స్థానం లేదు. జీవితంలో శుభాశుభాలు సుఖదు:ఖాలు వస్తుంటాయి. ప్రతి ప్రసంగం ప్రతి యొక్క పరిస్థితి యేదో యొక పాఠాన్ని



**ప్రతి ఒక్కరూ కష్టసుఖాలు అనుభవించక తప్పదు. సత్కార్యములను దైవకార్యములుగా భావించి కర్మఫలాలను దైవార్పితంగా చేయుట మంచిది.**

నేర్పేందుకు యేదో ఒక సందేశాన్ని అందించే కోసం వస్తుంటుంది శుభంకాని దు:ఖం గాని కష్టంగాని సుఖంగాని ఇవి ఒంటరిగా రావు. సుఖంలో దు:ఖము, దు:ఖములో సుఖము శుభంలో అశుభం అశుభంలో శుభం కలుసుకొనే ఉంటాయి. సూక్ష్మదృష్టి కలవాడై ఎవడీ రహస్యాన్ని గుర్తిస్తాడో వాడెట్టి పరిస్థితులలోను తక బికలు బొందదు శుభంలో పొంగిపోడు. అశుభంలో కుంగిపోడు. ఒక వ్యక్తిని చూసి కష్టాలతో చాల బాధ పడుతున్నావే అని ఒకడన్నాడట. ఎందుకు బాధ " కష్టాలను కష్టాలు అనుకోవడంతో వచ్చింది బాధ " అని ఆన్నాడట అతను. మరింత దూరం చూపుతో వేరే వ్యక్తి అదేం కాదు. సుఖాలను సుఖాలను కోవడంతోనే వచ్చింది ఈ బాధంతా అన్నాడట. కుంతీదేవి తనకు విపత్తులేకావాలని కోరింది. ఈ విపత్తులను మనం అశు భం అనుకుంటాం. ఒక భక్తుడంటాడు

శ్లో ॥ విపదోనైవ విపద: – సంపదోనైవ సంపద:
విపద్విస్మరణం విష్ణో: – సంపన్నారాయణ స్మృతి:

తా॥ విపత్తులు విపత్తులు కావు – సంపదలు సంపదలు కావు.
భగవంతుని విస్మరించుటే విపత్తు – భగవంతుని స్మరణే సంపత్తు

మనం ప్రస్తుతం భక్తియోగంలో భక్తుని లక్షణాలను భగవంతుడు మనసారా కీర్తిస్తున్నాడు. భక్తుని వర్ణించుతూ చెప్పిన శ్లోకాలు ఎనిమిది. వాటికి "అమృతాష్టకం" అని భగవంతుడే పేరు పెట్టినాడు. కృష్ణాష్టకం లక్ష్మీ అష్టకం, చంద్రశేఖరాష్టకం అంటూ చాలా అష్టకాలు గలవు. వాటన్నిటికంటే విలక్షణమైనది భగవంతునిచే కీర్తించబడినది. ఇది అమృతాష్టకం. పాలసముద్రంలో పుట్టిన అమృతం ఆయన దృష్టిలో అమృతం కాదు కామాది వికారములను విచారించలేని అమృతము అదేమి అమృతము. చంద్రునిలో



**ధనమెంత సంపాదించినా అణువంత కూడా వెంటరాదు. స్వార్థ చింతన వదలిన నిష్కామ కర్మతో జ్ఞాన ధనం సంపాదించు.**

ఉండే అమృతము చంద్రుని క్షయరోగాన్నే నిర్మూలించలేని అమృతం దాని జోలి మన కెందుకు.

భక్తుడు అమృత స్వరూపుడు. భక్తి అమృత స్వరూపం దాని రుచి దాని అనుభవం పొందిన నారద మహర్షి తన భక్తి సూత్రాలలో " అమృత స్వరూపాచ " అని నోట్ చేసి పెట్టాడు. నారదుడు " సర్టిఫై " చేసిన భక్తి భగవంతుని పాలిట అమృతం భగవంతుడు ఆ అమృతాన్నే పానం చేస్తున్నాడు. చేయిస్తున్నాడు. మనం ఇంతవరకు 28 లక్షణాలు చెప్పుకున్నాం. ఇపుడు 29 వ లక్షణం " సమశ్శత్రౌ చ మిత్రౌ చ "శత్రుమిత్రులయందు సమ భావం గలవాడు నా భక్తుడు. ఏకామ్రనాథుడు మహా భక్తుడు జ్ఞాని ఆయన ఎప్పుడూ సంతోషంగా ఉండేవాడు. ఆయనకు దు:ఖం కలిగిస్తే 500లు అయిదువందల రూపాయలు ఇస్తానన్నాడట. ఒక అసూయపరుడు ఆ డబ్బులకు ఆసించి ఒక వ్యక్తి ఏకామ్రనాథునికి కష్టం కలిగించాలనే ప్రయత్నంతో ఆయన రోజూ నదికి వెళ్ళి స్నానం చేసి బిందెతో నీళ్ళు తెచ్చే మార్గంలో గోడపైన కూర్చుని ఆకులువక్కలు సున్నము కాచు అన్నీ దండిగా దంచి పెట్టుకొని ఏకామ్రనాథుడు వచ్చే సమయానికి నోటినిండా తొక్కుపెట్టుకొని ఏ కామ్ర నాథుని పై ఉమ్మి వేస్తాడు. ఇలాగే సాయంత్రం వరకు వీడు ఉమ్మి వేయడం ఆయన తిరిగి నదికి వెళ్ళి స్నానం చేయడం చివరకు వీడి దగ్గెర సరుకు అయిపోయింది. వీనిలో పరి వర్తనం వచ్చింది. వీడి కఠిన పాషాణ హృదయం కరిగింది ఔరా ఉదయం నుండి సాయంత్రం వరకు ఉమ్మివేసినా కనీసం తలయెత్తి పైకైనా చూడ లేదే ఇటువంటి శాంతమూర్తిని మహాభక్తుని అవమానం చేసి మహాపాపినైనానే అని పశ్చాత్తాపపడి ఆయన కాళ్ళపైపడి క్షమించమని వేడగా ఏకామ్రనాథుడు అంటాడు అయ్యో నీవు నాకు మహోపకారివి నీకు నేనెంతో ఋణపడినాను అన్నాడట. అదెట్లు స్వామీ మహాపాపిని మీరు క్షమించడం

గాక నేనేదో మేలు చేశినానంటారే అదెట్లు సాధ్యం స్వామీ అని అడుగగా, బాబూ యీ రోజు వైకుంఠ ఏకాదశి నీ దయ లేకుండిన నేను ఒకతూరే స్నానం చేసి ఒక తూరే విష్ణు సహస్రనామ పారాయణం చేసేవాడిని నీ మూలంగా 108 తూర్లు స్నానం చేశాను 108 తూర్లు విష్ణు సహస్రనామము పారాయణ చేశాను. యీ భాగ్యం నాకు లభింప జేసిన పరమ పుణ్యాత్ముడవయ్యా నీకే నా నమస్కారం అన్నాడట. ఆ మాటతో ఆ వ్యక్తి పూర్తిగా మారి ఏకామ్రనాథుని శిష్యుడై పరమ భక్తుడయ్యాడట. ఇది " సమశ్శత్రౌచ మిత్రౌ చ "

తర్వాత 30వది " తథా మానావ మానయో:" సన్మానంలోనూ అవమానంలోనూ భక్తుడు సమానంగానే ఉంటాడు. భక్తుడు వాని బుద్ధి ఏక త్వంగానే ఉంటుంది. లోకం గౌరవించవచ్చు. అగౌరవించవచ్చు. సాధకుడు కాని భక్తుడు కాని ఆవైపు దృష్టి పెట్టరాదు. ధర్మశాస్త్రం ఏమి చెబుతుందంటే " అవమానాత్తపోవృద్ధి " సన్మానాత్తపస:క్షయ: " సన్మానాలలో పుణ్యఫలం తరుగుతుంది. మానావ మానాలు అహంకార దేవతకు పత్రపుష్పాలు మానంతో పుష్ట మౌతుంది. అవమానంతో దుష్టమౌతుంది. ఏ రెండు ముఖాలా దానికి ప్రకోపమే భక్తుడు మానావ మానాలలో " బ్యాలెన్సు" చెడడు. సమస్థితిని కోల్పోడు. మానావమానాలు యీ రెండూ అహంకారి రాజ్యంలోగాని భక్తుని రాజ్యంలో గాని ఉండవు. భగవంతుడు భక్తుని వర్ణిస్తూ మత్తుడైనాడు. ఆ ఆనందంలో చెబుతూనే ఉన్నాడు. మనం వింటూనే ఉన్నాం.

ఇప్పుడు 31వ లక్షణం "శీతోష్ణ సుఖ దు:ఖేషు సమ: " శీతలంలోనూ ఉష్ణంలోనూ భక్తుడు సముడు సమత్వం బ్రహ్మలక్షణం విషమత్వం సంసారలక్షణం సమ అనే పదానికి సాధకుని పరంపరగా అర్థము బ్యాలెన్సు చెడకుండుట యీ ద్వంద్వ సహిష్ణత భక్తుని కే కాదు సాధకునికీ అవసరమే

యోగా రూఢునికీ అవసరమే సుఖమునకు దు:ఖానికి మనస్సును కల్లోలం చేసుకోడు. ఇవి రెండూ అందరికీ వస్తూ పోతూ ఉండేవి. శీతోష్ణాలు ప్రకృతి ధర్మాలు – ప్రపంచ ధర్మాలు సుఖ దు:ఖాలు మనోధర్మాలు ప్రకృతిని మార్చాలనుకోవడం వృధా ప్రయాస నీ మనస్సును మార్చుకో సృష్టిని మార్చలేవు దృష్టిని మార్చుకొమ్మని పెద్దల సూక్తి మనము ఇంతవరకు "శీతోష్ణ సుఖ దు:ఖేషు సమ: " గూర్చి తెలుసుకున్నాము. ప్రస్తుతం 32వ లక్షణం యీ సుఖదు:ఖాలు నానుండే ప్రాణులకు వస్తాయని గీతలో పలు మార్లు గీతా చార్యుడు తెలిపియే యున్నాడు. తద్వారా యీ పదానికి ఎంత మహత్వముందో తెలుసుకోవచ్చు. ఆ దయాపరుడు యీ సుఖదు:ఖాలను ఎందుకు పంపాడో మనకేమి తెలుసు. ఏడుస్తూ అయినా అనుభవించాలి నవ్వుతూ అయినా అనుభవించాలి. భగవంతుని యిచ్చలో తన యిచ్చ కలుపుటే భక్తునికి శోభ. ఏడుస్తూ ప్రతి కూలిస్తే భగవంతునికి క్లేశం కలిగించి తాను క్రొత్త రాగద్వేషాలను క్రొత్త కర్మను సృష్టించు కోవడమే అవుతుంది.

ఆ ద్వంద్వాలు తనకు లేకుండా చేయమని భక్తుడు భగవంతుని కోరుకోడు. ఆ ద్వంద్వాలు వచ్చినా ఓర్చుకునే శక్తిని ఇవ్వమని కోరుతాడు. ఇవి కలకాలం ఉండవు కదా వచ్చినవి, ఎటూ పోతాయి. వీటిని తెలివితో సహించుకోవడం శౌర్యవంతుని లక్షణం ఓర్చుకోవయ్యా అంటూ అంత సన్నిహితుడైన అర్జునునికే ఆయన బోధించాడు కాని యేదో మంత్రం చేశి మటుమాయం చేస్తానని అనలేదే ఇష్టము కష్టము ప్రారబ్దంతో వస్తాయి సుఖం దు:ఖం అజ్ఞానంతో వస్తాయి. కలలోని, సుఖ దు:ఖాలు యెట్లో జాగ్రత్తలోని సుఖదు:ఖాలు అట్లే సమానమే భక్తుని విషయంలో ననేగాక కార్యసాధకుని విషయంలోనూ " లెక్కకురానీయడు కార్యసాధకుడు " అన్నాడు. భర్త్రుహరిగూడా భగవత్ ప్రియుడైన భక్తుని సంగతి మరి చెప్ప వలసిందేముంది. యీ ఆధ్యాయానికి



**ధనమున్నవాడు దానిని కాపాడుకోవడానికి కష్టపడుతుంటాడు. ధనం లేని వాడు ధన సంపాదనకు కష్టపడుతుంటాడు. ఇర్వురూ ఆనందంగా ఉండలేకున్నారు.**

భక్తి యోగమని పేరు యీ ఆధ్యాయం భక్తి షట్కానికి గోపుర శిఖరం వంటిది. అందులోనూ భక్తుని గుణ గౌరవాలను వర్ణించే చివరి ఎనిమిది శ్లోకాలు ఆ శిఖరానికి కలశం వంటివి యీ ఘట్టానికి అమృతాష్టకమని శ్రీ కృష్ణ పరమాత్మనే పేరు పెట్టినాడు. యాత్రికులు శిఖరానికి నమస్కరిస్తేనే పూర్ణ యాత్రా ఫలితం పొందగల్గుతారని పెద్దల వాక్యం యీ అమృతాష్టక విషయం కూడా అంతే మనం ఇంత వరకు భక్తుని భక్త లక్షణాలను 32ని గూర్చి తెలుసుకున్నాము. ఇపుడు 33వ గుణం "సంగవర్జిత:" భక్తుడు అన్ని విధాలా సంగాన్ని వర్జించినాడని అర్థం సంగమంటే సక్తి ఆసక్తి సక్తితో జీవుడు బద్ధుడౌతాడు. విరక్తితో ముక్తుడౌతాడు. నాది అంటే అపచారం నీది అంటే ఉపచారం. మేమే అంటూ మేక బలై పోయింది. తూ తూ అంటూ గోరు వంక పోషింపబడింది. మే అంటే నాది అని అర్థం తూ అంటే నీవు అని అర్థం.

గీతాచార్యులకు నమస్కరించి గీతా భవనంలోని 12వ అంతస్థులో మనం పయనించుచున్నాము. ఇంతవరకు భక్తుని లక్షణాలు (33) చెప్పుకున్నాం. వికారాన్ని కల్గించే సంబంధమే సంగమము తన చుట్టూ ఉండే జడచేతన పదార్థాల పరిణామాలతో హర్ష శోకాలకు గురి అవుతూ యుంటారు అవివేకులు.

ప్రపంచం ఒక మ్యూజియం లాంటిది మ్యూజియం భద్రపరచిన వస్తువులను దర్శించాలి. సంతోషించాలి అంతేకాని అంటడానికి అనుభవించడానికి అపహరించడానికి వీలుండదు. అది నీ సొంతం కాదు. అది జాతీయ సంపద దూరంనుండి ఆదరంతో చూడు తృప్తిపడు. ఆలాగుననే యీ ప్రపంచం యీశ్వరుని సొత్తు అంటుకుంటే అసభ్యం అపహరిస్తే నేరం అనుభవిస్తే శిక్ష ఆదరించి శోభాసంపన్నం చెయ్యి అనుభవించి యెంగిలి మంగళం చెయ్యవద్దు.



**ధనము భార్యాబిడ్డలు బంధువులు వస్తువులు ఇహలోకమునకే పరిమితం పరలోకములో నీకు సహకరించేది పుణ్యఫలము భగవంతుడు మాత్రమే.**

విష్ణురూపంతో ఉండే యీ విశ్వం పూజ్యంకాని భోజ్యం కాదు సుమా, ప్రపంచంలో కెమెరాలాగా ఉండవద్దు అద్దంలాగా ఉండు కెమెరా చూచిన దాన్నంతా పట్టుకుంటుంది. ఇక వదలదు అద్దం అన్నింటినీ చూస్తుంది. దేనినీ పట్టుకోదు. భక్తుడు అద్దంలా ఉంటాడు దేన్నీ పట్టుకోడు. అతడు సంగవర్జితుడు గనుక సముద్రంలో యే చిన్న గడ్డిపరక పడినా బైటకి తోసేస్తుంటాడు సముద్రుడు. ఏమోలెమ్మని అశ్రద్ధ అయితే తుదకు నన్నే ముంచుతుందని సముద్రునికి భయం అందుకే సముద్రుడు దత్తాత్రేయులకు గురువైనాడు. భగవంతుని శ్రీవాణి నుండి చెప్పబడిన భక్తుడు ఆ భక్తుని లక్షణాలను మనం వింటున్నాం. 33 ముప్పై మూడు లక్షణాలను చెప్పుకున్నాం. ఇప్పుడు 34వ లక్షణం 'తుల్యనిందాస్తుతి' నిందాస్తుతులలో సమతుల్యుడు భక్తుడు నింద అనే తులలో పెట్టి తూచినా స్తుతి అనే తులలో పెట్టి తూచినా భక్తుడు మ్రొగ్గడు తగ్గడు విషయ పరిస్థితులలో సమత్వాన్ని సాధించే వ్యక్తిత్వం భక్తునిది శీతోష్ణాలు మానావమానాలు శుభాశుభాలు నిందాస్తుతులు దేహం ఉండే వరకు ప్రపంచం ఉండే వరకు తప్పనిసరి వచ్చే ద్వంద్వాలు భక్తుని భక్తికి ఒఱిపిడి రాళ్ళు. యీ పరీక్షలో నిగ్గినపుడే అతడు భక్తుడు. వేషధారి భక్తుల సంగతి భగవంతుడు మెచ్చడు. భగవద్గీతకు నచ్చదు నాటకంలో " కబీరు " భక్త కబీరు కాలేడు లేని దోషాలను చేయడమే నింద. నింద మానవుని స్వస్థత చెడగొడ్తుంది. " నిర్దోషి " అని నిరూపించుకోవడం అందరికీ ప్రీతి నిజంగా ఆత్మ లక్షణం అదే ఆ లక్షణమే అందరిలో ప్రతీతమౌతుంది.

కాని నిందించడం అనేది చాలా మందికి రుచియైన ఆహారంగా అలవాటై పోయింది. ఎవరినో ఒకరిని నిందిస్తూ ఉంటేనే వారికి తినిన తిండి జీర్ణమయ్యేది నింద చేసేవాడు తానే నేర్పు కలిగిన వ్యాపారినని దుమ్మును కూడా సొమ్ము చేసుకుంటుంటాడు. పొట్టులో కూడా గట్టిని సంపాదిస్తాడు.

“ నన్ను వాడు నిందిస్తే నాకు పోయిందేమీ లేదు పొగిడితే వచ్చిందేమీ లేదు వానికదేదో రుచి ఆత్మ పరిశీలన చేసుకునేందుకు అతడు నన్ను ప్రేరేపిస్తున్నాడు. అతడు నాకు తల్లికంటే కూడా గొప్ప ఆప్తుడు. తల్లి తన చేతితో మైలను తీసేసేది. ఇతడు నాలుకతోనే మైలను తొలగిస్తున్నాడు. తల్లి చేయలేని పని ఇతడు చేస్తున్నాడు. ఇతడు నాకు అత్యంత పూజనీయుడు అంటాడు భక్తుడు. నిందతో మానవుడు జాగృతిని పొందుతాడు. నిన్ను నిందచేసేవాని యింటి పొరుగున అద్దెకైనా కాపురం చెయ్ అంటాడు కబీరు. నిన్ను నిందించే వాని పేరు నీ కొడుకునకు పెట్టుకొమ్మంటాడు ఏకనాథ స్వామి.

నింద చేసేవాని నాలుకలోనూ స్తుతి చేసేవాని నాలుకలోనూ ఉండేది భగవంతుడే. రెండూ భగవంతుని ప్రసాదాలే ఇదీ భక్తుని భావన కనుక భక్తుడు నిందలోనూ కృంగడు. స్తుతిలోనూ పొగడ్తలోనూ పొంగడం ఉండదు. పొగిడేవాడు మరింతా సద్గుణాలను సంపాదించుకునేందుకు ప్రేరేపిస్తున్నాడని భక్తుని భావన పొగడ్తలకు లొంగిపోయేది స్త్రీ స్వభావం మాటకారిత్వానికి వశులై బోల్తా పడడం స్త్రీలకు సహజం పరమార్థ సాధకుడు స్తుతిలో సావధానంగా ఉంటాడు. భక్తుడు నిందను స్తుతిని సద్వినియోగం చేసుకొని ఆత్మలాభాన్ని సంపాదిస్తాడు భక్తుడు. “తుల్యనిందాస్తుతుడు ” తర్వాత “మౌని” అనేది 35వ లక్షణం భగవంతుడన్నా మౌనమన్నా ఒకే అర్థం మనస్సు మౌనం వహించిందా అదే సమాధి యోగం అదే పరమాత్మ స్థితి భగవంతుని స్వరూపం యీ దృష్టితోనే గతంలో మౌనాన్ని మానసిక తపస్సని చెప్పబడింది. “ఊరకున్న వాడు ఉత్తమయోగిరా ” అన్నాడు వేమన యోగి కూడా. ఊరుకుంటే దేవుడు, ఊగులాడితే జీవుడు మౌనంలో మహత్తర శక్తులున్నాయి. శక్తుల ఆవిరాట్ భవనానికి మౌన మొక తాళపు

చెవి అందుకే దానిని గుహ్యమన్నారు. ఆ విభూతిని తనలో నెలకొల్పుకొని భక్తుడు "మౌని" అయ్యాడు.

భక్తుని లక్షణాలను చెప్పుకుంటున్నాం భక్తుడు మౌని అది 35వ లక్షణం యీ భక్తుని లక్షణాలను ఎంత చెప్పుకున్నా అనుభవం అనుభవంతోనే రావాలిగాని మాటలతో రాదు అయినా కొంత వరకు సాధన రూపంలో మాటలు పనికి వస్తాయి. మౌనంలో యెంత గొప్పతనం లేకపోతే దక్షిణామూర్తి ఎందుకు మౌనం అవలంబిస్తాడు. శ్రీకృష్ణుడు మౌనం నా విభూతి అని ఎందుకు అంటాడు. మౌన గీతాన్ని మరిగిన వారు మాటలరుచిలో పడరు. మౌనం అంటే సామాన్యంగా యేమీ మాట్లాడకుండావుంటే దానిని మౌనం అని చెప్పుతూ ఉంటాం అది స్థూలమైన అర్థం మాటలాడాలనే ప్రేరణే లేకుండ మాటలాడుటే వ్యర్థమైన స్థితికి పోతే అది సూక్ష్మార్థం కాని అది పొందడం చాలా కష్టం. " మౌనేన మనీషి " అనే సూక్తి ఉంది. వాచాప్రియులైన వారు కవులుగా ఉండేవారు యిలాంటి మనీషులుగా తయారు కావాలని ప్రయత్నించాలి. మౌనంలో ఒక అంతరార్థం ఉంది. యోగ్యమైన విషయంలో మాట్లాడుట కూడా మౌనమే మాటలు ఎలా అనర్థాలు తెచ్చి పెడ్తాయో ఒకొకప్పుడు మౌనం కూడా అనర్థం చేస్తుంది. వివేకం లేని మౌనం అనర్థకారి కావచ్చు వివేకంతో కూడిన మాట ఫలవంతం కావచ్చు కౌరవ సభలో ద్రౌపతికి పరాభవం జరిగే సమయంలో భీష్మద్రోణుల మౌనం అనర్థకారి అయ్యింది ఇలాంటివి ఎన్నో ఎన్నెన్నో.

ఇక 36 ముప్పై ఆరవ లక్షణం " సంతుష్టోయేనకేనచిత్ " ఎంతో అంతతో తృప్తి పొందే వాడు భక్తుడు ఇదే భావాన్ని భాగవతంలో బలిచక్రవర్తి అంటాడు" సంతుష్టుడీ మూడు జగముల పూజ్యుండు, సంతోషికెప్పుడు జరుగు సుఖము సంతోషికాకుండ సంసారహేతువు సంతసంబున ముక్తి సతియు దొరుకు

అన్నాడు. దానవరాజు సంతుష్టి సార్వభౌమ పదవితో సమానమైనది కోరికలు లేనివాడే ఫకీర్. తృప్తిగా ఉండే వాడే శ్రీమంతుడు. తృప్తిలేనివాడే దరిద్రుడు. ఆస్తి లేకపోతే కాదు దరిద్రుడు ఆశ యెక్కువ అయితేనే దరిద్రుడు. ఆస్తి వుంటే కాదు ధనవంతుడు ఆశ లేకుంటేనే ధనవంతుడు. ధన వంతుడని దరిద్రుడని బైట కాదు భావంలో మన మిద్దరం ఒక్కటే ఎంత లభిస్తే అంతటితోనే తృప్తి తృప్తి తుష్టి భక్తుని లక్షణము – అతృప్తి అసంతుష్టి అభక్తుని లక్షణము. భక్తుడు నిత్యతృప్తుడు.

తర్వాత 37 ముప్పై ఏడవ లక్షణము " అని కేత: " భక్తుడు అని కేతుడు నికేతమనగా యిల్లు నివాస స్థానము నికేతములేనివాడు అనికేతుడు. ఇల్లు వాకిలి లేనివాడు అనికేతుడు. ఇది మాటలలో వచ్చే అర్థము. భక్తునికి యిల్లు వాకిలి ఉండదని " సత్రభోజనం మఠం నిద్ర " అనే రకం వాడని దేశ ద్రిమ్మరి అని ఆ మాటకు అక్షరార్థం. వాచ్యార్థం చెప్పుకో కూడదు. ఇంటి యందు నివాస స్థానమునందు మమకారం లేని వాడని అర్థం దేహంతోనే సంబంధంలేనివానికి గేహంతో సంబంధమేమి అనికేతుడు అనగా నిరాశ్రయుడని కూడా అర్థం అన్ని ఆశ్రయములు వదలిన వాడు కాబట్టే భక్తునికీ పరమాత్ముని ఆశ్రయం లభించింది. విశ్వమే తానిది కానప్పుడు విశ్వంలోని ఒక గృహాన్ని నాది అంటూ భక్తుడు యెలా అభిమానిస్తాడు యెలా ఆశ్రయిస్తాడు.

ఒక సన్యాసి అట్లట్లా తిరుగుతూ రాజభవనంలో ప్రవేశించాడు. ద్వార పాలకులెవ్వరూ లేకపోవుటచే లోపలికి వెళ్ళి రాజ సింహాసనంలో కూర్చొని బాగా సంతోషిస్తున్నాడు. మహారాజుగారు పైనుండి వచ్చి ఏమయ్యా సన్యాసీ ఇది సత్రమనుకున్నావా ఎందుకు వచ్చినావన్నాడట. అందుకు సన్యాసి సత్రమంటే అర్థమేమి అందుకు రాజుగారు, వచ్చేవారు వస్తుంటే పోయేవారు



సకల చరాచర జగత్తుకు ప్రకాశకుడు ఆ పరమాత్మయే అట్టి పరమాత్మను అణువణువులో దర్శించువాడే జ్ఞాని.

పోతూ ఉంటారు. అది సత్రం అని రాజుగారి జవాబు మీరెంత కాలంనుండి యీ యింట్లో ఉన్నారు. 40 ఏళ్ళ నుండి - అంతకుముందెవరున్నారు - మా తండ్రి అంతకుముందు మా తాత - మీ తర్వాత మా కుమారుడు - యిక్కడ కూడా వచ్చేవారు వస్తున్నారు పోయేవారు పోతున్నారు. యిదీ సత్రం గాక ఏమౌతుందని సన్యాసి అన్నాడట అని యిదిగో నేనూ వెళ్ళి పోతున్నానని వెళ్ళిపోయాడట నీ గృహంలో నీవు అతిథిలాగా ఉండు యజమానిలా ఉండొద్దు అటువంటివాడే అనికేతుడు.

అనికేతుని గూర్చి ఇంత వరకు తెలుసుకున్నాము. ఇపుడు "స్థిరమతి" అనే 38 ముప్పై ఎనిమిదవ లక్షణం గూర్చి తెలుసుకుందాము. యీ రెండు పరస్పరం సంబంధం ఉన్న లక్షణాలు. దేహం అనికేతమైనవానికి మతి స్థిరంగా ఉండనక్కరలేదు. ఉండదు కూడా. మతి స్థిరంగా ఉండాలి "స్థిరమతి" అనగా స్థితప్రజ్ఞుడు చివరిగా "స్థిరప్రజ్ఞ" లక్షణం చెప్పి భక్తలక్షణాలకే ఉపసంహారం జరిగింది.

భక్తుడంటే స్థితప్రజ్ఞుడు రాయిరప్పలాగా పనిపాటలు లేక వూరక ఉండే వాడని కొందరి అభిప్రాయం. కానీ అలా ఉండేవాడు రోగి అయినా కావాలి. సోమరిపోతు అయినా అయివుండాలి. ఇలాంటి సోమరులకు స్థిత ప్రజ్ఞుడనే పేరు వీరి కెట్లు సరిపోతుంది. కొంత మంది భావనలో పని పాటలు వదలి ఉంటేనే ధ్యానం కుదిరేది. యోగం కుదిరేది అంటారు. కాని అది సత్యం కాదు. అన్ని పనులు చేస్తూ గూడా యోగి కావచ్చు. కొందరు " ధ్యానం సమాధి " అంటూ దేహాన్ని పూరకపెడ్తారు కాని వారి మనస్సు దిక్కుమాలిన దేశాలన్నీ తిరుగుతూ ఉంటుంది.

గీతలో చెప్పినట్లు వారు మిధ్యాచార్యులైన అయివుండాలి. లేక ప్రారంభ సాధకులైనా అయివుండాలి. మరి కొందరి స్థితి బైటా నిశ్చలత లోపలా

నిశ్చలత ఇతడు భగవంతుడు చెప్పిన భక్తుడు. " నారదుడు అనికేతుడు " స్థిరమతి శరీరం ఒక చోట ఉండదు కాని బుద్ధి భగవన్నిష్టము ఆయన శిష్యుడు ధృవుడు నికేతుడు స్థిరమతి స్థితి కలదు మతీ కలదు బైటా ధృవుడు లోపలా ధృవుడు గురుశిష్యులు ఎవరికి వారే గొప్ప గురువు అనికేతుడు। స్థిరమతి శిష్యుడు ఉన్నత కేతుడు అనగా ఉన్నతోన్నతుడని అర్థం. భక్తుడు "స్థిరమతి" అనగా స్థిత ప్రజ్ఞుడు యీ లక్షణం చెప్పి భక్త లక్షణాలను భగవంతుడు పరిసమాప్తి చేశాడు భగవద్గీతకు ఆదర్శమూర్తి స్థిత ప్రజ్ఞుడు.

భక్తుడంటే యేమిటో ఆ విషయం గురించి లోకంలో ఉండే భ్రమలను తొలగించి లోకుల కళ్ళు తెరిపించాడు భగవంతుడు తన భక్తుని సంగతి తనకే తెలుసు. "లోగుట్టు పెరుమాళ్ళ కెరుక " భక్తులారా మేల్కొనండి భగవంతుని మాటలను ఆలకించండి. అనుసరించండి. భగవంతుడు యీ భక్తుని ప్రకరణాన్ని ముగిస్తూ యీ ప్రకరణానికి ఫలశృతిని వినిపిస్తున్నాడు. ఆశీర్వదిస్తున్నాడు. రండు నా యొక్క ఆ మాటను కూడా వినండి.

శ్లో ॥ యేతు ధర్మ్యామృత మిదం యథోక్తం పర్యుపాసతే
శ్రద్ధాదానా మత్పరమా భక్తాస్తే తవమే ప్రియా: ॥

భగవద్గీతలో యీ పంద్రెండవ అధ్యాయం యీ భక్తి యోగంలో యిది చివరి శ్లోకం అమృతాష్టకంలో ఇది ఫలశృతి అత్యంత ముఖ్యమైనది. విలువైన దీ శ్లోకం భక్తుని ప్రశంశ. భక్తుని స్వరూపం భక్తుని గుణగరిమ "అమృత" మంటూ భగవంతుడు పేర్కొంటున్నాడు. భక్తునిగూర్చి అమృత స్వరూపమంటూ సెలవిచ్చాడు. భక్తి అమృతం దీనిని సేవించిన వారూ అమృత స్వరూపులే యీ అమృతం "ధర్మ్యామృతం" వట్టి అమృతం కాదు ఆ వట్టి అమృతం స్వర్గంలో ఉంది. అది స్వర్గామృతం దేవతలు కావాలంటే స్వర్గామృతం పానం



**ఎవడు విషయసుఖాలను కోరుకొనునో వారి మనస్సు విషయాకారమగుచుండును అట్టి మనస్సు మోక్షప్రాప్తికి పనికిరాదు.**

చేయండి. ఎవరైతే యీ భక్తుని 38 లక్షణాలను ఆచరించేందుకు శ్రద్ధవహిస్తారో అట్టి వారు నాకు అత్యంత ప్రియులని యీ శ్లోక తాత్పర్యం ఇది ధర్మామృతం కామ్యామృతం కాదు కామనలను కోరికలను పూర్తి చేసుకునేందుకు సేవించే అమృతం కాదు ధర్మ సిద్ధి కోసం జీవుని పరమ ధర్మ సిద్ధి కోసం భగవత్ప్రాప్తి కోసం భగవత్ప్రీతి కోసం ఆదరించే ఆస్వాదించే ఆచరించే అమృతం ఇది ధర్మరూపమైన అమృతం ధర్మమయమైన అమృతం.

ధర్మమెప్పుడూ అమృతంగానే ఉండదు. ధర్మం చేదుగానే ఉంటుంది. మొదట క్రమేణ క్రమేణ మాధుర్యం మహదానందం ప్రసాదిస్తుంది. ధర్మం అమృతమైతే యీ జనులందరకు దానిపై రుచి అభిరుచి లేదే ధర్మంతోనే అర్థం లభిస్తుంది. కామం లభిస్తుంది శాశ్వతానందం లభిస్తుంది. ఎందుకయ్యా మీరు ధర్మమార్గాన్ని అనుసరించక అధర్మమార్గాన్ని అనుసరిస్తున్నారు అని నేను రెండు చేతుల పైకెత్తి అరచినా ఎవరూ నా మాట వినరే అని శ్రీవేదవ్యాసుల వారంటారు మహా భారతంలో దయ, ధర్మగుణాల్ని ప్రజలలో మేల్కొలుపుతాడు. ప్రజల్ని కంటికి రెప్పవలె కాపాడుతూ పాలించే మంచి పాలకుల్ని ఏర్పరచుతాడు. అప్పుడు మరల సత్యయుగం వస్తుంది. సూర్య వంశస్తుడయిన "మరుత్తు" చంద్ర వంశీయుడైన "దేవాపి" తపస్సు పూర్తి చేసుకొని కల్కి పురుషుని ఆజ్ఞను అనుసరించి రాజులవుతారు.


వీరిలో మరుత్తు ఇక్ష్వాకువంశీయుడు. దేవాపి భీష్ముని తండ్రి శంతనునికి అన్నగారు. ఆనాడు వారు రాజ్యాలువదలి తపస్సులకు వెళ్ళిపోయారు. "కలాప" అనే చోట యోగనిష్ఠులైవున్నారు. వారిని కల్కి మేల్కొలిపి కర్తవ్యం ఉపదేశిస్తాడు. అప్పుడువారు చక్రవర్తులై సత్యయుగాన్ని స్థాపిస్తారు. మానవులు సదాచార సంపన్నులు అవుతారు. సత్యవర్తనులవుతారు. అదే కృతయుగం.

భూమండలం సస్య సమృద్ధం అవుతుంది. సకాలంలో వర్షాలు కురుస్తాయి.



శిల్పి రాతిని శిల్పాకారముగా మార్చుటకు కష్టపడినట్లు తన మనస్సు ఆత్మాకారముగా మార్చుకొనుటకు చాలా కష్టపడాలి.

ఋతువులు సక్రమంగా తిరుగుతుంటాయి. మానవులు తుష్టి, పుష్టి కలిగి దివ్యతేజస్సుతో ప్రకాశిస్తారు. కాలపురుషుడు కాలహంతకుడు. కాలకర్త అయిన శ్రీహరి నామసంకీర్తనమే ఇహపరసౌఖ్యాలనిస్తుంది. ఇది వ్యాస వచనం. ఇదే భాగవత ఆదేశం. ఇదే భారతీయుల విశ్వాసం.






చీకటి ఇంటిలో దొంగలు ప్రవేశించినట్లు అజ్ఞానపు మనసులో దురాలోచనలు ప్రవేశిస్తూ ఉంటాయి. అందుకే జ్ఞానజ్యోతిని వెలిగించుము.

# శ్రీ భగవద్గీత

# పదమూడవ ఆధ్యాయము

# క్షేత్రక్షేత్రజ్ఞ విభాగయోగము

యీ ఆధ్యాయం పూర్తిగా జ్ఞానమార్గంలో ప్రయాణించడం జరుగుతుంది. క్షేత్రం క్షేత్రజ్ఞుడు. దేహి దేహము వీటిని విభజించి నీవెవరో తెలుసుకొమ్మని పూర్ణ జ్ఞానాన్ని బోధిస్తున్నాడు. ఆ దేవదేవుడు భగవద్గీతలో 3 షట్కాలు అవి ప్రథమ షట్కం ద్వితీయ షట్కం పూర్తి చేసుకొని తృతీయ షట్కంలో ప్రవేశిస్తున్నాము. మానవునికి అన్నీ తెలుసు తానెవరో తెలియదు. అన్ని దేశాల నుండి వార్తలు తెలుసుకుంటున్నాడు. తన్ను గురించి తెలుసుకోలేక పోతున్నాడు.

తన్ను తాను తెలుసుకొనకుండ తక్కినవి తెలుసుకోబూనడం పెద్ద అజ్ఞానం యీ మానవుడు ప్రతి వాణ్ణి నీవెవరు, నీవెవరు, అని విచారిస్తాడు. కాని నేనెవరు అని తెలుసుకునే ప్రయత్నం చేయడం లేదు. " ఒకరోజు శ్రీరామచంద్రునికి ఏదో సంశయం కల్గి వెంటనే రాత్రి పురోహితుడు గురువు అయిన వశిష్ఠుని యింటికి వెళ్ళి తలుపు తట్టినాడట. వశిష్ఠుడు లోపలినుంచి ఓ యెవరూ అన్నాడట. అలా అనగానే శ్రీరాములు నేనేనండి అన్నాడట. నేనంటే ఎవరు అన్నాడట వశిష్ఠుడు ఆ విషయం తెలుసుకునేందుకే వచ్చినాను అన్నాడట. శ్రీరాముడు అడుగు అడుగునా గడియగడియకూ "నేను" ను వాడు కుంటూనే ఉన్నాం. కాని దాని స్వరూపాన్ని తెలుసుకోలేదు. ఆ నేనులో కూడుకొని ప్రతి ఇంద్రియం పని చేస్తూ ఉన్నది. మనం మొదటి షట్కంలో కర్మను గూర్చి తెలుసుకున్నాము. ద్వితీయ షట్కంలో భక్తిని గూర్చి

తెలుసుకున్నాము. ఇపుడు తృతీయ షట్కంలో జ్ఞానాన్ని గూర్చి బోధిస్తున్నాడు. మొత్తం భగవద్గీత కర్మభక్తి జ్ఞాన మార్గాలలో ఎవరికి యే మార్గం నచ్చితే ఆ మార్గంలో పయనించవచ్చు శ్రీకృష్ణుడు అర్జునునితో.

ఓ అర్జునా యీ శరీరము క్షేత్రము దీని నెరుంగు వాడు క్షేత్రజ్ఞుడు యీ విధంగా క్షేత్ర వివేకంగల పెద్దలెరుంగుదురు. యింతవరకు శరీరమని దేహమని యీ పార్థివ శరీరమునకు పేర్లు ఇప్పుడేమో భగవంతుడు యీ శరీరానికి క్షేత్రమని కొత్త పేరు పెట్టినాడు. జీర్ణమైపోయే స్వభావం కలది కనుక దీనికి కావాలని మందులు వాడవల్సిన పని లేదు. అది చచ్చే తీరుతుంది. వద్దంటే వదలదు. దహింపబడేది కనుక దేహమని పేరు యిక్కడ భగవంతుడు యీ దేహానికి క్షేత్రమని క్రొత్తపేరు పెట్టినాడు. కాశీక్షేత్రం తిరుపతి క్షేత్రం అని పుణ్యక్షేత్రాలకు ఉండే పేరు పెట్టినాడు భగవద్విభూతి నెలకొన్నచోటులను పవిత్రతీర్థములు ప్రవహించే స్థలాలను క్షేత్రములని అంటారు. ఆ క్షేత్రాలను దర్శిస్తే పుణ్యము వస్తుంది. కాని యీ క్షేత్రంలో పుణ్యమే కాదు. జ్ఞానాన్ని మోక్షాన్ని కూడా పొందవచ్చు. క్షేత్రమంటే కవచంవలె జీవుణ్ణి కాపాడేదని అర్థం ఇంకో అర్థం పొలమని అర్థం. పొలం వలె జడస్వభావం కలదని అర్థం. ఆ శరీరంలో యే విత్తనాలు వేస్తామో ఆ పంట పండుతుంది. యీ క్షేత్ర పాలకుడు జీవుడు పుణ్యబీజాలను చల్లి పుణ్య పంటను పండించవచ్చు. పాపబీజాలు విత్తి దు:ఖాన్ని పండించవచ్చు. ఇంతేగాక జ్ఞాన మనే విత్తనాలు విత్తి మోక్షమనే ఫలితమూ పొందవచ్చు.

యీ అధ్యాయం పూర్తిగా జ్ఞానమార్గంలోనే పయనించనుంది. యీ జ్ఞానం జీవుడు. దేవుడు, దేహము దేహి, యీ విషయాలన్నీ పూర్తిగా విన్న తర్వాతనే అర్జునుని మోహము వదిలింది కూడా. యీ జ్ఞానాన్నే వశిష్టగీతలో వశిష్టుడు

శ్రీరామచంద్రునకు బోధించుట జరిగింది. ఆనాడు శ్రీరామచంద్రుడు దు:ఖిస్తే వశిష్టగీత బైటకు వచ్చింది. అర్జునుడు దు:ఖిస్తే భగవద్గీత బైటకు వచ్చింది. మనం దు:ఖించితే కన్నీళ్ళు మాత్రం బైటకు రావచ్చు. క్షేత్రం వేరు క్షేత్రజ్ఞుడు వేరు. అర్జునుడు అన్నీ తెలుసుకున్నా కొన్ని సంశయాలు వీడలేదు. ఒక్కొక్క క్షేత్రానికి ఒక్కొక్క క్షేత్రజ్ఞుడున్నాడు కదా. అనగా ఒక్కొక్క శరీరానికి ఒక్కొక్క ఆత్మ ఉన్నదన్నమాట. అలాగైతే శరీరాలు కోటానుకోట్లు ఉన్నాయి ఆత్మలు కూడా కోటాను కోట్లు ఉన్నట్లే కదా, అన్న సంశయాన్ని తెలుపగా గీతాచార్యుడు ఆ సంశయాన్ని నిరశిస్తూ " అన్ని క్షేత్రాలలో ఉండే క్షేత్రజ్ఞుడను నేనేనని " శ్రీకృష్ణుడు బాహాటంగా ప్రకటించుకున్నాడు. నగలు వేరైనా బంగారము ఒక్కటే జలబాండువులు వేరైనా ఆకాశము ఒక్కటే ఇంకా చెప్పాలంటే లైట్లు మిక్సీలు. ఫ్రిజ్జులు మోటార్లు కూలర్లు హీటర్లు ఇట్లు కొన్ని వందలు చెప్పవచ్చు. అవి యెన్ని రకాలుగా పని చేసినా వాటన్నిటికి కరెంటు ఆధారం ఆ కరెంటు చూచుటకు కనపడదు కరెంటు వచ్చింది కరెంటు పోయింది అంటున్నామే కాని వచ్చేది పోయేది కనుపించదు. కరెంటు లైటుకు సంబందించిన లైటు స్విచ్చు కనెక్షను ట్రాన్సుఫారం అన్నీవున్నా పని చేయదు. అలానే భగవంతుడూ మనలో ఉండి అన్నీ చేయిస్తున్నాడు. ఆ క్షేత్రజ్ఞుడు యీ దేహంలో ఉంటే అప్పుడు వీరి రేటు కోట్లు ఆ క్షేత్రజ్ఞుడు లేకపోతే యీ దేహం రేటు పైస కూడా చేయదు.

శ్రీకృష్ణుడు క్షేత్రజ్ఞుడను నేననలేదు. క్షేత్రజ్ఞుడను కూడా నేనే అనుటలో ఇంకో అర్ధముంది క్షేత్రమునేనే క్షేత్రజ్ఞుడనూ నేనేనని అర్థము.

అర్జునా మీ ఎరుగబడు వస్తువులైన క్షేత్రము క్షేత్రజ్ఞుడు యే జ్ఞానముచే ఎరుగబడుచున్నదో ఆ జ్ఞానమే నిజమైన పరబ్రహ్మ స్వరూపమై ఉన్నాను అంటూ యీ గీతాబోధలో పరిశుద్ధమైన జ్ఞానబోధను కుండపోతగ కురిపించుచున్నాడు.

దేవాది దేవుడు, భగవద్గీతలో చివరి అధ్యాయం పేరు " మోక్ష సన్యాస యోగం" అనగా కులగోత్రాలను ఇళ్ళు వాకిళ్ళు వేషభాషలకు సన్యాసమిమ్మని లోకమంతా చెబుతూ వుంటే భగవద్గీత మోక్షానికే సన్యాసమిమ్మని చెబుతుంది అదే జ్ఞానం యొక్క పర్యవసానం మోక్షం కావాలనుకోవడం అదీ కోరికే అదీ భ్రమే. ముక్తి నీ స్వరూపం స్వారాజ్యం నీ జన్మహక్కు బంధంలో ఉన్నా అవిద్య తొలగితే అదే విముక్తి "నీవు నిత్యముక్తుడవు" సత్యజ్ఞానానంద స్వరూపుడవైన నీవు దేహం అని భ్రమించడమే అజ్ఞానం అంటూ అర్జునా అజ్ఞానజనిత మై నిన్నావరించిన వ్యామోహము నశించినదా అని ప్రశ్నించాడు. అజ్ఞానం పోవాలంటే ఒక్క జ్ఞానంతోనే పోవాలి. చీకటి పోవాలంటే వెలుతురు రావాలి అర్జునుని నిమిత్తం చేసుకొని లోకంలోని మానవ కోటికి అజ్ఞానం తొలిగించే కోసం భగవంతుడు బోధించిన జ్ఞానబోధే భగవద్గీత యిక్కడ పంచభూతాల గురించి వాటి గుణాల గురించి గుణత్రయాల గురించి వాటి లక్షణాల గురించి జ్ఞానేంద్రియాలు వాటి ఉత్పత్తి వాటి గుణాలు కర్మేంద్రియాలు వాటి గుణాలు అవి చేయు పనుల గురించి యీషణత్రయాలు వాటి గుణాల గురించి చాలా విశేషంగా బోధిస్తాడు భగవంతుడు. దేహి ధర్మం దేహ ధర్మం గురించి చాలా వివరంగా తెల్పినాడు. శ్రీ కృష్ణుడు పాఠకులకు విసుగు కలగవచ్చుననే భావనతో ఇందులో చాలా సంక్షిప్తముగా మాత్రమే మీకు తెలుపు చున్నాను. గ్రహించండి. ఇచ్ఛ ద్వేషము సుఖము దు:ఖము సంఘాతము చేతన ధృతి యీ ఏడు క్షేత్రవికారాలు, రాగద్వేషాలు ఒకప్పుడనుభవించిన సుఖము కల్గించునని తెలుసుకున్న వస్తువును మరీ కావలెననే స్పృహ "ఇచ్ఛ" ఆ వస్తువు లభించునపుడు చిత్తమున కల్గెడి ప్రసన్నతారూపమగు వృత్తి" సుఖము " ఒకప్పుడనుభవించి దు:ఖ దాయకమని తెలుసుకొని ఆ వస్తువు తనకు కూడదనెడి విరసన భావము "ద్వేషము" అట్టి

ప్రతికూల వస్తు ప్రాప్తితో చిత్తమున కల్గెడి క్లేశము "దు:ఖము" యీ రాగద్వేషాలు సుఖదు:ఖాలు అంత:కరణ వృత్తి వికారాలు ఒకప్పుడుండి ఒకప్పుడు లేనటువంటివి అవి దృశ్యాలు ద్రష్టయైన క్షేత్రజ్ఞునకు యివి చెందవు అంటవు.

యీ క్షేత్ర విచారం వలన దు:ఖనివృత్తి కలుగుతుంది. క్షేత్రజ్ఞవిచారం ఆనంద ప్రాప్తికి ఉపకరిస్తుంది.

అర్జునా అమానిత్వము అదంభిత్వము అహింస క్షాంతి ఆర్జవము ఆచార్యోపాసనము శౌచము స్థైర్యము ఆత్మనిగ్రహము ఇంద్రియార్థాలలో వైరాగ్యము అహంకారము జన్మ మృత్యుజరావ్యాధి దు:ఖ దోషానుదర్శనము ఆసక్తి దారాపుత్రగృహాదికములలో అన భిష్వంగము ఇష్టానిష్ట ప్రాప్తి యందు సమచిత్తత్వము అనన్య యోగమున నాయందు అవ్యభిచారియగు భక్తి వివిక్తసేవిత్వము జన సంగమమున ప్రీతి లేకుండుట ఆధ్యాత్మ జ్ఞాన నిత్యత్వము తత్వజ్ఞానార్థ దర్శనము అనెడి యీ ఇర్వదియు జ్ఞానమని చెప్పబడును ఇందుకు వ్యతిరేక మయినవి అజ్ఞానమనబడును.

అర్జునా అమానిత్వాది గుణాలు మొత్తం ఇరవై అందులో అమానిత్వం మొదటిది (అనగా) అభిమానం లేకుండట మానమున్న చోట జ్ఞానముండదని పెద్దలందరు అందరూ తననే గౌరవించాలని ముందు పూలదండ నా మెడలోననే వేయాలి. ఇదీ అభిమాని లక్షణం గౌరవాన్ని ఇచ్చుటకు తీసుకునేటందుకు మనుష్య మాత్రుడెంతటివాడు మానవులకు మనకు ఒక్క అభిమానం కాదు ఎన్ని అభిమానాలో దేహాభిమానం కులాభిమానం విద్యాభిమానం ధనాభిమానం జ్ఞానిననే అభిమానం తపస్వివననే అభిమానం భక్తుడననే అభిమానం ఇలా చెబుతూ పోతే తండోపతండాలు బాంబులు మెడకు నడుముకు దండిగా వేసుకొని వాటిని పేల్చుకొని వాడు చావడమేగాక ఇతరుల నెందరినో చెడగొట్టి

చంపెడి వానివలె ఉంటుందీ అభిమానుల విషయం ఆత్మాహుతి దళంవలె తానెంత వాడైనా విర్రవీగకుండుటే అమానిత్వం తానెంతటి ఉన్నత గుణాలు కలిగి ఉండినా పొగడ్తలను సహింపలేని స్వభావమే  అమానిత్వము వరదబాధితులకు పదిరూపాయలు ఇస్తే మన పేరు పత్రికలో పెద్దఅక్షరాలలో చూడాలని వీరి తపన జ్ఞానం కోరేవాడు యీ దుర్లక్షణాన్ని వదలాలి నీలో యే కొంచెం మంచి ఉన్నా గుప్తంగా పదిల పరచి కాపాడుకో కాలక్రమంలో అది నిన్ను కాపాడుతుంది మట్టి క్రింద గుప్తంగా దాచిన విత్తనం అనంత ఫలాన్ని యివ్వగలుగుతుంది బరాబయలున ఉన్న విత్తనం అసలుకే లోటు కలుగుతుంది.

రెండవది అదంభిత్వం దంభము లేకుండుట ఇది పెద్ద సుగుణము. ఈనాడు దంభం ప్రపంచమంతా వ్యాపించింది దంభమంటే ఎందుకో బలేరుచి అందరికీను అన్ని రంగాలలో దాని పెత్తనమే భక్తుడు  కాకున్నా భక్తుని వలె కనబడుట పండితుడు కాకున్నా పండితునివలె కనపడుట యిదంతా దంభుని సామ్రాజ్యం రాజకీయ నాయకులు సమాజసేవకులు పండితులు పామరులు. సాధువులు సన్యాసులు అందరూ వారి అంతస్తుకు తగినట్టు దంభ దేవతకు పూజారులే దంభమొకటి పోతే లోకానికి సగం రోగం పోయినట్లు దంభము అసురీ సంపదకు అగ్రనాయకుడు కలిపురుషునికి ముఖ్యమంత్రి.

తర్వాత " అదంభిత్వము "  తన తప్పులను తాను నిర్భయంగా తెల్పుట అట్లు తెలపిన సమాజం క్షమిస్తుంది.  భగవంతుడు మన్నిస్తాడు. సర్వతోముఖాభివృద్ధి మనకు సంభవిస్తుంది. తర్వాత అహింస.  వ్యవహారాలలో అహింసను ఎంత మాత్రం అనుసరింప వీలగునో అంతమాత్రం వంచనలేక అనుసరించుటకు ప్రయత్నం చేయాలి.  నీ భావం హింసా కలుషితం కారాదు. స్వార్థం కొరకై హింస చేయరాదు.  చేతికి క్యాన్సరు వంటి వ్యాధి వచ్చింది

అనుకుందాము. ఆ చేతి భాగమును తొలగించి మనిషిని బ్రతికించు డాక్టరుది హింస కాదు. ఇంకొక చోట ఒక బాలకుని చేతికి బంగారు కంకణం ఉన్నది దానిని దొంగిలించాలనుకున్నాడు దొంగ. అది రాలేదు. ఆ చేతిని నరికి బంగారు కంకణం దొంగిలించినాడు దొంగ. ఇర్వురూ చేతిని ఖండించిన వారే కాని ఒకరికి ధనము సమర్పించి కృతజ్ఞత తెలియజేస్తాము. ఒకరిని పోలీసులకు అప్పజెప్పి శిక్షింపజేస్తాము. ఒకరు చేసినది అహింస ఒకరు చేసినది హింస.

నాల్గవ గుణం "క్షాంతి" దీనినే క్షమ ఓర్పు సహనమని అంటారు. క్షమా శీలుడు పరులు చేసిన అపకారాలను నీటిపై గీటు వలె వెంటనే మరచిపోతాడు. అతనికి ప్రతీకార బుద్ధి ఉండదు. విధి లేక గతిలేక పశువు వలె ఓర్చుకొనుట క్షాంతి కాదు బైట క్షాంతికి లోపల శాంతి కూడా కలసి రావాలి. లోపల అశాంతి యుండి బైట మెరమెచ్చులకో విధిలేకనో చాలకనో – సాగకనో ఓర్చుకోవడం క్షాంతి కాదు.

తర్వాత " ఆర్జవం " ను గూర్చి తెలుసుకుందాము. ఇది అయిదవది ఆర్జవం అనగా ఋజుత్వం. దీనినే సరళత్వమని నిజాయితీ యని అందురు. కల్లా కపటాలు లేక మాయామర్మాలు లేక త్రికరణ శుద్ధిగా మనసు వాక్కు కర్మలు ఒకే రూపంలో ఉండుట అది ఋజుత్వం యీ ఋజుత్వం లేకుండిన తండ్రీ బిడ్డలకు భార్యాభర్తలకు గురుశిష్యులకు ప్రభువుకు ప్రజలకు ఆర్జవం లేకుండిన వ్యవహారాలన్నీ అశాంతి నిలయాలగును.

ఆరోగుణం " ఆచార్యోపాసన " ఆచార్యవాన్ పురుషోవేదనేతర: " అని వేదసూక్తి గురువు లేని విద్య గుడ్డివిద్య. ఆధ్యాత్మిక విద్యను గూర్చి చెప్పనవసరంలేదు. యిక్కడ ఆచార్య సేవ అనక " ఆచార్యోపాసన " అని

చెప్పినారు. దేవున్ని ఉపాసించినట్లు గురువును ఉపాసించమని దాని అర్థం. కాని నేడు గురువులలో వాత్సల్యం లేదు. శిష్యులలో భక్తిలేదు. విత్తాపహారకులైన గురువులు ప్రబలినారు. హృత్తాపకారులు కరువైనారు. శిష్యుడు గురువునే సేవించి రెండు అంధకారాలనుండి విముక్తుడు కావాలి. 1. గర్భాంధకారం దీనినే ప్రకృతే విముక్తి కలిగిస్తుంది. రెండవది మాయాంధకారం నుండి విముక్తి పొందాలంటే గురువు అనుగ్రహము కావాలి.

"శౌచం" ఏడవది శుచిత్వమనేది మన సనాతన ధర్మమునందు ప్రత్యేక స్థానాన్ని గడించింది. శుచిత్వమే తెలియనివానికి జ్ఞానమెలా లభిస్తుంది. కానీ బాహ్య శౌచత్వంతో పాటు అంత:కరణ శుచిత్వం కూడా అత్యంతావశ్యము.

శ్లో ॥ అద్భిర్గాత్రాణి – శుధ్యంతి – మనస్సత్యేన శుధ్యతి
విద్యాతపోభ్యాం జీవాత్మా బుద్ధి: జ్ఞానేన శుధ్యతి

తా ॥ దేహశుద్ధి జలంతో కలుగుతుంది. మనస్సుద్ధి సత్యంతో కలుగుతుంది. విద్యా తపస్సులతో జీవాత్మ శుద్ధి బొందును. జ్ఞానంతో బుద్ధి పరిశుద్ధమగును.

జ్ఞానసాధనలో "స్థైర్యము" ఎనిమిదవది చపలచిత్తుడు ఏ కార్యాన్ని సాధించలేడు. అనుకున్న పని సాధించేవరకు దీక్ష పట్టుదల వదలనివాడే, స్థైర్యవంతుడు నిజమగు సాధకుడు బుద్ధుని వలె ధృవునివలె ఎన్ని అవాంతరాలు వచ్చినా మేరువు తల క్రిందులైనా పారావారము లింకినను అనుకున్న పనిని విడువకుండ సాధించు వారే స్థైర్యవంతులు యీ ధైర్యాలే గాక ఆధ్యాత్మిక మార్గంలో జ్ఞాన మార్గంలో ఎన్ని అవాంతరాలు ఎదురైనా జపము ధ్యానము నియమాన్ని వదలని వాడే జ్ఞాని.



దోషము లేనివాడు భగవంతుడు తన దోషముల నెరిగి దిద్దుకొనువాడు మహాత్ముడు తన దోషముల దాచి పెట్టి చరించువాడు దురాత్ముడు.

ఇక తొమ్మిదవది " ఆత్మవినిగ్రహము" గుఱ్ఱాలు స్వాధీనంలో లేకుంటే రథికుడు గమ్యం చేరలేడు. అట్లే జీవాత్మ తన గమ్యమైన బ్రహ్మ పదవి పొందడానికి దేహేంద్రియాలు స్వాధీనాలై ఉండాలి. బ్రేకులు లేని బండి కళ్ళెమునకు లొంగని గుఱ్ఱము వలె ఆత్మ నిగ్రహము లేని మనుజుడు ఇహపరాలకు కొఱగాడు. ఇంద్రియాదులు నీకొఱకై ఉన్నవి కాన వాటి కొఱకు నీవు గాదు.

ఇంద్రియార్థాలలో పదియవది " వైరాగ్యము " ఇంద్రియార్థాలనగా, శబ్ద స్పర్శరూప, రస, గంధాలు, యీ శబ్దం ఒక్క దానివల్ల పాములు జింకలు బలైనాయి. స్పర్శానందంతో ఏనుగుబలి అయ్యింది. రూపానందంలో మిడుతపురుగు, రసానందంతో చేప, గంధం సువాసనలో తుమ్మెద, బలై పోయినాయి. యీ దుర్గుణాలకు ఒక్కొక్క గుణానికి ఒక్కొక్క జంతువు బలైనాయి. యీ మానవునకేమో యీ అయిదు, శబ్దానందం కావాలి. స్పర్శానందం కావాలి. రూపానందం కావాలి. రసానందం (రుచి) గంధానందం (సువాసన) మానవునకు యీ అయిదూ కావాలి. మరి వీటిలో బలి కాకుండా ఉండాలంటే వీటికి దూరంగా ఉండాలి. ఇంద్రియాలు తమకు కావలసినవే కోరుతాయి గాని మనకు కావలసినవి కాదు భోగాలు రోగాలకే పర్యవసానం లభించునంతవరకు కావాలని కోరికలు లభించిన తర్వాత స్థిరంగా ఉండాలని ఆశలు అవి పోయినచో పోయెనే అని దు:ఖము పరమార్థ సాధకులను విషయ వాసనల నుండి విషయ శత్రువుల నుండి కాపాడుటకు పెట్టని కోట వైరాగ్యము. వైరాగ్యము నాశ్రయించి జ్ఞానమును పొందాలి అంతేకాని వైరాగ్యం కొరకు కాదు.

11వ లక్షణం – తర్వాత విషయం " అనహంకారము " అహంకారం

అవగుణాలకు పుట్ట అహంకారికి భగవంతుడు తోడ్పడడు. హృదయంలో నేనుండే వరకు గురువులేడు. గురువు వచ్చాడా, అహంకారం లేదు. హిరణ్య కశిపుడున్నంత వరకు నరసింహస్వామి లేడు స్వామి వచ్చాడా హిరణ్య కశిపుడు లేడు, అర్జునుడు భగవంతుని పురస్కరించుకొని సార్థక జీవి అయ్యాడు. దుర్యోధనుడు అహంకారాన్ని పురస్కరించుకొని సర్వనాశనమయ్యాడు. అహంకారం తీయని విషము మిత్రుని వలె నుండే శత్రువు.

"జన్మమృత్యు జరావ్యాధి దు:ఖదోషానుదర్శనం " ఇది పంద్రెండవ లక్షణం ప్రపంచము దు:ఖమయమని దేహము రోగ మయమని మానవుడు ఏడుస్తూ పుట్టాడు. ఏడుస్తూ చస్తాడు. జన్మదు:ఖము జరా (ముసలితనం) దు:ఖము వ్యాధి దు:ఖము సంసారం దు:ఖ మని గ్రహించి మానవుడు విరక్తుడు కావాలి. "పురోభివృద్ధిని కోరువాడు పూర్వ వృత్తాంతమును మరువరాదు" అని సూక్తి నీవు ఎక్కడ నుండి వచ్చావు వెనక్కి తిరిగి చూడమంటారు. పెద్దలు సిగ్గో యెగ్గో అది బహిరంగ గోప్యం దిగంబర రహస్యం ఏది తప్పినా తప్పవచ్చు కాని మృత్యువు తప్పదు యీ దేహం నీది కాదు నాది కాదు మృత్యువేమో తప్పదు యీ దేహం తూచే యంత్రం పై నిల్చి నేనింత తూకం ఉన్నానని వీడు సంతోషిస్తే అది చూచి మృత్యు దేవత ముసిముసినవ్వులను నవ్వుతుంది.

మనమూ నవ్వుతూ నవ్విస్తూ జీవిస్తూ నవ్వుతూ మరణించుదాము.

పాలు వెన్నలతో పెంచిన యీ బంగారు శరీరానికి చివరి దశేమిటో ఆలోచించండి. చావు అన్నంత మాత్రాన చెవులు మూసుకునే మృత్యువు కళ్ళు మూసుకోదు. యీ మృత్యువు నుండి కాపాడుకోవడానికి మానవుడు చేయని ప్రయత్నమంటూ లేదు. అయినా అది ఆగేది లేదు. ఇతడుగాని డాక్టర్లుగాని ఆపేది లేదు ఏది తప్పినా మృత్యువు తప్పదు.

'ఆసక్తి' పదమూడవది యే పదార్థమందుననూ ఆసక్తి లేకపోవుట ఆసక్తి మారకము అనాసక్తి తారకము. మానవుడు ఒంటరిగా పుద్తాడు. ఒంటరిగా ఛస్తాడు. తన వెంట ఒకటీరాదు. తనవెంట ఒకటీపోదు. త్యాగమూర్తులు ఒట్టిచేతులతోనే వెళ్ళుదురు. ఈ సమస్తము యీశ్వరుని సొత్తు. అయినా మనం ప్రతివస్తువుపైనా, నాది నాది అనే మమకార ముద్రవేశాము. ఆ మమకారమే మనలను ఏడ్పిస్తుంది.

"అనభిష్వంగము" ఇది జ్ఞానమార్గంలో "పదునాల్గవది". పుత్రకళత్ర క్షేత్రములతో అభిష్వంగ ముండరాదు. అభిష్వంగమంటే అతి స్నేహము. వారి సుఖమే తన సుఖమని వారి దు:ఖమే తన దు:ఖమనే అపోహ భ్రమ. వస్తువులపై మనుష్యులపై ప్రేమ ఉండవచ్చును గాని వ్యామోహం ఉండరాదు. యీ భార్యా పిల్లలపై, మిత్రులపై ప్రేమ ఉండవచ్చు గానీ, వారు లేకుంటే నేను బ్రతకలేననే అతి వ్యామోహం ఉండరాదు. యేది లేకున్నా జరిగేది జరుగుతుంది. పుట్టక మునుపు వీటన్నిటితో నీకే సంబంధం లేదు. మరణానంతరం ఉండదు. మధ్యలో కొంత ప్రేమనాటకం ప్రేమ ఉండవలసిందే. అతి ప్రేమ ఉండరాదు. పప్పులో ఉప్పువేస్తేనే రుచి. రుచి అని పప్పంతా ఉప్పే ఉంటే అది మనకు ఉపయోగిస్తుందా. వ్యవహారంకూడా కొంపముంచే వ్యవహారం పనికిరాదు. పుత్ర మమకారంతో దశరథుడు ద్రోణుడు సయితం మరణించారు. ఆసక్తి అనే జిడ్డుతో అంత:కరణము మలినమై పోతుంది.

ఇష్టానిష్ట ప్రాప్తియందు "సమచిత్తత్వము" "పదునైదవది" సుఖదు:ఖాలలో మంచి చెడ్డలలో హెచ్చుతగ్గులు లేక సమత్వస్థితిలో నుండాలి. లెక్కకు రానీయడు కార్యసాధకుడు దు:ఖంబున్ సుఖంబున్ మదిన్, సముద్రమున్నంత వరకు

అలలు తప్పవు. ప్రపంచమున్నంత వరకు సుఖదు:ఖాలు తప్పవు. అనివార్యమైన దానిని గూర్చి ఆలోచించుట అవివేకి లక్షణము. సుఖదు:ఖాలు సాధకునకు గీటురాళ్ళు.

"మయి చానన్యయోగేన భక్తి రవ్యభిచారిణి" ఇది జ్ఞానసాధన గుణాలలో 'పదియారవది' అన్య భావన లేని భగవద్భక్తి కల్గి ఉండాలి సర్వకాల సర్వావస్థలలో విభక్తుడు కాని వాడే భక్తుడు.

" వివిక్త దేశసేవిత్వం - పదియేడవ లక్షణం " సాధకుడు ఏకాంత ప్రదేశంలో ఉండుటకు అభిరుచి కలిగి ఉండాలి. సాధకుడు సింహం లాగ ఏకాంత ప్రియుడు కావాలి. ఇది సాధకునకు చాలా ముఖ్యము.

" జన సంగమమున ప్రీతి లేకుండుట పదునెన్మిది జనులనగా పామర జనులు విషయాసక్తులు కాదు. వన్యమృగాలలో ఉండి అయినా సిద్ధి పొందవచ్చునుగాని పామర జనసాంగత్యంలో ఉండి సిద్ధిని బొందుట శక్యంకాదు. ఎట్టి సాంగత్యంలో ఉంటే అట్టివాడై పోతాడు. సత్సాంగత్యం ఏకాంత వాసానికంటే అధిక ఫలకారి. సత్సాంగత్యంలో దాసీపుత్రుడు నారదుడు దేవర్షి అయ్యాడు. పచ్చి కిరాతకుడు ఆదికవి అయ్యాడు.

'ఆధ్యాత్మజ్ఞాన నిత్యత్వము పందొమ్మిదవది' ఆత్మానాత్మ వివేకత్వము నందు అత్యంతాసక్తి కలిగి యుండాలి. ఈగ అన్నింటిపై వాలుతుంది. కాని నిప్పుపై వాలదు. మనస్సు అన్నింటిని గూర్చి ఆలోచిస్తుంది కానీ ఆత్మను గురించి ఆలోచించదు.

అర్జునా! ఎల్లకాలము నన్ను స్మరిస్తూ యుద్ధం చేయి ఎల్లకాలం అనగా యీ పదునెనిమిది రోజుల యుద్ధం వరకే కాదు జీవితంలో ఎప్పుడూ ఏదో యుద్ధం జరుగుతూనే యుంటుంది. కనుక ఎప్పుడూ భగవంతుని స్మరించాలని భగవంతుని ఆదేశం. 'తత్వజ్ఞానార్థ దర్శనము, ఇది ఇరువదవ లక్షణం.

ఇది జ్ఞానసాధనలో చివరిది. తత్వ జ్ఞానానికి ప్రయోజనమైన మోక్షమునందే దృష్టి పెట్టవలెను. యీ మోక్షాపేక్షతో అందరూ కృషిచేస్తున్నారని చెప్పలేము. కొందరు కుతూహలానికి పండితులమనిపించుకొనుటకు ప్రయత్నించు చుందురు. ఇది పనికిరాదు. నిరంతర కృషి సాధన విరామం లేకుండ సాధన చేయవలెను.

ఇక్కడికి అమానిత్వాదులు ఇరవై సాధనాలు ముగుస్తాయి. ఇంత వరకు గీతాచార్యుడు క్షేత్రమును గురించి వివరించినాడు. ఇపుడు క్షేత్రజ్ఞుని గురించి సంక్షిప్తంగా తెలుసుకుందాము.

అర్జునా ఆ క్షేత్రజ్ఞుని గూర్చి తెలుపుచున్నాను. శ్రద్ధగా విను. దాని గురించి తెలుసుకున్నచో మోక్షము లభించగలదు. అది అనాది అయినది. అది పరబ్రహ్మము జ్ఞేయము. జ్ఞేయము అనగా జ్ఞానంతో తెలుసుకోదగినదని కృష్ణుడు చెబుతున్నాడు. అప్పుడు అర్జునుడు తన అనుభవాన్ని గూర్చి చెబుతూ "స్మృతిర్లబ్ధా" అన్నాడు. స్మృతి లాభం కల్గినదన్నాడు" నేనెవరో నాకు జ్ఞాపకం వచ్చిందన్నాడు " ఇంతవరకూ దేహమే తాననుకున్న అర్జునుడు తాను ఆత్మననే అనుభవాన్ని పొందాడు. ఆ కొద్ది సమయంలో ఆ స్థితిని పొందాడంటే అర్జునుడు యే సాధన చేసి పొందాడు. ఏదీ లేదు. భగవంతుని అనుగ్రహంతో భ్రమాజ్ఞానం పోయింది. ప్రమాజ్ఞానం కలిగింది.

క్షేత్రజ్ఞుడు జ్ఞేయవస్తువు. ధ్యేయ వస్తువని చెప్పలేదు. ధ్యానంతో పొందేది ధ్యేయము. జ్ఞానంతో పొందేది జ్ఞేయము. శ్రీకృష్ణుడు ఒకే పర్యాయము గీతాబోధ చేశాడు. అంతటితో అర్జునుని అజ్ఞానం పటాపంచలైంది. 'నష్టోమోహ' అని ఆయన తన అనుభవాన్ని చెప్పాడు. సామాన్య గురువులు రోజూ చెబుతూ ఉంటారు. సామాన్య శిష్యులు నిత్యం వింటూనే ఉంటారు.

కాని యీ ఫలితం రావడం లేదు. కాని కృష్ణార్జునులు లోక విలక్షణులైన గురుశిష్యులు వారు. జగద్గురువు ఒకేసారి బోధించాడు. అజ్ఞాన జనిత మోహరోగం పటాపంచలైనది. శ్రీకృష్ణుని ఇంజెక్షను ఎంత ప్రభావం కలదో? అర్జునా యీ జ్ఞానం గూర్చి తెలుసుకుంటే అమృతత్వం లభిస్తుంది. జనన మరణాలే లేని ముక్తి లభిస్తుంది. చూశారా ఆ జగద్గురువు మాట ఎంత శక్తి వంతంగా మాట్లాడినాడో " జ్ఞానా దేవతు కైవల్యం, అంధకారంలో త్రాటిని చూచి పాము అనుకున్నావు భ్రమ కలిగింది. లైటు వేసి చూచిన వెంటనే అది త్రాడని తెలిసిపోయింది. ఈ ప్రయత్నంలేని యదార్థ జ్ఞానంతో భయము, భ్రమ తీరింది. "ఆత్మ జ్ఞానము" సమ్యగ్దర్శనం లభించిందా మోక్షం నీ చేతిలో నున్నట్లే.

భగవంతుడు ఆ క్షేత్రజ్ఞుని వర్ణిస్తున్నాడు. క్షేత్రజ్ఞుడు ఆదిలేనివాడు. అనగా పుట్టక లేనివాడు, అంతంలేనివాడు. యీ క్షేత్రజ్ఞుడు పరబ్రహ్మ స్వరూపము నిరాకార నిర్గుణ స్వరూపుడే క్షేత్రజ్ఞుడు. ఆయనే దివ్యజ్యోతి స్వరూపుడు. యీ క్షేత్రజ్ఞుని గురించి గీతలో గీతాచార్యుడు చాలా విస్తారంగా తెలియజేశాడు. శ్రోతలకు విసుగు కల్పించిన వాడనౌతానని క్లుప్తంగా ముగిస్తున్నాను.

క్షేత్రము అనగా స్థలము దేహము. క్షేత్రజ్ఞుడు అనగా అందులో నివసించి యీ దేహాన్ని నడిపించేవాడు. చూసేవాడు, చూపించేవాడు, అనేవాడు, వినేవాడు, నడిపించేవాడు, తినిపించేవాడు అన్నీ ఆ పరబ్రహ్మ స్వరూపమేనని తెలిసి, నడుచుకోవడమే యీ క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగంలో సారాంశమని గ్రహించేది " ఆయన చైతన్యం లేకుంటే శవమే – ఆయన చైతన్యం వున్నంతసేపే 'శివము'.

# శ్రీ భగవద్గీత
# పదునాల్గవ ఆధ్యాయము
# గుణత్రయ విభాగయోగము

యీ ఆధ్యాయంలోని త్రిగుణ ప్రసంగము తత్వవిచారానికి మూలమై జీవుని నిజస్వరూపాన్ని గుర్తించేందుకు యీ గుణత్రయ విభాగయోగం ఆవశ్యకమైనది. మనుష్య స్వభావము త్రిగుణమయమని త్రిగుణ ప్రభావాలను గుర్తించవలసిన అవసరం ఎంతైనా వుంది.

శ్లో ॥ పరం భూయ: ప్రవక్ష్యామి - జ్ఞానానాం జ్ఞానముత్తమం
యజ్ఞాత్వా మునయస్సర్వే - పరాంసిద్ధి మితోగతా:

షడ్గుణైశ్వర్య సంపన్నుడగు భగవంతుడు శ్రీకృష్ణుడు అర్జునునితో అంటున్నాడు అర్జునా శ్రద్ధగా విను జ్ఞానాలలో శ్రేష్ఠమైన జ్ఞానం ఉత్తమమైన జ్ఞానాన్ని నీకు బోధిస్తున్నాను. మనన శీలురైన మునులు దీన్ని తెలిసి యిక్కడనే జీవించియుండగానే పరమపురుషార్థ లక్షణమైన యీ కైవల్యమోక్షాన్ని అనుభవిస్తారు. లౌకిక జ్ఞానాలు జ్ఞానాలేకాదు నారదుడు ఎన్నో విద్యలను తెలుసుకున్నా శాంతిని పొందలేక పోయాడు. పరమాత్మను తెలియచేశే జ్ఞానమే జ్ఞానము. ఆత్మజ్ఞానము లేని జ్ఞానాలు ఒకటి లేని సున్నల వంటివి. ప్రకృతి పురుషుల స్వరూపాలను వివేకించి పురుషుని యధార్థ స్వరూపాన్ని యెరుకపరచి ప్రకృతిబంధం నుండి విముక్తి చేయగలిగే జ్ఞానం కాబట్టి దీనిని పరమ జ్ఞానమని ఉత్తమ జ్ఞానమని ప్రశంసించుచున్నాడు. శ్రీకృష్ణుడు వేదాలలో స్మృతులలో చెప్పబడిన యజ్ఞయాగాది విషయిక జ్ఞానం కంటే యీ జ్ఞానం శ్రేష్టమైనది. ఇతర ఆధ్యాయాలలో ఉంది కాని సత్వరజస్తమోగుణాల గురించి ఇంతవరకు

ఎక్కడా చెప్పలేదు. సత్వగుణ సంపన్నుడు కావాలంటే మూడు గుణాల గూర్చి తెలుసుకోవాలి. అపథ్యకరమైన వస్తువులు వదలాలి అలా అయితేనే రోగికి ఆరోగ్యం చేకూరేది.

అర్జునా ఈ జ్ఞానాన్ని ఆశ్రయించి అనుష్ఠించిన మునులు నా స్వరూపాన్ని సంప్రాప్తిస్తారు. పూర్ణులౌతారు. వారు సృష్టికాలంలో పుట్టరు. ప్రళయకాలంలో నశించరు. పూర్ణునికి పుట్టుకలు చావులుంటాయా ఎవరైతే క్షేత్ర క్షేత్రజ్ఞులను వివేచించి క్షేత్రజ్ఞుని పరమార్థ స్వరూప జ్ఞానాన్ని పొందివున్నారో వారికి పరమపద ప్రాప్తి లభిస్తుంది. భగవద్గీత జ్ఞానశాస్త్రం జ్ఞానప్రభావంతో నరుడు నారాయణుడౌతాడు. జీవుడు శివుడౌతాడు. పశుత్వం తొలగి పశు పతిత్వం లభిస్తుంది.

అసత్తు నుండి సత్తుకు తమస్సునుండి ప్రకాశానికి మృత్యుభయం నుండి అమృతపదవికి చేర్చే మంత్ర దండము పతితులను పావనం చేసేది దుర్బలులను బలిష్ఠులనుగా చేసేది. గుణాతీత స్థితిని పొందుటే ప్రయోజనం యీ గుణాలను అతిక్రమిస్తే చాలు పురుషోత్తమ ప్రాప్తి ప్రక్కనే ఉంది. పురుషోత్తమ ప్రాప్తి సులభమే గాని గుణాల ఆకర్షణలను దాటుటే కష్టం జీవునికి బంధకారణాలైన త్రిగుణాల యొక్క స్వరూప స్వభావాలను వివరించుట కోసమే భగవంతుడు యీ ఆధ్యాయాన్ని ప్రారంభించాడు.

జీవులందరకు ప్రకృతి తల్లి పరమేశ్వరుడు తండ్రి పరమేశ్వరుని సంకల్ప ప్రేరణ లేనిదే ప్రాణి ఉత్పన్నం కాదు. భరత కులదీపకా అర్జునా ఈశ్వరుడను నాకు వాస్తవము వ్యవహారము అను రెండు భేదాలతో రెండు రూపాలు ఉన్నవి. వాస్తవముగా సచ్చిదానందాలే నా స్వరూపాలు వ్యవహారాలలో నన్ను మాయా విశిష్టుడన్నారు. మాయ నా శక్తి. మాయ వేరు నేను వేరు కాదు

శక్తిమంతులు భిన్నంగా ఉండరు. ఆ మాయనే ప్రకృతి అని అవ్యక్తమని అంటారు. అదియే మహాబ్రహ్మ యీ మూడు గుణాల పేర్లు సత్వగుణము, రజో గుణము, తమో గుణము. యీ మూడు గుణములు చాలా బలమైనవి. ఒకరియందున సత్వగుణం ప్రధానంగా భాసిస్తుంది. ఒకరి యందు రజోగుణం భాసిస్తుంది. ఒకరియందు తమో గుణం విశేషంగా భాసిస్తుంది. పురుషుడు స్వరూపత: నిర్వికారుడు అయినా మాయా ప్రభావంతో తన స్వరూపాన్ని మరచి దృశ్యాలైన గుణాలలో తాదాత్మ్యంబొంది నేను నాది అనే అభిమానాలకు పాల్పడి జనన మరణ రూప సంసారానికి బద్ధుడైనాడు. ఇది మానవుని స్వయంకృతాపరాధము సత్వగుణము అద్దమువలె ప్రకాశమై ఉంటుంది. వస్తువు యొక్క స్వరూపాన్ని ఉన్నది ఉన్నట్లు చూపిస్తుంది. సత్వగుణం మంచిదే కాని అహంకారానికి అభిమానానికి దారి తీసిందా బంధానికి కారణమౌతుంది. నేను సుఖిని నేను జ్ఞానిని నేను నిరామయుణ్ణి నేనే భక్తుణ్ణి అనే అహంభావంతో జీవుని బంధిస్తుంది. సుఖాసక్తితో జ్ఞానాసక్తితో దేహబంధాన్ని పెంపొందిస్తుంది యీ సత్వగుణం బంగారు సంకెళ్ళు.

సత్వగుణ లక్షణం చెప్పి దానితో కలిగే బంధాన్ని చెప్పి భగవంతుడు అనంతరం రజోగుణ స్వభావాన్ని దాని లక్షణాలను దానితో కలిగే బంధ స్వరూపాన్ని ఉపదేశిస్తున్నాడు.

శ్లో ॥ రజోరాగాత్మకం విద్ధి - తృష్ణాసంగ సముద్భవం
తన్నిబధ్నాతి కౌంతేయ - కర్మ సంగేన దేహినామ్

కుంతీకుమారా ఇంక రజోగుణాన్ని గూర్చి విను. రజోగుణం రాగాత్మకమైనది. రాగరూపమైంది. విషయవస్తువుల దర్శన శ్రవణా స్మరణాదులతో అంత: కరణంలో కలిగే స్నేహ వృత్తియే రాగం. రాగం

రజోగుణ ప్రధానమైనప్పటికి రజోగుణాన్ని రాగరూపమని చెప్పడంలో అర్థమేమిటంటే ధర్మమూ ధర్మీ రెండూ కలిసి యుంటాయి. అనేక జన్మాలకు యీ రజోగుణమే కారణం అఖండ వస్తువును ఖండ ఖండాలు చేసి చూపించేది. యీ రజోగుణమే మనస్సును విషయ భోగాలలో పడవేసి దు:ఖాల పాలు చేసేది యీ రజోగుణమే రజోగుణం. చూసినదంతా కావాలి. విన్నదంతా కావాలి లేనివన్నీ కావాలి ఉన్నవన్నీ కాపాడుకోవాలి. ఇలాంటి కోర్కెలకు అంతేలేదు. అది చేయాలి. ఇది చేయాలి నేనే చేయకపోతే ఎవరు చేస్తారు. అర్థం కావాలి అధికారం కావాలి, కీర్తికావాలి ప్రతిష్ట కావాలి ఓట్లు కావాలి సీట్లు కావాలి ఇతని ఆరాటం పాదరసం లాగా పారాడ్తూ ఉంటాడు. పైపెచ్చు అన్నీ ప్రగల్భాలు ఎప్పుడైనా తను చేసే పనికి తన ప్లానుకు యెదురు దెబ్బ తగిలిందా అప్పుడే ఉత్తుత్తమ వైరాగ్యం యేపనికీ పోరాదు. అంటూ ప్రగల్భాలు ఇదే రజోగుణం ప్రభావం. శ్రీకృష్ణ పరమాత్మ రజోగుణ ధర్మాలు సంక్షిప్తంగా తెలిపి ఇప్పుడు తమోగుణ ప్రభావాన్ని తెలియజేయుచున్నాడు.

అర్జునా తమో గుణానికి తల్లి అజ్ఞానము. అందరినీ మోహింపజేస్తుంది. నిద్రలోనూ సోమరితనంతోనూ జీవుని బంధిస్తుంది. తమోగుణం అజ్ఞానంతో పుట్టింది. యీ తమోగుణం జీవుల యొక్క సదసద్వివేకాన్నీ జ్ఞానాన్నీ ఆవరించి మోహబద్ధులను చేస్తుంది. ప్రమాదమూ సోమరితనమూ ఆలస్యము తమోగుణానికి సంతానంబులు చేయవలసిన పనులు చేయకపోవుట చేయరాని పనులు చేయుట ప్రమాదమే మృత్యువని శృతులు చెబుతున్నాయి. యీ ప్రమాదమే అన్ని విధాలా పతనాలకు కారణమని బుద్ధుడు అన్నాడు. మరపే మరణమని వేదాంతులంటారు. చెప్పిన మాటలు మరచిపోవడం చేయవలసిన పనులు మరచిపోవడం అంతా అయోమయం అంతా పరధ్యానం తామస వృత్తికల మూఢజనుల లక్షణాలు.



**ప్రేమచేత కోపమును దాన ధర్మముల చేత లోభమును విచారణ చేత మోహమును సత్యముచేత అబద్ధమును జయించవలెను.**

శుద్ధ బద్ధకత్వం చేయవలసిన పనులను రేపు మాపు అంటూ వాయిదాలు వేయడం ఆ రేపుకు రూపం ఉండదు. భగవంతుడు పొట్టనుపెట్టి అన్యాయం చేశాడు. యీ పొట్టే లేకపోతే సుఖంగా బ్రతికే వాళ్ళం అని దేవుని మీద అభాండాలు వేస్తాడు తినే పొట్టను ఒకటి పెట్టి పని చేసే చేతులను రెండిచ్చాడనే సంగతి యీ సోమరికి తెలియదు. సోమరి తలకాయ దయ్యాలకొంప ఉ ద్యోగం పురుషలక్షణం నిరుద్యోగం పిశాచలక్షణం. తమోగుణంలో ముఖ్యమైనది నిద్ర. అభాగ్యునకు ఆకలి ఎక్కువ. నిర్భాగ్యునకు నిద్ర ఎక్కువ. ఇతడు నిద్రపోయే సమయంలో 'ఏ దేవత అయినా అమృతాన్ని తెచ్చి అందిస్తే యిది సమయం కాదు పొమ్మంటాడు. బ్రహ్మతో సమానంగా ఆయుస్సు కావాలని ఆ ఆయుస్సునంతా నిద్రలో గడపాలని పాపం వాని కోరిక యీ తమో గుణాలతో కూడిన జీవుడు ముక్తికీ ముక్తి సాధనాలకూ దూరమై పోతాడు. యీ తమోగుణం జీవున్ని ఇన్ని విధాల బంధిస్తుంది కనుక తమో గుణాలకు దూరమై అందరూ తరించండి.

గుణత్రయ విభాగంలో పయనిద్దాం. ప్రకృతి స్త్రీ అని, నేను పురుషున్ని అని చెప్పినాడు. ఇంతకు ముందు భగవంతుడు ప్రకృతిని "స్త్రీ" గా ఎందుకు పోల్చినాడనగా స్త్రీ అనే అక్షరంలో సకారం తకారం రకారం యీ మూడు అక్షరాలు అందులో ఉన్నవి దాని అర్థమేమనగా, సత్వగుణం తమోగుణం రజోగుణం యీ గుణాలతో బంధింపబడిన వారందరూ స్త్రీలే యీ త్రిగుణాలతో బంధింపబడని వారే పురుషులు.

ఒకసారి జనక మహారాజు వేదాంత మహాసభ నిర్వహించుచుండెనట. ఆ సభకు ఒక స్త్రీ మూర్తి తేజ స్సంపన్నురాలు వచ్చినదట. ఆమెకు యీ సభలో ప్రవేశము లేదు. పురుషులకు మాత్రమే ప్రవేశమని, ద్వారపాలకులు అడ్డగించుతారు. అపుడు ఆమె నేను పురుషున్ని గాని స్త్రీని కాదే అన్నదట.

అపుడు ద్వారపాలకులు మహారాజుకు యీ విషయం చెప్పగా ఆమెను ప్రవేశ పెట్టండి అంటాడు. అపుడు ఆమె ఆ వేదాంత సభకు వస్తుంది అపుడు జనక మహారాజు ఏమి తల్లీ నీవు స్త్రీవై ఉండి పురుషున్ని నేనని అన్నావట అని అడుగగా అపుడు ఆమె అంటుంది. స్త్రీ అంటే అర్థమేమి సత్వరజస్తమో గుణాలచే బంధింప బడినవారు స్త్రీలు ఆ త్రిగుణాలతో బంధించబడని నేను పురుషున్ని అని సమాధానం చెబుతుంది. అపుడు మహారాజు జనకుడు నమస్కరించి గౌరవించి పూజించి తన సంశయాలను నివృత్తి చేసుకుంటాడు.

అర్జునా తమోగుణం నుండి రజోగుణానికి రజోగుణం నుండి సత్వగుణానికి అధిగమించుటే మానవుని వికాసయాత్రలోని మజిలీలు గుణము ఒక్కటే అయినా స్థితులను బట్టి మూడు విధాలై ఉంటుంది. యీ గుణాలు అందరిలోను ఉండినా ఒక్కొక్క గుణం ఒక్కొక్కరిలో అధికంగా ఉండును. ఇందుకు ఉదాహరణంగా యీ త్రిగుణాలు ఉన్నవారు. ముగ్గురూ ఒకే ఇంటిలోనే ఉన్నారు. వారే రజోగుణ స్వభావం కలవాడు రావణాసురుడు యీ రజోగుణ స్వభావం అంతా నాకే కావాలి. అన్ని భోగాలు నేనే అనుభవించాలి. అన్నింటిలో నేనే గొప్పననిపించుకోవాలి. యిది రావణుని స్వభావం. తమోగుణ స్వభావం కుంభకర్ణునిది యీ లక్షణాలు సోమరితనం బద్ధకం నిద్ర తిండిపోతుతనం అలసత్వం తమస్సు అంటే చీకటి అభాగ్యునకు ఆకలి ఎక్కువ నిర్భాగ్యునికి నిద్ర ఎక్కువ అనేది ఒక సూక్తి. యీ తమోగుణ స్వభావం కలవారు వట్టి సోమరులు. కుంభకర్ణుని వారసులు వీరే.

ఒక ఆశ్రమంలో కొంత మంది శిష్యులు ఉండేవారట. ఓరోజు గాలివాన వచ్చింది. అప్పుడు గురువు ఓ శిష్యునితో బాబూ మన ఆశ్రమంపైన తాటియాకులు గాలికి లేచి పోయినాయి. వెంటనే పైకి వెళ్ళి ఆ తాటియాకులు పెట్టిరా నాయనా వాన నీళ్ళు కుటీరంలోనికి వస్తున్నాయి. అని గురువంటే



**మనిషి ఒంటరిగా జన్మిస్తాడు. ఒంటరిగా మరణిస్తాడు. అదే ఒంటరితనంతో తాను చేసిన పాప పుణ్యాల ఫలితాలనూ అనుభవిస్తాడు.**

యీ సోమరి శిష్యుడు గురువుగారూ వర్షం తగ్గిన తర్వాత పెడ్తానంటాడు. పోనీలే అలాగే లెమ్మంటాడు గురువుగారు. వర్షం తగ్గిన తర్వాత యిపుడు వెళ్ళు. బాబూ వర్షం తగ్గింది. కుటీరంపై తాటాకులు పెట్టి రమ్మంటే ఎందుకు స్వామీ వర్షం లేదు గదా ఇపుడెందుకు లెమ్మన్నాడట యిది తమోగుణ స్వభావానికి చిన్న ఉదాహరణ యిది.

తర్వాత సత్వగుణస్వభావుడు విభీషణుడు సాత్వికత ఓర్పు, దైవభక్తి, ధర్మము న్యాయము, నీతి, క్రమ శిక్షణ దైవోపాసన సత్వగుణ సంబంధం మర్యాదకల బంధం యీ సత్వగుణ స్వభావం గలవారి లక్షణాలు మాటలతో నిరాకరిస్తూనే చేతలలో సన్మానాలను మెడలో పూల దండలను హృదయాలలో పొగడ్తలను స్వీకరిస్తూనే ఉందురు. నిరహంకారిననే అహంకారం నిరభిమానిననే అభిమానం యివి ఉండును.

త్రిగుణాతీతుడయిన శ్రీకృష్ణ పరమాత్మ త్రిగుణాల గూర్చి గుణత్రయ విభాగ యోగంలో సుస్పష్టంగా తెలియజేయుచున్నాడు. కర్మాతీతులై ఉండే వారిని కర్మ రహితులై ఉండేవారిని ఒకే రకంగా భావించడం పొరపాటు యీ రెండు అంతస్థులకు ఎంతో భేదం ఉంది. గుణాతీత లక్షణాలు సాధకునికి ప్రయత్న సాధనలై ఉంటవి జ్ఞానికి సహజ లక్షణాలై ఉంటవి. అర్జునా గుణాతీత స్థితిని బొందేందుకు ముఖ్యముగా అనుసరించవలసిన ముఖ్యోపాయాన్ని తెల్పుతున్నారు. శ్రద్ధగా విను తాను అకర్తగా గుర్తించి నిర్గుణ నిరాకార సచ్చిదానంద పరబ్రహ్మంలో నిత్య నిరంతరం స్థితి నొంది ఉండుటే గుణాతీతుడు అయ్యేందుకు ఉపాయంగా సెలవిచ్చి యున్నాడు.

శ్లో ॥ మాంచ యోవ్యభిచారేణ – భక్తి యోగేన సేవతే
సగుణాన్ సమతీత్యైతాన్ – బ్రహ్మభూయాయ కల్ప్యతే



అర్హత గల అతిధికి సాదరంగా స్వాగతం పలికిన యింట స్థిమితంగా తిష్ట వేయడానికి లక్ష్మీదేవి ఆనందంగా అంగీకరిస్తుంది.

అర్జునా సర్వభూతాలకు అంతర్యామియై తన మాయాశక్తి చేతనే క్షేత్రజ్ఞ భావాన్ని పొందిన నన్ను పరబ్రహ్మము అను అచంచల భక్తి యోగంతో సేవించవలసి ఉంటుంది. తైలధారలాగా నిరంతర సజాతీయ వృత్తి ప్రవాహం కల్గి ఉండుటే అవ్యభిచార భక్తియోగమని చెప్పబడుతుంది. దీనినే ఏకాంతభక్తి అని కూడా అందురు. ఇట్టి భక్తుడు సత్వాది గుణాల నతిక్రమించి వాటిని మిధ్యలుగా భావించి నిర్గుణ బ్రహ్మభావాన్ని అనగా మోక్షాన్ని జీవించి ఉండగానే పొందగల్గుతాడు ఇది నిర్గుణభక్తి విధానం.

ఇక సగుణ భక్తి యోగాన్ని గూర్చి తెల్పుతా విను. పరమేశ్వరుడు సర్వాధికుడు ఆయనే తండ్రి. ఆయనే తల్లి. ఆయనే ప్రభువు. ఆయనే ప్రాణం. అతడు తప్ప నన్ను రక్షించువారు లేరు అని తలంచి స్వార్థ రహితమైన అనన్య ప్రేమ కలిగి ఉండుటే అవ్యభిచారిణీ భక్తి అన్ని యెడల భగవంతుని సందర్శిస్తూ తదేక చింతన ధ్యాన స్మరణాదులతో భగవంతుని సేవించే భక్తుడు గుణాల నతిక్రమించి పరిపూర్ణ నిర్గుణ పరబ్రహ్మ భావాన్ని పొందును సగుణాతీతుడు కావాలని గుణాలతో కుస్తీ పట్టితే లాభంలేదు ఆ పద్ధతిలో అవి మనకు వశం కాకపోగా వాటినే తలపోసి తలపోసి మనమే వాటి గోతిలో పడిపోతాము. భగవంతుని అవ్యభిచార భక్తి యోగంతో సేవించుటే గుణాలను తరించేందుకు సులభోపాయం నిరంతరం భగవన్నిష్టలో యుండే వారి మనస్సులో గుణాలు చొరబడే వీల్లేదు. రాముడుండే హృదయంలో కాముడుండే వీలు లేదు. వారి దృష్టిలో మంచీ చెడులను చెప్పే రెండూ చెడ్డవే గుణాలలో అభినివేశం మాని భగవంతుని యందే వారు నిరంతర భక్తి యోగంలో నిమగ్నులై యున్నారు. తక్కిన జనసామాన్యానికి వారు ఆదర్శంగా యుందురు. గుణాతీతుడైన భగవంతుని చింతనలో ఉండే వారికి అవశ్యంగా గుణాలబంధం ఊడి పోతుంది. ఆత్మను తెలుసుకున్నాడా పరమాత్మను తెలుసుకున్నట్లే ఆత్మ

అన్నా పరబ్రహ్మమన్నా ఒకే అర్థం. కాబట్టి ఆత్మయందు భక్తి కలవాడు గుణాతీతుడై పరబ్రహ్మ భావాన్ని పొందుతున్నాడు పొందడమేమిటి అదే అయి యున్నాడు.

అర్జునా నిర్గుణ నిర్వికల్ప పరబ్రహ్మమైన నేనే అమృతమూ అవ్యయమూ శాశ్వతమూ ధర్మమూ ఏకాంత సుఖమూ ఐన సగుణ బ్రహ్మానికి ఆధారమూ అయి ఉన్నాను అట్టి అచంచల భక్తి చేత భక్తుడు బ్రహ్మభావాన్ని పొందుతున్నాడు. సర్వాశ్రయము సర్వ వ్యాపకము సర్వకర్త సర్వభర్త అయినది పరమాత్మ యొక్క నిరాకార స్వరూపం విష్ణు శివరామకృష్ణాది మూర్తులు సాకార రూపాలు యీ ప్రపంచమే భగవంతుని నిర్వికారమూ అమృతమునైన పరబ్రహ్మానికి ప్రతిష్ట పరబ్రహ్మ స్వరూపమును భక్తజనులలో ప్రతిష్టించుట కొరకే ఆయన అవతరించినాడు. అనేక నదులకు సముద్రమే అంతమయినట్లు యీ నానాత్వం ఏయే లోకంలో అంతమౌతుందో ఆ బ్రహ్మమే ఏకాంతం ఏకాంత సుఖమనగా బ్రహ్మ సుఖమని అర్థం. వేదములకు నేనే ప్రతిష్ఠను వేదములకు నేనే పర్యవసానం ఆవేదం అమృతమూ అవ్యయమూ అయిన ఆ వేదానికి నేనే ఆధారం వేదాలచే తెలియదగిన వస్తువు నేనే సుమా. శాశ్వతమైన ధర్మానికి నేనే ప్రతిష్ఠను కామ్యధర్మంతో లభించే స్వర్గాదులు నశించిపోయేవి నన్ను గురించి అర్పించే ధర్మాలు శాశ్వతాలు వాటి ద్వారా శాశ్వత ఫలమైన మోక్షం లభిస్తుంది. ఆ మోక్ష స్వరూపుడను నేనే కాబట్టి శాశ్వత ధర్మానికి నేనే ఆధారం. విషయ సంబంధ సుఖం ఏకాంత సుఖం కాలేదు. స్వరూప భూతమైన మోక్ష సుఖమే ఏకాంత సుఖం దానికి నేనే పరాకాష్ఠ నేనట్టివాడనే కాబట్టి నన్ను అచంచలమైన భావంతో సేవించువాడు బ్రహ్మ భావాన్ని పొందగల్గుతాడు.

ప్రియమైన భగవద్భక్తులారా! భగవదనుగ్రహంతో మనమంతా గుణాతీత యోగాన్ని సాధించవలసి వుంది. గుణబద్ధులై పశుజీవితం గడిపేందుకు మనుష్య జన్మ రాలేదు. గుణాతీతులై పశుపతిత్వం సంపాదించే కొరకే భగవంతుడీ లోకానికి పంపియున్నాడు. ఆ సుయోగం మనకు సిద్ధించుగాక.

నరుడు చేయవలసినది చేస్తే నారాయణుడౌతాడు. అనాదికాలం నుండీ మూయబడియున్న బుద్ధి గుహను తెరచి, నారాయణుని సందర్శించే కోసం నరుడు జన్మమెత్తినాడు. కర్తవ్య విస్మరణ మహాపాపం దానికి కావలసినంత శిక్ష ప్రకృతి యిచ్చింది. తన పని మరచినవారికి దండగచాకిరి మీద పడింది. ఒకసారి అంటుకున్న యీ జిడ్డును వదిలించుకొనడంలో బ్రహ్మ ప్రళయాలు దాటిపోయినవి.

జీవుడు దేహభావంతో నరుడైనాడు. ఆత్మభావంతో నారాయణుడౌతాడు. శరీరం తాదాత్మ్యంతో పురుషుడైనాడు. దానిని వదిలితే పురుషోత్తముడౌతాడు. నర భావాన్ని వదిలితే చాలు స్వయంగా తాను నారాయణుడే.

నామరూప దృష్టి అధోదృష్టి అస్థిభాతి ప్రియదృష్టి ఊర్ధ్వదృష్టి కలవారు. సర్వభావంతో పురుషోత్తముని భజిస్తారు. వారికి సర్వమూ పురుషోత్తముడే మనమింత వరకు గుణత్రయ విభాగ యోగం పూర్తి చేసుకొని పురుషోత్తమ ప్రాప్తి యోగంలో ప్రవేశిస్తున్నాము. గీతలో ఇదొక్క విశిష్టమైన అధ్యాయం గంగానది మొత్తం అన్నిచోట్లా పవిత్ర తీర్థమే అయినా కాశి ప్రయాగాలలో తీర్థమై క్షేత్రమై రాణిస్తుంది. భగవద్గీతా మొత్తం పవిత్రమే అయినా ఇలాంటి అధ్యాయాలు మరింత పవిత్రంగా పరిగణింపబడ్డాయి. అర్జునుని ప్రశ్నతో నిమిత్తమే లేకుండా కరుణానిధి యగు భగవంతుడు యీ అధ్యాయంతో ప్రారంభించినాడు. యీ పదునైదవ అధ్యాయాన్ని భోజన కాలంలో పఠిస్తారు.



**సప్త ద్వీపాలలోనైనా నవఖండాలలోనైనా ముల్లోకాలలోనైనా శాంతితో సరితూగ గలిగే సుఖం లేనేలేదు.**

ఆహారం శుద్ధి కలగాలని ఆ ఆహారం సత్వగుణాభివృద్ధి జరుగాలని ఆహారం మంచిగా ఉంటేనే అన్నీ మంచిగా యుండును. యీ పురుషోత్తమ ప్రాప్తి యోగంలో ఎన్నో అర్థాలు కలవు. పురుషుడనగా మగవాడని అర్థం. ఇక్కడ లింగభేదప్రకారంగా చూస్తే భగవంతుడు ఒక్కడే పురుషుడు మిగతా అందరూ స్త్రీలు సత్వ తమో రజో గుణాల చేత బంధించబడినవారు స్త్రీలు ఆ గుణాల చేత బంధింపబడనివారు ఎవరో వారు మాత్రమే పురుషులు. యీ ఆధ్యాయానికి నాల్గుపేర్లు ఉన్నవి. పురుష, ఉత్తమ, ప్రాప్తి, యోగము, యీ నాల్గు పేర్లు కలవు. యీ శరీరాన్ని నఖ శిఖ పర్యంతం పూరించి పూర్ణంగా ఉండేవాడు మాత్రమే పురుషుడు. యీ దేహాలు పురాలు (నవద్వారేపురే) అని అయిదవ ఆధ్యాయంలో చెప్పబడింది. యీ నవద్వారాలలో పూర్ణమై ఉండే వాడే పురుషుడు. దేహ దృష్టి వదలి చూస్తే అందరూ పురుషులే.



# శ్రీ భగవద్గీత
# పదునైదవ ఆధ్యాయము
# పురుషోత్తమ ప్రాప్తి యోగము

ప్రస్తుతం మనము పురుషోత్తమ ప్రాప్తి యోగంలో ప్రవేశిస్తున్నాము. యోగమను వాక్యము భగవద్గీతలో అనేక పర్యాయాలు వాడడం జరిగింది. యోగమనగా ఉపాయం యుక్తి అని అర్థం. పురుషోత్తముడగు పరమాత్ముని ప్రాప్తికి కావలసిన ఉపాయం యీ ఆధ్యాయంలో చెప్పబడింది. అందుచే యీ ఆధ్యాయానికా పేరు వచ్చింది.

పురుషోత్తమ ప్రాప్తి ప్రతి మానవుని జన్మహక్కు అందుకొరకే పవిత్ర మానవ జన్మ వచ్చినది. పురుషోత్తముడు భగవంతుడు ఎక్కడో లేడు అంతటా ఉన్నాడు. నీలోనే ఉన్నాడు. తన్ను తాను తెలుసుకోలేనివాడు పరమాత్మను తెలుసుకోలేడు. లేని వస్తువు అయితే కొని తెచ్చుకుంటాము. వస్తువు తన చెంతనే ఉంది తనువెతుకుతూ ఉంటాడు. వేరే వారు వచ్చి మీ దగ్గరనే ఉంది కదండి అని అంటే గాని అతనికి గుర్తుకు రాదు. అప్పుడు దొరికింది. దొరికింది అని అంటాడు. ఇది యొక రూపమైన ప్రాప్తి దీనినే ప్రాప్తి రూప ప్రాప్తి అని అందురు. అలానే పురుషోత్తమ పరమాత్మ మన స్వరూపంగానే ఉన్నాడు. అజ్ఞానంతో మనం మరిచాము ఆప్త వాక్యంతో గురూపదేశంతో స్వరూప భూతదయ పరమాత్మను అనుభవించగలిగినాము.

చెప్పవలసిన ఉపదేశం అంతా చెప్పి చిట్టచివర భగవంతుడు శ్రీకృష్ణుడు అయ్యా అర్జునా నే చెప్పిన ఉపదేశాన్ని విన్నావా స్వామీ విన్నాను ఏకాగ్రతతో విన్నావా అవును ఏకాగ్రతతో విన్నాను. అయితే ఏదీ నీ అనుభవాన్ని

చెప్పమంటూ అడుగుతాడు. కాని జగద్గురువు బోధకు గడువులేదు, వాయిదాలేదు. ఉపదేశం ముగిసీ ముగియక మునుపే అనుభవం వప్పజెప్పమంటున్నాడు. అది బోధ గొప్పతనం స్విచ్ వేసిన వెంటనే బల్బు వెలగాలి. వెంటనే జ్ఞానం కలగాలి. అజ్ఞానం తొలగాలి ఇంజక్షన్ చేసిన వెంటనే రోగం కుదరాలి. అర్జునుడు సామాన్య శిష్యుడా అలౌకిక శిష్యుడాయె అడగడమే తడువుగా అప్పటికప్పుడే చిటికెల మీద తన అనుభవాన్ని వప్పజెప్పాడు. " నష్టో మోహ: దేవాది దేవా తన అనుగ్రహము వల్ల నా మోహం నశించింది మీరిచ్చిన ఔషధంలో నారోగం నయమయ్యింది.

రోగమోహ ప్రభావంతో నేను క్షత్రియుడనని కుంతి కొడుకునని యుద్ధానికి కర్తనని యుద్ధఫలానికి భోక్తనని తలపోసి యుంటిని. "స్మృతిర్లబ్ధా" నాకు స్మృతిలాభము కల్గినది నేనెవరో నాకు తెలిసింది. నన్నుమరచి యుంటిని నీ ఉపదేశ ప్రభావంతో నా స్వరూపం నాకు జ్ఞాపకం వచ్చింది. నేను క్షత్రియుడను కాను యుద్ధానికి కర్తనుకాను యుద్ధఫలానికి భోక్తను గాను అకర్తను అభోక్తను నిత్య శుద్ధ బుద్ధ పరబ్రహ్మమును నీ అనుగ్రహంతో యీ అనుభవాన్ని పొందినాను. నా పాండిత్యంతో కాదు. నా ప్రతాపంతోకాదు నా శౌర్యంతో కాదు. గురుడవూ జగద్గురువూ అయిన నీ అనుగ్రహంతో నాకీ స్మృతి లభ్యమైనది. నీవు అచ్యుతుడివి చ్యుతి లేనివాడవు నాకు కూడా అట్టి వరం దయచేయి " స్థితోస్మి" స్థిత ప్రజ్ఞుడనయ్యాను.

"గత సందేహం" సంశయాలన్నీ విచ్ఛిన్నమయ్యాయి. ఇది భక్తునకు కల్గిన అనుభవం ప్రతిగీతా భక్తునకూ కల్గవలసిన అనుభవమూ యిదే యిది కల్గలేదేని గాఢమైన శ్రద్ధ గట్టి ప్రయత్నమూ లేదని అర్థం మోహ నష్టము గీతా భక్తుని ఫలము "స్మృతిలాభము గీతాభ్యాసికి ప్రయోజనము తన స్వరూపము తనకు స్మృతికి వచ్చిందనే చెప్పినాడు కాని కొత్తగా ఎక్కడినుండి సంపాదించానని

అర్జునుడు చెప్పలేదు. ఆత్మ అనినా పురుషోత్తముడనినా కొత్తగా సంపాదించే వస్తువు కాదు. అది తన స్వరూపము అని తెలుసుకోవడమే నదులకు సముద్రం ఎలా గమ్యమో అలాగుననే జీవునికి గమ్యస్థానం బ్రహ్మప్రాప్తి బ్రహ్మప్రాప్తి అనినా నిత్య సుఖమనినా మోక్షమనినా ఒకటే అర్థం. మోక్షప్రాప్తికి అనన్యభక్తి అత్యగత్యము. నామరూపాల మాయకు లోబడి జీవుడు భగవంతున్ని మరిచాడు. మయసభలో దుర్యోధనుడు భంగపడినాడు. యీ మాయసభలో ప్రతి మానవుడూ భంగపడుతూనే యున్నాడు.

విషయాత్మక సంసారంపై వైరాగ్యం కల్గనివానికి భగవంతునిపై అనన్య భక్తి కుదరదు. ఆత్మజ్ఞానం కల్గదు. ముందు తాను పట్టుకున్న వస్తువును వదిలితేనే మరో వస్తువు పట్టుకోగల్గేది.

శ్లో ॥ ఊర్ధ్వమూల మధః శాఖ మశ్వత్థం ప్రాహురవ్యయం
ఛందాంసి యస్యపర్ణాని - యస్తం వేద సవేదవిత్

అర్జునా యీ ప్రపంచమును అశ్వర్థమని వేదాలు చెప్పినవి మహర్షులు అన్నారు. ఇది అంతులేనిది దీనికి మూలము ఊర్ధ్వము శాఖలు క్రిందివి ఛందస్సులు దీని ఆకులు. దీని నెరిగినవాడే వేదవేత్త బ్రహ్మాండమును అశ్వర్థవృక్షముగ పోల్చి చెప్పుట పరిపాటి యీ అశ్వర్థ వృక్షము ఊర్ధ్వ మూలము ఊర్ధ్వము అను మాటకు శ్రేష్ఠమయినది ఉత్కృష్టమైనది అని అర్థము. కాలానికంటే సూక్ష్మమై సర్వోత్కృష్టమైనది పరబ్రహ్మమునకు ఊర్ధ్వము అని పేరు.

ఊర్ధ్వమూల మధః శాఖ " ఇది యొక విచిత్రమైన సంసారవృక్షము. విశ్వముఖాలు విశ్వ రహస్యాలు బహుముఖాలైనట్లు యీ శ్లోకార్థాలు కూడా బహువిధాలుగా యీ ప్రపంచం మొదలు పైకి కొమ్మలు క్రిందికి గల చెట్టని

భగవంతుడు చెప్పినాడు. ప్రపంచంలో మనం చూసే వృక్షాలు తల క్రిందులుగా ఎక్కడైనా ఉన్నాయా.

వంశవృక్షం వ్రాసేటప్పుడు మూల పురుషుల పేర్లు క్రింద వ్రాసి తర్వాత వారి పేర్లు పైపైన వ్రాస్తుంటారు. ఊయలకు క్రింద ఆధారం లేదు. పైన ఆధారంలేనట్లే సామాన్య మానవులకు ఇహంలో సుఖం లేదు పరంలో సుఖం లేదు. యీ అశ్వర్థ వృక్షంలాగా యీ జగత్తు విశాలమైనది. అగాధమైనది. కాబట్టే దీని ఆకులు ఎప్పుడూ చలిస్తూ యుండును. అలాగే ప్రపంచ వస్తువులు కూడా నిత్యం చలిస్తూ యుండును. అశ్వమనగా గుఱ్ఱము. గుఱ్ఱము చపలజీవి. యీ ప్రపంచం కూడా అట్టిదే. ప్రపంచం యొక్క అనిత్యత్వాన్ని నిరూపించే కోసం దీనికి అశ్వర్థ వృక్షమని పేరు పెట్టబడినది. ప్రపంచంపై వైరాగ్యాన్ని నేర్పి ఊర్థ్వ దృష్టి కల్గించి బ్రహ్మనిష్టను నెలకొల్పుటే యీ ప్రసంగం యొక్క ప్రయోజనము.

జ్ఞానుల దృష్టిలో యీ వృక్షము మిధ్యే అయినప్పటికి అజ్ఞానుల పాలిటికిది అంతులేనిది. యీ బ్రహ్మాండ వృక్షానికి ఆకులు ఛందస్సులనగా వేదాలు కొమ్మలనుండే ఆకులు వచ్చినట్లు బ్రహ్మాండ వృక్షానికి మొదట కొమ్మ అయిన బ్రహ్మదేవుని నుండే వేదాలు కలిగాయి. చెట్టు ఆకుల ద్వారా ప్రాణవాయువును గ్రహించి జీవించినట్లు ప్రవృత్తి నివృత్తులను ధర్మా ధర్మాలను వాటి ఫలాలను తెలిసి వేదాలలోని కర్మకాండలు యీ సంసార వృక్షాన్ని పోషిస్తున్నాయి. అర్జునా యీ సంసార వృక్షానికి బ్రహ్మమే మూలము. నానా జీవకోట్లే కొమ్మలు ప్రపంచాన్ని పరమాత్మ రూపంగా తెలుసుకున్న వాడే నిజమైన వేదవేత్త. యీ చెట్టుకు ఊడలు విస్తారంగా క్రిందికి వ్యాపించి ఉండును. అహంకార మమకార రాగద్వేషాది సూక్ష్మవాసనలే యీ వూడలు. ఇవి పుణ్యపాపకర్మలకు ప్రేరేపకాలు.

ఇవి సూక్ష్మ శరీరాల లోగుట్టుగా పెనవేసుకుని యున్నవి. వీటిని ఛేదించితే కాని సాధకుడు ఊర్ధ్వ లోకాలకు ఊర్ధ్వ మూలానికి ప్రయాణం చేసే వీలు లేదు.

యీ సంసార వృక్షమొక విచిత్రమయినది. ముక్తి నొసగే మూలం పై వైపున వుంది. బంధించే మూలాలు క్రిందివైపు అలుముకొని ఉన్నాయి. యీ అవాంతర మూలాలు ఊడలు మానవున్ని ఊర్ధ్వ గమనానికి దారియ్యవు. కర్మాధికారి అయిన మానవుడు తన పురుషార్థంతో తాను చేసే కర్మలతో యీ ఊడలను ఖండించి ఊర్ధ్వగామీ కావచ్చు లేదా స్వయంకృత కర్మలతో యీ అవాంతర మూలాలకు బలాన్ని పోసి మరింత బద్ధుడూ కావచ్చు. పశుపతీ కావచ్చు. కర్మాధికారం కర్మ స్వాతంత్ర్యం ఒక్క మానవ జన్మానికి తప్ప మరే దేవ జన్మలకు కూడా లేదు. తక్కిన జన్మాలలో కర్మ ఫలాధికారమే గాని, మానవ జన్మలో కర్మాధికారము కర్మ ఫలాధికారము రెండూ వున్నవి. ఖట్వాంగ చక్రవర్తి ముక్తిపొందే కోసం దేవలోకాన్ని వీడి మనుష్య లోకానికి రావలసి వచ్చింది. మానవుడైన నీవే కర్మాధికారివని గీతాచార్యుని బోధ వెనుకటి కర్మఫలాన్ని అనుభవిస్తూ క్రొత్త కర్మలు చేసుకునే హక్కు మానవునికి ఉంది. " నిన్ను నీవు ఉద్ధరించుకో " నిన్ను నీవు చెడగొట్టుకోవద్దు, అని జగద్గురుని బోధ నీ మంచికి నీ చెడ్డకు ఎవ్వరో కారణం కాదు నీవు చేసుకునే కర్మలే కారణం. ఉత్తమ కర్మలు చేసి ఉన్నత పదవి పొందవచ్చు. నీచ కర్మలను చేసి అధోగతి పొందవచ్చు. నీ పాప పుణ్యాలకు నీవే బాధ్యుడవు.

అర్జునా ఎవరి పాపపుణ్యాలకు వారే బాధ్యులు. ఉత్తమ కర్మలు చేసి ఉన్నతిని పొందవచ్చు. నీచ కర్మలచే అధోగతి పొందవచ్చు. నా ప్రారబ్ధం నా కర్మ నా గ్రహచారం అని దేబరించే పౌరుష హీనుల నుద్దేశించి "క్లైబ్యం మా'

స్మగమ: ” యీ నపుంసకత్వాన్ని వదలండంటూ గీతాచార్యుడు ఛీకొట్టి మందలించినాడు. ప్రారబ్ధం గ్రహచారం అనేది కూడాను నీవు వొకప్పుడు చేసిన కర్మయే. ప్రారబ్ధం ముందు నీవు వెనక కాదు. నీవు ముందు ప్రారబ్ధం వెనుక బుద్ధి: కర్మానుసారిణే అని అందరూ అంటారు. బుద్ధి కర్మను అనుసరించితే అనుసరించనీ గాక. కాని నీవు బుద్ధివి కావు కదా కర్మకు కర్త వైన నీవు కర్మకు అధీనంగా ఉండవలసిన పని లేదు.

కర్మను సృష్టించిన కర్తవు నీవే కర్మకాని బుద్ధికాని నీకు ఉపకరణాలు మాత్రమే ముల్లును ముల్లుతో తీసివేసినట్లు వెనుక చేసిన కర్మలను ఇపుడు చేసే కర్మలతో నివారించుకోవచ్చు. యీ అశ్వర్థవృక్షము ఆకులు వేదశాస్త్రాలు చిగుళ్ళు ఇంద్రియ విషయరూపాలు వీటిచే వృద్ధిపొందిన కొమ్మలు త్రిగుణాత్మకాలు దీని మూలాలు వ్రేళ్ళు మానవున్ని బంధిస్తున్నవి.

అర్జునా యీ గీతాబోధ నిన్ను నిమిత్తంగా చేసుకొని లోకానికి నేను చేస్తున్న అత్యుత్తమ బోధ ఇది జ్ఞానులకు అజ్ఞానులకూ ప్రపంచం కానవస్తుంది. కాని అజ్ఞానుల వలె జ్ఞానులు దీని ఆకర్షణకు వంచితులై వెతలు పొలుకారు.

ఇహలోక పరలోకభోగాలపై రాగము లేకుండుటే వైరాగ్యము ప్రపంచంలోని ప్రతి విషయ సుఖమూ క్షయస్వాతిశయ దోషాలతో కూడుకొనే ఉంది. ఇది ఈ లోకంలోనే కాదు. స్వర్గలోకంలో సైతం యీ దోషాలు తప్పినవి కావు. కనుక ఇహసుఖాలు పరలోక సుఖాలు శాశ్వత సుఖాలు ఇవ్వజాలవు కనుక. పరలోక సుఖాల పై ఆసక్తి త్యజించి పరబ్రహ్మ ప్రాప్తికి సిద్ధపడాలి అందుకు” అసంగశస్త్రాన్ని ఆశ్రయించమంటున్నాడు భగవంతుడు.

సంగమనగా రాగం అసంగమనగా విరాగం. ముముక్షువునకు అసంగమే మహాస్త్రం లాగ ఉపకరిస్తుంది. దేవేంద్రుడు వజ్రాయుధంతో కొండలను

ఖండించినట్లు ముముక్షువు అసంగ శస్త్రంతో సంసార వృక్షాన్ని ఛేదిస్తాడు. తత్వజ్ఞాన నిష్ఠతో గట్టిపడి వివేకాభ్యాసంతో పదును పెట్టబడిన వైరాగ్యమనే ఆయుధమే సంసారాన్ని సమూలంగా ఛేదింపగల్గుతుంది.

పూర్ణమైన ఆత్మనిష్ఠ కలవానికి పూర్ణమైన అసంగస్థితి కలుగుతుంది. దాని గొప్పతనాన్ని సామాన్యులు గుర్తించలేరు. ప్రపంచంలోని ప్రతి మానవుడూ దు:ఖనివృత్తిని ఆనంద ప్రాప్తిని కోరుతున్నాడు. మానవుడే కాదు ప్రతిపాణి కూడా దు:ఖం పోవాలని సుఖం రావాలని కోర్తుంది. ప్రతివాడు చేసే పనికి వ్యవహారానికి ఉద్యోగానికి ఇదే ఆశయమై ఉంది. మోక్షం అంటే అదియే లోకంలోని వస్తువో కాదు దు:ఖనివృత్తి ఆనంద ప్రాప్తినే యీ రెండింటినీ ఒక్కే మాటలో వారి పరిభాషలో వేదాంతులు " మోక్ష" మని పేరు పెట్టినారు. దొంగ కూడా తాను చేసే పనిలో దు:ఖనివృత్తి ఆనందప్రాప్తి కావాలనే కోరుతాడు. కానీ వాడు చేసేపని సక్రమమైనది కాదు అది వక్రమమయినది. అభిప్రాయం మంచిదే వాడుచేసే సాధన దానికి అనుగుణమైనది కాదు కనుకనే వానికి సిద్ధి లభించుట లేదు. ప్రతి మానవుని పరిస్థితి యింతే అయింది. పదభ్రష్టులై ప్రవర్తించే మానవకోట్లకు కరుణామయుడగు భగవంతుడు హితాన్ని ఉపదేశిస్తున్నాడు.

ఇంతవరకూ వైరాగ్యంలో సంసార త్యాగం చెప్పబడింది. దాని ద్వారా దు:ఖ నివృత్తి కల్గుతుంది. కాని పరమానంద ప్రాప్తి చేకూరదు. నిద్రలో కూడా దు:ఖ నివృత్తి ఉంది. అంతమాత్రంతో లాభం లేదు. బ్రహ్మప్రాప్తి తో ఆత్మసాక్షాత్కారంతో ఆనంద ప్రాప్తి చేకూర్చుకోవలసి ఉంటుంది. తర్వాత శ్రీకృష్ణుడు తెల్పుచున్నాడు. అర్జునా అసంగ శస్త్రంతో సంసార వృక్షాన్ని ఖండించిన తర్వాత వివేకవైరాగ్యంతో నిష్కాముడూ విక్షేపరహితుడూ అయిన సాధకుడు ప్రసిద్ధమైన ఆ బ్రహ్మ పదవిని అన్వేషింపవలసి ఉంది. ఆ పదవి

యెట్టి దంటావా విను. మాయామయమగు యీ సంసారానికి అది అధిష్ఠానమైనది. స్వాత్వాభిమానాన్ని వదలిన వివేకవంతులు ఆ నిర్విశేష బ్రహ్మపదవిలో ప్రవేశించి స్వాత్వాభిమానాన్ని పొంది సంసారానికి తిరిగిరారు. భగవంతుని శరణు పొందాలంటే భగవత్ప్రాప్తి కావాలంటే అది అందరికీ కలుగదు. అందుకు తగిన పూర్వ పుణ్య సంస్కారం ఉండాలి. ప్రతివాడూ తన సంపదకు తన సంసారానికి తన పాండిత్యానికి తన ప్రతాపానికి తన బుద్ధికి తన వృద్ధికి శరణు పొందుతాడే గానీ, భగవంతుని శరణు పొందాలనే సద్బుద్ధి ఏ నూటికో కోటికో ఒక్కనికిగాని కలుగదు. భక్తితోపాటు సాధన కూడా కావాలి.

అర్జునా అభిమాన మోహాలను వదలినవారు యీ పరమాత్మ ప్రాప్తికి తగినవారు మానము, అభిమానము జ్ఞానానికి విరోధము నేను గుణవంతుడిని విద్యావంతుడిని అందరు నన్నే గౌరవించాలి. ఈ అభిమానం శరణాగతుడైన భక్తునికి తగదు. మానము రజోగుణమైతే మోహము తమోగుణము యీ రెండు గుణాల నతిక్రమించి సత్వగుణాన్ని అవలంబించినవారే పరమాత్మ ప్రాప్తికి అర్హులు కాగలరు. మరియు వారు “జితసంగదోషులు ” కావాలి. సంగమం మహాదోషం భూమ్యాకర్షణ కంటే విద్యుచ్ఛక్తి కంటే సంగశక్తి ప్రబలమైనది. ప్రమాదకరమైనది కూడాను. పట్టుకుంటే వదలదు సంగదోషము చివరికి మానవుని సర్వస్వాన్ని హరిస్తుంది. స్మృతిభ్రంశము బుద్ధినాశము సర్వనాశాలు సంగదోషంతో వాటిల్లే అనర్థ పరంపరలు “ పుత్ర విత్తాలు నావి ” అనేది మమత్వ సంగం “ కర్మలకు కర్తను నేననేది ” కర్తృత్వ సంగం. యీ రెండు దోషాలను జయించిన వారు జితసంగదోషులు. అట్టివారు ప్రియాప్రియ వస్తువులు సన్నిహితంగా ఉండి కూడా రాగద్వేషాది సంగదోషాలను దూరం చేసినవానికి సమస్తకామనలు సంగమే మూలము. అట్టివారు

"వినివృత్తకాము" లనిపించుకుంటారు. సమస్తకామనలు తొలగిపోయినప్పుడు బ్రహ్మప్రాప్తి సిద్ధిస్తుంది.

అర్జునా సంసారమొక సముద్రము లాంటిది సుఖదు:ఖాలకు కారణములైన ద్వంద్వాలనే అలలు దీనిలో లెక్కలేనన్ని జయాపజయాలు మానావమానాలు లాభనష్టాలు శీతోష్ణాదులు మొదలైన ద్వంద్వాలు అనేక విధాలు అడవిలో ఉండేవానికి మృగాల బాధలు తప్పనట్లు ప్రపంచంలో నివసించేవానికి యీ ద్వంద్వ బాధ తప్పింది కాదు. సామాన్య మానవుడు వీటి అఘాతాలకు గడియారంలో పెండలం లాగా కంపించి పోతుంటాడు. వివేకి అయిన మానవుడు సముద్ర తరంగాలను తట్టుకొని స్థిరంగా ఉండే గండశిలలాగ పట్టభద్రుడై ఉంటాడు. అట్టివాడే పరమార్థ పదంలో పారం ముట్టుతాడు. బాగా వింటున్నావా పార్థా ఇట్టివారే నాశరహితమైన పరబ్రహ్మ స్థానాన్ని ఆత్మభావంతో ప్రాప్తిస్తాడు. ఇంతవరకు చెప్పిన లక్షణాలు సాధకులకు ప్రయత్న సాధ్యంగానూ సిద్ధులకు సహజ స్వభావంగాను ఉండును. అర్జునా అయినా పరమపదమును సూర్యుడు ప్రకాశింపజేయలేడు. చంద్రుడు వెల్గించలేడు. అగ్ని చూడలేదు. అక్కడికి వెళ్ళినవారు తిరిగి రావడమంటూ ఉండదు. స్వయంప్రకాశమైనది కాబట్టి అది పరమాత్ముని స్వరూపం పరమధామమని చెప్పబడింది.

జాతరలో చిన్నపిల్లవాడు తప్పిపోయినాడు. ఎవరు వచ్చినా ఏమి ఇచ్చినా తీసుకోవడంలేదు. నా తల్లిదండ్రులు కావాలనే తపన తప్ప వేరే ఏమీ లేదు. అలాగుననే మానవుడు మనువు వంశం నుండి జన్మించినాడు. మనువు గొప్ప ఋషీశ్వరుడు. ఋషి వంశంలో జన్మించిన మనం ఋషులమై తీరాలి. అప్పుడే మన జన్మకు లోకానికి సార్థకత. మనమంతా ఋషి వంశీకులం గనుక ఋషి సాంప్రదాయాలను పాటించి మన జన్మలు సార్థకం చేసుకొని

మనం తరిస్తూ లోకాన్ని తరింప చేద్దాము.

మానవుడు మర్కటము నుండి గాని, మట్టినుండి గాని రాలేదు. భగవంతుని నుండి వచ్చినాడు మానవుడు. " మనువు అను మహర్షి సంతానం కనుకనే మానవుడనే పేరు వచ్చింది. " శృర్వ్యాంతువిశ్వే అమృత స్యపుత్రా: " అని వేద మాత కూడా చెప్పింది. మనమంతా పాపులం కాదు పాప సంతానం కాదు. అమృత పుత్రులం అమృత సంతానం పాపుల మనుకుంటు పాడై పోవద మెందుకు మేము దైవాత్మ స్వరూపులమని గోపుర మెక్కి చాటి చెప్పండి. భగవంతుని మాటపై విశ్వాసముంచండి మనమెవరో మనకు తెలియక పోతే భగవంతుడు చెబుతున్నాడు. జీవుడు " సనాతనుడు " పరమాత్మని అంశమే జీవుడు పరమాత్మని వలెనే జీవుడు సనాతన నిత్యచైతన్య స్వరూపులమని గుర్తించాలి.

అర్జునా "వాయుర్గంధాని వాశయాత్ " వాయువు వెళ్ళేటప్పుడు పుష్పాల నుండి సుగంధాన్ని దుర్గంధాన్ని తీసుకొని వెళ్ళినట్లే జీవుడు యీ దేహం నుండి ఇంకో దేహం చేరునప్పుడు యీ పాప పుణ్యాలను వెంట తీసుకొని వెళ్తాడు. అజ్ఞానులకు యీ శరీరము సంసార బంధానికి కారణమైతే జ్ఞానులకు యీ శరీరమే ఆత్మప్రాప్తికి మోక్షసిద్ధికి కారణమైనది. వెయ్యిమంది మూఢుల మాటల కంటె ఒక్క జ్ఞాని మాట పరమ ప్రామాణికము. వెయ్యిమంది గుడ్డివారు సాక్ష్యము కంటే కన్నులు కలవాని ఒక సాక్ష్యం చాలు. జ్ఞానులకు జ్ఞాని, భగవంతుడు శాస్త్రీయమగు సంస్కారము లేని వారు ఆత్మానాత్మ వివేకము లేనివారు ఎంతగా ప్రయత్నించినా వారికి ఆత్మ దర్శనం అసాధ్యం. ఎందుకనగా వారు అకృతాత్ములు వారికి తపస్సు లేదు. ఇంద్రియ జయం లేదు. దురాచారాలను వదలుట లేదు. వీరికి చిత్తమున నిలకడ లేదు. వివేకము

లేదు, సాధన సంపత్తి లేనివారు ఎన్ని శాస్త్రాలు పఠించినా వారికి ఆత్మజ్ఞానము లభించదు.  ఇట్టి వారే అకృతాత్ములు.

జీవుడు పరమాత్మ అంశమే గనుక ప్రతి వారు తన స్వరూపము నందే పరమాత్ముని సాక్షాత్కరించు కోవలసి ఉంటుంది.  అర్జునా తన యందు పరమాత్ముని దర్శించినవాడు అన్నిచోట్లా భగవంతుని దర్శించ గలడు.  ఇట్లు సర్వత్రా పరమాత్ముని చూచినప్పుడు ప్రతి వస్తువు పారమార్థిక స్వరూపం పరమాత్ముడే దర్శనమిస్తాడు.

ప్రపంచంలో ధ్యానం చేయని వాడంటూ ఎవరూ ఉండరు.  ప్రతివారూ ఏదో ఒక ధ్యానం చేస్తూనే ఉన్నారు.  ధనాన్ని ఒకరు, స్త్రీని ఒకరు, పదవిని ఒకరు, సంతానాన్ని ఒకరు, సంసారాన్ని ఒకరు, ఇట్లు ఒక్కొక్కరు ఒక్కో వస్తువును ధ్యానిస్తూనే ఉన్నారు.  యీ ధ్యానాలతో మానవుడు ఉద్ధరింపబడడు, జడ వస్తువుల ధ్యానంతో మానవుడు జడమై పోతున్నాడు.  చైతన్య వస్తువును ధ్యానం చేసి తానూ చైతన్య జ్యోతి కావాలి ధ్యానానికి భ్రమర కీటక న్యాయం ప్రసిద్ధమైన దృష్టాంతం కీటకం భ్రమరాన్ని ధ్యానం చేసి చేసి అదీ భ్రమరమై పోయింది.  కంసుడు కృష్ణుని ధ్యానిస్తూ కృష్ణచైతన్యం పొందాడు.

అర్జునా సమస్త ప్రపంచాన్ని వెలిగించే సూర్యునిలోని తేజస్సు తోనే వారు ప్రకాశిస్తున్నారు.  తనలో ప్రకాశించే సూర్యుని చంద్రాగ్నులు తనను ప్రకాశింప చేయలేవు.  సూర్యుడనేది ఒక పెద్ద కరెంటు బల్బు లాంటిది.  కరెంటు లేకపోతే  ఆ బల్బు వెలుగనట్లు పరమేశ్వర చైతన్యమనే కరెంటు లేకపోతే ఆ సూర్యచంద్రులనే బల్బులు వెలుగవు భగవంతుని బ్రహ్మాండ భవనంలో సూర్యచంద్రాగ్నులు పెద్ద బల్బులు పరమాత్ముని చైతన్య శక్తి వాటికి కరెంటు వంటిది.  మనస్సులో సంకల్పించే శక్తి కంటితో చూసే శక్తి వాక్కుతో పలికే

శక్తి పరమాత్మునిదేనని మరువకూడదు.

అర్జునా ! సర్వాతి సూక్ష్మమైన పరమాత్మలోని పంచభూతాలు ప్రపంచము నేనే వహించి యున్నాను. నేను వైశ్వా నరరూప జఠరాగ్నినై సమస్త ప్రాణుల దేహాల నాశ్రయించి ప్రాణాపానములతో కూడికొని మీరు తిను చతుర్విధాహారములను పచనం చేస్తున్నాను. యీ వాక్యానికి మూలము.

మానవుడు తన పురుషార్థంతో తాను చేసే కర్మలతో యీ ఊడలను ఖండించి ఊర్ధ్వగామీ కావచ్చు లేదా స్వయంకృత కర్మలతో యీ అవాంతర మూలాలకు బలాన్ని పోసి మరింత బద్ధుడు కావచ్చు. స్వయంకృత కర్మ ప్రభావంతో తాను పశువూ కావచ్చు. పశపతీ కావచ్చు. కర్మాధికారం కర్మ స్వాతంత్ర్యం ఒక్క మానవ జన్మలో కర్మాధికారము కర్మ ఫలాధికారమూ రెండూ వున్నవి. ఖట్వాంగ చక్రవర్తి ముక్తిపొందే కోసం దేవలోకాన్ని వీడి మనుష్యలోకానికి రావలసి వచ్చింది. మానవుడవైన నీవే కర్మాధికారివని గీతాచార్యుని బోధ వెనుకటి కర్మఫలాన్ని అనుభవిస్తూ క్రొత్త కర్మలు చేసుకునే హక్కు మానవునికి ఉంది. " నిన్ను నీవు ఉద్ధరించుకో " నిన్ను నీవు చెడగొట్టుకోవద్దు, అని జగద్గురుని బోధ నీ మంచికీ నీ చెడ్డకూ ఎవ్వరో కారణం కాదు నీవు చేసుకునే కర్మలే కారణం ఉత్తమ కర్మలు చేసి ఉన్నత పదవి పొందవచ్చు. నీచకర్మలు చేసి అధోగతీ పొందవచ్చు. నీపాప పుణ్యాలకు నీవే బాధ్యుడవు.

# శ్రీ భగవద్గీత
# పదహారవ అధ్యాయము
# దైవాసుర సంపద్విభాగయోగము

పూర్వము దేవతలు మానవులు రాక్షసులని వేర్వేరుగా ఉండెడివారు. ప్రస్తుతం ఈ కాలంలో మానవులలో దేవతలు, మానవులలో మానవులు, మానవులలో రాక్షసులు ఉన్నారు. సంఘంలో దేవతలు మానవులు, రాక్షసులూ కలిసే ఉన్నారన్నమాట. కనుక మనము కలిసిన పోయిన రాళ్ళను బియ్యమును వేరు చేసినట్లు దైవీ లక్షణాలు, అసురీలక్షణాలను గూర్చి బాగా తెలుసుకొని రాక్షసాంశతో ఉన్నవారితో సత్సంబంధాలు పెట్టుకోకుండ దైవీలక్షణం ఉన్నవారితోనే మిత్రత్వం బంధుత్వం సాంగత్యం చేయుమని భగవంతుడు దైవీలక్షణాలను అసురీలక్షణాలను మనకు అర్థమయ్యే రీతిలో తెలియజేయు చున్నాడు. అందుకే అసుర రాక్షస స్వభావం కలవారు నన్ను చేరజాలరు, దైవీ స్వభావం గలవారు ఎప్పుడూ నన్నే ధ్యానిస్తూ నన్నే చేరుదురు అన్నాడు.

ఏనుగు బైటికి పోవాలంటుంది. మొసలి లోపలకి పోవాలంటుంది. అదే కరిమకరముల పోరు. యీ దైవీ సంపదకు అసురీ సంపదకు నిరంతరం పోరు జరుగుతూనే యుంది. ఆ గజేంద్రునికు ఒక్క మొసలి మాత్రమే పట్టి పీడించింది. మనకు అడుగడుగునా మొసళ్ళే. ఒకదానిని విడిపించుకునే సరికి మరొకటి పట్టిపీడిస్తుంది. ఈ మొసళ్ళను దాటుకుంటేనే కదా మోక్షం. అప్పుడు కౌరవులూ పాండవులు వేర్వేరుగా వుండినారు. ఇప్పుడు ఇర్వురు మనలోననే ఉన్నారు. ఆ కౌరవ పాండవ యుద్ధము అదే, మంచికీ చెడుకూ యుద్ధం జరుగుతూనే యుంది. అక్కడనేమో పాండవులు జయించినారు.

ఇక్కడనేమో కౌరవులు జయిస్తున్నారు. కాల ప్రభావమేమో యీ దైవాసుర సంపద్విభాగంలో మొదట దైవ గుణాలను గూర్చి తెలుపుచున్నాడు భగవానుడు. మొదటిది " అభయము " గీతా అభ్యర్థికి మొదటి పాఠము అభయము. "నిర్భయుడవై యుండుము" యీ వాక్యాన్ని స్వామి వివేకానందుల వారు కూడా పదేపదే వాడేవాడు "క్లైబ్యం మాస్మగమ: పార్థ, పిరికి పందవు కావద్దు ఇది ప్రారంభోపదేశం, వీరుడు ఒక్కతూరే చస్తాడు. భీరుడు పదేపదే చస్తాడు. పండితుని చెంతకు యీ భయశోకాలు రానేరావు. భీరువుకు ప్రియవస్తువు పోతుందని భయము. బల్లిని చూస్తే భయము. పిల్లిని చూస్తే భయము, భయము చెడ్డరోగము, సాహసము లేక మనుజుడు సౌఖ్య పడడు. మోక్షమార్గంలో ఎదురయ్యే ఆటంకాలను అవమానాలకు వెరవకుండా ఉండుట అభయమని యిక్కడ అర్థము.

అన్ని సుగుణాలలో అభయమునకు అగ్ర పీఠము వేయబడినది. యీ దైవీసేనకు అభయుడు సర్వసేనాధిపతి. సేనాధిపతి ముందు వుంటే సేన వెనుక నడుస్తూ ఉంటుంది. దైవీసంపద అనే యీ రైలుకు అభయము ఇంజను వంటిది. మధ్యన 24 పెట్టెలున్నాయి. చివరిది దైవీ గుణము "నాతి మానితా, అనబడే యీ వినయము గార్డుపెట్టె. అభయములో యీ బండి ముందుకు సాగుతుంది. వెనక్కు జారకుండా వినయము కాపాడుతుంది. భయములేని చోటు స్వర్గలోకము. వైకుంఠంలో గరుడుడు ఆదిశేషుడు కలిసి ఉంటారు. కైలాసంలో వృషభము సింహము పాములు నెమలి కలిసి ఉంటాయి. భయముతో జీవించువాడు నరక లోకములో ఉన్నట్లే. జ్ఞాని ఒక్కడే నిర్భయుడు. అన్ని భయాలలో మృత్యుభయము మహాచెడ్డది. జ్ఞాని దేనికీ భయపడడు. శిక్షించే వానికి రెండు చేతులైతే రక్షించేవానికి వేయి చేతులు. భయపడేది పశులక్షణము. భయపెట్టేది మృగలక్షణము.

భక్తుడు భయపెట్టేది లేదు, భయపడేది లేదు. జ్ఞాని మృత్యువుకు కూడా భయపడడు. ఇక రెండవది " సత్వ సంశుద్ధి" తమోగుణానికి రజోగుణానికి లొంగనిదే సత్వగుణము. ఈ గుణం కల్గినప్పుడే సత్వసంశుద్ధుడనబడుతాడు. లోపలా బైటా సత్వసంశుద్ధుడు కావాలి. శుద్ధ బుద్ధి కామధేనువు వంటిది. అంత:కరణ స్థితి సత్వసంశుద్ధి అనబడుతుంది.

మూడవది " జ్ఞానయోగ వ్యవస్థితి. వివేకముతో పనిచేయుట, శాస్త్రముల వలన గురువుల వలన తెలుసుకొనిన జ్ఞానాన్ని ఏకాగ్ర మనస్సుతో తెలుసుకొనుట. " వ్యవస్థితి " స్థితి కాదు. స్థితి అనగా అతిధి వలె నుండుట కాదు, అధిపతివలె ఉండాలి అదే వ్యవస్థితి.

ఇక నాల్గవది "దానము". దాన మేకం కలౌ యుగే. కలియుగంలో దానానికి ప్రాధాన్యత ఉంది. దానం చేస్తే దరిద్రుల మౌతామని కొందరి భయము. దానం చేయక పోతే దరిద్రుల మౌతామని అనుకునే వారు కొందరు. న్యాయార్జితాన్ని సత్పాత్రదానం చేయడం చాలా ముఖ్యం. అన్నదానం, ధనదానం, వస్త్రదానం, వైద్యదానం, కన్యాదానం, భూదానం, శ్రమదానం, వాగ్ధానం, మొదలగునవి వారివారి యోగ్యతను బట్టి దేశకాల పాత్రల గురించి దానం చేయాలి, అపాత్రదానం చేయరాదు. గృహస్థాశ్రమానికి దానమే ప్రాణము పెట్టింది. తనదగ్గర చేరేది, తను పెట్టుకున్నది పరులది. దానం చేయని దోషం వలన దరిద్రులై పుద్తారు. దరిద్ర దోషంతో పాపం చేస్తాడు. పాపంతో నరకం పొందుతాడు.

అయిదవది "దమము" పని చేయడం మన డ్యూటీ పని ఇవ్వడం భగవంతుని డ్యూటి. శక్తి వంచన లేకుండా పనిచేయండి. అనుభవం దాని పాటికి అదే వస్తుంది.



సమయాన్ని వృధాచేయడం నోరు జారడం యీ రెండు ఘోర దుర్వ్యసనాలు.

దమము అనగా ఇంద్రియ నిగ్రహము – మానవ సభ్యత యొక్క వికాసము, యీ దమముపై ఆధారపడి ఉంది. పచ్చగ కనపడితే పరుగెత్తేది పశులక్షణము. ఇంద్రియాల వెంట పరుగెత్తేవాడు వాటికిబానిసై ప్రవర్తించేవాడు పశువుకంటే నికృష్టుడు. ఇంద్రియాలు తమకు కావలసినవి కోరుతాయి. కాని మనకు కావలసినవి కోరవు. ఇంద్రియ పశువులను జయించినవాడు పశుపతి అవుతాడు. దేహ ప్రధానమైన పశువులకు భోగజీవితం తగినదే కాని బుద్ధి ప్రధానమైన మానవునికి భోగజీవితం అధమము. మానవునకు యోగ జీవితం అత్యంత ముఖ్యము. భోగాసక్తి తగ్గితే యోగానికి ప్రారంభం. యీ " దమ " శబ్దాన్ని తారుమారు చేస్తే " మద " అవుతుంది. దమము దైవీ సంపద, మద నరకానికి దారి, ఇంద్రుని గెల్చిన రావణుడు ఇంద్రియాదులను గెల్వలేక చచ్చాడు.

ఇక " యజ్ఞము " ఆరవ సంపద. పంచ యజ్ఞాలనబడేవి దేహ యజ్ఞము పితృయజ్ఞము, భూతయజ్ఞము, భూత యజ్ఞాలు స్మార్త యజ్ఞాలు అనునవి ముఖ్యమైనవి. ఒక్కమాటలో చెప్పాలంటే యజ్ఞమనగా పరార్థంగా పరమార్ధంగా గడిపే జీవన చర్యే. భగవత్ప్రీతిగా నిస్వార్ధంగా అతిథికి పట్టెడన్నము పెట్టినా, దాహార్థికి గ్లాసు మంచినీళ్ళు యిచ్చినా అది కూడా యజ్ఞమే. భగవంతుడు నీవు యేమి ఇస్తున్నావని చూడడు. ఎట్లు ఇస్తున్నావని చూచును. ఆయన నీ విత్తాన్ని చూడడు చిత్తాన్ని చూస్తాడు.

తర్వాత ఏడవది " స్వాధ్యాయము " అను సంపద ఆత్మసాక్షాత్కారానికి తోడ్పడే సచ్ఛాస్త్రాలను సద్గ్రంథాలను పఠించుట. ఆధ్యాత్మిక గ్రంథాలను నియమంగా పఠించుటను స్వాధ్యాయము అందురు. శాస్త్ర మర్మములు తెలుసుకొనుటకు స్వాధ్యాయము తాళము చెవి వంటిది.

తర్వాత ఎనిమిదవ సంపద "తపస్సు". తపస్సు అనగా భగవంతుని కొరకు ధర్మము కొరకు మోక్షము కొరకు తపించుటే తపస్సు. తపస్సుతో సాధించరానిదేదీ లేదు, తపస్సుతో పాపవికారాలు భస్మమై పోతాయి. తపస్సు లేని వానికి పతనము తప్పదు.

ఇక తొమ్మిదవ దైవీ సంపద " అహింస ". సభ్యత యొక్క పరమావధి. బుద్ధుడు, మహాత్మా గాంధి వీరు యీ అహింసలో విశేషమైన ప్రగతిని సాధించారు. హింస అనగా ఆయుధాలతో చంపుటే కాదు ఒరుల మనస్సు నొప్పించుట కూడానూ హింసయే.

ఈ అహింసకు ప్రక్కనే పదియవది " సత్యం". ఉన్నదిఉన్నట్లు తెలిసినది తెలిసినట్లు హితముగ పలుకుటే సత్యము. సత్యము శివమూ సుందరమూ, సత్యాన్ని మించిన పుణ్యం లేదు. అబద్ధాన్ని మించిన పాపం లేదు.

ఇక పదకొండవది " అక్రోధము ". క్రోధ మనిన, కోపమనినా ఒక్కటే. కోపము ఒక పాపము, కోప మొక విషము, కోప మొక పిచ్చి. కోపంలో కోసిన ముక్కు శాంతంలో వస్తుందా అని కొందరంటారు. కోపమొస్తే నేను మనిషిని కాదు అని అంటుంటారు. అప్పుడతడు భూతమౌతాడని అర్థం. కోపం ఛండాలుడు, ఛండాలుని తాకితే స్నానం చేస్తారు. కోపం వస్తే వెంటనే స్నానం చెయ్యి అది తగ్గుతుంది. యీ కోపం గురించి ఒక చిన్న పద్యం చెప్పుకుందాం.

కోపులు గురువధ కోడరు
కోపులు పరనింద జేయగొంకరు కోరుం
బాపదల కెల్ల మూలము
కోపము పాపముల పొత్తు కోపానలమున్

కోపమంత చెడ్డది మరొక్కటి లేదు. గనుక కోపానికి దూరంగా ఉండుటకు ప్రయత్నించడం ప్రతి ఒక్కరి కర్తవ్యం.

తర్వాత పదమూడవది " త్యాగము " గీత మొదటి నుండి త్యాగివి కమ్మని బోధిస్తుంది. త్యాగి ఉన్నవాటికి అంటుకోడు, లేనివి కావలయునని కోరడు. త్యాగ మనగా అన్నీ ఒదులుట అని అర్థము. అనగా సంసారాన్ని వదలుట అని అర్థము. త్యాగియేమైనా చేయగలడు. యేమైనా సాధించగలడు.

తర్వాత పదునాల్గవది " శాంతి ". యీ శాంతి కలగాలంటే త్యాగం వల్లనే శాంతి లభిస్తుంది. చిత్తము రాగద్వేష రహితం కావడమే శాంతి. 'అశాంతస్యకుతస్సుఖం ' అని గీత చెప్పింది. శాంతము లేక సౌఖ్యము లేదని త్యాగరాజస్వామి పాటగా పాడి వినిపించాడు.

తర్వాత పదునయిదవది "అపైశునము" అనగా కొండెములు చెప్పకుండుట. ఒకరి దోషాలను ఇతరులకు చెప్పడం. ఇదే చాడీ కోరుతనము. ఇంతకంటే పాపవృత్తి మరొక్కటి లేదు. ఇది కాకి వృత్తి. కాకికి ఎక్కడ దోషాలుంటాయో అక్కడే వాలుతుంది. దోషవృత్తి కాకిది. గుణదృష్టి హంసది. అందుకే హంస బ్రహ్మావాహనమైనది. కాకి పితృదేవతల ప్రతినిధి అయినది.

ప్రతివ్యక్తి తనలో దోషాలు ఇతరులకు తెలియకూడదని ఎలా కోరుతాడో అలాగే ఇతరుల చెడులను కూడా చూడవద్దంటుంది గీత. పనిచేసేది నీవంతు ఫలితం ఇచ్చేది భగవంతుడు " దయా భూతేషు " భూతదయ పదియారవది ఇతరులకు సుఖము కల్గించడం దయ అవుతుంది. దయ అహింసకు మూల స్తంభము. దయలేని వాడు దైత్యుడు. దయ ధర్మానికి మూలము. అభిమానము పాపానికి మూలము. " అలోలత్వం " ఇది 17వది యీ అలోలత్వము పనికి రాదంటున్నాడు పరమాత్మ స్త్రీలోలత్వము,

పానలోలత్వము, గానలోలత్వము యివి బహువిధాలు ఆధ్యాత్మ సాధకుడికి యీలోలత్వాలు పనికిరావు. భోగాలను అనుభవించడం తప్పుకాదు. బానిసవై అనుభవించకు ప్రభుడవై అనుభవించమంటుంది గీత.

భాగవతంలో పోతన అంటాడు " మహా విద్వాంసుడున్ కామినీ హేలా కృష్ణ కురంగ శాబక మగున్ హీనస్థితిన్ వింటిరే " అంటూ తర్కవాచస్పతులమని, కవి కంఠీరవులమని కళాప్రపూర్ణులమని ఉపన్యాస చక్రవర్తులమని విర్రవీగి ఉర్రూతలూగే మహావిద్వాంసులున్ పోతన్నగారితో పెడ పెడ లెంపకాయలు తిన్నారు. యీ విషయం గొప్పదే అయినా యీ చట్టాన్ని ధిక్కరించిన ధీరులు లేకపోలేదు. కనుకనే "కలంచునే సతుల మాయల్ ధీరచిత్తంబులన్ " అన్నాడు పెద్దన్నగారు " స్త్రీ " మారుత చండధాటికి చపలమానవులు గడ్డి పోచలవలె గజగజలాడిపోతారు. కొందరు కొండల వలె ఉంటారే వారే ధీరులు ధన్యులు జ్ఞానులు.

గీతా భక్తులు యీ వివిధ లోలత్వాలకు స్వాధీనం కారాదు. పాశ్చాత్యదేశాలలో భోగాలు ఎంత పెంచుకుంటే అంత గొప్ప. భారతదేశంలో ఎంత తగ్గించుకుంటే అంత గొప్ప. " బ్రతుకుటకై తినాలి. తినుటకై బ్రతుకరాదు" తర్వాతది " మార్దవము " ఇది 18వది. మార్దవమంటే మృదుత్వము, మృదుత్వము దైవ సంపద, దేహము గట్టిగా ఉండాలి. మనస్సు మృదువుగా ఉండాలి. మృదుత్వము దైవీ సంపద, కఠినత్వము అసురీ సంపద. "హ్రీ " ఇది 19వది లజ్జను సంస్కృతంలో "హ్రీ " అని అందురు స్త్రీకి ఇది ఒక భూషణము, అపకీర్తికి అర్హములైన పనులకు భయపడడం, ఇది లజ్జ యొక్క లక్షణము.

ప్రస్తుతము కలికాలంలో మానవుడు అంతా రివర్సు. క్లబ్బులకు పోవాలన్నా సినిమాలకు పోవాలన్నా సిగ్గుపడడు గాని, మందిరాలకు పోవాలన్నా ముఖానికి బొట్టుపెట్టుకోవాలన్నా పెద్దల ఉపన్యాసాలకు పోవాలన్నా మహా సిగ్గు. సిగరెట్లు త్రాగాలన్నా చీట్ల పేకాటలాడాలన్నా సిగ్గులేదు గాని, భగవద్గీత చదువాలంటే, భజన చేయాలంటే సిగ్గు.

"అచాపలము" ఇది ఇరవయ్యో లక్షణము అనగా చపలత్వము లేకుండుట. యీ చపలత్వం యెక్కడైనా దొరుకుతుంది గాని స్థిరత్వం అనేది ఎక్కడా లభించుట లేదు. కళ్ళు చపలత్వము, మనసు చపలత్వము, ఏ ఇంద్రియం చూచినా చపలత్వమే. ఏనుగు అంత పెద్దదయినా ఎప్పుడూ చపలత్వమే, ఎందుకనగా అది మదప్రాణి గనుక, సింహము చూడండి ఎంత గంభీరము అందుకే అది మృగరాజు అయ్యింది.

"తేజస్సు" 21వది దైవీ సంపద నిగ్రహానుగ్రహ సమర్థమైన తేజస్సు. దైవీ సంపన్నులలో ఈ బ్రహ్మతేజస్సు విరాజమానమై ఉంటుంది. తర్వాతది 'క్షమ' 22వది. యీ క్షమను గురించి ఇంతకు ముందు కూడా గీతలో శ్రీకృష్ణ పరమాత్మ ప్రస్తావించినాడు. 'ధృతి' ఇది 23వది ధృతి అనగా దృఢ నిశ్చయము. దృఢ దీక్ష కష్టాలు చుట్టుముట్టినప్పుడు చలించకుండా దృఢంగా ఉండుటే అదే ధృతి. దృఢ నిశ్చయం.

శౌచము 24వది. లోపల వెలుపల శుచిగా ఉండుట. త్రికరణ శుద్ధిని సంపాదించుట శౌచమనబడుతుంది. శౌచము దైవీసంపద.

25వది 'అద్రోహము' భక్తుని లక్షణాలలో అద్వేష్టా సర్వభూతానాం, అనే మాటకు ఇది పర్యాయపదం. విశ్వాస ద్రోహం చేయకుండుట ప్రాణి ద్రోహం చేయకుండుట అద్రోహ మనబడును. అన్యద్రోహము ఆత్మద్రోహమే అవుతుంది. యీ తత్త్వాన్ని తెలిసినవాడు ఎవరికీ ఏ ద్రోహము చేయడు.

చివరిది "నాతిమానిత్వము" అనగా తానే గొప్ప వాడననుకొనుట, తానే భక్తుడను, తానే పండితుడనుకోవటము. యిది ఆంజనేయునిలో ప్రస్ఫుటంగా చూడవచ్చు. అదే వినయం, విధేయత, యీ దైవీ సంపద లోని లక్షణాల నన్నిటినీ వెన్నంటి ఉండేదీ అమానిత్వమనే వినయం చాలా గొప్పగుణం. భగవంతుడంటున్నాడు అర్జునా! సాత్విక వాసనల ఆశ్రయంలో జన్మించినవాడు. యీ దైవీ సంపదలతో కూడుకొని ఉంటాడు. భగవంతుడు ఇంతవరకు దైవీ సంపదను వర్ణించిన తర్వాత తద్విరుద్ధమగు అసురీ సంపదను గూర్చి తెల్పుతున్నాడు.

యీ దైవాసుర సంపద్విభాగయోగం ముఖ్యోద్ద్యేశం ఏమనగా దైవీ గుణాలను పెంచుకుంటూ, అసురీగుణాలను తుంచుకుంటూ ఉన్నతిని సాధించాలని భగవంతుని ఆశయం. పరమాత్మ దైవీసంపదను 3 శ్లోకాలలో చెప్పి అసురీసంపదను విశేషంగా తెల్పుతున్నాడు. చెడుగుణాలను గూర్చి బాగా తెలుసుకొని మంచిగా మారాలని ఆకాంక్షిస్తాడు అనంతుడు.

యీ దైవాసుర సంపద్విభాగ యోగంలో మొత్తం 24 శ్లోకాలు. అందులో దైవీ సంపదను గూర్చి 3 శ్లోకాలలో చెప్పి శ్రీకృష్ణ పరమాత్మ అసురీ సంపదను గూర్చి 21 శ్లోకాలలో తెలియజేయుచున్నాడు. అసురీ సంపద అని ఎందుకు అసురీ లక్షణాలు అంటే సరిపోతుంది కదా అని అనుకోవచ్చు. రాక్షసులకు క్రూరులకు అదీ ఒక సంపదే కనుక ఆ పేరు పెట్టి వుండవచ్చు, ఆ పరమాత్మ. ఆ భగవంతుడు చాలా విశేషంగా తెల్పినా మనం సున్నితంగానే ముందుకు వెళ్ళే ప్రయత్నం చేశాము. మొదట శ్లోకంతో ప్రారంభించుదాము.

శ్లో ॥ దంభో దర్పాభిమానశ్చ - క్రోధ: పారుష్యమేవచ
అజ్ఞానం చాభి జాతస్య - పార్థ: సంపద మాసురీం

తా॥ అర్జునా దంభము, దర్పము, అభిమానము, క్రోధము, పౌరుషము, అజ్ఞానము యీ అసురీ సంపదలకు యివిఆరు తలలు. మానవుడు పతనమగుటకు ఒక్కటి చాలు. ఇక ఆరు ఉన్నాయంటే చెప్పనలవి కాదు.

యీ అసురీ స్వభావం వారి కౄరత్వం వారి స్వార్థము వారి కాఠిన్యము వారి కపటము విశేషంగా వర్ణించి 21 శ్లోకాలలో వివరించాడు ఆ దేవ దేవుడు. ఆ రాక్షస గుణాలను వర్ణించడం ఎందుకు? అసురీ గుణాలను వదలిపెట్టి ముందుకు పయనిద్దాము. ఇంతవరకు భగవద్గీతలో 16 అధ్యాయాలు పూర్తి చేసుకున్నాము.

ఇపుడు మనము శ్రద్ధాత్రయ విభాగ యోగంలో ప్రవేశించే ముందు ఆ ఆధ్యాయాన్ని గూర్చి కొద్దిగా చర్చించుకొని 17వ ఆధ్యాయంలో ప్రవేశించుదాము.

భగవద్గీత 18 అంతస్థుల దివ్య భవనం. యీ భవనముపై వుండు గోపురం యీ ఆధ్యాయం అసురీసంపదను దైవీ సంపదగా మార్చుకొని దైవీగుణ సంపన్నులై నిత్య కర్మానుష్ఠానపరులై భగవద్గీతలోని పరమార్థాన్ని పరిగ్రహించి మీరు పవిత్రులై మీ పరిసరాల వారినీ పవిత్రులను చేసి ధన్యులౌతారని ఆశిద్దాం.



# శ్రీ భగవద్గీత
# పదిహేడవ అధ్యాయము
# శ్రద్ధాత్రయ విభాగ యోగము

నదికి గమ్యం సముద్రం. విద్యార్థికి గమ్యం పరీక్షలలో ఉత్తీర్ణుడగుట. మానవ జీవితానికి గమ్యం పురుషోత్తమ ప్రాప్తి. ఇంతవరకు పురుషోత్తమ ప్రాప్తిలో దైవీ సంపదను బాధాకరమైన అసురీ సంపదను వివరిస్తూ పదహారవ అధ్యాయం నడిచింది. ఇప్పుడు యీ పదిహేడవ అధ్యాయంలో అసురీ ప్రవర్తనను దైవీ ప్రవర్తనగా మార్చుకొనే కోసం అందుకు కావలసిన యుక్తియుక్తాల తెల్పుచున్నాడు శ్రీకృష్ణపరమాత్మ.

అర్జునుడు శ్రద్ధాయుక్తులగు పురుషుల నిష్టను గూర్చి ప్రశ్నిస్తాడు. అందుకు శ్రీకృష్ణుడు పురుషుని స్వరూపాన్ని వాని నిష్టను నిర్ణయం చేసి చెప్పాడు.

మనం శ్రద్ధాత్రయ విభాగయోగంలో ప్రవేశిస్తున్నాము. మానవుడు ఏమి సాధించాలన్నా శ్రద్ధ అవసరం అంటూ ప్రారంభిస్తున్నాడు. అర్జునా ఎవడు శాస్త్ర పద్ధతిని వదిలి స్వేచ్ఛాచారియై ప్రవర్తిస్తాడో వానికి సిద్ధిలేదు. శు ద్ధిలేదు, ఇహము లేదు, పరము లేదు కనుక శాస్త్ర విధానాన్ని అనుసరించి నీవు కర్మలు చేయుట యుక్తము అని తెల్పగా దేవా చాలామంది పూజలు, యజ్ఞాలు అనుష్టిస్తూ ఉంటారు. వారి నిష్ట సాత్వికమా, తామసమా, రాజసమా అనే సంశయం రాగా అర్జునా కర్మలు చేసే వారు మూడు రకాలు. శాస్త్రము తెలసు, శ్రద్ధ లేదు వీరు అసురులు మరొక్కరున్నారు శ్రద్ధ ఉంది. అజ్ఞానంతోనో, బద్ధకంతోనో శాస్త్రవిధి వారికి తెలియదు. పెద్దల మార్గాన్ని బట్టి ప్రవర్తిస్తుంటారు

వారు. వారిని గూర్చి వివరంగా తెలుసుకుందాము. శాస్త్రము ముఖ్యమా, శ్రద్ధ ముఖ్యమా అంటే శ్రద్ధే ముఖ్యమని సూచించుతూ శ్రద్ధ లేని శాస్త్రం చదవడం ముఖ్యం కాదు. శాస్త్రంలోని ఆచరణకు అవి ఉండిన చాలు. ఉత్తమ శ్రద్ధాభక్తులు ఇప్పుడు శాస్త్రం చదివితే రావు. అవి జన్మాంతర పుణ్య సంస్కారంతో వస్తాయి.

యజ్ఞము, దానము, తపస్సు, సాత్వికంగా ఉండాలంటే ఆహారమూ సాత్వికంగా ఉండాలి. అందుకై ఆహార విషయాన్ని ముందుగా ప్రస్తావించి సాత్వికాహారము గూర్చి తెల్పుతున్నాడు గీతాచార్యులు.

శ్లో ॥ ఆయుస్సత్వం బలారోగ్యం - సుఖ ప్రీతి వివర్ధనా:
రస్యాస్నిగ్ధా స్థిరాహృద్యా - ఆహారాస్సాత్విక ప్రియా:

అర్జునా ఆయుస్సునూ, సత్వాన్ని, బలాన్ని, ఆరోగ్యాన్ని, సుఖాన్ని, ప్రీతిని అభివృద్ధి చేయునది రసవంతమైనది సాత్వికాహారము.

ఆహార విషయంలో చాలా ముఖ్యంగా ప్రాధాన్యత ఇవ్వటం లేదు. ప్రపంచంలో ఎన్నో విధాలైన ఆహారాలు ఉండినా, శాకాహారము, మాంసాహారము ఇవి ముఖ్యమైనవి. ఆహార స్వభావాన్ని బట్టి యీ శాకాహార మాంసాహారుల స్వభావాలు భిన్నంగా ఉంటాయి. మాంసాహార జంతువులు పులి, నక్క, తోడేలు వీటి స్వభావాన్ని చూడండి. శాకాహార జంతువులైన ఆవు, గుఱ్ఱము, ఏనుగు మొదలగు జంతువుల స్వభావాలు చూడండి మీకే అర్థమవుతుంది.

మనుష్యునిలో ధర్మము, పవిత్రత, శుద్ధి, బుద్ధి, జ్ఞానము, శాంతము కావాలంటే సాత్వికాహారమే ముఖ్యంగా వాడాలి. ఇంతే గాక బాహ్యామైన శారీరిక శక్తి, ప్రసన్నత్వము, ఆనందము సులభముగ జీర్ణమగునది. తినుటకు

ప్రియమైనది. విటమిన్స్‌లతో కూడినది మనస్సుకు ఇంపైన, పుష్టి కల్గినది అయిన యీ సాత్వికాహారాన్ని గూర్చి శ్రీకృష్ణుడు తెల్పుతున్నాడు.

శ్లో ॥ కట్వామ్ల లవణాత్యుష్ణ తీక్ష్ణ రూక్షవిదాహిన: ॥
ఆహారా రాజసస్యేష్టా దు:ఖ శోకామయప్రదా: ॥

చేదు, పులుపు, ఉప్పు మిక్కిలి వేడిగా ఉండునది కారము ఎండిపోయిన కఠినముగా ఉండునవి మిగుల దప్పిని కల్గించునవి ఇట్టి ఆహారాలు రాజస స్వభావం కలవారికి యిష్టంగా ఉండును. యీ రాజసాహారం దు:ఖాన్ని, శోకాన్ని రోగాలను కల్గించును. పులుపు, కారము, చేదు, వేడిని అతిగా వాడరాదు. పులుపు ఎక్కువ వాడుటచే వీర్యం క్షయిస్తుంది. కంఠస్వరం చెడుతుంది. చంచలత్వం వృద్ధి చెందుతుంది. రక్తదోషాలు వృద్ధిచెందుతాయి. వెంట్రుకలు త్వరగా తెల్లబడును. చర్మరోగాలు వృద్ధిచెందుతాయి.

ఎక్కువ వేడి పదార్థాలు సేవించడంలో వీర్యక్షయము, అతిదాహము, వణుకుడు రోగాలు వచ్చుట. ఈనాడు వేడి వేడి కాఫీలు, టీలు రాత్రింబ వళ్ళు త్రాగడం అలవాటై పోయింది. ఇవి ఎన్నో అనారోగ్యాలకు దారితీయును. ఎక్కువ కారము, జీర్ణశక్తిని పాడుచేస్తుంది. చరచరా అనే చట్నీలు గప్పుమనే మసాలాలు రకరకాలైన పూరగాయలు, కొందరు మిరప కాయలనే తింటారు. పచ్చిమిరపకాయలు, ఎలుకలకు ఇష్టం, ఎండుమిరపకాయలు కాకులకు ఇష్టం. వాటి స్వభావం కలవారే వాటిని ప్రేమిస్తారు. ఎండిన పదార్థాలు రక్తాన్ని హరింపచేస్తాయి. కనుక అతి కారం, అతి పులుపు, అతి ఉప్పు వాడరాదు.

అధరానికి రుచి – ఉదరానికి బాధ అనే సూక్తిని గమనించి ఆరోగ్యాన్ని కోరువారు ఆహార నియమాన్ని తప్పక పాటించాలి. యీ రాజసాహార సేవనంతో దుస్వప్నాలు దుష్ట సంకల్పాలు ఆవహిస్తాయి అని తెల్పి, యిక

తామసాహారాన్ని గూర్చి కృష్ణుడు తెల్పుతున్నాడు అర్జునా

శ్లో ॥ యాత యామం గత రసం - పూతిపర్యుషితంచయత్
ఉచ్ఛిష్ట మపిచామేధ్యం - భోజనం తామస ప్రియం

వండిన తర్వాత మరురోజు చద్దిది తినుట, ఉడికీ ఉడకనిది, సారము లేనిది, పోషకానికి పనికిరానిది తామసులకు ప్రియమైన ఆహారం, కంపుకొట్టునది ఎవ్వరూ ఇష్టపడరు గాని తామసులు వెదకి వెదకి సేవిస్తుంటారు. అవి కల్లు సారాయి లాంటి మత్తు పదార్థాలు వాటిని గ్రహించిన వాని నోటి నుండి కూడా దుర్వాసనే వస్తుంది. ఉచ్ఛిష్ఠము ఒకరు తిని విడిచినది ఒకరు తినరాదు అయినా

బ్రహ్మనిష్టులగు గురువుల ఉచ్ఛిష్టము శిష్యులూ, భర్తల ఉచ్ఛిష్టము పతివ్రతామతల్లులు, భుజించుట దోషం కాదు. ఆహార వస్తువు మంచిగా ఉంటేనే చాలదు దానిని ఎటువంటి డబ్బుచే సంపాదించినదో తెలుసుకుంటే మంచిది. పాపపు సొమ్ముచే గాని పాపపు వృత్తితో గాని సంపాదించినది వస్తువు మంచిదైనా మూడు విధానాలని అవి సాత్వికాహారం, రాజసాహారం, తామసాహారమని తెల్పి వాటి మంచీ చెడులను గూర్చి తెలియజేసినాడు.

సాత్వికాహారాన్ని సాత్వికులు వాడుతారు. రాజసాహారాన్ని రాజసులు వాడుతారు. తామసాహారాన్ని తామసులు వాడ్తారంటూ చెప్పి ఇంత వరకు త్రిగుణాలు ముందు యజ్ఞాలలో తమోయజ్ఞం సాత్విక యజ్ఞం రాజసయజ్ఞంలను గూర్చి శ్రీకృష్ణుడు తెల్పుచున్నాడు.

శ్రద్ధాత్రయ విభాగయోగంలో యజ్ఞాలలో తమో యజ్ఞ రజోయజ్ఞం సాత్విక యజ్ఞాల గూర్చి తెలియజేయుచున్నాడు. మానవుడు జన్మతోనే సృష్టికి ఋణపడినాడు. సంఘానికి ఋణపడినాడు. శరీరానికి ఋణపడినాడు.

వీటి ఋణం తీర్చుకోవాలంటే సృష్టి ఋణం తీర్చుకునేందుకు యజ్ఞాన్ని సమాజ ఋణం తీర్చుకునేందుకు దానాన్ని శరీరఋణం తీర్చుకునేందుకు తపస్సును చేయమంటుంది భగవద్గీత.

సాత్విక యజ్ఞము ఫలాపేక్ష లేకుండ ఉండవలెను. శాస్త్ర విహితమై ఉండవలెను. కర్తవ్య దృష్టి కలిగి యుండవలెను. యజ్ఞము స్వరూపము పరోపకారము సమాజసేవ భూత తృప్తి కలిగి చేయుట సాత్విక యజ్ఞము అని తెల్పి

ఇపుడు రాజస యజ్ఞాన్ని గూర్చి శ్రీకృష్ణ పరమాత్మ తెలియజేయుచున్నాడు.

శ్లో ॥ అభిసంధాయతు ఫలం - దంభార్థ మపిచైవయత్
ఇజ్యతే భరత శ్రేష్ఠ - తం యజ్ఞం విద్ధి రాజసం

భరత శ్రేష్ఠుడవైన అర్జునా ఫలాన్ని ఆపేక్షించి చేసే యజ్ఞం డంభానికి చేసే యజ్ఞం రాజస యజ్ఞమని చెప్పబడుతుంది. ఇది ఫలాకాంక్షతో కూడి యుంటుంది. పదిమంది పొగడాలని పరువు ప్రతిష్టలు పెరగాలని, ఆర్భాటాలకు చేసే యజ్ఞం తనలోని దోషాలను మోసాలను కప్పి పుచ్చే కోసం చేసే యజ్ఞాలు రాజస యజ్ఞం అందురు. అలాంటి యజ్ఞాల వల్ల వ్యయ ప్రయాసలేగాని శ్రమకు తగిన ఫలితం లభించదు.

శ్లో ॥ విధిహీన మసృష్టాన్నం - మంత్రహీన మదక్షిణం
శ్రద్ధా విరహితం యజ్ఞం - తామసం పరిచక్షతే

అర్జునా పాకాది సంస్కారహీనమైన అన్నము (అనగా) విధిహీనమైన అన్నదానము మంత్ర విరహిత మైనది. దక్షిణలేనిది శ్రద్ధలేనిది యీ అయిదు లక్షణాలతో కూడినది.

అన్నదానం లేని యజ్ఞము తామస యజ్ఞమని పేరు. దక్షిణ లేదంటే

త్యాగం లేదని అర్థము.  భోగం అన్ని పాపాలకు మూలమని మహాభారతం చెప్పింది.  పెట్టింది తనది పెట్టుకున్నది ఇతరులది యీ విధంగా మూడు విధాలైన యజ్ఞాల గురించి తెల్పిన తరువాత తపస్సుల గురించి వాటి విధానాల గూర్చి తెలియజేయుచున్నాడు.  భగవంతుడు ఇంతవరకు యజ్ఞాల గూర్చి తెల్పి ఇప్పుడు తపస్సులను గూర్చి తపస్సులలో రకాల గూర్చి తెల్పుచున్నాడు.

శ్లో ॥ దేవ ద్విజగురు ప్రాజ్ఞ – పూజనం శౌచ మార్జనమ్
బ్రహ్మ చర్య మహింసాచ – శారీరం తప ఉచ్యతే

తపస్సంటే చాలా మంది భయపడుతుంటారు.  తపస్సనే మాటకు అర్థం ఇల్లు విడిచి అరణ్యాలకు వెళ్ళి కొండలలో గుహలలో, శ్మశానాలలో వెళ్ళి గోళ్ళు గడ్డాలు పెంచి పస్తులుండి శరీరానికి వివిధ రకాల క్లేశాల కల్గించుటే తపస్సని తలుస్తారు.  కాని భగవంతుడు తన బోధల ద్వారా ఆ భ్రాంతిని నివారిస్తున్నాడు.  శరీరాన్ని మనస్సును ఆధ్యాత్మికీకరణము చేసే ప్రక్రియే తపస్సు ప్రపంచంలో పనులు, చేస్తూ బయట లోపల క్షీణించిన శక్తిని పూరించే ప్రక్రియే తపస్సు స్వభావంగా నిరంకుశంగా వుండే శరీరాలను సంయమనంలో పెట్టే పద్ధతే తపస్సు తర్వాత దేవతలను ద్విజులను గురువులను జ్ఞానులను పూజించుటయు శుచిత్వము ఆర్జవము బ్రహ్మచర్యము అహింస ప్రవర్తన కలిగి యుండుట ఇవి శారీరిక తపస్సని చెప్పబడుతుంది.

శ్లో ॥ అనుద్వేగ కరం వాక్యం – సత్యం ప్రియ హితంచయత్
స్వాధ్యాయా భ్యసనం చైవ – వాఙ్మయం తప ఉచ్యతే

పాండవ మధ్యమా ఎదుటి వాని మనస్సుకు తాపము కల్గించేటట్లు మాట్లాడరాదు.  మాట్లాడే మాట సత్యంగా ఉండాలి.  హితంగా ఉండాలి.  సత్య శాస్త్రాలను పఠించాలి.  ఇదంతా వాఙ్మయ తపస్సు.

వాచక తపస్సు గూర్చి తెల్పి తర్వాత మానసిక తపస్సుని గూర్చి తెల్పుతున్నాడు శ్రీకృష్ణ పరమాత్మ.

అర్జునా మనస్సు ప్రశాంతంగా ఉండాలి. శాంత భావం కలిగి యుండాలి. మౌనంగా ఉండాలి. ఆత్మనిగ్రహం కలిగి ఉండాలి. భావ సంసిద్ధి కలిగి ఉండాలి. ఇవన్నీ మానసిక తపస్సు తపస్సులలో కెల్లా మానసిక తపస్సు అత్యంత శ్రేష్ఠమైనది. యీ మనస్సు సహాయం లేకపోతే ఏ ఇంద్రియమూ ఏ పనీ చెయ్యలేదు. సంస్కారం పొందిన తపస్సే దేవత.

యీ సంస్కారములు లేని తపస్సు భూతం వంటిది. ఈనాడు ప్రపంచంలో మానవునికి బయట అన్నీ బాగున్నాయి. మనస్సు మాత్రం చెడిపోయింది. మానసిక జాఢ్యాలు ఎక్కువైనాయి. యీ రోగాలకు యీ ఉపద్రవాలకు మానసిక తపస్సే మంచి మందు.

యీ శ్రద్ధాత్రయ విభాగ యోగంలో శ్రీకృష్ణ పరమాత్మ అందరికీ ఆచరణ యోగ్యమైన నీతులు తెల్పుతున్నాడు. యీ శ్రద్ధాత్రయ విభాగ యోగం శ్రద్ధను బట్టి సిద్ధి లభిస్తూ ఉంటుంది. వాని శ్రద్ధ ఎట్టిదో వాని సిద్ధి ఆ విధంగానే ఉంటుంది. అతడు చేసే యజ్ఞము తపస్సు దానాన్ని బట్టి వాని వాని శ్రద్ధను గుర్తించాలి. ఆ అభిప్రాయంతోనే భగవంతుడు యజ్ఞాన్ని, తపస్సును 3 భాగాలు చేసి వివరిస్తున్నాడు. ప్రస్తుతం దానాన్ని గూర్చి వివరిస్తున్నాడు. దానాన్ని మించిన సత్కర్మ ఇంకొకటి లేదు. "దానమేకం - కలౌయుగే " నూరు చేతులతో సంపాదించు వేయి చేతులతో దానం చెయ్యి అని శాస్త్రం చెబుతుంది.

అర్జునా ప్రత్యుపకారం పొందాలనే ఉద్దేశ్యంతో కాని ఫలాపేక్షతో కాని మనస్సులో బాధపడుతూ కాని చేసిన దానం రాజసదానం అని చెప్పబడుతుంది.

సాత్విక దానం ఫలాపేక్ష రహితంగా కర్తవ్య దృష్టితో చేయబడుతుంది. రాజస దానం ప్రత్యుపకారం కోరి ఫలాపేక్షతోనూ ధనలాభం కొరకు దానం చేస్తారు. కొందరు ఐశ్వర్యాలు రావాలని దానం చేస్తారు. ఎలక్షన్‌లలో గెలవాలని కొందరు దానం చేస్తారు అవన్నీ రాజస దానాలే.

అయోగ్య దేశము నందు అయోగ్య కాలము నందు అయోగ్య పాత్రదానం నిరాదరణ పూర్వకంగా కాని తిరస్కార పూర్వకంగా గాని చేయు దానము తామస దానమని చెప్పబడును. జూదరులకు, త్రాగుబోతులకు దుశ్శీలురకు, కపటదారులకు కల్లలాడు వారికి చేసే దానం తామసదానం అనబడును. ఆహారం, యజ్ఞము, తపస్సు, దానము వీటియొక్క త్రివిధ బేధాన్ని చెప్పడం జరిగింది. యీ విధంగా యీ శ్రద్ధాత్రయ విభాగ యోగమును సంక్షిప్తంగా పూర్తి చేసుకున్నాము.



# శ్రీ భగవద్గీత
# పదునెనిమిదవ అధ్యాయము
# మోక్ష సన్యాస యోగము

శ్లో ॥ నష్టో మోహా: స్మృతిర్లబ్ధా – త్వత్ప్రసాదాన్మయాచ్యుత:
స్థితో స్మి గత సందేహా: । కరిష్యేవచనం తవ।

యీ అధ్యాయంలో 73వ శ్లోకంలో చెబుతాడు అర్జునుడు పదకొండవ అధ్యాయంలో " మోహోమంవిగతోమమ: ( నా మోహం పోయింది అని అన్నాడే కాని " నీవు చెప్పినట్లు చేస్తాను అనలేదు " అర్జునుడు ఆ మాట అనే వరకు బోధిస్తునే ఉన్నాడు! పూర్ణాహుతి అయ్యేవరకు ఆ దేవదేవుడు వదలుతాడా మొదట్లో అర్జునుడు గాండీవాన్ని పారవేశాడు కాని అహంకారాన్ని పట్టుకొని కూర్చున్నాడు చివరికి వచ్చేసరికి గాండీవాన్ని పట్టుకున్నాడు. ఆహంకారాన్ని వదలివేశాడు. నిజానికి వదలవలసింది అహంకారాన్ని గాండీవం గాదు.

బలిచక్రవర్తి తలకాయ యిచ్చినాడట. ఆ దానం అంత ప్రసిద్ధి చెందింది. తలకాయ యివ్వడమంటే అంతా ఇవ్వడమని అర్థం తల ఇవ్వకుండా ఎన్ని ఇచ్చినా పూర్ణార్పణం కాలేదు. యీ మోక్ష సన్యాస యోగాన్ని సంక్షిప్త గీతయని గౌరవంగా చెప్తుతుంటారు. యీ అధ్యాయం గీతాసారమే కాదు సమస్త వేదసారంకూడా ఇందులో చెప్పడం జరిగింది. అర్జున విషాదంతో మొదలైన గీత మోక్ష సన్యాస యోగంగా మారింది. అర్జునుని విషాదం భగవంతుని సన్నిధిలోనిది ఆ పుణ్య విషాదానికి ఫలితంగా పర్యవసానంగా పరిశుద్ధ సన్యాసం సిద్ధించింది. కర్మసన్యాస యోగంలో కర్మలకు సన్యాసం చెబితే యీ ఆధ్యాయంలో మోక్షానికే సన్యాసం చెప్పడం జరిగింది. లోకంలో ఇళ్ళకు



**పుణ్యఫలం కావాలందురే కాని పుణ్యకార్యాలు చేయరు పాపఫలితం వలదందురే కాని పాపకార్యాలు మానరు.**

వస్త్రాలకు వాహనాలకు వస్త్రాలకు కులాలకు గోత్రాలకు సన్యాస మివ్వాలని అంటుంటే భగవద్గీత మోక్షానికే సన్యాస మివ్వాలని బోధిస్తుంది.

అర్జునా మనం సమాజము నుండి ఎన్నో తీసుకుంటున్నాము. తీసుకున్నవాడు ఇవ్వక తప్పదు ఇవ్వని వాడు పాపి. యిచ్చి పుచ్చుకునే విషయం పై యీ బ్రహ్మాండాలన్ని నిలబడి ఉన్నాయి. సముద్రము నదులనుండి నీరు తీసుకుంటుంది. మళ్ళీ వర్షరూపంలో భూమిపైకి పంపుతుంది. ఇవ్వకుండా తీసుకోవడమైతే ప్రపంచం ప్రళయం పాలైపోతుంది. ఇచ్చేటందుకు ఇష్ట పడని వానికి తీసుకునే హక్కులేదు. దేవతా ప్రీతి కోసం యజ్ఞము, దేశసేవ కోసం దానం దేహ బుద్ధి కోసం తపస్సు యీ మూడింటిని ప్రతివాడు ఆచరించాలి.

బావా శ్రీకృష్ణ పరమాత్మా సన్యాసమనగానేమి? అర్జునా ! సంసారం వదలటం భార్య బిడ్డలను వదలడం యిల్లు వదలడం అన్నపానీయాలు వదలడం ఊరు వదలడం కాదయ్యా సన్యాసమంటే " కామ్య కర్మలను వదలుటే సన్యాసం"

మరి స్వామీ ! త్యాగమంటే ఏమిటి ? ఇది అర్జునుని ప్రశ్నకు కృష్ణుడు అర్జునా ఫలాపేక్ష లేక కర్మలు చేయడం సర్వకర్మలు ఆచరిస్తూ కూడా ఫలము ఆసక్తి లేకుండట త్యాగం. అర్జునా ఒకరు కర్మలు ఒదిలాడు ఒకడు కర్మఫలితాలను వదిలాడు కాని మొదటివాడు కర్మలే చేయనప్పుడు అతని దగ్గర ఫలితమేముంది. ఫలితం డిపాజిట్టు లేనప్పుడు ఒదిలేదేముంది అది సరైన పద్ధతి కాదు.

మొదటిది సన్యాసం రెండది త్యాగం ఒకటి కామ్యకర్మలను త్యజించమంటుంది రెండవది కర్మఫలాలను త్యజించమంటుంది. రెండింటి అభిప్రాయం కోరికలనూ ఫలాన్నీ త్యజించమనే కోరికలపై దృష్టి పెట్టుకొని ఫలంపై ఆసక్తి పెట్టుకొని చేసేకర్మలు రాణింపుగా ఉండవు కర్మ వర్తమానంలోనిది

ఫలము కోరిక భవిష్యత్తులోనిది యాత్ర చేసేవాడు ఇంటి మీద మనసుపెట్టు కుంటే యాత్ర సరిగా చేయలేడు చేసే పని చిత్తశుద్ధితో ఫలాపేక్షరహితంగా చేస్తే యెంతో మంచిది. సన్యాసమనినా, త్యాగమనినా ఒకే అర్థము వదలుట అని అర్థము. గీతలో ఆశ్రమ సన్యాసాన్ని గూర్చిగాని యిల్లు భార్యా బిడ్డలను వదలాలని గాని ఎక్కడా చెప్పలేదు. భగవంతుడు సాధన సన్యాసమునకు ఎక్కువ ప్రాధాన్యతను ఇస్తూ త్యాగరూపమయిన కర్మయోగాన్ని ఎక్కువగా బలపరచడం జరిగింది. భగవంతుడు త్యాగ పక్షపాతే గాని సన్యాస పక్షపాతి కాదు.

అర్జునా ఎంత జ్ఞాని అయినా యజ్ఞదాన తిరస్కారాలు మంచిది కాదు ఆత్మ జ్ఞానంలేని అజ్ఞాని తాను కర్మలను త్యజించినా ననుకోవడం ఒక కల్పనా చిత్రమే కాని నిజం కాదు. మొదట్లో కర్మలను చేస్తున్నాననేది ఇక అతడు ఒదిలిందేముంది. వదిలాననేది ఒదలమని భగవద్గీత చెబుతుంది.

కర్మత్యాగంలో నీకు స్వతంత్రం లేదు కానీ కర్మ ఫలత్యాగం నీ అధీనంలో ఉంది. ఫల సంగత్యాగంలో కర్మబంధము శిధిలమవుతుంది. కర్మశక్తి నిస్తేజమౌతుంది. అట్టివానికి త్యాగఫలితం లభిస్తుంది. నిజంగా త్యాగి అని ఇట్టి వానినే చెప్పాలి. ఇష్టఫలితమని అయిష్టఫలమని మిశ్రమఫలమని కర్మకు మూడు ఫలాలు స్వర్గాదులు యిష్టఫలాలు నరకాదులు అయిష్టఫలాలు సుఖదు:ఖ మిశ్రమమగు మనుష్య జన్మ మిశ్రమ ఫలము యీ ఫలాలు కర్మనిష్టులైన భోగులకు తప్పినవి కావు. భోగాసక్తుడు ఫలితాలను అనుభవించి తీరవలసిందే ఒకవేళ యీ లోకంలో యిప్పుడే అనుభవించకున్నా చచ్చి పరలోకంలోనైనా అనుభవిస్తాడు. యీ నియమం, త్యాగులు కానట్టి అజ్ఞానులకే గాని త్యాగులైన సన్యాసులకు కాదు.

భగవంతుని చివరి సందేశాన్ని మీరు వింటున్నారు. పశుపక్ష్యాదులు ఇంద్రియ ప్రధానమైనవి మానవుడు జ్ఞాన ప్రధానమైనవాడు జ్ఞానహీనుడు పశువుతో సమానుడని శాస్త్రం అన్ని జన్మలలో మానవజన్మ శ్రేష్ఠం అన్ని జ్ఞానాలలో ఆత్మజ్ఞానం శ్రేష్ఠం.

భగవంతుడు త్యాగం గూర్చి తెల్పుతున్నాడు. త్యాగము ముందు భోగము వెనుక మానవుని విశిష్టత వ్యక్తం కావాలంటే భోగంతో కాదు. త్యాగంలోననే భోగం పశుపక్ష్యాదులకూ లభిస్తుంది.

ప్రస్తుతం మనము పదునెనిమిదవ అధ్యాయంలో పయనిస్తున్నాము. భగవంతుడు త్యాగం గురించి త్యాగిని గురించి గీతాచార్యుడు తన శ్రీముఖంతో వర్ణిస్తున్నాడు. మానవుని విశిష్టత వ్యక్తం కావాలంటే భోగంతో కాదు త్యాగంతోనే ఇంద్రాదుల భోగం కూడా అది భోగం కాదయ్యా అది భవరోగమంటూ తుకారామస్వామి సెలవిచ్చినాడు. శ్రీరాముడు భోగి కాదు. శ్రీరాముడు త్యాగి. ఆ రామచంద్రుడు మనకు ఆదర్శము. ధర్మం కోసం సర్వస్వాన్నీ త్యాగం చేసి అడవులకు వెళ్ళినాడు. పద్నాలుగు సంవత్సరాలు అడవులలో భార్యతో కలసి జీవించి బ్రహ్మచర్య వ్రతాన్ని పరిపాలించి సంఖ్యను సంసారాన్ని పెంచుకోకుండా అయోధ్యకు తిరిగి వచ్చిన శ్రీరామచంద్రుడు మనకు ఆదర్శము పురంలోనూ అంత:పురములోనూ బుడుక్కున సంద్రంలో మునిగిపోతున్నప్పుడూ ఒకే ఆనందం. శ్రీకృష్ణుడు పైకి చూసేందుకు భోగేశ్వరుడు లోపల చూస్తే యోగేశ్వరుడు త్యాగంతో కూడిన భోగం యోగమైనది. ఆ యోగేశ్వరుడు ఆ త్యాగేశ్వరుడు మనకు ఆదర్శము.

ఆటలాడుకునే బాల్యంలోననే వెన్నమీగడలు అపహరించి తెచ్చి కోతులకూ పిల్లలకూ పెట్టి ఆనందించేవాడు శ్రీకృష్ణుడు పరాయి వారల తలపై కిరీటాలను

పెట్టాడు రాజ్యాలు ఏలిస్తాడు కాని తాను రాజ్యాలు ఏలడు. రాజులను తయారు చేసే రారాజు కాని ఆయన రాజు కాదు. ఆయన త్యాగేశ్వరుడు కాబట్టే త్యాగాన్ని గూర్చి బోధించే అర్హత చెందినవాడు. కర్మత్యాగం కన్నా కర్మ ఫలత్యాగం శ్రేష్ఠమూ శ్రేయస్కరమూ ముఖ్యము. దీనికిలోటు లేదు. సంగత్యాగమూ కలశిరావలసిందే. మనకు కర్తవ్య భావం కర్తృత్వాహంకారం బలపడనిదే ఏదీ లభించదు. నేను కర్తను నేను కర్తనంటూ మనుష్యుడు మిడిసి పడ్తున్నాడే కాని నిజంగా తాను కర్తేనా కర్తృత్వంలో ఫలాసక్తి కలిసే ఉన్నాయి. ఫలాసక్తిని వదలితే కర్మాసక్తి మాత్రం బంధ హేతువే కదా కర్తృత్వం తనకు నిజం కాదని తేల్తే ఫలం తనకు ఉందనుకోవడం పొరపాటే అవుతుంది. కర్తే తాను కాక పోతే ఫలంలో తనకేమీ సంబంధం – అయ్యా నీవు కర్తవు కాదు చేసేటివి చేయించేటివి కర్మకారణాలు వేరే ఉన్నాయి. సుషిప్తిలో ఆత్మకు ఏ విధంగా సంబంధం లేదో అలానే జాగ్రత్త స్వప్నాలలో కూడా లేదు.

కర్తృత్వం ఎగిరి పోయిందా ఫలాసక్తికితావే లేదు. భగవంతుడు మూలంలోనే గొడ్డలి పెట్టు వేశాడు. అర్జునా నేను కర్తననెడి అహంకారమెవ్వనికి లేదో ఎవ్వని బుద్ధిలో కర్మ ఫలాలైన సుఖదు:ఖాలు నేను భోక్తననెడి అభిమానము లేదో వాడు సమస్త లోకాలను చంపినను, చంపినవాడు కాదు వానికి ఆ ఫలములో బంధము లేదు. అనగా సర్వకర్మలు చేసినా చేసినవాడు కాదని అర్థము. సాత్విక త్యాగి కర్మయోగి. సర్వత్యాగి సన్యాసి అతడే జ్ఞానయోగి ఆచార పూర్ణత్వము కర్మయోగము విచార పూర్ణత్వము జ్ఞానయోగము కర్మయోగం లేక సన్యాసం లేదు. సాత్విక త్యాగం కావాలంటే సాత్విక జ్ఞానము సాత్విక కర్మ సాత్విక కర్త సాత్విక బుద్ధి సాత్విక ధృతి కావలసి వుంటుంది. దాని ఫలం చివరకు సాత్విక సుఖం ఆ సుఖంలో చేరినప్పుడు ఆత్మలో కర్మలను ఆరోపించుకునే అజ్ఞానం పోతుంది. పరమాత్మ సన్యాసమప్పుడు సిద్ధిస్తుంది.

సంయమనం లేనివాడు శాస్త్ర సంస్కారహీనుడు. పొగరుబోతు కపటి కొంపలు ముంచేవాడు. సోమరి యేడ్పు ముఖంవాడు యీ రోజుని రేపని రేపటిని మర్నాడని వాయిదాలు వేసేవాడు. తామసకర్త అనబడుతాడు. ఇంతవరకు విచారకుడి గురించి తెల్పిన భగవంతుడు ఇప్పుడు ఆచార కాండను గ్రుడ్డిది ఆచారములేని విచారము కుంటిది.

శ్లో ॥ అనాచారస్తు మాలిన్యం – అత్యాచారస్తు మూఢతా
విచారాచార యోర్యోగ: – సదాచారస్స ఉచ్యతే

అని ఆచారము మూఢాచారము, విచారము ఆచారము రెండూ కలిసినప్పుడు అది సదాచార మనబడుతుంది. నియతకర్మల త్యాగం కూడదని సంగమమూ ఆసక్తి వదలి చేయుటే త్యాగమంటే లోగడ చెప్పడం జరిగింది. అయితే ఆ నియత కర్మల స్వరూపమేమిటి త్యాగమని చెప్పబడే యీ కర్మయోగానికి భక్తితో సహాయమెంతదని పర్యవసానమైన పరమసిద్ధియేది అన్నింటినీ వివరించే కోసం భగవంతుడు తర్వాత ప్రకరణాన్ని ప్రారంభిస్తున్నాడు. గుణాతీతుడైనప్పుడే ముక్తి గుణాతిక్రమణానికి పరమసాధన జ్ఞానము జ్ఞానసిద్ధికి సత్వశుద్ధి కావాలి. సత్వశుద్ధికి నిష్కామకర్మ సాధనమైవుంది కాబట్టి తన అధికారానికి తగిన కర్మలలో పరమాత్మను ఆరాధించి సంసిద్ధిని పొందాలి.

శత్రువులను తపింపచేసే అర్జునా గుణాన్ని బట్టి స్వభావం ఏర్పడుతుంది. ఆ స్వభావంతో మానవుడు, కర్మలలో ప్రవర్తిస్తాడు. బ్రాహ్మణ క్షత్రియవైశ్య శూద్రులనీ చెప్పబడే చాతుర్వర్ణ్యముల యొక్క కర్మలు వారి వారి స్వభావాన్ని బట్టి గుణాలను బట్టి నియమింపబడ్డాయి. సంస్కారమంటే పుట్టుకతోనే ప్రకటితమయ్యే సంస్కార రాశి బ్రాహ్మణుడని అనిపించుకుంటేనే మోక్షం రాదు.

శూద్ర జాతిలో లెక్కపడినంత మాత్రాన మోక్ష ద్వారములు మూయబడవు. బ్రాహ్మణ కర్మలలో బ్రాహ్మణుడు పొందే ముక్తిని పరిచర్య చేసే శూద్రుడూ పొందవచ్చు. ఉద్దేశ్యము వర్ణాలను చెప్పుట కాదు. పూర్వోక్త విచార కాండననుసరించి వాని వాని కర్మల నాచరించి ముక్తిని పొందాలని దీని అభిప్రాయము. దేహాభిమానం వదలనిదే ఎవ్వరికీ ముక్తి రాదు. చర్మ దృష్టి కలవాడు ఛండాలుడు బ్రహ్మదృష్టి కలవాడు బ్రాహ్మణుడు. స్వార్ధ భావాన్ని మత్సర బుద్ధిని సాక్షి దృష్టిని వదలి విచారించండి బ్రాహ్మణాది శబ్దాలు జాతి వాచకాలు కాదు. అవి గుణ వాచకాలు. మనిషి మనిషికి మధ్య అగడ్తలు త్రవ్వకండి. వ్యక్తి వికాసానికి భంగం కల్గించే పనికంటే మహాపాపం మరొక్కటి లేదు. బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రుల మధ్య భేదాన్ని స్థిరపరచేందుకు భగవద్గీత రాలేదు. ఆ భేదాలలో అభేదాన్ని తెలిపే కోసమే భగవద్గీత వచ్చింది. దురదృష్టవశాత్తు స్వార్ధపరుల ప్రభావాలతో యీ వర్ణవ్యవస్థ భేదభావాలకు నిలయమై పోయింది. శుద్ధబుద్ధితో శాస్త్రాలను అభ్యసింపని దోషము సమాజములో సనాతన ధర్మానికి ద్రోహం చేస్తుంది. సనాతన ధర్మమనే తులసివనంలో యీ గంజాయి మొక్కలు చిక్కుట లేదు. కర్మల మార్పుతో లాభం లేదు. భావం మారాలి ఏ పని చేయాలో భగవద్గీత చెప్పదు. ఏ విధంగా చేయాలో చెప్తుంది. ప్రతివానికీ ప్రపంచంలో స్థానం ఉంది ఎవ్వడూ స్థాన భ్రష్టుడు కావలసిన పని లేదు. ఉన్నచోటనే ఉండి ఉన్నతి పొందే వీలు ఉంది. కర్మాంతర ధర్మాంతర కాలాంతరాలలో ముక్తిరాదు. కావలసినదంతా భావాంతరమంటూ భగవద్గీత తెలియజేయుచున్నది.

1. అర్జునా అంతరేంద్రియమైన మనస్సు నియమంలో పెట్టుకోవడాన్ని శమమంటారు. బాహ్యేంద్రియాలు స్వేచ్ఛగా పోకుండ అరికట్టడం దమ మంటారు. శరీరంతో వాక్కుతో మనస్సుతో వ్రత నియమాలను ఆచరించడం

తపస్సనబడుతుంది. దేహాన్ని నిర్మలంగా మనస్సును నిర్మలంగా పెట్టుకోవడం
తపస్సనబడుతుంది. దేహాన్ని నిర్మలంగా మనస్సును నిర్మలంగా పెట్టుకోవడం
శుచిత్వమంటారు. తనకు ద్రోహం చేసిన ద్రోహికి తిరిగి ద్రోహం చేయక ఆ ద్రోహాన్ని మరచిపోయే స్వభావాన్ని క్షాంతి అంటారు. మాట ఒకటి మనసు ఒకటి కాకుండ నిజాయితీతో ఉండే స్వభావాన్ని ఆర్జవమంటారు. జ్ఞానమనగా శాస్త్రజ్ఞానము, విజ్ఞానమనగా అనుభవజ్ఞానము, గురువాక్యంలో విశ్వాసం కలిగి ఉండటాన్ని ఆస్తిక్యమంటారు. ఈ తొమ్మిది గుణాలు భక్తునికి బ్రాహ్మణునికి స్వభావంతో కలిగే లక్షణాలు.

2. బ్రాహ్మణుని స్వభావం సత్వగుణ ప్రధానమై ఉండును. కురువీరా తన కంటే బలవంతుణ్ణి కూడా తన్నివేస్తాననే ధీమాను శౌర్యమంటారు. ఇతరులకు జంకని స్వభావాన్ని తేజస్సంటారు. ఆపదలు ముంచుక వచ్చినా కదలని స్థితిని 'ధృతి' అంటారు. కార్య సమర్థత క్రియా నైపుణ్యము కర్మకౌశలము దక్షత అనబడుతుంది. యుద్ధంలో మడమ త్రిప్పకుండడం యోగ్యత కలిగి యుండటం దర్పానికి తలవొగ్గని స్వాతంత్ర్యభావము యీ యేడు క్షత్రియ ధర్మాలు యివి ప్రకృతి సహజంగానే లభించే కర్మలు.

3. వ్యవసాయం చేయుట, గోవుల రక్షించుట, వ్యాపారము చేయుట వైశ్యునికి స్వభావంగా కల్గే కర్మలు. పరిచర్యలు సేయుట శూద్రునికి స్వభావనియతమైనది. కురునందనా తన ప్రకృతి కొద్దీ తన యోగ్యత కొద్దీ తన సంస్కారం కొద్దీ తన ప్రారబ్దం కొద్దీ లభించిన కర్మను ప్రేమతో ఆచరిస్తూ నరుడు సంసిద్ధిని బడయవచ్చు. సంసిద్ధి అనగా ఆత్మ జ్ఞానానికి కావలసిన పాత్రత కర్మభూమిలో పుట్టిన పురుషుడు కర్మకు బద్ధుడై కర్మగర్తంలో మునిగి తీరవలసిన పనిలేదు. కర్మలు చేస్తూ కర్మ విముక్తిని సాధించే అవకాశం పశు

పక్ష్యాదులకు లేదు. ఇంకా చెప్పాలంటే దేవతలకు కూడా లేదు. కాని నరునకు మాత్రం ఉంది. అందుకే "నరుడు" అని యిచ్చోట నొక్కి చెప్పడం జరిగింది. కర్మ బంధించదు, భావం బంధిస్తుంది. ఏ మార్గం ద్వారా కర్మలను ఆచరిస్తే సిద్ధికి మార్గం దొరుకుతుందో, అర్జునా ఆ ఉపాయాన్ని వివరిస్తాను విను.

శీలము, జ్ఞానము కల్గినచో యే వర్ణము వాడైనా ఆదరణీయుడే అవి లేనిచో పేరుకు బ్రాహ్మణుడని అనిపించుకుంటే ఆదర్శపాత్రుడౌతాడు. పాలలో చేరి నీళ్ళకు విలువ యిచ్చినట్లు పూజ్యుల వర్గంలో చేరి అపూజ్యులు కూడా కొంత ప్రయాణంలో పూజ్యతను బొందారు. అంతమాత్రంతో అది స్థిరంకాదు. వ్యాసునికి ఆధ్యాత్మిక విద్యాప్రవృత్తి మయునికి యాంత్రిక విద్యాప్రవృత్తి. వీరి కర్మ వ్యాసంగాలు వేరు వేరైనా విద్యా వివేక బుద్ధి జ్ఞాన వైభవంతో ఆచార్యులైనారు.

ఆ విధంగానే స్వభావ ప్రభావాలైన శౌర్య ధైర్యాలను ఆయా రంగాలలో కీలక పాత్ర వహించే వారలు క్షత్రియులు కాని వైశ్యులు కాని శూద్రులు కాని పరిచర్యా రూపమైన కళాకౌశలంతో కాని వారి వారి స్వభావ కర్మలను యజ్ఞార్థముగా వినియోగించి పరమాత్మను భజించి వీరందరు, పరమ కల్యాణం పొందుతారు. కామనలతో తృప్తి బొందుట కాక యజ్ఞ శేషంతో వారు తృప్తి వహిస్తారు.

బ్రాహ్మణులు వారి బుద్ధి వైభవాన్ని ఐహిక సుఖాల కోసం కాదు. క్షత్రియులు తమ భుజబలాన్ని రాజ్యవిస్తారం కోసం కాదు వైశ్యులు తమ వ్యాపార నైపుణ్యం కోటీశ్వరులయే కోసం కాదు శూద్రులు సేవ చేస్తారంటే విధాయకం లేక జడత్వంలో దీనత్వంతో కాదు పూజాదృష్టితో భగవదర్చనగా భావించి చేయాలి. ఆవిధంగా చేసినప్పుడు, నాల్గువర్ణాల వారూ మాన్యులే

విరాట్ పురుషునికి నాల్గువర్ణాలు నాల్గు అవయవాలుగా వర్ణించబడ్డాయి. ఆ పద్ధతిలో ఎక్కువ తక్కువలు నిరూపించేదెలా సాధ్యమవుతుంది.

అర్జునుడు సన్యాసాన్ని త్యాగాన్ని గూర్చి అడిగితే భగవంతుడు కర్మయోగాన్ని గూర్చి తెల్పుచున్నాడు. ఎందుకనగా సిద్ధిని గూర్చి ప్రశ్నిస్తే సాధన గూర్చి తెల్పుచున్నాడు. ఎందుకనగా సిద్ధిని గూర్చి ప్రశ్నిస్తే సాధన గూర్చి తెల్పుట భగవద్గీతలోని ప్రత్యేకత కర్మ. కర్మ కోసం కాదు, కర్మ సన్యాసం కోసం, కర్మత్యాగం కోసం, ప్రయాణం కోసం కాదు, ప్రయాణ పరిసమాప్తి కోసం. అట్లే కర్మ త్యాగం కావాలంటే కర్మయోగం లేక రాదు. కాబట్టే భగవంతుడు వర్ణ కర్మలను చెప్పి తర్వాత భక్తియుక్తి కర్మ యోగ స్వరూపాన్ని దాన్ని ఫలాన్ని చెప్పే కోసం కర్మలను ఏ విధంగా ఆచరిస్తే అనాయాసంగా పరమసిద్ధి లభిస్తుందో తెల్పుతున్నాడు.

అర్జునా సర్వభూతములు ఎక్కడి నుండి వచ్చాయో అచ్చటికి వెళ్ళి తీరాలి. సముద్రము నుండి వచ్చిన నది సముద్రం చేరి విశ్రాంతి పొందుతుంది. అలాగే భగవంతుని నుండి వచ్చిన మనము భగవంతుని చేరుటే మనజన్మకు సార్థకత. ఈ స్థూల, సూక్ష్మ శరీరాల క్రియా కలాపాలన్నీ పరమాత్ముని చైతన్య శక్తితో ప్రవర్తిస్తున్నాయి. గడియారం కీయిస్తే ఆడుతుంది. మనందరికీ కీ ఇచ్చేవాడు భగవంతుడు. గడియారము జడ వస్తువు. కాబట్టి అది తనను కాని తనకు కీ ఇచ్చే వాణ్ణి కాని గుర్తించలేదు. మానవుడలా కాదు. మానవుడు జ్ఞానప్రాణి శాస్త్రాచార్య సజ్జన సేవచేత అంతర్ముఖుడై తన జీవన క్రియాకలాపాలన్నీ పరమేశ్వరాధీనాలంటూ తెలుసుకోగల్గుతాడు. సమస్తం భగవంతుడే చేయిస్తున్నాడు. మన దేముందంటూ పాపకృత్యాలకు ఒడిగట్టే శుష్కవాది కాదతడు. అణురేణు తృణ కాష్ఠ పశుపక్షి, క్రిమి, కీటక సమస్త చరాచరాలలో సర్వమయుని శక్తిని ప్రదర్శించిన సజ్జనునిలో పాపాలు ప్రవేశించే

వీలులేదు. నిజంగా యజమాని మేల్కొని ఉన్నాడని తెలిస్తే దొంగ ఇంట్లో ప్రవేశించలేడు. ఈ విధంగా యీ సమస్త జగత్తుకూ నిమిత్త కారణమూ ఆయనే అయివున్నాడు. ఈ విశ్వరూప భగవంతునకు తాను చేసే పూజయేది? తన జీవితమే పూజాగృహం ఇంద్రియాలే పూజా పుష్పాలు. తానే పూజారి. భగవత్ ప్రీతిని కల్గించని కర్మ అదెంత పెద్దదైనా వ్యర్థమే.

పార్థా కర్మ యేదైనా కావచ్చు స్వధర్మ కర్మలోనే సిద్ధిని పొందవచ్చు. ఏ కర్మ చేయాలనే ప్రశ్నే లేదు. అది నీ ప్రారబ్ధం కర్మతో సిద్ధిలేదు, కర్మ వెంట కలిసి వుండే భావంతోనే సిద్ధి భగవదర్పణ బుద్ధితో చేసిన పని వల్లే సిద్ధి. ఉదాహరణకు భీష్ముడు శ్రీకృష్ణుని ఎదిరించి యుద్ధం చేసి కూడా సిద్ధి పొందాడు. కర్మ యీశ్వర సృష్టి భావన నీ సృష్టి కర్మభోగాన్ని సృష్టిస్తుంది. భావన త్యాగాన్ని సృష్టిస్తుంది. త్యాగంతో సిద్ధి లభిస్తుంది. ఆత్మజ్ఞాన ప్రాప్తికి యోగ్యమైన చిత్తశుద్ధినే యిక్కడ సిద్ధి అని చెప్పడం జరిగింది.

యీశ్వరార్చన అనగానేమి ? ఫలాసక్తిని ఒదలుట వకటి యీశ్వరాను గ్రహంతోనే యీ పని చేస్తున్నానని కర్తృత్వాన్ని వదలుట, రెండు దీనినే యోగమన్నారు. యీ యోగం ద్వారానే నిష్కల్మషమైన సిద్ధికి తగిన అర్హత లభిస్తుంది.

శ్లో ॥ శ్రేయాన్ స్వధర్మోవిగుణః పరధర్మాత్స్వనుష్ఠితాత్ ।
స్వభావ నియతం కర్మ కుర్వన్నాప్నోతి కిల్బిషం ॥

అర్జునా పరధర్మము అనుష్టించేందుకు అనుకూలంగా కనపడవచ్చు. లాభదాయంకంగాను ఉండవచ్చు. కాని దానిని ఆచరించరాదు. స్వధర్మము అనుకూలంగా లాభదాయకంగా ఉండక పోవచ్చు. అయినా స్వధర్మమే శ్రేష్ఠము. ప్రాప్తమునకు వచ్చినది పరమాన్నము. కులవృత్తికి సాటిలేదు.

నీళ్ళకంటే నేయి (నెయ్యి) గొప్ప వస్తువు కావచ్చు అయినా అది త్రాగి జీవించలేము. అందులో నివశించమంటే చేప ససేమిరా ఒప్పుకోదు. నీళ్ళలో బ్రతకడం దానికి స్వధర్మము. తన స్వభావానికి తగిన కర్మను ఆచరిస్తూ మానవుడు యెట్టి దోషానికి గూడా గురి కాడు. యుద్ధము మంచిదికాదని భిక్షాటన జేసి జీవిస్తాను అను నీ బుద్ధి సవ్యమైన బుద్ధి కాదు. అర్జునా సహజకర్మలలో దోషమున్నప్పటికి క్షేత్రకరమైనప్పటికి ధర్మవ్యాధుని వలె దానిని వదలరాదు. దేహాత్మజ్ఞాని సర్వకర్మ త్యాగానికి సమర్థుడు కాదు.

మాంసవిక్రయమును ధర్మవ్యాధుడు దానిని సహజ ప్రాప్తకర్మగా భావించి నేర్పుతో ఓర్పుతో నిర్వహించాడు. కౌశిక బ్రాహ్మణునికి గురువైనాడు. ధర్మవ్యాధుడు తనకో పెద్ద ఉద్యోగం కావాలని ప్రాకులాడి కాలాన్ని వృధాచేయక స్వకర్మతో ధర్మపీఠాన్ని అధిష్ఠించాడు. వ్యాధుడు ధర్మవ్యాధుడైనాడు. కర్మస్వరూపమైన దేహము తానై కర్మలను ఒదిలితే ఎలాగ తిరిగే భూమి మీద కూర్చున్నవాడు తిరుగకుండా ఉండడు. ఆ కర్త్రాత్మ జ్ఞాని ఒక్కడు మాత్రమే. కర్మలకు అతీతుడు కాగలిగేది ఎటూ కర్మలను వదలడము. లేదు కాబట్టి పరధర్మము భయావహము కాబట్టి, సహజ కర్మను స్వధర్మమును అంత:శుద్ధి కల్గక ముందు వదలరాదు. సంఘదోషాన్ని, ఫలదోషాన్ని వదలి నిష్కామబుద్ధితో స్వధర్మపాలన చేసి అంత:కరణశుద్ధిని బొందిన అధికారి యే విధంగా ధ్యానయోగం పరాభక్తి జ్ఞానభక్తి సమదర్శనాల ద్వారా శుద్ధాత్మ సాక్షాత్కారాన్ని పొందగల్గుతాడో ఆ విధానాన్ని తెలియజేయుచున్నాడు. అర్జునా క్రియ యందు కాని కారకములందు కాని ఫలములందు గాని "నాది నాది " యనెడి మమత్వబుద్ధిని వదలుటే అసక్త బుద్ధి కర్మయోగి సర్వత్ర యీ అసక్త బుద్ధితో కూడా కర్మల నాచరిస్తాడు. కాబట్టి వానికి కర్మబంధం బంధించదు. మరీ వాడు జితాత్ముడు తపశ్శాలి కాబట్టి యీ సంఘాతము వానికి స్వాధీనమై

ఉంది. కోరికలను శాంతింపజేశాడు, మనస్సును గెలిచినవాడు, మాయను గెలిచినవాడు, అట్టివాడు నిష్క్రియ బ్రహ్మ వస్తువును తన స్వరూపముగా ఎరుంగుటే సన్యాసము. అజ్ఞానంలో సమస్త కర్మలు స్వరూపత: వదిలాయి అట్టివాడు నిష్కర్మి ఆ భూమిక లోని యోగికి యే కర్మా యే క్రియా అంటదు. వాని స్థితిని నైష్కర్మసిద్ధి అన్నారు. అదియే పరాభక్తి అదియే పరమసిద్ధి.

ఆత్మీయ ప్రియబంధువులారా భగవంతుని బోధ ఉన్నత దశలో కొనసాగుచున్నది. అర్జునా అంత:కరణ శుద్ధిని బొందిన అధికారి తన స్వరూపమే అయిన బ్రహ్మ వస్తువును యేవిధంగా ప్రాప్తిని బొందుతాడో ఆ విధానాన్ని తెల్పుచున్నాను శ్రద్ధగా విను. సర్వవ్యాపక బ్రహ్మవస్తువు యే విధంగా బొందుతాడో ఆ విధానాన్ని విను. సర్వవ్యాపక బ్రహ్మవస్తువు తన స్వరూపంగానే యుంది. కాబట్టి అది ప్రారూప ప్రాప్తి ప్రతిబంధ నివృత్తి జరుగుటే తరువాయి సంశయ అసంభావన విపరీత భావము తొలగి స్వస్వరూప యదార్థ భావమే బ్రహ్మ ప్రాప్తి. జ్ఞానము యొక్క పరాకాష్ఠ యిదే జ్ఞానప్రాప్తి, జ్ఞానమే ఆత్మ, ఆత్మే బ్రహ్మము మరియు సాధకుడు వివిక్త సేవి కావాలి. నిజమైన వివిక్తము. ఆత్మ అది చేరిన వారికి విశ్వమంతా వివిక్తమే. యోగాభ్యాసి లఘ్వాసి కావాలి. మితాహారి కావాలి గాలి ఎక్కువగా తీసుకొనుట ఆయుర్వృద్ధికరము ఆహారము ఎక్కువగా తీసుకొనుట ఆయుక్షీణకరము భోజనము ప్రాణ తృప్తి కోసమే గాని ఇంద్రియ తృప్తి కోసము కాదు. తిండి పోతు ఇంద్రియాదులను నిగ్రహించలేడు. ఆకలికి తినుట యోగి లక్షణము రుచికి తినుట భోగి లక్షణము. భోగానికి గమ్యము రోగము. యోగానికి గమ్యము త్యాగమనేదే గమ్యము త్యాగమనబడే మోక్షము, ఆహారము మితంగా హితంగా సాత్వికమై ఉండడం మంచిది. మనోవాక్కాయ కర్మలు అనబడే త్రికరణాల నియామకంలో ఉండాలి. అతిస్వేచ్ఛ పనికిరాదు హఠ నిగ్రహం

పనికిరాదు. జీవితం అన్నింటి యందు మధ్యమ మార్గం మంచిది, అట్టివానికి ధ్యానయోగం సులభము.

చిత్తమును ఆత్మాకారము చేయుట ధ్యానము, వృత్తి శూన్యమొనరించుట యోగము. దేహమున్నంత వరకు ఆహారము ఉండాలి. మనస్సు ఉండే వరకు ధ్యానం చేయాలి. ఆ ముముక్షవు వైరాగ్యము నాశ్రయించాలి. అభావ వైరాగ్యము, శ్మశాన వైరాగ్యము, పురాణ వైరాగ్యము కాకుండ నిజమైన వైరాగ్యము ఉండాలి అని దాని అర్థము. భద్రపురుషా పార్థా ఈ జ్ఞాన యోగసాధన కత్తి మీద సాము అది సోమరుల సొత్తు కాదు. వీరాధివీరులు నడిచే మార్గము ఆ సాధకుడికి సాధన మార్గంలో కొంత సంభారం కావాలి. అహంకారము బలము, దర్పము, కామము, క్రోధము, పరిగ్రహణము పూర్తిగా పరిత్యజించాలి. నేను జ్ఞానిని నేను భక్తుణ్ణి నేనే విరక్తుణ్ణి యీ విధమైన భావాలకు అహంకారమే మూలము. ఆ అహంకారానికి మూలమైన వాసనా బలము అన్యాయంగా యితరుల సొత్తు అపహరించుట వారిపై పెత్తనం చెలాయించే పశుబలము సర్వదా త్యజించవలెను. ధనజన విద్యాశక్తులతో పెద్దలను తిరస్కరించటం దర్పము. భోగవాంఛ కలిగి ఉండుట కామము. తన కోర్కెకు ప్రతిబంధకము కలిగినప్పుడు చిత్తములో కల్గు క్షోభ క్రోధము కోపమని చెప్పబడుతుంది. అవసరానికి మించి వృధాగా భోగసామగ్రులను చేర్చి పెట్టుకోవడము పరిగ్రహము అందురు దీనినే సంగ్రహణమని కూడా అందురు. సంగ్రహణ బుద్ధికలవాడు సాధనలో ముందుకు పోలేడు. కొమ్మలు ఎక్కువగా ఉంటే చెట్టు ఎత్తుగా పెరుగలేదు. మమకారము వదలాలి రాగద్వేషాది విక్షేపములు ఉడగాలి అట్టివాడు బ్రహ్మ భావసిద్ధికి పాత్రుడౌతాడు.

ప్రసన్నాంత:కరణము గలవాడు అట్టి తత్త్వవేత్త దేని కొరకై శోకించడు.

దేనినీ అకాంక్షించడు, గతించిన దాని కొరకు శోకించడు. భవిష్యత్తు కోసం ఉవ్విళ్ళూరడు. ప్రియవస్తు వియోగంతో శోకం కల్గుతుంది. ప్రియవస్తువు ఇతనికి పరమాత్మ కాబట్టి దానికి వియోగం లేదు. కాబట్టి శోకం సంభవించే వీలులేదు. రాముని సందర్శనంతో కాముడు దూరమై పోయాడు. ఆ పూర్ణపురుషునికి కోరిక లెక్కడివి.

శాస్త్రాలలో భక్తి మూడు విధాలుగా చెప్పబడింది. దైవీభక్తి, రాగాత్మికభక్తి, పరాభక్తి అనునవి శ్రవణ కీర్తనాదులతో భగవత్ ప్రేమను అభ్యసించుట దైవీభక్తి దాస్య సఖ్యాది భావాలతో భగవత్ ప్రేమలో మునిగి పోవుట రాగాత్మకాబుద్ధి సర్వత్రా పరమాత్మను అనుభవమును బొందుట పరాభక్తి, పరాభక్తి అన్నా పరమ జ్ఞానమన్నా ఒకటే కర్మయోగానికి ఫలితము యిదే అట్టివారు సర్వభూతసముడై ఆ పరాభక్తిని బడయగల్గుచున్నాడు.

అటువంటి పరాభక్తి ఆ గీతామాత మనకు ప్రసాదించుచున్నది.

అర్జునా పరమాత్మను సర్వవ్యాప్తిగ గుర్తించినవాడు సర్వుల యందు ప్రేమగల్గిన వాడును సర్వభూతాత్ముడౌతాడు. ఆ ప్రేమనే పరాభక్తి అంటారు. దీనినే ఏకాంతభక్తి అందురు. యీ పరాభక్తి పైన చెప్పిన ధ్యాన యోగానికి పరిపాకము. వేదాంతుల నిధి ధ్యాస యిదే నన్ను తన స్వరూపంగా యెరిగి నా యందు వారు ప్రేమను అవలంబించి యున్నారు. " అహం బ్రహ్మోస్మి " అని అఖండ చైతన్యాకార బుద్ధి వృత్తియే పరాభక్తి " స్వరూపము.

శ్లో ॥ భక్త్యా మా మభిజానాతి, యావాన్యశ్చా స్మి తత్త్వన:
తతో మాంతత్వ తో జ్ఞాత్వా - విశతే తదనంతరం

అర్జునా ఆ పరాభక్తి యొక్క ఫలితం చాలా విలువైనది. ఆ భక్తుడు నన్ను నా గొప్పతనాన్ని ఉన్నది ఉన్నట్లు తెలుసుకోగలడు. నా స్వరూపాన్ని

తెలుసుకున్న అనంతరము నన్నే ప్రవేశిస్తాడు. తెలుసుకోవడమంటే "సకలమిదమహం వాసుదేవ:" అనే సర్వాత్మ భావాన్ని పొందడమే జీవునికి జీవత్వం పోతే స్వయంగా తానే శివుడు అదే అనుభూతి కలుగుతుంది.

అర్జునా నన్ను ఆశ్రయించి సర్వకర్మలను సదా చేస్తూ కర్మయోగి నా ప్రసాదంతో శాశ్వతమూ అవ్యయమూ అయిన స్థానాన్ని సంపాదిస్తాడు. పరమపద ప్రాప్తికి పరమాత్ముడే ఉపేయమన్న మాట. నా ఆశ్రయంలో ఉండి కర్మయోగి కర్మ సంసారంలో ప్రవర్తిస్తున్నా అన్ని పనులు చేస్తున్నా కర్మబంధంలో తగుల్కోడు. ఈశ్వర ప్రసాద మహిమ వలన పునరావృత్తి రహిత శాశ్వత బ్రహ్మపదవి వానికి లభిస్తుంది.

అర్జునా సంసారము భుజాలపై పెట్టుకో, భగవంతుని బుద్ధిలో పెట్టుకో ప్రపంచము బైట ఉండాలి. పరమాత్మ లోపల ఉండాలి చిత్తము పరమేశ్వరునికి, విత్తము ప్రపంచానికి అప్పగించు కర్తృత్వమే భగవంతునికి అర్పిస్తే కర్మల నన్నింటినీ అర్పించినట్లే అవుతుంది.

అహంకార మమకారములు అర్పణమై పోయినప్పుడు వానికి సహజంగా సత్వబుద్ధి సిద్ధిస్తుంది. అదే బుద్ధియోగం. లాభము నష్టము లక్ష్మీపతిది అయినప్పుడు తాను ఏడ్వవలసిన నవ్వవలసిన పనిలేదు.

అర్జునా నిరంతరం నాయందే చిత్తము కల వాడివికమ్ము. మరుపే మరణమని వేదాంతులంటారు. ఈ మరణమొక మరణం కాదు. భగవంతుని మరచుటే అసలైన మరణము. నన్ను నమ్మిన వాడు చెడిపోడు. ప్రపంచమంతా వదలిపెట్టినా నిన్ను నేను వదలిపెట్టను. నా మాట విను చిత్తాన్ని నాకు వదలిపెట్టు. నీ ఉద్ధారకాన్ని నేను చూసుకుంటాను. లోపలి సంసారాన్ని నీవు ఒదిలిపోతే బయట సంసారాన్ని నేను నిర్వహిస్తాను చెట్టు వేరు నీటి మట్టం వరకు పోతే ఆ చెట్టు మండు వేసవిలో కూడా కళకళలాడ్తూ

ఉంటుంది. అట్లే మచ్చిత్తుడు సర్వదుర్గ సంకటాలలో కూడా నా భక్తుడు నా అనుగ్రహ ప్రసాదంతో తరించి పోతాడు.

అర్జునా అహంకారంతో నా మాట వినకపోతివా సర్వం చెడిపోతావు. కిరీటీ గాండీవాన్ని కాదయ్యా పారవేయవలసింది. అహంకారాన్ని పారవేయాలి నేను యుద్ధం చేయననడము నీ యీ హఠం నిరుపయోగమే కాని ఉపయోగం ఉండదు. సవ్యంగా చేయవలసిన పనిని అపసవ్యంగా చేసినట్లవుతుంది.

శ్లో ॥ ఈశ్వర స్సర్వభూతాని - హృద్దేశేర్జున'తిష్టతి
భ్రామయన్ సర్వభూతాని - యంత్రా రూఢాని మాయయా ॥

ప్రియమైన అర్జునా సర్వభూతాల హృదయాల్లో భగవంతుడు ఉన్నాడు. సర్వభూతాలు మాయకు వశమై దేహాలను యంత్రాలను అధిరోహించి ఉన్నాయి. . కేవలము భక్తుల హృదయాలలో యోగుల హృదయాలలో మాత్రమే ఉన్నాడను కోవద్దు. అలా కాదయ్యా సర్వభూతాలలోను ఉన్నాడు. ఒక్క ప్రాణి కూడా అనాథ కాదు. అయితే యీ సంగతి జ్ఞానికి తెలుసు అజ్ఞానికి తెలియదు. తెలిసిన వానికి ప్రయోజనముంది లేని వానికి లేదు నీవిది ఎరింగి నీ పూజ్య భావాన్ని వ్యాపకంగా పెట్టుకో.

అర్జునా యీశ్వరుని ఆ మాయా చక్రం నుండి విముక్తి పొందాలనే మార్గమేదంటావా విను.

శ్లో ॥ తమేవ శరణం గచ్ఛ - సర్వభావేన భారత
తత్ప్రసాదాత్పరాంశాంతిం - స్థానం ప్రాప్స్యసి శాశ్వతం

బ్రహ్మ విద్యా ప్రకాశంలో రమించే ఓ అర్జునా మాయాపతియైన భగవంతున్నే అన్ని విధాలా శరణుబొందుట తప్ప మాయను తరించేందుకు

మరో మార్గం లేదు. చిత్తంతో గాక త్రికరణశుద్ధిగా పొరపొచ్చాలు లేకుండా శరణు పొందాలని అర్థము. పూర్ణస్థితి పొందాలంటే – పూర్ణ సాధన కూడా కావాలి. యితర దేవతల్ని శరణు పొందితే కొన్ని సిద్ధులు ప్రసిద్ధులూ రావచ్చు. శాశ్వత స్థానమైన మోక్షము లభించదు, ఆ శరణాగత భక్తునకు, నా ప్రసాదం లభిస్తుంది. నా భక్తుడు కాని వానికి నా ప్రసాదం లభిస్తున్నా అనుభవించే పాత్రత వానికి లేదు.

నా ప్రసాదానికి అర్హుడైన భక్తుడు తప్పిపోయిన తన శాశ్వత స్థానాన్ని పడయగల్గుతాడు. ఆత్యంతిక దు:ఖనివృత్తి పరమానంద ప్రాప్తి అనే మోక్షాన్ని ఆ పరమశాంతి స్థానాన్ని పొందుతున్నాడు. " వాసుదేవ సర్వ " మని సర్వాత్మనా వాసుదేవతత్వాన్ని శరణు బొందినప్పుడు మాయకు పృథక్ సత్తా లేక మాయామయమై పోతుంది లేదా, ఆ మాయ కూడా భగవత్స్వరూపంగానే తోస్తుంది.

ఓ అర్జునా నీ కింత వరకు గుహ్యాతి గుహ్యామైన జ్ఞానమును గురించి సాంగోపాంగముగా చెప్పినాను. కర్మమును యోగమును భక్తిని గురించి తెల్పితిని నా బోధను సంపూర్ణముగా విమర్శించి యేమి చేయదలచు కుంటావో దానిని చేసుకొని మంత్రతంత్ర రసాయనాది గుహ్యవిద్యల కంటే ఆధ్యాత్మిక విద్య మరింత గుహ్యమైంది. ఆ గుహ్యవిద్యలు విశేషమైన అధికారిని ఆపేక్షింపవు యీ బ్రహ్మ విద్యకు విశేషమైన అధికారి కావాలి. కావుననే యిది గుహ్యాతి గుహ్యమైనది వ్యక్తి యొక్క భావస్వాతంత్ర్యాన్ని అపహరించి పెత్తనం చేయాలనే స్వాతిశయం నాకు లేదు విమర్శించుకో.

"శాస్త్ర దృష్టం గురోర్వాక్యం తృతీయం ఆత్మనిశ్చయ: " అన్నారు పెద్దలు. కనుక అర్జునా నీకు ఏది యిష్టమో అదే చేయుము జ్ఞానమును బోధించుటే

నాపని కాని కర్మను విధించుట కాదు.  భగవద్గీత  జ్ఞాన శాస్త్రం కాని కారక శాస్త్రం కాదు గురువు గారి పని చేప్పేదే.   కాని శిష్యుడు తన కళ్ళతో తానే చూడాలి చెప్పేదే నా పని కాని చేసేది నీ పనే అది నీ ప్రాప్తం.

అర్జునా యీయన చెప్పినదే మళ్ళీ మళ్ళీ చెబుతాడే అని అనుకోవద్దు. ఆధ్యాత్మ విద్యకు పునరుక్తి దోషం లేదు.  గుహ్యతమమైన శాస్త్రమిది ధర్మశాస్త్రము ధర్మ ఫలమైన భగవంతున్ని పరోక్షంగా చెప్పే భక్తి శాస్త్రము గుహ్యతమము “ ధర్మ స్యప్రభురచ్యుత: ” ఆ అచ్యుతుని అపరోక్షంగా చెప్పే అద్వైత వేదాంత శాస్త్రము గుహ్యతమ శాస్త్రము.  ఈ విద్య సర్వగుహ్యతమమని పరమమని దృఢమని హితమని నీవు యిష్టుడవని ప్రేమతో చెప్పుచున్నాను.  కట్టకడమాట గట్టి మాట విను.

శ్లో ॥ మన్మనాభవ మద్భక్తో - మద్యాజీ మాం నమస్కురు
మాయే వైష్యసి సత్యంతే - ప్రతి జానే ప్రియోసిమే ॥

అర్జునుని పుణ్యమే పుణ్యము భగవంతుడే స్వయంగా తన నోటారా ఇష్టుడవు  ప్రియుడవు అంటూ నోరారా పొంగి పొంగి పొగిడినాడు.  గురువుకు ఇంత ప్రీతి పాత్రమైన శిష్యుని దెంత భాగ్యమో ధనంజయా నేను సత్యము నా మాట సత్యము నేను అచ్యుతుని నా మాట అచ్యుతము అన్ని దేశాలకు అన్ని లోకాలకు అన్ని కాలాలకు అందరికి అవసరమైనది అనుకూలమైనది కాబట్టి యీ బోధ సత్యమైనది.

అర్జునా నాయందే నీ మనస్సు పెట్టు నీవు నాకు ఏమిచ్చినా నాకు తృప్తి లేదు.   నీ మనస్సు నాకు సమర్పించినా వంటే నేను అత్యంత తృప్తిని పొందుతాను.  నీ మనస్సును నాకు నీవు అర్పించగలిగితే ఆ నీ మనస్సు నా స్వరూపమైపోతుంది.   నీ ప్రతి కర్మలను, ఈశ్వరార్పణ బుద్ధితో ఆచరిస్తూ

పరమాత్ముడనైన నా యందు నీ మనస్సును సంలగ్నం గావించు. ఒక వేళ అట్లు సాధ్యం కాకపోతే నా యందు భక్తి యోగాన్ని అనుసరించు ద్వేషంతో గాక ప్రేమతో భక్తుడివికా ఈ మానవుడు భార్యకో, బిడ్డలకో, మందుకో, మందిరాలకో, పదవులకో, పొగడ్తలకో, ఏదో ఒక దానికిగాని, వీటి అన్నిటికి గాని భక్తుడై ఉంటాడు ప్రతివాడు. ఇందువల్ల వొరిగేదేమీలేదు. జరిగేదేమీ లేదు. కనుక యీ ప్రపంచంపై ప్రవర్తించే భక్తిని మనస్సును భగవంతుని యందు మార్చితే చాలు. నీవు నా భక్తుడవై తరించిపోతావు. నీకు నీ సంసారానికి నీ పదవులకు నీ అభివృద్ధికి కూడా నష్టమేమీ ఉండదు. ఈ మానవుడు తనను విడిచిపెట్టి పొయ్యే వస్తువులకు ప్రాధాన్యత ఇచ్చినట్లు తనను రక్షించే తన వెంట వచ్చే వస్తువును గూర్చి ఆలోచించడు. దాసుని తప్పులు దండంతో సరి.

భక్తుని వందనము భగవంతునికి బంధనము. అహంకారానికి గమనము. అర్జునా ! నా ప్రతిజ్ఞ భంగమైనా సరే నా భక్తుడైన భీష్ముని ప్రతిజ్ఞ నెరవేర్చినాను అటువంటి నేను నా భక్తుల రక్షించుటకై నేను వేచివుంటాను.

శ్లో ॥ సర్వధర్మాన్ పరిత్యజ్య, మామేకం శరణం వ్రజ:
అహంత్వాసర్వపాపేభ్యో - మోక్షయిష్యామి మాశుచ:

శ్రీకృష్ణ పరమాత్మ చెప్పిన చివరి మంత్రమిది. ఆత్మ స్వాతంత్ర్యము దేవుని ఆశ్రయము సర్వపాప విముక్తి. దు:ఖోపశమనము. ఎన్నో వరాలు బహుమతులూ ఇచ్చాడు. యీ చివరి మంత్రములో గీతాపారాయణ చేసేవారు వైష్ణవాచార్యులు దీనిని చరమ శ్లోకమని అందురు. అనగా చివరి బోధ అని అర్థము. 'అశోచ్యాన్ " అన్యశో చస్త్వం " తో ప్రారంభమైన గీతాబోధ మోక్షయిష్యామి మాశుచ: అనే మాటతో పరిసమాప్తి బొందింది. ఈవిధంగా

ఇది చరమ శ్లోకము. అంతేగాక చరమ దశలో మరణ కాలంలో యీ మంత్రాన్ని పఠిస్తే భగవత్ప్రాప్తి లభిస్తుంది. కాబట్టి ఆ దృష్టితోనూ యీ శ్లోకానికి చరమ శ్లోక మనే పేరు వచ్చింది. భగవద్గీతకు బ్రహ్మవిద్య అనియు యోగశాస్త్రమనియూ చెప్పుట జరిగింది.

మాధవుడు చివరిగా ఇంకో ముఖ్యమైన మాటా అంటున్నాడు. అర్జునా! సర్వధర్మాలను పరిత్యాగం చేసి నన్నొక్కనినే శరణుపొందు. ధర్మాలను అధర్మాలను వాటికి మూలమైన ధర్మిని అనగా అహంకారాన్ని సైతం పరిత్యాగం చేయవలసి వుంటుంది. ఇతర శాస్త్రాలలో అధర్మా చరణాన్ని నిషేధించడం జరిగింది. కానీ ధర్మాచరణము యెడ కూడా ఉపేక్ష వహించాలనే మాట ఆ యితర శాస్త్రాలలో లేదు. ఈ శాస్త్రానికి సరిక్రొత్తమాట సర్వధర్మ, సర్వకర్మ పరిత్యాగము వేదాంత శాస్త్రానికి ముఖ్య కర్తవ్యము.

అర్జునా కర్మ చెయ్యమని మొదట చెప్పాను. పురుషార్థంపై ఆధారపడి ఫలాన్ని వదలి కర్మ చెయ్యమని రెండోసారి చెప్పాను. నీ పురుషార్థాన్ని కూడా పరమ పురుషుని పాదాలపై అర్పించమని యిప్పుడు చెబుతున్నాను. పరమపురుషుని ప్రసాదానికి పాత్రం కాని పురుషార్థసేవ గొడ్డావును మేపినట్లు పురుషార్థాన్ని కూడా అర్పణం చేయుట అనునది మహా మహాపురుషార్థము నీవు నన్ను చేరాలంటే యీ ధర్మకర్మాల ఆపేక్ష తప్పాలి. పరమాత్ముని ప్రేమకు పాత్రమగుటయే నీ ధర్మాలకు కర్మాలకు అదే ముఖ్య ఫలం. ధర్మాలను వదలితే పాపము రాదా, అనే సంశయంతో నీకు పనిలేదు. అవి అన్నీ నాకు సమర్పించు సర్వధర్మ పరిత్యాగ పూర్వకముగా నన్ను శరణుబొందుట నీ వంతు. సర్వపాప విమోచనం చేసి నిన్ను ఉద్ధారకం చేయుట నా వంతు. నీ డ్యూటీ నీవు చేయుము. నా డ్యూటీ నేను చేస్తాను.

నీవు నేనను బేధభావం లేని ఏక స్వరూప పరమాత్మను శరణు బొందు దేహధర్మాలు యింద్రియ ధర్మాలు ప్రాణధర్మాలు మనోధర్మాలు " సర్వ ధర్మాన్ పరిత్యజ్య సర్వ దృశ్య ధర్మాలను మిధ్యా మాత్రమని పరిత్యాగం చేసి శుద్ధాత్మ వస్తువు నేననెడి అద్వైత జ్ఞానాన్ని అవలంబించు అహంపద లక్ష్యమైన బ్రహ్మమును శరణుబొందు అన్ని పాపాలు, పాప మూలమైన అహంకార గ్రంధి దాని మూలమైన అవిద్య యీ అన్నిటి నుండి విముక్తిని ప్రసాదిస్తాను. భగవంతుడు స్వయంగా జ్ఞానరూపి " **ఆత్మైవేదం సర్వం** " అనే జ్ఞానం కల్గేసరికి ఆ జ్ఞానమే అజ్ఞానాన్ని స్వయంగా నివారిస్తుంది. కనుక నీవే మీ చింతిల్లకు అంటూ చింతా శోకాలను తొలగిస్తున్నాడు శ్రీకృష్ణపరమాత్మ.

ప్రియభగవద్భక్తులారా భగవంతుని అనుగ్రహంతో పాఠక దేవుళ్ళ అభిమానంతో భగవద్గీతా సాగరతీరాన్ని చేరుకునే భాగ్యాన్ని కల్గించిన భగవంతునికి వందనములు. భగవద్గీతలో సారభూతమైన మోక్ష సన్యాస యోగా ధ్యాయాన్ని యధాశక్తిగా గురుదేవుల అనుగ్రహంతో తెలుసుకున్నాము. చరమశ్లోకం చదువుకున్నాం. శాస్త్రం ముగిసింది. భగవంతుడు తన బోధకు కావలసిన ప్రచార పద్ధతిని సంప్రదాయ విధిని తెలియజేయుచున్నాడు.

అర్జునా నా యీ ఉపదేశాన్ని తపస్సు చేయని వానికి భక్తుడు కాని వానికి వినాలనే కుతూహలం లేనివానికి నన్ను ద్వేషించు వానికి చెప్పవద్దు. ఇది శాస్త్ర సంప్రదాయ పద్ధతి. గీత ఒక శాస్త్రము. సంప్రదాయ పద్ధతిలో నడిచినప్పుడే యే శాస్త్రమైనా భద్రముగా నిలువ గల్గుట ఉత్తమ విద్య. ఉత్తమాధికారులలో ప్రచారము కావలసి ఉంటుంది. అప్పుడే ఆ విద్యకు శోభ. అధికారికి ప్రయోజనము అనధికారికి విద్య ఇచ్చినచో ఆ విద్యకు తిరస్కారము. వానికి అనర్థము కావుననే తపస్వి కాని వాడు యీ జ్ఞానానికి అధికారి కాలేడు.

తపస్సు అనగా ఇంద్రియ నిగ్రహము శమ దమాది సద్గుణాలు చిత్తైకాగ్రత, జ్ఞానతృష్ణ, మోక్షాపేక్ష, ఇవి తపస్సుతో కలిగే ఫలితాలు. కాగిన భూమి నీరును లాగుతుంది. తపశ్శాలి హృదయం జ్ఞానాన్ని ఆకర్షిస్తుంది. తపస్వి కానివాడు యీ జ్ఞానానికి అధికారి కాలేడు. గురుసజ్జన పూజ్యులకు శుశ్రూష శ్రవణేచ్ఛ లేనివానికి యీ గీతాబోధ పనికిరాదు. శిష్యుడు గురువు యొక్క బాహ్యదేహాన్ని పోషిస్తే గురువు శిష్యుని భావదేహాన్ని పోషిస్తాడు. సేవాభావం లేని వానికి యీ ఉపదేశం చెప్పరాదు. భగవద్విశ్వాసము లేని వానికి యీ ఉపదేశం చెప్పరాదు. భగవద్విశ్వాసము లేని వానికి గీతాచార్యుడైన శ్రీకృష్ణుని మానవ మాత్రునిగా భావించువానికి యీ గీతాబోధ బోధించరాదు. బోధ ఫలించాలంటే బోధకుని యందు విశ్వాసముండాలి.

శ్లో ॥ య ఇమం పరమంగుహ్యం మద్భక్తేష్వభి ధాస్యతి
భక్తిం మ యి పరాంకృత్వా మామేవైష్యత్య సంశయ:

తా ॥ అర్జునా పరమగోప్యము అయిన యీ ధర్మమయ సంవాదాన్ని నా భక్తులతో ప్రచారం చేసేవాడు నాకు పరమభక్తుడు. వాడు నిశ్చయముగా

నన్నే చేరును. వాని కంటే మించిన ప్రేమాస్పదుడు మానవ లోకంలో మరెవ్వరునూ లేరు, ముందుకూడా ఉండబోరు.

శ్లో ॥ నచతస్మాన్మనుష్యేషు - కశ్చిన్మే ప్రియసత్తమ:
భవితానచమే తస్మాత్ అన్య: ప్రియతరో భువి: ॥

పార్థా ! మన యీ ధర్మమయ సంవాదాన్ని స్వయంగా పఠించేవారు జ్ఞాన యజ్ఞం ద్వారా నన్ను పూజించిన వారగుదురు, ఈ గీతా ప్రచారాలు చేయలేక పోయినా తాను పఠన చేసినా అది జ్ఞానయజ్ఞ మనబడుతుంది.

యీ విధంగా గీతా ప్రచార వ్యవస్థను పదిలం చేసి చెప్పేవానికి, చదివే వానికి వినే వానికి, కలిగే ఫలాన్ని వివరించి అర్జునునకు తను ఇచ్చిన మందు అతనికి ఎంత మట్టుకు పనిచేసిందో తెలుసుకునే కోసం ప్రశ్నిస్తున్నాడు.

కుంతీకుమారా ఈ నా జ్ఞానోపదేశాన్ని యేకాగ్ర చిత్తంతో విన్నావా అజ్ఞాన ప్రభావంతో నీకు కల్గిన మోహ జాఢ్యము నీకు పూర్తిగా నశించినదా అని భగవంతుడు. గురుని లక్షణం కాబట్టి శిష్యుని యీ విధంగా ప్రశ్నించగా ప్రియశిష్యుడైన అర్జునుడు తన అనుభవాన్ని తెలియజేస్తున్నాడు. అచ్యుతా నీ ప్రసాదంతో నా మోహం నశించినది. స్మృతిలాభము కల్గినది. సందేహములు తొలిగాయి. స్థిత ప్రజ్ఞుడనైనాను. ఇంక నీవు చెప్పినట్లు చేస్తాను అంటూ వినయంగా తెలియజేస్తున్నాడు.

ఈ సమయంలో వ్యాసమహర్షితో దివ్యదృష్ఠి ప్రసాదింపబడి కురుక్షేత్రంలో ఎప్పటికప్పుడు తను చూస్తున్న విషయాలు వింటున్న విషయాలు సాంగోపాంగముగా ధృతరాష్ట్ర మహారాజుకు వినిపిస్తున్న సంజయుడు అంటున్నాడు.

శ్లో ॥ రాజన్ సంస్మృత్య సంస్మృత్య సంవాద మిమ మద్భుతం
కేశవార్జునయో: పుణ్యం - హృష్యామి చ ముహుర్ముహు:

శ్లో ॥ తచ్చసంస్మృత్య సంస్మృత్య - రూప మత్యద్భుతంహరే:
విస్మయోమే మహారాజన్ - హృష్యామిచ పున: పున:

ధృతరాష్ట్ర మహారాజా యీ విధంగా పరమాత్ముడైన వాసుదేవుని యొక్క మహాత్ముడైన అర్జునుని యొక్క సంవాదమును శ్రద్ధగా విన్నాను, అది చాలా అద్భుతమైనది. ఒళ్ళు గగుర్పాటు కలిగించునది. రణరంగంలో ఇట్టి

బోధజరుగుట కంటే అద్భుతమేమున్నది. వ్యాస భగవానుని అనుగ్రహంతో యీ పరమ రహస్యమూ, మోక్షసాధన మయిన యోగమును యోగేశ్వరుడైన శ్రీకృష్ణుడు సాక్షాత్తుగా చెప్పుచుండగా స్వయముగా నేను విన్నాను.

యోగ విషయాన్ని యోగీశ్వరుని కంటే మిన్నగా ఎవరు చెప్పగలరు నేను నీకు ఇంతవరకు తెల్పిన శ్రీకృష్ణార్జున సంవాదాన్ని సాక్షాత్తుగా విన్నాను ఓ ధృతరాష్ట్ర మహారాజా అద్భుతమూ, పుణ్యదాయకమూ అయిన ఈ కృష్ణార్జున సంవాదాన్ని తలచి తలచి మాటమాటకి ఉప్పొంగిపోయాను.

భగవంతుడగు శ్రీకృష్ణుని యొక్క అద్భుతరూపమును సూతవేషమున బోధించెడి ఆ మనోహరమూర్తిని కాలరూపమున బెదిరించిన ఆ విశ్వరూపమూర్తిని తలంచి తలంచి మహారాజా మాటమాటకీ ఆశ్చర్యములో మునిగిపోయాను.

సంజయుని సంతోషానికి మేరలేదు పున: పున: అంటూ తనివితీరక ఆశ్చర్యంతో ఆనందంతో చెప్పిన మాటే చెప్పుతున్నాడు. గీతాబోధతోను సంస్మరించి – సంస్మరించి ఎన్నిమార్లు సంస్మరించినా ఆయనకు సంజయునికి తృప్తిలేదు.

సంజయుని సంగతి ఇలా ఉంటే భగవద్గీత చదివామండీ అనే డాంభిక భక్తుల గురించి ఏమి చెప్పాలో మీరే ఆలోచించండి. ఫలశృతి వంటి ఒక మంగళ శ్లోకంతో సంజయుడు తన మాటలను ముగిస్తున్నాడు.ం

శ్లో ॥ యత్రయోగీశ్వర: కృష్ణో – యత్రపార్థో ధనుర్ధర:
తత్రశ్రీర్విజయోభూతి – ధ్రువానీతిర్మతిర్మమ: ॥

భగవద్గీతా ప్రారంభంలో ధర్మక్షేత్రే కురుక్షేత్రే అను శ్లోకం ప్రారంభ శ్లోకం యీ శ్లోకం చిట్ట చివరి శ్లోకం అందులో పాండవులూ, మా వాళ్ళు ఏమి చేశారు, అని ధృతరాష్ట్రుడు సంజయుని అడిగాడు. యీ గ్రుడ్డి మహారాజుకు

తన వాళ్ళకు జయం కలిసి వస్తుందేమోననే పేరాశ, భీష్ముడు పడిపోయాడని తెలిసినా భగవంతుని కరాళకల స్వరూపం ద్వారా కౌరవులకు వినాశం తప్పదని విన్నా అతని ఆశ ఉడుగలేదు. ఆదిలో అడిగిన ఆ ప్రశ్నకు పరోక్షంగా సమాధానమిస్తూ సంజయుడు చివరిలో యుద్ధపరిణామాన్ని గూర్చిన స్పష్ట సిద్ధాంతాన్ని వెల్లడిస్తున్నాడు సంజయుడు.

యోగీశ్వరుడైన శ్రీకృష్ణుడు ధనుర్ధారి యైన అర్జునుడు యే పక్షంలో వుంటారో మహారాజా ఆ పక్షంలో అచల రాజ్యలక్ష్మి చిరస్థాయి విజయము.

శాశ్వత విభూతి సకల పురుషార్థ సాధకమగు నీతి విలసిల్లి ఉంటుందంటూ నా విశ్వాసము. విజయుడు తనవాడై ఉండగా, ధర్మానికి ప్రభువైన ధర్మరాజుకు విజయం తప్పునా పైగా భగవంతుని తోడ్పాటు ధర్మరాజుకు ఉండగా ఆయన కేమి లోటు దైవబలము పురుష ప్రయత్నమూ కూడినప్పుడు యేపని మాత్రం నెరవేరకుండ ఎందుకు ఉంటుంది. యుక్తి శక్తి ఒకచోట కలిస్తే జయానికి విజయానికి యేమి తక్కువ.

ప్రతి మానవుడూ జ్ఞానాన్ని విజయాన్ని ఔన్నత్యాన్ని కోరుతూనే ఉంటాడు. అది లభించే ఉపాయమేమి ఆ ఉపాయమే యీ శ్లోకంలో వివరింపబడినది. కురుక్షేత్రంలో జరిగే ప్రతి విషయం ఎప్పటికప్పుడు నేను తెలుసుకోవాలి. ఆ శక్తిని నాకు ప్రసాదించమని వ్యాస భగవానున్ని ధృతరాష్ట్రుడు కోరగా ఆ వ్యాస భగవానుడు సంజయునికి ఆ దివ్యశక్తిని ప్రసాదిస్తాడు. యుద్ధభూమి లో జరిగే విశేషాలన్నీ కనపడునట్లు వినపడునట్లు ఆ దివ్య శక్తిని ప్రసాదిస్తాడు సంజయునికి. ఆ సంజయుడు వెంటవెంటనే ఆ విశేషాలన్నీ ధృతరాష్ట్రునికి వినిపించేవాడు. మరి ఆ దివ్యశక్తి ఆ సంజయునికే ఎందుకు ప్రసాదించినాడు అని ఆలోచిస్తే అందులోనూ ఎంతో పరమార్థం ఉంది.

సంజయుడనగా సమ్యక్ జయ: ఇంద్రియములను చక్కగా జయించిన వాడని అర్థము. అలాంటి ఉత్తమోత్తముడు కాబట్టే సంజయునకు వ్యాసుడు ఆ దివ్యశక్తిని ప్రసాదించినాడు. శ్రీకృష్ణుడు లోకాన్ని ఉద్ధరించుటకై చెప్పిన భగవద్గీత శ్లోకము

సారధ్య మర్జున స్యాదౌ
కుర్వన్ గీతామృతం దదౌ
లోకత్రయోప కారాయ
తస్మై కృష్ణాత్మనే నమ:

మంగళం శ్రీకురుక్షేత్ర
రణక్షోణి విహారిణే
పార్థసారధి రూపాయ
గీతాచార్యాయ మంగళం


శ్రీమత్
భగవద్గీతామృత పానం
భవసాగరతీరం
సర్వం శ్రీకృష్ణార్పణము



ఇందులో గొప్పలు ఎన్ని ఉన్నా అవి అన్నీ పూజ్యులు పూజ్యపాదులు రామకృష్ణా నందగిరి స్వాములవేనని మరియు ఉత్తమోత్తములైన గీతా బోధకులవని ప్రేమతో భక్తితో స్వీకరించండి. తెలిసీ తెలియక జరిగిన తప్పు లేమైనా యుండిన నావిగా మన్నించమని మనసారా ప్రార్ధిస్తున్న

భగవద్గీతా భక్తుల దాసుడు

**సన్నిధి జనార్దనస్వామి నామధేయుడు**

# స్వామి గారి రచనలు




స్వామి గారి
రాబోవు రచనలు

జ్ఞాన విజ్ఞాన కుసుమాలు

visit : www.saidesam.com

## వెరుకూరి గ్రూప్

• డిపాజిట్స్ • జ్యూయలర్స్ • రియల్ ఎస్టేట్స్ • కన్‌స్ట్రక్షన్స్ •

హెడ్ ఆఫీస్: ప్లాట్ నెం.29, ఫేజ్-1, మెయిన్ రోడ్, వనస్థలిపురం, హైదరాబాద్.

☎ : 040-24125356, 98852 06666